రామాయణం

# యోగ వాసిష్ఠ సారము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని శ్రీ విద్యా సారథి వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) శ్రీ విద్యా సారథి వారి వెబ్ సైట్: http://srividyasaradhi.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో శ్రీ విద్యా సారథి వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

శ్రీ విద్యా సారధి  వారి వెబ్ సైట్:

**http://srividyasaradhi.org/**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి.

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# యోగ వాసిష్ఠసారము



ప్రవచనాలలో ప్రపంచ రికార్డు సృష్టించిన

## స్వామి పరమానందనాథ

(డా: శ్రీని పార్థసారథి)

# UNIQUE WORLD RECORDS™

REGISTRAR OF THE RECORDS

UNIQUE WORLD RECORDS
REGISTRAR OF THE RECORDS

# CERTIFICATE

**Longest Philosophical Discourses Rendered**

Krovi Partha Saarathi (born December 13th December, 1949) a retired reader in commerce at Vijayawada, Andhra Pradesh, India has given philosophical lectures titled as "Yoga Vasistam" in Telugu Language for a duration of 123 hours 35 minutes, starting from 01-07-2012 ending on 25-10-2012. These discourses are dedicated to the society.

Sabahhi Mangal (Chief Editor)

UNIQUE WORLD RECORDS

© UNIQUE WORLD RECORDS™ 2011. ALL RIGHTS RESERVED. THIS CERTIFICATE MUST NOT BE REPRODUCED WITHOUT THE PRIOR PERMISSION OF UNIQUE WORLD RECORDS AND DOES NOT NECESSARILY DENOTE AN ENTRY INTO ANY UNIQUE WORLD RECORDS PUBLICATION.

www.uniqueworldrecords.com

Unique World Record Recieving from His Holiness Jagadguru Bharathi Teerda Mahaswamy of Srungeri Peetam dt. 12-02-2013



# విషయ సూచిక


| | |
|---|---|
| **1. వైరాగ్య ప్రకరణము** | 1 |
| ఒకటవ సర్గ - వైరాగ్యోత్పత్తి ప్రతిపాదనము | 1 |
| రెండవ సర్గ - జగద్దోష ప్రకాశ వర్ణనము | 19 |
| **2. ముముక్షు వ్యవహార ప్రకరణము** | 50 |
| **3. ఉత్పత్తి ప్రకరణము** | 71 |
| ఒకటవ సర్గ - ఆకాశజోపాఖ్యానము | 71 |
| రెండవ సర్గ - మండపోఖ్యానము - లీలోపాఖ్యానము | 81 |
| మూడవ సర్గ - కర్కాట్యుపాఖ్యానము | 89 |
| నాల్గవ సర్గ - ఐందవోపాఖ్యానము | 102 |
| ఐదవ సర్గ - ఇంద్రోపాఖ్యానము | 106 |
| ఆరవ సర్గ - చిత్తోపాఖ్యానము | 110 |
| ఏడవ సర్గ - బాలకోపాఖ్యానము | 117 |
| ఎనిమిదవ సర్గ - శాంబరికోపాఖ్యానము | 121 |
| తొమ్మిదవ సర్గ - లవణోపాఖ్యానము | 126 |
| **4. స్థితి ప్రకరణము** | 143 |
| శుక్రోపాఖ్యానము | 145 |
| దామాద్యుపాఖ్యానము | 149 |
| భీమాద్యుపాఖ్యానము | 154 |
| దాశూరోపాఖ్యానము | 166 |
| ఉపదేశోపాఖ్యానము | 169 |
| **5. ఉపశమ ప్రకరణము** | 117 |
| జనకోపాఖ్యానము | 171 |
| పుణ్య పావనోపాఖ్యానము | 173 |
| బల్యుపాఖ్యానము | 175 |
| ప్రహ్లాదోపాఖ్యానము | 178 |
| గాధ్యుపాఖ్యానము | 180 |

ఉద్దాలకోపాఖ్యానము 184
సురఘూపాఖ్యానము 190
భాసవిలాసోపాఖ్యానము 193
వీతహవ్యో పాఖ్యానము 195
ఆకాశ గత్యభావ నిరూపణము 198

**6. నిర్వాణ ప్రకరణము 203**

బుశుండో పాఖ్యానము 203
దేవపూజోపాఖ్యానము 211
బిల్వఫలాఖ్యానము 215
మహాశిలోపాఖ్యానము 217
అర్జునోపాఖ్యానము 218
శతరుద్రోపాఖ్యానము 222
బేతాలోపాఖ్యానము 224
భగీరథోపాఖ్యానము 229
శిఖిధ్వజోపాఖ్యానము 230
కచోపాఖ్యానము 241
మిథ్యా పురుషోపాఖ్యానము 242
భృంగీశోపాఖ్యానము 244
ఇక్ష్వాకూపాఖ్యానము 245
మునివ్యాధో పాఖ్యానము 248
సప్తభూమికోపాఖ్యానము 250

భరద్వాజాను శాసనమ్ 253

గ్రంథ సారము 254

# వైరాగ్య ప్రకరణము

## ఒకటవ సర్గ – వైరాగ్యోత్పత్తి ప్రతిపాదనం

పూర్వం ఒకప్పుడు సుతీక్ష్ణుడు అనే బ్రాహ్మణుడు తన సంశయాలను తీర్చుకోవటానికై అగస్త్య మహర్షి వద్దకు వెళ్ళి యిట్లా అడిగాడు - 'స్వామీ! తాము తత్త్వవేత్తలు. మహాజ్ఞాన సంపన్నులు. నా అనుమానం తీర్చండి - మోక్షానికి కారణం కర్మా? లేక జ్ఞానమా? లేక ఈ రెండూనా? కర్మ, జ్ఞానము, కర్మ జ్ఞాన సముచ్చయం, ఈ మూడింటిలో ఏది మోక్షసాధనమో చెప్పండి' అని (ఇక్కడ ఈ శావాశ్యోపనిషత్తు 9 నుండి 11 వరకు గల మంత్రాలను గమనించడం మంచిది.)

ఇది విని అగస్త్యుడిట్లా అన్నాడు - 'ఓ విప్రుడా! ఒక పక్షి ఆకాశంలో ఎగిరి, తన గమ్యాన్ని చేరుకోవాలంటే దానికి రెండు రెక్కలూ అవసరమే! ఏ ఒక్క రెక్క లేక పోయినా అది ఎగర లేదు, గమ్యాన్ని చేరలేదు. అట్లాగే మోక్షానికి కర్మ, జ్ఞానం, ఈ రెండూ కూడా ముఖ్య సాధనాలే! ఈ విషయమైన ఒక పురాతన ఇతిహాసం నీకు చెపుతాను, విను, అని అగస్త్యుడిట్లా చెపుతున్నాడు -

**కారుణ్యుడు, అగ్నివేశుడు, అనేవారి కథ:** పూర్వంకారుణ్యుడు అనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు వేదవేదాంగవేత్త. అతనికి అగ్నివేశుడు అనే కొడుకు ఉన్నాడు. అతడు గురుకులంలో విద్యాభ్యాసం చేసి ఇంటికి వచ్చాడు. కాని, సంధ్యావందనాది కర్మలు ఏవీ చేయకుండా ఎప్పుడూ నిద్రించేవానిలాగ శాంతంగా ఉండేవాడు. ఇది చూచి, తండ్రి కొడుకుతో యిట్లా అన్నాడు - 'నాయనా! నీవు శాస్త్ర విహితమైన కర్మలను ఎందుకు వదలిపెట్టావు? నీవు యిట్లా మౌనంగా ఉండటానికి కారణం ఏమిటి?' అని.

అగ్నివేశుడిట్లా అన్నాడు - 'నాన్నగారూ! నేను సంధ్యావందనం, అగ్నికార్యం మొదలైనవి చేయాలని శ్రుతిస్మృతులు విధిస్తున్నాయి. కాని, ఇవన్నీ ప్రవృత్తి రూపం కలవి, కాబట్టి పరమపురుషార్థమైన మోక్షానికి భంగం కలిగిస్తాయి. మోక్షమనే పరమపదం, కర్మల వల్ల గాని, సంతానం వల్ల గాని, ధనం వల్ల గాని లభించదనీ త్యాగం వల్ల మాత్రమే లభిస్తుందనీ శ్రుతి చెపుతోంది. (న కర్మణా న ప్రజయా ధనేన, త్యాగేనైకే అమృతత్వ మానశుః - కైవల్యోపనిషత్తు - 1 - 3) అయితే, విహిత కర్మ

చరణం చేయమని చెప్పిందీ శ్రుతే. కర్మత్యాగం చేయమని చెప్పిందీ శ్రుతే! ఈ రెంటిలోను నేను దేనిని పాటించాలి? అనే ఈ సందేహంతోనే నేను అన్నింటి యెడల ఉదాసీనుడనై ఉన్నాను.'' అని.

కొడుకు మాటలు విని, కారుణ్యుడు కాస్సేపు ఆలోచనతో మౌనం వహించాడు. పిమ్మట ఇట్లా అన్నాడు - ''నాయనా! ఈ విషయమై నేను నీకొక కథ చెపుతాను, విను! ఈ కథ విని, నీకు ఎట్లా తోస్తే అట్లా చెయ్యి!' అని ఆ కథను చెపుతున్నాడు -

**సురుచి కథ:** పూర్వం సురుచి అనే అప్సరస ఉండేది. ఆమె చాలా అందకత్తె. ఒకసారి ఆమె వనమయూరాలతో కూడిన హిమాలయ పర్వతం మీద మహా పాపాలన్నింటినీ పోగొట్టే గంగానదీ తీరాన కూర్చుంది. ఆ శిఖరం మీదనే కామసంతప్తులై యున్న కిన్నరులు కామక్రీడలతో విహరిస్తున్నారు. ఆ సమయంలోనే ఇంద్రుని దూత ఒకడు ఆకాశ మార్గంలో పోతూ ఉండటాన్ని ఆ సురుచి అనే అప్సరస చూచింది. 'ఓ మహాత్మా! నీవు ఎక్కడి నుండి వస్తున్నావు?' అని అతనిని అడిగింది. ఆ దేవదూత సురుచితో ఇట్లా అంటున్నాడు -

**అరిష్టనేమి కథ:** 'భద్రే! విను! నేను దేవేంద్రుని దూతను. అరిష్టనేమి అనే రాజు ఉన్నాడు. అతడు ధర్మ పరిపాలనం చేసి, వీతరాగుడై, తపస్సు చేసుకొంటూ గంధమాదన పర్వతం మీద ఉంటున్నాడు. నేను అతని వద్దకు వెళ్ళి, నాకు ఒప్పగించిన పని చూచుకొని తిరిగి వస్తున్నాను'.

ఇది విని, సురుచి ఇట్లా అడిగింది - 'మీరు కోపించరనే నమ్మకంతో అడుగుతున్నాను. తాము అచటికి ఏ పని మీద వెళ్ళారు?'

దేవదూత అంటున్నాడు - 'శుభాంగీ! విను! అరిష్టనేమి చేస్తున్న తపస్సు విషయం విని ఇంద్రుడు నాతో 'యక్షకిన్నర గంధర్వాది స్త్రీలతో, అనేక వాద్యాలతో కూడిన ఈ విమానం తీసుకొని అరిష్టనేమి వద్దకు వెళ్ళి, అతనిని ఇచటికి తీసుకొని రమ్మన్నాడు. అట్లాగే నేను అచటికి వెళ్ళి అరిష్టనేమికి ఇంద్రుని ఆజ్ఞను విన్నవించుకొన్నాను. అది విని అరిష్టనేమి నన్ను ఇట్లా అడిగాడు - 'ఓయీ! దేవదూతా! నేను అడిగే దానికి సమాధానం చెప్పు! నన్ను స్వర్గానికి రమ్మని అంటున్నావు కదా! ఆ స్వర్గంలో ఉండే గుణదోషాలు - మంచిచెడ్డలు ఏమిటో చెప్పు.''

అందుకు నేను (దేవదూత) ''అయ్యా! స్వర్గంలో అత్యుత్తమమైన పుణ్యకార్యాలకు తగినట్టి పరమ సుఖం లభిస్తుంది. కనిష్ఠ పుణ్యమైతే కనిష్ఠ సుఖమే లభిస్తుంది. అక్కడ కూడా తమ కంటె ఉన్నతస్థితిలో ఉన్నవారిని చూచి సహించలేక పోవటం, అనేది ఉంది. సమాన స్థితిలో ఉన్నవారు తోటివారితో పోటీపడి లోభంతో కూడి ఉంటారు. కొంతమంది తమ కంటె తక్కువ వారిని చూచి తమ సుఖానికి తామే సంతోషిస్తూ ఉంటారు. వీరంతా తమ పుణ్యఫలానుభవం పూర్తి అయ్యేదాకా అక్కడ ఉంటారు. పుణ్యక్షయం కాగానే మర్త్యలోకానికి పోతారు. కాబట్టి స్వర్గంలో కూడా మంచి చెడులు రెండూ ఉన్నాయి. ''అని చెప్పాను. ఇది విన్న అరిష్టనేమి నాతో - ''ఓ దేవదూతా! ఈ విధమైన గుణదోషాలతో కూడిన స్వర్గానికి రావటం నాకు ఇష్టం లేదు. నేను ఇట్లాగే ఇంకా కఠినమైన తపస్సు చేసి, ఈ అసహ్యకరమైనట్టి, అశుద్ధమైనట్టి శరీరాన్ని వదలివేస్తాను - సర్పం కుబుసాన్ని వదలివేసినట్లుగా! నీవు వచ్చిన త్రోవనే వెళ్ళు. నీవు తెచ్చిన విమానం, ఈ వైభవ సామగ్రి నీవు నీ వెంట తీసికొని పో! నీకు, నీ స్వర్గానికీ ఒక నమస్కారం.'' అన్నాడు.

దేవదూత సురుచితో ఇట్లా చెపుతున్నాడు. నేను ఈ విషయ మంతా ఇంద్రునికి నివేదించాను. ఇంద్రుడు ఆశ్చర్యచకితుడై మళ్ళీ నన్ను విరక్తుడు, ఆత్మజ్ఞాని అయిన అరిష్టనేమి వద్దకు వెళ్ళి ఆయనను మహాతత్త్వవేత్త అయిన వాల్మీకి మహర్షి వద్దకు తీసుకొని వెళ్ళు. నా మాటగా వాల్మీకితో ఇట్లా చెప్పు - ''ఓ మునీంద్రా! వినయ సంపన్నుడు, వీతరాగుడూ, స్వర్గాన్ని సైతం తృణీకరించిన ఈ అరిష్టనేమి మహారాజుకు తత్త్వ జ్ఞానాన్ని ఉపదేశించండి. ఈయన జన్మమరణ రూపమైన సంసార దుఃఖంతో పీడితుడై ఉన్నాడు. మీరు బోధించే తత్త్వజ్ఞానంతోనే ఈయనకు మోక్షం లభించాలి. '' అని యిట్లా చెప్పి, దేవేంద్రుడు మళ్ళీ నన్ను అరిష్టనేమి వద్దకు పంపాడు. నేను ఆ విధంగానే అరిష్టనేమిని వాల్మీకి ఆశ్రమానికి చేర్చి, వాల్మీకితో ఇంద్రుడు చెప్పిన మాటలను నివేదించాను. అరిష్టనేమి వాల్మీకిని 'మోక్షసాధనం ఏమిటి? ' అని అడిగాడు.

వాల్మీకి ముందుగా అతని క్షేమ సమాచారాలను అడిగాడు. అతని శరీరారోగ్యం విషయమై అడిగాడు. అరిష్టనేమి వాల్మీకితో - 'ఓ భగవంతుడా! తాము ధర్మజ్ఞులు. తెలుసుకోవాల్సిన విషయాలేవో తమకు పూర్తిగా తెలుసు. ఓ

మునిశ్రేష్ఠా! నేను మీ దర్శనం వల్లనే కృతార్థుణ్ణి అయినాను. ఇక నా క్షేమానికి, శరీరారోగ్యానికీ లోటు ఏముంటుంది ? నేను మిమ్మల్ని ఒక విషయం అడగాలని అనుకుంటున్నాను. కాదనకుండా సెలవివ్వండి. ఈ సాంసారికబంధనాలు, దుఃఖాల నుండి ముక్తి ఎట్లా లభిస్తుంది ? ఈ విషయం నాకు చెప్పండి.''

ఇది విని వాల్మీకి మహర్షి యిట్లా అన్నాడు - '' ఓ రాజా! నీకు నేను రామాయణాన్ని పూర్తిగా వినిపిస్తాను. దానిని విని నీ హృదయంలో ధారణ చేస్తే నీవు జీవన్ముక్తుడవౌతావు. నీవు విద్వాంసుడవు. ఈ రామాయణం, రామునికి వసిష్ఠునికి జరిగిన సంవాదరూపంలో ఉంటుంది. మోక్షప్రాప్తికి చక్కగా ఉపకరించే కథ ఇది. నీ స్వభావాన్ని, నీ అభీష్టాన్నీ పూర్తిగా గ్రహించాను. కాబట్టి అపూర్వమైనట్టి దుర్లభమైనట్టి ఈ కథను అధికారివైన నీకు చెపుతాను.''

ఇది విని అరిష్టనేమి ఈ విధంగా అడిగాడు - ''స్వామీ! ఆ రాముడు ఎవరు? అతని స్వరూపం ఎటువంటిది ? ఆయన స్వయం బుద్ధుడా? ముక్తుడా?'' అని.

వాల్మీకి అంటున్నాడు - 'ఓ రాజా! సాక్షాత్తు శ్రీహరియే శాపపాలనం కోసం రాజుగా - శ్రీరామచంద్రుడుగా పుట్టాడు. ఆతడు పరమాత్మయే అయినా, సర్వజ్ఞుడే అయినా, తన భక్తుల మాటను నిజమని రుజువు చేయటానికై ఈ లోకంలో, తానుగా కోరి అజ్ఞానంతో గూడిన సామాన్య మానవుని రూపంలో అవతరించాడు.''

ఇది విన్న అరిష్టనేమి యిట్లా అడిగాడు - ''రాముడు, తాను, చిదానంద స్వరూపుడు, శుద్ధ చైతన్య విగ్రహుడే అయితే ఆతనికి శాపం యిచ్చినవారెవరు ? అద్వితీయుడైన ఆ పరమాత్మకు శాపం యివ్వగలిగిన ద్వితీయుడు - మరొకడు ఎవడుంటాడు ?'' అని. వాల్మీకి అంటున్నాడు - ''సరే! ఆ కథ విను! బ్రహ్మ యొక్క మానసపుత్రుడు, సనత్కుమారుడు. అతడు నిష్కాముడు. బ్రహ్మధామంలో ఉంటున్నాడు. ఒక రోజున వైకుంఠంలో ఉండే విష్ణుమూర్తి ఆ బ్రహ్మలోకానికి వచ్చాడు. అక్కడ ఉన్న వారంతా విష్ణుదేవునికి స్వాగత సత్కారాలు, అర్ఘ్యపాద్య అర్చనాదులు నిర్వర్తించారు. సనత్కుమారుడు మాత్రం ఏమీ పట్టనివానిలాగా - తనకేమీ సంబంధం లేనట్లుగా, కదల లేదు. మెదల లేదు. ఇది గమనించాడు విష్ణుమూర్తి. కొంచెం కోపం - కూడా వచ్చింది. సనత్కుమారునితో ఇట్లా అన్నాడు - 'ఓయీ! సనత్కుమారా! నిన్ను నీవు నిష్కామునిగా భావించుకొని అహంకరిస్తున్నావు. ఆ అహంకారంతో జడ పదార్థంలాగా ఉన్నావు. ఏమీ

గమనించటం లేదు. కాబట్టి, నీవు దండనార్హుడవు. నిన్ను శపిస్తున్నాను. నీవు శరజన్ముడనే పేరుతో పరమ కామార్తుడవై వేరొక శరీరాన్ని పొందు.' అని.

ఇది విన్న సనత్కుమారుడు కూడా ఊరుకోలేదు. విష్ణుమూర్తిని ఇట్లా శపించాడు - '' మీరు సర్వజ్ఞులే! అయినా, కొంత కాలం పాటు ఆ సర్వజ్ఞత్వాన్ని కోల్పోయి అజ్ఞానంతో కూడిన సామాన్య జీవభావాన్ని పొందండి'' అని. ఇది పరస్పర శాపవృత్తాంతం.

వాల్మీకి ఇంకా అంటున్నాడు - ''ఒకప్పుడు భృగుమహర్షి భార్య శ్రీహరి - చక్రంతో సంహరింపబడ్డది. ఆ కారణంగా భృగువుకు కోపం వచ్చి '' నీవు నాకు పత్నీ వియోగాన్ని కలిగించావు. కాబట్టి నీవు కూడా నా లాగానే కొంత కాలం పాటు భార్యా వియోగాన్ని పొందు ''అని శపించాడు. ఇది విష్ణుమూర్తికి మరొక శాపం. అంతే కాదు, జలంధరుని భార్యయైన బృంద కూడా ఒకప్పుడు విష్ణువును శపించింది - ''ఓయీ! విష్ణుమూర్తీ! నీవు మోసంతో, కపట వేషంతో, నా భర్త రూపం దాల్చి నన్ను వంచించి, నా పాతివ్రత్యానికి భంగం కలిగించావు, కాబట్టి నీవు పత్నీ వియోగాన్ని పొందుతావు '' అని. అట్లాగే, వేరొకప్పుడు దేవదత్తుని భార్య భయంతో ప్రాణాలు వదిలింది. ఆ కారణంగా దేవదత్తుడు కోపించి విష్ణువును 'నీవు కూడా నా లాగానే భార్యా వియోగాన్ని పొందు.' అని శపించాడు. ఈ విధంగా విష్ణుమూర్తి సనత్కుమారుని వల్ల, భృగువు వల్ల, బృంద వల్ల, దేవదత్తుని వల్ల శపించబడ్డాడు. అందుకే మానవరూపంలో పుట్టి, వారి శాపాలను అనుభవించి, వారిని అమోఘవాక్కులనుగా చేశాడు. ఆ వృత్తాంతం యావత్తూ నీకు సవిస్తరంగా చెపుతాను, విను.' అంటూ వాల్మీకి మహర్షి ఈ విధంగా మంగళాచరణం చేసి రామ కథను ఆరంభిస్తున్నాడు.

విష్ణుమూర్తికి లభించిన శాపాల వృత్తాంతం శివపురాణంలో ఈ విధంగా ఉంది:

పైన చెప్పిన విధంగా సనత్కుమారుని శాపం వల్ల విష్ణుమూర్తి శ్రీరాముడుగా జన్మించాడు. విష్ణుమూర్తి శాపం వల్ల సనత్కుమారుడు కుమారస్వామిగా జన్మించాడు. రాముడు రావణాసురునీ, కుమారస్వామి తారకాసురునీ సంహరించారు. కుమారుడు కామమోహితుడై దేవతాస్త్రీలను మానభంగం కలిగిస్తూ ఉండగా వారంతా పార్వతీ దేవిని ప్రార్థించారు. ఆమె కుమారునికి గుణపాఠం

నేర్పుదలచి దేవతాస్త్రీల నావహించింది. దానితో కుమారస్వామికి ప్రతి స్త్రీ తన తల్లి రూపంగానే కనిపించసాగింది. తన నడవడికి సిగ్గుపడి స్త్రీలందరినీ తల్లులుగా భావించాడు.

దేవదానవ యుద్ధంలో విష్ణువు దేవతల పక్షాన యుద్ధంలో రాక్షస సంహారం చేయసాగాడు. రాక్షసులు ప్రాణభయంతో మహా పతివ్రతయైన భృగుపత్ని చాటున దాగారు. ఆమె వారిని రక్షించింది. ఆమె అంతకు పూర్వం మరణానంతరం విష్ణువులో లీనమయ్యేటట్లుగా వరం పొంది ఉంది. ఆ వరానికీ, ప్రస్తుత అవసరానికీ అనుగుణంగా విష్ణువు ఆమె తలను నరికి ఆమె ఆత్మను తనలో లీనం చేసుకొన్నాడు. భృగువు వచ్చి, తల నరకబడిన భార్యను చూచి, విష్ణువుకు భార్యా వియోగం కలిగేటట్లు శపించాడు.

జలంధరుడనే రాక్షసుడు మహాక్రూరుడు. అతడు కాలనేమి కూతురు అయిన బృంద అనే సౌందర్య రాశిని వివాహమాడాడు. ఆమె పాతివ్రత్యం వల్ల అతనికి ఇంకా ఎక్కువ శక్తి వచ్చింది. పార్వతి విష్ణువు సాయం కోరింది. విష్ణువు, మాయ సన్యాసి వేషంతో జలంధరుడు యుద్ధంలో చనిపోయినాడని, అతనిని తాను బ్రతికిస్తానని బృందను నమ్మించి, సమీపంలోని కొలనులో స్నానం చేసి జలంధర వేషంతో బృంద యొక్క పాతివ్రత్య భంగం చేశాడు. జలంధరుని శక్తి తగ్గింది. శివుడు జలంధరుని సంహరించాడు. ఈ కారణంగా బృంద విష్ణువును పత్నీవియోగం పొందమని శపించి అగ్ని ప్రవేశం చేసింది.

హిరణ్య కశిపుని సంహరించిన నృసింహమూర్తి పయోష్ణి నది వద్దకు వెళ్ళాడు. అక్కడ గర్భిణియైన దేవదత్తుని భార్య ఆ నృసింహుని చూచి భయపడి ప్రాణాలు వదలింది. చనిపోయిన తన భార్యను చూచి దేవదత్తుడు విష్ణుమూర్తిని పత్నీవియోగ దుఃఖాన్ని పొందమని శపించాడు.

**దివి భూమౌ తథాకాశే బహిరన్తశ్చమే విభుః**
**యో విభాత్యవ భాసాత్మా తస్మై సర్వాత్మనే నమః** 1

భూమ్యాకాశాల్లోనూ, బాహ్యాభ్యన్తరాల్లోనూ, సర్వత్రా ప్రవేశిస్తూ అన్నిటినీ ప్రకాశింప చేస్తూ, అన్నింటికీ ప్రభువైనట్టి అన్నింటియందూ ఉన్నట్టి - సర్వాత్మయైన ఆ పరమాత్మకు నమస్కారములు.

**అహం బద్ధో విముక్తః స్యామితి యస్యాస్తి నిశ్చయం:**
**నాత్యన్తమజ్ఞో నా తజ్ఞః సోస్మిన్ఛాస్త్రే దికారవాన్.** 2

ఓ రాజా! అరిష్టనేమీ! విను! నేను, నాది అనే అహంకారం అనే బంధనంలో చిక్కుపడి, దుఃఖాలనుభవిస్తూ, ఈ సంసార బంధనాల నుండి నేను విముక్తుణ్ణి కావాలి' అని మనస్సులో ధృఢనిశ్చయాన్ని పొంది ఉన్నవాడూ, మరీ అజ్ఞాని కానివాడూ, పూర్తిగా తత్త్వజ్ఞాని కానివాడు, ఇప్పుడు నేను చెప్పబోయే శాస్త్రాన్ని వినటానికీ చదవటానికీ అర్హుడు. (అంటే ఈ జ్ఞాన వాసిష్ఠ మహారామాయణం మధ్యమాధికారి కోసం చెపుతున్నారు. కేవలం, అజ్ఞానికి చెప్పినా బోధపడదు. పూర్తిగా తెలిసిన వారికి చెప్పనక్కరలేదు. కాబట్టి మధ్యమాధికారికి ఇందుకు అర్హుడు.)

ఇంతకు ముందు ఆరు కాండలలో కథయే ప్రధానంగా నేను చెప్పినట్టి రామాయణాన్ని చదివి, ఇప్పుడు ఆరు ప్రకరణాలలో నేను చెప్పబోయే ఈ వాసిష్ఠ రామాయణాన్ని శ్రద్ధగా, పరిశీలనగా బుద్ధితో చదివినవారు, జన్మ మరణ విముక్తులై మోక్షాన్ని పొందుతారు.

రామాయణం రెండు ఖండాలుగా ఉంది. పూర్వ ఖండం, ఉత్తర ఖండం అని. నేను మొదటి రామాయణాన్ని (పూర్వఖండాన్ని) రచించి, నాకు శిష్యుడు, పరమ వినీతుడు, బుద్ధిమంతుడు అయిన భరద్వాజునికి సముద్రుడు తన మణుల్ని యోగ్యుడైన యాచకునికి యిచ్చునట్లుగా యిచ్చాను. భరద్వాజుడు ఆ రామాయణాన్ని మేరువు పర్వతం మీద గహనమైన వనంలో ఉన్న బ్రహ్మ వద్దకు పోయి వినిపించాడు. ఆ రామాయణాన్ని విని, పితామహుడు సంప్రీతుడై ఏదైనా వరం కోరుకోమన్నాడట. అందుకు భరద్వాజుడీ విధంగా కోరాడు - 'పితామహా! తాము త్రికాలాధిపతులు. ఏ ఉపాయం వల్ల దుఃఖ పీడితమై యున్న ఈ మానవ సమాజం అంతా దుఃఖ విముక్తులౌతారో దానిని నాకు సెలవివ్వండి. అదే నేను కోరేవరం'' అని.

ఇది విన్న బ్రహ్మదేవుడిట్లా అన్నాడు - '' నాయనా! నీవు శీఘ్రమే ఈ రామాయణాన్ని రచించినట్టి, నీ గురువు అయినట్టి వాల్మీకి మహర్షి వద్దకు వెళ్ళి, ఈ విషయం ఆయనను అడుగు. ఆయన రచించిన ఈ రామాయణం సంసార సాగరాన్ని తరించటానికి సేతువు లాంటిది.'' అని చెప్పి బ్రహ్మదేవుడు అగస్త్యుని

వెంట బెట్టుకొని నా వద్దకు ( వాల్మీకి వద్దకు ) వచ్చాడు. వారికి నేను అర్ఘ్యపాద్యాదులిచ్చి పూజించాను. పిమ్మట పితామహుడు నాతో ఇట్లా అన్నాడు - ' ఓ మహర్షీ! నీవు రామాయణాన్ని రచించటంలో చాలా మానసిక క్లేశాన్నీ, హృదయోద్వేగాన్నీ అనుభవించావు. శ్రీరాముని స్వరూప స్వభావాదులనూ, ధర్మాన్నీ చాటావు. ఇది లోకహితం కోరి చేసిన పని. అట్లాగే, సంసార సాగరాన్ని తరించటానికి నా వంటిదైన మరొక రామాయణాన్ని లోకహితం కోరి రచించు! '' అని చెప్పి సముద్రంలో అల మాయమైనట్లుగా అంతర్హితుడైనాడు. అని చెప్పి భరద్వాజునితో అన్నాను - ''నాయనా! భరద్వాజా! నేను బ్రహ్మ సందర్శనం వల్ల ఆశ్చర్యచకితుడనై నన్ను నేనే మరచిపోయాను. ఆ సృష్టికర్త ఏమని ఆజ్ఞాపించాడో చెప్పు!' అని.

భరద్వాజు డిట్లా అన్నాడు - ' సమస్త లోకహితాన్నీ కోరి, సంసార సాగరాన్ని తరించటానికి సేతువుగా ఉపయోగపడే రామాయణాన్ని రచించవలసిందిగా పితామహుడాజ్ఞాపించాడు. స్వామీ! రాముడు, లక్ష్మణుడు, భరత శత్రుఘ్నులు, సీతామహాసాధ్వి, శ్రీరాముని అనుసరించిన గొప్ప బుద్ధిమంతులైన మంత్రులు, వారిపుత్రులు, వీరంతా ఘోరమైన సంసార సంకటాల్లో పడి ఎట్లా సంచరించారో నాకు సవిస్తరంగా చెప్పండి. నేను కూడా వారి లాగానే నడచుకొంటాను '' అని. ఓ అరిష్టనేమి మహారాజా! భరద్వాజుడు బ్రహ్మదేవుని ఆజ్ఞను నెరవేర్చవలసిందని నన్ను ప్రార్థించిన మీదట నేనాతనితో ఇట్లా అన్నాను - ''భరద్వాజా! నేను చెప్పే శ్రీరాముని వృత్తాంతాన్ని విన్న మీదట నీవు నీ మోహాన్ని వదలివేయగలవు. ఆనంద స్వరూపుడైన శ్రీరాముడు జనులందరికీ సుఖాన్ని కలిగించటానికై ఈ సంసారం మీద ఆసక్తిని ఎట్లా వదిలివేసి సంచరించాడో నీవు కూడా అట్లాగేనడచుకో! సంసారం మీద ఆసక్తిని వదలివెయ్యి! మహాత్ముడైన లక్ష్మణుడు, భరత శత్రుఘ్నులు, కౌసల్య, సుమిత్ర, సీత, దశరథుడు, రాముని మిత్రులు, కృతాస్త్రులు, పురోహితులు, వసిష్ఠుడు, వామదేవుడు, ఇతర ఋషులు, వీరంతా పరమ జ్ఞానాన్ని పొందారు. దృష్టి, జయంత, భాస, సత్యవక్త, విజయ, సుషేణ, హనుమంత, ఇంద్రజిత్తులు ఎనమండుగురు శ్రీరాముని మంత్రులు. వారు సమదృష్టి కలవారు. రాగద్వేష రహితులు. విషయాసక్తులు కానివారు. తమ ప్రారబ్ధాన్ని బట్టి తమకు లభించిన దానితో సదా తృప్తులైఉండేవారు. నాయనా! భరద్వాజా! వారంతా ఎట్లా హోమాలు, దానాలు, ఆదాన ప్రదానాలు చేస్తూ, నిరంతరం దైవస్మరణలో, శ్రౌతస్మార్త

కర్మ లాచరిస్తూ జీవయాత్ర సాగించారో, అట్లాగే నీవు కూడా నీ జీవితాన్ని పవిత్రంగా నడిపితే తప్పకుండా ఈ సంసారతాపాల నుండి విముక్తుడవు అవుతావు.

**అపార సంసార సముద్రపాతీ లబ్ధ్వా పరాం యుక్తి ముదార సత్వః**
**న శోక మాయాతి న దైన్యమేతి గత జ్వరస్తిష్ఠతి నిత్యతృప్తః** 3

ఉదారులు సత్త్వగుణ సంపన్నులు అయిన వారు, ఈ సంసార సాగరంలో పడినప్పటికీ, పైన చెప్పబడిన సాధనాలను (సమదృష్టి, రాగద్వేష రాహిత్యము, విషయవాసనా పరాఙ్ముఖత.) ఆచరించటం ద్వారా శోకాన్ని దైన్యాన్ని పొందరు. అన్ని దుఃఖాలకు దూరంగా పరమానందంతో తృప్తులై ఉంటారు.

వాల్మీకి చెప్పినది విని, భరద్వాజుడు అంటున్నాడు - ''మహాత్మా! తాము శ్రీరాముని కథను వివరించి చెపుతూ ఆతడు క్రమంగా జీవన్ముక్తుని స్థితిని పొందిన విధాన్ని వర్ణించి చెప్పండి. దానివి విని నేను పరమ సుఖాన్ని పొందుతాను.''

ఆతని ప్రార్థనను విని వాల్మీకి అంటున్నాడు -

**భ్రమస్య జాగతస్యా స్య జాతస్యా కాశవర్ణవత్**
**అపునః స్మరణం సాధో మన్యే విస్మరణం వరమ్.** 4

నాయనా! భరద్వాజా! విను! ఆకాశానికి రంగు లేదు, రూపమూ లేదు. అయినా, మనం పైన ఉన్న ఆకాశానికి నీలపురంగును, ఒక రూపాన్నీ ఆపాదించుకొంటున్నాం - భ్రమను పొందుతున్నాం. అట్లాగే, నామ రూపరహితుడైన నిర్గుణ బ్రహ్మమందు మన అజ్ఞానం కారణంగా ఈ లేని జగత్తును ఉన్న దానినిగా భ్రమిస్తున్నాం. ఇటువంటి మిథ్యా జగత్తును, ఈ భ్రమను పూర్తిగా విస్మరించి, దానిని గూర్చిన ఏ విధమైన ఆలోచనా లేకుండా ఉండటమే సరియైన జ్ఞానం. ఈ కనిపించే ప్రపంచం లేనే లేదు. ఉన్నట్లు కనిపించటం, అనిపించటం, స్వప్నంలో లాగా మిథ్య, భ్రాంతి, అనే జ్ఞానం కలిగేటంత వరకు ఎంతటి వాడైనా అజ్ఞాని అన్న మాటే! అంతవరకు ఆత్మజ్ఞానాన్ని అనుభవించలేడు. కాబట్టి, మనం అజ్ఞానాన్ని వీడి, జ్ఞానం కోసం ప్రయత్నించాలి. ఈ యోగవాసిష్ఠము (వాసిష్ఠ మహారామాయణం) అనే గ్రంథం మనకు అటువంటి తత్త్వ జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. అందుకే, దీనిని ప్రచారం చేయవలసిన అగత్యం ఉంది.

ఓ పుణ్యాత్ముడా!

దృశ్యం నాస్తీతి భోధేన మనసో దృశ్యమార్జనమ్
సంపన్నం చేత్తదుత్పన్నా పరా నిర్వాణ నిర్వృతిః 5
అన్యథా శాస్త్రగర్తేషు లుంఠతాం భవతామిహ
భవత్య కృత్రిమాజ్ఞానాం కల్పైరపి న నిర్వృతిః 6
అశేషేణ పరిత్యాగో వాసనానాం య ఉత్తమః
మోక్షఇత్యుచ్యతే సద్భిః స ఏవ విమలక్రమః 7

ఈ దృశ్య ప్రపంచం అసలు లేనే లేదు అనే జ్ఞానం కలిగినప్పుడు, ఈ ప్రపంచ నివారణం కాగానే, పరమ నిర్వాణ స్వరూపమైన శాంతి దానంతట అదే లభిస్తుంది. అట్లాకాక, అనాత్మశాస్త్రాలు అనే గోతిలో పడి దొర్లుతూ ఉండేవారికి ఎన్ని యుగాలు గడచినా నిర్వాణ శాంతి లభించదు. కాబట్టి, ఓ విప్రుడా! వాసనలను పూర్తిగా వదలివేయుటమే మోక్షం. అదే పాప రహితుడవటానికి సరియైన మార్గం. వాసనా పరిత్యాగం చేయనివానికి జన్మ మరణ చక్రభ్రమణం తప్పదు. ఆ వాసనలు వాటి స్వభావాన్ని గురించి చెపుతా విను -

క్షీణాయాం వాసనాయాం తు చేతోగలతి సత్వరమ్
క్షీణాయాం శీతసంతత్యాం బ్రహ్మన్ హిమకణోయథా. 8
వాసనా ద్వివిధా ప్రోక్తా శుద్ధా చ మలినా తథా
మలినా జన్మనో హేతుః శుద్ధా జన్మ వినాశినీ. 9
అజ్ఞాన సుఘనాకారా ఘనాహంకార శాలినీ
పునర్జన్మ కరీప్రోక్తా మలినా వాసనా బుధైః 10
పునర్జన్మాంకురాం న్యక్త్వాస్థితా సంభ్రష్ట బీజవత్
దేహార్థం ధ్రియతే జ్ఞాతజ్ఞేయా శుద్ధేతి చోచ్యతే. 11
యే శుద్ధవాసనా భూయో న జన్మానర్థ భాజనం
జ్ఞాతజ్ఞేయాస్త ఉచ్యన్తే జీవన్ముక్తా మహాధియః 12
జీవన్ముక్తి పదం ప్రాప్తో యథా రామో మహామనాః
తత్తేహం శృణు వక్ష్యామి జరామరణ శాంతయే. 13

ఓ భరద్వాజుడా! చలికాలం పోగానే మంచు కణాలు మెల్లగా

కరగిపోయినట్లుగా, జన్మ జన్మాంతరాల వాసనలు క్షీణమైపోయిన కొద్దీ చిత్తం కూడా మెల్లగా కరగిపోతుంది - లయమైపోతుంది. అంటే, చిత్తాభావ స్థితి కలుగుతుంది. (ముత్యాల హారంలోని దారం ఉన్నంత వరకే హారం ఉంటుంది. ఆ దారం పోగానే హారమూ పోతుంది. అట్లాగే, పూర్వ వాసనలు ఉన్నంత వరకే చిత్తము - శరీరము ఉంటుంది.)

ఈ వాసనలు, శుద్ధ వాసనలనీ, మలిన వాసనలనీ రెండు రకాలుగా ఉంటాయి. శుద్ధవాసనలు జన్మరాహిత్యాన్ని యిస్తే, మలిన వాసనలు జీవునికి అనంతంగా జన్మపరంపరలను ఇస్తాయి. అజ్ఞానమనేదే ఈ మలిన వాసనల ఘనీభూతమైన రూపం! శుద్ధవాసనలు ఈ శరీరం పోగానే నశించిపోతాయి - దగ్ధ బీజంలాగా వాటికి జన్మ నిచ్చే శక్తి ఉండదు. కాబట్టి శుద్ధ వాసనల వల్ల పునర్జన్మ ఉండదు. శుద్ధ వాసనలు కలవారు పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకొన్న వారు కాబట్టి జీవన్ముక్తులుగా ఉంటారు. శ్రీరామచంద్రుడు జీవన్ముక్త స్థితిని ఏ విధంగా పొందాడో ఆ వృత్తాంతం చెపుతాను విను అని, వాల్మీకి భరద్వాజునితో ఇంకా యిట్లా అన్నాడు -

**శ్రీరాముని తీర్థ యాత్రలు :** -శ్రీరాముడు తన అధ్యయన గృహం నుండి తిరిగివచ్చి, కొంత కాలం పాటు నిశ్చింతగా, నిర్భీతిగా, ఆట పాటల్లో గడిపాడు. ఆతని తండ్రి పాలనలో ప్రజలు దుఃఖమనేది ఎరుగరు. కష్టాలు ఎరుగరు. కరవు కాటకాలూ లేవు. ఇట్లా హాయిగా రోజులు గడుస్తూ ఉండగా, రామునికి తీర్థయాత్రలు చేయాలనే తలంపు కలిగింది. ఋష్యాశ్రమాలను, పుణ్య నదులను సేవించాలనే కోరిక పుట్టింది. ఒకనాడు పద్మం వద్దకు హంసలాగా రాముడు తండ్రి వద్దకు వెళ్ళి ఇట్లా అన్నాడు - ''నాన్నగారూ! నాకు పుణ్య తీర్థాలను సేవించాలని ఉంది. ఋష్యాశ్రమాలను చూడాలని ఉంది. నేను నా జీవితంలో కోరిన మొదటి కోరిక ఇదే. నా కోరిక తీర్చండి. మీరు కాదనరని నాకు తెలుసు.'' ఇది విని దశరథుడు కులగురువైన వసిష్ఠునితో సంప్రతించి అందుకు అనుమతి ఇచ్చాడు.

ఒక శుభదినాన, ఒక శుభ ముహూర్తంలో శ్రీరామచంద్రుడు తన తమ్ములతో సహా అభ్యంగనం చేసి, అలంకృతుడై, బ్రాహ్మణులు వేద పఠనం చేస్తూ వసిష్ఠ ప్రేషితులై వెంటరాగా, తోటి రాజకుమారులను కూడా వెంట బెట్టుకుని తీర్థ యాత్రలకు బయలుదేరాడు.

అట్లా కోసల దేశంలో బయలుదేరిన రాముడు, పుణ్య నదులలో స్నానం చేస్తూ, దానాలిస్తూ, పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, సముద్ర తీరాలు, పర్వతాలు దాటి ముందుకు సాగుతూ యమున, సరస్వతి, ఇరావతి, శతద్రు, చంద్రభాగ, వేణి, కృష్ణవేణి, నిర్వింధ్య, సరయు, చర్మణ్వతి, వితస్తవిపాశ, బాహుద, మొదలైన పుణ్య నదులలో స్నానాలు చేసి, ధర్మారణ్యం, నైమిశారణ్యం, ప్రయాగ, వారణాసి, గయ, కేదార, శ్రీశైల, పుష్కర, మానసరోవర, చక్రతీర్థ, ఉత్తరమానస, బాడబముఖం, అగ్నితీర్థం, ఇంద్రద్యుమ్న సరోవరం, మొదలైన పుణ్య తీర్థాలు, పుణ్యక్షేత్రాలను సేవించి, ఋషులను బ్రాహ్మణులను పూజించి, శివుడు భూలోకాన్ని దర్శించి మళ్ళీ కైలాసానికి చేరినట్లుగా తీర్థయాత్రల అనంతరం రామచంద్రుడు తన రాజధానికి చేరాడు.

ఓ భరద్వాజా! రామచంద్రుడు రాజధానికి రాగా పురజనులు మంగళ వాద్యాలతో, నృత్త గీతాదులతో స్వాగతమిచ్చారు. రాముడు జయంతమనే, రాజప్రాసాదం చేరాడు. పిమ్మట కొన్నాళ్ళ పాటు రాజసభకు విచ్చేస్తూ, వసిష్ఠుని వచనాలు వింటూ, ప్రజల విషయాలు తెలుసుకొంటూ స్నేహితులతో వినోదిస్తూ కాలం గడిపాడు. రాముడికి పదిహేనేండ్లు వచ్చాయి. లక్ష్మణ శత్రుఘ్నులు ఎల్ల వేళలా అతని వెంటనే ఉండేవారు. భరతుడు మాత్రం తన మేనమామ యింట ఉండేవాడు. ఇన్ని రాజభోగాలు అనుభవిస్తున్నా, వినోదాలు చూస్తున్నా, రాముని ముఖంలో ఏవో విషాదచ్ఛాయలు కనిపిస్తూనే ఉన్నాయి. అతని ప్రవర్తనలో నిర్వేదం. వైరాగ్యం గోచరిస్తోంది. ఉదాసీనత కనిపిస్తోంది. దశరథుడు ఇది గమనించాడు. ఇందుకు కారణం ఏమిటి అని వసిష్ఠుని అడిగాడు. వసిష్ఠుడు దివ్య దృష్టితో చూచి అన్నాడు - 'రాజా! రాముని విషాదానికి కారణం ఉంది. నీవు భయపడవద్దు. చింతించవద్దు. మహాత్ములకు దోషం గాని, దుఃఖంగాని, సంతోషం కాని తగిన కారణం లేకుండా కలగవు. పంచభూతాలు సైతం సృష్టిసమయంలో గానీ, ప్రళయ సమయంలో గానీ, మాత్రమే తీవ్రరూపాన్ని, భయంకర రూపాన్నీ పొందుతాయి.

వాల్మీకి భరద్వాజునితో ఇంకా యిట్లా అన్నాడు -

వసిష్ఠుడీ విధంగా ఓదార్చినప్పటికీ, దశరథుడు, రాజబంధువులు, ఉద్యోగులు, శ్రీరాముని వైరాగ్య ప్రవర్తనకు లోలోన బాధపడుతూనే ఉన్నారు. ఇట్లా ఉండగానే, ఒక రోజున విశ్వామిత్ర మహర్షి వచ్చాడు. దశరథుడు వసిష్ఠప్రేరితుడై

ఎదురేగి అర్ఘ్యపాద్యాదులిచ్చి అతనిని పూజించాడు. వసిష్ఠుడు కూడా విశ్వామిత్రుని సగౌరవంగా ఆహ్వానించి కుశలప్రశ్నలు అడిగాడు. తమ కోరిక ఏదో చెప్పండి తప్పకుండా నెరవేరుస్తాను, అన్నాడు దశరథుడు. విశ్వామిత్రుడు సంతోషించి తాను వచ్చిన కారణాన్ని ఈ విధంగా చెప్పాడు.

''నేను లోక కల్యాణం కోసం చేస్తున్న యాగానికి రాక్షసులు విఘ్నం కలుగజేస్తున్నారు. యజ్ఞం పూర్తి కావటం లేదు. నేను కోపించి వారిని శపించగలను. కాని, అట్లా కోపించటం అనేది యాగం చేసే సందర్భంలో నిషిద్ధం. యాగదీక్షలో ఉన్న వాడు మంచి శమదమాదులు కలిగి ఉండాలి. అందుచేత నేను నిస్సహాయ స్థితిలో ఉన్నాను. నీవు నీ కుమారుని శ్రీరాముని నా వెంట పంపు. అతడు రాక్షసులను వధించి నా యాగం నిర్విఘ్నంగా కొనసాగేటట్లు చేయగలడు.'' అని.

విశ్వామిత్రుని కోరిక విని దశరథుడు కాస్సేపు ఆలోచించి ఇట్లా అన్నాడు ''శ్రీరాముడు బాలుడు. పదునైదేండ్ల వాడు. అతడు రాక్షసులతో యుద్ధం చేయలేడు. ఇంతవరకు క్రీడాయుద్ధాలే తప్ప నిజమైన ఏ యుద్ధంలోనూ అతడు పాల్గొనలేదు. పైగా ఈ మధ్య పిల్లవాడు ఎందుకో నిర్వేదంలో ఉన్నాడు. అనాసక్తితో ఉంటున్నాడు. తండ్రియైనవాడు, తన సంపదను, ప్రాణాల్ని, భార్యను, సుఖాల్నీ వేటికైనా వదలగలడు. కాని, కొడుకును వదలలేడు. పైగా ఆ రాక్షసులేమో క్రూరులు, భయంకరులు, యుద్ధ నిపుణులు! వారితో ఈ బాలుడు ఏమి యుద్ధం చేయగలడు? నాలాంటి వారు ఆ రాక్షసులను హతమార్చి మీ యజ్ఞం నిర్విఘ్నం చేయాలన్నా వారి రాజు రావణుడు మహాబలపరాక్రమ శాలి - కుబేరుని సోదరుడు. విశ్రవసుని కొడుకు. మీ కష్టాలకు అతడే కారకుడు. అతనిని జయించే శక్తి మాకు లేదు. ఓ మహానుభావా!

**కాలేకాలే పృథగ్భిన్నా భూరి వీర్యవిభూతయః**
**భూతేష్వభ్యుదయం యాన్తి ప్రలీయన్తేచ కాలతః 14**
**అద్యాస్మింస్తు వయం కాలే రావణాదిషు శత్రుషు**
**న సమర్థాః పురః స్థాతుం నియతే రేష నిశ్చయః 15**
**అయమన్యతమః కాలః పేలవీకృత సజ్జనః**
**రాఘవోఽపి గతో దైన్యం యత్ర వార్ధక జర్జరః 16**

ఒక్కొక్క సమయంలో కొందరికి అత్యధిక బలవీర్య విభూతులు లభిస్తాయి.

అప్పుడు వారు మహాభ్యుదయాన్ని పొందుతారు. ఆ కాలం తీరిపోగానే ఆ విభూతులన్నీ - ఆ శక్తులన్నీ, వాటంతట అవే మాయమైపోతాయి. ప్రస్తుతం రావణాదులకు అటువంటి బలశక్తి విభూతులు ఉన్నాయి. వాటి ముందు ఎవరూ ఆగలేరు. ఇది నియతి నిర్ణయం - ఈశ్వరేచ్ఛ. అటువంటి స్థితిలో బాలుడైన రాఘవుడు వారిని ఎట్లా నిర్జించగలడు ? ఈ కాలమే అటువంటిది - అది సజ్జనులను నిర్వీర్యం చేసింది. రాముడు సైతం, గొప్పదైన రఘు వంశంలో పుట్టినా ముసలివాళ్ళ లాగా నిర్వీర్యుడైనాడు '' అని దశరథుడిట్లా అనగా -

తచ్ఛ్రుత్వా వచనం తస్యస్నేహ పర్యాకులాక్షరమ్
సమన్యుః కౌశికో వాక్యం ప్రత్యువాచ మహీపతిమ్ 17
కరిష్యామీతి సంశ్రుత్య ప్రతిజ్ఞాం హాతుమిచ్ఛసి
స భవాన్కేసరీ భూత్వా మృగతామభివాంఛసి 18
యది త్వమక్షమో రాజన్గమిష్యామి యథాగతమ్
హీన ప్రతిజ్ఞః కాకుత్స్థ సుఖీభవ సబాంధవః 19
తస్మిన్ కోపపరీతే తు విశ్వామిత్రే మహాత్మని
చచాల వసుధా కృత్స్నా సురాంశ్చ భయమావిశత్. 20
క్రోధాభిభూతం విజ్ఞాయ జగన్మిత్రం మహామునిం
ధృతిమాన్ సువ్రతో ధీమాన్వసిష్ఠో వాక్యమబ్రవీత్ 21
ఇక్ష్వాకు వంశజాతో పి స్వయం దశరథో పి సన్
న పాలయసి చేద్వాక్యం కో పరః పాలయిష్యతి. 22
యుష్మదాది ప్రణీతేన వ్యవహారేణ జంతవః -
మర్యాదాం న విముంచన్తి తాం న హాతుం త్వమర్హసి 23
గుప్తం పురుష సింహేన గరుడే నామృతం యథా
కృతాస్త్ర మకృతాస్త్రం వా నైనం శక్యన్తి రాక్షసాః 24
ఏష విగ్రహవాన్ ధర్మః ఏష వీర్యవతాం వరః
ఏష బుద్ధ్యాధికో లోకే తమసాంచ పరాయణం. 25

వాల్మీకి భరద్వాజునితో చెపుతున్నాడు - ఓ భరద్వాజా! స్నేహపర్యాకుల చిత్తుడైన దశరథుడన్న మాటలు విని కోపంతో విశ్వామిత్రుడు ఇట్లా అన్నాడు - '' ఓ రాజా! నీవు చేసిన ప్రతిజ్ఞను - నా కిచ్చిన వాగ్దానాన్ని నీవే తప్పుతున్నావు. సింహంలాంటి నీవు లేడిలాగా అయిపోవాలనుకుంటున్నావు. రఘు కులంలో

పుట్టిన నీకు ఇది తగదు. రాజా! నీవు నీ మాట నిలబెట్టుకోలేక పోతే నా దారిన నేను పోతాను. నీవు, నీ బంధువులు సుఖంగా ఉండండి.''

కోపంతో విశ్వామిత్రుడన్న మాటలకు భూమి కంపించింది. దేవతల హృదయాలను అజ్ఞాతమైన భయం ఏదో ఆవహించింది. విశ్వామిత్రునికి కోపం వచ్చిందని తెలుసుకొన్న వసిష్ఠుడు దశరథునితో ఇట్లా అన్నాడు - ఓ రాజా! ఇక్ష్వాకు వంశంలో పుట్టావు. దశరథుడవు. నీవే మాట నిలబెట్టుకోకపోతే ఇతరులెవరు మాటకు కట్టుబడి ఉంటారు ? నీ లాంటి వారి ఇటువంటి ప్రవర్తనను చూచి ప్రజలు కూడా అట్లాగే అధర్మపరులౌతారు. దేవేంద్ర భవనంలో అగ్నిదేవుని ద్వారా అమృత రక్షణం జరుగుతున్నట్లుగా శ్రీరాముని చేత ఈ విశ్వామిత్రుని యాగం రక్షింపబడాలి. శ్రీరాముడు అస్త్ర-శస్త్రాదులు సాధించిన వాడైనా కాకపోయినా రాక్షసులు ఆతనికి హాని కలుగజేయలేరు. శ్రీరాముడు మూర్తీభవించిన ధర్మం. పరాక్రమంలో వరిష్ఠుడు. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు. తపస్సులలో మిన్న.

**తథా వసిష్ఠే బ్రువతి రాజా దశరథః సుతం**
**సంప్రహృష్టమనో రామమాజుహావ స లక్ష్మణం** 26

వసిష్ఠ మహర్షి ఇట్లా చెప్పిన మీదట, దశరథుడు మిక్కిలి సంతసించినవాడై లక్ష్మణునితో సహా తన జ్యేష్ఠపుత్రుని పిలుచుకొని రమ్మని ద్వారపాలుని పంపాడు. ఆ ద్వారపాలుడు తిరిగి వచ్చి యిట్లా అంటున్నాడు -

**రామో రాజీవ పత్రాక్షో యతః ప్రభృతి చాగతః**
**సవిప్రస్తీర్థ యాత్రాయాస్తతః ప్రభృతి దుర్మనాః** 27
**యత్న ప్రార్థన యాస్మాకం నిజవ్యాపార మాహ్నికమ్**
**సోయమామ్లాన వదనః కరోతి న కరోతి వా.** 28
**కిం సంపదా కిం విపదా కిం గేహేన కిమీహితైః**
**సర్వమేవాసదిత్యుక్త్వా తూష్ణీమేకో వతిష్ఠతే** 29
**వస్త్ర పానాశనా దాన పరాఙ్ముఖతయా తథా**
**పరివ్రాట్ ధర్మిణం రాజన్సో నుయాతి తపస్వినం.** 30
**నాభిమాన ముపాదత్తే నాభివాంఛతి రాజతాం**
**నోదేతి నాస్తమాయాతి సుఖదుఃఖాది వృత్తిషు.** 31
**సీతమాయు రనాయాస మభివాంఛసి కిం ధనమ్**
**అను శోచ్యేతి సర్వస్వ మర్థిభ్యః సంప్రయచ్ఛతి.** 32

రాజీవలోచనుడైన రాముడు విప్రులతో సహా తీర్థయాత్రల నుండి తిరిగి వచ్చిన నాటి నుండి, మిక్కిలి ఉదాసీనుడై ఉంటున్నాడు. మేము ఎంతో ప్రార్థించిన మీదట స్నానపానాదుల్నీ, ఆహ్నిక కృత్యాలను నిర్వర్తిస్తున్నాడు. ఒకప్పుడు అదీ లేదు. 'ఈ సంపద ఎందుకు? ఈ విపత్తులు ఏమిటి? ఈ భవనాలు, ఈ కోరికలు వీటి అన్నింటి వల్ల ఏమిటి ప్రయోజనం? ' అని అంటూ మౌనాన్ని పూని, ఏకాంతంగా కూర్చుంటున్నాడు. ఓ రాజా! వస్త్రపాన ఆహారాదుల యెడల విముఖుడై సన్యాసుల లాగా, తపస్వులలాగా వ్యవహరిస్తున్నాడు. ఆతనికి ఏ విషయమ్మైన అభిమానమూ లేదు. రాజసింహాసనం కావాలనీ లేదు. సుఖం కలిగినప్పుడు సంతోషమూ లేదు. దుఃఖం కలిగినప్పుడు విషాదమూ లేదు. 'మనమంతా పరమపదాన్ని (మోక్షాన్ని) పొందటానికి అడ్డుగా ఉండే పనుల్లోనే మన కాలాన్ని గడుపుతున్నాం ' అంటూ తనలో తానే గొణుగుతూ ఉంటాడు. అతడు అందరికీ ఈ విధంగా బోధిస్తూ ఉంటాడు. - 'ఈ ధనమనేది సమస్త విపత్తులకూ మూలస్థానం. అటువంటి ధనం కావాలని ఎందుకు కోరతావు? ' అని అంటూ తన సంపదను, తన వస్తువులను అర్హులైనవారికి స్నేహితులకు ఇచ్చివేస్తూ ఉంటాడు. లోకులంతా రోజూ 'నేను దిక్కులేని వాడను, అనాథను, చచ్చిపోతున్నాను ' అని అనుకుంటూ, ఎన్ని బాధలు అనుభవిస్తున్నా వారికి వైరాగ్యం కలగటం లేదు. శ్రీరాముడు ఎల్లప్పుడూ వైరాగ్య బోధలు చేస్తూ ఉండటం ఆశ్చర్యంగానే ఉంది. (శ్రీరాముని యందు ముముక్షువైన వానికి, ఇహాముత్రఫల భోగ విరాగానికి ఉండే లక్షణాలను చూపించారు.)

ఇది విని విశ్వామిత్రుడు ఇట్లా అంటున్నాడు :

ఏవం చేత్తన్మహాప్రాజ్ఞం భవన్తో రఘునందనమ్
ఇహానయన్తు త్వరితా హరిణం హరిణా ఇవ 33
ఏషమోహో రఘుపతేర్నా పద్యో నాపి రాగతః
వివేక వైరాగ్య కృతో బోధ ఏష మహోదయః 34
ఏతస్మి న్మార్జితే యుక్త్యా మోహే స రఘునందనః
విశ్రాన్తి మేష్యతి పదే తస్మిన్వయ మివోత్తమే. 35
నిజాంచ ప్రాకృతామేవ వ్యవహార పరంపరామ్
పరిపూర్ణమనా మాన్య ఆచరిష్యత్య ఖండితామ్. 36

ఏవం మునీంద్రే బ్రువతి పితుః పాదాభివందనం
కర్తుమభ్యా జగామాథ రామః కమలలోచనః 37
ప్రథమం పితరం పశ్చాన్మునీ మాన్యైకమానితౌ
తతో విప్రాంస్తతో బన్ధూన్ ప్రణనామ తతో గురూన్. 38

అట్లా అయితే, శ్రీరామచంద్రుని, మృగయూథానికి యూథపతిని లాగా, ఇచటికి తీసుకొని రండి. శ్రీరామునికి ఈ విధమైన మోహం ఏ ఆపత్తి వల్లనూ కలగలేదు. ఏ ఆసక్తి వల్లనూ కలగలేదు. మా ఉపదేశం వల్ల యదార్థ జ్ఞానం కలుగుతుంది. యదార్థమైన పరమానంద స్వరూపాన్ని - పూర్ణ జ్ఞాన స్వరూపాన్ని పొంది, సంతాపరహితుడై కాంతిమంతుడౌతాడు. మనస్సులో పరిపూర్ణత్వాన్ని అనుభవించి, వర్ణాశ్రమ ధర్మానుష్ఠానం చేస్తాడు. అతనిని సుఖదుఃఖాలు ఏమీ చేయలేవు. అతని దృష్టిలో బంగారం, మట్టిబెడ్డ ఒకటే అవుతాయి.

విశ్వామిత్రుడిట్లా అంటూ ఉండగా, శ్రీరామచంద్రుడు సభలోనికి వచ్చాడు. ముందుగా తండ్రికి, పిమ్మట వసిష్ఠ, విశ్వామిత్రులకు, విప్రులకు, బంధువులకు, పెద్దలకు నమస్కరించాడు. పిమ్మట రాజసమూహం చేసే ప్రణామాల్ని ప్రసన్న దృష్టితోనూ, ఆమోద సూచకంగా తల ఆడిస్తూనూ, మృదు వచనాలతోనూ స్వీకరించాడు.

పుత్ర ప్రాప్తవివేకస్త్వం కల్యాణానాం చ భాజనమ్
జడవజ్జీర్ణయా బుద్ధ్యా ఖేదాయాత్మా న దీయతామ్. 39
వృద్ధ విప్ర గురుప్రోక్తం త్వాదృశేనానుతిష్ఠతా
పదమారుహ్యతే పుణ్యం న మోహమను ధావతా. 40
తావదేవాపదో దూరే తిష్ఠన్తి పరిపేలవాః
యావదేవ న మోహస్య ప్రసరః పుత్ర దీయతే. 41

దశరథుడు తనకు నమస్కరించిన రాముని హృదయానికి హత్తుకొని ముద్దుపెట్టుకొన్నాడు. తన ఒడిలో కూర్చోమన్నాడు. కాని, రాముడు పరిజనులు పరచిన వస్త్రం మీద కూర్చున్నాడు. దశరథుడు రామునితో అంటున్నాడు-

నాయనా! నీవు అనేక కల్యాణగుణాలకు ఆకరమైనవాడవు. నీవు పరిపూర్ణమైన వివేకాన్ని పొందావు. జడునిలాగా నిన్ను నీవే ఖిన్నునిగా చేసుకోవద్దు. నీలాంటి వివేకవంతులైన వారు పెద్దలు, గురువులు చేసే హితబోధననుసరించి నడచుకొని పుణ్యపదాన్ని పొందుతారు. మోహం వెంట పోయేవారు ఆ పరమపదాన్ని పొందలేరు.

నాయనా! మోహానికి హృదయంలో తావు లేనంత వరకు సమస్త విపత్తులు మనకు దూరంగానే ఉండిపోతాయి. కాబట్టి, నీవు మోహానికి తావు ఇవ్వ వద్దు.

వసిష్ఠుడు అందుకొన్నాడు -

**రాజపుత్ర మహాబాహో శూరస్త్వం విజితాస్త్వయా**
**దురుచ్ఛేదా దురారంభా అప్యమీ విషయారయః** 42
**కిమతజ్ఞ ఇవాజ్ఞానాం యోగ్యే వ్యామోహ సాగరే**
**వినిమజ్జసి కల్లోల బహులే జాడ్యశాలిని** 43

''ఓ మహాశూరుడా! నీవు వీరుడవు కాబట్టి, దుఃఖకారణాలై నష్టాల్నీ కష్టాల్నీ కలిగించే విషయ వాసనలుఅనే శత్రువుల్ని జయించావు. ఇల్లా మహాజ్ఞానివైనప్పటికీ ఏమీ తెలియని అజ్ఞానిలాగా ఉవ్వెత్తుగా లేస్తున్న అలలతో కూడిన మహాసాగరంలో ఎందుకు మునుగుతున్నావు? '' అని.

విశ్వామిత్రుడంటున్నాడు -

**కింనిష్ఠాః కే చ తే కేన కియన్తః కారణేన తే**
**అధయః ప్రవిలుంపన్తి మనో గేహ మివాఖవః** 44
**యథాభిమతమాశు త్వం బ్రూహి ప్రాప్స్యసి చానఘ**
**సర్వమేవ పునర్యేన భేత్స్యన్తి త్వాం తు నా ఘయః** 45
**ఇత్యుక్తమస్య సుమతే రఘువంశకేతు -**
**రాకర్ణ్య వాక్యముచితార్థ విలాసగర్భమ్** 46
**తత్యాజ ఖేద మభిగర్జతి వారివాహే**
**బర్హీ యథా త్వనుమితాభిమతార్థ సిద్ధిః** 47

ఓ రాజకుమారా! కదలుతున్న నీలకమల దళాల వంటి నీ నేత్రాల్లో కనిపించే చాంచల్యం వల్ల నీ మానసిక వ్యగ్రత గోచరిస్తోంది. నీకు ఇట్టి వ్యామోహం ఎందుకు కలిగిందో చెప్పు. ఎలుకలు ఇంటిని పాడు చేసే విధంగా ఏ మనోవ్యాధులు నిన్ను బాధిస్తున్నాయి ? అనుచితమైన ఇటువంటి చింతకు నీవు తగినవాడకు కావు. నీకు చింత అనేది కలగటానికే వీలు లేదు.

నీ మానసిక వృత్తాంతమంతా నాకు చెప్పు. నీ మనోరథం నెరవేరుతుంది. నీకిక ఏ చింతలూ ఉండవు. మేఘ గర్జనను విన్న మయూరం ఇష్టప్రాప్తిని పొంది సంతోషించినట్లుగా, విశ్వామిత్రుని మాటలు విన్న రఘువంశ భూషణుడు హృదయఖేదాన్ని విడనాడాడు. విశ్వామిత్రుని మాటల్లో అతనికి తనకిష్టమైన అనుకూలార్థం తోచింది.

# రెండవ సర్గ - జగద్దోష ప్రకాశ వర్ణనము

వాల్మీకి అంటున్నాడు -

**ఇతి పృష్టో మునీంద్రేణ సమాశ్వాస్య చ రాఘవః**
**ఉవాచ వచనం చారు పరిపూర్ణార్థ మంథరమ్. 1**

ఓ భరద్వాజా! విశ్వామిత్రుడీ విధంగా అడిగిన మీదట శ్రీరాముడు కొంత ఊరట చెందినవాడై, అర్థ గౌరవంతో కూడిన మాటలతో మెల్లగా ఇట్లా అన్నాడు.

**భగవన్భవతా పృష్టో యథా వదధునాఖిలమ్**
**కథయామ్యహ మజ్ఞో పి కో లంఘయతి సద్వచః 2**
**అహం తావదయం జాతో నిజే స్మిన్మందిరే పితుః**
**క్రమేణ వృద్ధిం సంప్రాప్తః ప్రాప్త విద్యశ్చ సంస్థితః 3**
**తతః సదాచార పరో భూత్వాహం మునినాయక**
**విహృతస్తీర్థ యాత్రార్థ ముర్వీముంబుధి మేఖలాం 4**
**ఏతావతా చ కాలేన సంసారాస్థామిమాం హరన్**
**ప్రాదుర్భూతో మనసిమే విచారః సోయమీదృశః 5**
**కిం నామేదం వద సుఖం యేయం సంసార సంస్థితిః**
**జాయతే మృతయే లోకో మ్రియతే జననాయ చ. 6**
**అస్థిరాః సర్వ ఏవైతే సచరాచర చేష్టితాః**
**సర్వాపదాం పదం పాపా భావా విభవ భూమయః 7**
**అయః శలాకా సదృశాః పరస్పర మసంగినః**
**శ్లిష్యన్తే కేవలం భావా మనః కల్పనయా స్వయా 8**

ఓ దేవా! నేను జ్ఞానిని కాకపోయినా, మీరు నా మనస్సులోని మాట అడిగారు కాబట్టి చెపుతున్నాను. మీ మాటను ఎవరు ఉల్లంఘించగలరు? నేను నా తండ్రి యింట పుట్టి పెరిగి పెద్దవాడినై విద్యాభ్యాసం చేశాను. ఓ మునినాథా! సదాచారాన్ని పాటిస్తూ తీర్థయాత్రలకై బయలుదేరి, సాగరపరివేష్టితమైన భూమండల మంతా తిరిగాను. పిమ్మట, ఈ సంసార దుఃఖాలను దూరం చేయజాలిన ఆలోచనలు నా మనస్సులో పుట్టినాయి - నాకు కలిగిన వివేకం ఏమంటే, ఈ సమస్తమైన విషయ భోగాలలోనూ ఏ విధమైన సారమూ లేదు అని. ఇటువంటి వైరాగ్యభావంతోనే ఆలోచించటం ఆరంభించాను. సమస్త ప్రాణులూ చావటానికే పుడుతున్నాయి.

పుట్టి చస్తున్నాయి. ఈ చరాచర జీవరాసుల చేష్టలు, ఈ విషయాలూ అన్నీ నశించేవే! సాంసారిక సుఖభోగాలన్నీ క్షణికాలే! నశ్వరాలే! ఇంకా ఇంకా విషయాలలో బంధించేవే! ఇదంతా తెలిసీ కూడా మానవుడు వాటికి చిక్కుతున్నాడు. ఇనుప మేకుతో బిగింపబడినట్లుగా ఇది నా భార్య, వీడు నా కొడుకు, ఇతడు నా భర్త, అనే మిథ్యా కల్పనతో - అహంకార మమకారాలతో - బంధింపబడుతున్నాడు.

**కిం మే రాజ్యేన కిం భోగైః కోహం కిమిదమాగతమ్**
**యన్మిథ్యైవాస్తు తన్మిథ్యా కస్యనామ కిమాగతమ్ 9**
**ఏవం విమృశతో బ్రహ్మన్సర్వేష్వేవ తతో మమ**
**భావే ష్వరతిరాయాతా పథికస్య మరుష్వివ 10**
**శామ్య తీదం కథం దుఃఖమితి తప్తోస్మి చిన్తయా**
**జరద్వృక్ష ఇవోగ్రేణ కోటర స్థిత వహ్నినా. 11**
**సంసార దుఃఖ పాషాణ నీరంధ్ర హృదయో హ్యహమ్**
**నిజ లోకభయాదేవ గలద్బాష్పం న రోదిమి 12**
**చింతాని చయ చక్రాణి నానన్దాయ ధనాని మే**
**సంప్రసూత కలత్రాణి గృహోణ్యుగ్రాపదా మివ 13**

నాకు ఈ రాజ్యంతో, ఈ సుఖభోగాలతో ఏమి ప్రయోజనం? నేను ఎవరిని? ఈ కనిపించే ప్రపంచం ఏమిటి? నా బుద్ధికి ఇది ఇట్లా ఎందుకు గోచరిస్తోంది? ఇది మిథ్య అయితే మిథ్యగానే ఉండవచ్చు గదా! దాని వల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదు. ఓ మహానుభావా! ఇట్లా ఆలోచించగా ఈ సమస్త భోగపదార్థాలూ, పథికునికి మరుస్థలం మీద లాగా వైరాగ్యాన్ని అయిష్టతను కలిగించినాయి. దేవా! చెట్టు తొఱ్ఱలో అగ్నిప్రవేశం జరగటం వల్ల ఆ అగ్నితో అది కాలి భస్మమైనట్లుగా, నాలో చింత ప్రవేశించింది. అది ఎట్లా శాంతిస్తుంది? పాషాణంలాగా అయిపోయిన నా హృదయం ఈ సాంసారిక దుఃఖాలకు, ద్వంద్వాలకు చలించటం లేదు. నా స్థితిని చూచి ఆక్రందన చేసే పరిజనాన్ని చూచి కన్నీరు వచ్చినా తల్లిదండ్రులు బాధ పడతారని ఏడవటం లేదు. ఈ ధన సంపదలు, వైభవాలు, ఇవన్నీ దుఃఖదాయకాలు. నాకు వీటి వల్ల ఏమాత్రమూ సుఖం కనిపించటం లేదు. బహుసంతానం కలిగిన సంసారం లాగానే అనేక సుఖవైభవాలతో కూడిన ఈ జీవితం దుఃఖదాయకం.

లక్ష్మీ నిరాకరణం

ఇయమస్మిన్ స్థితో దారా సంసారే పరిపేలవా
శ్రీర్మునే పరిమోహాయ సాపి నూనం న శర్మదా. 14
గుణాగుణ విచారేణ వినైవ కిల పార్శ్వగమ్
రాజ ప్రకృతి వన్మూఢా దురారూఢావలమ్బతే. 15
కర్మ..కా తేన తేనైషా విస్తార మనుగచ్ఛతి
దోషాశీ విష వేగస్య యత్ క్షీరం వినరాయతే. 16

లక్ష్మి అనేది - సంపద అనేది - ఈ ప్రపంచంలో అనేక సుఖాలకు సాధనం అని మూర్ఖులు భావిస్తూ ఉంటారు. ఇది ఉత్కృష్టమైనదీ కాదు; ఇది స్థిరంగానూ ఉండదు. నిజానికి ఇది సుఖదాయకమూ కాదు. ఇది మోహాన్ని పుట్టించి చివరికి దుఃఖాన్నే కలిగిస్తుంది.

ప్రక్కన ఎప్పుడు ఏ ఉద్యోగి ఉంటే వాని మీదనే ఆధారపడి అతనినే ఆశ్రయించే రాజులాగా. ఈ లక్ష్మి కూడా ప్రక్కన ఆ సమయానికి ఎవరు ఉంటే వారినే కరుణించి ఆశ్రయిస్తుంది.

సర్పానికి పాలు పోసి పెంచిన కొద్దీ విషవృద్ధి అయినట్లుగా వాణిజ్యాది కర్మల ద్వారా ఈ సంపదను (లక్ష్మిని) పెంచిన కొద్దీ అది అనర్థాలకు కారణమౌతుంది - దుఃఖమూ పెరుగుతుంది.

తావచ్ఛీత మృదుస్పర్శః పరేస్వే వర్తతే జనః
వాత్యయేవ హిమం యావచ్ఛ్రియా న పరుషీ కృతః 17
ప్రాజ్ఞాః శూరాః కృతజ్ఞాశ్చ పేశలా మృదవశ్చ యే
పాంశుముష్ట్యేవ మణయః శ్రియా తే పరుషీకృతాః 18
శ్రీమాన జనని ద్య్వశ్చ శూరశ్చాప్య వికత్థనః
సమదృష్టిః ప్రభుశ్చేతి దుర్లభాః పురుషాస్త్రయః 19
మనోరమా కర్షతి చిత్తవృత్తిం కదర్థ సాధ్యా క్షణ భంగురా చ
వ్యాలావలీ గాత్ర వివృత్త దేహా శ్వభ్రో త్థితా పుష్పలతేవ లక్ష్మీః 20

దేవా! సుఖదాయకమైన మంచు యొక్క శీతల స్పర్శ - హిమ శైత్యం - వేడిగాలి తగలటంతోనే మాయమైపోయినట్లుగా, లక్ష్మీదేవి యొక్క స్పర్శ తగలగానే మానవునిలో ఉండే శాంత స్వభావం నష్టమైపోతుంది. ఒక గుప్పెడు మట్టి, రత్నాల

యొక్క- అందాన్నీ ప్రకాశాన్నీ పాడు చేసినట్లుగా సంపద అనేది మానవులలోని పరాక్రమం, కృతజ్ఞత, దయ, మృదుత్వం, మొదలైన సద్గుణాలను పాడుచేస్తుంది. ప్రపంచంలో మూడు రకాల మనుష్యులు చాలా అరుదుగా ఉంటారు -(1) సంపన్నులైనప్పటికీ సమాజానికి చెరుపు చేయనివారు (2) తాము గొప్ప శూరులైనప్పటికీ ఆత్మస్తుతి చేయనివారు (3) తాము యజమానులై ఉండీ కూడా తమ సేవకుల యెడల, ఆశ్రితుల యెడల సమాన భావం కలవారు - తామెంతో వారూ అంతే అనే భావం కలవారు. సంపద (లక్ష్మి) మనస్సును రమింపచేసేది. కాబట్టి మన చిత్తవృత్తుల్ని ఆకర్షించుకొంటుంది. సంపద అనేది ఎప్పుడైనా దుష్ట కర్మ వల్లనే లభిస్తుంది. కాబట్టి అది క్షణ భంగురం. లక్ష్మి ఎల్లప్పుడూ సర్పం చేత చుట్టబడిన పూలతీగలాగా, వాసనల చేత దుఃఖాల చేత చుట్టబడి ఉంటుంది.

అస్థిరమైన ఆయుర్దాయాన్ని గురించి :

ఆయుః పల్లవ కోణాగ్ర లవాంబుకణ భంగురం
ఉన్మత్తమివ సంత్యజ్య యాత్య కాండే శరీరకం. 21
విషయాశీ విషా సంగ పరిజర్జర చేతసామ్
అప్రౌఢాత్మ వివేకానా మాయు రాయాస కారణం 22
వయం పరిమితాకార పరినిష్ఠిత నిశ్చయాః
సంసారాభ్రతడిత్పుంజే మునే నాయుషి నిర్వృతాః 23
యుజ్యతే వేష్టనం వాయోరాకాశస్య చ ఖండనం
గ్రథనం చ తరంగాణా మాస్థా నాయుషి యుజ్యతే. 24
పేలవం శరదీవాభ్రమస్నేహ ఇవ దీపకః
తరంగక ఇవాలోలం గత మేవోప లక్ష్యతే 25
అవిశ్రాంత మనాః శూన్యమాయురాతత మీహతే
దుఃఖాయైవ విమూఢోన్తర్గర్భ మశ్వతరీ యథా. 26
శ్రీరాముడు అంటున్నాడు -

మహాత్మా! ఆయుర్దాయం అనేది చిగురుటాకు చివరి అంచున వ్రేలాడుతున్న నీటి బిందువులాగా అస్థిరమైనది. పిచ్చివాడు ధ్యేయమంటూ లేకుండా ఒక చోటు వదిలి ఇంకొక చోటుకు వెళ్ళిపోయేటట్లు, ఎప్పుడో, అనుకోకుండానే ఆయువు ఈ శరీరాన్ని వదలిపెట్టి వెళ్ళిపోతుంది.

సాంసారిక విషయవాసనలనే సర్పాల చేత మనస్సు కాటు వేయబడినందున ఎవరి శరీరాలు జీర్ణము శీర్ణము అయినాయో, ఎవరికి ఆత్మ వివేకం కలుగలేదో, అట్టివారికి ఆయువు క్లేశ కారణమే అవుతుంది. ఓ ఋషి పుంగవా! మనం, పరిమితాకారం కలిగినట్టి, నశ్వరమైనట్టి, ఈ శరీరాన్ని ఆత్మ అని అజ్ఞానం వల్ల అనుకుంటున్నాం. కాబట్టే, ఒక్కసారిగా మెరసి మాయమైపోయే మేఘాల్లోని తటిల్లత లాంటి ఈ సాంసారిక జీవితంలో - అల్పాయువులో సుఖమనేది మనకు కనిపించటం లేదు.

గాలిని ప్రోగుచేయటం, ఆకాశాన్ని ముక్కలు ముక్కలుగా నరకటం అలలను మాలగా గ్రుచ్చటం, సంభవమైతే కావచ్చు! కాని, ఆయువును నమ్మలేము. శరత్కాలంలోని మేఘం లాగా, నూనె లేని దీపం లాగా, ఆయువు అనేది వ్యర్థం. అది తాత్కాలికమైన అలలాంటిది. ఆయువును నమ్మటం కంటె, అది ఇక లేదని, అది అయిపోయిందని అనుకోవటం మంచిది. శారీరకంగాను, మానసికంగాను కూడా స్వస్థతలేని వారు ఆయువు ఎక్కువ ఉంటే మంచిది అనుకుంటారు. అశ్వతరి ఎంత ఎక్కువ కాలం గర్భాన్ని ధరిస్తే, ఆ గర్భం తనకు అంత ప్రమాదకారి అవుతుందని గ్రహించలేదు. (అశ్వతరి అంటే కంచర గాడిద. గుఱ్ఱం వల్ల గాడిద యందు పుట్టినది. అది గర్భం ధరించినపుడు లోపల ఉన్న పిల్ల పెరిగి పెరిగి తల్లి గర్భాన్ని చీల్చుకొని బయటకు వస్తుంది. దానితో తల్లి చచ్చిపోతుంది.)

ప్రాప్యం సంప్రాప్యతే యేన భూయో యేన న శోచ్యతే
పరాయా నిర్వృతేః స్థానం యత్త జ్జీవిత ముచ్యతే 27
తరవోపి హి జీవన్తి జీవన్తి మృగపక్షిణః
స జీవతి మనో యస్య మననేనైవ జీవతి. 28
జాతాస్త ఏవ జగతి జన్తవః సాధుజీవితాః
యేపునర్నేహ జాయన్తే శేషా జరఠ గర్దభాః 29
భారోవివేకినః శాస్త్రం భారో జ్ఞానం చ రాగిణః
అశాంతస్య మనోభారో భారోఽనాత్మ విదో వపుః 30
రూపమాయుర్మనో బుద్ధి రహంకారః స్థిరే హితం
భారో భారవహస్యేవ సర్వం దుఃఖాయ దుర్ధియః 31

తాను జీవితంలో సాధించవలసిన పరమపురుషార్థాన్ని - మోక్షాన్ని సాధించిన వాని జీవితమే సఫలమైనది. కేవలం బ్రతకటమే అయితే, చెట్లు చేమలు, పశుపక్ష్యాదులు కూడా బ్రతుకుతూనే ఉన్నాయి. కాని వాటి బ్రతుకు బ్రతుకే కాదు. వాసనలను జయించి, తత్త్వజ్ఞానంతో పరమ నిర్వృతిని పొందినవాని జీవితమే సార్థకం. మిగతావారి జీవితాలు ముసలి గాడిద యొక్క జీవితం లాంటివి. వివేకం లేని వాని శాస్త్ర జ్ఞానం భారమే! అది కష్టాలకు, ప్రమాదాలకు కారణమౌతుంది. అట్లాగే, శాంతి లేని వాని మనస్సు సైతం మిక్కిలి భారమైనది. ఆత్మవేత్త కానివాని శరీరం సైతం మహాభారమే! బరువు మోసేవానికి అన్ని రకాల బరువులు దుఃఖదాయకాలే! ఏ వస్తువు బరువైనా ఒకటే! అట్లాగే అజ్ఞానికి రూపము, ఆయుర్దాయము, మనస్సు, బుద్ధి, అహంకారం వగైరా అన్నీ దుఃఖదాయకాలే!

*అహంకారాన్ని నిరసిస్తున్నారు :*

శ్రీరామచంద్రుడు విశ్వామిత్రునితో ఇంకా యిట్లా అంటున్నాడు -

**ముధైవాభ్యుత్థితో మోహాన్ముధైవ పరివర్తతే**
**మిథ్యామయేన భీతాః స్మో దురహంకారవైరిణా** 32
**అహంకార వశాదా పదహంకారా ద్దురాధయః**
**అహంకార వశాదీహా నాహంకారాత్పరో రిపుః** 33
**తమహంకార మాశ్రిత్య పరమం చిరవైరిణమ్**
**న భుంజే న పిబామ్యమ్భః కిము భోగాన్భజే మునే.** 34
**సర్వాపదాం నిలయ మధ్రువమన్తర్‌స్థ -**
**మున్ముక్త ముత్తమ గుణేన న సంశ్రయామి**
**యత్నాదహంకృతి పదం పరితోఽతి దుఃఖం**
**శేషేణ మాం సమనుశాధి మహానుభావ.** 35

ఓ మునిపుంగవా! ప్రపంచంలో అహంకారాన్ని మించిన శత్రువు లేదు. అహంకారం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయి. ఈ అహంకారం అనేది మోహం వల్ల పుడుతుంది. అజ్ఞానం వల్లనే ఇది బాగా వృద్ధి పొందుతుంది. అహంకారంఅనేది అనేకమైన శారీరక ఆపదలకు ఉత్పత్తి స్థానం. అహంకారం వల్లనే మానవుడు అనేక మానసిక చింతలచేత చుట్టబడతాడు. మానసిక వికృతులన్నీ ఈ అహంకారం వల్ల పుట్టేవే! ఈ అహంకారం మానవునికి చిరశత్రువు లాంటిది. ఈ దురహంకారమే

నా కున్న జాడ్యం. ఈ అహంకారానికి లోబడే నేను అన్న పానాదులు మానితిని. ఇక భోగాల సంగతి వేరే చెప్పనక్కర లేదు. అహంకారం సమస్త ఆపదలకు మూలం. హృదయంలోని మంచినంతనంతటిని పాడు చేసేది ఈ అహంకారమే! మానుభావా! ఎంతో కష్టం మీద నేను ఆ అహంకారాన్ని వదలి వేయాలని అనుకుంటున్నాను. ఓ మునిశ్రేష్ఠా! ఈ విషయమై నా కర్తవ్యం ఏమిటో నాకు సెలవివ్వండి.

చిత్త దౌరాత్మ్యాన్ని గూర్చి రాముడిట్లా చెపుతున్నాడు -

**దోషైర్జర్జరతాం యాతం సత్కార్యాదార్యసేవితాత్**
**వా తాన్తః పిచ్ఛలవచ్చేత శ్చలతి చంచలమ్.** 36

**ఇతశ్చేతశ్చ సువ్యగ్రం వ్యర్థమేవాభి ధావతి**
**దూరాద్దూరతరం దీర్ఘం గ్రామే కాలేయకో యథా** 37

**న ప్రాప్నోతి క్వచిత్కించి త్ప్రాప్తైరపి మహాధనైః**
**నాన్తః సంపూర్ణతామేతి కరండకమివాంబుభిః** 38

**వహ్నే రుష్ణతరః శైలాదపి కష్టతరక్రమః**
**వజ్రాదపి దృఢో బ్రహ్మ న్దుర్నిగ్రహో మనోగ్రహః** 39

**హార్దాన్ధకార శర్వర్యా తృష్ణయైవ దురన్తయా**
**స్ఫురన్తి చేతనాకాశే దోష కౌశిక పంక్తయః** 40

ఓ మునీంద్రా! వాయువు యొక్క ప్రవాహ వేగానికి నెమలి పింఛం యొక్క చివరి భాగం ఊగిసలాడేటట్లుగా, మూర్ఖమైన ఈ మనస్సు సత్కార్యాచరణాన్ని మాని వ్యర్థంగా ఇటూ అటూ తిరుగుతూ ఉంటుంది. వీధి కుక్క తన పొట్ట నింపుకోవటం కోసం కాకపోయినా, వ్యర్థంగా వీధి వీధికీ, ఇంటింటికీ చంచలంగా ఇటూ అటూ తిరిగినట్లుగా ఈ చిత్తం కూడా తనకు అనుకూలమైన వాటి కోసం ఇటూ అటూ తిరుగుతూ ఉంటుంది. వెదురు బుట్టలో ఎంత నీరు పోసినా ఆ బుట్ట నిండనట్లుగా, ఎంత గొప్ప ధన భండారం లభించినా ఈ మనస్సుకు తృప్తి అనేది ఉండదు.

ఓ మహర్షీ! ఈ మనస్సు అనే పిశాచం అగ్ని కంటె ఉష్ణం కలది. ఎల్లప్పుడూ సంతృప్తమౌతూ ఉంటుంది. దీనిపై ఆధిపత్యాన్ని సంపాదించటం - దీనిని అదుపులో ఉంచుకోవటం - పెద్ద పర్వతాన్ని లోబరుచుకోవటం వంటిది. ఇది వజ్రాయుధం కంటె కఠినమైనది. అజ్ఞానం అనే అంధకారంతో కూడిన తృష్ణ అనే

రాత్రి వేళ అదను చూచుకొని చేతనుడైన జీవాత్మ అనే ఆకాశంలో అనేక పాపాలనే గుడ్లగూబలు సంచరిస్తు ఉంటాయి. (తృష్ణ అనేదిరాత్రి - అజ్ఞానం అనేది అంధకారం. జీవాత్మ ఆకాశం. పాపాలు గుడ్లగూబలు.)

**తృష్ణా నిరాసనము :**

శ్రీరాముడు విశ్వామిత్రునితో ఇంకా ఇట్లా అంటున్నాడు -

**రోగార్తిరంగనా తృష్ణా గంభీరమపి మానవమ్**
**ఉత్తానతాం నయత్యాశు సూర్యాంశవ ఇవాంబుజమ్. 41**
**అపి మేరూపమం ప్రాజ్ఞమపి శూరమపి స్థిరమ్**
**తృణీకరోతి తృష్ణైషా నిమిషేణ నరోత్తమమ్. 42**

మహాత్మా! సూర్యుని యొక్క కిరణాలు పద్మాల్ని వికసింపజేసి పైకి లేపినట్లుగా, తృష్ణ అనేది రోగ పీడ రూపంలో, అంగనా సక్తి రూపంలో ఎంతటి ధీరుణ్ణి గంభీరుణ్ణి అయినా విచలితుని చేసివేస్తుంది. మేరువు వంటి మహాశూరుని, పండిత శ్రేష్ఠుని సైతం ఈ తృష్ణ అనేది ఒక్క క్షణంలో తుచ్ఛునిగా, తృణసమానునిగా చేసివేస్తుంది.

దేహాన్ని నిరసిస్తున్నారు -

ఆర్ద్రాన్త్ర తన్త్రీ గహనో వికారీ పరితాపవాన్
కాయః స్ఫురతి సంసారే సోపి దుఃఖాయ కేవలం. 43
స్తోకేనానన్ద మాయాతి స్తోకేనాయాతి ఖేదతామ్
నాస్తి దేహసమః శోచ్యో నీచో గుణవివర్జితః 44
కలేవర మహంకారగృహస్థస్య మహాగృహమ్
లుంఠత్వభ్యేతు వా స్థైర్యం కిమనేన మునే మమ. 45
కిం శ్రియా కిం చ రాజ్యేన కిం కాయేన కి మీహయా
దినైః కతిపయైరేవ కాలః సర్వ నికృన్తతి. 46
రక్త మాంస మయస్యాస్య సబాహ్యాభ్యన్తరం మునే
నాశైకధర్మిణో బ్రూహికైవ కాయస్య రమ్యతా. 47
జరాకాలే జరామేతి మృతి కాలే తథా మృతిమ్
సమ మేవా విశేషజ్ఞః కాయో భోగి దరిద్రయోః 48

శ్రీరాముడు యిట్లా అంటున్నాడు - ఓ మహర్షీ! ప్రాణులకు ఈ శరీరం దుఃఖాలు, కఠినమైన క్లేశాలు అనుభవించటానికే లభిస్తోంది. మల మూత్రాదులతో నిండి, ప్రేగులతో నాడులతో అల్లిబిల్లిగా అల్లుకొని ఉన్నట్టి ఈ శరీరం నశ్వరమైనది. అల్పమైన విషయాలకే సంతోషిస్తూ, అల్పమైన వాటికోసమే దుఃఖిస్తూ ఉండే ఈశరీరం కంటె హీనమైనదీ, అవగుణ భూయిష్టమైనదీ వేరొకటి లేదు. ఈ శరీరం అహంకారం అనే గృహస్థుకు గృహం లాంటిది. అది ఈనాడు ఉండవచ్చు. రేపు పోవచ్చు. ఆ శరీరం వల్ల నా కేమీ ప్రయోజనం లేదు.

ఈ సమస్తాన్నీ ఉచ్ఛేదింప చేసే మహాకాలం అనేది ఉండగా, ఇక స్వల్ప కాలం పాటు ఉండేఈ ధనం, వైభవం, శరీరం, ఈ కోరికలు, వీటితో ఏమిటి ప్రయోజనం? ఇవన్నీ వ్యర్థం. రక్తము, మాంసపు ముద్దలతో కూడి, నాశనమైపోయే స్వభావం కల శరీరంలో ఏమి అందం ఉంది? ఏమి ఆకర్షణ ఉంది ? మీరే చెప్పండి.

ఎన్ని సుఖాలు అనుభవించే వాడైనా, ఎంతధనవంతుడైనా, ఎన్ని దుఃఖాలలోనో పుట్టి దుఃఖాలతో పెరిగే దరిద్రుడైనా, అందరికీ శరీరం - అనేది ఒకే విధంగా లభిస్తుంది. అందరికీ ముసలితనం వస్తుంది. అందరికీ చావూ వస్తుంది.

**బాల్యాదుల నిరసనం:**

**లబ్ధ్వాపి తరలాకారే కార్యభార తరంగిణి**
**సంసార సాగరే జన్మ బాల్యం దుఃఖాయ కేవలం 49**
**అశక్తి రాపదస్తృష్ణా మూకతా మూఢ బుద్ధితా**
**గృధ్నుతా లోలతా దైన్యం సర్వం బాల్యే ప్రతిష్ఠితం. 50**
**స్తోకేన వశమాయాతి స్తోకేనైవ వికారితాం**
**అమేధ్య ఏవ రమతే బాలః కాలేయకో యథా 51**
**సకలదోష దశాభిహతాశయం బునస హ్యవివేక విలాసినః**
**ఇహ న కస్య చిదేవ మహామునే భవతి బాల్యమిదం పరితుష్టయే. 52**

బాల్య ప్రవృత్తి బాల్య జీవనం ఎట్లా ఉంటుందో శ్రీరామచంద్రుడు వివరిస్తూన్నాడు - ఓ మునీశ్వరా! అనేక రకాల కార్యభారాలతో నిండి ఉన్న ఈ సంసారసాగరంలో నశ్వరమైన శరీరానికి ఉన్న నాల్గు దశలతో కూడిన ( బాల్య యౌవన కౌమార వార్థక్యాలతో కూడిన) శరీరాన్ని పొందినప్పటికీ - మానవ జన్మ ఎత్తినప్పటికీ - ఈ మానవ జన్మలో బాల్యమనేది చాలా దుఃఖప్రదమైన దశ - అని

గ్రహించాలి. ఈ బాల్యదశలో కార్యకరణ సామర్థ్యం ఉండదు. అనేక విపత్తులు తృష్ణ, మౌఢ్యము, బుద్ధి లేమి, ఆటల మీద, ఆట వస్తువుల మీద మోజు, చంచలత్వం, దైన్యం మొదలైన అనేక దోషాలతో నిండి ఉంటుంది ఈ బాల్యదశ.

బాల్య ప్రవృత్తి కుక్కలాగానే సర్వదా సర్వత్ర అపవిత్రస్థానాల్లో విహరిస్తూ, ఆడుకుంటూ, సంతోషించాలని అనుకుంటూ ఉంటుంది. అందుకే బాలుడు ఏదైనా కాస్త తినటానికి పెట్టినా, బుజ్జగించినా, లాలించినా, వశమైపోతాడు. భయపెట్టినా, బెత్తం చూపించినా పారిపోతాడు. సమస్త దోషాలతో దూషితమైన అంతఃకరణం కలిగినట్టి అజ్ఞానం వల్ల నిరంకుశంగా వ్యవహరించే స్వభావంతో కూడిన బాల్యమనేది ఎవరికీ సుఖదాయకం కాదు.

**అట్లాగే యౌవనమూను :**

**బాల్యావస్థా మథ త్యక్త్వా పుమానభిహితాశయః**
**ఆరోహతి నిపాతాయ యౌవనం సంభ్రమేణతు** 53
**స్వచిత్త విలసం స్థేన నానా విభ్రమ దాయినా**
**బలాత్కామ పిశాచేన వివశః పరిభూయతే.** 54
**విస్తీర్ణాపి ప్రసన్నాపి పావన్యపి హి యౌవనే**
**మతిః కలుషతామేతి ప్రావృషీవ తరంగిణీ.** 55

ఓ మునిపుంగవా! బాల్యావస్థ సమాప్తమైన పిమ్మట మానవుడు బాల్య దోషాలనువదిలి, భోగాలను అనుభవించాలనే ఉత్సాహంతో కాముడనే పిశాచం చేతపట్టువడ్డవాడై, దూషితచిత్తుడై, పతితుడైపోవటానికి యౌవనారూఢుడౌతాడు.

ఈ కామమనే పిశాచం మానవుని మనస్సు అనే గుహంలో ఉంటూ, అనేక రకాల భ్రమలను కలిగిస్తూ, తనకు వశుడైనవానిని బలాత్కారంగా వివశుణ్ణి చేసి పరాభవాన్ని కలిగిస్తుంది.

అంతవరకు నిర్మలంగా, పవిత్రంగా ఉన్నట్టి నది, వర్షర్తువు రాగానే కలుషితమై పోయినట్లుగా, యౌవనం రాగానే మానవుని బుద్ధి, వివేకాన్ని కోల్పోయి, మోహంతో, మదంతో కలుషితమైపోతుంది.

యౌవన దోషాలకు అస్పదమైన స్త్రీని గురించి (పురుషులకు సైతం వర్తిస్తుంది) నిందించటం ఆరంభిస్తున్నారు.

మాంస పాంచాలి కాయాస్తు యంత్రలోలేంగ పంజరే
స్నాయ్వస్థి గ్రన్థిశాలిన్యాః స్త్రీయాః కిమివ శోభనమ్ 56
త్వజ్మాంస రక్త బాష్పాంబు పృథక్కృత్వా విలోచనమ్
సమాలోకయ రమ్యం చేత్కిం ముధా పరిముహ్యాసి. 57
మేరుశృంగ తటోల్లాసి గంగాజల రయోపమా
దృష్టా యస్మిన్ స్తనే ముక్తాహార స్యోల్లాస శాలితా
శ్మశానేషు దిగన్తేషు స ఏవ లలనాస్తనః 58
శ్వభి రాస్వాద్యతే కాలే లఘుపిండ ఇవాన్ధసః 59
కేశ కంజల ధారిణ్యో దుఃస్పర్శా లోచనప్రియాః
దుష్కృతాగ్ని శిఖానార్యో దహన్తి తృణవన్నరాన్. 60
యస్య స్త్రీ తస్య భోగేచ్ఛా నిస్త్రీ కస్య క్వ భోగభూః
స్త్రీయం త్యక్త్వా జగత్త్యక్తం జగత్త్యక్త్వా సుఖీభవేత్ 61

శ్రీరామచంద్రుడు ఇంకా యిట్లా అంటున్నాడు -

స్త్రీయొక్క సౌందర్యాన్ని గురించి పురుషునికి ఒక విధమైన భ్రమ కలుగుతుంది. నిజానికి వస్త్రాదుల చేత అలంకరింపబడిన ఒక కదలాడే బొమ్మలాంటిది స్త్రీ. మాంసం, ఎముకలు, నరాలు మొదలైన వాటి చేత నిర్మింపబడిన బొమ్మలాంటిది.

రక్తం, చెమట, చర్మం, మాంసం, ఎముకలు మొదలైన వాటిలో ఏమైనా అందం ఉన్నదా? వీటిలో ఏమైనా అందం ఉంటే, స్త్రీలో కూడా ఉన్నదని అనుకోవచ్చు! రక్తాదుల్లో అందం లేనప్పుడు వాటి చేత నిర్మింపబడిన స్త్రీలో సౌందర్యం ఎట్లా ఉంటుంది? సౌందర్యం ఉన్నదని అనుకోవటం భ్రమ.

మేరు పర్వత శిఖరం మీద నుండి ప్రవహించే గంగానదీ జలధారలాగా స్త్రీయొక్క సమున్నతమైన స్తన మండలం మీద కదలాడే ముత్యాలహారాలు శోభిస్తూఉంటాయి. ప్రాణం అనే పక్షి శరీర పంజరం నుండి ఎగిరిపోగానే, ఆ స్తనాలనే అన్నపు ముద్దల్లాగా కుక్కలు మొదలైనవి పీక్కుతింటాయి.

స్త్రీ జ్వలించే అగ్ని శిఖ లాంటిది. ఆమె కేశపాశం ధూమపంక్తి లాంటిది. అగ్నిజ్వాల తృణాల్ని దహించి వేసినట్లుగా కామ వాసనాగ్నితో స్త్రీ పురుషుణ్ణి దహించివేస్తుంది. సమీపంలో స్త్రీ ఉన్న వానియందు భోగేచ్ఛ తప్పక ఉంటుంది -

స్త్రీభోగక్షేత్రం కాబట్టి! స్త్రీ లేకపోతే భోగేచ్ఛయే ఉండదు. కాబట్టి స్త్రీని వదలినవాడు జగత్తును వదలినవాడే! జగత్తును - సంసారాన్ని - వదలినవాడు సుఖవంతుడే అవుతాడు.

యౌవనం తరువాతిదైన వార్ధక్యాన్ని (జరను) నిందిస్తున్నారు.

అపర్యాప్తం హి బాలత్వం బలాత్పిబతి యౌవనమ్
యౌవనం చ జరా పశ్చాత్పశ్య కర్కశతాం మిథః 62
దాసాః పుత్రాః స్త్రియశ్చైవ బాంధవాః సుహృదస్తథా
హసన్త్యున్మక మివ నరం వార్ధక కంపితమ్ 63
దుఃప్రేక్ష్యం జరఠం దీనం హీనం గుణపరాక్రమైః
గృధ్రో వృక్షమివా దీర్ఘం గర్ధోహ్యాభ్యేతి వార్ధకమ్ 64
దైన్య దోషమయీ దీర్ఘా హృది దాహప్రదాయినీ
సర్వాపదా మేక సఖీ వార్ధకే వర్ధతే స్పృహా 65
కర్తవ్యం కిం మయా కష్టం పరత్రేత్యతి దారుణమ్.
అప్రతీకారయోగ్యం హి వార్ధకే వర్ధతే భయమ్. 66
గర్ధోభ్యుదేతి సోల్లాస ముపభోక్తుం న శక్యతే
హృదయం దహ్యతే నూనం శక్తి దౌః స్థ్యేన వార్ధకే 67
పరిపక్వ మివాలోక్య జరాక్షార విధూసరమ్
శిరః కూష్మాండకం భుంక్తే పుంసాం కాలః కిలేశ్వరః 68
కిం తేన దుర్జీవిత దుర్గ్రహేణ జరాంగతేనాపి హి జీవ్యతే యత్
జరా జగత్యామజితా జనానాం సర్వేషణాస్తాత తిరస్కరోతి. 69

అసమర్థమైనట్టి బాల్యాన్ని, క్రీడా కౌతుకాలతో కూడిన బాల్యాన్ని, యౌవనం మింగివేస్తుంది. కాంతా కనకాది భోగాలతో కూడినట్టి యౌవనాన్ని - భోగాలతో తృప్తి చెందని యౌవనాన్ని, వార్ధక్యం వచ్చి ఆవరిస్తుంది. ఈ వార్ధక్యం అనేది మిక్కిలి అశక్తితో కూడినట్టిది.

వార్ధక్యంతో వణకిపోతూ ఉంటే వానిని చూచి నౌకర్లు, దాసీజనం, బంధుమిత్రులు, పుత్రులు, పుత్రికలు, భార్య, అంతా వేళాకోళం చేస్తారు. ఆతనిని చూచి హేళనతో నవ్వుతారు.

వార్ధక్యంలో భోగాలను అనుభవించే శక్తి లేక పోయినప్పటికీ, విషయాల

యందు కోరిక మాత్రం అధికంగానే ఉంటుంది. వృద్ధునికి లోగడ ఉండిన గుణగణాలన్నీ పోయి పరాక్రమహీనుడై, దీనుడై అందరిచేత ఉపేక్షింపబడుతూ ఉంటాడు. ఒక చిన్న మొక్కను, గ్రద్ధ, తనకు పనికి రానందున ఉపేక్షించినట్లుగా అంతా అతనిని ఉపేక్షిస్తారు.

దైన్యం తోడి దోషాలతో నిండినట్టి, హృదయానికి బాధను - వ్యథను కలిగించే టటువంటి, అనేక విపత్తులకు ఆకరమైనట్టి విషయేచ్ఛ ముసలితనంలో పెరిగిపోతుంది.

వృద్ధావస్థలో పరలోకం కోసం నేను ఏమి చేశాను? ఏమి చేయాలి? అనే భయం హృదయంలో దారుణంగా పెరిగిపోతుంది. ఈ నాజీవిత మంతా వ్యర్థంగానే గడచిపోయింది అనే - ఏమీ చేయజాలని, అప్రతీకారమైన - భయం ఆవరిస్తుంది.

జీర్ణశక్తి తగ్గిపోతుంది. విషయాలను అనుభవించటానికి లోగడ సమర్థంగా ఉండిన ఇంద్రియాలన్నీ వార్ధక్యంలో శిథిలమైపోతాయి. కాని, హృదయంలో మాత్రం విషయభోగేచ్ఛ పెరిగిపోతూ, తన అసమర్థత కారణంగా జ్వలించి పోతూ ఉంటాడు. వార్ధక్యం కారణంగా బూడిద పూసినట్లు తెల్లబడి పోయినట్టి, బాగా పక్వమైనట్టి బూడిదగుమ్మడి కాయలాగా ఉన్నట్టి అతని శిరస్సును కాలుడు మ్రింగివేస్తాడు. ఓ మునీంద్రా! ఇటువంటి ముసలితనంతో కూడిన దుఃఖభూయిష్టమైన జీవితం వల్ల ఏమి లాభం ఉంది? జీవించి ఉండాలనే కోరికవల్ల కలిగే లాభం ఏముంది?

ఈ ముసలితనాన్ని మానవుడు జయించలేడు. ఈ జర అనేది వచ్చి అన్ని కోరికలను తుడిచిపెడుతుంది.

(ఇట్లా దుఃఖ భూయిష్టమైన సంసారంలో సుఖం ఏమాత్రమూ లేదని చెప్పి భోక్తృభోగ్య భోగాల అనిత్యత్వం కారణంగా ముక్తి లేదని చెపుతున్నారు)

**న తదస్తీహ యదయం కాలః సకల ఘస్మరః**
**గ్రసతే తజ్జగజ్జాతం మహోర్ధిమివ బాడవః** 70
**మహతామపినో దేవః పరిపాలయతి క్షణమ్**
**కాలః కవలితాశేష విశ్వో విశ్వాత్మతాం గతః** 71
**యే రమ్యా యే శుభారమ్భాః సుమేరు గురవోఽపి యే**
**కాలేన వినిగీర్ణాస్తే గరుడేనేవ పన్నగాః** 72

**అప్యేవాచరతో దీనైరుమ్ఘై ర్భాత మృగవ్రజైః**
**అఖేటకం జర్జరితై ర్జగజ్జాంగల జాలకే.** 73
**చండీ చతుర సంచారా సర్వమాతృ గణాన్వితా**
**సంసార వన విన్యస్తా వ్యాఘ్రీ ఘూతౌఘ ఘాతినీ.** 74

బడబాగ్ని, సముద్ర జలాన్ని కల్లోలితం చేసి సముద్రాన్ని మింగి వేసినట్లుగా, మహాకాలుడు ఈ సృష్టిలోని సమస్త జీవజాతాన్నీ మింగివేస్తాడు. సర్వభక్షణశీలుడైన ఆ మహాకాలుని ( మృత్యు దేవుని) నోట పడకుండా తప్పించుకోజాలినదేదీ లేదు.

బలము, బుద్ధి, వైభవాదులు కారణంగా, ఎంతటి గొప్ప వారినైనా, దేవతల వంటి వారినైనా, ఈ సమస్త విశ్వాన్నీ మింగివేసే మహాబలశాలియైన మహాకాలుడు సమయం రాగానే క్షణం కూడా ఆలస్యం చేయకుండా మింగివేస్తాడు.

ఎంతటి అందమైనవి, పవిత్రమైనవి, మేరువు పర్వతం లాంటి గొప్పవి అయినప్పటికి, సర్పాలు గరుడుని చేత మింగబడినట్లుగా, ఏదో ఒక రోజున ఈ కాల దేవత చేత మింగబడాల్సిందే. ఈ జగత్తు అనే మహారణ్యంలో ఉండే సమస్త ప్రాణులూ దైన్యంతో అజ్ఞానంతో కూడిన ప్రాణులన్నీ ఈ మహాకాలునికి వేట పశువుల వంటివే! ఈ కాల దేవత పెద్ద పులిలాగా ఈ ప్రపంచం అనే అడవిలో ఉండే జీవరాసులను నాశనం చేస్తూ విహరిస్తూ ఉంటుంది. ఇది సాక్షాత్తు సమస్త మాతృకాగణాలతో కూడిన చండిక లాంటిది.

**అత్రైవ దుర్విలాసానాం చూడామణిరిహాపరః**
**కరాత్యత్తీతి లోకేస్మిన్ దైవం కాలశ్చకథ్యతే** 75

ఓ మునీశ్వరా! ఈ కాలుడు తన దుర్విలాసాలను ప్రకటించటంలో అందరినీ మించినవాడు. ఇతడే కృతాంతుడుగా ఉంటూ ప్రాణులకు వాటి వాటి పనులకు తగిన ఫలాన్ని యిస్తూ ఉంటాడు. ఇతనినే దైవం అనీ, కాలుడనీ అంటారు. ఈ సందర్భంలోనే కృతాంతుని వేరు వేరు రూపాలలో విపులంగా వర్ణించారు

**ఇతస్తతో దూరతరం విహృత్య ప్రవిశ్యగేహం దివసావసానే**
**వివేకి లోకాశ్రయ సాధువృత్తరిక్తోప్ని యాతే క ఉపైతి నిద్రామ్.** 76
**పుత్రాంశ్చ దారాశ్చ ధనం చ బుద్ధ్యా ప్రకల్ప్యతే తాత రసాయనాభమ్**
**సర్వంతు తన్నామ కరోత్యథాన్తే యన్నాతిరమ్యా విషమూర్ఛనైవ** 77

విద్రావితే శత్రుజనే సమగ్రే సమాగతాయా మభితశ్చ లక్ష్యామ్
సేవ్యన్త ఏతాని సుఖాని యావత్తావత్సమాయాతి కృతోపి మృత్యుః 78
ఇతోన్యతశ్చో పగతాస్తథైవ సమాన సంకేత నిబద్ధభావాః
యాత్రా సమాసంగ సమా నరాణాం కళత్ర మిత్ర వ్యవహార మాయాః
కల్పాభిధాన క్షణ జీవినో హి కల్పౌఘ సంఖ్యా కలనే విరంచ్యాః
అతః కలామాలిని కాలజాలే లఘుత్వ దీర్ఘత్వ ధియోవ్యసత్యాః 80
జనః కామాసక్తో వివిధ కుకలాచ్చేష్టనపరః
న తు స్వప్నేవ్యస్మిన్ జగతి సులభో నాద్య సుజనః 81
క్రియా దుఃఖాసంగా విధుర విధురా నూన మఖిలా
న జానే నేతవ్యా కథమివ దశా జీవిత మయీ. 82

అవివేకులైనవారు సాంసారిక కార్యకలాపాల్లో కాలాన్ని వ్యర్థం చేసి రాత్రంతా నిద్రించి జీవితాన్ని నిరుపయోగం చేస్తూ ఉండగా, ముముక్షువులు, వివేకవంతులైనవారు పగలంతా సత్పురుషసాంగత్యంలో తిరిగి, సత్కార్మలాచరించి సాయంకాలానికి ఇంటికి చేరి సుఖాన్ని పొందుతారు.

మానవుడు భ్రమ వల్ల పుత్రులు, భార్య , ధనం, మొదలైనవన్నీ సుఖాన్ని యిస్తాయని తలుస్తాడు. ఇవన్నీ సుఖ సాధనాలని భ్రమిస్తాడు. కాని ఇవి ఏవీ కూడా మరణ సమయంలో అక్కరకు వచ్చేవి కావు. అంత్య కాలంలో ఈ ధనాదికాలే ఈ భోగాలే విషం లాగా మూర్ఛితుల్ని చేస్తాయి. ఏ విధమైన సుఖాన్నీ ఇవ్వలేవు. దుఃఖదాయకాలే అవుతాయి.

మానవుడు, శత్రువులందరినీ జయించి, తనకు ఎదురైన వారినందరినీ, అడ్డుగా ఉండే వారి నందరినీ, తొలగించి, అన్ని విధాలైన సంపదలను ప్రోగుచేసుకొని, ఆ సంపద వల్ల లభించే విషయానందంలో నిమగ్నుడై, తన నిజ స్వరూపాన్ని గానీ, తన కర్తవ్యాన్ని గానీ గుర్తించకుండా విశృంఖలంగా తిరుగుతూ ఉండగానే మృత్యువు వచ్చి ఆతనిని కబళించివేస్తుంది.

తీర్థయాత్రలలో, తిరునాళ్ళలో కలసినట్లే, ఈ జీవితంలో భార్య, పుత్రులు, మిత్రులు, సోదరులు, బంధువులు కలుస్తున్నారు. నాలుగు రోజుల పాటు, అపరిచితులైనవారంతా యాత్రల్లో కలసి ఉండి వేరైపోయినట్లే పుత్రకళత్రాదు లంతా దూరమైపోతారు. ఎవరి త్రోవన వారు వెళ్ళిపోతారు. - ఇక మళ్ళీ ఒకరితో

ఒకరికి సంబంధం ఉండదు.

మనం కాలాన్ని క్షణాలు మొదలుకొని కల్పాల వరకు లెక్కిస్తాము. (బ్రహ్మయొక్క దీర్ఘకాలాన్ని కల్పమనీ, ఈ ప్రాపంచిక జీవుల కాలాన్ని క్షణ మని వ్యవహరిస్తాము) ఈ కాల గణనం కూడా అసత్యమే! కల్పాలనీ, క్షణాలనీ భేదవ్యవహారం మిథ్యే! కాలంలో మనం చూచే (లెక్కించే) లఘుత్వ దీర్ఘత్వాలు అసత్యాలే!

మానవుడు స్వప్నంలో అనేక సుఖదుఃఖాలను అనుభవిస్తున్నట్లే, ఈ అసత్యమైనట్టి, ఈ ప్రపంచంలో సైతం అనేక విషయాలకు లోనై కష్టసుఖాలు అనుభవిస్తున్నాడు. పైకి రమణీయంగా కనిపించే దాని పరిణామం ఎప్పుడూ భీషణంగానే ఉంటుంది. అందుకే వివేకవంతులు ఈ జగత్తుకు దూరంగానే ఉంటారు. ఇక్కడ కనిపించరు. వివేకహీనులు జగత్తు చేత ఆకర్షింపబడి దుఃఖ దావానలంతో దగ్ధమౌతుంటారు. వారికి వివేకోదయం కలగదు.

**దివసాస్తే మహాన్తస్తే సంపదస్తాః క్రియాశ్చ తాః**
**సర్వం స్మృతి పథం యాతం యామో వయమతః పరమ్** 84
**బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ సర్వా వా భూత జాతయః**
**నాశమేవానుధావన్తి సలిలానీవ బాడవమ్** 85
**ఆపదః క్షణమాయాన్తి సంపదః క్షణమేవ చ**
**క్షణం జన్మాథ మరణం మునే కిమివ న క్షణమ్** 86
**అశూరేణ హతః శూర ఏకేన బహవో హతః**
**ప్రాకృతాః ప్రభుతాం యాతాః సర్వమావర్త్యతే జగత్.** 87

ఈ మహావైభవంతో కూడినట్టి వారి రోజులు, వారి వారి సంపదలు, వారు చేసిన ఘనకార్యాలు అన్నీ మన కండ్ల ముందు నుండి దూరమై, స్మృతిపథంలోకి చేరిపోతాయి. మనమూ అట్లాగే మన సమస్త భౌతిక సంపదలు యిక్కడే వదలి ఎక్కడికో వెళ్ళిపోతాము.

జలమంతా పోయి బడబాగ్ని నోటిలో పడినట్లుగా బ్రహ్మ, విష్ణువు, శివుడు, సమస్త దేవతలు, భూత సమూహమంతా నాశనాన్నే పొందుతాయి. అంతా పోయి ఆ మృత్యు ముఖంలోనే పడుతారు.

ఒకప్పుడు ఆపదలు వస్తాయి. ఒకప్పుడు సంపదలు వస్తాయి. ఆ సంపదలు,

ఆపదలు కూడా క్షణికాలే! అట్లాగే ఒక క్షణం పుట్టుక, మరొక క్షణం మరణం చూస్తూనే ఉన్నాం. ఈ జగత్తులో అన్నీ క్షణికాలే!

ఒక పిరికి పంద ఒక మహాశూరుణ్ణి చంపటం ఈ జగత్తులో చూస్తున్నాం ఒకడు వంద మందిని చంపటం చూస్తున్నాం. ఒక సామాన్యుడు రాజు అవటం చూస్తున్నాం. ప్రపంచం స్థిరంగా ఉండేది కాదు. అది పరివర్తన శీలము - జగత్తులో అన్నీ మార్పు చెందేవే!

శ్రీరామ ఉవాచ -

ఇతి మే దోష దావాగ్ని దగ్ధే సపది చేతసి
ప్రస్ఫురన్తి నభోగాశ్చ మృగతృష్ణా సరః స్వివ 88
నాభి నన్దామి మరణం నాభి నందామి జీవితమ్
యథా తిష్ఠామి తిష్ఠామి తథైవ విగత జ్వరః 89
అథ చే త్త్వచ్ఛయా బుద్ధ్యా మునీంద్ర న చికిత్స్యతే
భూయశ్చిత్త చికిత్సా యాస్త త్కాలావసరః కుతః 90
విషం విషయ వైషమ్యం న విషం విషముచ్యతే
జన్మాన్తరఘ్నా విషయా ఏక దేహహరం విషం 91
న సుఖాని న దుఃఖాని న మిత్రాణి న బాంధవాః
న జీవితం న మరణం బన్ధాయ జ్ఞస్య చేతసః 92
ఆయుర్వాయు విఘట్టితా భ్రపటలీ లోలాంబు వద్భంగురం
భోగామేఘ వితాన మధ్య విలస త్సౌదామినీ చంచలాః 93
లోలో యౌవన లాలనా జలరయశ్చేత్యా కలయ్యాద్భుతం
ముద్రై వాద్య మయార్పితా నను దృఢాచిత్తే చిరం శాన్తయే 94

శ్రీరామచంద్రుడు వశిష్ఠునితో ఇంకా ఇట్లా అన్నాడు -

ఓ మునీంద్రా! జలాశయాలలో ఎండమావులు పుట్టినట్లుగా ఈ సాంసారిక దుఃఖాలను చూచి సంతప్తమైన నా చిత్తంలో విషయభోగాలను గూర్చిన కోరిక పుట్టటం లేదు. - ఈ శరీరము, విషయోపభోగాలు కూడా అసత్యములు, అనిత్యములు అనే విషయం నా చిత్తంలో దృఢంగా నాటుకొన్నది.

నేను మృత్యువును పొందాలనీ కోరను, ఈ జీవితమే కావాలనీ కోరను. చావు బ్రతుకులు రెండూ నాకు ఒకటే! ఎక్కువ కాలం జీవించి ఉండాలనీ లేదు.

చనిపోవాలనీ లేదు. ఇప్పుడు బాల్యావస్థలో ఏ బాధలూ లేకుండా ఉన్నట్లే ఉండగలను.

ఓ మునీంద్రా! మానవ జీవితానికి ఆరంభ దశలో వివేకంతో కూడిన బుద్ధి స్వచ్ఛంగా ఉన్నప్పుడే దాని ద్వారా (వివేక బుద్ధితో) చిత్తానికి తగిన చికిత్స చేయకపోతే (విషయ వాసనల నుండి దూరం చేసి పరమార్థం వైపుకు చిత్తాన్ని త్రిప్పకపోతే ) ఇక ఎన్నడూ చిత్త చికిత్స అనేది సంభవం కాదు, అందుకు అవకాశం లభించదు.

లోకంలో మనం విషం అనుకొనే వన్నీ నిజానికి విషాలు కావు. వాటిని సేవించినందు వల్ల ఆ సేవించిన శరీరం ఒక్కటే ఈ జన్మలో నశిస్తుంది. కాని, విషయవాసనలనే విషం జన్మ జన్మాంతరాలకు కారణమై కర్మ ఫలభోగాన్ని యిచ్చి, విభిన్న జన్మల్లోని శరీరాలన్నింటినీ నాశనం చేస్తుంది.

సుఖ దుఃఖాలు, చుట్టపక్కాలు, పెళ్ళాం పిల్లలు, ఇల్లు వాకిలి, చావు బ్రతుకులు ఇవన్నీ భవబంధనానికి కారణమైనప్పటికీ. జ్ఞానులైనవారిని ఇవి బంధించ లేవు- అజ్ఞానులను మాత్రమే ఇవి బంధించగలుగుతాయి.

ఈ ఆయువు అనేది మేఘం చివర నుండి జారి పడబోయే నీటి బిందువు లాంటిది. క్షణ భంగురమైనది. ఈ విషయోపభోగాలన్నీ మేఘ మధ్యంలో మెరిసే మెరుపు తీగలాంటివి - క్షణికాలు. యౌవనంలో ఉండే ఆకర్షణలు, మనో రంజనాలు మొదలైనవి కొండవాగుల్లోని నీరు లాంటి లేదా నీటి బుడగల వంటిది. ఈ సత్యాన్ని తెలుసుకొని మనస్సులో స్థిరంగా నిలుపుకోవటం వల్ల ప్రసన్న చిత్తంతో ప్రశాంతంగా ఉన్నాను. కాని ---

ఏవమభ్యుత్థితా నర్థ శత సంకట కోటరే
జగదాలోక్య నిర్మగ్నం మనోమనన కర్దమే 95
మనోమే భ్రమతీ వేదం సంభ్రమశ్చేవ జాయతే
గాత్రాణి వరికంపంతే వత్రాణేవ జరత్తరోః 96
నా వ్యక్తిలి ముపాయాతి న చ యాతి యథేప్సితమ్
బుద్ధి ర్జీవేశ్వరాయత్తా కాన్తేవ ప్రియసద్మని. 97
అతోతుచ్ఛ మనాయాస మనుపాధి గతభ్రమమ్
కిం తత్ స్థితి పదం సాధు యత్ర శంకా న విద్యతే 98

యధా జానాసి భగవన్ తథా మోహ నివృత్తయే
బ్రూహి మే సాధవో యేన నూనం విర్దుఃఖతాం గతాః 99
అథవా తాదృశీ యుక్తిర్యది బ్రహ్మన్న విద్యతే
న వక్తి మమ వా కశ్చిద్విద్య మానామపి స్ఫుటమ్ 100
స్వయం చైవ న చాప్నో తాం విశ్రాన్తి మనుత్తమాం
తదహం త్యక్త సందేహో నిరహంకారతాం గతః 101
న భోక్ష్యేన పిబామ్యంబు నాతః పరిదధేమ్బరమ్
కరోమి నాహం వ్యాపారం స్నానదానాశనాదికమ్ 102
న చ తిష్ఠామి కార్యేషు సంపత్స్వాపద్దశాసు చ
న కించ దభి వాంఛామి దేహత్యాగా దృతే మనే! 103

శ్రీరామచంద్రుడు ఇంకా యిట్లా అన్నాడు - మునీంద్రా! ఇట్టి వందలకొలది అనర్థాలతో కూడి ఉన్న ఈ సంసారం అనే అంధ కూపంలో పడి కొట్టుమిట్టాడే జీవుల్ని చూచి నా మనస్సు చింత అనే బురదలో దిగిపోతుంది.

అనేక భోగాలు అనుభవించటంలో నిమగ్నమై యున్న జీవులు కల్యాణ మార్గాన్ని కనుక్కోలేక బాధపడుతున్న జీవుల్ని చూచి నా మనస్సు జీర్ణవృక్షం మీది ఆకులాగా చలించిపోతోంది. ఈ చింత అనేది జీవుడనే భర్త అధీనంలో ఆతని యింటిలో ఉన్నప్పటికీ, శాంతిని పొందలేకపోతోంది. తన అభీష్టాన్నీ పొందలేక పోతోంది. కాబట్టి ఓ మహాత్మా! జన్మ మరణాలు లేనట్టి, శరీరాది ఉపాధులు లేనట్టి, భ్రమలు లేనట్టి, దుఃఖశోకాదులు లేనట్టి పరమపదాన్ని గూర్చి నాకు తెలియజేయండి.

ఓ మహాత్మా! ఈ సాంసారిక మహామోహం నుండి నివృత్తి కలిగేందుకు ఏదైనా ఒక మంచి సాధనాన్ని, ఉపాయాన్ని నాకు ఉపదేశించండి. ఏ ఉపాయం వల్ల మహాత్ములు దుఃఖరహితమైన స్థితిని పొందారో దానిని నాకు ఉపదేశించండి. ఇటువంటి ఉపాయం గనుక ఏదీ లేకపోతే, ఉన్నప్పటికీ అట్టి ఉపాయాన్ని నాకు తాము చెప్పకపోతే నాకిక శాంతి అనేది ఉండదు. ఇక నేను సమస్త కోరికలనూ త్యజించి నిరహంకార స్థితిని పొందవలసిందే!

నా మనస్సుకు ఏ విధంగానూ శాంతి లభించకపోతే నిజంగానే అన్నపానాదుల్ని, వస్త్రాద్యలంకారాల్ని, స్నానదానాది కర్మల్ని, సమస్తమూ వదలివేస్తాను. సంపద్విపత్తులను లెక్కించను. దేనిని కోరను. దేనిని చేయను. దేహత్యాగం తప్ప

నేను కోరేది ఏదీ ఉండదు.

ఇత్యుక్త వానమల శీతకరాభిరామో
రామో మహత్తర వివేక వికాశిచేతాః
తూష్ణీం బభూవ పురతో మహతాం ఘనానాం
కేకారవ శ్రమవశాదివ నీలకంఠః 104

(వాల్మీకి భరద్వాజునితో అంటున్నాడు) ఓ భరద్వాజా! మేఘాన్ని చూచి, అరచి అలసిపోయి మిన్నకుండిన నెమలి లాగా చంద్రుని లాంటి నిర్మలమైన సౌందర్యంతో కూడిన రాముడు వశిష్ఠ మహామునితో యిట్లా చెప్పి మిన్నకున్నాడు.

## మూడవ సర్గ

వాల్మీకి రువాచ -
వదత్యేవం మహామోహా వినివృత్తి కరం వచః
రామే రాజీవ పత్రాక్షే తస్మిన్ రాజ కుమారకే. 1
సర్వే బభూవుస్తత్రస్థా విస్మయో త్ఫుల్లలోచనాః
భిన్నాంబరా దేహరుహైర్గిరః శ్రోతు మివోద్ధురైః 2
అథ తూష్ణీం స్థితవతి రామే రాజీవలోచనే
తస్మిన్ రఘు కులాకాశ శశాంకే శశిసుందరే 3
సాధువాదగిరా సార్థం సిద్ధ సంఘసమీరితా
వితానక సమా ద్వ్యోమ్నః పౌష్పవృష్టిః సపాతహ 4
ఆ కల్పం సిద్ధసేనాసు భ్రమద్భిరభితో దివమ్
అపూర్వ మిదమస్మాభిః శ్రుతం శ్రుతి రసాయనమ్ 5
ఉపశమామృత సుందర మాదరా దధిగతోత్తమతాపద మేషయత్
కథితవా నుచితం రఘునందనః స పది తేన వయం ప్రతిబోధితాః 6

వాల్మీకి ఇట్లా అన్నాడు - పద్మదళాయతాక్షుడైన శ్రీరామచంద్రుని నోట మహా మోహనివారకమైన ఇట్టి మాటలు విన్న మీదట రాజసభలోని వారంతా ఆశ్చర్యంతో కన్నులు పెద్దవి చేసి, పులకితగాత్రులైనారు. శ్రీరాముని మాటలు విని వారంతా తమ జడత్వాన్ని వదలివేశారు.

రఘువంశాకాశంలో చంద్రుని వంటి వాడైనట్టి, పరమసుందరుడైనట్టి శ్రీరాముడట్లా చెప్పి ఊరకున్న మీదట బాగు బాగు అనే సాధు వాదాల పరమ

గంభీర ధ్వనితో సభ అంతా మారుమ్రోగింది. సిద్ధులు పూల వాన కురిపించగా ఆ పూలు అన్నీ వితానకం లాగా కన్పట్టినాయి.

సృష్ట్యాది నుండీ ఈ నాటి వరకూ సిద్ధపురుషసంఘంతో ఉంటూ స్వర్గంలోని మహాభోగాలు అనుభవిస్తూ తిరుగుతున్నా, అమృత తుల్యములై, కర్ణరసాయనాలైన ఇటువంటి మాటలను మనం వినలేదు. ఈ నాడు వేదాలకు సారభూతములైన వాక్యాలను విన్నాము.

శ్రీరాముడిప్పుడు చెప్పిన మాటలు శాంతితో కూడినవై, అమృత తుల్యములైనవి. మిక్కిలి శ్రేష్ఠములైనవి. సర్వోత్తమములైనవి. ఈ మాటల వల్ల మనకు జ్ఞానోదయమైనది. నిజంగానే ఈ స్వర్గ భోగాలన్నీ నిస్సారములైనవి అని సభలోని వారు అనుకున్నారు.

భరద్వాజ ఉవాచ -

**పావన స్యాథ వచసః ప్రోక్తస్య రఘుకేతునా**
**న్నిర్ణయం శ్రోతు మిచ్ఛామి వక్ష్యమాణం మహాత్మభిః** 7

''రఘుకుల తిలకుడైన శ్రీరామచంద్రుడు పలికిన మాటలు, ఆతని ప్రశ్నలకు సమాధానంగా మహాత్ములైన మహర్షి గణమంతా నిర్ణయాత్మకమైన ఏ సమాధానం ఇస్తుందో దానిని మేము వినాలనుకుంటున్నాము '' అని అన్నాడు భరద్వాజుడు.

వాల్మీకి రువాచ -

**ఇత్యుక్త్వా సా సముస్థైవ వ్యోమావాసనివాసినీ**
**తాం పపాత సభాం తత్ర దివ్యా ముని పరంపరా.** 8
**వసిష్ఠ విశ్వామిత్రౌ తాన్పూరజా మాసతుః క్షణాత్**
**వసిష్ఠ విశ్వామిత్రౌ తే పూజయామా సురాదరాత్.** 9
**సర్వాదరేణ సిద్ధౌ ఘాన్పూజయామాస భూపతిః**
**సిద్ధౌఘా భూపతిం చైవ కుశలప్రశ్న వార్తయా** 10

వాల్మీకి ఈ విధంగా చెప్పాడు -

ఓ భరద్వాజా! సిద్ధులిట్లా సాధువాదాలు చేసిన పిమ్మట విమానాల్లో ఉండిన దేవర్షులంతా రాజసభలోకి దిగివచ్చారు. అట్లా వచ్చిన వారినందరినీ వసిష్ఠ, విశ్వామిత్రులు ఆదరంతో పూజించారు. దశరథ మహారాజు కూడా వచ్చిన

దేవర్షులందరినీ అర్ఘ్యపాద్యాదులతో, మృదుమధుర వచనాలతో పూజించాడు. ఆ ఋషులు సైతం దశరథుని ఆదరించి సత్కరించారు.

మునయ ఊచుః -

**అహో బత కుమారేణ కల్యాణ గుణ శాలినీ**
**వాగుక్తా పరమోదారా వైరాగ్య రసగర్భిణీ** 11
**ఇతి నాదేన మహతా వచస్యుక్తే సమాగతైః**
**రామమగ్రగతం ప్రీత్యా విశ్వామిత్రోభ్యభాషత** 12

మునీశ్వరులన్నారు - 'ఓహో! శ్రీరామచంద్రుడు కల్యాణ గుణ పరిపూర్ణమైనట్టి, వైరాగ్య రస నిర్భరమైనట్టి ఎంత చక్కటి మాటలు పలికాడు!' అని. ఆ సమయంలోనే ప్రేమతో విశ్వామిత్రుడు ఇట్లా అన్నాడు - అని వాల్మీకి మహర్షి మళ్ళీ అంటున్నాడు -

ఓ భరద్వాజా! ఆ రాజసభలో దేవర్షులు, సిద్ధ సమూహము శ్రీరామచంద్రుని తాత్త్వికజ్ఞానంతో నిండిన మాటలను విని ప్రశంసించి, అభినందించగా, విశ్వామిత్రుడిట్లా అన్నాడు -

**న రాఘవ తవాస్త్యన్య జ్ఞేయం జ్ఞాన వతాం వర**
**స్వయైవ సూక్ష్మయా బుద్ధ్యా సర్వం విజ్ఞాత వానసి.** 13
**భగవన్ వ్యాస పుత్రస్య శుక స్యేవ మతిస్తవ**
**విశ్రాన్తి మాత్రమేవాంతర్జ్ఞాతజ్ఞేయే వ్యపేక్షతే** 14
**శ్రీరామ ఉవాచ -**

**భగవన్ వ్యాస పుత్రస్య శుకస్య భగవన్ కథమ్**
**జ్ఞేయే ప్యాదౌన విశ్రాన్తం చ ధియా పునః** 15

జ్ఞానులలో శ్రేష్ఠుడవైన రాఘవా! ఇక నీవు తెలుసుకో దగిన దేదీ లేదు. నీవు నీ సూక్ష్మ బుద్ధితో సమస్తాన్నీ తెలుసుకొన్నావు.

ఓ రామా! నీ బుద్ధి వ్యాస భగవానుని కుమారుడైన శుకుని బుద్ధి లాంటిది. సమస్త వస్తువులను గూర్చిన సంపూర్ణ జ్ఞానం నీకు లభించింది.

ఇది విన్న రాముడిట్లా అన్నాడు - 'ఓ భగవానుడా! వ్యాస భగవానుని కుమారునికి తెలుసుకోదగిన ఏ విషయాల వల్ల మనస్సుకు శాంతి లేకుండా పోయింది? ఏ విధమైన గురూపదేశం వల్ల ఆ పిమ్మట శాంతి లభించిందో నాకు చెప్పండి.

విశ్వామిత్ర ఉవాచ -

ఆత్మో దంత సమం రామ కథ్యమాన మిదం మయా
శ్రుణు వ్యాసాత్మజోద్దుతం జన్మనా మన్తకారణం 16
తస్య చిన్తయతో లోకయాత్రా మేవ మిమాం హృది
తమేవ కిల సద్బుద్ధే ర్వివేక ఉదభూదయమ్. 17
తేనా సౌ స్వవివేకేన స్వయమేవ మహామనాః
విచార్య సుచిరం చారుం యత్సత్యం దతవాప్తవాన్ 18
స్వయం ప్రాప్తే పరే వస్తున్య విశ్రాన్తమనాః స్థితః
ఇదం వస్త్వితి విశ్వాసం నాసా వాత్మన్యుపాయయౌ 19
కేవలం విర రామాస్య చేతో విగత చాపలం
భోగేభ్యో భూరిభంగేభ్యో ధరాభ్య ఇవ చాతకః 20

విశ్వామిత్రుడిట్లా అన్నాడు -

ఓ రామా! నీ వృత్తాంతం లాంటిదే అయినట్టి వ్యాసపుత్రుడైన శుకుని వృత్తాంతం చెపుతున్నాను విను. ఈ శుకుని వృత్తాంతం విన్నవారికి జన్మమరణ రూపమైన సంసారం ఉండదు. మోక్షం లభిస్తుంది. ఆ శుకదేవుడొకప్పుడు నీలాగానే తన మనస్సులో మానవ జీవితాన్ని గురించి, సంసార యాత్రను గురించి ఆలోచిస్తూ ఉండగా అతనికి వివేకోదయం అయినది.

ఆ శుక మహర్షి తనలోనే పుట్టినట్టి వివేకంతో, తనలో తానే చాలాకాలం ఆలోచించి ఆలోచించి పరమార్థాన్ని, - సత్యస్వరూపాన్ని దర్శించాడు. అట్లా పరమార్థాన్ని - సత్యస్వరూపాన్ని పొందిన మీదట అతని హృదయంలోనే సచ్చిదానంద స్వరూపం - పరబ్రహ్మ మనే పరమార్థతత్త్వం ఉన్నదని గ్రహించాడు. ఆ విధంగా పరమసత్యవస్తు వేదో తెలిసినప్పటికీ అదే పరబ్రహ్మ స్వరూపమనే దృఢమైన విశ్వాసం కలగనందున అతని మనస్సుకు శాంతి లభించలేదు.

అతనికి కలిగిన వివేకం వల్ల జరిగిన ప్రయోజనమల్లా వర్షధారల యెడల తప్ప ఇతర జలాల యెడల ఆకర్షితం కాని చాతకపక్షిలాగా, అతడు కూడా ఈ సాంసారిక సుఖభోగాల యెడ విరక్తుడవటం, చిత్తచాంచల్యం దూరమవటం, అనేదే!

ఏ కదా సోమల ప్రశ్నో మేరా వేకాన్త మాస్థితమ్
పప్రచ్ఛ పితరం భక్త్యా కృష్ణ ద్వైపాయనం మునిమ్ 21

సంసారాడంబర మిదం కథమభ్యుత్థితం మునే
కథం చ ప్రశమం యాతి కియత్కాస్య కదేతి చ. 22
ఇతి పృష్టేన మునినా వ్యాసే నాఖిల మాత్మజే
యథా వదమలం ప్రోక్తం వక్తవ్యం విదితాత్మనా 23
ఆ జ్ఞాసిషం పూర్వ మేతదహ మిత్యథ తత్పితుః
స శుకః శుభయా బుద్ధ్యా న వాక్యం బహ్వామన్యత. 24
వ్యాసోపి భగవాన్ జ్ఞాత్వా పుత్రాభిపాయ మీదృశమ్
ప్రత్యువాచ పునః పుత్రం నా హం జానామి తత్త్వతః 25
జనకో నామ భూపాలో విద్యతే వసుధాతలే
యథా వద్వేత్త్యసౌ వేద్యం తస్మాత్సర్వ మవాప్స్యసి 26

ఒకప్పుడు విమల బుద్ధి సంపన్నుడైన శుకుడు, మేరువు పర్వతం మీద ఏకాంత స్థలంలో ఉన్న కృష్ణ ద్వైపాయనుని భక్తి భావంతో ఇట్లా అడిగాడు - '' మహాత్మా! ఈ సంసారం అనే ఆడంబరం ఏట్లా ఉత్పన్నమైంది? దీని విస్తార మెంత? ఇది ఎంత కాలం పాటు ఉంటుంది? '' అని.

తన పుత్రుడీ విధంగా అడుగగా, ఆత్మ జ్ఞాన సంపన్నుడైన వ్యాసమహర్షి, తాను చెప్పదగిన విషయమంతా విపులంగా స్పష్టంగా శుకునికి తెలియజేశాడు.

తండ్రి ద్వారా లభించిన ఉపదేశాన్ని విన్న మీదట శుకుడు, ఈ విషయాలన్నీ తనంతట తాను ఇది వరకే తెలుసుకొని ఉన్నవాడు కాబట్టి, తండ్రి చెప్పిన దానిని ఎక్కువగా సమాదరించలేదు. వ్యాసుడు కూడా తన కుమారుని వైఖరిని గమనించి శుకునితో ఇట్లా అన్నాడు - ''నాయనా! యదార్థానికి, తత్త్వతః ఈ గహనమైన విషయాన్ని నేనూ ఎరుగను - నాకూ తెలియదు. ఈ భూమండలంలో జనకుడనే రాజు ఉన్నాడు. ఈ విషయం యొక్క తత్త్వమంతా అతనికి తెలుసు. నీవు ఆయన వద్దకేగి సంపూర్ణమైన తత్త్వ జ్ఞానాన్ని పొందు '' అని.

పిత్రేత్యుక్తః శుకః ప్రాయాత్సుమేరోర్వ సుధాతలమ్
విదేహనగరీం ప్రాప జనకే నాభిపాలితాం 27
ఆవేదితోసౌ యాష్టీకైర్జన కాయ మహాత్మనే
ద్వార వ్యాసుతో రాజన్ శుకోత్ర స్థితవానితి 28
జిజ్ఞాసార్థం శుకస్యాసా వాస్తామేవేత్య వజ్ఞయా
ఉక్త్వాబభూవ జనకస్తూష్ణీం సప్తదినా న్యథ 29

తతః ప్రవేశయా మాస జనకః శుకమంగణమ్
తత్రాహాని స సప్తైవ తథైవాస స ఉన్మనాః 30
తతః ప్రవేశయా మాస జనకోన్తః పురం శుకమ్
రాజాన దృశ్యతే తావదితి సప్తదినాని తమ్ 31
తత్రోన్మదాభిః కాన్తాభిః భోజనై ర్భోగ సంచయైః
జనకో లాలయామాస శుకం శశిభాననమ్. 32

తండ్రి ఈ విధంగా చెప్పిన మీదట, శుకుడు మేరువు పర్వతం దిగి భూ మండలానికి వచ్చి జనకుడు పరిపాలిస్తూ ఉండే విదేహ నగరాన్ని చేరాడు. అచట ద్వారపాలకులు జనకుని వద్ద కేగి శుకుడు వచ్చినట్లుగా విన్నవించారు. ''సరే! అతనిని అక్కడ అట్లాగే ఉండనివ్వండి '' అని జనకుడు ఏడు రోజుల పాటు మిన్నకున్నాడు. ఏడు రోజుల తరువాత జనకుడు శుకుణ్ణి రాజప్రాసాదానికి ముందున్న దొడ్లోకి పిలిపించాడు. అక్కడికి వచ్చిన పిమ్మట కూడా ఏడు రోజుల పాటు అతని విషయం పట్టించుకోలేదు. పిమ్మట జనక మహారాజు శుకుణ్ణి అంతఃపురంలోనికి రప్పించాడు. అప్పుడు కూడా ఏడు రోజుల పాటు ఆతనిని కలుసుకోలేదు. ఆ అంతఃపురంలో యౌవనమదవతులైన సుందరీ మణులు అనేక మంది ద్వారా, చంద్రుని వలె సుందరుడైన శుకునికి వివిధ భోగ సామాగ్రితో ఉపచారాలకు ఏర్పాట్లు చేయించాడు.

తే భోగాస్తాని దుఃఖాని వ్యాసపుత్రస్య తన్మనః
నా జహ్రుర్మంద పవనో బద్ధపీఠ మివాచలమ్ 33
కేవలం సుమనాః స్వచ్ఛో మౌనీ ముదిత మానసః
సంపూర్ణ ఇవ శీతాంశు రతిష్ఠ దమలః శుకః 34
పరిజ్ఞాత స్వభావం తం శుకం స జనకో నృపః
ఆనీయ ముదితాత్మాన మవలోక్య ననామహ 35
నిఃశేషిత జగత్కార్య ప్రాప్తాఖిల మనోరథ
కిమీహితం తవేత్యాశు కృతస్వాగత మహతమ్. 36
శుక ఉవాచ –
సంసారాడంబర మిదం కథమభ్యుత్థితం గురో
కథం ప్రశమ మాయాతి యథావ కథ యాశుమే 37

విశ్వామిత్ర ఉవాచ -

**జనకే నేతి పృష్టేన శుకస్య కథితం తదా**
**తదేవ యత్పురా ప్రోక్తం తస్యపిత్రా మహాత్మనా. 38**

బలమైన సుదృఢమైన మూలం కలిగిన వృక్షం మందపవనానికి చలించనట్లుగా ఆ అనేక రకాల భోగాలు గాని, ఆ మర్యాదలు గాని, జనకుడు చూపిన ఆ అనాదరం గానీ, శుకుని మనస్సును కదలించలేక పోయాయి - అతనిలో ఏవిధమైన వికృతీ కలగలేదు.

శుకుడు రాజాంతఃపురంలో పూర్ణచంద్రుని లాగా వికారరహితుడై, హర్ష విషాదాలు ఏవీ లేనివాడై, ఆదరము అనాదరము అన్నిటి యెడల సమభావంతో మౌనంగా ప్రసన్నంగా ఉన్నాడు.

జనక మహారాజు ఈ విధంగా శుకుణ్ణి పరీక్షించి ఆతని స్వభావాన్ని తెలుసుకున్నాడు. ఆదరంతో తన వద్దకు పిలిపించుకొన్నాడు. సంతోషంతో ఆతనికి నమస్కరించాడు. ఇట్లా అన్నాడు -

ఓ మహనీయుడా! పరమ పురుషార్థ సిద్ధి కోసం ఈ లోకంలో నిర్వర్తించ వలసిన కర్తవ్యాలను పూర్తిగా నిర్వహించావు. పరిపూర్ణ మనోరథుడవైనావు. కృతకృత్యుడవు అయినావు. ఇక నీకు కావలసిన దేమిటి? '' అని

శుకుడు ఈ విధంగా అన్నాడు - '' ఓ మహారాజా! ఈ జగదాడంబరం అంతా ఎట్లా పుట్టింది? దీని వినాశనం ఏ విధంగా జరుగుతుంది? అనే ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవటానికే ఇచటికి వచ్చాను. చెప్పండి '' అని.

విశ్వామిత్రుడింకా ఇట్లా అన్నాడు - శుకుడు ఈ విధంగా అడిగిన పిమ్మట, వ్యాస మహర్షి ముందుగా శుకునికి ఏ విధమైన సమాధానం ఇచ్చాడో అటువంటి సమాధానమే జనకుడు ఇచ్చాడు.

శుక ఉవాచ -

స్వయమేవ మయా పూర్వమేతద్ జ్ఞాతం వివేకతః
ఏతదేవ చ పృష్టేన పిత్రా మే సముదాహృతమ్ 39
భవతాప్యేష ఏవార్థః కథితో వాగ్విదాం వర
ఏష ఏవ చ వాక్యార్థః శాస్త్రేషు పరిదృశ్యతే 40

**యథాయం స్వవికల్పోత్థః స్వవికల్ప పరిక్షయాత్**
**క్షీయతే దగ్ధ సంసారో నిఃసార ఇతి నిశ్చయః 41**
**తత్కిమేత న్మహా బాహో సత్యం బ్రూహి మమాచలమ్**
**త్వత్తో విశ్రామ మాప్నోతి చేతసా భ్రమతా జగత్. 42**

శుకుడు ఇట్లా అన్నాడు - '' ఓ రాజా నేను నా వివేకంతోనే ఈ విషయాన్ని తెలుసుకున్నాను. అయినటికీ, నా తండ్రిని ఈ విషయాన్ని గూర్చి అడిగాను. ఆయన కూడా వాగ్విదులైన తాము చెప్పినట్లే చెప్పారు. ఈ విషయమే శాస్త్రాల్లోని మహావాక్యాలు సైతం చెపుతున్నాయి. - ఈ నశ్వర స్వభావం కలిగిన సంసారం తన సంకల్పంతోనే ఉత్పన్న మౌతోంది. తన సంకల్పంతోనే వినాశనాన్ని పొందుతోంది. కాబట్టి ఇది (ఈ సంసారం) నిస్సారమైనది. ఓ మహావీరుడా! ఇది యదార్థమేనా? ఇది నిజమే గనుక అయితే నా చిత్తానికి పరమ శాంతి లభించే విధంగా నా భ్రమలు, అనుమానాలు నివృత్తమయ్యే విధంగా నాకు ఉపదేశం చేయండి '' అని.

జనక ఉవాచ -

**నాతః పరతరః కశ్చిన్నిశ్చయోస్త్యపరో మునే**
**స్వయమేవ త్వయాజ్ఞాతం గురుతశ్చ పునః శ్రుతమ్ 43**
**అవ్యుచ్ఛిన్న చిదాత్మైకః పుమానస్తీహ నేతరత్**
**స్వ సంకల్ప వశాద్బద్ధో నిః సంకల్పశ్చ ముచ్యతే 44**
**తేనత్వయా స్ఫుటం జ్ఞాతం జ్ఞేయం యస్య మహాత్మనః**
**భోగేభ్యో హ్యరతిర్జాతా దృశ్యాద్వా సకలాదిహ 45**
**ప్రాప్తం ప్రాప్తవ్య మఖిలం భవతా పూర్ణ చేతసా**
**న దృశ్యే పతసి బ్రహ్మన్ముక్తస్త్వం భ్రాన్తి ముత్సృజ 46**

జనక మహారాజు ఇట్లా అన్నాడు - ఈ బ్రహ్మాండం అంతటా అఖండము, చిన్మయము అయిన పరతత్త్వం కంటె వేరేమీ లేదనే విషయం నీకూ తెలుసు. ఈ తత్త్వాన్ని నీ వివేకంతో నీవు తెలుసుకొన్నావు. ఓ మునీంద్రా! ఈ తత్త్వాన్ని గూర్చే నీ తండ్రి ద్వారా గురూపదేశం లాగా విన్నావు. ఇంతకు మించి నట్టి, తెలుసుకొనదగినట్టి వేరొక తత్త్వం ఏదీ లేదు. ఈ ప్రాణి తన సంకల్పాలకు వశమై బంధింపబడుతోంది. ఆ సంకల్పాలను వదిలివేసినందున ముక్తమౌతోంది.

ఓ మహాత్మా! తెలుసుకోదగిన వస్తువేదో దానిని నీవు పూర్తిగా తెలుసుకున్నావు నీవు పూర్ణకాముడవైనావు. బాహ్య విషయాల వైపుకు నీ దృష్టి పోవటం లేదు.

సంకల్ప రహితుడవైనావు. భోగరక్తి లేదు కాబట్టి నీవు పూర్తిగా ముక్తుడవైనావు. ఇక ఈ దృశ్య ప్రపంచంతో సంబంధం లేదు. నీకేదైనా భ్రాంతి అనేది ఉంటే వదలివేయుము.

**అనుశిష్టః స ఇత్యేవం జనకేన మహాత్మనా**
**అతిష్ఠత్స శుకస్తూష్ణీం స్వస్థే పరమవస్తుని** **47**
**వీతశోక భయాయాసో నిరీహచ్ఛిన్న సంశయః**
**జగామ శిఖరం మేరోః సమాధ్యర్థ మనిన్దితమ్** **48**
**తత్రవర్ష సహస్రాణి నిర్వికల్ప సమాధినా**
**దశస్థిత్వా శశామాసావాత్మన్య స్నేహదీపవత్** **49**
**వ్యపగత కలనా కలంక శుద్ధః స్వయమమలాత్మని పావనే పదేసౌ**
**సలిలకణ ఇవాంబుధౌ మహాత్మా విగలిత వాసన మేకతాం జగామ.** **50**

విశ్వామిత్రుడు శ్రీరామునితో ఇంకా యిట్లా చెపుతున్నాడు -

ఓ శ్రీరామచంద్రా! మహాత్ముడైన జనకుని వల్ల ఈ సదుపదేశాన్ని పొందిన శుకుడు పరమాత్మను గూర్చిన ధ్యానంలో నిమగ్నుడైనాడు. ఆతని శోక ,భయ శ్రమాదులుతొలగిపోయాయి. నిరీహుడు సంశయరహితుడు అయినాడు. మేరు పర్వత శిఖరాన సమాధిస్థితుడు కావటానికై వెళ్ళాడు. అక్కడ వేయి సంవత్సరాల పాటు నిర్వికల్ప సమాధిలో నిమగ్నుడై, నూనె అయిపోగా క్షీణించిపోయే దీపకళికలాగా ప్రారబ్ధక్షయం కాగానే పరబ్రహ్మలో లీనమైనాడు.

ఈ దృశ్య జగత్తునందలి విషయాల యెడల ఆసక్తి కలగటం వల్ల ఉత్పన్నమైన అజ్ఞానం తొలగిపోగానే, సంచిత పుణ్యాపాపాలన్నీ నశించిపోగానే, దేహాదులందలి భ్రాంతి దూరమైపోగా, నల్లని మేఘం నుండి జారిపడి సముద్రంలో కలసిపోయే నీటి బిందువులాగా తత్సమానుడు ( పరబ్రహ్మతో సమానుడు) అవుతున్నాడు. అట్లాగే వాసనలు తొలగిపోయిన శుకమహర్షి యొక్క ఆత్మ పరమాత్మలో ఏకీభావాన్ని చెందినది.

విశ్వామిత్ర ఉవాచ -

**తస్య వ్యాస తనూజస్య మలమాత్రాప మార్జనమ్**
**యథో పయుక్తం తే రామ తావదేవోప యుజ్యతే** **51**

జ్ఞాత జ్ఞేయస్య మనసో నూనమేత ద్విలక్షణమ్
న స్వాదన్తే సమగ్రాణి భోగవృన్దాని యత్నుతః 52
భోగ భావనయా యాతి బన్ధో దార్ఢ్యమనుత్తుజః
తయోపశాన్తయా యాతి బన్ధో జగతి తానవమ్. 53
వాసనా తానవం రామ మోక్ష ఇత్యుచ్యతే బుధైః
పదార్థ వాసనాదార్ఢ్యం బన్ధ ఇత్యభిధీయతే. 54

విశ్వామిత్రుడింకా ఇట్లా అన్నాడు - ఓ రామా! వ్యాస పుత్రుడైన శుకదేవుడు ఉపదేశం ద్వారా పాపాలను, అజ్ఞానాన్ని పోగొట్టుకొని నిర్మలుడైనట్లుగా నీవు కూడా కావాలి.

ఈ విషయాన్నే సమర్ధించటం కోసం సభలోని మునీశ్వరులను సంబోధించి విశ్వామిత్రుడిట్లా అంటున్నాడు - ఓ మునులారా! శ్రీరామచంద్రుడు తెలుసుకోదగిన వస్తువును తెలుసుకున్నాడు. అతనికి జ్ఞానం కలిగినందు వల్లనే ఈ సాంసారిక భోగాలు రోగాలుగా కనిపిస్తున్నాయి. జ్ఞానవంతుని మానసిక స్థితి ఇట్లాగే ఉంటుంది. జ్ఞేయ వస్తువును గూర్చిన జ్ఞానం కలిగినంతనే సాంసారిక భోగాల యెడ ఆసక్తి తగ్గి, సాంసారిక బంధనాలు సైతం తొలగిపోతాయి.

ఓ రామా! ఈ భోగాలను అనుభవించాలనే వాసనాక్షయం కావటాన్నే పండితులు మోక్షం అంటారు. సాంసారిక విషయాల యెడల దృఢమై ఉండే వాసననే భవబంధనం అంటారు.

యశః ప్రభృతినా యస్మై హేతునైవ వినా పునః
భోగా ఇహ న రోచన్తే స జీవన్ముక్త ఉచ్యతే 55
రామో యదేతజ్జానాతి వస్తుస్తీత్యేవ సమ్ముఖాత్
ఆశ్చర్యచిత్త విశ్రాన్తి మాప్నోత్యేవ మునీశ్వరాః 56
అత్రాస్య చిత్త విశ్రాన్త్యై రాఘవస్య మహాత్మనః
యుక్తిం కథయతు శ్రీమాన్ వసిష్ఠో భగవానయమ్ 57
రఘూణామేష సర్వేషాం ప్రభుః కులగురుః సదా
సర్వజ్ఞః సర్వసాక్షీవ త్రికాలామల దర్శనః 58

రాగ ద్వేషాదులు లేని దృష్టి అలవడటం వల్ల, కీర్తి మొదలైన కారణాలు సైతం ఏవీ లేకుండానే, ఎవనికి సాంసారిక భోగాలు రుచించవో అట్టివాడే జీవన్ముక్తుడు.

కాబట్టి ఓ మునీశ్వరులారా! రఘుకులతిలకుడైన ఈ రాముడు జీవన్ముక్తుడని గ్రహించండి. ఎందుచేతనంటే అతడు పరిపూర్ణమైన తత్త్వజ్ఞానాన్ని పొందాడు. సాంసారిక భోగాలు ఆతనికి ఆనందాన్ని ఇవ్వటం లేదు.

కాబట్టే, మహాత్ముడైన శ్రీరాముని చిత్తానికి విశ్రాంతి కలగటం కోసం పూజ్యపాదుడైన వసిష్ఠులవారుసముచితమైన ఉపాయాన్ని ప్రతిపాదించాలి.

ఆయన (వసిష్ఠుడు) రఘువంశీయులందరికీ కాకుండా ఇక్ష్వాకు వంశంవారందరికీ ప్రభువు లాంటివాడు, శాసకుడు, కులగురువు. ఆయన సర్వజ్ఞుడు, సర్వసాక్షి, త్రికాలవేది.

వసిష్ఠ భగవన్పూర్వం కచ్చిత్ స్మరసి యత్త్వయమ్
ఆవయోర్వైర శాన్త్యర్థం శ్రేయోసే చ మహాధియా 59
ఉపదిష్టం భగవతా జ్ఞానం పద్మభువా ముహుః
తదేవో పదిశాద్య త్వం రామాయాస్తే నివాసినే 60
తద్జ్ఞానం చ స శాస్త్రార్థ స్తద్వైదగ్ధ్య మఖండితమ్
సుశిష్యాయ విరక్తాయ సాధో యదుపదిశ్యతే 61
అశిష్యాయా విరక్తాయ యత్కించిదుప దిశ్యతే
తత్ప్రయాత్య పవిత్రత్వం గోక్షీరం శ్వదృతావివ 62
ఇత్యుక్తే గాధిపుత్రేణ వ్యాస నారద పూర్వకాః
మునయస్తే తమేవార్థం సాధు సాధ్విత్య పూజయన్ 63
అథోవాచ మహాతేజా రాజ్ఞః పార్శ్వే వ్యవస్థితః
బ్రహ్మేన బ్రహ్మణః పుత్రో వసిష్ఠో భగవాన్మునిః 64
మునే యదాదిశసి మే తదవిఘ్నం కరోమ్యహం
కః సమర్థః సమర్థోపి సతాం లంఘయితుం వచః 65
స్మరామ్యఖండితం సర్వం సంసార భ్రమ శాంతయే
నిషధాద్రౌ పురాప్రోక్తం యద్ జ్ఞానం పద్మయోనినా 66
వాల్మీకి రువాచ -
ఇతి నిగదిత వానసౌ మహాత్మా పరికర బంధ గృహీత వక్త్రతేజాః
అ కథయ దిదమజ్ఞతో పశాన్త్యై పరమ పదైక విబోధనం వసిష్ఠః 67

(సంపూర్ణ మిదం వైరాగ్య ప్రకరణమ్)

విశ్వామిత్రుడింకా ఇట్లా అన్నాడు -

ఓ వసిష్ఠ భగవానుడా! నీకు పూర్వం జరిగిన విషయాలు జ్ఞాపకం ఉన్నాయా? మన యిరువురి వైరాన్ని శాంతింప చేయటానికై బ్రహ్మదేవుడు చేసిన జ్ఞానోపదేశం గుర్తు ఉన్నది గదా! ఆ జ్ఞానాన్ని యుక్తి యుక్తంగా మీ శిష్యుడైన శ్రీరామునికీనాడు ఉపదేశించండి.

శ్రీరాముడు మంచి శిష్యుడు, విరక్తుడు, పాపరహితుడు, మంచి అధికారి కాబట్టి మీరు నిరాయాసంగా ఉపదేశించవచ్చు. అవిధేయునికి, వైరాగ్యం లేనివానికి, శిష్య భావం లేనట్టి వానికి, అనధికారికి చేసే ఉపదేశం కుక్కతోలుతో చేసిన తిత్తిలో పోసిన ఆవు పాలలాగా అపవిత్రమౌతుంది.

గాధి నందనుడై న విశ్వామిత్రుని మాటలు విని వ్యాసుడు, నారదుడు మొదలైన మునులంతా 'బాగు బాగు' అని ప్రశంసించారు. పిమ్మట దశరథ మహారాజు సమీపంలో విరాజిల్లుతున్నట్టి, మహాతేజస్వియైనట్టి, బ్రహ్మకు ఆత్మజుడైనట్టి వసిష్ఠుడు ఇట్లా అన్నాడు -

''ఓ మునీంద్రా! మీరు నన్ను చేయమని ఆదేశించిన పనిని నిర్విఘ్నంగా కొనసాగించటానికై ఇప్పుడే ఆరంభిస్తున్నాను. శక్తి ఉండీ కూడా, సత్పురుషులిచ్చిన ఆదేశాన్ని, ఎవడు ఉల్లంఘించగలుగుతాడు? పూర్వం నిషధ పర్వతం మీద, పద్మభవుడైన బ్రహ్మదేవుడు చేసిన జ్ఞానోపదేశం నాకు జ్ఞాపకు ఉంది దానిని చెపుతాను.'' అని

వాల్మీకి అంటున్నాడు - ఓ భరద్వాజా! ఈ విధంగా మహోపదేష్ట, ఉత్తమ తేజస్సంపన్నుడైన వసిష్ఠుడు, అజ్ఞానాన్ని పోగొట్టి పరమ శాంతిని ప్రసాదింపజాలిన పరమాత్మతత్త్వాన్ని ఉపదేశించాడు.

శ్రీ యోగ వాసిష్ఠ సారంలో వైరాగ్యప్రకరణం సమాప్తం

# 2. ముముక్షు వ్యవహార ప్రకరణము

శ్రీవసిష్ఠ ఉవాచ -

సర్వదా సర్వమేవేహ సంసారే రఘునందన
సమ్యక్ప్రయుక్తా త్సర్వేణ పౌరుషాత్సమ వాప్యతే 1
ఉచ్ఛాస్త్రం శాస్త్రితం చేతి ద్వివిధం పౌరుషం స్మృతమ్
తత్రోచ్ఛాస్త్ర మనర్థాయ పరమార్థాయ శాస్త్రితమ్ 2
ఆ బాల్యా దలమభ్యస్తైః శాస్త్ర సత్సంగ మాదిభిః
గుణైః పురుష యత్నేన స్వార్థః సంప్రాప్యతే హితః 3

శ్రీరామ ఉవాచ -

ప్రాక్తనం వాసనాజాలం నియోజయతి మాం యథా
తథైవ తిష్ఠామి మునే కృపణః కిం కరోమ్యహమ్. 4

వసిష్ఠుడిట్లా అన్నాడు -

ఓ రఘునందనా! ఈ ప్రపంచంలో ఎల్లప్పుడూ, అన్ని విధాలా చక్కగా ప్రయత్నం చేసినప్పుడు - పురుషార్థంతో - సమస్తమూ లభిస్తాయి. అన్ని పనులూ సఫలమౌతాయి. ఎక్కడైనా అసఫలత్వం అనేది ఉంటే, అక్కడ ప్రయత్న లోపం ఉన్నదన్న మాటే!

ఈ పురుషార్థం అనేది ఉచ్ఛాస్త్రము, శాస్త్రితము అని రెండు విధాలుగా ఉంటుంది. శాస్త్రితము అంటే శాస్త్రాల్లో చెప్పిన విధంగా ప్రయత్నించటం. శాస్త్ర విరుద్ధంగా చేసే ప్రయత్నాన్ని ఉచ్ఛాస్త్రం అంటారు. ఉచ్ఛాస్త్ర పురుషార్థం అనర్థాన్ని తెచ్చిపెడుతుంది. శాస్త్రితమైన పురుషార్థం పరమార్థాన్ని యిస్తుంది.

బాల్యావస్థ నుండి చక్కగా అభ్యసించిన శాస్త్రాలననుసరించి, సత్పురుషుల సాంగత్యాది సద్గుణాదులతో చేసే పురుష ప్రయత్నం హితప్రదమై కోరిన ప్రయోజనాన్ని యిస్తుంది.

ఇది విని రాముడిట్లా అడిగాడు -

ఓ మునీంద్రా! పూర్వజన్మ వాసన నన్ను ఏ విధంగా నడిపిస్తుందో అట్లా నడుస్తాను. మానవులంతా అంతే! వాసన అనేది అంతటి బలమైనది. కాబట్టి అంతా దానికి లోబడే ఉంటారు. వాసనను అతిక్రమించి పురుషార్థంతో

ప్రయోజనాన్ని సాధించ లేము. అటువంటి దీనుడను నేను! ఏమి చేయాలి?

వసిష్ఠ ఉవాచ -

అత ఏవ హి హేరామ శ్రేయః ప్రాప్నోషి శాశ్వతమ్
స్వప్రయత్నో పనీతేన పౌరుషేణైవ నాన్యథా 5
ద్వివిధో వాసనా వ్యూహః శుభశ్చైవాశుభశ్చ తే
ప్రాక్తనో విద్యతే రామ ద్వయోరేక తరోథవా 6
వాసనౌ ఘేన శుద్ధేన తత్ర చేదుపనీయసే
తత్క్రమేణ శుభేనైవ పదం ప్రాప్స్యసి శాశ్వతమ్ 7
అథ చేదశుభో భావస్త్వాం యోజయతి సంకటే
ప్రాక్తనస్తదసౌ యత్నాజ్జేతవ్యో భవతాస్వయమ్ 8
శుభాశుభాభ్యాం మార్గాభ్యాం వహన్తీ వాసనా సరిత్
పౌరుషేణ ప్రయత్నేన యోజనీయా శుభే పథి 9

పూర్వ వాసన అలంఘ్యము, బలవత్తరము అయినందునే స్వప్రయత్నం వల్లను, సముపనీతుడైనందునను శ్రేయాన్ని పొందుతున్నాడు. పూర్వవాసన లేకపోతే పౌరుషమే బలవత్తరంగా ఉండదు.

రామా! వాసనా సమూహం రెండు విధాలుగా ఉంటుంది. మంచి వాసనలు, చెడ్డ వాసనలు అని. మనలో ఏదో ఒక విధమైన వాసనలు గానీ రెండూ కలసి గాని ఉండవచ్చు. ఈ రెంటిలోనూ శుభవాసనా సమూహంతో కూడి ఉన్న వాడైతే వాటి శక్తి వల్లనే క్రమేణ శాశ్వతమైన పరమపదాన్ని పొందగలుగుతాడు. అట్లా కాకుండా అశుభవాసనలు - చెడ్డ వాసనలు కలవాడైతే కష్టాలను, సంకటాలను పొందుతాడు. కాబట్టి దుష్టవాసనల వల్ల పుట్టిన ప్రవృత్తిని అణచివేసి వాటిపై విజయం సాధించాలి.

వాసనలనే నది శుభాశుభములనే రెండు మార్గాలకు ప్రవహిస్తూ ఉంటుంది. మనం మన బలముతో, శక్తితో ప్రయత్నపూర్వకంగా దానిని ( ఆ ప్రవాహాన్ని) శుభ మార్గానికి త్రిప్పాలి.

అశుభేషు సమావిష్టం శుభంష్వేవావతారయేత్
స్వమనః పురుషార్థేన బలేన బలినాం వర 10
అశుభాచ్చాలితం యాతి శుభం తస్మాదపీతరత్
జన్తోశ్చిత్తం తు శిశువ త్తస్మా త్తచ్చాల యేద్బలాత్ 11

సమతా సాన్త్వనేనాశు న ద్రాగితి శనైః శనైః
పౌరుషేణైవ యత్నేన లాలయేచ్చిత్త బాలకమ్ 12
ప్రాగభ్యాసవశాజ్జాతో యదాతే వాసనోదయః
తదాభ్యాసస్య సాఫల్యం విద్ధి త్వమరిమర్దన 13

ఓ మహావీరుడా! అశుభ కర్మల్లో (పాపకర్మల్లో) ప్రవృత్తమయ్యే మనస్సును ప్రబలమైన పురుషార్థంతో (గట్టి ప్రయత్నంతో) శుభ కర్మల వైపుకు (త్రిప్పి) ఆ పుణ్య కర్మలందు లగ్నం చేయాలి. మనస్సు అనేది శిశువులాగా చాలా చంచలమైనది. పాప కర్మల నుండి పుణ్య కర్మలవైపుకు మరలించినా, వెంటనే మరల అది అశుభకర్మలవైపు కే పోతుంది. కాబట్టి ఎంతో బలంతో దానిని మంచి మార్గానికి త్రిప్పాలి. హర్ష విషాదాలు లేని స్వరూపం కలిగిన సమభావంతో, సాంత్వన వచనాలతో (బుజ్జగింపుతో) చిత్తమనే బాలకుని ప్రయత్న పూర్వకంగా, ప్రేమతో అశుభ కర్మల నుండి మరలించి పరమపురుషార్థం వైపుకు త్రిప్పాలి. ఈ విషయంలో తొందరపాటు పనికిరాదు. పూర్వాభ్యాసం వల్ల - ఈ జన్మలోనే బాల్యం నుండి చేసిన అభ్యాసం వల్ల లేదా పూర్వ జన్మలో చేసిన అభ్యాసం వల్ల, నీకు ఇట్టి వాసనోదయం కలిగితే - శుభవాసనలు కలిగితే - అది నీ అభ్యాస సాఫల్యమనే అనుకోవాలి.

సందిగ్ధాయామపి భృశం శుభామేవ సమాహర
శుభాయాం వాసనా వృద్ధౌ తాత దోషో న కశ్చన 18
అవ్యుత్పన్నమనా యావద్భవానజ్ఞాత తత్పదః
గురుశాస్త్ర ప్రమాణైస్తు నిర్ణీతం తావదాచర 19
తతః పక్వ కషాయేణ నూనం విజ్ఞాత వస్తునా
శుభోప్యసౌ పరిత్యాజ్యో వాసనౌఘో నిరోధినా 20
యదతి సుభగమార్య సేవితం తచ్ఛుభ మనుసృత్య మనోజ్ఞభావ బుద్ధ్యా
అధిగమయ పదం సదా విశోకం తదను తదప్యవ ముచ్య సాధు తిష్ఠ 21

శుభవాసనల ఆధిక్యత ఉన్నప్పుడూ, రెండు రకాల వాసనలూ సమానంగా ఉన్నప్పుడూ, కర్తవ్యాన్ని బోధించి ఇంకా అంటున్నారు - శుభాశుభ సందిగ్ధావస్థలో శుభ వాసనలనే అధికంగా సమాహరించాలి (ప్రోగుచేయాలి) శుద్ధవాసనలు వృద్ధి అయినందు వల్ల దోషమేమీ లేదు.

వాసనలనేవి ఎటువంటివైనా అవిద్యా జనితాలైనందు వల్ల దోషయుక్తములే! కాబట్టి వసిష్ఠుడంటున్నాడు - నీకు విశేషజ్ఞానం కలిగేటంత వరకు, పరబ్రహ్మ స్వరూపాన్ని తెసుకోగలిగేటంత వరకు గురూపదేశాన్ని శాస్త్రోక్త ప్రమాణాల వల్ల నిర్ణీతమైన వాటినే ఆచరించాలి.

పిమ్మట - సాంసారిక దోషాలన్నీ భస్మీభూతమైన పిమ్మట, తెలుసుకోదగిన తాత్త్విక వస్తుజ్ఞానం పూర్తిగా కలిగిన పిమ్మట, వివేకవంతుడవైనప్పుడు శుభవాసనలను సైతం పరిత్యజించాల్సిందే!

శుభకరములు, మహాత్మ్యంతో కూడినవి, మహాత్ములు అనుసరించినవీ అయిన శుభవాసనలను అనుసరించి, మనోజ్ఞమైన బుద్ధితో మనస్సును నిర్మలం గావించుకొని, శోకరహితమైన పదాన్ని పొందాలి. పూర్తిగా వివేకం కలిగిన పిమ్మట ఆ సద్వాసనలను కూడా పరిత్యజించి సుస్థిరంగా ఉండాలి.

వసిష్ఠ ఉవాచ -

అపునర్గ్రహణాయాన్త స్త్యక్త్వా సంసార భావనామ్
సంపూర్ణా శమసంతోషౌ చాదాయోదారయా ధియా 22
సుపూర్వాపర వాక్యార్థ విచార విషయాదృతమ్
మనః సమరసం కృత్వా సానుసంధాన మాత్మని 23
శ్రుణు రామ పురాప్రోక్తం బ్రహ్మణా పరమేష్ఠినా
సర్వ దుఃఖక్షయకరం పరమాశ్వాసనం ధియః 24

శ్రీరామ ఉవాచ-

కోనోక్తం కారణే నేదం బ్రహ్మన్పూర్వం స్వయం భువా
కథం చ భవతా ప్రాప్త మే తత్కథయ మే ప్రభో. 25

వసిష్ఠుడిట్లా అన్నాడు -

ఓ రామా! ఈ ప్రపంచంలో మళ్ళీ జన్మ ఎత్తకుండా ఉండాలంటే - భవబంధాల నుండి విముక్తి పొందాలంటే - అంతఃకరణంలో సాంసారిక భావాల్ని (వాసనలను) వదలివేయాలి. తన హృదయంలో పరమ శాంతిని, సంతోషాన్ని పొంది ఉండాలి.

రామా! అందమైన పూర్వాపరవాక్యార్థ విచారణతో కూడిన విషయ మందలి

ఆదరంతో, మనస్సును సమరస భావంతో ఆత్మానుసంధానం చేయాలి. అని పూర్వం పరమేష్ఠియైన బ్రహ్మ చెప్పాడు. ఈ విషయం బుద్ధికి మిక్కిలి ఆశ్వాసనం కలిగించి, దుఃఖాల్ని దూరం చేయగలదు. దానిని విను!

రాముడిట్లా అడిగాడు -

ఓ మహాత్మా! పూర్వం స్వయంభువుడైన పరమేష్ఠి ఎందుకు చెప్పాడు? మీకు ఈ విషయం ఎట్లా తెలిసింది? ఈ విషయం మంతా నాకు చెప్పండి.

వసిష్ఠ ఉవాచ -

**అస్త్యనన్త విలాసాత్మా సర్వగః సర్వసంశ్రయః**
**చిదాకాశో వినాశాత్మా ప్రదీపః సర్వవస్తుషు** 26
**స్పన్దాస్పన్ద సమాకారాత్తతో విష్ణురజాయత**
**తస్యాపి హృదయాంభోజాత్పరమేష్ఠీ వ్యజాయత.** 27
**సోస్పృజత్సకలం సర్గం వికల్పౌఘం యథా మనః**
**ఏ తస్మిన్భారతే వర్షే నానా వ్యసన సంకులమ్** 28
**జనస్యైతస్య దుఃఖం స దృష్ట్వా సకలలోక కృత్**
**జగామ కరుణామీశః పుత్రదుఃఖాత్పితా యథా** 29
**క ఏతేషాం హతాశానాం దుఃఖస్యాన్తో హతాయుషాం**
**స్యాదితి క్షణమేకాగ్ర శ్చిన్తయిత్వా స్వలభ్యత** 30
**తపోదానం జపస్తీర్థం నాత్యన్తం దుఃఖశాన్తయే**
**తత్తావద్దుఃఖ మోక్షార్థం జ్ఞానం ప్రకథయామ్యహమ్.** 31

వసిష్ఠమహర్షి ఇంకా యిట్లాఅన్నాడు -

రామా! సమస్త కార్యస్వరూపుడు - అంతటా వ్యాపుడై ఉండి అన్ని విషయాలయందు, వస్తువుల యందు భాసిస్తూ ఉండేవాడు, చిదాకాశ స్వరూపుడు అవినాశియైనవాడు, స్పందనయుక్తుడు స్పందన రహితుడు అయిన పరమాత్మనుండి విష్ణువు పుట్టాడు. ఆయన హృదయ కమలం నుండి పరమేష్ఠియైన బ్రహ్మ జననం జరిగింది. ఆ బ్రహ్మయే ఈ సృష్టినంతటినీ సృజించాడు. మన మనోరథాలన్నింటి స్వరూపమూ మనస్సే అయినట్లుగా ఈ సమస్త జగత్స్వరూపము ఆ పరబ్రహ్మమే!

ఆ పరమేష్ఠి ఈ జగత్తునందలి జీవుల దుఃఖాలన్నీ చూచి, కొడుకు దుఃఖాల్ని చూచి తండ్రి జాలిపడినట్లుగా, పరమేష్ఠి హృదయంలో జాలి కలిగింది. అంతట బ్రహ్మదేవుడు, హతాశులు మరణస్వభావులు, అల్పాయుర్దాయం కలిగిన వారుఅయిన ఈ మానవుల దుఃఖాలను తొలగించడం ఎట్లా? అని ఎంతగానో ఆలోచించాడు.

తపస్సుగాని, దాన ధర్మాలు గాని, తీర్థసేవలు గాని, పుణ్యక్షేత్ర దర్శనాదులు గాని వీరి దుఃఖాలను పోగొట్టలేవు. అందుచేత వీరిని దుఃఖాల నుండి విముక్తుల్ని చేయటానికై జ్ఞానోపదేశం చేస్తాను, అని అనుకొన్నాడు.

ఇతి సంచిన్త్య భగవాన్ బ్రహ్మా కమల సంస్థితః
మనసా పరిసంకల్ప్య మా ముత్పాదిత వానిమమ్ 32
కమండలు ధరో నాథః స కమండలునా మయా
సాక్షమాలం స్థితః పద్మే స ప్రణమ్యాభి వాదితః 33
ఏహి పుత్రేతి మాముక్త్వా స్వాబ్జస్యోత్తరే దలే
మాం నివేశ్య మహాబాహో ప్రోవాచ భగవానజః 34
ముహూర్త మాత్రం తే పుత్ర చేతో వానర చంచలమ్
అజ్ఞాన మభ్యావిశతు సబాష్పం దర్పణం యథా 35
ఇతి తేనాశు శప్తః సన్విచారం సమనన్తరమ్
అహం విస్మృత వాన్సర్వం స్వరూప మమలం కిల 36
అథాహం దీనతామేత్య స్థితో సంబుద్ధ్యా ధియా
దుఃఖ శోకాభి సంతప్తో జాతో జన ఇవాధమః 37

విష్ణు భగవానుని నాభి కమలంలో ఉండే పరమేష్ఠియైన బ్రహ్మదేవుడు ఇట్లా ఆలోచించి, తన మానసిక సంకల్పం ద్వారా నన్ను పుట్టించాడు. కమండులు ధారియైన నేను, కమండలముతో పాటు అక్షమాలాధారియై, పద్మాసనాసీనుడై యుండిన బ్రహ్మదేవునికి సగౌరవంగా నమస్కరించాను.

ఆయన నాతో ఇట్లా అన్నాడు - '' పుత్రకా! ఇటు రమ్ము! అని నన్ను తానున్న పద్మానికి ప్రక్కనున్న పద్మదళం మీద కూర్చుండ జేసి ఇట్లా అన్నాడు - '' నాయనా! నీ చిత్తం ( మనస్సు) ఒక ముహూర్త కాలం పాటు - రెండు గడియల పాటు కోతిలాగా చంచలంగా ఉండుగాక! '' అని.

ఈ విధంగా ఆయన చేత అభిశప్తుడనైన నేను నోటి నుండి వెలువడిన ఆవిరి వల్ల మసకబారిన అద్దంలా అయిపోయాను - అజ్ఞానం నన్ను ఆవరించింది. వివేకాన్ని, నా స్వరూపజ్ఞానాన్ని కోల్పోయాను. మిక్కిలి దైన్యస్థితిని పొంది, అసంబద్ధమైన బుద్ధితో, అధమునివలె, దుఃఖ సంతప్తుడనై ఉండిపోయాను.

అథా భ్యయాత్ప మాం నాథః పుత్ర కిం దుఃఖ వానసి
దుఃఖోపఘాతం మాం పృచ్ఛ సుఖీ నిత్యం భవిష్యసి 38
తతః పృష్టః స భగవాన్మయా సంసార భేషజమ్
కథం నాథ మహాదుఃఖ మయః సంసార ఆగతః 39
కథం చ క్షీయతే నాథ తత్తేన మహాత్మనా
తద్జ్ఞానం సుబహు ప్రోక్తం యద్ జ్ఞాత్వాహం సుఖీస్థితః 40
తతో విదిత వేద్యం మాం విజాయాం ప్రకృతౌ స్థితమ్
స ఉవాచ జగత్కర్తా వాక్యం సకల కారణమ్ 41
శాపే నాజ్ఞ పదం నీత్వా పృచ్ఛకస్త్వం మయాకృతః
పుత్రాన్య జ్ఞాన సారస్య సమస్త జన సిద్ధయే. 42

పిమ్మట పరమేష్ఠి నా సమీపానికి వచ్చి యిట్లా అన్నాడు - ''పుత్రా! నీకు దుఃఖం కలిగిందా? ఈ దుఃఖోప ఘాతాన్ని గురించి నన్ను అడిగి తెలుసుకో! ఆ పైన నీవు నిత్యమూ సుఖివి అవుతావు '' అని. అంతట నేను పరమేష్ఠియైన బ్రహ్మను ఇట్లా అడిగాను - '' ప్రభూ! ఈ సంసారమనే మహారోగానికి ఔషధం ఏది? భవబంధనమనే మహావ్యాధి ఎట్లా అయితే నయమౌతుంది? ఈ సంసారమనే వ్యాధి ఎట్లా సంక్రమిస్తోంది? ఈ వ్యాధి ఎట్లా క్షయమౌతుంది? '' అని.

అంతట పరమేష్ఠి గొప్పదైన జ్ఞానాన్ని ఉపదేశించాడు. ఆ జ్ఞానాన్ని పొంది నేను పరమ సుఖిని అయినాను. పిమ్మట తెలుసుకొనదగినట్టి తత్త్వాన్ని తెలిసికొని నిజప్రకృతిలో ఉన్నట్టి నాతో, జగత్కర్తయైన బ్రహ్మ, సమస్తానికీ కారణస్వరూపమైన వాక్యాన్ని చెప్పాడు - ''వత్సా! నేను నిన్ను శపించి క్షణంలో నిన్ను అజ్ఞానిని చేశాను. అందుకే నీవు ఇప్పుడు నన్ను ఆ అజ్ఞానానికి కారణం ఏమిటి? అని అడుగుతున్నావు. నాయనా! ఈ నేను చెప్పబోయే జ్ఞానాన్ని పొంది అందరూ సుఖవంతులు కావాలనే తలంపుతో నేను అట్లా చేశాను. '' అని.

ఇదానీం శాంతశాపస్త్వం బోధం పరముపాగతః
గచ్ఛ వత్స మహీపీఠం జంబూద్వీపాంతర స్థితమ్ 43
సాధో భారత వర్షే త్వం లోకానుగ్రహ హేతునా
తత్ర క్రియాకాండ పరాస్త్వయా పుత్ర మహాధియః 44
ఉపదేశ్యాః క్రియాకాండ క్రమేణ శకుశాలినా
విరక్త చిత్తాశ్చ తథా మహాప్రాజ్ఞా విచారిణః 45
ఉపదేశ్యాస్త్వయా సాధో జ్ఞానే నాన్లదాయినా
ఇతి తేన నియుక్తోహం పిత్రా కమలజన్మనా 46
ఇహ సాధోవ తిష్ఠామి యావద్భూత పరంపరా
కర్తవ్య మస్తి న మమేహ హి కించిదేవ 47
స్థాతవ్య మత్యతి మనా భువి సంస్థితోస్మి
సంశాన్తయా సతత సుప్తధియైవ వృత్త్యా
కార్యం కరోమి న చ కించి దహం కరోమి. 48

''నేను నీకు ఇచ్చిన ఈ శాపం ఇప్పుడు శాంతించింది. శాపం తొలగిపోగా నీవు విశుద్ధమైన జ్ఞానాన్ని పొందావు. నాయనా! నీవిప్పుడు జంబూద్వీపానికి మధ్యలో నున్న భూభాగానికి పో! అక్కడ లోకానుగ్రహార్థం ఆ భారత దేశంలో గొప్ప బుద్ధిమంతులు, శమదమాది సద్గుణ సంపన్నులు, విరక్తచిత్తులు, పండితులు అయిన ఋషీశ్వరులకు నీవు క్రియాకాండ క్రమాన్ని ఉపదేశించవలసినదిగ నియమిస్తున్నాను'' అని బ్రహ్మదేవుడు అన్నాడు. పరమపితయైన పరమేష్ఠి వల్ల ఈ విధంగా నియుక్తుడనై ఈ సమస్త ప్రాణుల రాకపోకలున్నంత వరకు ఇక్కడ ఉంటాను. ఈ కర్మక్షేత్రమైనభారత దేశంలో ఇంతకు మించిన కర్తవ్యమంటూ నా కేదీ లేదు. గుర్వాజ్ఞననుసరించి ఈభూమి మీద ఉంటున్నాను. నాకు హర్ష విషాదాలు లేవు. బుద్ధి వృత్తులన్నీ సుప్తమై ఉన్నాయి. నేను పరమార్థ దృష్టితో ఏ పనైనా చేస్తున్నాను. అంతేతప్ప స్వార్థబుద్ధితో చేయటం లేదు.

శ్రీవసిష్ఠ ఉవాచ -

అజ్ఞాతాన్లజ్ఞతే పూర్వం వక్తుర్నిర్ణీయ కార్యతః
యః కరోతి నరః ప్రశ్నం పృచ్ఛకఃస మహామతిః 49
పూర్వాపర సమాధాన క్షమ బుద్ధా వనిన్దితే
పృష్టం ప్రాజ్ఞేన వక్తవ్యం నాధమే పశుధర్మిణి 50

మోక్షద్వారే ద్వారపాలాశ్చ త్వారః పరికీర్తితాః
శమో విచారః సంతోషశ్చతుర్థః సాధు సంగమః 51
ఏతే సేవ్యాః ప్రయత్నేన చత్వారో ద్వే త్రయోథవా
ద్వారము ద్ఘాటయన్త్యేతే మోక్షే రాజగృహే యథా 52
ఏకం వా సర్వయత్నేన సర్వముత్సృజ్య సంశ్రయేత్
ఏకస్మిన్వశగే యాన్తి చత్వారోపి వశం యతః 53
శాస్త్రైః సజ్జన సంసర్గ పూర్వకైః స తపోదమైః
ఆదౌసంసార ముక్త్యర్థం ప్రజ్ఞామేవాభి వర్ధయేత్ 54

వక్తయైన తనను, శ్రోతయైన శ్రీరాముని దృష్టిలో ఉంచుకొని వసిష్ఠుడు ఇంకా ఈ విధంగా అన్నాడు -

రామచంద్రా! వక్తయొక్క ముఖ్యమైన మొదటి కర్తవ్యం ఏమిటి? అంటే, అడిగేవాడు తెలిసినవాడా? తెలియని వాడా? అని అతని అజ్ఞతను, తద్ జ్ఞతను నిర్ణయించుకోవాలి. ఆ పిమ్మటనే చెప్పదలచినది చెప్పాలి. ఇక్కడ పృచ్ఛకుడు గొప్ప బుద్ధిమంతుడై, పూర్వాపరవాక్యార్థాలను సమన్వయించుకోగా, ఇంకేమైన ఆక్షేపం మిగిలినప్పుడు, దాని అన్వయాన్ని సరిగా తెలుసుకోజాలిన శిష్యునికే, అట్టి అనిందితుడైనవానికే ఉపదేశం చేయాలి. అంతే తప్ప పశుప్రవృత్తి కలిగిన అధర్మపరుడైనవానికి ఉపదేశం చేయరాదు.

వసిష్ఠుడింకా ఈ విధంగా ఉపదేశిస్తున్నాడు-

నాయనా! మోక్ష కాంక్షియైనవాని కర్తవ్యం చెపుతా విను. మోక్షద్వారానికి నలుగురు ద్వారపాలురున్నారు - శమము, విచారము, సంతోషము, సత్సంగము. ఈ నలుగురినీ సేవించి వారిని లోబరచుకొంటే తప్ప ముముక్షువుకు మోక్షం లభ్యం కాదు. నలుగురినీ సేవించకపోతే ముగ్గురుని, లేదా యిద్దరిని, లేదా కనీసం ఒకరినైనా సేవించి లోబరచుకోక తప్పదు. వీరిని ప్రసన్నుల్ని చేసుకొంటే వీరు మోక్ష ద్వారాన్ని తెరుస్తారు. ద్వార రక్షకులను సేవిస్తేనే తప్ప రాజ భవనంలోకి ప్రవేశం లభించనట్లుగా ఈ నలుగురినీ, కనీసం ఒకరినైనా ప్రసన్నుల్ని చేసుకొని అనుమతి పొందాలి. ఏ ఒకరినైనా లోబరచుకో గలిగితే మెల్లగా మిగతా ముగ్గురూ కూడా లోబడతారు. పిమ్మట తపస్సు, దమంతో కూడిన వారై సజ్జన సాంగత్యం ద్వారా, శాస్త్రార్థ విచారణ ద్వారా సాంసారిక బంధనాల నుండి విముక్తి పొందటానికై తను ప్రజ్ఞను వృద్ధి పరచుకోవాలి.

దుస్సహో రామ సంసార విష వేగ విషూచికా
యోగగారుడ మంత్రేణ పావనేన ప్రశామ్యతి 55
దుర్జేయం కిల విషయ విషజ విషూచికా యది న చికిత్స్యతే
తన్నితరాం నరక నగర నికర ఫలాను బన్దినీ 56
తద్దైతత్కరోతి యత్ర శిలాశితాసి
శతపాతోత్పల (శాతః పాత ఉపల '' అని బృహద్యోగవాసిష్ఠం) తాడనమ్.57
అగ్నిదాహో హిమావ సేచనం అంగావకర్తన చందన చర్చా
నిరవధినా ఏవ నరక నిపాతో విదాఘు వినోదన 58
ధారాగృహ శీకర వర్ష శిరచ్ఛేదః సుఖనిద్రా
మూకీకరణ మానన ముద్రా వాధిర్యం మహానుపచయః 59
తదేవం రామ శాస్త్రేణావ హేలయా వ్యవహర్తవ్యం
అవశ్యమేవం విచారణీయం ఏవం చావబోద్ధవ్యమ్. 60
యథా కిల శాస్త్ర విచారా ద్బోధో భవతీతి.

రామా! సంసార విషవేగం వల్ల పుట్టే వ్యాధి విషూచికా వ్యాధి లాంటిది. ఈ వ్యాధి తగ్గటానికి బ్రహ్మాత్మైక్య విజ్ఞానం అనేది గారుడ మంత్రం లాగా పనిచేస్తుంది. - సంసార విషూచికావ్యాధికి బ్రహ్మాత్మైక్య విజ్ఞానం పరమౌషధం. ఈ పరమార్థ విజ్ఞానం సజ్జన సాంగత్యం వల్లను శాస్త్రార్థ విచారణ వల్ల లభిస్తుంది.

ఈ సాంసారిక విషయ విషూచికా వ్యాధి దుస్సహమైనది. దీనికి తగిన చికిత్స చేయకపోతే నరకంలో అనుభవించే బాధలు అనుభవించాల్సి వస్తుంది. వందల కొలది కత్తులతో పొడిచినట్లుగా, రాళ్ళతో కొట్టినట్లుగా బాధపడాల్సి ఉంటుంది. నరకంలో అగ్నిలో పడేసి కాల్చటం, మంచులో ముంచటం, శరీరాన్ని కోయటం, బాణాలతో గ్రుచ్చటం, ఎండలో పడవేయటం, నీటి ధారలు పడే గృహంలో ఉంచటం, శిరచ్ఛేదం చేయటం, నిద్ర లేకుండా, ఏడవటానికి కూడా వీలు లేకుండా నోరు కట్టివేయటం, వినపడకుండా చేయటం లాంటి అనేక బాధలు చాలకాలం పాటు అనుభవించాల్సి ఉంటుంది. కాబట్టి, ఈ విషయ విషూచికా రోగానికి తప్పనిసరిగా చికిత్స చేయాలి. ఈ అనర్థనివృత్తికై శాస్త్ర విచారణ చేయాలి. శాస్త్ర విచారణ వల్ల జ్ఞానం కలుగుతుంది. జ్ఞానార్జనం అనేది తప్పని సరి.

స్వాను భూతేశ్చ శాస్త్రస్య గురోశ్చైవైక వాక్యతా
యస్యాభ్యాసేన తేనాత్మా సంతతే నావ లోక్యతే 61
కించిత్సంస్కృత బుద్ధీనాం శ్రుతం శాస్త్రమిదం యథా
మౌర్ఖ్యాపహం తథా శాస్త్రమన్యదస్తి న కించన 62
వరం శరావహస్తస్య చాండాలాగార వీథిషు
భిక్షార్థమటనం రామ న మౌర్ఖ్యం హతజీవితమ్ 63
న ధనా న్యుప కుర్వన్తి న మిత్రాణి న బాంధవాః
న హస్త పాద చలనం న దేశాంతర సంగమః 64
న కాయక్లేశ వైధుర్యం న తీర్థాయ న జీవితమ్
కేవలం తన్మనో మాత్ర జయేనా సాద్యతే పరమ్ 65
మోక్ష ద్వారే ద్వారపాలాని మాం శ్రుణు యథాక్రమమ్
ఏషా మేక తమాసక్త్యా మోక్షద్వారే ప్రవేశ్యతే. 66

నిరంతరాభ్యాసం వల్ల స్వీయానుభూతిని పొందినవాడూ, శాస్త్రాలను చక్కగా చదివి బాగా మననం చేసినవాడూ, గురువును చక్కగా సేవించి గురూపదేశం పొందినవాడూ, ఆత్మ సాక్షాత్కారాన్ని పొందగలుగుతాడు. అంటే, స్వానుభూతి, శాస్త్రావలోకనం, గురూపదేశం అనేవి ఆత్మ సాక్షాత్కారానికి అవసరం.

శాస్త్రాభ్యాసం వల్లను, మననం వల్లను మూర్ఖత్వం తొలగిపోతుంది. అయితే, సుసంస్కృత బుద్ధులకు మాత్రమే - మంచి సంస్కారం కలవారికి మాత్రమే శాస్త్ర శ్రవణాదుల వల్ల మూర్ఖత్వం పోతుంది. మూర్ఖత్వాన్ని పోగొట్టటానికి శాస్త్రాన్ని మించిన సాధనం-ఏదీ లేదు.

రామా! మూర్ఖత్వాన్ని పోగొట్టుకోవటం అనేది మానవ జీవితానికి మిక్కిలి అవసరం. చండాలురు నివసించే వీధుల్లో కల్లుముంత చేతపట్టి భిక్షాటనం చేయట మనేది మూర్ఖత్వంతో బ్రతకటం కంటె చాలానయం - మూర్ఖజీవనం చాలా హేయమైనది.

ఈ జీవితంలో ధనాదికాలను సంపాదించి సత్పాత్రులకు మనం దానం చేయవచ్చు గాక! బంధుమిత్రులతో కూడి ఉండటం వల్లను, దేశాలు తిరగటం వల్లను, చేతులు కాళ్ళు ఆడించటం వల్లను, శరీరక్లేశాదుల్ని సహించి నందువల్లను, తీర్థయాత్రలు చేసినందు వల్లను బ్రహ్మప్రాప్తి కలగదు. మనస్సును లోబరచుకొన్నందు వల్ల మాత్రమే పరబ్రహ్మ ప్రాప్తి కలుగుతుంది.

మోక్ష ద్వారం వద్ద ఉండే ద్వారపాలకుల విషయం విను. ఈ లోగడ చెప్పబడిన ద్వార రక్షకులలో ఏ ఒకనిని లోబరచుకొన్నా మోక్ష ద్వార ప్రవేశం కలుగుతుంది.

యాని దుఃఖాని యా తృష్ణా దుస్సహా యే దురా ధయః
తత్సర్వం శాన్త చేతస్సు తమోర్కే ష్వివ నశ్యతి 67
మారరీవ పరం యాన్తి విషమాణి మృదూని చ
విశ్వాస మిహ భూతాని సర్వాణి శమశాలిని. 68
న రసాయన పానేన న లక్ష్మ్యాలింగనేన చ
తథా సుఖమవాప్నోతి శమే నాన్తర్యథా జనః 69
శ్రుత్వా స్పృష్ట్వా చ దృష్ట్వా చ భుక్త్వా ఘ్రాత్వా శుభాశుభమ్
న హృష్యత గ్లాయతి యః స శాన్త ఇతి కథ్యతే 70
తుషారకర బింబాచ్ఛం మనో యస్య నిరాకులం
మరణోత్సవ యుద్ధేషు స శాన్త ఇతి కథ్యతే 71
తపస్విషు బహుజ్ఞేషు యాజకేషు నృపేషు చ
బలవత్సు గుణాఢ్యేషు శమవా నేవ రాజతే. 72

మోక్షద్వారంలో ప్రవేశించగానే పరమశాంతి లభిస్తుంది. తృష్ణ, దుస్సహమైన మానసిక వ్యథలు మొదలైనవన్నీ సూర్యోదయం కాగానే చీకటి మాయమైనట్లు నశించిపోతాయి. కాబట్టి శాంతచిత్తుడౌతాడు. అట్టి పరమశాంతి లభించగానే విషమ పదార్థాలన్నీ మృదుస్వభావం కలవైపోతాయి. అట్టి ప్రభావం కలవాని యందు సమస్త ప్రాణులు పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉంటాయి.

అట్టి మానవునికి ఆంతరికమైన మానసిక శాంతి వల్ల లభించే పరమసుఖం, రసాయనాలు త్రాగినందువల్ల గాని, లక్ష్మీదేవి సమాలింగనం వల్ల గాని ( అనేక భోగ భాగ్యాలు లభించినందు వల్ల గాని) లభించదు. అది అన్ని సుఖాలను మించిన పరమ సుఖం. అటువంటి అత్యుత్తమమైన శాంతి వల్ల లభించే అత్యుత్తమ ఫల స్వరూపం ఎటువంటిది? అంటే - అట్టి శాంతిని పొందినవాడు శుభాశుభాలను విన్నా, స్పృశించినా, చూచినా, తిన్నా, వాసన చూచినా, దుఃఖాన్ని గానీ సంతోషాన్ని గానీ పొందడు. అంటే మంచి చెడ్డలు, సుఖదుఃఖాలు మొదలైన ద్వంద్వాలన్నింటికీ అతీతుడై ఉంటాడు.

మరణ సమయంలో గాని, ఉత్సవ సమయంలో గాని యుద్ధ సమయంలో గాని, ఏ విధమైన ఆకుల పాటును చెందకుండా చంద్రబింబంలాగా స్వచ్ఛంగా ఉండే మనస్సు కలవాడే శాంతుడు అని వ్యవహరింపబడతాడు.

తపస్వులు, అనేక విషయాలు తెలిసినవారు, యాజకులు, రాజులు, బలశాలురు, గుణవంతులు మొదలైన వీరందరిలోను శాంత చిత్తుడు శ్రేష్ఠుడు. అంటే, తపస్సు, జ్ఞానము, యజనము, ఐశ్వర్యం, బలం, ఇతర సద్గుణాలన్నింటి కంటె శమం అనేది చాలా గొప్పది.

శమ మమృత మహార్య మార్య గుప్తం
పరమవలంబ్య పరం పదం ప్రయాతాః
రఘు తనయయథా మహానుభావాః
క్రమమను పాలయ సిద్ధయే తమేవ. 73
శాస్త్రవబోధామలయా ధియా పరమ పూతయా
కర్తవ్యః కారణజ్ఞేన విచారో నిశమాత్మనః 74
విచారాత్తీక్ష్ణతా మేత్య ధీః పశ్యతి పరం పదం
దీర్ఘ సంసార రోగస్య విచారో హి మహౌషధమ్. 75
కోహం కస్య చ సంసార ఇత్యాపద్యపి ధీమతా
చిన్తనీయం ప్రయత్నేన సప్రతీకార మాత్మనా 76
అన్ధ మంధకారేషు బహుతేజః స్వజిహ్మితమ్
పశ్యత్యపి వ్యవహితం విచార శ్చారులోచనమ్ 77
కోహం కథమయం దోషః సంసారాఖ్య ఉపాగతః
న్యాయే నేతి పరామర్శో విచార ఇతి కథ్యతే. 78

ఓ రామా! మహిమాన్వితులైన గొప్పవారందరూ ఈ శమము అనే గుణాన్ని ఆధారంగా చేసుకొని పరమ పదాన్ని పొందారు. అందుకే ఇది గొప్ప మహిమ కలది. దీనిని ఎవరూ అపహరించలేరు. అందుచేత నీవు కూడా ఆ సుఖసాధనమైన శమాన్ని ఆచరించు.

ఏ కార్యానికి ఏది కారణం? అని తెలిసికొనగలిగిన వారు కారణజ్ఞులు. అట్టివారు సమస్త సత్కార్మల్నీ భగవంతుని పాదాల చెంత అర్పించి, పరమ పవిత్రమైన జ్ఞానం ద్వారా, నివృత్తి పరాయణమైన నిర్మల బుద్ధితో ఆత్మ విచారణ చేయాలి.

విచారణ వల్ల బుద్ధి తీక్షణమై విమలమై పరమ పదాన్ని దర్శించ గలుగుతుంది. అంటే వివేకం యొక్క తీవ్రత వల్ల మోక్ష సంబంధమైన భావన స్థిరమౌతుంది. కాబట్టి సంసార బంధమనే దీర్ఘ రోగానికి నిరంతర విచారణ అనేది పరమౌషధం.

విచారణ యొక్క పద్ధతి - స్వరూపం -ఎట్లా ఉండాలి? అంటే, ''నేను ఎవరిని? ఏ ప్రయోజనం కోసం నేను ఈ ప్రపంచంలోకి వచ్చాను? ఈ సంసారంతో - ప్రపంచంతో నాకు ఎంతవరకు, ఎటువంటి సంబంధం ఉంది?'' అని ఇట్లా ఎన్ని విఘ్నాలు వస్తున్నా ఎల్లప్పుడూ చింతన చేయాలి.

వివేకంతో చేసే విచారణ అనేది చీకట్లో కూడా చూడగలిగిన శక్తివంతమైనట్టి నేత్రం లాంటిది - దూరంగా ఉన్న దానిని కూడా చూడగలిగిన అందమైన కన్ను లాంటిది. విచారణ చేసినకొలదీ అన్నింటియొక్క వాస్తవిక జ్ఞానమూ లభిస్తుందని భావం. నేను ఎవరిని? ఈ సంసారమనే మహాదోషం నాకు ఎట్లా సంక్రమించింది? అని ఈ విధమైన న్యాయపూర్వకమైన విమర్శనే విచారణ అంటారు.

వసిష్ఠ ఉవాచ -

సంతోషో హి పరం శ్రేయః సంతోషః సుఖముచ్యతే
సంతుష్టః పరమభ్యేతి విశ్రామ మరిమర్దన 79
సంతోషామృత పానేన యే శాన్తా స్తృప్తి మాగతాః
భోగశ్రీరతులా తేషా మేషా ప్రతి విషాయతే 80
అప్రాప్త వాంఛా ముత్సృజ్య సంప్రాప్తే సమతాం గతః
అదృష్ట ఖేదా ఖేదో యః సంతుష్టః స ఇహోచ్యతే 81
ఆశా వైవశ్య వివశే చిత్తే సంతోషర్వజితే
మ్లానే వక్రమివాదర్శే న జ్ఞానం ప్రతి బింబతి. 82
నాభి వాంఛత్య సంప్రాప్తం ప్రాప్తం భుంక్తే యథాక్రమమ్
యస్తు సౌమ్య సమాచారః సంతుష్ట ఇతి కథ్యతే 83
సమతయా మతయా గుణశాలినాం
పురుష రాడిహ యః సమలం కృతః
తమమలం ప్రణమన్తి నరోత్తమా
అపి మహామునయో రఘు నన్దన. 84

వసిష్ఠుడు విచారణను గురించి చెప్పి, ఇకసంతోషాన్ని గురించి ఇట్లా అన్నాడు.

ఓ రామచంద్రా! సంతోషమనేది మానవునికి శ్రేయస్సును కలిగిస్తుంది. సంతోషాన్ని సుఖం అంటారు. ఈ సంతోషమనే సద్గుణంతో సంతుష్టుడై ఉండేవాడు పరమ విశ్రాంతిని పొందుతాడు.

సంతోషమనే అమృతాన్ని సేవించి శాంతుడై తృప్తిని పొందినవానికి ఈ అనంత సంపదలు, భోగాలు మొదలైనవన్నీ ప్రతికూలమైనవిగా, విషం లాగా కనిపిస్తాయి.

ఇక సంతోష స్వరూపాన్ని గురించి చెప్పాలంటే, అభీష్టమైన వస్తువు లభించినప్పుడు కలిగే సంతోషం గాని ఆ వస్తువు లభించనప్పుడు కలిగే విషాదం గానీ ఈ రెండూ లేకుండా, సమభావంతో ఉండటాన్ని సంతోషం అంటారు. న్యూనాధిక్యతలు లేకుండా ఎల్లప్పుడూ అన్ని విషయాల్లోనూ సమభావంతో ఉండే వాడే సంతుష్టుడు.

ఈ విధమైన సంతోషం పూర్తిగా లభించనంతవరకు జ్ఞానోత్పత్తి కలగదు - ఆశలతో, కోరికలతో కూడి ఉన్నందున ఆతని చిత్తం మలిన దర్పణం లాగా ఉంటుంది. మలినమైన అద్దంలో ప్రతిబింబం కనిపించనట్లుగా మలిన చిత్తంలో జ్ఞానోదయం కాదు.

అప్రాప్యమైన దానిని కోరకుండా, లభించిన దానిని ఆచార క్రమాన్ని అతిక్రమించకుండా అనుభవించాలి. ప్రాప్తమైన దానిని అనుభవించటం, ఆచారక్రమాన్ని ఉల్లంఘించకుండా ఉండటంతో పాటు సౌమ్యమైన నడవడి కలవానిని 'సంతుష్టుడు' అంటారు.

ఓరఘురామా! సద్గుణాలు కలిగిన సజ్జనుల చేత నుతింపబడే సమ భావంతో కూడినవాడు పరమశ్రేష్ఠుడు. అటువంటి శ్రేష్ఠునికి గొప్ప గొప్ప మునీశ్వరులుసైతం ప్రణమిల్లుతారు.

**విశేషేణ మహాబాహో సంసారోత్తరణే నృణామ్**
**సర్వత్రో పకరోతీహ సాధుః సాధు సమాగమః** 85
**శూన్యమాకీర్ణతామేతి మృత్యురప్యుత్సవాయతే**
**ఆపత్సం పదివాభాతి విద్వజ్జన సమాగమే** 86

యః స్నాతః శీతసితయా సాధుసంగము గంగయా
కిం తస్య దానైః కిం తీర్థైః కిం తపోభిః కిమధ్వరైః 87
విచ్ఛిన్న గ్రంథయసద్జ్ఞః సాధవః సర్వసంమతాః
సర్వోపాయేన సంసేవ్యాస్తే హ్యుపాయా భవాంబుధౌ 88
చత్వార ఏతే విమలా ఉపాయా భవభేదనే
యైరభ్యస్తాస్త ఉత్తీర్ణా మోహవారిభవార్ణవాత్ 89
త్వమేతయా ఖండితయా గుణలక్ష్మ్యా సమాశ్రితః
మనోమోహహరం వాక్యం వక్ష్యమాణమిదం శృణు 90
మోక్షోపాయ కథామేతాం శ్రుణ్వతామరి మర్దన
అనిచ్ఛతామపి బలాత్పరో బోధః ప్రవర్తతే 91
లోభ మోహాదయో దోషాస్తానవం యాన్త్యలం ధియః
మనః ప్రసాద మాయాతి శరదీవామలం నరః 92

ఓ మహావీరుడా! ప్రపంచంలో ఉండే మానవులకు ఈ సంసారాసాగరాన్ని తరించటానికి సజ్జన సాంగత్యం అన్ని విధాలా ఎంతో ఉపకరిస్తుంది. విద్వాంసులైన వారి సాంగత్యం వల్ల, జనశూన్యమైన మరుభూమి కూడా ప్రాణులతో కూడిన ప్రదేశం లాగా, మృత్యువు కూడా సంతోషాన్ని కలిగించే ఉత్సవం లాగా, ఆపదలన్నీ సంపదల లాగా కనిపిస్తాయి. సాధు సాంగత్యానికి అంతటి మహాత్యం ఉంది.

సజ్జన సాంగత్యం అనే గంగానదిలో స్నానం చేసిన వానికి దానాలు, తీర్థయాత్రలు, తపశ్చర్యలు, యజ్ఞాలు మొదలైన పుణ్యకర్మలేవీ చేయాల్సిన అగత్యం ఉండదు. సత్పురుష సాంగత్యం అనేది వీటి అన్నింటినీ మించినది.

అహంకారమనే గ్రంధిని ఛేదించినవారు, ఆత్మజ్ఞానాన్ని పొందినవారు, సర్వజన సమ్మాన్యులు అయిన సజ్జనులను అన్ని విధాలా సేవించాలి. సాధు సాంగత్యమనేదే సంసార సాగరాన్ని తరించటానికి ఉత్తమమైన సాధనం.

వివేకంతో కూడిన ఆత్మ విచారణ, సంతోషము, శమము, సాధుసాంగత్యము అనే నాలుగూ సంసార బంధనాల నుండి విముక్తి పొందటానికి సాధనాలు. ఈ నాల్గింటినీ అభ్యాసం ద్వారా సాధించినవాడు మోహవార్ధియైన ఈ సంసారాన్ని తరిస్తాడు. రామా! ఈ సమస్త సద్గుణాలు నీలో ఉన్నాయి. మానసికమైన మోహాన్ని పోగొట్టజాలిన నా మాటలు విను! అరిమర్దనుడా! మోక్షప్రాప్తికి

అవసరమైన ఈ నాల్గింటిని గూర్చిన వృత్తాంతాన్ని విన్నవానికి, తాను కోరకపోయినా బలవంతంగా నైనా జ్ఞానోదయం అవుతుంది. మానవునికి జ్ఞానోదయం అయినప్పుడు, అతని బుద్ధియందలి లోభం, మోహం మొదలైన దోషాలన్నీ తొలగిపోతాయి. అతని మనస్సు, శరత్కాలంలోని సరోవరం లాగా నిర్మలము, ప్రసాద గుణ పరిపూర్ణమూ అవుతుంది.

**దైన్య దారిద్ర్యదోషాఢ్యా దృష్టయో దర్శితాంతరాః**
**న నికృన్తన్తి మర్మాణి స సన్నాహమి వేషవః** 93
**హృదయం నావలుం పన్తి భీమాః సంసృతి భీతయః**
**సామ్యం పరముదేత్యన్త ర్నిర్మందర ఇవార్ణవః** 94
**సముద్రస్యేవ గాంభీర్యం స్థైర్యం మేరోరివ స్థితిః**
**అన్తః శీతలతా చేన్దో రివోదేతి విచారిణః** 95
**సచ్ఛాస్త్ర సాధువృత్తీనా మవిరోధిని కర్మణి**
**రమతే ధీర్యథాప్రాప్తే సాధ్వీవాన్తః పురాజిరే** 96

జ్ఞానవంతుడు దైన్యము దారిద్ర్యము మొదలైన దోషాలు లేనివాడై ఉంటాడు. మంచి కవచాన్ని ధరించిన వానిని బాణాలు ఛేదింపజాలవు. అట్లాగే జ్ఞానవంతుని దైన్యాది దోషాలు ఏమీ చేయలేవు. సాంసారికమైన భయాలు - మాటి మాటికి కలిగే జన్మ మరణ భయాలు - ప్రబుద్ధుడైనవాని ( జ్ఞానియొక్క ) హృదయాన్ని ఛేదింపలేవు అంతే కాదు, మందరాచల రహితమైన సాగరంలాగా అతని హృదయం సమభావాన్ని పొంది ఉంటుంది. విచార శీలుడైన వాని అంతఃకరణం సముద్రంలాగా గంభీరంగాను, మేరువు పర్వతం లాగా నిశ్చలంగాను, చంద్రుని లాగా శీతలంగానూ ఉంటుంది. గాంభీర్యము, స్థిరత్వము, ప్రశాంతత అనేవి విచారశీలుని అంతఃకరణ ధర్మాలు.

సచ్ఛాస్త్రాల ఆదేశాన్ననుసరించి, సాధు వృత్తి కలవాడు చేసే కర్మలందు వైరుధ్యం ఏమీ ఉండదు. అతని బుద్ధి అంతఃపురాంగణంలో విహరించే సాధ్వీలలామలాగా రమిస్తూ ఉంటుంది.

**సాజీవన్ముక్తితా తస్య శనైః పరిణతిం గతా**
**శాన్తాశేష విశేషస్య భవత్యవిషయా గిరామ్.** 97
**దృశ్యతే లోక సామాన్యో యథా ప్రాప్తాను వృత్తిమాన్**
**ఇష్టానిష్ట ఫలప్రాప్తౌ హృదయేనా పరాజితః** 98

సుఖాసనో పవిష్టేన యథా సంభవ మశ్నతా
భోగజాలం సదాచార విరుద్ధేషు నతిష్నతా 99
యథాక్షణం యథాదేశం ప్రవిచారయతా సుఖమ్
యథా సంభవ సత్సంగమిమం మోక్ష కథాక్రమమ్. 100
అసాద్యతే మహోన్యేన బోధః సంసార శాన్తిదః
న భూయో జాయతే యేన యోనియన్త్రప్రపీడనమ్ 101
ఏతావత్యపి యే భీతాః పాపా భోగరసే స్థితాః
స్వమాతృ విష్ఠే కృమయః కీర్తనీయా న తేధమాః 102
శాస్త్రోపశమ సౌజన్య ప్రజ్ఞాతజ్ఞ సమాగమైః
అన్తరాన్తర సంపన్న ధర్మార్థోపార్జన క్రియః 103

ఆ విధంగా పరమశాంతిని పొందిన ఆతని జీవన్ముక్తస్థితి, క్రమంగా పరిపక్వమై మాటలకు అందనిదౌతుంది. - ఆ స్థితిని మాటలతో వర్ణించలేము. శాస్త్ర విధి ననుసరించి, లోక వ్యవహారాన్ని అనుసరించి జీవించే జీవన్ముక్తుని స్థితి ఆరంభంలో లోక సామాన్యం గానే కనిపిస్తుంది. అభీష్ట ఫలప్రాప్తి యందు గాని, అనిష్ట ఫలప్రాప్తియందు గాని ఆతని హృదయం వికృతిని పొందదు. ఇష్టానిష్టా లు రెండూ ఆతనికి సమానములే!

సుఖాసనంలో కూర్చుంటూ, లభించిన ఆహారాన్ని భక్షిస్తూ, సదాచారానికి విరుద్ధమైన భోగాలను అనుభవించకుండా ఉంటూ, దేశ కాలానుసారంగా, సుఖపూర్వకంగా మోక్ష కథా ప్రసంగాలు చేస్తూ, ఆత్మతత్త్వ విచారణను చేస్తూ, అపరోక్షాను భూతిని పొందుతూ ఉండే వానికి, మళ్ళీ మాతృయోని ప్రపీడనమనేది (పునర్జన్మమనేది ) ఉండదు.

ఇటువంటి జన్మసమయంలో కలిగే బాధను గూర్చిన భయం లేని పాపి, లౌకిక భోగ రసాస్వాదనలోలుడై ఉంటాడు. అట్టివానికే మాతృమలంలోని క్రుములతో ఉండేగతి పడుతుంది. (పునర్జన్మ ఉంటుంది) అట్టి అధముల విషయం చెప్పనక్కర లేదు. ముముక్షువు, శమము, శాస్త్రజ్ఞానము, శ్రవణ మనన నిది ధ్యాసలతో కూడిన సదాచార పరాయణుడై, శాంత చిత్తులు, ఉత్తమబుద్ధిసంపన్నులు అయినవారి సాంగత్యం ద్వారా ధర్మార్థాలను సంపాదించాలి.

తావద్విచారయేత్ప్రాజ్ఞో యావద్విశ్రాన్తి మాత్మని
సంప్రయాత్య పునర్నాశాం శాంతిం తుర్యపదాభిధామ్. 104
తుర్య విశ్రాన్తియుక్తస్య ప్రతీపస్య భవార్ణవాత్
జీవతోజీవతశ్చైవ గృహస్థ స్యాథవా యతేః 105
న కృతేనాకృతేనార్థోన శ్రుతిస్మృతి విభ్రమైః
నిర్మందర ఇవాంభోధిః స తిష్ఠతి యథాస్థితమ్. 106
శ్రుణుతావది దానం త్వం కథ్యమాన మిదం మయా
రాఘవ జ్ఞాన విస్తారం బుద్ధి సారాన్తరాన్తరమ్ 107
యుక్తి యుక్త ముపాదేయం వచనం బాల కాదపి
అన్యత్తృణ మివ త్యాజ్య మయుక్తం పద్మయోనినా 108
యైర్యైః కాకుత్ఝ దృష్టాన్తై స్త్వం మయేహావ బోధ్యసే
సర్వే సకారణాస్తే హి ప్రాప్యస్తు సదకారణమ్ 109
బ్రహ్మోపదేశ దృష్టాన్తో యస్త్వేహ హి కథ్యతే
ఏక దేశ సధర్మిత్వం తత్రాన్తః పరిగృహ్యతామ్. 110

విద్వాంసుడైన వాడు తన ఆత్మకు ఎన్నడూ వినష్టం కాని తురీయమనే పరమశాంతి లభించేటంత వరకు ప్రయత్న పూర్వకంగా విచారణ సాగిస్తూనే ఉండాలి. తురీయమనే పరమశాంతితో కూడిన వాడు, ఈ భవసాగరాన్ని దాటిన వాడై ఉంటాడు కాబట్టి, అతడు గృహస్థుడైనా, సన్యాసి అయినా, అతనికి జీవన్మరణాలతో గాని, కర్మాకర్మలతో గాని, శ్రుతి స్మృతి నియమాలతో గాని, ఎట్టి ప్రయోజనమూ ఉండదు. అట్టివాడు ఎల్లప్పుడు నిర్మందర సాగరం లాగా స్థిర చిత్తంతో ప్రశాంతంగా ఉంటాడు.

రాఘవా! నేను చెప్పే విషయం విను! బుద్ధికి అంతరాంతరాల్లో ఉండే జ్ఞాన సారాంశాన్ని గూర్చి చెపుతున్నాను. ఇది జ్ఞాన భాండాగారం. దీనిని తెలుసుకో!

యుక్తియుక్తము, సమంజసము అయిన మాటను పిల్లవాడు చెప్పినా వినాలి. యుక్తియుక్తము కాని దానిని, అసమంజసమైన దానిని బ్రహ్మదేవుడు చెప్పినా విననక్కర లేదు. మాటలలోని సారాన్ని బట్టే మాటలకు గౌరవం ఉంటుంది.

ఓ రామచంద్రా! ఇప్పుడు నేను ఏ ఏ దృష్టాంతాలతో నీకు జ్ఞాన బోధ చేస్తున్నానో ఏ ఏ దృష్టాంతాలతో నీవు జ్ఞానాన్ని పొందుతున్నావో వాటి అన్నింటికీ కారణమైన బ్రహ్మను పొందు. బ్రహ్మోపదేశ సందర్భంలో చెప్పే దృష్టాంతాలన్నీ ఏక

దేశీయమైనవే! వాటి యందలి పరమార్థాన్నే గ్రహించాలి.

ఏవం సతి నిరాకారే బ్రహ్మణ్యాకార వాన్కథమ్
దృష్టాన్త ఇహ చోద్యస్తి మూర్ఖం వైకల్పికోక్తయః 111
నను తార్కికతామేత్య నాశనీయా ప్రబుద్ధతాః
అనుభూత్య పలాపాన్తై రపవిత్రై ర్వికల్పితైః 112
గుణాః శమాదయో జ్ఞానాచ్ఛమాదిభ్యస్తథా జ్ఞతా
పరస్పరం వివర్ధన్తే ద్వే పద్మ సరసీ ఇవ 113
న యావ త్సుసమభ్యస్తౌ జ్ఞానసత్పురుషక్రమౌ
ఏకోపి నోన యోస్తావ త్పురుష స్యేహ సిద్ధిదః 114
ఇదం యశస్య మాయుష్యం పురుషార్థ ఫలప్రదమ్
శ్రుత్వా త్వం బుద్ధినైర్మల్యాద్బలా ద్యాస్యసి తత్పదమ్ 115
విదిత వేద్యమిదం హి మనో మునేర్వివశమేవ
హి యాతి పరం పదమ్
యదవ బుద్ధ మఖండిత మక్రమం
తదవబోధ దశాం న జహాతి హి. 116

(ముముక్షు వ్యవహార ప్రకరణం సమాప్తం)

అందుకే నిరాకారమైన బ్రహ్మ విషయంలో సాకారమైన దృష్టాంతాలు ఎట్లా సరిపోతాయి? ఎట్లా అన్వయిస్తాయి? అని ఈ విధమైన అనుమానాలు కుతర్కాలు మూర్ఖులకు కలుగుతూ ఉంటాయి. మూర్ఖులకు కలిగే కుతర్కాలు, వికల్పాలు నీకు కలుగ కూడదు. అవి జ్ఞానాన్ని నాశనం చేస్తాయి. అనుభూతిని కాదంటాయి. అపవిత్రార్థాలను కలిగిస్తాయి. కాబట్టి అవి అపవిత్రాలు.

(వికల్పాలు ఇట్లా ఉంటాయి - బ్రహ్మము సద్వితీయమా అద్వితీయమా? సద్వితీయం - వేరొకటి ఉన్నదీ అంటే అపసిద్ధాంతం అవుతుంది. సత్సిద్ధాంతానికి విపరీతం అవుతుంది. అద్వితీయం అంటే గురు శాస్త్రాదుల అభావం వల్ల జ్ఞానోత్పత్తి కాకుండాపోతుంది. బ్రహ్మను సప్రమాణము అనిఅంటే, అద్వైతమనే వాదానికి క్షతి కలుగుతుంది. అప్రమాణము అని అంటే ప్రమేయం కాకుండా పోతుంది.)

జ్ఞానం వల్ల శమాది గుణాలు వృద్ధి చెందుతాయి. శమాది గుణాల వల్ల విజ్ఞాత యొక్క వృద్ధి కలుగుతుంది. ఇట్లా సరస్సు, పద్మాలు లాగా పరస్పర వివర్ధనములౌతాయి.

శమాదులతో కూడిన తత్త్వ విచారణ ముముక్షువుకు అవసరం అని లోగడ చెప్పబడ్డది. నిది ధ్యాసన పూర్వకంగా స్వరూపజ్ఞానాభ్యాసం చేయాలి. బహిర్ముఖమైన చిత్తం ద్వారా అది సాధ్యం కాదు. అంతర్ముఖుడై ఆత్మతత్త్వాన్ని చూస్తున్నంత సేపూ శమాది గుణ సమన్వితుడై ఉంటాడు. శమాది గుణ సమన్వితుడై ఉన్నంత సేపూ ఆత్మత్త్వాన్ని దర్శిస్తాడు. జ్ఞానాభ్యాసము, శమ దమ సంతోషాదుల అభ్యాసము ఒకేసారి జరగాలి. రామా! ఈ కీర్తిని యిచ్చేదీ, ఆయుర్దాయాన్ని వృద్ధి చేసేదీ, పురుషార్థాన్ని - మోక్షాన్ని - యిచ్చేదీ అయిన ఈ విషయాన్ని విన్నందు వల్ల బుద్ధి నిర్మలమై తప్పకుండా పరమపదాన్ని పొందుతారు.

ఒక్కసారి ఆ స్వరూపజ్ఞానం కలిగితే ఇక దానికి మరపు అంటూ ఉండదు. జ్ఞేయ వస్తువును గూర్చిన జ్ఞానాన్ని పొందిన ముని తప్పక పరమపదాన్ని పొందుతాడు. అపరిచ్ఛిన్నము, జ్ఞానస్వరూపము అయినందువల్ల ఆ పరమాత్మ విద్వాంసుని మనస్సును వదలడు.

(యోగ వాసిష్ఠ సారంలో ముముక్షు వ్యవహార ప్రకరణం సమాప్తం)

# 3. ఉత్పత్తి ప్రకరణము

## ఒకటవ సర్గ

ఈ ఉత్పత్తి ప్రకరణంలో తొమ్మిది ఉపాఖ్యానాలు ఉన్నాయి. 1. ఆకాశజోపాఖ్యానం, 2. లీలోపాఖ్యానం, 3. కర్కటోపాఖ్యానం 4. ఐందవోపాఖ్యానం , 5. ఇంద్రోపాఖ్యానం , 6. చిత్తోపాఖ్యానం, 7. బాలకోపాఖ్యానం, 8. శాంబరి కోపాఖ్యానం, 9. లవణోపాఖ్యానం

వసిష్ఠుడు ఇంకా ఈ విధంగా అన్నాడు - '' రాఘవా! ముక్తిని కోరేవాని నడవడి ఎట్లా ఉండాలో నీకు చెప్పాను. ఇప్పుడు నీకు ఈ జగత్తు యొక్క ఉత్పత్తిని గూర్చి చెపుతాను. ఈ జగత్తు యొక్క సత్త - ఉనికి - ఉన్నంత వరకు సంసార బంధమనేది ఉంటుంది. కాబట్టి, ఈ దృశ్య జగత్తు యొక్క స్వరూపాన్ని గూర్చిన జ్ఞానం అవసరం.

జీవుడు చిత్ప్రతిబింబ లక్షణుడు. జీవుని పురుషుడు అని కూడా అంటారు. సంవిద్రూపుడైన ఆ పరమాత్మయే తన అవిద్యా రూపమైన చిత్తాన్ని ఉపాధిగా గ్రహించి పురుషుడు ( జీవుడు) అవుతున్నాడు. ఈ పరమాత్మయే సంకల్ప వికల్పాల వల్ల, భ్రమ సంశయాదుల వల్ల, జలం తరంగాదుల రూపంలో స్ఫురించినట్లుగా, ఈ దృశ్య జగత్పదార్థాలుగా స్ఫురిస్తున్నాడు. నిజానికి ఈ దృశ్య జగత్తాంతా పరబ్రహ్మమే తప్ప ఇతరమేదీ కాదు. (''తదాత్మానం స్వయమ కురుతే''. అనే తైత్తిరీయ శ్రుతివాక్యం స్వీయ మాయద్వారా పరమాత్మయే జగదుత్పత్తి కారణం అని తెలుస్తోంది) ''సర్వం ఖల్విదం బ్రహ్మ'' అనే శ్రుతి వాక్యం ప్రకారం ఈ జగత్తు అంతా పరబ్రహ్మ యొక్క కార్యం. కాబట్టి కారణస్వరూపమైన బ్రహ్మము తప్ప ఈ సమస్త దృశ్య జగత్తూ అసత్యమే! (''వాచారంభణం వికారో నామ ధేయం మృత్తికేత్యేవ సత్యం'' అనే శ్రుతివాక్యం ఈ విషయాన్నే చెపుతోంది. ఈ విషయాలనే వసిష్ఠుడు విశదీకరిస్తున్నాడు)

ఈ దృశ్య జగత్తే బంధ కారణం అంటూ వసిష్ఠుడిట్లా అన్నాడు -

బంధోయం దృశ్యసద్భావా దృశ్యాభావేన బంధనమ్
న సంభవతి దృశ్యం తు యథేదం శ్రుణు కథ్యతే 1
యదిదం దృశ్యతే సర్వం జగత్ స్థావర జంగమమ్
తత్సుషుప్తా వివ స్వప్నః కల్పాన్తే ప్రవినశ్యతి 2

ఈ కనిపించే అసత్యమైన జగత్తును సత్యమని మనం భావించటమే బంధం. సత్యమైన పరమాత్మ స్వరూపాన్ని గుర్తించకుండా అసత్పదార్థాలను సత్యమని అనుకోవటమే బంధనం. ఈ స్థావర జంగమాత్మకమైన దృశ్యం అంతా (జగత్తంతా) నాశనమైపోయేదే! సుషుప్తి రాగానే - గాఢ నిద్ర కలిగినంతనే స్వప్నము, స్వప్నంలోని దృశ్యాలు, అనుభూతులు అన్నీ మాయమైపోయినట్లే, కల్పాంతంలో ఈ దృశ్య జగత్తంతా మాయమైపోతుంది. మరి ఆ స్థితిలో మిగిలి ఉండేది ఏమిటి? అంటే -

**తతః స్తిమిత గంభీరం న తేజో న తమస్తతమ్**
**అనాఖ్య మనభివ్యక్తం సత్కించి దవశిష్యతే** 3
**ఋతమాత్మా పరంబ్రహ్మ సత్యమిత్యాదికా బుధైః**
**కల్పితా వ్యవహారార్థం తస్య సంజ్ఞా మహాత్మనః** 4
**స తథా భూత ఏవాత్మా స్వయ మన్య ఇవోల్లసన్**
**జీవితా ముపయాతీ. భావినామ కదర్థితామ్** 5
**తతః స జీవశబ్దార్థః కలనా కులతాం గతః**
**మనో భవతి భూతాత్మా మననా న్మంథరీ భవత్,** 6
**మనః సంపద్యతే నామ మహతః పరమాత్మనః**
**సుస్థిరా దస్థిరా కారం తరంగ ఇవ వారిధేః** 7

స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తు లయమై పోగా ఇక తేజస్సూ ఉండదు, తిమిరమూ ఉండదు. ఉండే దల్లా స్థిరము, గంభీరము, అపరిచ్ఛేద్యము, సత్యము, ఇంద్రియాలకు గోచరం కానట్టి, ఫలానా అని చెప్పటానికి వీలుకానట్టి సత్పదార్థమే! ఆ సత్పదార్థాన్నే బుధులు, ఆత్మ అనీ, పరబ్రహ్మమనీ, సత్యం, జ్ఞానము, అనంతమూ అనీ వ్యవహారం కోసం పేర్లు పెట్టి చెపుతూ ఉంటారు.

**ప్రపంచోత్పత్తి :** ఆ సత్పదార్థమైన పరమాత్మయే స్వచ్ఛమైన జలంతో ఆకాశం లాగా ప్రతిఫలిస్తూ ఇతరుని లాగా జీవ భావాన్ని పొందుతున్నాడు. పిమ్మట సంకల్ప వికల్పాత్మకమైన మనస్సు రూపాన్ని పొందుతున్నాడు. భూతాలకు కారణమైనందున భూతాత్మ - ప్రాణం - అవుతున్నాడు. సత్యస్వరూపుడు, నిత్యుడు అయిన ఆ పరమాత్మను 'మనస్సు' అని ఎట్లా అనగలుగుతాము? అంటే - సుస్థిరమైన సముద్రంలో, అస్థిరమైన తరంగం లాంటిదే ఆ మనస్సు! ఆ తరంగం సముద్రం కంటె భిన్నమైనది కాదు గదా!

తత్స్వయం స్వైరమేవాశు సంకల్ప యతి నిత్యశః
తేనేయ మింద్రజాల శ్రీ ర్వాగతీ ప్రవితన్మతే 8
యథా కటక శబ్దార్థః పృథక్త్వార్హో న కాంచనాత్
న హేమ కటకా త్తద్వజ్జగచ్ఛబ్దార్థతా పరే 9
అసత్యైవ సతీ తావన ద్యేవ లహరీ చలా
మనసై వేంద్రజాల శ్రీ ర్వాగతీ ప్రవితన్యతే 10
అవిద్యా సంసృతిర్మోహో బంధో మాయా మలం తమః
కల్పితా నీతినా మాని తస్యాః సకల వేదిభిః 11
బంధస్య తావద్రూపం త్వం కథ్యమాన మిదం శ్రుణు
తతః స్వరూపం మోక్షస్య జ్ఞాస్యసీన్ధు సమానస 12
ద్రష్టు ర్దృస్య సత్తాంగ బన్ధ ఇత్యభిధీయతే
ద్రష్టా దృశ్యవశాద్బద్ధో దృశ్యాభావే విముచ్యతే 13
జగత్వ మహ మిత్యాది సర్గాత్మా దృశ్యముచ్యతే
యావదేత త్సంభవతి తావన్మోక్షో న విద్యతే 14
ఆనీలవల్లరీ రూపం యథా పద్మాక్ష కోటరే
ఆస్తే కమలనీ బీజం తథా ద్రష్టరి దృశ్యధీః 15
యథాం కురోస్తర్బీజస్య సంస్థితో దేశకాలతః
తనోతి భాసురం దేహం తనోత్యేవం హి దృశ్యధీః 16
ద్రవ్యస్య హృద్యేవ చమత్కృతి ర్యథా
సదోదితా స్వస్తమయో క్షితోదరే
ద్రవ్యస్య చిన్మాత్ర శరీరిణ స్తథా
స్వభావ భూతా స్ప్వదరే జగత్ స్థితిః 17

ఆ మనస్సు నిత్యమూ, తొందర తొందరగా సంకల్ప వికల్పాలను సృష్టిస్తూ ఉంటుంది. ఆ సమష్టి మనస్సు వల్లనే శబ్దాది పంచతన్మాత్రలు, ఆకారాదులు, పంచ మహాభూతాలూ, ఇంద్రజాలంలో లాగా రచింపబడుతున్నాయి. బంగారంతో కడియం చేస్తున్నారు. పేరు భిన్నమే తప్ప కడియం సైతం బంగారమే! అట్లాగే, పరమాత్మకు, జగత్తుకు భేదం లేదు.

ఎండమావుల్లో నీరు లాగా, అలల్లాగా మనస్సు చేతనే జగత్తు అనే ఇంద్రజాలం పరివ్యాప్తమౌతోంది. యదార్థానికి ఈ జగత్తు మిథ్యే! పండితులు ఈ ఇంద్రజాలానికే

అవిద్య అనీ, సంసృతి అనీ, మోహం అనీ, బంధం అనీ, మాయ అనీ, మలం అనీ తమస్సు అనీ అనేకమైన పేర్లను కల్పిస్తారు.

శ్రీరామచంద్రా! ఈ బంధ స్వరూపాన్ని గురించి చెపుతాను. విను. ఈ బంధ స్వరూప జ్ఞానం కలిగితే మోక్ష స్వరూప జ్ఞానమూ కుగుతుంది.

ఈ దృశ్య జగత్తులో సద్భావాన్ని (సత్యమనే భావాన్ని) కలిగి ఉండటం బంధమౌతుంది. ఈ జగత్తులో అభావాన్ని (జగత్తు అసత్యం అనే భావాన్ని పొందితే ముక్తుడౌతాడు. ద్వైత ప్రపంచమే దృశ్య జగత్తు. అంటే నీవు, నేను అనే భ్రమనే దృశ్యం అంటారు. ఈ విధమైన దృశ్య జగద్భావం ఉన్నంత వరకు మోక్షం ఉండదు. పద్మం యొక్క బీజంలో సంస్కార రూపంలో పద్మం యొక్క ఆకులు తీగ, పూలు వగైరాలన్నీ దాగి ఉన్నట్లే, దృశ్యం అంతా ద్రష్టలో దాగి ఉంది. విత్తనం దేశ కాలాలను బట్టి చెట్టుగా మారుతోంది. అట్లాగే ఈ దృశ్యానికి సంబంధిచిన భావాలు మనస్సులో పెరిగి అనుకూల పరిస్థితుల వల్ల పెద్దవౌతాయి. అట్లాగే జీవుని మనస్సులో ఈ దృశ్య ప్రపంచం ఒకప్పుడు ఉంటుంది. మరొకప్పుడు ఉండదు. పరిస్థితుల్ని బట్టి ఒక్కొక్కప్పుడు అణచివేయబడుతుంది.

## ఆకాశజోపాఖ్యానము

వసిష్ఠుడు ఇంకా ఇట్లా అంటున్నాడు-

రామచంద్రా! నీకు ఈ దృశ్య ప్రపంచాన్ని సృష్టించిన ఆది సృష్టికర్తను గూర్చి చెపుతాను విను.

ఒకప్పుడు 'ఆకాశజుడు' అనే ధర్మపరాయణుడైన బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు ధ్యానైక నిష్ఠుడై సదా ప్రజల హితాన్ని కోరేవాడు. 'ఆకాశము' అంటే బ్రహ్మ. కాబట్టి ఇది బ్రహ్మోపాఖ్యానమే! ఈ బ్రహ్మ చిరంజీవిగా ఉండటం చూచి మృత్యువు ఇట్లా అనుకున్నది - ''నేను ఎటువంటి వారినైనా చంప గలుగుతున్నాను. కాని, ఆకాశోత్పన్నుడైన ఇతనిని (ఆకాశజుడనే బ్రాహ్మణుని) చంపలేకుండా ఉన్నాను. ఎందుచేత ?'' అని ఆలోచించి మృత్యువు, ఆకాశజుడు ఉండే పట్టణానికి వెళ్ళింది. అక్కడ నివసించే వారంతా తమ తమ ఉద్యమాల్ని ఆపటం లేదు. తమ పనిలో విజయం పొందేటంత వరకు తమ ప్రయత్నాన్ని విరమించటం లేదు.

మృత్యువు ఆకాశజుని యింటికి వెళ్ళింది. అతడు భయంకరమైన

అగ్నిజ్వాలలచే చుట్టబడి ఉండటాన్ని చూచింది. అతనిని పట్టుకోవటానికై తన వేయి చేతులను చాపింది. కాని ఆకాశజుని పట్టుకొనలేకపోయింది. మృత్యువు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమై పోయినాయి.

మృత్యువు యముని వద్దకు వెళ్ళి తన అసమర్థతను చెప్పి, ఆకాశజుని చంపలేకపోవటానికి కారణం అడిగింది. యముడిట్లా అన్నాడు -

''ఓ మృత్యువా! నీవు నీ శక్తితో ఎవరినీ చంపలేవు. జీవులు తాము పూర్వం చేసిన కర్మల వల్లనే చావును పొందుతున్నారు - నీ శక్తి వల్ల కాదు. నీవు అతనిని (ఆకాశజుడు) చంపాలని అనుకుంటే ముందుగా ఆతడు చేసిన పూర్వ కర్మలలో చావుకు కారణమైన కర్మలున్నాయా? లేదా? అని వెదకు!'

యముడు చెప్పిన మాటలు విన్న మృత్యువు ఆ ద్విజుని పూర్వ కర్మల కోసం అన్ని దిక్కులలోను, అన్ని లోకాల్లోను, నదీ నదాల్లో, పర్వతాల్లో అంతటా వెదకింది. కాని ఆకాశజుని పూర్వకర్మలు ఎక్కడా కనిపించలేదు. మళ్ళీ యముని వద్దకు వెళ్ళి అడిగింది - ప్రభూ! ఆద్విజుని కర్మలు ఎచట ఉన్నాయో చెప్పండి'' అని

యముడు చాలా సేపు ఆలోచించి ఇట్లా అన్నాడు -

''ఓ మృత్యువా! ఆకాశజుని పైన కర్మలు ఏవీ లేవు. ఇతడు ఆకాశం నుండి పుట్టినవాడు. ఇతడు పరమాత్మకు ప్రతిబింబరూపంగా, సహకారి కారణం లేకుండా పుట్టినవాడు. కాబట్టి ఆకాశం లాగానే కర్మలు గాని, మనస్సుగానీ ఇతనికి లేవు. సహకార కారణాలు లేకుండా పుట్టినవాడు తనకు కారణమైన దాని కంటె భిన్నుడు కాడు. జలంలో ప్రతిబింబించిన చంద్రుడు తనకు కారణమైన అసలు చంద్రుని కంటె భిన్నుడు కానట్లుగా ఇతడు కూడా కర్మ రహితుడు, శూన్య స్వరూపుడు అయిన ఆకాశం కంటె భిన్నుడు కాడు. ఇతడు స్వయంభువుడు. ఈతడు చిదాకాశం కంటె భిన్నుడు కాడు. చిదాకాశానికి ఆది మధ్య అంతములనేవి లేవు. తన మనస్సు ద్వారా తన యిష్టాన్ని బట్టి నిరాకారుడుగా ప్రకాశిస్తున్నాడు. కాబట్టి ఈతనిని చంపాలనే యత్నాన్ని నీవు విరమించుకో!''

ఇది విన్న మృత్యువు యముణ్ణే ఇట్లా అడిగాడు -

''అయ్యా! ఆకాశమంటే శూన్యమే గదా! ఆకాశం నుండి - శూన్యం నుండి - ఈ బ్రాహ్మణుడు ఎట్లా పుట్టాడు? ఈ భూమ్యాది భూతాలు ఒకప్పుడు ఉండటానికీ ఒకప్పుడు లేకపోవటానికీ కారణం ఏమిటి?'' అని.

యముడిట్లా అన్నాడు - '' ఆ బ్రాహ్మణుడు (ఆకాశజుడు) ఎన్నడూ పుట్టలేదు. అతడు శాశ్వతుడు. విజ్ఞానానికి అతడు ప్రతీక. లయ కాలంలో ఏమీ ఉండదు. అద్వితీయుడు, నిరాకారుడు, శాశ్వతుడు, శూన్యుడు, అయిన పరమాత్మ మాత్రమే మిగిలి ఉంటాడు. అట్టి వానిని కబళించాలని యత్నం చేయకు. ''ఈ మాటలు విని మృత్యువు వెళ్ళిపోయాడు.

ఇదంతా విన్న శ్రీరాముడు వసిష్ఠుని ఇట్లా అడిగాడు -

''మునీంద్రా! మీరు చెప్పిన బ్రాహ్మణుడు అందరికీ ప్రపితామహుడైన బ్రహ్మయేనా! విజ్ఞాన స్వరూపుడు అజుడు అయిన పరబ్రహ్మయేనా?''

వసిష్ఠుడన్నాడు - '' అవును. లయకాలంలో అందరినీ కబళించే మృత్యువు అలవాటు కొద్దీ పరమాత్మను కూడా గ్రహించాలని అనుకొని, యముని చేత ఉపదిష్టుడై మరలిపోయాడు. పరమాత్మ మనో మాత్రుడు. సంకల్ప మాత్రుడు. మనం మనస్సుతో ఊహించుకొన్న మనిషి, ఊహా మాత్రంగా మనకు కనిపించినట్లే, స్వయంభువుడైన బ్రహ్మయొక్క ఆకారాన్ని కల్పించుకుంటున్నాము. నిజానికి అతడు ద్రష్ట కాడు, దృశ్యం కాడు, దర్శనమూ కాడు. అతడు అద్వితీయుడు. అతనికి శరీరం గాని, ఆకారం గానీ లేదు.''

శ్రీరాముడు ఈ విధంగా అడిగాడు - '' అయ్యా, మనస్సు అనే దాని వల్లనే ఈ జగత్తంతా వ్యాప్తి చెందుతోందనీ, మనో రూపుడయిన బహ్మ వల్లనే లోకసృష్టి జరుగుతోంది. అనీ, ఈ జగత్తు మనో వికారమాత్రమనీ, మీరు చెపుతున్నారు. దయచేసి, ఆ మనస్సుయొక్క స్వరూపం ఎటువంటిదో నాకు చెప్పండి.'' అని.

వసిష్ఠ మహర్షి ఈ విధంగా చెపుతున్నాడు - '' రామా! విను. ఈ మనస్సు యొక్క రూపం కనిపించదు. శూన్యానికి రూపం అనేది ఉండదు గదా! ఆకాశం అనే పేరు ఒకటి మాత్రమే ఉంటుంది. ఆ పేరును బట్టే శూన్యాన్ని ఆకాశంగా తెలుసుకుంటున్నాం .అట్లాగే మనస్సూను. మనస్సు ఆకాశం లాగానే సర్వత్రా ఉంటుంది. సంకల్పం చేయటమనేది మనస్సు యొక్క పని. కాబట్టి, సంకల్పాన్నే మనస్సు అనవచ్చు. సంకల్పం ఉన్నదంటే అక్కడ మనస్సు ఉన్నట్లే! శూన్యం ఉన్న చోట ఆకాశం ఉన్నట్లు! ఈ జగత్తంతా సంకల్ప మయమే! మనోమయమే!

యదార్థానికి దృశ్యం గానీ, ద్రష్టకానీ, దర్శనం కానీ, శూన్యం కానీ, జడం

కానీ, బుద్ధిలో ప్రతిబింబిత చైతన్యం గానీ లేవు. ఉన్నదల్లా శాంతమయమ్మైన ఆత్మయే! ఆ ఆత్మయే అనేక రూపాలుగా వ్యాపించి ఉంది. ఇక్కడ స్ఫురించేదల్లా చంచల శక్తితో కూడిన మనస్సు ఒక్కటే! అదే భ్రమిస్తోంది. స్వర్గ నరకాలకు పోతోంది. వస్తోంది. అదే యాచిస్తోంది. సంసారంలో నిమగ్న మౌతోంది. సంహారం చేస్తోంది. అధోగతి పాలౌతోంది. అదే మోక్షాన్ని పొందుతోంది. కాబట్టి, మనస్సు తప్ప జగత్తంటూ ఏదీ లేదు. దృశ్యాన్ని విస్తరింపచేస్తూ కైవల్య ప్రాప్తికి ఈ మనస్సే అడ్డుగా ఉంటోంది.

వసిష్ఠుడింకా యిలా అన్నాడు -

''ఓ రామా! మహాప్రళయం సంభవించినప్పుడు ఈ జగత్తు అనే దృశ్యం అంతరించిపోతుంది. నిర్వికల్ప బ్రహ్మ మాత్రమే మిగిలి ఉంటాడు. ఏ పరమాత్మను గూర్చి వాక్కు వర్ణించలేదో, అట్టి మహేశ్వరుడు, ప్రకాశ స్వరూపుడు, అజుడు అయిన పరబ్రహ్మయే మిగిలి ఉంటాడు.

ఆ పరమాత్మనే సాంఖ్యులు పురుషుడనీ, వేదాంతులు బ్రహ్మమనీ, శూన్యవాదులు శూన్యమనీ, విజ్ఞాన వాదులు విజ్ఞానమనీ అంటారు. అతడే అన్ని జీవుల యందు తెలిసికొనే వాడు. అనుభవించేవాడు. చూచేవాడు, చేసేవాడుగా ఉంటున్నాడు. అతడు సత్ అయినప్పటికి 'అసత్' గా కనిపిస్తాడు. మన ఈ శరీరాల్లో ఉంటున్నా ఎక్కడో ఉన్నట్లుగా అనిపిస్తాడు. అతడు స్వయం ప్రకాశుడు. సూర్యుని నుండి కిరణాలు వచ్చినట్లుగా పరమాత్మ నుండే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు - సృష్టి స్థితి లయకారకులు ఉద్భవిస్తున్నారు. అయినా, ఆపరమాత్మ మాత్రం నిర్వికారుడు, అద్వితీయుడు.

కుర్వన్నపీహ జగతాం మహతామనన్తం
వృన్దం కించన కరోతి కదాచనాపి 18
స్వాత్మన్యవస్తమయ సంవిది నిర్వికల్పే
త్యక్తోదయ స్థితి మతిః స్థిత ఏక ఏవ 19
భిద్యతే హృదయ గ్రంథి చ్ఛిద్యన్తే సర్వసంశయాః
క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్దృష్టే పరావరే 20

(ముండకోపనిషత్తు 2- 2 -8 )

తన మాయ ద్వారా ఇంత గొప్ప జగత్తుల సమూహాన్ని సృష్టిస్తున్నప్పటికీ, నిజానికి అతడేమీ చేయటం లేదు. నాశరహితుడు, నిర్వికల్పుడు, అద్వితీయుడు. అట్టి పరమాత్మ యొక్క సాక్షాత్కారం కలిగినంతనే హృదయ గ్రంథులన్నీ - అహంకారాది అజ్ఞాన జన్యములైన భ్రమలన్నీ - తొలగిపోతాయి. సంశయాలన్నీ తొలగిపోతాయి. ఆతని మంచి, చెడు కర్మలన్నీ క్షయమైపోతాయి.

ఇది విన్న శ్రీరాముడు ఈ విధంగా అడిగాడు-

**ఇయతో దృశ్య జాతస్య బ్రహ్మాండస్య జగత్ స్థితేః**
**మునే కథమసన్నాసి క్వ మేరు సర్షపోదరే** 21

ఓ మునీశ్వరా! ఈ మన కండ్లకు ఇట్లా కనిపిస్తూ ఉన్నట్టి ఈ జగత్తు అసత్యం (మిథ్య) ఎట్లా అవుతుంది? పరమాణు స్వరూపుడైన పరమాత్మలో ఇంతటి బ్రహ్మాండం ఆవగింజలో మేరువు పర్వతంలాగా ఎట్లా ఉంది? ''అని

వసిష్ఠ ఉవాచ -

**సాధు సంగమ సచ్ఛాస్త్రపరో భవసి రామ చేత్**
**తర్ది నైరేవ నోమాసైః ప్రాప్నోషీమాం పరాంధియం** 22
**సర్వేషా మితిహాసానా మయం సార ఉదాహృతః**
**శ్రుతేస్మిన్నిర్మలే యస్మాజ్జీవన్ముక్తత్వ మవ్యయమ్** 23
**ఉదేతి స్వయమే వాన్త రిదమేవ విచారయ**
**స్థితమే వాస్త మాయాతి జగద్దృశ్యం విచారణాత్** 24
**నృణాం జ్ఞానైక నిష్ఠానా మాత్మజ్ఞాన విచారిణామ్**
**సా జీన్ముక్త తోదేతి విదేహోన్ముక్త తైవ యా.** 25

వసిష్ఠు డిట్లా అన్నాడు - రామా! సాధు సాంగత్యము, సచ్ఛాస్త్ర పరాయణత్వము అనే వాటి వల్ల అద్వైతజ్ఞానం పొందటానికి ఒక నెల రోజులు చాలు. మన భారతాది ఇతిహాసాల్లోను, నేను చెప్పే ఈ ఇతిహాసాల్లోనూ అద్వైత జ్ఞానం నిండి ఉంది. దానిని విని అవ్యయమైన జీవన్ముక్తిని పొందవచ్చు.

శ్రవణమననాదుల వల్ల అద్వైత జ్ఞానం ఉదయిస్తుంది. అప్పుడు నీవే ఆలోచించవచ్చు. అట్లా విచారణ చేయగా చేయగా ఈ కనిపించే జగత్తంతా బుద్ధిలో లయమైపోతుంది. ఎండమావిలోని నీరు లాంటిదని తెలిసిపోతుంది.

ఇట్లా దృశ్యం మాయమైనంతనే ఇక ద్రష్ట దర్శనము సైతం ఉండవు. ఉండేదల్లా బ్రహ్మమే! దృశ్యం ఉంటేనే ద్రష్ట ఉంటాడు. ద్రష్ట ఉంటే దృశ్యమూ ఉంటుంది. కాబట్టి దృశ్యమనేది లేకపోతె ద్వంద్వమనేది ఉండదు ఈ విధంగా ఆత్మజ్ఞాన విచారణ చేసి, జ్ఞాన నిష్ఠుడైన వానికి జీవన్ముక్త స్థితి లభిస్తుంది.

శ్రీరామ ఉవాచ-

బ్రహ్మన్విదేహ ముక్తస్య జీవన్ముక్తస్య లక్షణమ్
బ్రూహియేన తథైవాహం యతే శాస్త్ర (గయా దృశా) దృశాధియా 26

శ్రీరాముడిట్లా అంటున్నాడు - '' మహాత్మా! విదేహముక్తులు, జీవన్ముక్తులు అయినవారి లక్షణాలు ఎట్లా ఉంటాయి? నేను కూడా శాస్త్ర విధులపై దృష్టి నుంచి, శాస్త్రములందు చెప్పబడిన అట్టి మానసిక స్థితిని పొందినవాడనై - జీవన్ముక్తుడనయ్యేందుకు ప్రయత్నిస్తాను.''

వసిష్ఠ ఉవాచ -

యథాస్థిత మిదం యస్య వ్యవహారవతోపిచ
అస్తంగతం స్థితం వ్యోమన జీవన్ముక్త ఉచ్యతే. 27
నోదేతి నాస్తమాయాతి సుఖేదుఃఖే ముఖ ప్రభా
యథా ప్రాప్తస్థితిర్యస్య స జీవన్ముక్త ఉచ్యతే 28
యోజాగర్తి సుషుప్తిస్థో యస్య జాగ్రన్న విద్యతే
యస్య నిర్వాసనో బోధః సజీవన్ముక్త ఉచ్యతే 29
రాగద్వేష మయాదీనాం అనురూపం చరన్నపి
యోన్త ర్వ్యోమ వదత్యచ్ఛః సజీవన్ముక్త ఉచ్యతే. 30
యస్య నాహం కృతో భావో యస్య బుద్ధిర్న లిప్యతే
కుర్వతో కుర్వతోవాపి సజీవన్ముక్త ఉచ్యతే 31
యస్మాన్నో ద్విజతే లోకో లోకాన్నో ద్విజతే చయః
హర్షా మర్ష భయోన్ముక్తః సజీవన్ముక్త ఉచ్యతే. 32
శాన్త సంసార కల్లోలః కలావానపి నిష్కలః
యః సచిన్తోపి నిశ్చిన్తః సజీవన్ముక్త ఉచ్యతే 33
యః సమస్తార్థ జాతేషు వ్యవహార్యపి శీతలః
పరార్థేష్వివ పూర్ణాత్మా సజీవన్ముక్త ఉచ్యతే. 34

**జీవన్ముక్త లక్షణము :** వసిష్ఠుడిట్లా అన్నాడు - " రామా! తన నిత్యకృత్యాలన్నీ విధులన్నీ నిర్వహిస్తూ కూడా, ఎవడైతే ఈ ప్రపంచాన్ని ఆకాశం లాగా శూన్యంగా చూస్తూ, అసంగుడుగా ఉంటాడో అట్టివాడు జీవన్ముక్తుడు.

ఎవని ముఖం సంతోషం కలిగినప్పుడు వికసించదో, దుఃఖం కలిగినప్పుడు కుంచించుకుపోదో (ఎవనికి సుఖ దుఃఖాలు రెండూ సమానాలై ఉంటాయో) మంచి గానీ, చెడు గానీ, అన్ని సమయాల్లోను ఎవని స్థితి ఒకే విధంగా ఉంటుందో అట్టివాడు జీవన్ముక్తుడు. వికారం లేని ఆత్మజ్ఞానంతో నిమగ్నుడై జాగ్రత్ స్థితిలో ఉంటూ, బాహ్య దృశ్య ప్రపంచంలో నిద్రిస్తున్నవాడై, వాసనలు లేకపోవటంతో నిర్మలమైన జ్ఞానం కలవాడు జీవన్ముక్తుడు - ఇంద్రియాలతో విషయాలను గ్రహించడు కాబట్టి జాగ్రత్తు లేని వాడుగా ఉంటాడు.

ఆరబ్ధ కర్మ యోగం వల్ల రాగం, ద్వేషం, భయం మొదలైన వాటిని బాహ్యంగా అనుభవిస్తున్నా, ( ఆ గుణాలు కలవాడుగా కనిపించినా ) లోపల మాత్రం నిర్మలమైన ఆకాశంలాగా స్వచ్ఛంగా ఉండేవాడు జీవన్ముక్తుడు.

ఏ విద్వాంసునికి అహంకారం లేదో కర్మలు చేస్తున్నప్పటికీ, చేయనప్పటికీ, కర్తవ్యాకర్తవ్యాలకు అంటకుండా సంచరిస్తూ ఉంటాడో - ఇంద్రియ వ్యాపారాలకు కేవలం సాక్షిభూతుడుగా ఉంటాడో - అట్టివాడు జీవన్ముక్తుడు.

ఎవని వల్ల లోకానికి ఎటువంటి భయమూ ఉండదో, ఎవనికి లోకం వల్ల ఎటువంటి భయమూ ఉండదో, ఎవనికి హర్షము శోకము, క్రోధము, భయము మొదలైనవేవీ ఉండవో అట్టివాడు జీవన్ముక్తుడు.

నిజానికి అవయవాలు ( శరీరం) ఉన్నప్పటికీ, ఎవడు అవయవాలు ( శరీరం) లేనివాడుగా ఉంటాడో ఎవడు చిత్తం ( మనస్సు) ఉన్నప్పటికీ చిత్తం లేనివాడుగా ఉంటాడో అట్టివాడు జీవన్ముక్తుడు.

ఎవడు ఈ సంసారంలో - జగత్తులో - ఉంటూ దైనందిన కార్యకలాపాల్లో పాల్గొంటున్నా, దేనియందూ ఆసక్తిని పొందకుండా, దేనితోనూ సంబంధం లేకుండా ప్రశాంత తరంగం లాగా, అన్నిటి యందు ఆత్మను దర్శిస్తూ ఉంటాడో అట్టివాడు జీవన్ముక్తుడు - బ్రతికి ఉన్నప్పటికి ముక్తి పొందినవాడు.

జీవన్ముక్త పదం త్యక్త్వా స్వదేహే కాల సాత్కృతే
విశత్య దేహముక్తత్వం పవనోస్పన్ద తామివ. 35
విదేహ ముక్తో నోదేతి నాస్తమేతి న శా మ్యతి
న సన్నా సన్న దూరస్థో చాహం న చేతరః 36
తతః స్తిమితగంభీరం న తేజోన తమస్తతమ్
అనాఖ్య మనభివ్యక్తం సత్కించిదవశిష్యతే. 37
న శూన్యం నా పి చా(సా) కారం న దృశ్యం నాపి దర్శనమ్
న చ భూత పదార్థాఘః సదన్తతయా స్థితమ్. 38

ఇటువంటి జీవన్ముక్తుని శరీరం కాలక్రమాన నశించిపోగా (మరణించగా) విదేహముక్తపదవిని (శరీరం లేని స్థితిలో మోక్ష పదాన్ని) పొందుతాడు. కదలిక లేనట్టి నిశ్చల వాయు స్థితిని పొందుతాడు. శరీరాన్ని త్యజించి వేసినందున మళ్ళీ పుట్టటం అంటూ ఉండదు. పుట్టటం ఉండదు కాబట్టీ ఇక చచ్చుట అనేదీ ఉండదు. అస్తమించటమూ ఉండదు. ఉదయించటమూ ఉండదు. దగ్గర ఉండే వాడూ కాడు దూరంగా ఉండేవాడూ కాడు. అతడు కార్యమూ కాడు, కారణము కాడు. స్వపర భేదాలూ ఉండవు - అతడే సమస్తమూ కాబట్టి! స్తిమిత గంభీర స్వరూపుడౌతాడు. అప్పుడాతడు తేజస్సూ కాడు, తిమిరమూ కాడు. అతనికి నామ రూపాలు ఉండవు. శూన్యమూ కాడు, ఆకారుడూ కాడు. దృశ్యమూ కాడు, దర్శనమూ కాడు. ఏ పాంచభౌతిక పదార్థమూ కాడు. కేవలం సత్ స్వరూపుడై ఉంటాడు.

# రెండవ సర్గ

## మండపోపాఖ్యానము (లేక) లీలోపాఖ్యానము

వసిష్ఠుడింకా యిట్లా అన్నాడు - ఓ రామచంద్రా! ఆకాశోపాఖ్యానంలో చిన్మాత్రుడైన పరమాత్మ యొక్క మాయయే, మనస్సుగా అయి సృష్టి జరుపుతోందని చెప్పబడ్డది. ఇప్పుడుకు నీకు మండపోఖ్యానం (లీలోపాఖ్యానం) చెపుతాను. ఈ మాయ అనేది ఎంత బలవత్తరమైనదో దీని వల్ల నీకు తెలుస్తుంది.

పూర్వం పద్ముడు అనే రాజు ఉండేవాడు. అతడు సమస్త సద్గుణ సంపన్నుడు. రాజుకు ఉండాల్సిన సద్గుణాలన్నీ అతనికున్నాయి. అతని భార్య పేరు లీల. ఆమె రాజుకు మిక్కిలి అనుకూలవతి. భర్తను ప్రాణం కంటె మిన్నగా ప్రేమించేది. ఆమె

తన భర్త ఎడబాటును ఏ మాత్రమూ సహించగలిగేది కాదు. ఆమె ఆలోచనలు ఇట్లా సాగేవి - '' నా కంటె ముందుగా నా భర్త చనిపోకూడదు. అయన కంటె ముందుగా నేనే చనిపోతే మంచిదే! నా భర్త నా కంటెముందు చనిపోతే ఆతని ప్రాణాలు నా యింటిలోనే పరిభ్రమిస్తూ నన్ను చూస్తూ ఉండాలి. అప్పుడేనాకు సంతోషం. ఆ విధంగా జరగాలంటే ఏమి చేయాలి?''

ఇట్లా ఆలోచిస్తూతగిన ఉపాయం తెలుసుకోవటం కోసం ఆమె పండితులను, బ్రహ్మవేత్తలను పిలిపించింది. తన కోరిక నెరవేరటానికి తగిన మంత్రాన్ని గాని, వ్రతాన్ని గాని, చెప్పమన్నది. వారు శాస్త్రోక్త పద్ధతిలో సరస్వతీ దేవిని గూర్చి త్రిరాత్ర వ్రతము చేయమన్నారు. ఆమె అట్లాగే ఉపవాసం చేస్తూ మూడు రోజుల పాటు నియమంతో సరస్వతీ ధ్యానంచేస్తూ, జపతపాదులతో గడపుతూ మూడు రాత్రులు గడచిన పిమ్మట భోజనం చేస్తూ, మళ్ళీ మూడు రోజులు దీక్ష వహిస్తూ, ఇట్లా నూరు త్రిరాత్ర వ్రతాలు చేసింది. అంతట వాగ్దేవి ఆమెకు ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకోమని అన్నది. లీల రెండు వరాలు దేవిని కోరినది (1) నా కంటె ముందుగా నా భర్త చనిపోతే ఆతని జీవాత్మ నా అంతఃపుర మండపం నుండి బయటకు పోకుండా నా యెదుటనే ఉండాలి. (2) నేను నీ దర్శనం కోరినప్పుడల్లా నాకు నీవు కనిపిస్తూ ఉండాలి. జగన్మాత ఆ విధంగానే ఆమెకు వరాలు యిచ్చింది.

కొంత కాలానికి లీల జీవించి ఉండగానే పద్మడు మరణించాడు. లీల వాగ్దేవిని ధ్యానించింది. వాగ్దేవి ప్రత్యక్షమై ఇట్లా అంది - '' అమ్మాయీ! నీ భర్త కళేబరాన్ని పూలతో కప్పి నీ అంతఃపుర మండపంలో ఉంచు. ఆ కళేబరం క్రుళ్ళకుండా నీవు కోరిన విధంగా ఉంటుంది. కొన్నాళ్ళకు నీవు మళ్ళీ నీ భర్తను పొందుతావు.'' అని.

లీల ఆ విధంగానే చేసి, దుఃఖంతో దేవిని ఇట్లా అడిగింది - ''దేవీ! ఇప్పుడు నా భర్త ఎక్కడున్నాడు? ఏమి చేస్తున్నాడు? ఎట్లా ఉన్నాడు? నేను ఆతడు లేనిదే జీవించలేను. నన్ను ఆతని వద్దకు చేర్చు!'' అని

జ్ఞప్తి రువాచ -

**చిత్తా కాశం చిదాకాశ మాకాశం చ తృతీయకం**
**ద్వాభ్యాం శూన్యతరం విద్ధి చిదాకాశం వరాననే!** 1

దేశదేశాన్తర ప్రాప్తౌ సంవిదో మధ్యమేవయత్
నిమేషేణ చిదాకాశం తద్విద్ధి వరవర్ణిని. 2
తస్మిన్నిరస్త నిఃశేష సంకల్ప స్థితి మేషిచేత్
సర్వాత్మకం పదం శాన్తం తదా ప్రాప్నోష్య సంశయమ్ 3
అత్యంతా భావ సంపత్త్యా జగస్త్వత దాప్యతే
నాన్యథా మద్వరేణాశు త్వం ప్రాప్స్యసి సుందరి. 4

జ్ఞప్తి (వాగ్దేవి) ఇట్లా అన్నది - ''అమ్మా! ఆకాశం మూడు విధాలుగా ఉంటుంది, చిత్తాకాశం, చిదాకాశం, ఆకాశం, అని. చిదాకాశం అనేది మిగతా రెండింటి కంటె ఎక్కువ శూన్యంగా ఉంటుంది. చిత్తం, ఒక విషయం నుండి వేరొక విషయాన్ని గ్రహించటానికి మధ్యలో ఉండే అల్ప కాలంలో భాసించేదే చిదాకాశం ( చిత్తం తన పూర్వ వృత్తిని వదలిపెట్టి తరువాతి వృత్తిని గ్రహించే లోపల ఈ మధ్య కాలంలో నిర్విషయంగా, సాక్షిభూతంగా, ప్రతీయమానమయ్యే చైతన్యమే చిదాకాశం) నీ సంకల్పాలన్నింటినీ పూర్తిగా, నిరవశేషంగా వదలివేసి ఆ స్థితిలో ఉంటే నీవు సర్వాత్మక బ్రహ్మ స్వరూపాన్ని నిస్సందేహంగా పొందగలుగుతావు. జగత్తు అనేది సంపూర్ణంగా లేకుండా పోయినప్పుడే ఆ సర్వాత్మకత్వం సిద్ధిస్తుంది. నా వరం వల్ల నీవు త్వరలోనే ఆ స్థితిని పొందుతావు '' అని చెప్పి జ్ఞప్తి మాయమైంది. ( త్రిపురా రహస్యం జ్ఞాన ఖండంలో కూడా ఇట్లాగే చెప్పబడ్డది)

సరస్వతీ దేవి దయవల్ల లీల తన అంతః కరణ పంజరాన్ని వీడి - శరీరాన్ని మరచి - నిర్వికల్ప సమాధిస్థితిని చెందింది. ఆ స్థితిలో ఆమె ఆ చిదాకాశంలో అనేక మంది సామంతరాజులతో పరివృతుడైనట్టి, రాజలాంఛనాలతో పదహారేండ్ల వయస్సుతో ఒప్పుచున్న రాజును చూచింది. మిక్కిలి ఆనందించింది. కొంత సేపటికి సమాధి నుండి తన మందిరానికి వచ్చి దేవిని స్మరించింది. తన ఎదుట భద్రాసనాసీనయై ప్రత్యక్షమైన దేవిని ఇట్లా అడిగింది. - '' దేవీ! చిదాకాశంలో ఉన్న నా భర్తను, అక్కడ ఉన్న అమూర్తమైన సృష్టిని, మహాకాశంలో లోగడ ఉన్న నా భర్త లాగానే అప్పటి భ్రమాత్మక దృశ్యాలనే చూచాను. ఈ రెంటిలో ఏది సత్యం? ఏది భ్రమ? నా కీ విషయం చెప్పు!'' అని. దేవి ఇట్లా అంది - '' ఈ ప్రపంచం అంతా భ్రమ స్వరూపమే! పూర్వ ముండిన భ్రమ నుండి తరువాతి భ్రమ పుడుతూ ఉంటుంది. నీ భర్తకు పూర్వ జన్మలోని సంచిత కర్మ వల్ల పుట్టిన భ్రమ వల్ల ప్రపంచ

భ్రమ పుట్టింది. రాజుగాపుట్టాడు. చనిపోయిన పిమ్మట కూడా పూర్వజన్మ వాసన వల్లనే మళ్ళీ ప్రపంచ భ్రమ ప్రాప్తించింది. నీకు బాగా అర్థం అవటానికై విపులంగా చెపుతాను విను.-

## మండపోపాఖ్యానం

ఈ చిదాకాశంలో ఒక చోట ఒక మండపం ఉంది. దానిని సంసారం అంటారు. అది ఆకాశంలో కప్పబడి ఉంది. దానిని సంసారం అంటారు. అందులో పదునాల్గు లోకాలకు స్థానం ఉంది. ఆ సంసారానికి సూర్యుడే దీపం. ఆ సంసారంలో అనేక జీవరాసులున్నాయి. దేవాసురులున్నారు. లోకాలు, పట్టణాలు, పల్లెలు, నదీ నదాలు, పర్వతాలు, సముద్రాలు ఉన్నాయి. అక్కడ భార్య, పిల్లలతో సహా ఒక బ్రాహ్మణుడున్నాడు. అతడు అతిథి పూజలు, అగ్ని కార్యాలు ద్వారా కర్మలనాచరిస్తూ ఉన్నాడు.

ఆ బ్రాహ్మణుని పేరు వసిష్ఠుడు. ఆతని భార్య పేరు అరుంధతి. నిజంగా ఆతడు వసిష్ఠుడంతటి వాడే అయినా ఇక్ష్వాకులకు గురువైన వసిష్ఠుడు కాదు. ఈ అరుంధతి మోక్షాన్ని పొందిన ఆ అరుంధతి కాదు. ఒకప్పుడా బ్రాహ్మణుడు (వసిష్ఠుడు) పర్వతం మీద కూర్చుండి, వేటకై పరివారంతో సహా వైభవంతో అట్టహాసంగా వచ్చిన రాజును చూచాడు. తనలో ఇట్లా అనుకున్నాడు - ''ఆహా! ఈ రాజరికం ఎంత బాగుంది! నేను కూడా రాజుగా పుడితే ఈ వైభవాన్ని అనుభవించవచ్చు గదా!'' అని. అతనిలో ఈ కోరిక బాగా బలవత్తరమై పెరిగింది. ముసలితనం వచ్చిన పిమ్మట ఆ బ్రాహ్మణుడు మరణించాడు. అతడు ఎనిమిది రోజుల క్రిందట మరణించాడు. ఆతని భార్యయైన అరుంధతి, నీవు నన్ను కోరినట్లుగానే కోరింది. ఆ కారణంగా ఆ బ్రాహ్మణుని ఆత్మ ఆ ఇంటిలోనే పరిభ్రమించసాగింది. అంటే ఆతని పూర్వవాసనలతో, తీవ్రమైన సంకల్ప బలంతో ఆ బ్రాహ్మణుడు చిత్తాకాశంతో కూడిన పూర్వ భౌతిక కాయాన్ని వదలి, గృహాకాశంలో పరిభ్రమిస్తున్నాడు. ఆతని భార్య దుఃఖంతో తన శరీరాన్ని వదలి, ఆతివాహిక శరీరంతో (సూక్ష్మ శరీరంతో) భర్తను అనుగమించింది.

లీలా! ఆ బ్రాహ్మణుడు ఎవరో కాదు, నీ భర్త అయిన పద్మడు! నీవే ఆ

అరుంధతినీ! మీ వెనుకటి జన్మ భ్రమ, అసత్యం. భ్రమ వల్ల చిత్, జీవరూపాన్ని పొందింది. భ్రమవల్లనే చిదాకాశం భ్రమకు ప్రతిబింబం అవుతోంది. ఇది సత్యమా? అసత్యమా? అనేది నీవు గ్రహించగలుగుతే చాలు. ఆలోచించు. ఈ ప్రపంచం అంతా అసత్యం అని నీకు తెలుస్తుంది.

లీల ఇట్లా అడిగింది - '' దేవీ! ఆ బ్రాహ్మణుడు, భార్య చనిపోయి ఎనిమిది రోజులైంది. అన్నావు గదా! ఆ దంపతులమే, ఈ జన్మలో మేముగా జన్మించామని అన్నావు గదా! మేము ఇక్కడ చాలాకాలం నుండి ఉన్నాము గదా! ఇది ఎట్లా సంభవం? పైగా ప్రస్తుతం నా భర్త మరణించి మరొక లోకంలో ఉన్నాడు. నేను ఇక్కడ ఉన్నాను. ఇదంతా ఎట్లా సంభవం?'' అని.

దేవి యిట్లా అన్నది - ' లీలా! నేను చెప్పింది నిజమే! అసంభవం కాదు. మీరే ఆ బ్రాహ్మణ దంపతులని జ్ఞాపకం చేసుకోకుండా ఉన్నావు - ఒక స్వప్నములో అనేక దృశ్యాలు చూస్తావు. ఆ తరువాతి స్వప్నంలో వెనుకటి స్వప్న దృశ్యాలన్నింటినీ మరచిపోతావు. ఆ రెండు స్వప్నాలూ చిదాకాశ ప్రతిబింబాలే తప్ప, అన్యం కావు. లీలా! ఈ దృశ్యానికి పొడవు వెడల్పులు లేనట్లే, కాలానికి సైతం పరిమితులు లేవు జగత్తు లాగానే కాలం కూడా బ్రహ్మస్వరూపమే! క్షణాలు, నిమిషాలు, గంటలు, సంవత్సరాలు, కల్పాలు అన్నీ ఈ దృశ్య జగత్తులాగా అసత్యాలే! స్వప్నతుల్యాలే! జీవుడు దేశకాలాలను ఊహా రేఖలతో విభజించుకుంటాడు. హరిశ్చంద్రుడు ఒక క్షణాన్ని పన్నెండు సంవత్సరాలుగా ఊహించుకుంటే, ఎడబాటులోనున్న ఆతని భార్య ఒక రోజును ఒక సంవత్సరంగా తలచింది. కళ్ళు తెరచినప్పుడు మనిషి విభిన్నరూపాలను చూచినట్లే, చనిపోయిన పిమ్మట కూడా అనేక ఊహాలోకాలను దృశ్యాలను చూస్తాడు. మళ్ళీ జన్మించి లోగడ అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఉంటాడు. ఏవీ గుర్తుకు రాకుండా, సంసారమంతా పూర్తిగా మరపునకు రావటం అంటేమోక్షమే! ఇదంతా విని లీల అడిగింది - ''దేవీ! జ్ఞానం పరిపుష్టం కావటానికి పూర్వం చేయవలసిన అభ్యాసం, ఆ అభ్యాసం పరిపుష్టమైనప్పుడుండే స్థితి ఎట్లా ఉంటుందో సెలవియ్యి!'' అని

దేవ్యువాచ-
తచ్చింతనం తత్కథన మన్యోన్యం తత్ప్రబోధనం
ఏతదేక పరత్వం చ తదభ్యాసం విదుర్బుధాః 5
ఉదితౌ దార్య సౌందర్య వైరాగ్య రస గర్భిణీ
ఆనంద స్యందినీ యేషాం మతిస్తేభ్యాసినః పరే 6
అత్యంతా భావ సంపత్తౌ జ్ఞాతుర్జ్ఞేయస్య వస్తునః
యుక్త్యా శాస్త్రైర్య తన్తే యేతే బ్రహ్మోభ్యాసినః స్థిరాః 7
సర్గాదా వేవ నోత్పన్నం దృశ్యం నాస్త్యేవ తత్సదా
ఇదం జగదహం చేతి బోధా భ్యాసం విదుః పరే 8
దృశ్యా సంభవ బోధేన రాగద్వేషాది తానవే
రతిర్బలోదితా యాసౌ బ్రహ్మాభ్యాసః స ఉచ్యతే 9
దృశ్యా సంభవ బోధో హి జ్ఞానం జ్ఞేయం చ కథ్యతే.
తదభ్యాసేన నిర్వాణ మిత్యభ్యాసో మహోదయః 10

**బ్రహ్మాభ్యాసం :** దేవి ఈ విధంగా అన్నది - '' లీలా! గురువు చెప్పిన విషయాలను విని, వాటిని చింతన చేయటం, యుక్తి యుక్తంగా వాటిని పర్యాలోచన చేయటం, ఇట్లా బ్రహ్మ పరాయణత్వంతో ఉండటాన్నే పండితులు అభ్యాసం అంటారు.

బ్రహ్మాభ్యాసం చేసేవాని మనస్సు ఆనందంతో నిండినదైఉంటుంది. ఆతని మనస్సు గొప్పతనంతో కూడిన అందంతో వైరాగ్య రసగర్భితమై ఉంటుంది. జ్ఞాత, జ్ఞేయము, ద్రష్ట, దృశ్యము అనేవి లేకుండా పూర్తిగా వాటితో విడిపోయి ఉంటుంది - బ్రహ్మాభ్యాసపరులైన వారు శాస్త్రవములలో చెప్పినట్లు నడుచుకుంటారు. సృష్ట్యారంభంలో దృశ్యం లేదు. నిజానికి అది ఎప్పుడూ లేదు. కాబట్టి జగత్తు అనేది లేనే లేదు - అది మిథ్య! నీవు నేను లేనేలేము. ఈ విధమైన జ్ఞానాన్నే బ్రహ్మాభ్యాసం అంటారు. దృశ్యం అనేది లేదనే జ్ఞానం వల్ల, అట్టి ద్వైతా భావజ్ఞానం (దృశ్యాసంభవ బోధాభ్యాసం) పరిపక్వం అవటం వల్ల రాగద్వేష లోభాదులు క్షీణించి, అపరోక్ష జ్ఞాన ప్రాప్తి కలిగి మోక్షం సిద్ధిస్తుంది.

బ్రహ్మాభ్యాసపరులు మూడు తరగతులుగా ఉంటారని భావం. ప్రపంచం మిథ్య అని గట్టిగా తలచి నిష్ప్రపంచ బ్రహ్మానందంలో నిమగ్న చిత్తులైన వారు

మొదటి తరగతికి ( ఉత్తమ శ్రేణికి) చెందినవారు. ప్రపంచం మిథ్య అని తెలుసుకొని, ఆ జ్ఞానాన్ని దృఢం చేసుకోవటానికై యత్నించేవారు, మధ్యములు. ప్రపంచ మిథ్యాత్వాన్ని తెలుసుకోవటానికై, యుక్తులను, శాస్త్రాలను వెదుకుతూ ప్రయత్నిస్తూ ఉండేవారు, అధములు.

( పిమ్మట వసిష్ఠుడు లీల, సరస్వతీ దేవి ఇద్దరూ నిర్వికల్ప సమాధి స్థితిని పొంది, చిచ్ఛక్తితో, చిదాకాశదేహాలతో విహరించటాన్నీ, పూర్వ సంకల్పాల కారణంగా వారికి మనస్సు మాత్రం ఉన్నట్లు చెప్పి, ఆకాశాన్ని, భూమిని, సిద్ధుల్ని, జన్మలను గూర్చి పునర్జన్మలను గూర్చి, బ్రహ్మాండాలను గూర్చి విపులంగా రామునికి వర్ణించి చెప్పాడు)

లీల యొక్క పూర్వ జన్మలను, అందలి విశేషాలను, పద్మని పునర్జన్మను, లీలతో పాటు విదేహముక్తిని పొందటాన్నీ వర్ణించి చెప్పాడు.

వసిష్ఠుడు రామునితో ఇట్లా అన్నాడు - ''రామా! దృశ్యానికి సంబంధించిన దోషాల్ని - దృశ్యాన్ని సత్యమని భ్రమించటాన్ని - తొలగించటానికై లీల యొక్క కథను నీకు చెప్పాను. ఇక నీవు ఈ ప్రపంచం సత్యమని ఎన్నడూ భ్రమించకు. ఈ దృశ్య మంతా సత్యమనే భావం ఉన్నంత వరకు ఈ దృశ్యం తొలగిపోదు. ఈ కనిపించే దృశ్యమంతా ఆకాశం, - శూన్యం. ఇదంతా ఆ పరమ పురుషునిలోనే ప్రకాశిస్తోంది. అతడు స్వయం భువుడు. తనను తానే సృజించుకొని, తనలోనే ఉంటున్నాడు. సృష్టిస్థితిలయాలు అతని సంకల్పాలు.''

ఇది విని, రాముడు ఇట్లా అన్నాడు - ''పూజ్య మునీంద్రా! నాకు పరమార్థ దృష్టిని ప్రసాదించారు. దాని వల్ల నా మనస్సుకు శాంతి లభించింది. మీరు అనేక ఉదాహరణలతో వర్ణించి చెప్పిన కథ, నాకు పరమానందాన్ని కలిగించింది. అయినా, నాకొక సందేహం మిగిలి ఉంది. దయచేసి ఆ సందేహాన్ని తీర్చండి - ''పద్మని మూడు జన్మల్లోను ఆతడు గడిపిన కాలం ఎంత? ఒక రాత్రా? ఒక పగలా? ఒక నెలా? సంవత్సరమా? ఇంకా ఎక్కువ కాలమా?''

వసిష్ఠుడిట్లా అన్నాడు - రామచంద్రా! ఎప్పుడైనా సరే, ఎక్కడైనా సరే, మనం అనుకొన్న దానిని బట్టి, మనం ఆలోచించిన దానిని బట్టే మనకు ఏదైనా కనిపిస్తుంది. నీవు విషాన్ని అమృతం అని నిరంతరం భావిస్తే అది అమృతమే అవుతుంది. అట్లాగే శత్రువును నిరంతరం మిత్రునిగా ధ్యానిస్తే అతడు మిత్రుడే అవుతాడు. అట్లాగే ఒక నిముషాన్ని మనం ఒక కల్పంగా ఊహించుకుంటే అది కల్పమే అవుతుంది. ఒకడు

స్వప్నంలో తాను చచ్చిపోయినట్లు, మళ్ళీ పుట్టినట్లు, యువకుడైనట్లు దేశదేశాలు తిరిగినట్లు నమ్ముతాడు. రామా! ఈ సృష్టి అంతా మానసిక భావాలతో నిండి ఉంది. శాస్త్రాలు, ధర్మాలు, జపాలు, తపాలు, ఇవన్నీ ఆచరించటం కష్టం అనిపిస్తుంది. కాని అభ్యాసం చేస్తే తేలికగానే ఉంటాయి. ప్రపంచం అంతా మానసిక పరివర్తనం. మనస్సు మారినప్పుడల్లా దృశ్యం మారుతుంది. ఒక్క చిదాకాశం మాత్రమే, నిరంతరము పరమ ప్రశాంతంగా ఉంటుంది. ఆకాశంలో - శూన్యంలో, ముత్యాల హారం మన భ్రమ వల్ల కనిపించినట్లే, మన భ్రమ వల్లనే పరబ్రహ్మంలో ఈ జగత్తు కనిపిస్తోంది.''

''రామచంద్రా! చైతన్య రూపంలో ఉండే ఆశక్తే, నియతి. ఆశక్తి వల్లనే ఆత్మాను భూతి కలిగిన వారు కూడా నిత్య కృత్యాలు జరుపుతూ ఉంటారు. ఆ నియతే పరబ్రహ్మ నుండి సంకల్ప రూపంలో ముందుగా సృష్ట్యాది యందు పుట్టింది. ఈ నియతినే మహాసత్త, మహాచితి, మహాశక్తి, మహాదృష్టి, మహాక్రియ, మహోద్భవ, మహాస్పంద, మహాత్మ రూప ఇత్యాది పేర్లతో వ్యవహరిస్తారు. ఈ నియతి యొక్క శక్తి వల్లనే ఈ లోకాలన్నీ మారుతున్నాయి. ఏవి ఎట్లా మారినా ఈనియతి మాత్రం మారదు. ఆత్మ, పరమాత్మ, నియతి, ఈ సృష్టి అంతా ఒకటే! అజ్ఞానులు మాత్రమే వీటిని భిన్నాలని తలుస్తారు. ఈ నియతినే దైవం అంటారు. 'పురుషస్పంద' మని కూడా అంటారు. 'త్రికాలగ' మని అంటారు. కల్పారంభం నుండి కల్పాంతం వరకు జరిగే కార్యకలాపమంతా నియతి వల్లనే జరుగుతుంది. ఈ నియతితో స్వయం కృషి - స్వీయ ప్రయత్నం - తోడైనప్పుడు ఏదైనా జరుగుతుంది. ఈ స్వీయ ప్రయత్నాన్నే పురుష కారము అంటారు. పురుష కారం లేకుండా ఒక్క నియతి వల్ల ఏదీ జరగదు. ఈ విషయం బాగా గుర్తు ఉంచుకోవాలి. అయితే ఈ నియతి యొక్క మహత్త్వాన్ని చూచి సంసారం సత్యమని భ్రమించరాదు.

# మూడవ సర్గ

## కర్కాట్యుపాఖ్యానము

వసిష్ఠుడింకా యిట్లా చెపుతున్నాడు :

ఏతత్తే కథితం రామ దృశ్యదోష నివృత్తయే
లీలోపాఖ్యానమనఘం ఘనతాం జగతస్త్వ జ 11
అనదాభాసమచ్ఛాత్మ బ్రహ్మేస్తీహ ప్రబృంహితమ్
బృహచ్ఛిద్ఘైరవ వపురానన్దాభిధమవ్యయమ్ 12
తస్య యత్సమ మాపూర్ణం శుద్ధసత్త్వమచిహ్నితమ్
తద్విదామవ్యనిర్దేశ్యం తచ్ఛాన్తం పరమం పదమ్ 13
బ్రహ్మణః స్ఫురణం కించిద్యదవాతాంబుధే రివ
దీపస్యేవాథ్యవాతస్య తం జీవం విద్ధి రాఘవ 14
తదేవ ఘనసంవిత్త్వా యాత్యహన్తా మనుక్రమాత్
వహ్న్యణు స్త్విద్ధ నాధిక్యా త్స్వం ప్రకాశకతామివ 15
సంకల్పోన్ముఖతాం యాతస్త్వహంకారో భవత్యత
చిత్తం చేతో మనో మాయా వకృతిశ్చేతినామభిః 16
పరస్మాత్కారణాదేవం మనః ప్రథమ ముత్థితమ్
మననాత్మక మాభోగి తేనేదం తన్యతే జగత్ 17
అపారావార విస్తారసంవిత్సలిల వల్గనైః
చిదేకార్ణవ ఏవాయం స్వయమాత్మా విజృంభతే 18
దీర్ఘస్వప్న స్థితిం యాతః సంసారాఖ్యో మనోవశాత్
అనన్యగ్దర్శనా త్స్థాణావివ పుం ప్రత్యయోదృఢః 19
ద్వైతం యథానాస్తి చిదాత్మ జీవయో స్తథైవ భేధోస్తి న జీవ చిత్తయోః
యథైవ భేదోస్తి న జీవ చిత్తయో స్తథైవ భేదోస్తి న చిత్త సర్గయోః 20

శ్రీరామచంద్రా ! ఈ దృశ్యజగత్తు స్వప్నంలాంటిదనీ, దానిని నిజం అని భ్రమించుటయే దోషమనీ, ఆ జగత్తు సత్యమనే దోషాన్ని తొలగించటానికీ లీలోపాఖ్యానం చెప్పబడ్డది. కాబట్టి జగత్తు విషయంలో నీకున్న భ్రాంతిని వదలివెయ్యి.

బ్రహ్మ శబ్దాన్ని రెండు అర్థాల్లో వాడతారు. మొదటి అర్థం ఈ మాయిక ప్రపంచంతో కూడిన బ్రహ్మ - కార్య బ్రహ్మ అనీ, రెండవ అర్థం స్వచ్ఛస్వరూపము, అనిర్వచనీయము, ఆనంద స్వరూపము అయిన బ్రహ్మము అనీ! శుద్ధసత్త్వ స్వరూపము, నిరాకారము అయిన బ్రహ్మన్ని విద్వాంసులుసైతం వర్ణించి చెప్పలేరు. శాంతము, పరమపదము అయిన బ్రహ్మ స్వరూపాన్ని ఇటు వంటిదని చెప్పలేరు.

గాలి అలలు లేని సముద్రం లాగా, గాలికి చలించని దీపంలాగా ఉండే ఆ పరమ ప్రశాంతమైన ఆ పరబ్రహ్మ యొక్క అత్యంతాల్పంగా స్ఫురించే రూపమే జీవుడు. ఆ స్ఫురణమే మిక్కిలి బలమైన సంకల్పం కారణంగా 'అహం' నేను అనే భావాన్ని - అహంకారాన్ని పొందుతోంది. అత్యంతాల్ప పరిమాణంలో ఉన్న నిప్పురవ్వ ఎండుపుల్లలు అధికంగా చేరగా చేరగా ప్రజ్వలించనట్లుగా, జీవుడు సంకల్పాలు అధికాధికంగా చేరి అహంభావాన్ని పొంది ఇట్లా వ్యక్తమౌతున్నాడు. ఈ స్థితినే మనం చిత్తమని, జీవుడని, మనస్సు అని, మాయ అని, ప్రకృతి అనీ అంటున్నాం. పరమకారణుడైన ఆ బ్రహ్మము వల్లనే ముందుగా మనస్సు అనేది పుడుతోంది. మనస్సు సంకల్పాత్మకం! ఈ మనస్సు ద్వారానే జగద్విస్తారం జరుగుతోంది.

అపార పారావారంలోని జలంలాగా అనంతబ్రహ్మలోని సంవిత్తు - సంకల్పమే, ఈ దృశ్య జగత్తు యొక్క రూపాన్ని దాల్చింది. సంకల్పాత్మకమైన మనస్సు వల్లనే ఈ జగత్తు ఒక పెద్ద స్వప్నంలాగా తయారైంది. అస్పష్టంగా ఉండటంవల్ల, భ్రమ వల్ల ఒక మొద్దును మనిషిగా భావించినట్లుగా కేవలం సంకల్ప సమూహమైన జగత్తును సత్యంగా భావిస్తున్నాము . పరబ్రహ్మ కారణమైతే జీవాత్మ కార్యం - పూర్ణబ్రహ్మయొక్క అంశమే జీవాత్మ. ఈ రెంటిలోను ద్వైతభావంలేదు. చిత్తం ( మనస్సు) వల్లనే సమస్త ప్రపంచము పుడుతోంది కాబట్టి జీవునికి ప్రపంచానికి కార్య కారణ సంబంధం ఉంది.

ఇందుకు ఉదాహరణగా నీకొక పురాతన ఇతిహాసం చెపుతాను, విను. పూర్వం హిమాలయాల ఉత్తరభాగంలో మిక్కిలి భయంకరాకారంతో కర్కటి అనే రాక్షసి ఉండేది. దాని శరీరం కాటుక లాగా భయంకరంగాను, దాని పొట్ట పొడ్డదై బడబాగ్ని శిఖలవంటి జఠరాగ్నితో ఎన్నడూ తృప్తిపొందనిదై అనేక ప్రాణులను ఒక్కసారిగామింగ గలిగి ఉండేది. ఎంత మందిని మింగినా దాని ఆకలి తీరేదికాదు. ఒకసారి అది ఇట్లా

తలచింది - ''నా ఆకలి కొంతవరకైనా తీరాలంటే జంబూద్వీపంలో ఉండే ప్రాణులన్నింటినీ ఒక్కసారిగా మింగాలి. కాని అన్నింటిని ఒక్కసారిగా మింగటం ఎట్లా? అంతేకాక, కొంత మందికి భూతప్రేత రాక్షసాదుల్ని తరిమివేయజాలిన మంత్రాలు వచ్చి ఉంటాయి. కొంత మందికి చావులేని మందులు తెలిసి ఉంటాయి. కొంతమంది సత్కార్యాలతో, దేవతా పూజలతో తపస్సులతో, వ్రతాలతో మృత్యుభయం లేనివారై ఉంటారు. అందరినీ ఒక్క సారిగా మింగాలంటే నేను కూడా తపస్సుచేసి అటు వంటి శక్తిని పొందాలి. తపస్సు వల్ల సాధ్యం కానిది ఏమీ లేదు. ''ఇట్లా ఆలోచించి అది ఒక దుర్గమ పర్వత ప్రాంతంలో తపస్సుకు పూనుకొంది. ఎనిమిది వేల సంవత్సరాల పాటు ఆ రాక్షసి ఘోరతపస్సు చేసింది. ఆ తపస్సు వల్ల రాక్షసి శరీరం ఎండిపోయి పుల్లలాగా అయిపోయింది.

ఎంతటి నీచకర్ములైనా, పాపిష్ఠులైనా లక్ష్య సిద్ధికోసం దారుణమైన తపస్సు చేస్తే తప్పకుండా వారికి తపస్సిద్ధి కలుగుతుంది. అట్లాగే, కర్కాటి తపస్సుకు మెచ్చి, బ్రహ్మ దేవుడు ప్రత్యక్షమై 'నీ కిష్టమైన వరం కోరుకో!' అన్నాడు.

కర్కాటి ఇట్లా అన్నది ''స్వామీ ! నా పై కరుణించి నేను జీవసూచికనయ్యేటట్లు - లోహసూచికలాగా కర్కశ స్వభావం కలదానినిగా అయ్యేటట్లు వరం ఇవ్వండి ' అని .

బ్రహ్మ యిట్లా అన్నాడు - ''సరే నీవు 'వి' అనే ఉపసర్గతో కూడిన సూచికవు అవుతావు. అంటే, 'విషూచికవు' (కలరావ్యాధి) అవుతావు. లోహసూచికవూ అవుతావు. ఆ విధంగా కూడా జీవుల్ని బాధించ గలుగుతావు'' అని, ఇంకా యిట్లా అన్నాడు -

దుర్భోజనా దురారంభా మూర్ఖా దుః స్థితయశ్చ యే
దుర్దేశ వాసినో దుష్టాస్తేషాం హింసాం కరిష్యసి 21
ప్రవిశ్యహృదయం ప్రాణైః పద్మప్లీహాది బాధనాత్
22
వాతలేఖాత్మికా వ్యాధిర్భవిష్యసి విషూచికా
సగుణం నిర్గుణం చైవ జనమాసాద యిష్యసి
23
సగుణా నాం చికిత్సార్థం మంత్రోయం తు మయోచ్యతే

నిషిద్ధాన్నాన్ని తినేవారినీ, అతిగా భుజించేవారినీ, అసమయంలో తినే వారినీ, దూషితాన్నాన్ని, పర్యుషితాన్నాన్ని భుజించే వారిని, చెడు పనులను చేసేవారినీ, చెడ్డ

చోట్ల నివసించేవారినీ నీవు విషూచి రూపంలో (కలరా రూపంలో) బాధించగలవు అయితే ఒకప్పుడు నీవు మంచివారిని సైతం బాధించటానికి పూనుకోవచ్చు. అందువల్ల నీ బారి నుండి తప్పించు కోవటానికై ఒక మంత్రాన్ని యిస్తున్నాను.

"ఓం ఆం హ్రీం శ్రీం రాం విష్ణు శక్తయే నమో భగవతి విష్ణుశక్తి ఏహి ఏనాం హరహర దహ దహ హన హన పచపచ మథ మథ ఉత్సాదయ ఉత్సాదయ దూరే కురుకురు స్వాహా. విషూచికే త్వం హిమవన్తం గచ్ఛ గచ్ఛ జీవ సార చంద్ర మండలం గతోసి స్వాహా."

**ఇతి మన్త్రీ మహా మన్త్రం న్యస్య వామ కరోదరే**
**మార్జయే చ్చా తురా కారం తేన హస్తేన సంయుతః** 24
**హిమశైలాభిముఖ్యేన విధృతాం తాం విచిన్తయేత్**
**కర్కటీం కర్కాశాం క్రుద్ధాం మంత్ర ముద్గర మర్దితామ్** 25
**ఆతురం చిన్తయే చ్చ ఙ్ఞే రసాయన హృది స్థితమ్**
**అజరామరణం ముక్తం సర్వాధి వ్యాధి విభ్రమైః** 26
**సాధకో హి శుచిర్భూత్వా స్వా చాన్తః సుసమాహితః**
**క్రమేణానేన సకాలాం ప్రోచ్ఛినత్తి విషూచికాః** 27

ఓం, ఆం, హ్రీం, శ్రీం, రాం అనేవి బీజాక్షరాలు. వేరు వేరు కోరికలను ఈయజాలిన బీజాక్షరాలు వేరువేరుగా ఉంటాయి.

విష్ణు శక్తికి నమస్కారము. భగవతియైనఅది విష్ణుశక్తికి నమస్కారములు ఇచటికి వచ్చి వ్యాధిని హరించు. ఈ విషూచికను తీసికొని పొమ్ము. ఈ రోగాన్ని హరించు. ఈ రోగాన్ని దహించు.ఈ రోగాన్ని జీర్ణింప చెయ్యి. ఈ రోగాన్ని మథించు. దీనిని దూరంగా పారద్రోలు. ('స్వాహా' శబ్దం దేవికి సమర్పణ చేయటాన్ని సూచిస్తుంది.)

రోగశక్తి యైన విషూచికీ ! నీవు హిమాలయాలకు పారిపో! ఓ రోగీ! ఓ జీవుడా! నీవు చంద్ర మండలానికి పో ! అచటి అమృతాన్ని త్రాగి స్వస్థుడవు కమ్ము !

ఈమహా మంత్రాన్ని ఎడమ అర చేతిలో మంత్రాక్షరాలను లిఖించి ఆ చేతితో రోగి శరీరాన్ని తుడవాలి. అట్లా చేసేటప్పుడు, వికార శరీరియైన కర్కటి - విషూచిక రోగి శరీరం నుండి బయటకు వచ్చి పారిపోతున్నట్లు భావన చేయాలి.

రోగి చంద్ర మండలంలోని అమృతాన్ని త్రాగి స్వస్థుడై, వార్ధక్య మరణాదులు లేని వాడై నట్లు భావన చేయాలి. ఇట్లా ఆనతి యిచ్చి బ్రహ్మ దేవుడు తన చోటుకు వెళ్ళిపోయాడు. బ్రహ్మ దేవుడు ఈ మంత్రాన్ని ప్రసాదించగా, సిద్ధులు, దేవేంద్రుడు గ్రహించారు.

కర్కాటి యొక్క స్థూలదేహం లోహ సూచికలాగా అయినది. దాని మనస్సు జీవసూచికలాగా అయినది. ఈ రెండు రూపాలతోనూ కూడా అది లోకాలను బాధించ సాగింది. కాని, దానికి తృప్తి కలుగలేదు. తాను చేసిన పనికి తానే చింతించ సాగింది. అంతటి మహా భీకరాకృతికలిగిన శరీరంతోనే దాని ఆకలి చల్లారలేదు. సూక్ష్మ రూపాలు దానికి తృప్తి నెట్లా కలిగించ గలుగుతాయి?

ఇట్లా చాలాకాలం గడచిపోయిన పిమ్మట ఆ రాక్షసికి తన స్థితి యెడల వైరాగ్యం జనించింది. అది హిమాలయ శిఖరానికి పోయి మళ్ళీ తపస్సు ప్రారంభించింది.

వెయ్యి సంవత్సరాల పాటు తపస్సు చేసి తన పాపాలను పోగొట్టు కొన్నది. జీవ బ్రహ్మైక్య జ్ఞానాన్ని పొందింది. బ్రహ్మ దేవుడు దాని తపస్సుకు మెచ్చి ''పూర్వ రూపాన్నే ధరించి సుఖంగా ఉండు . మూఢులు, దుర్మార్గులు, ఆత్మజ్ఞాన విహీనులు, పాపకర్ములు నీకు ఆహారం అవుతారు.'' అని ఆజ్ఞాపించాడు.

కర్కాటి పూర్వ శరీరాన్ని పొంది, క్రూరస్వభావాన్ని, వీడినందుకు సంతుష్టుడైన వాయుదేవుడు, ఈ విధంగా అన్నాడు - ''కర్కాటీ! నీవు మూఢులవద్ద కేగి వారికి జ్ఞానాన్ని బోధించి తరింప జెయ్యి ! మూఢులను జ్ఞానోపదేశంద్వారా తరింపజేయటమే మహాత్ముల లక్షణం'' అని.

ఈమాటలకు సంతసించిన కర్కాటి, పర్వతశిఖరంనుండి కిందికి దిగివచ్చి, కిరాతులరాజ్యాన్ని ప్రవేశించింది. అదే సమయంలో ధైర్యంతో, అస్త్ర పాణులై బేతాళులను చూడాలనే సంకల్పంతో ఆ అడవిలో సంచరిస్తున్న ఒక రాజును, ఆతని మంత్రిని కర్కాటి చూచింది. కర్కాటి తనలో ఇట్లా అనుకుంది ''ఆహా ! నాకు నేడు సుదినం. నాకు మంచి ఆహారం లభించింది. వీరు మహా మూఢులు, ఆత్మ జ్ఞానం లేనివారు అయి ఉంటారు. ఇట్టి వారిని దేహాలు భారభూతములే అయి ఉంటాయి. వీరి దేహాల వల్ల పాపకర్మలే వృద్ధి అవు తూ ఉంటాయి. కాబట్టి

అట్టి వారిని తినటంలో తప్పులేదు. వీరు గుణవంతులు, పుణ్యాత్ములు అయితే, వీరిని తినను. అట్లా తినటం నా స్వభావానికి విరుద్ధం.

తదేతౌ సంపరీక్ష్యేహం యదితాదృగ్గుణాన్వితౌ
తద్భుక్ష్యం న కరోమ్యేతౌ న హింస్యే గుణినఃక్వచిత్ 28
అకృతిమం సుఖం కీర్తిమాయుశ్చైవాభి వాంఛతా
సర్వాభిమతదానేన పూజనీయా గుణాన్వితాః 29
అపి జీవిత దానేన గుణినం పరిపాలయేత్
గుణ వత్సంగ మౌషధ్యా మృత్యు ర్యాత్యేతి మిత్రతామ్ 30
ఉదార గుణ యుక్తా యే విహరన్తీహ దేహినః
ధరాతలేందవః సంగాద్భృశం శీతలయన్తి తే 31
మృతిర్గుణి తిరస్కారో జీవితం గుణి సంశ్రయః
ఫలం స్వర్గాపవర్గాది జీవితాద్గుణి సంశ్రయాత్ 32
తస్మాదిమౌ పరీక్ష్యేహం కయాచిత్ప్రశ్న లీలయా
కిం మాత్ర జ్ఞాన కావేతావితి తామరసేక్షణా. 33

అందుచేత వీరు సద్గుణులు అవునా ? కాదా? అని పరీక్షించాలి. వీరు గుణవంతులైతే వీరు తిన దగిన వారు కారు. గుణవంతుల్ని ఎన్నడూ హింసించరాదు గదా! నిజమైన సుఖాన్నీ, కీర్తినీ, అయువునూ కోరేవారు, గుణవంతులకు కోరిన దానాలను ఇచ్చి పూజించాలి. నా ప్రాణాలను అర్పించి అయినా గుణవంతులను రక్షించాలి. గుణవంతుని సాంగత్యం గొప్ప ఔషధం లాంటింది. అది మృత్యువును కూడా మిత్రునిగా చేస్తుంది. ఈ భూమిపై సంచరించే ఉదారగుణ సంపన్నులైన వారు చంద్రునిలాగా ప్రాణులన్నింటికీ చల్లదనాన్ని ఇస్తారు. గుణవంతుల్ని తిరస్కరించటం అంటే మృత్యువే ! గుణవంతుల నాశ్రయించటమే జీవితమన్న మాట ! జీవనానికి స్వర్గాపవర్గాలే ఫలం ! గుణ వంతుల నాశ్రయించక పోతే మృత్యువుతో పాటు స్వర్గా పవర్గాలనే జీవనానికి ఫలంకూడా నశిస్తుంది. జీవితమే పురుషార్థానికి మూలం. కాబట్టి గుణవంతులు జీవించి ఉండటం చాలా అవసరం. కాబట్టి వీరిద్దరిలో ఎవరిలో ఎటువంటి జ్ఞాన లక్షణాలు, తామసిక లక్షణాలు ఉన్నాయో ప్రశ్నించి తెలుసుకుంటాను అని అనుకుంది.

వసిష్ఠుడింకా యిట్లా అన్నాడు - అంతట రాక్షస కులం అనే అడవిలో

పుట్టిన లత లాంటి ఆమె చీకటిలో మెరుపు తీగలాగా మేఘగర్జనం తరువాత పడగళ్ల తోటి పిడుగులను పోలిన గంభీర భీకర నాదంతో అన్నది -

'' ఈ భయంకరాటవిలో, ఆకాశంలోని సూర్యచంద్రుల్లాగా ఉన్న మీ రెవ్వరు ? మహా మాయారూపంలో ఉన్న తమస్సు యొక్క పీఠ శిలలోని ఛిద్రంలో ఉన్న చిన్న కీటకాల్లాగా ఉన్న మీరెవ్వరు? సద్బుద్ధి కలవారా? దుర్బుద్ధికలవారా? ఇచటి కెందుకు వచ్చారు? ఇది నాకు భక్షణ స్థానం అని మీకు తెలియదా ? క్షణంలో మీరిద్దరు చావనున్నారు.''

ఆమె మాటలు విని రాజు యిల్లా అన్నాడు '' ఓ భూతమా! నీ వెవరవు ? నీ శరీరం ఎచట ఉన్నది ? మాకు తుమ్మెద స్వరంలాగా నీ మాటలు మాత్రమే వినిస్తున్నాయి. నీవు మాకు కనిపించు. మమ్మ భయపెట్టజూచే నీవు ఎవరవు ? ఇంత మాత్రానికే ఎవరు భయపడతారు?''

రాజు మాటలు విన్న ఆ రాక్షసి ఎదుట పడటానికి ధైర్యం చాలని దాని వలె వేళా కోళాంగా అన్నట్లుగా, ఒక విచిత్రమైన ధ్వని చేసింది. రాజ మంత్రులిద్దరూ దిక్కులను పిక్కటిల్ల జేసిన ధ్వనిని విన్నారు. దూరంగా వికటాట్టహాసం చేస్తు న్న రూపాన్ని చూచారు. ఆ రూపం, ప్రళయ కాలీన మేఘాట్ట హాసం లాగా ఉంది. కాని, రాజ మంత్రులు భయపడలేదు. మంత్రి అన్నాడు -

'' ఓ మహా రాక్షసీ! అనవసరమైనట్టి, వ్యర్థమైన అట్టహాసం, వేగిరపాటు ఎందుకు? నీవీ తొందర పాటును వదలి పెట్టాలి. సంభ్రమం నీకు శోభించదు. తమ అభీష్టాన్ని సాధించాలని అనుకొనేవారు యోగ్యమైన పద్ధతిలోనే విషయ ప్రవృత్తులౌతారు. యోగ్యమైన పద్ధతిలోనే విషయ ప్రవృత్తులౌతారు. ఓ అబలా ! మా ధైర్యమనే వాయువు నీ వంటి దోమలను ఎన్నింటినో తృణాల్లాగా ఎగరగొట్టినది. తొందర పాటును వదలి పెట్టినప్పుడే, బుద్ధి మంతులు యుక్తితో తమ పనులను సాధించ గలుగుతారు. శాంత చిత్తవై, నీ కోరిక ఏమిటో చెప్పు. యాచకులు ఎవరైనా సరే మా వద్దనుండి వ్యర్థంగా పోరు నీ కోరిక తీరుస్తాం ''.

మంత్రి అనిన మాటలు రాక్షసి విన్నది. తనలో అను కొన్నది. '' ఈ పురుష సింహులు బుద్ధిమంతులు, సదాచారులు. వీరు సామాన్య ప్రాణులు కారు. ఆశ్చర్యంగానే ఉంది. హృదయంలోని భావం వాక్కు ద్వారా, ముఖాకృతి నేత్రాల ద్వారా వ్యక్తమౌతోంది. వాక్కు, ముఖాకృతి, వీటిద్వారా అభిప్రాయాలు

ఒకటిగా అయి వ్యక్తమౌతున్నాయి. నా మాటలలో, నా ముఖాకృతితో నా అభిప్రాయాన్ని వీరిద్దరూ గ్రహించారు. వీరు పరబ్రహ్మ స్వరూపులైనందున నాశరహితులు. నా చేత వీరు నశింపరు. కాబట్టి నా మనసులోని సందేహాలను అడుగుతాను. ప్రాజ్ఞులైన వారు ఎదుట ఉన్నప్పటికీ తమ సందేహాలను నివారించుకోలేని వాడు అధముడు (ప్రాజ్ఞం ప్రాప్య న పృచ్ఛన్తి సందేహం తే నరాధమాః) ఈ విధంగా తలచి, అకాలమేఘ గర్జనంలాంటి తన స్వరాన్ని అదుపులో పెట్టుకొని, నవ్వును సైతం ఆపుకొని, యదార్థ విషయాన్ని గూర్చి అడిగింది -

'' మీ యిద్దరిలో మిక్కిలి ధైర్యవంతుడెవరు ?'' అని. మంత్రి యిట్లా అన్నాడు. ఈయన కిరాతరాజు. నేను ఈయన మంత్రిని నీ వంటి భూతముల నుండి ప్రజలను కాపాడటానికై రాత్రి వేళలందు తిరుగుతున్నాం. దుష్టగ్రహాలను నిగ్రహించటం రాజ ధర్మంగదా!''

రాక్షసి అంది - ''మంచి మంత్రికి మంచి రాజు లభించాలి. మంచి రాజుకు మంచి మంత్రి లభించాలి. మంత్రి ద్వారా ముందుగా రాజు మంచి వివేకాన్ని పొందాలి. రాజు వివేక వంతుడైతే ప్రజలు సైతం వివేకవంతులౌతారు ( యథా రాజా తథా ప్రజా) రాజ విద్యా పరిజ్ఞానం ద్వారా ( బహ్మ విద్యా పరిజ్ఞానంవల్ల ) సర్వ సమత్వ భావాన్ని, ప్రభుత్వ శక్తినీ పొందాలి. ఈ విధమైన పరిజ్ఞానం లేనివాడు రాజూ కాడు, మంత్రీ కాజాలడు. మీకా పరిజ్ఞానం ఉంటే మంచిదే ! లేకపోతే అనర్థమే ! ఓ పిల్లలారా ! నేను అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానం మీరు చెప్పగలిగితేనే నా నుండి తప్పించు కో గలుగుతారు.''

ఇట్లాఅని, రాక్షసి రాజమంత్రుల అంగీకారాన్ని పొంది పశ్నలడగటం ఆరంభించింది. 'ఓ రామా! ప్రశ్నలు చెపుతాను విను' అంటూ వసిష్ఠుడు చెపుతున్నాడు.

రాక్షస్యువాచ -

**ఏకస్యానేక సంఖ్యస్య కస్యాణోరంబుధేరివ**
**అంతర్బ్రహ్మాండ లక్షాణి వీయంతే బుద్బుదా ఇవ. 34**
**కిమాకాశ మనాకాశం న కించి త్కించిదేవ కిం**
**గచ్ఛ న్న గచ్ఛతి చ కః కోతిష్ఠ న్నేవ తిష్ఠతి 35**

కస్మాతనోపి పాషాణః కస్మాద్వ్యోమని చిత్రకృత్
అణౌ జగంతి తిష్ఠంతి కస్మిన్ బీజఇవ ద్రుమః 36
కస్మాన్న కించిచ్చ పృథ గూర్మ్యాదీవ మహాంభసః
ద్వైత మప్య పృథక్ కస్మాద్ద్రవతే చ మహాంభసః 37
యద్యేతాన్ సపది ధియా విచారయంతౌ
మత్ప్రశ్నాన్నఖలు విగాహితుం సమర్థౌ
తద్భక్షో జఠర హుతాశనేంధనత్వం
నిర్విఘ్నం ఝుడితి గమిష్యథః క్షణేన. 38

కర్కాటి ఈ విధంగా వారిని ప్రశ్నిస్తోంది.

(ప్రశ్నలకు పిమ్మట వారి సమాధానాలకు వరుస సంఖ్యలు ఇవ్వబడ్డాయి. (త్రిపురా రహస్యం - జ్ఞాన ఖండంలో కూడా బ్రహ్మ రాక్షసుని ప్రశ్నలు, వాటికి హేమచూడుని సమాధానాలు ఈ విధంగానే ఉన్నాయి.)

(1) సముద్రం లోపల నీటి బుడగల్లాగా, ఈ విశ్వంలో ఉన్న లక్షల కొలది బ్రహ్మాండాలన్నీ ఏ పరమాణువులో లీనమైపోతున్నాయి?

(2) ఆకాశమై ఉండీ కూడా ఏది ఆకాశం కాకుండా ఉంది?

(3) అసలు ఏమీ కాకుండానే, అన్నీ అయ్యేది ఏది?

(4) పోతూనే - వెడుతూనే - వెళ్ళకుండా ఉండేది ఏది?

(5) లేకుండానే ఉంటూ ఉండేది ఏది?

(6) చేతనం అయి ఉండీ కూడా అచేతనమైనదేది?

(7) ఆకాశంలో చిత్ర రచన చేసేది ఏది?

(8) విత్తనంలో చెట్టు ఉన్నట్టుగా ఏ అణు రూపమైన దానియందు ఈ జగత్తంతా ఉంది?

(9) సముద్రం కంటె తరంగాలు భిన్నములు కానట్లుగా, దేని కంటే భిన్నమైన వస్తువంటూ లేదు?

(10) జలం కంటె ద్రవత్వం వేరు కానట్లుగా, దేని కంటే భేదము (ద్వైతము) వేరుగా ఉండదు? అంటే, భిన్నంగా ఉన్నట్లు భాసించినా అభిన్నంగా ఉండేది ఏది?

నేనడిగిన ఈ ప్రశ్నలకు మీ బుద్ధితో సరియైన సమాధానాలు ఆలోచించి చెపితే సరే, లేక పోతే మీరు నా జఠరాగ్నికి సమిథలై, భస్మమైపోతారు. ఇందుకు నిష్ఫలంగానీ, ఆలస్యం గానీ ఉండదు.

మంత్ర్యువాచ -

**భవత్యా పరమాత్మైష కథితః కమలేక్షణే**
**అనయైవ వచోభంగ్యా బ్రహ్మవిద్బోధ యోగ్యయా** 39
**అనాఖ్యత్వా దగమ్యత్వాన్మనష్షష్ఠేంద్రియ స్థితేః**
**చిన్మాత్రమేవ మాత్మాణు రాకాశాదపి సూక్ష్మకః** 40
**చిదణోః పరమస్యాంతః కోటి బ్రహ్మాండ బుద్బుదాః**
**ఉద్భూయ స్థితిమభ్యస్య లీయంతే శక్తి పర్యయాత్.** 41
**ఆకాశం బాహ్యశూన్యత్వా దనాకాశం చ చిత్త్వతః**
**అకించిదిత్యనిర్దేశ్యం వస్తు సత్తేతి కించన.** 42
**సర్వగస్సర్వ సంబద్ధో గత్యభావాన్న గచ్ఛతి**
**నాస్త్యసా వాశ్రయా భావాత్సద్రూపత్వా దథాస్తిచ** 43
**చేతనోసౌ ప్రకాశాత్మా వేద్యాభావా చ్ఛిలోపమః**
**ఆత్మని వ్యోమని స్వచ్ఛే జగదున్మేష చిత్రకృత్** 44
**తద్భావమాత్రమిదం విశ్వమితి నస్యాత్తతః పృథక్**
**జగద్భేదోపి తద్భావ మితిభేదోపి తన్మయః** 45

రక్కసి ప్రశ్నలకు మంత్రి ఈ విధంగా సమాధానం చెప్పాడు -

ఓ కమలాక్షీ! బ్రహ్మవేత్తలకు మాత్రమే తెలియునట్టి వాక్యశైలిలో నీవు పరమాత్మను గురించే అడిగావు - నా సమాధానాలు విను.

1) పేరు లేనందు వల్లను, చర్మము, కన్ను, నాలుక, ముక్కు, చెవి, మనస్సు అనే ఆరు ఇంద్రియాలకు గోచరించనందువల్లను, ఆకాశం కంటె సూక్ష్మమైనదైనందువల్లను, చిన్మాత్ర స్వరూపుడైన పరమాత్మయే 'అణువు' అని వ్యవహరింపబడును. ఇట్టి 'చిత్' (జ్ఞానము) స్వరూపంగా గల పరమాత్మ అనే అణువు లోపల కోట్ల కొలది ఈ బ్రహ్మాండములు సముద్రంలో నీటి బుడగల్లాగా పుట్టి, కాస్సేపు నిలిచి, నశించి ఆ అణువులోనే అణగిపోతున్నాయి.

2) ఆకాశం కంటె పై నున్న వస్తువేదీ లేదు. కాబట్టి అన్ని వస్తువులనూ తన

యందే ఉంచుకొని ప్రకాశిస్తోంది. కాబట్టి బ్రహ్మమే ఆకాశమగును. అయితే అది చిద్రూపం కాబట్టి ఆకాశం కాదు - భూతాకాశం కాదు.

3) ఇటువంటిదని నిర్దేశించి చెప్పటానికి వీలులేనిది కాబట్టి బ్రహ్మము అకించిత్. ఇంచుకంత వస్తువు కాదు (ఏమీ కాదు). అయినప్పటికీ, సమస్త వస్తువుల యొక్క ఉనికికీ రూపంగా కలది కాబట్టి ఆ బ్రహ్మమే (కించిత్) ఇంచుకంత వస్తువూ అవుతుంది (అన్నీ అవుతుంది).

4) వెళ్లదగిన ప్రదేశాన్ని పొందటం (చేరటం) అనేది వెళ్లటానికి ఫలం అవుతుంది. అంతటినీ పొందియున్నవాడు కాబట్టి పరమాత్మ అన్ని చోట్లకూ పోయేవాడు అవుతున్నాడు. అయితే, పరమాత్మకు నడక లేదు కాబట్టి, తన కంటె పోదగిన ఇతరమైన చోటు లేదు కాబట్టి పోవుచున్నవాడూ కాడు.

5) ఉండే ప్రతివానికీ ఒక ఆశ్రయం (ఆధారం) ఉండాలి. అట్టి ఆశ్రయం ఏదీ లేదు కాబట్టి పరమాత్మ లేనివాడు అవుతున్నాడు. అయితే పరమార్థసత్త (ఉనికి) రూపంగా కలవాడైనందున ఉన్నవాడు అవుతున్నాడు.

6) జ్ఞానమే స్వరూపంగా కలిగియున్నందున పరబ్రహ్మము చేతనం. తనకంటె ఇతరమైనట్టి తెలుసుకొనదగిన వస్తువంటూ ఏదీ లేనందున బ్రహ్మము వృత్తి శూన్యమై రాతిని పోలి ఉన్నది.

7) బ్రహ్మమే నిర్మలమైన చిదాకాశంలో (జ్ఞానాకాశరూపమైన తన యందే) జగత్తు అనే చిత్రాన్ని చిత్రిస్తున్నది.

8) ఈ ప్రశ్నకు సమాధానం మొదటి ప్రశ్నకు చెప్పిన సమాధానమే అన్వయిస్తుంది.

9) ఈ జగత్తుకు బ్రహ్మము యొక్క సత్త కంటె భిన్నమైన ఇతరసత్త (ఉనికి) లేదు కాబట్టి, ఈ జగత్తు బ్రహ్మము కంటె వేరు కాదు.

10) దృశ్యము అయిన ఈ జగత్తు అంతా (చూడబడే ఈ జగత్తు బ్రహ్మము యొక్క వివర్తమే (కనిపిస్తూ ఉండే ఆ యదార్థరూపమే) కాబట్టి జలం కంటె ద్రవత్వం వేరు కానట్లే, బ్రహ్మము కంటె ఈ జగత్తు వేరు కాదు.

మంత్రి యిచ్చిన సమాధానాలు విని ఆ రాక్షసి, ''ఓ మంత్రివర్యా! నీ పవిత్రమైన వచనాలను విని మెచ్చుకొంటున్నాను. ఇక, ఈ విషయమై మీ రాజు కూడా తనకు తోచినది చెప్పాలి. ఆతడు చెప్పేది కూడా నేను వినాలి'' అన్నది.

రాజోవాచ -

జాగత్ప్రత్యయాభావాద్యస్యాహుః ప్రత్యయం పరం
సర్వసంకల్ప సన్యాస శ్చేతసా యత్పరిగ్రహః 46
యత్సంకోచ వికాసాభ్యాం జగత్ప్రళయ సృష్టయః
నిష్ఠా వేదాంత వాక్యానా మథ వాచామగోచరః 47
కోటిద్వయాంతరాలస్థ మథకోటిద్వయీ మయం
యస్య చిత్తమయీ లీలా జగదేత చ్చరాచరం 48
యస్య విశ్వాత్మకత్వేపి ఖండ్యతేనైక పిండతా
సన్మాత్రం తత్త్వయా భద్రే కథ్యతే బ్రహ్మశాశ్వతం. 49

ద్వైతవస్తువు సత్యమనే జ్ఞానం, వివేకియైన వాని యొక్క అద్వైత జ్ఞానానికి ప్రతిబంధకం. కాబట్టి అద్వైత వస్తువు సత్యమనే జ్ఞానం తొలగిపోవాలి. అదే పరమమైన జ్ఞానం. అదే పరమపురుషార్థ సాధనం. మరొక విధంగా చెప్పాలంటే, జాగ్రత్ స్వప్న సుషుప్తులలో ఉండే, జగత్తుకు సంబంధించిన వృత్తులు ( జ్ఞానాలు) తొలగిపోవటమే తురీయావస్థ. ఆ తురీయజ్ఞానమే బ్రహ్మస్వరూపం. అట్టి సర్వ సంకల్ప సన్యాసస్థితి ( తురీయ స్థితి) ఆ బ్రహ్మమందు తదేక నిష్ఠ వలన లభిస్తుంది. అట్టి తదేక నిష్ఠయే నిర్వికల్ప సమాధి. అంతఃకరణం ద్వారా సమస్త ద్వైత ప్రపంచ సంబంధాన్నీ వదలివేయటమే పరబ్రహ్మప్రాప్తి అన్నమాట.

స్థూల సూక్ష్మాలు, సంకోచ వికాసాలు, సంకల్ప వికల్పాలు, ఉదయ లయాలు, సృష్టిప్రళయాలు ఇటువంటి కోట్ల కొలదిగా నున్న ద్వంద్వాలకు పరమాత్మ అతీతుడు. అతనిని వాక్కులతో వర్ణించలేము. వేదాంత మహావాక్యాలతో తెలుసుకొనదగినది, అయిన బ్రహ్మమును గురించే నీవు అడిగావు. ఆ పరబ్రహ్మము ప్రపంచ రూపాన్ని పొందినా, దాని అఖండత్వము భంగము నొందదు. అట్టి సన్మాత్ర స్వరూపమూ, నిత్యమూ అయిన బ్రహ్మమునే నీవు అడిగావు.

ఈ చరాచర ప్రకృతి అంతా సత్ అసత్‌లు, చిత్ జడాలు, వీటి సమ్మేళనం. ఈ జగత్తంతా ఆ హిరణ్య గర్భుని యొక్క ( ప్రథమ జీవుని యొక్క ) మానసిక క్రీడావస్తువు. ఈ కనపడేదంతా ఆ పరమాత్మ యొక్క దృశ్య స్వరూపం. అతడు విశ్వాత్మకుడైనా, అఖండుడు - ఏకరూపుడు. నీవు చెప్పిన సన్మాత్రుడు, శాశ్వతుడు అయినవాడు ఆ పరమాత్మే!

రాజు చెప్పిన ఈ మాటలు విన్న కర్కటి సంతోషంతో అన్నది - ''రాజా! మీ యిరువురి బుద్ధి అస్తమయమంటూ లేని బ్రహ్మజ్ఞానం అనే సూర్యునిచే ప్రకాశిస్తోంది. ఇక నేను ఆకలిని లెక్కచేయను. ఏ ప్రాణినీ హింసించను. సురల హిమవత్పర్వత శిఖరానికి పోయి, ధ్యానం చేస్తూ, నిశ్చల చిత్తంతో సుఖంగా ఉంటాను'' అని చెప్పి వెడలిపోవటానికి సిద్ధపడిన రాక్షసితో రాజు యిట్లా అంటున్నాడు-

''ఓ రాక్షసీ! 'సౌహార్దం సుజనానాం హి దర్శనాదేవ వర్ధతే' సజ్జనులకు స్నేహం అనేది దర్శనమాత్రం చేతనే పెరుగుతుంది అని పెద్దల వాక్కు. నీవు నీ వికృత రూపాన్ని వీడి, సుందర రూపాన్ని దాల్చి మా యింటికి వచ్చి అచట సుఖంగా ఉండు.''

ఇది విన్న రాక్షసి యిట్లా అన్నది - ''ఓ రాజా! సుందరాకారంతో నున్న ముగ్ధకూ, కోమలీకీ, అయితే నీవు భోజనం పెట్టగలవు. నేను రాక్షసిని గదా! నన్ను ఎట్లా తృప్తిపరచగలవు? పూర్వం నుండీ ఉన్న దేహం, స్వభావం, పోవు గదా!''

రాజు యిట్లా అన్నాడు - కర్కటీ! నీవు కొన్నాళ్ల పాటు - నేను కోరినంత కాలం, యింట్లో పరమ సుందరీ మణి రూపంలో ఉండు. నేను నా అధీనంలోని మండలాల నుండి పాపాచారుల్ని, దొంగలను, దుష్టులను వందల కొలది మందిని వధించి తెచ్చి నీకు అర్పిస్తాను. వారిని నీవు హిమాలయానికి గొంపోయి హాయిగా భుజించు. అతిగా తినే వారికి ఏకాంత భోజనమే బాగా ఉంటుంది. (మహాశనానా మేకాంతే భోజనం హి సుఖాయతే) అట్లా భుజించి, తృప్తి పొంది, నిద్రించి మళ్లీ సమాధి నిష్ఠవు కమ్మ. సమాధి నుండి మేల్కాంచిన పిమ్మట మళ్లీ యిక్కడకు రా! మళ్లీ నీ వెంట దుష్టుల్ని తీసుకొనిపో! ఇటువంటి ధర్మపాలన కోసం జరిగే హింస హింస కాదు.

రాక్షసి అన్నది -'' ఓ రాజా మీరన్న మాట బాగానే ఉంది. మీరు చెప్పినట్లే చేస్తాను.''

వసిష్ఠుడు రామునితో అంటున్నాడు - ''రామా! ఆ రక్కసి అట్లా అంటూనే సుందరాకారాన్ని ధరించి, రాజమంత్రుల వెంట వెళ్లింది. అంతఃపురంలో ఉంటోంది. రాజు, ఆరు రోజుల పాటు తన మండలాలలో తిరిగి, వధింపదగిన వారిని మూడు వేల మందిని వధించి తెచ్చి యిచ్చాడు. రాక్షసి భయంకరాకారం దాల్చి, వారినందరినీ తన బాహువుల్లో బంధించి హిమాలయ శిఖరాలకు వెళ్ళినది. ఆ నాటి నుండి నేటి వరకు అట్లాగే వచ్చి వధింపదగిన వారిని తీసికొని పోతోంది. సమాధి నుండి లేచి మళ్ళీ వస్తోంది.

# నాల్గవ సర్గ
## ఐందవోపాఖ్యానము

వసిష్ఠ ఉవాచ -

ఏతత్తే సర్వమాఖ్యాతం సూచీవృత్తాంత కీర్తనాత్
ఆత్మైవాస్తి పరం సత్యం నాన్యాః సంసార దృష్టయః 1
సర్వంహి మనఏవేద మిత్థం స్ఫురతి సృష్టిషు
అత్రేద మైందవాఖ్యానం శ్రుణు శ్రవణ భూషణం. 2
రామ తే కథయిష్యామి తదాఖ్యాన మనిందితం.
చితిశక్తి సముల్లాసం విశ్విన్నోషి జగద్యతః 3
చిత్తబాలో జగద్యక్షం మిథ్యాపశ్యత్యబోధితః
బోధితోసౌ పరం రూపం స్వం పశ్యతి నిరామయం 4

వసిష్ఠుడు శ్రీరామునితో ఇంకా ఇట్లా అంటున్నాడు -

శ్రీరామచంద్రా! నీకు కర్కటివృత్తాంతాన్ని చెప్పాను. ఈ కర్కటి వృత్తాంతం ద్వారా ఆత్మ మాత్రమే (బ్రహ్మము మాత్రమే) పరమ సత్యమనీ, ఇతరములైన సాంసారిక దృశ్యాలన్నీ కేవలం భ్రాంతి మాత్రములే! భ్రమజన్యములే! అనీ, ఈ జగత్తంతా మనస్సు చేత కల్పింపబడ్డదనీ, బ్రహ్మయొక్క వివర్త రూపమనీ (అజ్ఞానం వల్ల కలిగిన రూపాంతరమనీ) గ్రహించు.

అజ్ఞానియైన బాలకుడు మిథ్యాయక్షుని (బేతాలుని) చూచి భయపడినట్లే, చిత్తం అజ్ఞానం వల్ల ఈ జగత్తు యొక్క మిథ్యా రూపాన్ని చూచి భ్రమపడుతోంది. యదార్థ జ్ఞానం పొంది నిరుపద్రవమైన అధిష్ఠానాన్ని చూస్తోంది. ఈ విషయమై నీకు ఐందవోపాఖ్యానం చెపుతాను విను.

చిత్తమేవ హి సంసారో రాగాదిక్లేశ దూషితం
తదేవ తైర్వినిర్ముక్తం భవాన్త ఇతి కథ్యతే 5
కదాచి దఖిలం సర్గం సంహృత్య దివసక్షయే
ఏకాగ్రో భగవాన్ వేధా సుప్తస్తామనయ న్నిశాం 6
నిశాంతే సంప్రబుద్ధాత్మా కృత్వా సంధ్యాం యథావిధి
ప్రజాః స్రష్టుం దృశాస్ఫారే వ్యోమ్ని యోజిత వానజః 7
అథాసౌ దృష్టవాన్ తత్ర మనసా వితతేంబరే
పృథక్ స్థితాన్మహారంభా న్సర్గాన్ స్థితి నిరర్గళాన్. 8

ఛానాలోక్య విశుద్ధేన పరేణ స్వేన తేజసా.
భృశం విస్మయ మాపన్నః కిమేత త్కథమిత్యుత 9
అథా లోక్య చిరంకాలం మనసైవ తదాంబరే
సూర్యం తస్మాజ్జగజ్జాలాదేక మానీయ పృష్టవాన్. 10

రాగాది క్లేశాలతో దోషభూయిష్టమైన చిత్తమే సంసారం - జగత్తు! ఆ రాగద్వేషాదుల నుండి విముక్తి పొందితే ఆ చిత్తమే సంసార నివృత్తికి సాధన మాతోంది. (మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః) నీ అనుమానాలు తొలగిపోవటానికై నీకు ఐందవుల కథ చెపుతాను. బ్రహ్మదేవుడు ఒకప్పుడు నాకీ కథను చెప్పాడు. అని వసిష్ఠుడు ఐందవోపాఖ్యానాన్ని యిట్లా చెప్పాడు-

ఒకప్పుడు సృష్టి యొక్క పగటి భాగం సమాప్తం కాగా, సృష్టి కర్తయైన బ్రహ్మ (వేధ) దానిని లయం చేసి (సంహారం చేసి) తదేక చిత్తంతో నిద్రించి, ఆ రాత్రి గడచినంతనే మళ్ళీ మేల్కొంచి, సంధ్యోపాసనను నిర్వర్తించి, మళ్లీ సృష్టిని చేయదలచి ఆ మహాకాశంలోకి తన దృష్టిని కేంద్రీకరించాడు. అంతటా అనంతమైన మహాకాశం! సృష్టిచేయాలనే తలంపుతో బ్రహ్మ చుట్టూచూచాడు. ఆ మహాకాశంలో విష్ణువు మొదలైన వారిచే పాలింపబడే అనేక సృష్టులున్నాయి. తన వంటి బ్రహ్మలు అనేక మంది ఉన్నారు. నాల్గు రకాల జీవులతో (స్వేదజ, అండజ, ఉద్భిజ, జరాయుజ జీవరాసులతో) ఆ సృష్టులన్నీ నిండి ఉన్నాయి. ఆ జగజ్జాలాన్ని చూచి, బ్రహ్మ ఆశ్చర్యపడ్డాడు. ఇదంతా ఏమిటి? ఎట్లా పుట్టింది? భౌతిక నేత్రాలకు గోచరించనిది మనో నేత్రానికి గోచరిస్తోంది! బ్రహ్మ ఒక సూర్యుని పిలిచి అడిగాడు - 'ఈ ప్రపంచం అంతా ఎట్లా పుట్టిందో చెప్పు!'' అని.

సూర్యుడా తనిని బ్రహ్మగా గుర్తించి, నమస్కరించి, యిట్లా అన్నాడు - ''దేవ దేవా! మీకు అంతా తెలుసు. ఈ దృశ్య ప్రపంచానికి కంతకూ కారణం మీరే! నా ద్వారా విందామని అనుకుంటే చెపుతాను, వినండి. మహామాయ యొక్క శక్తి వల్ల- అజ్ఞాన కారణంగా - ఈ జగత్తు సత్యంగానూ, ఆత్మ సాక్షాత్కారానంతరం అసత్యంగానూ కనిపించటానికి మనస్సే కారణం. ఓ పరమేశ్వరా! నా ఉత్పత్తిని గూర్చి చెపుతాను వినండి -

కైలాస పర్వత తలంలో జంబూద్వీపం ఉంది. అక్కడ సువర్ణ తటం అనే అందమైన ప్రదేశం ఉంది. నీ మానసపుత్రులైన మరీచ్యాదులు దానిని నిర్మించారు. అక్కడ ధర్మ నిష్ఠుడు, బ్రహ్మవేత్త, శాంతుడు, కశ్యపగోత్రజుడు అయిన

బ్రాహ్మణుడు ఒకడున్నాడు. అతని పేరు ఇందుడు. అతనికి సుందరాంగియైన భార్య ఉన్నది. వారికి సంతానం కలుగలేదు. అందుకు వారు ఖిన్నులై, పర్వతం మీదకు పోయి తపశ్చర్యకు పూనుకొన్నారు. వారి తపస్సుకు శివుడు ప్రసన్నుడైనాడు. వరం కోరుకొమ్మని అన్నాడు. ఆ విప్రుడు తనకు పది మంది పుత్రులు కలగాలని కోరుకొన్నాడు. శివుడా విధంగానే వరమిచ్చాడు. బ్రాహ్మణునికి (ఇందునికి) పది మంది పుత్రులు కలిగారు. వారు పెద్దవారైనారు. ఇందుడు, భార్య కొన్నాళ్ళకు చనిపోయారు. ఈ పది మంది కుమారులు దుఃఖితులైకైలాస పర్వతం మీదకు వెళ్ళారు. వారీ విధంగా ఆలోచించసాగారు -

**కిం స్యాదిహ పరంశ్రేయః కిమిహ స్యాదదుఃఖదం**
**కియదేత జ్జనైశ్వర్యం సామన్తోహి మహేశ్వరః** **11**
**సామంత సంపత్కిం నామ రాజానో హి మహేశ్వరాః**
**కానామ సంపద్భూపానాం సమ్రాడిహ మహేశ్వరః** **12**
**కిం నామ సంపత్సామ్రాజ్య మింద్రస్తేషాం మహేశ్వరః**
**కిం నామ తన్మహేంద్రత్వం యన్ముహూర్తం ప్రజాపతేః**
**వినశ్యతి యత్కల్పే కిం తత్స్యాదిహ శోభనం** **13**
**జ్యేష్ఠ ఉవాచ -**
**ఐశ్వర్యాణాం హి సర్వేషా మాకల్పాంతా వినాశియత్**
**రోచతే భ్రాతరస్తన్మే బ్రహ్మత్వ మిహ నేతరత్** **14**

మనకు దుఃఖాల్ని కలిగించేది ఏది? ఏది మనకు శ్రేయస్సాధనమౌతుంది? మానవుల ఐశ్వర్యం ఎంతటిది? ఇల్లు వాకిలి, పొలాలు ఉన్నవాడు, అవి లేని సామాన్యుని కంటే భాగ్యవంతుడు. అట్టి భాగ్యవంతుని కంటే మండలాధిపతి, ఆ మండలాధిపతి కంటె రాజు, రాజు కంటె చక్రవర్తి భాగ్యవంతులు. ఆ చక్రవర్తి కంటె ఇంద్రుడు, ఆ ఇంద్రుని కంటె ఆతని సంపదను క్షణంలో నాశనం చేయజాలిన బ్రహ్మ గొప్పవాడు. కాబట్టి మనం ఎన్నడూ నాశనం కానట్టి, అన్నిటి కంటె గొప్పదైన సంపదను గూర్చి తెలుసుకొని, దానిని పొందాలి.'' అని.

వారిలో పెద్దవాడిట్లా అన్నాడు - ''సోదరులారా! మన జీవితాంతం, పూర్తి నిశ్చయంతో, పట్టుదలతో, విశుద్ధహృదయంతో, ఆత్మను గూర్చిన ధ్యానం చేద్దాం. నేనే బ్రహ్మననీ, పద్మాసనస్థుడై యున్న బ్రహ్మను నేనే అనీ, నా వల్లనే సృష్టిస్థితిలయాలు జరుగుతున్నాయనీ ధ్యానం చేద్దాం.''

అథ తే బ్రాహ్మణా ఏవం బద్ధ బ్రహ్మాత్మ భావనాః
దేహాన్విసస్మరుః పూర్వాన్పూర్వ భావనయార్పితాన్ 15
అథతే దేహ కా స్పర్శే మమై రాతపేన చ
కాలేన శోష మభ్యేత్య గలితా శ్శీర్ణపర్ణవత్ 16
స తేషాం దశధా సర్గ ప్రతి భాసోయముత్థితః
భావనా పరి పాకేన దశతే బ్రహ్మతాం గతాః 17
త ఏతే దశ సంస్కారా మనో వ్యోమని సంస్థితాః
ఏషామన్య తమస్యాహం భాస్కరోహర్నిశాకరః 18
ఇత్యుక్త్వా వేధసం భానుర్జగామ నిజమందిరం
విరించిరపి దేవేశః స్వవ్యాపార పరోభవత్ 19

అన్నగారి మాటలకు అంగీకరించి, మిగిలిన సోదరులు కూడా ఆ విధంగానే ధ్యానం చేశారు. మనస్సును అంతర్ముఖం చేశారు. రాతి బొమ్మల లాగా నిశ్చలులైనారు. బాహ్య కర్మల్ని వదలి, బ్రహ్మ భావన చేశారు-

(నేనే బ్రహ్మను. పద్మం నా ఆసనం. సృష్టి కర్తను నేనే! నేనే ఈ సృష్టికి యజమానిని, యజ్ఞం చేసే యజమానులు, యజ్ఞసాధనాలు, వేదాలు, గాయత్రి అన్నీ నేనే! దేవతలు, సిద్ధసాధ్యులు నివసించే స్వర్గం నాలోనే ఉంది. సముద్రాలు, భూమి, కొండలు, సమస్తం నాలోనే ఉన్నాయి. ద్వాదశాదిత్యులు, అగ్ని, పండ్రెండు నెలలు, నాలోనే ఉన్నాయి. నియతికి లోబడి పాలించే ఇంద్రాదులందరూ నాలోనే ఉన్నారు. విలయం సైతం నాలోనే ఉంది. కల్పాంతంలో కార్యబ్రహ్మ వెళ్లిపోతాడు. నేను మాత్రం స్వరూపంలో ఉంటాను. ఈ విధంగా ఐందవులు ధ్యాన సమాధి నిష్ఠులైనారు)

ఈ విధంగా సమాధి పరిపక్వం చెందిన ఆ పది మంది బ్రాహ్మణ కుమారులు, పది బ్రహ్మాండాలకూ, పది మంది బ్రహ్మలుగా అయినారు. ఈ పది సృష్టులు సంస్కార మాత్రములుగా (స్మృతి మాత్రములుగా) మనస్సు అనే ఆకాశంలో ఉన్నాయి. వానిలో ఒక్క ప్రపంచానికి నేను రేయింబవళ్ళు ఏర్పాటు చేస్తూ సూర్యునిలాగా ఉంటున్నాను.

అని ఈ విధంగా సూర్యుడు బ్రహ్మదేవునికి విన్నవించి తన నివాసానికి వెళ్ళాడు. బ్రహ్మ తన సృష్టి వ్యాపారంలో నిమగ్నుడైనాడు.

# ఐదవ సర్గ

## ఇంద్రోపాఖ్యానము

వసిష్ఠ మహర్షి ఇట్లా అన్నాడు - ఈ ఉపాఖ్యానం వల్ల ఈ జగత్తులన్నీ మనస్సు చేతనే కల్పింపబడుతున్నాయనేది స్పష్టమైంది.

**మనో హి జగతాం కర్తృమనో హి పురుషః పరః**
**మనః కృతం కృతం లోకే న శరీర కృతం కృతం** 1
**సామాన్యా బ్రాహ్మణాభూత్వా మనోభావనయా కిల**
**ఐందవా బ్రహ్మతాం యాతా మనసః పశ్య శక్తితాం.** 2
**మనసా భావ్యమానో హి దేహితాం యాతి దేహకః**
**దేహభావనయా ముక్తో దేహధర్మైర్నబాధ్యతే.** 3
**నాన్తర్ముఖతయా యోగీ దేహీ వేత్తి ప్రియాప్రియే**
**ఇంద్రస్యాహల్యయా సార్థముదన్తోత్ర నిదర్శనం.** 4

మనస్సే పరమ పురుషుడు. శరీరంతో చేయగలిగిందేమీ లేదు. అన్ని పనులూ మనస్సు వల్ల జరగవలసినవే! సామాన్య బ్రాహ్మణ బాలకులైన ఐందవులు దృఢమైన మనో నిశ్చయంతోనే - ధ్యానంతోనే - సృష్టి కర్తలైనారు. ధృఢమైన, మనస్సంకల్పంతోనే, శరీరం, అది చేయవలసిన పనులను చేస్తోంది. ఈ ప్రాపంచిక భ్రమలకు కారణం మనస్సే. పురుషుడు మనస్సు నందు దేహభావాన్ని వదలివేస్తే, శరీర ధర్మాలైన శీతోష్ణాదులు, మానావమానములు, మొదలైన వానిచే బాధింప బడడు. యోగి యొక్క మనస్సు అంతర్ముఖమై ఉంటుంది. కాబట్టి ద్వంద్వాలు అతనిని బాధింపవు. కాబట్టి, దేహ వాసన లేకుండా ఉండేటట్లు మనస్సును నిగ్రహించాలి. ఇందుకు దృష్టాంతంగా నీకు ఇంద్రుడు, అహల్యలకు సంబంధించిన వృత్తాంతాన్ని చెపుతాను.

ఇది విని శ్రీరాముడీ విధంగా అడిగాడు - '' ఓ మునీంద్రా! అహల్య ఎవతె? ఇంద్రుడెవరు? వారి వృత్తాంతం ఏమిటి? '' అని.

### కృత్రిమేంద్రోపాఖ్యనము:

వసిష్ఠుడిట్లా చెపుతున్నాడు - రామచంద్రా! పూర్వం మగధ దేశంలో ఇంద్రద్యుమ్నుడనే రాజు ఉండేవాడు. ఇతడు కూడా అంతకు పూర్వం ఉండినట్టి,

పురాణ ప్రసిద్ధుడు, విష్ణుభక్తి పరాయణుడు అయిన ఇంద్రద్యుమ్న మహారాజులాగానే ప్రసిద్ధుడు. అతని భార్య మిక్కిలి సౌందర్యవతి. పేరు అహల్య. పురాణ స్త్రీ అయినట్టి, గౌతముని భార్యయైనట్టి అహల్య వలెనే సౌందర్యవతి. ఆ పట్టణంలోనే ఇంద్రుడు అనే విటశ్రేష్ఠుడు ఉండేవాడు.

ఇంద్రద్యుమ్నుని భార్యయైన అహల్య, గౌతముని భార్యయైన అహల్య, దేవతలకు రాజైన ఇంద్రుని యెడల ఆసక్తయైనట్లు పురాణగాథను విన్నది. కాబట్టి, ఆమె తన పట్టణంలో ఉన్న విటశ్రేష్ఠుడైన ఇంద్రుని యెడ ఆసక్తయైనది; ప్రేమించినది. సదా, ఇంద్రనామ స్మరణ చేయసాగింది. ఆమె చెలికత్తెలు, జాలి చెంది, సమలంకృతయైన ఆమెను, ఏకాంతంలో ఇంద్రుని వద్దకు తీసికొనివెళ్లారు.

ఇంద్రుడు కూడా ఆమె యెడ ఆసక్తుడైనాడు. వారిరువురు, ఒకరినొకరు విడచి ఉండలేని స్థితికి వచ్చారు. అధర్మయుక్తమైన వీరి విషయం ఇంద్రద్యుమ్నునికి తెలిసింది. చాలాచింతించాడు, వారిని మందలించాడు. వారి ప్రేమను భగ్నపరచటానికి రక రకాల ఉపాయాలు ఆలోచించాడు. చివరకు అనేక విధాలుగా శిక్షించాడు. వారిని నీటిలో ముంచాడు. కాని, వారి ప్రేమ రోజు రోజుకూ వృద్ధిపొందుతూనే ఉంది. వారిని ఏనుగుల చేత త్రొక్కించాడు. కొరడాలతో కొట్టించాడు. అగ్ని జ్వాలలచే కాల్పించాడు. కాని వారికే విధమైన కష్టమూ కలుగలేదు. ఇందుకు కారణం ఏమిటి? అని, రాజు ఆ ప్రేమికులను అడిగాడు. వారీ విధంగా చెప్పారు -

ఆత్మానం న విజానీవో జాతావన్యోన్య తన్మయౌ
ముహ్యావో న మహీపాల స్వాంగైరపి వికర్తితైః 1
ఇష్టార్థే చిరమావిష్టం క్వాపి ధీరం మనః కృతం
భావం భావాః శరీరోత్థా నృప శక్తా న బాధితుం 2
ఆవాం తన్న విజానీ వో జాతా వన్యోన్యతన్మయౌ
భావితం తీవ్ర వేగేన మనసా యన్మహీపతే 3
తదేవ పశ్యత్యఖిలం న శరీర విచేష్టితం
న కాశ్చన క్రియా రాజన్ మునిశాపాదికా అపి 4
తీవ్ర వేగేన సంపన్నం శక్తాశ్చాలయితుం మనః
ఏక కార్యే ని విష్టం హి మనోధీరస్య భూపతే 5
న చాల్యతే మేరు రివ ప్రతి ఘాత శతైరపి. 6

ఓ రాజా! మేము మా మనస్సులోనే ఒకరి ముఖాన్ని ఒకరం తలుస్తూ, తన్మయత్వం పొంది, శరీరాలను మరచినాము. కాబట్టి, మా శరీరావయవాలను నరికినా మాకు బాధ లేదు. ఒక ఇష్ట వస్తువును చిరకాలం మనసులో భావిస్తూ ఉంటే, పురుషునికి ఆ వస్తువే కనపడుతుంది. అంతే తప్ప దేహ సంబంధమైన దుఃఖాలు అతనిని బాధింపవు. అందుకే మీరు పెట్టిన కష్టాలు మాకు తెలియదు.

మిక్కిలి ఆసక్తితో మనస్సు ఏ వస్తువును భావిస్తూ ఉంటుందో, ఆ వస్తువే పురుషునికి కనిపిస్తుంది. ఇతర పనులు గాని, శాపాలు గానీ తీవ్రధ్యానంలో ఉన్న మనస్సును కదిలించలేవు. ఒక పని యందు తదేక నిష్ఠతో నున్న ధీరుని చిత్తం, ఎన్ని ఆటంకాలు వచ్చినా మేరువు పర్వతం లాగా స్థిరంగా నిలిచి ఉంటుంది. ( మనస్సులో గట్టిగా నిశ్చయించుకొన్న దానిని ఎవరూ మార్చలేరు. కాబట్టి అహల్య నాతో పాటు ఎప్పుడూ ఉండనే ఉంది. నాకు ఆమె తప్ప వేరొక ధ్యాస లేదు. కాబట్టి, ఆమెతోడి సుఖం నేను ఎల్లప్పుడూ అనుభవిస్తూనే ఉన్నాను. అట్లాగే అహల్యాను. మా యిరువురి మనస్సుల్లోను ఇంద్రుడే నిజమైన ప్రేమికుడనీ, అహల్యే నిజమైన ప్రేమికురాలనే భావం బాగా దృఢమైంది. అది ఇక చెదరదు. వారి ప్రేమే మాకు ఆదర్శం. శరీరం, మనస్సుకు ఎన్నడూ కారణం కాదు. కాని, మనస్సే, శరీరానికి కారణం అనేది సత్యం. జీవునికి మొదటి శరీరం మనస్సే! అదే జీవుని సుఖాను భూతికి కారణమైంది. మనస్సులో 'అహం' నేను అనే భావం పుట్టినప్పుడే అనేక జీవ శరీరాలు పుట్టాయి. జీవత్వానికి మొదటి కారణం మనస్సే! దాని నుండే, చెట్టు నుండి కొమ్మలు పుట్టినట్లు శరీరాలు పుట్టాయి. స్వప్నంలో ఒక శరీరం పోతే వేరొక శరీరాన్ని - అనేక శరీరాల్ని - మనస్సే సృష్టిస్తోంది. )

**రాజన్ శరీర కలనాని పృథోత్థితాని**
**చేతోహి కారణ మమీషు శరీర కేషు** 7
**వారీవ సర్వ వనఖండలతారసేషు**
**ముఖ్యం శరీర మిహ విద్ధి మనోమహాత్మన్.** 8

రాజా! ఈ శరీరాలు వ్యర్థంగా పుట్టినాయి. అడవిలోని వృక్ష లతాదుల్లో ఉండే అనేక రసాలకు ఉదకమే కారణం అయినట్లు ఈ శరీరాలన్నింటికీ చిత్తమే ముఖ్య శరీరం అని గ్రహించు.

దేహేక్షతే వివిధ దేహగణం కరోతి
స్వాప్నావనావివ నవంనవ మాశుచేతః 9
చిత్తే క్షతేతు న కరోతి హి కించిదేవ
దేహాస్తత స్సమను పాలయ చిత్తరత్నం 10
తాభ్యాం తథైవ ముక్తోసౌ రాజా రాజీవ లోచనః
మునిం భరత నామానం పార్శ్వస్థం సమువాచ హ. 11
భగవన్ సర్వ ధర్మజ్ఞ పరమార్థ రస స్పృశః
రమయంత్యేవ చేతాంసి గిరః కామాంధయోరపి 12
శాసితౌ చ యథా శాస్త్ర మేతౌ నిర్వాసయామ్యహం
ఇత్యుక్త్వా రాజ శార్దూల స్తావుభౌ నిరవాసయత్. 13

ఇంద్రుడు చెప్పిన ఈ మాటలను విన్న ఇంద్రద్యుమ్న మహారాజు తన ప్రక్కనే కూర్చుండి యున్న భరత మునితో అన్నాడు -

''ముని సత్తమా! ఈ పాపిని చూచావు గదా! అధర్మ పద్ధతిలో నా భార్యను అపహరించిన వీనిని శపించు '' అని

భరతముని, వారిద్దరినీ నాశనమై పొమ్మని శపించాడు. అప్పుడు అహల్య, ఇంద్రుడు, వారితో ఇట్లా అన్నారు - ''మీరు మూర్ఖులు. ఓ మునీ! నీ శాపం వల్ల మాకేమీ నష్టం లేదు. నీ తపస్సే క్షీణించిపోతుంది. మా శరీరాలే నశించిపోతాయి. మా మనస్సుకు ఏ నష్టమూ లేదు. అది కనిపించనిది. స్థిరమైనది. అది యెన్నడూ ఎవరి వల్లా నాశనం కాదు.

ఇంద్రద్యుమ్నుడిట్లా అన్నాడు - 'ఓ మహర్షీ! చూచావు గదా! కామాంధులైనప్పటికీ వీరి పరమార్థ సంబంధమైన మాటలు సంతోషాన్నే కలిగిస్తున్నాయి. అయినా శాస్త్ర ప్రకారం వీరిని శిక్షించాలి '' అని వారిని దేశం నుండి వెడలగొట్టాడు.

(వారి శరీరాలు పండిన ఆకుల్లాగా రాలిపోయాయి. పిమ్మట వారిద్దరూ హరిణాలుగా పుట్టారు. తరువాత పక్షుల్లాగా పుట్టారు. ఇప్పుడు ప్రేమికులైన బ్రాహ్మణ దంపతుల్లాగా పుట్టారు. వారి శరీరాలు నశించినా మనస్సు మారలేదు. కాబట్టి వారు ఎక్కడ ఎప్పుడు పుట్టినా భార్య భర్తలుగానే పుడతారు.)

## ఆరవ సర్గ
## చిత్తోపాఖ్యానము

వసిష్ఠుడు రామునితో అంటున్నాడు - శ్రీరామా! ఇంత వరకు నీకు ఆఖ్యాన రూపంలో చెప్పిన విషయాన్నే సారాంశ రూపంలో సంక్షేపంగా చెపుతాను, విను. ప్రపంచంలో ప్రాణులన్నింటికీ రెండు రకాల శరీరాలు ఉంటాయి. మనస్సు అనే శరీరం ఒకటి, మాంసాస్థిరక్తమయమైన భౌతిక శరీరం రెండవది. మనశ్శరీరం ఏ పనినైనా త్వరగా చేయగలుగుతుంది. సదా చంచలంగా ఉంటుంది. మనస్సు యొక్క పుట్టుక ఎట్టిది? అంటే, ఆద్యంత రహితమైనట్టి, సర్వశక్తియుతమైనట్టి, పరమాత్మయొక్క సంకల్ప శక్తి చేత ఏర్పడిన రూపమే మనస్సు. స్థాణువా? పురుషుడా? అనే సందేహంతో కూడి, సంకల్పాభిముఖమై ఉండే భావమే మనస్సు యొక్క రూపం.

భౌతిక శరీరం శాపాలకు, ఆయుధ క్షతాలకు, వినాశనానికి పాత్రమౌతుంది. మానసిక శరీరం వాటి అన్నింటికీ అతీతం. ఆత్మ కున్నట్టి సంకల్ప శక్తితో కూడియున్న కల్పిత స్వరూపాన్నే మనస్సు అనవచ్చు. ఆ మనస్సు సంకల్పోన్ముఖమైనప్పుడు సదసత్తుల మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది మనస్సు, పవిత్రమైన సంకల్పాలతో, ఆలోచనలలో, తపస్సులో నిమగ్నమైతే మంచి ఫలితమే ఉంటుంది. శాపాల వంటివి దానిని ఏమీ చేయలేవు. కాబట్టి సంసార నివృత్తి కోసం మనస్సును నిగ్రహించాలి. ఈ విషయమై ఈ చిత్తాన్ని గూర్చి బ్రహ్మదేవుడు లోగడ నాకు చెప్పిన ఒక ఆఖ్యానాన్ని నీకు చెపుతాను, విను.

అస్తి రా మాటవీ స్ఫారా శూన్యా శాంతాతి భీషణా
యోజనాని శతం యస్యాం లక్ష్యతే కోణమాత్రకం 1
అస్యామేకో హి పురుషః సహస్ర కరలోచనః
పర్యాకుల మతి ర్భీమః సంస్థితో వికృతాకృతిః 2
స సహస్రేణ బాహూనా మాదాయ పరిఘాన్ బహూన్
ప్రహరన్నాత్మనః పృష్ఠే స్వాత్మనైవ పలాయతే 3
దృఢ ప్రహారైః ప్రహరన్ స్వయమేవాత్మ నాత్మని
ప్రవిద్రవతి భీతాత్మా స యోజన శతాన్యపి 4

క్రందన్ పలాయమానోసౌ గత్వా దూరమతస్తతః
శ్రమవాన్ వివశాకారో విక్షీర్ణ చరణాంగకః 5
పతితోవశ ఏవాశు మహత్యంధోంధ కూపకే
కృష్ణ రాత్రితమే భీమే నభో గంభీర కోటరే 6
తతఃకాలేన బహునా సోన్ధకూపాత్సముత్థితః
పునః ప్రహారైః ప్రహరన్ విద్రవ త్యాత్మనాత్మని. 7
పునర్దూరతరంగత్వా శశాంక కర శీతలం
కదలీకాననం కాంతం సంప్రవిష్టో హసన్నివ. 8
కదలీ ఖండ కాత్తస్మాద్విని ర్మ్యమ్యక్షణాత్పునః
స్వయం ప్రహారైః ప్రహరన్విద్రవ త్యాత్మ నాత్మని 9
పునర్దూర తరంగత్వా తమోవాంధోంధ కూపకం
స సంప్రవిష్ట స్త్వరయా విశీర్ణావయవా కృతిః 10
అంధ కూపాత్సముత్థాయ ప్రవిష్టః కదలీవనం
కదలీకాననా చ్చుభ్రం కరంజ వన గుల్మకం 11
కరంజ కాననా త్కూపం కూపా ద్రంభావ నాతరం
ప్రవిష్టః ప్రహరం శ్చైవ స్వయమే వాత్మని స్థితః 12

రామా! నూరు ఆమడల దూరం కలిగి, మనుష్య సంచారం లేని భయంకరమైన ఒక అడవి ఉంది. ఆ అడవిలో వేయేసి చేతులు, కండ్లు కలిగి, వ్యాకుల చిత్తుడైనట్టి, వికారాకారం కలిగిన పురుషుడొకడున్నాడు. వాడు తన వేయి చేతులతో ఇనుప చువ్వలను (బెత్తములను) తీసికొని తన వీపుపై తానే బాదుకొంటున్నాడు. అట్లా బాదుకుంటూ భయంతో నూరేసియోజనాల దూరం పరుగెత్తుతున్నాడు. అట్లా అరుస్తూ ఇటూ అటూ చాలా దూరం తిరిగి అలసిపోయి, అవశుడై కృష్ణపక్షపు రాత్రియందు కండ్లు కనిపించక ఆకాశం లాంటి భయంకరమైన చీకటి నూతిలో పడ్డాడు.

కొంత కాలం అక్కడ పడి ఉండి, మళ్ళీ లేచి, తన్ను తాను బాదుకుంటూ, పరుగెత్తుతూ, అగ్నిపైకి మిడుత ఎగిరి పడునట్లుగా ముండ్లతో చుట్టుకొని యున్న కరంజవనాన్ని (కానుగుచెట్ల తోపులో) ప్రవేశించాడు.

మళ్లీ అచటి నుండి బయలుదేరి తన్ను తాను కొట్టుకుంటూపోయి

చంద్రకిరణములచే చల్లగానున్న అరటి తోటలోకి ప్రవేశించాడు. కొంత సేపటికి లేచి మళ్లీ తన్ను తాను బాదుకుంటూ, పరుగెత్తుతూ, అలసి, కన్నులు కానక, చీకటి నూతిలో పడ్డాడు. ఆ నూతి నుండి మళ్ళీ లేచి, అరటి తోటను ప్రవేశించి, అచటి నుండి కానుగవనంలోకి పోయి, మళ్లీ చీకటి నూతిలో పడుతూ, అరటి తోటలో ప్రవేశిస్తూ తిరుగుతున్నాడు.

ఏవం రూప నిజాచారం సమాలోక్య చిరం మయా
అవష్టభ్య బలాదేవ ముహూర్తం ప్రతిబోధితః 13
పృష్టశ్చ క్స్త్వం కి మిదం కేనార్థేన కరోషి చ.
కించ వాభి మతం తేస్యా త్కిం ముధా పరిధావసి 14
ఇతి పృష్టేన కథితం తేన మే రఘునందన
నాహం కశ్చిన్న చైవేదం మునే కించిత్కరో మ్యహం 15
త్వయాహ మవభగ్నోస్మి త్వం మే శత్రురహో బత
త్వయాదృష్టోస్మి నష్టోస్మి దుఃఖాయ చ సుఖాయ చ 16
ఇత్యుక్త్వా వీక్షచాన్యంగా న్యాలోక్య స్వా న్యత్యుష్టిమాన్
రురోదాతి రవం దీనో మోఘో వర్షన్ని వారవీ 17
క్షణమాత్రేణ తత్రా సా వుపసంహృత్య రోదనం
స్వాన్యం గాని సమాలోక్య జహాస గ్రసభం చిరం 18
అథాట్టహాస పర్యంతే సంభ్రమాత్పురతో మమ
క్రమేణ తాని తత్యాజ స్వాన్యంగాని సమంతతః 19

అట్లా తిరుగుతూ ఉన్న వానిని చాలా కాలం చూచి, ఆతనిని కాస్సేపు బలవంతంగా ఆపి, ''నీవెవ్వడవు? ఎందుకిట్లా తిరుగుతున్నావు? దీని వల్ల ప్రయోజనం ఉన్నదా? లేక, వ్యర్థంగానే తిరుగుతున్నావా?'' అని అడిగాను.

వాడిట్లా అన్నాడు - 'ఓ మునీంద్రా! నేనెవ్వడనూ కాను. నేను ఏ పనీ చేయటం లేదు. నన్ను భంగపరచావు. కాబట్టి నీవు నాకు శత్రువవు. నీవు నన్ను చూడటంతోనే సుఖ దుఃఖాలనేవి ఏవీ లేకుండా నేను నష్టపోయాను.

అని పలికి, తన అవయవాలు చూచుకొని, మేఘ గర్జనం లాగా కొంత సేపు ఏడ్చి, మళ్లీ ఏడ్పు ఆపి తన అవయవాలను చూచుకొని అట్టహాసం చేశాడు. ఇట్లా అట్టహాసం చేసి క్రమంగా తన అవయవాలను నా ఎదుట విడిచిపెట్టాడు.

ప్రథమం పతితం తస్య శిరః పరమదారుణం
తతస్తే బాహవః పశ్చాద్వక్షస్తదను చోదరం 20
అథక్షణేన స పుమాన్స్వాన్యంగాని యథాయథం
సంత్యజ్య నియతేః శక్త్యాక్వాపి గంతుముపస్థితః 21
దృష్ట వానహమే కాన్తే పునరన్యం తథా నరం
ప్రహరంతం భ్రమంతం చ పర్యాకుల తరాంతరం 22
స మయా సమ్ముఖీ కృత్య పరిపృష్ట స్తథైవ హి
తేనైవాసౌ క్రమేణైవ రుదిత్వా సంప్రహస్య చ 23
అంగైర్వి శీర్ణతామేత్య యయావల మలక్ష్యతాం
దృష్టవానహ మేకాంతే తథైవాన్యః క్వచిన్నరః 24
పలాయమానః పతితో హ్యత్యంతాంధోంధ కూపకే
తత్రాహం సుచిరం కాల మవసం తత్ప్రతీక్షకః 25
అథాసౌ సుచిరే ణాపి కూపాన్నాభ్యుత్థితశ్శఠః
దృష్టవాన్పున రన్యం చ ప్రపతంత మితస్తతః 26
అవష్టభ్య తథైవాశు తస్య ప్రోక్తం చిరం మయా
దుర్మతి ర్మామసౌ మూఢ నైవ జానాసి కించన 27
అపైహి దుర్మతే త్యుక్త్వా స్వవ్యాపార పరోభవత్
ఏవం తస్మిన్మహారణ్యే బహవస్తాదృశా నరాః 28
పరిభ్రమంత స్తిష్ఠంతి విద్యతే ద్యాపి సాటవీ.
సా భీషణా వివిధ కంటక సంకులాంగీ 29
ఘోరాటవీ ఘనతమో గహనాపిలోకే
ఆగత్య నిర్వృతి మవాప్త విజావ బోధై 30
రాసేవ్యతే కుసుమ గుల్మక వాటి కేవ 31

ముందుగా ఆతని శిరస్సు క్రింద పడ్డది. తరువాత వరుసగా చేతులు, పిమ్మట రొమ్ము, పొట్ట, పడ్డాయి. అవయవాలన్నింటినీ యిట్లా వదలిపెట్టి, జ్ఞానశక్తిచే ఎచటికో పోవ యత్నించెను.

ఆ విజన ప్రదేశంలో, అతి వ్యాకుల చిత్తంతో, అట్లాగే తన్ను మోదుకుంటూ

పరుగెత్తే వానిని ఇంకొకనిని చూచాను. అతనిని 'నీవెవరవు?' అని అడిగాను. వెనుకటి వాని వలె అతడు కూడ, ఏడుస్తూ, అట్టహాసం చేస్తూ, శిథిలావయవాలను వదిలి కనపడకుండా వెళ్ళిపోయాడు.

ఆ అడవిలోనే మరొకనిని చూచాను. వాడు పూర్తిగా గ్రుడ్డివాడు. పరుగెడుతూ నూతిలో పడ్డాడు. లేచి వస్తాడేమోనని నిరీక్షించాను. ఎంత కాలం గడచినా ఆ చీకటి నూతి నుండి వాడు లేచి రాలేదు.

అట్లాగే వేరొకడు నాల్గు దిక్కులకు పరుగెడుతూ ఉన్న వానిని చూచి, అడిగాను. వాడు - 'ఓయీ! మూర్ఖుడా! నన్నే ఎరుగవా?' అంటూ తన పనిని ఆపకుండా తిరుగుతున్నాడు. ఇట్లా ఆ అడవిలో అనేక మంది తిరుగుతూనే ఉన్నారు.

ఇట్లా భయంకరమైనట్టి, అనేక రకాల దుఃఖములనే ముండ్లచే నిండి, దట్టమైన అజ్ఞానం అనే చీకటిచే క్రమ్మబడినట్టి అడవిలో (సంసారంలో) ఆత్మతత్త్వాన్ని తెలుసుకోలేనివారు, సుఖపడాలని తలచి, పుష్పోద్యానం అనే భ్రాంతిలో (విషయాసక్తితో) ఆ అడవినే సేవిస్తున్నారు.

ఇది విని, రాముడు అడిగాడు - ''మునీంద్రా! ఆ అడవి ఎక్కడ ఉంది? అందున్న పురుషులు ఎవరు? అట్లా ఎందుకు తిరుగుతున్నారో వివరించండి '' అని.

### చిత్తోపాఖ్యాన రహస్యం

వసిష్ఠ ఉవాచ -

రఘునాథ మహాబాహో శృణు వక్ష్యామి తే ఖిలం
న సా మహాటవీ రామ దూరేనైవ చ తే నరాః 32
సేయం సంసార పదవీ గంభీరా పారకోటరా
తాం త్వం శూన్య వికారాఢ్యాం విద్ధి రామ మహాటవీం 33
తత్ర తే తు మహాకారాః పురుషాః ప్రభ్రమంతి హి
మనాంసి తాని విద్ధి త్వం దుఃఖే నిపతితాన్యలం 34
ద్రష్టాయో యమహం తేషాం స వివేకో మహామతే
మయా తాన్యవబోధ్యంతే వివేకేన మనాంసి హి 35
పరంబోధం సమాసాద్య మత్ప్రసాదాన్మహామతే
మనాంసి కాని చిత్తాని గతాన్యుపశమం పరం 36

వసిష్ఠుడు చిత్తోపాఖ్యానాన్ని వివరిస్తున్నాడు -

రామచంద్రా! ఈ చిత్తోపాఖ్యాన రహస్యం విను. అడవి అని చెప్పబడినది నిజంగా అడవి కాదు. అది దూరంగానూ లేదు. దగ్గరగానూ లేదు. అందులో తిరిగేవారు పురుషులూ కారు. అసద్రూపమైన కార్యములతో కూడినట్టి సంసారమనే మహాటవి. అదే మిక్కిలి లోతైన బిలం లాంటిది. ఆ సంసారాటవిలో పడి తిరుగుచున్నవి మనస్సులని తెలుసుకో! ఆ మనస్సులే గొప్ప దేహాలతో పరిభ్రమిస్తున్న పురుషులన్నమాట. ఆ పురుషులను చూచిన 'నేను' అంటే,' వివేకం' అని గ్రహించు. 'నేను' ఆ పురుషులకు బోధించటం అంటే, వివేకం ఆ మనస్సులకు బోధించిందని అర్థం. నా చేత బోధింపబడి, కొందరు అవయవాలను వదిలిపెట్టినారు, అంటే వివేకం చేత బోధింపబడి మనస్సులు సంసారాన్ని వదలిపెట్టి ఉపశాంతిని పొందినాయి అని అర్థం.

కాని చిన్నాభినందంతి మాం వివేకం విమోహితాః
మత్తిరస్కార వశతః కూపేష్వివ పతంత్యథః 37
యేతేంధ కూపా గహనా నరకాస్తే రఘూద్వహ
కదలీకాననం స్వర్గః కరంజో మర్త్య మండలం 38
ప్రవిష్టాన్యంధ కూపాన్త ర్నిర్గతాని నయాని తు
మహాపాతక యుక్తాని నరకే తాని సర్వదా 39
యత్తత్కారంజగహనం తత్కాశ్రరసా విలం
దుఃఖం కంటక సంబాధం మానుష్యం వివిధైషణం 40
యై రహం పుంభి రబుధైర్బుద్ధ్యజేతి తిరస్కృతః
తైర్మనోభి రనాత్మజ్ఞై స్స్వవివేక స్తిర స్కృతః 41
త్వయా దృష్టోస్మి నష్టోస్మి శత్రుర్మేత్వమితి ద్రుతం
యదుక్తం తద్ధి చిత్తేన మమతా పరిదేవితం 42

'కొంత మంది నన్ను చూచి సంతసింపక తిరస్కరించి నూతులలో పడ్డారు' అంటే, కొన్ని మనస్సులు వివేకాన్ని ఆశ్రయించక తిరస్కరించినందున నరకంలో పడ్డారని భావం. రామా! చీకటి నూతులు అంటే నరకాలు. అరటి తోట అంటే స్వర్గం. కరంజవనం అంటే మర్త్యలోకమని భావం.

'చీకటి నూతుల్లో పడి వెలుపలికి రాకుండినవి ఏవి?' అంటే, మహాపాపాల

కారణంగా ఎల్లప్పుడూ నరకంలో పడి ఉండే మనస్సులు అని భావం. ముండ్ల తీగంచే కప్పబడిన కరంజవనం అంటే, ధనం భార్య పుత్రాదులందు ప్రేమతో (ఏషణత్రయం కలిగిన) నిండి దుఃఖకారకమైన మనుష్య లోకం, అని భావం.

కొంత మంది 'దుష్టుడా!' అని నన్ను తిరస్కరించారనగా, ఆత్మజ్ఞానం లేని మనస్సులు తమ వివేకాన్ని లెక్కచేయక తిరస్కరించారని భావం.

'నీవు చూడటం వల్ల నశించాను, నీవు నాకు శత్రువు'. అని చెప్పటం వల్ల, చిత్తం ఆత్మవిచారం వల్ల క్షీణిస్తూ విచారపడుతోందని గ్రహించాలి.

రుదితం యన్మహాక్రందం నీరాణాం తత్ర రాఘవ
సద్భోగజాలం త్యజతా మనసా రోదనం కృతం 43
అర్థప్రాప్త వివేకస్య న ప్రాప్తస్యామలం పదం
మనుష్యజతో భోగా న్పరి తాపోహి జాయతే. 44
హసితంతు యదానంది పుంసాం తదవబోధతః
పరిప్రాప్త వివేకేన సంతోషశ్చేతసా కృతః 45
పరిప్రాప్త వివేకస్య త్యక్త సంసార సంస్థితేః
చేతస్త్యజతో రూప మానందోహి వివర్ధతే 46
యదాసౌ సముపస్థభ్య మయాదృష్టః ప్రయత్నతః
తద్వివేకో బలాచ్చిత్త మాదత్త ఇతి దర్శితం 47
యదాత్మ ప్రహారౌఘైః పుమాన్ ప్రహరతి స్వయం
తత్ర త త్కల్పనా ఘాతైః ప్రహరత్యాత్మనా మనః 48
పలాయతే యత్పురుషః స్వాత్మానం ప్రహరన్ స్వయం
స్వవాసనా ప్రహారేభ్యస్తత్ర తత్ర మనః స్వయం 49
సంకల్ప వాసనాజాలైః స్వైరేహాయాతి బంధనం
మనోలీలా మయ్యై ర్బంధైః కోశకార క్రిమిర్యథా 50
ఏ తతే కథితం రామ చిత్తోపాఖ్యాన ముత్తమం
చిత్తైనేద మాలోక్య చిత్తత్యాగే స్థిరో భవ. 51

'అక్కడ పురుషులు ఏడుస్తున్నారు' అంటే, మనస్సులు భోగాలను వదలిపెట్టలేక ఏడుస్తున్నాయని అర్థం. తత్త్వం పూర్తిగా చక్కగా తెలియనందున భోగాలను వదలిపెట్టే సమయంలో మనస్సుకు పరితాపం తప్పదు గదా! 'అచట పురుషులు నవ్వుతున్నారు' అంటే, ఆత్మజ్ఞానం వల్ల మనస్సుకు సంతోషం కలిగింది

అని భావం. వివేకం కలిగి సంసారాన్ని వదలివేసి, తన రూపాన్ని వదలివేస్తున్న మనస్సుకు ఆనందం వృద్ధి అవుతుంది గదా!

'నేనా పురుషుని బలవంతంగా పిలిపి చూచాను' అంటే వివేకం, మనస్సును బలవంతంగా వశపరచుకొన్నదని భావం. 'ఒక మనుజుడు ఇనుప గుదియతో తన్నుతాను బాదుకొంటున్నాడు', అంటే, మనస్సు తన సంకల్పాంలో తనలో తానేకొట్టుమిట్టాడుతోందని భావం. 'తన్ను తాను కొట్టుకుంటూ పరుగెత్తటం' అంటే, మనస్సు తన చే కల్పింపబడిన వాసనలకు భయపడి అక్కడక్కడకు పరుగెత్తుతుంది అని భావం.

పట్టుపురుగు తన నోటి నుండి వచ్చే చొంగతో తయారైన దారంతో తన చుట్టూ తానే గూడు అల్లుకొని, ఆ గూటిలోనే బంధింపబడునట్లు, మనస్సు కూడా విలాసంగా తాను కల్పించుకొన్న వాసనలచే తానే బంధింపబడుతోంది. కాబట్టి, రామా! ఆశ్చర్యకరమైన ఈ చిత్తోపాఖ్యానాన్ని నీ చిత్తంచేతనే తెలుసుకొని, ఆ చిత్తాన్ని విడిచిపెట్టే విషయంలో జాగరూకుడవై ఉండు.

## ఏడవ సర్గ

## బాలకోపాఖ్యానము

వెనుకటి సర్గలో - చిత్తోపాఖ్యానంలో - మనస్సు తన సంకల్పబలంతో తానే బంధింపబడుతోంది. కాబట్టి మనస్సు విడువదగినది, అని తెలిసింది. దీనిని బట్టి మనస్సు అనేది ఒకటి ఉన్నదనీ తెలిసింది. ఆ మనస్సు చేతనే నిర్మింపబడిన జగత్తు సత్యం కాదనీ, అది అసత్యమనీ చెప్పటానికే ఈ బాలకోపాఖ్యానం చెపుతున్నారు.

వసిష్ఠుడీ విధంగా అంటున్నాడు - ''ఓ రామా! సమస్త శక్తులూ కలిగినదీ, నిత్యమైనదీ, అంతటా నిండియున్నదీ అయిన మనస్సే బ్రహ్మమని జ్ఞానవంతుల అభిప్రాయం. మనస్సంటే బ్రహ్మ కంటే భిన్నమైన వస్తువు అని అనుకో రాదు. జగత్తుకు మూలం పరమాత్మ. వ్యాపక స్వరూపం కల పరమాత్మ యందు లేని వస్తువు లేదు. ఈ పరమాత్మ ఏ వస్తు శక్తిచే ప్రకాశించునో ఆ వస్తువుగా ప్రకాసిస్తూ ఉంటుంది.

బ్రహ్మము యొక్క చిచ్ఛక్తి శరీరములందు, చలన శక్తి వాయువు నందు, కాఠిన్య శక్తి రాతియందు, ద్రవశక్తి నీటియందు, దాహకశక్తి అగ్నియందు, శూన్యశక్తి

ఆకాశమందు, నాశశక్తి నశించే వస్తువుల్లోను ఉంటుంది. నెమలి గ్రుడ్డు నందు చిత్ర- విచిత్ర వర్ణములతో కూడిననెమలి యున్నట్లుగా, పూలు, ఆకులు ,రెమ్మలు, కొమ్మలు గల వృక్షం విత్తనంలో ఉన్నట్లుగా అనేక విధాలుగా ఉండే జగత్తు పరబ్రహ్మమందు ఉన్నదని తెలుసుకో! ఒక్కొక్క దేశంలో, ఒక్కొక్క-కాలంలో, ఒక్కొక్కరకమైన ధాన్యములు కలిగినట్లుగా, ఒక్కొక్క చోట, ఒక్కొక్క సమయంలో పరమాత్మ యందు ఒక్కొక్క విధమైన వస్తుశక్తులు కలుగుతున్నాయి.

రామచంద్రా! పరమాత్మయే మనస్సని తెలుసుకో! సర్వవ్యాపకుడూ, స్వయంప్రకాశమానుడూ, గొప్ప శరీరం (మహావపుడూ) కలవాడూ అయిన పరమాత్మ, స్వల్పమైన సంకల్ప శక్తి కల వాడైనప్పుడు 'మనస్సు' అని వ్యవహరింప బడుతున్నాడు - మొదట మనస్సు, పిమ్మట బంధమోక్ష పరిజ్ఞానమూ, అనంతరం ప్రపంచ సృష్టి కలుగుతుంది. (బంధమోక్ష పరిజ్ఞానం లేకపోతే భోగమోక్షాల కొరకు కృషి చేయుటం ఉండదు. కాబట్టి భోగ మోక్ష వివేకం తప్పనిసరి.) ఇది అంతా దాది పిల్లవానికి చెప్పిన కథలాగా నిజంగా తోచినప్పటికీ, అది అసత్యమే!

శ్రీరామ ఉవాచ -

**కి ముచ్యతే మునిశ్రేష్ఠ బాలకాఖ్యాయికా క్రమః**
**క్రమేణ కథయైతన్మే మనో వర్ణన కారణం** 52

శ్రీరాముడిట్లా అడిగాడు -

''ఓ మునీంద్రా! మనస్సు యొక్క స్వరూపాన్ని తెలుసుకొనుటకైసాధకమైన ఆ బాలకోపాఖ్యానాన్ని చెప్పండి.'' అని.

వసిష్ఠ ఉవాచ -

**కోపి ముగ్ధమతిర్బాలో ధాత్రీం పృచ్ఛతి రాఘవ**
**కాంచిద్వినోదినీం వార్తాం ధాత్రి సం కథయాశు మే.** 53
**సా బాలస్య వినోదాయ ధాత్రీ తస్య మహామతే**
**ఆఖ్యాయికాం కథయతి ప్రసన్న మధురాక్షరాం** 54
**క్వచిత్సంతి మహాత్మానో రాజపుత్రాస్త్రయ శ్శుభాః**
**ధార్మికా శ్శౌర్య ముదితా అత్యంతా సతి పత్తనే** 55

ద్వౌ న జాతౌ తథైకస్తు గర్భఏవ హి న స్థితః
అథాప్యుత్తమ లాభార్థ మేకదా తే శుభాస్త్రయః 56
స్వకీయా చ్ఛూన్య నగరాన్నిర్గతా విమలాశయాః
గచ్ఛంతో గగనే వృక్షాన్ దదృశుః ఫలశాలినః 57

వసిష్ఠుడీ విధంగా చెపుతున్నాడు -

అమాయకుడైన (మూఢ బుద్ధి గల) బాలకుడొకడు తన దాదితో ''ఓ దాదీ! నాకు వినోదాన్ని కలిగించే కథను ఒక దానిని చెప్పు'' అని అడిగాడు. అంతట, ఆ దాది, పిల్లవానిని వినోదింపజేయటానికై చమత్కారంతో కూడిన ఒక కథను చెప్పింది -

'అసత్ పట్టణంలో' (అసలు లేనట్టి పట్టణంలో) ధర్మపరాయణులు, శౌర్యవంతులు అయిన ముగ్గురు రాజపుత్రులున్నారు. వారిలో ఇద్దరు ఇంకా పుట్టలేదు. ఒకడు తల్లిగర్భంలోనే పడలేదు. అట్టి ఆ ముగ్గురూ ఉత్తమ లాభం కోసం తమ పట్టణం నుండి (లేని తమ పట్టణం నుండి) బయలుదేరి పోతూ, ఆకాశంలో పండ్లతో కూడిన కొన్ని చెట్లను చూచారు.

తేషు విశ్రమ్య విశ్రమ్య భుక్త్వా స్వాదు చ తత్ఫలం
యయు స్సుఖం విలాసేన తేత్రయో రాజమానవః 58
సరిత్త్రితయ మాసే దుస్తతః కల్లోల మాలితం
తత్రైకా పరిశుష్కైవ మనాగ్వ్యంబు న ద్వయోః 59
పరిశుష్కా భృశం యా సా తస్యాంతే సస్నురాద్రులాః
చిరం కృత్వా జలక్రీడాం పీత్వా క్షీరోపమం పయః 60
అథాసే దుర్దినస్యాంతే భవిష్యన్నగరం త్రయః
దూరశ్రుత సముల్లాపం ఖేలన్నాగర మండలం 61
దదృశుస్తత్ర రమ్యాణి త్రీణ్యథో భవనాని తే
ఏకం నిర్భిత్తి నిస్తంభ మనుత్పన్నం గృహద్వయం 62

ఆ ముగ్గురు రాజకుమారులు, ఆ చెట్ల నీడలందు విశ్రమించి, తీయని ఆ చెట్ల పండను భుజించి హాయిగా వెళ్ళారు. అట్లా బయలుదేరిన వారు కల్లోలితములై యున్న మూడు నదుల వద్దకు చేరారు. ఆ నదుల్లో ఒకటి ఎండిపోయినది. మిగిలిన రెంటిలోనూ నీరు లేదు. వారు ఆ ఎండిపోయిన నదిలో

స్నానం చేశారు. చాలసేపు ఆ నదిలో జలక్రీడలాడి, పాలలాగా ఉన్న ఆ నదిలో నీటిని త్రాగి, వారు ముప్పురూ సూర్యాస్తమయానికి దూరంగా మాటలు వినిపిస్తూ ఉన్నట్టి, పురజనులు విహరిస్తూ ఉన్నట్టి, కట్టబోయే పట్టణాన్ని చేరారు. అట్లా వెళ్లిన వారు ఆ గ్రామంలో మూడు ఇండ్లను చూచారు. ఆ యిండ్లలో ఒక యింటికి గోడలు లేవు. వేరొక యింటికి స్తంభాలు లేవు, ఇంకొకటి కట్టబడనే లేదు.

అభిత్తి మందిరం చారు ప్రవిష్టాస్తే నృపాత్మజాః
ప్రాపుః స్థాలీత్రయం తత్ర తప్త కాంచన కల్పితం 63
తత్ర ఖర్పరతాం యాతే ద్వే ఏకా చూర్ణతాం గతా
జగృహు శ్చూర్ణతాం జాతాం స్థాలీం తే శుద్ధ బుద్ధయః 64
తస్యాం ద్రోణత్రయం పక్వం న్యూనం ద్రోణత్రయేణ తే
అంధస్తతో ద్విజై ర్భుక్తం నిర్ముఖై ర్బహుభోజిభిః 65
విప్ర భుక్తావశేషం తు భుక్త మంధో నృపాత్మజైః
భవిష్యన్నగరే తస్మిన్రాజపుత్రా స్త్రయో హి తే 66
సుఖమేవ స్థితా స్తత్ర మృగయావ్యవహారిణః 67

ఆ రాజపుత్రులు ఆ మూడు గృహాల్లోనూ, గోడలు లేని ఇంట్లో ప్రవేశించారు. అచట వారికి మూడు బంగారు పాత్రలు కనిపించాయి. ఆ మూడింటిలో రెండు పాత్రలు ముక్కలు ముక్కలుగా ఉన్నాయి. ఒక పాత్ర పొడిపొడియై యున్నది. వారు పొడియైపోయిన పాత్రనే గ్రహించారు. ఆ మూడు పాత్రలలోను, మూడు కుంచాలకు మూడు కుంచాలు తక్కువగా ఉన్న బియ్యం పోసి అన్నం వండారు. బాగాలిన గలిగినట్టి, నోరే లేనట్టి బ్రాహ్మణులకా అన్నం కావలసినంత పెట్టారు. వారు తినగా మిగిలిన దానిని రాజపుత్రులు భుజించారు. ఇట్లా ఆ ముప్పురూ, వేటాడటానికై, ఆ కట్టబోయే పట్టణంలోనే సుఖంగా ఉండిపోయారు.

ధాత్ర్యేతి కథితా రామ బాలకాఖ్యాయికా శుభా
నిశ్చయం స యయౌ బాలో విర్వి చారణయా ధియా 68
ఏషాహి కథితా రామ బాలకాఖ్యా యికా తవ
ఇయం సంసార రచనా విచారోజ్ఝిత చేతసాం 69
బాలకాఖ్యాయి కేవేత్థ మవస్థితి ముపాగతా
సంకల్ప జాల కలనైవ జగత్సమగ్రం 70

సంకల్ప జాల కలనాత్తు మనో విలాసః 71
సంకల్ప మాత్రమల ముత్సృజ నిర్వికల్ప
మాశ్రిత్య నిశ్చయ మవాప్ను హి రామ శాంతిం 72

రామచంద్రా! దాది ఈ విధంగా చెప్పగా, వివేక విచారణ బుద్ధిలేని ఆ బాలుడు ఆ కథ అంతా నిజమే అని నమ్మాడు. ఈ కథ అంతా ఆ బాలునికి సత్యంగా ఎట్లా అనిపించిందో, అట్లాగే మనసులో సత్యాసత్య విచారణ చేయలేని వారికి ఈ సంసారమంతా ( జగత్తు అంతా) సత్యంగానే గోచరిస్తుంది.

రామా! ఈ జగత్తు అంతా సంకల్ప జాలం వల్ల కలిగినదే కదా! మనస్సు కూడా సంకల్పం వల్ల కలిగినదే గదా! కాబట్టి, నీవు సంకల్పాన్ని వదలివేసి, నిర్వికల్పమైన తత్త్వాన్ని ఆశ్రయించి శాంతిని పొందు.

## ఎనిమిదవ సర్గ
## శాంబరికో పాఖ్యానము

వెనుకటి ఆఖ్యానంలో నిర్వికల్పమైన తత్త్వాన్ని ఆశ్రయించటానికై ఏమి చేయాలి? అని ప్రశ్నించుకొని, బ్రహ్మ విచారం చేయాలని వసిష్ఠుడు ఇంకా ఈ విధంగా చెపుతున్నాడు -

ఓ రామచంద్రా! మూర్ఖుడు తన సంకల్పం వల్ల మోహాన్ని పొందుతాడు. పండితుడు ఎన్నడూ మోహాన్ని పొందడు. కాబట్టి, నీవు మోహావేగం లేనట్టి ఆత్మ విచారణతో కూడిన బుద్ధితో సత్యస్వరూపమైన బ్రహ్మాన్ని గూర్చి విచారణ చేస్తూ, అసత్యమైన ఈ జగత్తును విడిచిపెట్టు.

ఆత్మకు ఏ విధమైన బంధమూ లేదు. అట్టి ఆత్మ బంధింపబడినదని తలచి అనవసరంగా ఎందుకు దుఃఖిస్తావు? అంతంలేని ఆత్మతత్త్వాన్ని బంధించగలిగింది ఏదీ లేదు.

జ్ఞానము, ఆనందము, నిర్వికల్పము అయిన స్వరూపం కలది ఆత్మతత్త్వం. అది అద్వితీయము. రెండవ వస్తువంటూ లేనప్పుడు బంధింపబడే వాడెవడు? ముక్తినొందిన వాడెవడు? అంటే, బంధ మోక్షములు కల్పితాలే తప్ప సత్యం కావు.

కాబట్టి, మనస్సు యొక్క సంకల్పమే బంధం అవుతోంది. మనస్సు, సంకల్పాన్ని వదలివేస్తే మోక్షమే! నిజానికి, లేనట్టి బంధాన్ని మనస్సు ఎట్లా కల్పించ గలుగుతుంది? అని నీవు అడగవచ్చు. మనస్సు యొక్క సంకల్ప బలం చేత గోష్పదమంత చోటే కొన్ని యోజనాల దూరం అవుతుంది. కొన్ని యోజనాల దూరం కూడా ఆవు పాదమంత అల్ప ప్రదేశం అవుతుంది. ఆ సంకల్పబలం వల్ల క్షణ కాలం ఒక బ్రహ్మకల్ప మౌతుంది. బ్రహ్మకల్పం ఒక క్షణమౌతుంది. ఈ విషయం మనకు స్వప్నాలలో అనుభవమే!

**లవణోపాఖ్యానం :** రామచంద్రా! జగత్తు అనే ఇంద్రజాలం ఈ మనస్సులో ఎట్లా ఉన్నదో తెలియజేయటానికై నీకు ఒక వృత్తాంతాన్ని చెపుతాను, విను.

ఈ భూమండలంలో, ఉద్యానవనాలతో అందంగా ఉండే, 'ఉత్తర - పాండవము' అనేదేశం ఉంది. ఆ దేశాన్ని లవణుడు అనే రాజు పాలిస్తున్నాడు. అతడు హరిశ్చంద్రుని వంశంలో పుట్టిన ధర్మ నిష్ఠుడు. భూలోకానికి సూర్యుని వంటివాడు, ఉదారుడు, కీర్తిమంతుడు.

ఒకనాడు ఆలవణుని ఆ స్థానానికి ఒక ఐంద్రజాలికుడు వచ్చాడు. రాజుకు నమస్కరించి అన్నాడు - ''రాజా! నా విద్యను ప్రదర్శిస్తాను. చూడండి'' అని, పలికి, పరమాత్మ యొక్క మాయలాగా నానా విధ సృష్టికి కారణమనే భ్రమను కలిగించే తన నెమలిపించాన్ని త్రిప్పాడు.

రాజు అట్లా కాంతిలో ప్రకాశిస్తూ తిరుగుతున్న నెమలిపించాన్ని చూచాడు. అట్లా చూస్తూ ఉండగానే సింధు దేశపు రాజు యొక్క సామంతుడు సభలోనికి ప్రవేశించాడు. ఆ సామంతునితో పాటు, మిక్కిలి వేగంగా పరుగెత్తజాలిన ఒక గుఱ్ఱం కూడా సభలోకి వచ్చింది. ఆ సామంతుడు ఆ గుఱ్ఱాన్ని పట్టుకొని రాజుతో ఇట్లా అన్నాడు. ( ఆ సభలో సామంతుడు, సామంతునితో పాటు ఒకగుఱ్ఱం కూడా వచ్చినట్లు రాజుకు భ్రాంతి కలిగింది) ఓ రాజా! మా సింధు దేశ ప్రభువు నీకు గుఱ్ఱాన్ని కానుకగా పంపించాడు. పెద్దలకు ఉత్తమ పదార్థాలను అర్పించటం వల్ల అవి ప్రకాశిస్తాయి గదా! (రాజతే హి పదార్థ శ్రీ ర్మహతా మర్పణాచ్ఛుభా) రాజా! నీ వీ గుఱ్ఱాన్ని ఎక్కి లోకంలో విహరించు, అని ఐంద్రజాలికుడన్నాడు. రాజు ఆ గుఱ్ఱాన్ని

చూడసాగాడు. అట్లా రెప్ప వాల్చకుండా గుఱ్ఱాన్ని చూస్తూ, ఏదో ధ్యానం చేస్తున్న వానివలె నిశ్చేష్టుడైయున్నాడు.

మంత్రులు, సభాపతులు, ఆశ్చర్యంతో, అనుమానంతో విచారింపసాగారు. సభలోని కోలాహలం చల్లారింది. భయ, మోహాలుసభలోని వారిని ఆవహించినాయి. నాలుగు గడియల పిమ్మట లవణునికి తెలివి వచ్చింది. సింహాసనం మీద కూర్చుండి గడగడ వణకుతున్నాడు. ఎదుట నున్న వారాతనిని పట్టుకొన్నారు.

కొంత సేపటికాతనికి తెలివి వచ్చింది. మంత్రులు, సదస్యులు ఆతనిని ఇట్లా అడిగారు - ''ఓ రాజా! జ్ఞానముగల మనస్సు మోహాన్ని పొందదు. నిర్మలమైన నీ మనస్సు భ్రాంతిని పొందటానికి కారణం ఏమిటి?'' అని.

రాజు కండ్లు తెరచి ఆశ్చర్యంతో సభాసదులకు తన వృత్తాంతాన్ని ఇట్లా చెప్పాడు - ''ఇంద్రజాలికుడు నెమలి పింఛాన్ని త్రిప్పగానే భ్రమించినవాడనై ఆ గుఱ్ఱాన్ని ఎక్కి ఎక్కడికో పోతున్నాను. విషయ భోగాల యందు ఆసక్తమైన చిత్తం, మూర్ఖుని దూరానికి తీసికొనిపోవునట్లుగా ఆ గుఱ్ఱం నన్ను చాలా దూరం తీసికొని వెళ్లింది. అంతట, ప్రళయ కాలంలో కాలిపోయి చల్లారిన అడవిలాగా ఉన్న ప్రదేశాన్ని చేరాను. అచట చెట్లు చేమలు గాని, నీరు గాని లేదు. మంచు మాత్రం విస్తారంగా ఉంది.

ఆ అడవిలో నాకు చాలా కష్టం కలిగింది. పగలల్లా తిరుగుతూ ఉన్నాను. వివేకవంతుడు సంసారాన్ని తరించినట్లుగా, అతి కష్టం మీద కొద్దిగా నీరు, చెట్లు ఉన్న చోటుకు చేరాను. నేరేడు వంటి కొన్ని ఫల వృక్షాలచట ఉన్నాయి. అచట ఒక నిమ్మ చెట్టు క్రిందికి పోగా, ఆ చెట్టుపై నుండి వ్రేలాడు తీగకు చిక్కి నేను గుఱ్ఱము పై నుండి జారి, తీగకు వ్రేలాడుచుంటిని. అప్పుడా గుఱ్ఱం, గంగానదిలో మునిగిన వాని పాపాలు, మనుజుని వదలి పోయినట్లుగా ఆ గుఱ్ఱం నన్ను వదలి వెళ్లిపోయినది. అంతట నేను బాగా అలసియున్నందున ఆ రాత్రిని ఒక కల్పంలాగా చీకటిలో, చలితో, గడిపాను. మూర్ఖునిలో మంచి గుణం అనేది ఏ మాత్రమూ కనిపించనట్లుగా, ఆ చీకటి రాత్రిలో నాకేమీ కనుపించలేదు. పక్షులు మాత్రం ఏవో ధ్వనులు చేస్తున్నాయి.

ఇట్లా ఆ రాత్రి గడచింది. నాలుగు గడియల ప్రొద్దెక్కింది. నేను అక్కడ తిరుగుతూ ఉండగా ఎక్కడికో అన్నం తీసికొని పోతున్న ఒక కన్య నాకు కనిపించింది. ఆకలిగా నున్న నాకు అన్నము పెట్టమని ఆ కన్యను అడిగాను. ఎంత ప్రార్థించినా, పాపికి, లక్ష్మీదేవి ధనము ఇవ్వనట్లుగా ఆమె నా కేమియు పెట్టలేదు. నేను, వదలక ఆమెనే అనుసరించి పోతూ ఉండగా ఆమె "ఓ రాజా! నేను చండాల కన్యను. అడిగినంత మాత్రం చేతనే నీకు నేను అన్నం పెట్టను. నీవు నాకు భర్తవైతే నీకు భోజనం పెడతాను. ఇచట నా తండ్రి ఎద్దకు దున్నటం అలవాటు చేస్తున్నాడు. నీవు నన్ను వివాహమాడుటకు అంగీకరిస్తే నా తండ్రితో పాటు ఈ అన్నాన్ని నీకు పంచియిస్తాను." అన్నది.

అంత నేను, "ఓ కామినీ! ఆపత్కాలంలో కులాన్ని ఎవరు లెక్కచేస్తారు? (కేనా పది విచార్యంతే వర్ణజాతి కులక్రమాః) కావున నేను నీకు భర్తనౌతాను" అన్నాను.

నా మాట కంగీకరించి ఆమె నాకు అన్నంలో సగం పెట్టింది. దానిని తిని, నేరేడు పండ్ల రసాన్ని త్రాగాను. పిమ్మట ఆ చండాల కన్యక నన్ను చేత పట్టుకొని, దుర్మార్గుని అవీచి అనే నరకానికి చేర్చినట్లు, నన్ను భయంకరుడైన తన తండ్రి వద్దకు చేర్చింది. కూతురు చెప్పిన మీదట అతడు నన్ను ఆమెకు భర్తగా అంగీకరించాడు. సాయంకాలమైంది. అతడు ఎద్దను విడిచాడు. మేము చండాల వాటికను ప్రవేశించాము. ఆతడు తన భార్యతో ఈతడు మన అల్లుడని చెప్పాడు. అచటి వాతావరణం దుర్భరంగా ఉంది. తప్పటలు మ్రోగిస్తూ, సురాపానం చేస్తూ, బొబ్బలు పెడుతున్నారు. నేను ఆ చండాల వాటికలో ఉంటూ ఉండగానే, నెలలు గడిచాయి. నా వల్ల ఆమె ఒక కుమార్తెను కన్నది - ఆపద దుఃఖ క్రియను కన్నట్లు (విపద్దుఃఖ క్రియామివ) ఆ పిల్ల, మూర్ఖునికి చింతపెరిగినట్లు (మూర్ఖే చింతేవ వవరీ) పెరుగుతోంది. మళ్లీ మూడు సంవత్సరాలకు ఒక కొడుకును కన్నది - దుష్టబుద్ధి అనర్థాన్ని కన్నట్లు (అనర్థమివ దుర్బుద్ధిః) ఇట్లా ఆ చండాల కన్యతో చాలా కాలం గడిపాను. 'దార' పుత్రాదుల్ని పోషించటానికై బాధపడుతున్న నాకు ఎటు చూచినా కాలిపోతున్నట్లే తోచింది.

ఇట్లా కాలం గడుస్తూ ఉండగా, నాకు ముసలి తనం వచ్చింది. తెల్లటి సుంచుచే తడిసిన గడ్డి పరకల్లాగా మీసాలు నెరసినాయి. కఱవు వచ్చింది. తిండి, నీరు లేదు. జనమంతా వింధ్య పర్వత ప్రాంతానికి వలసపోయినారు. వర్షాలు లేవు. గాలి నిప్పులు చెరుగుతోంది. జనం నశిస్తున్నారు. ఇల్లు వాకిలి వదలిపోయినవారు కొందరు. కొందరు ఆకలి చేత, కష్టాల వల్ల, అగ్నిలో పడి, నూతుల్లో దూకి మరణించారు.

నేను కూడా భార్యను పిల్లలను తీసికొని దేశాంతరం పోతూ అలసి, ఒకతాటి చెట్టు క్రింద పిల్లల్ని దింపి విశ్రమించాను. ఆ చండాల కన్యక తన యిద్దరు పిల్లలను కౌగలించుకొని నిద్రిస్తూ ఉండగా, చివరి పిల్లవాడు నా ఎదుట కన్నీరు నింపి దైన్యంతో అన్నాడు - ''తండ్రీ! నాకు తినటానికి మాంసమూ, త్రాగటానికి నెత్తురూ తెచ్చిపెట్టు.'' ఇట్లా మాటి మాటికీ అంటూ ప్రాణాలు కోల్పోయే స్థితికి వచ్చాడు.

బాలుని దుఃఖం చూచి నేను బాధపడి, ఆ విపత్తును దాటలేక, బుద్ధిచెడి, చచ్చిపోవటానికి నిశ్చయించుకొన్నాను. ఈ నిశ్చయానికి వచ్చి, కట్టెలు తెచ్చి, చితిపేర్చి అగ్నినుంచాను. చిటపటలాడుచు కాలుచున్న ఆ చితిలో ప్రవేశింపబోవు నంతలో ఈ సింహాసనం కదిలింది. అంతలో తూర్యనాదాలతోను, జయ నాదాలతోను తెలివి నొందినాను.

అజ్ఞానము, జీవునికి అనేక విధాలైన మోహాన్ని కలిగించునట్లుగా, ఈ ఐంద్రజాలికుడు నాకు మోహాన్ని కలిగించాడు. ఈ విధంగా లవణ మహారాజు చెపుతూ ఉండగానే ఐంద్రజాలికుడు క్షణంలో అదృశ్యమైపోయాడు.

ఇది చూచిన సభ్యులు, రాజా! ఈతడు ఐంద్రజాలికుడు కాడు. ఐంద్రజాలికుడైతే ధనం యాచించేవాడు గదా! ఇది సంసార స్థితిని తెలియజేసే యోగమాయయే తప్ప ఇతరం కాదు. సంసారం అంటే మనస్సు యొక్క వివర్తమనీ, మనస్సు అంటే పరమాత్మ యొక్క వివర్తమనీ ఈ వృత్తాంతం చెపుతోంది గదా! అని అంతా ఆశ్చర్యచకితులైనారు.

# తొమ్మిదవ సర్గ
## లవణోపాఖ్యానము

''ఈ ప్రపంచమంటే, పరమాత్మయొక్క వివర్తరూపమైన మనస్సు యొక్క విలాసమే! కాబట్టి ప్రపంచం మిథ్య. దీనికి అధిష్ఠానమైన బ్రహ్మమే సత్యం'' అని ఈ ఉపాఖ్యానాల వల్ల ప్రతిపాదింపబడ్డది. అయితే, బ్రహ్మమనేది సత్యమని తెలిస్తే చాలదు. దాని అనుభవం తేటపడాలంటే మనస్సు స్థిరంగా ఉండాలి. ప్రాపంచిక విషయాల జోలికి దానిని పోనీయకుండా నిరోధించాలి. దీనిని బోధించదలచిన వసిష్ఠుడు ఇంకా ఇట్లా చెపుతున్నాడు -

**యత్కృతం మనసా నామ తత్కృతం విద్ధి రాఘవ**
**యత్త్యక్తం మనసా తావత్త్యక్తం విద్ధి రాఘవ.** 73
**యస్యా చపలతాం యాతం మనో మనన వివర్జితం**
**అనుత్తమ పదేనాసౌ ధ్యానే నానుగతోనఘ** 74
**సంయమాత్మనః శాంతిమేతి సంసార విభ్రమః**
**మందరే స్పందతాం యాతే యథాక్షీర మహార్ణవః** 75
**మనసో వృత్తయో యాయా భోగసంకల్ప విభ్రమాః**
**సంసార విష వృక్షాణాం తా ఏవాం కుర పంక్తయః** 76

రామచంద్రా! మనస్సు చేసిన పనియే పని అవుతుంది. శరీరం చేసిన పని, పని కానే కాదు. అంటే, కర్మకు మనస్సు ప్రధానం. కాబట్టి మనస్సు చేత మనం వదలిపెట్టినదే ప్రధానం. శరీరం చేత వదలిపెట్టినది ప్రధానం కాదు. ఎవని మనస్సు చలించకుండా, సంకల్పాలు లేకుండా ఉంటుందో, అట్టివాడే నిజంగా ధ్యాని అనిపించుకుంటాడు. అట్టివాని ధ్యానమే చిద్రూపుడైన పరమాత్మను ప్రకాశింపజేయగలుగుతుంది. కాబట్టి మనోనిశ్చలత్వం అవసరం. మందర పర్వతం కవ్వంలాగా చలించకుండా ఉంటే, పాలసముద్రం సంక్షోభం లేకుండా ఉంటుంది. అట్లాగే మనస్సు నిరోధింపబడి చలించకుండా ఉంటే సంసారభ్రాంతి ఉండదు. విషయవాసనా సంకల్పంతో కూడిన మనోవృత్తులే, సంసారం అనే విషవృక్షానికి మొలకలు అని తెలుసుకో!

చిత్త వ్యాధికి చికిత్స :- విషయభోగ సంకల్పాలు చిత్తానికి సంక్రమించిన

రోగం. దీనికి అనుపానం లేకుండా తేలికగా ఉండేదీ, మధురమైనదీ, నిశ్చయంగా వ్యాధిని నయం చేసేదీ అయిన పరమౌషధాన్ని చెపుతాను. విను!

ఇష్ట వస్తువును విడిచిపెట్టి, మనస్సును బాహ్య విషయాల మీదకు పోనీయకుండా చూచుకోవాలి. అప్పుడు మనస్సుకు దుఃఖం ఉండదు. అట్టి మనస్సు కలవాడు మనస్సును జయించిన వాడన్నమాట. తనకు హితమైనట్టి కోరికను విడిచిపెట్టాలనే జ్ఞానం లేనివాడు క్షుద్రమైన పురుగుతో సమానుడు. నిందార్హుడు.

మనస్సును జయించాలంటే కోరికను వదలివేయాలని అన్నారుగదా! మరి, కోరికను వదలటానికి ఉపాయం ఏమిటి? అంటే, ఇనుమును నరకాలంటే, ఇనుప సాధనాన్ని బాగా సానపెట్టి, కాచి చల్లార్చాలి. పిమ్మట మనం నరకదలచిన ఇనుమును ఎఱ్ఱగా కాల్చి తేలికగా నరుకుతాం. అట్లాగే, వేదాంతశాస్త్రాభ్యాసంచేత, సత్పురుష సాంగత్యం చేత,చురుకైనట్టి, సంతాపం లేనట్టి మనస్సు తోనే, సంసార చింత చేత కాగినట్టి మనస్సును ఛేదించాలి. చిత్తశాంతి అనేది పురుష ప్రయత్నంచేతనూ, కోరికను విడుచుటచేతనూ మాత్రమే సిద్ధిస్తుంది. దీనికి మరొక ఉపాయం లేదు. సంకల్పరాహిత్యం అనే శస్త్రం చేత నరుకబడి, మనస్సు అడగిపోయినప్పుడు సర్వవ్యాపకమైన బ్రహ్మము సిద్ధిస్తుంది. అప్పుడు నీవు చిత్తం కంటె భిన్నుడవై, సాక్షిరూపుడవు అవుతావు. అవహితచిత్తం తో మనసునందు బ్రహ్మాన్ని భావించాలి.ఇట్లా భావిస్తూ మనస్సును విడిచిపెట్టి మనసుకంటె పరమైనట్టి, ఆత్మను ధారణచేయాలి.

యమము, నియమము మొదలైన పురుష ప్రయత్నాన్ని ఆశయించి మనస్సును సంకల్పరహితం చేయాలి. అప్పుడు బ్రహ్మపదాన్ని పొందుతావు. బ్రహ్మపదాన్ని పొందినవారికి నాశము లేదు.

**అనుద్వేగ శ్శ్రియో మూలమనుద్వేగా త్ప్రవర్తతే**
**జంతోర్మనోజయో యేన త్రిలోకే విజయస్తృణం 77**
**ధ్యానతో హృదయాకాశే చితిచిచ్ఛ క్రధారయా**
**మనో మారయ నిశ్శంకం తతో బధ్నంతి నాధయః 78**

ఉల్లాసమనేది సంపదకు మూలం. ఉత్సాహంవల్లనే మానవునికి మనస్సు మీద విజయం లభిస్తుంది. అట్టి మనోజయంతో మూడు లోకాలను జయించటం తేలిక. హృదయాకాశంలో, జ్ఞానస్వరూపుడైన పరమాత్మను గూర్చిన ధ్యానం

చక్రాయుధం లాంటిది. చక్రాయుధంతో మనస్సును నిస్సంశయంగా చంపితే మనో వ్యాధులు నిన్ను బంధింపవు.

కల్పాంత వాయువులు వీచుగాక, సప్త సముద్రములు ఏకమగుగాక, పండ్రెండు మంది సూర్యులు తపింతురుగాక, సంకల్పరహితునికి మాత్రం ఏవిధమైన బాధ ఉండదు.

**న హి చంచలతా హీనం మనః క్వచన విద్యతే**
**చంచలత్వం మనోధర్మో వహ్నేర్ధర్మో యథోష్ణతా** 79
**యైషా హి చంచలా స్పందశక్తి శ్చిత్తత్వ సంస్థితా**
**తాం విద్ధి మానసీం శక్తిం జగదాడంబ రాత్మి కాం** 80
**యత్తు చంచలతా యైషా త్వవిద్యా రామ సోచ్యతే**
**తదేవ చ తపశ్శాస్త్రం సిద్ధాంతో మోక్ష ఉచ్యతే** 81
**తస్య చంచలతా యైషా త్వవిద్యా రామ సోచ్యతే**
**వాసనా పరనామ్నీం తాం విచారేణ వినాశయ.** 82
**అవిద్యయా వాసనయా తయాం తశ్చిత్త సత్తయా**
**విలీనయా త్యాగవశాత్పరం శ్రేయోఒధిగమ్యతే** 83

ఉష్ణత్వం అనేది అగ్ని యొక్క ధర్మంలాగానే, చంచలత్వం అనేది మనస్సు యొక్క ధర్మం. వేడిలేని అగ్ని ఉండదు.చాంచల్యం లేని మనస్సూ ఉండదు. రామచంద్రా! బ్రహ్మచైతన్యంలో చంచలస్వభావమైనట్టి, జగద్భ్రాంతిని కగించే శక్తిని మనశ్శక్తి అని గ్రహించు. చంచలత్వం లేని మనస్సే బ్రహ్మమనీ, అదేతపస్సనీ, అదే మోక్షమనీ, శాస్త్రాలు సిద్ధాంతం చేసి చెప్పినాయి. రామా ! ఆ మనస్సు యొక్క చాంచల్యమే అవిద్య. దానినే వాసన అంటారు. అట్టి అవిద్యను, ఆత్మ విచారణ చేత పోగొట్టు కోవాలి. కోరికను వదలి వేయటం వల్ల, అవిద్య, వాసన అని పేర్కొనబడే చాంచల్యం నశించిపోగా బ్రహ్మానందం లభిస్తోంది.

ఇదంతా విని శ్రీరాముడిట్లా అడిగాడు ''మునీంద్రా ! కనిపించే జగత్తంతా అవిద్య అనీ, ఆ అవిద్య, పరమాత్మను భావించటం చేత నశిస్తుందనీ చెప్పారు గదా! పరమాత్మ ఎటువంటి వాడో చెప్పండి'' అని.

**ఆత్మ స్వరూప నిరూపణం : వసిష్ఠ ఉవాచ :**
**చేత్యాను పాతరహితం సామాన్యేన చ సర్వగం**
**యచ్చిత్తత్త్వ మనాఖ్యేయం సఆత్మా పరమేశ్వరః** 84

సర్వం చ ఖల్విదం బ్రహ్మ నిత్యం చిద్ఘన మవ్యయం
కల్పనాన్యా మనోనామ్నీ విద్యతే నహి కాచన 85
న జాయతే న మ్రియతే కించి దత్ర జగత్రయే
న చ భావ వికారాణాం సత్తా క్వచన విద్యతే 86
కేవలం కేవలాభాసం సర్వసామాన్య మీక్షయం
చేత్యాను పాతరహితం చిన్మాత్రమిహ విద్యతే 87

దృశ్య సంబంధంలేనిదీ, హెచ్చు తగ్గులు లేక, అంతటా వ్యాపించి యుండినదీ, ఇట్టిదని చెప్పుటకు శక్యంకానట్టి ఏ పదార్థం ఉన్నదో అదే ఆత్మ, లేక, పరమేశ్వరుడు మనకండ్లకు కనిపించే ప్రపంచం అంతా త్రికాలా భాధ్యము, చిద్రూపము అయిన ఆ పరమాత్మ యొక్క వివర్తమే ! మనస్సు అనే కల్పన కూడా బ్రహ్మము కంటె భిన్నమైన దేమీ కాదు. ఈ జగత్తంతా ఏవస్తువునుండీ పుట్టటం లేదు, మృతి నొందటమూలేదు. కాబట్టి, జనన మరణాలు మొదలైన భావాలకు ఎక్కడా తావేలేదు. అద్వితీయము, స్వయం ప్రకాశమానము అయి, సర్వత్ర సమానంగా ప్రకాశించేదీ, దృశ్య సంబంధం లేనిదీ, సత్ మాత్రమే రూపంగా కలదీ బ్రహ్మము ఒక్క టే ఉంది.

( నిరుపద్రవమైన ఆ బ్రహ్మమే ఉపాధివశం వల్ల ఉపద్రవం కలదీ, మనన శక్తివల్ల మనస్సుగానూ అవుతోంది. ఈ మనశ్శక్తి సంకల్పం వల్ల పుడుతోంది. గాలివల్ల ( ప్రజ్వలించిన అగ్ని, గాలివల్లనే ఆరిపోవునట్లుగా సంకల్పంచే పుట్టిన మనస్సు, సంకల్పంచేతనే అణగిపోవాలి.)

**లవణుని వృత్తాంతం :-** శ్రీరాముడిదంతావిని ఇట్లా అడిగాడు - '' మునీంద్రా ! లవణ మహారాజు అటువంటి ఆపదను ఎందువల్ల పొందాడు ? '' అని.

వసిష్ఠుడీవిధంగా చెప్పాడు - '' రామ చంద్రా ! లవణుడు మనో భ్రమవల్ల చండాలత్వాన్ని పొందిన వృత్తాంతం చెపుతున్నాను విను. దీనివల్ల మనస్సే కర్త అనీ, అదే కర్మఫలాన్ని అనుభవిస్తోందనీ తెలుసుకోగలవు.

హరిశ్చంద్ర వంశజుడైన లవణమహారాజు, ఒకప్పుడు, తన తాతయైన హరిశ్చంద్రుడు రాజసూయం చేశాడు కాబట్టి తాను కూడా చేయాలని అనుకున్నాడు. అట్లా తలచి మనస్సులోనే యాగ దీక్ష గ్రహించాడు. మనస్సు

లోనే యాగం చేస్తూ దేవతలనూ, బ్రాహ్మణులనూ పూజిస్తున్నాడు. ఇట్లా ఒక సంవత్సరం పైగా గడచింది. (అంతకాలం గడచినట్లు మనస్సులోనే తోచింది) తనకున్న సంపదనంతటినీ బ్రాహ్మణులకు ఇతరులకు దక్షిణగా ఇచ్చాడు. ఈ విధంగా లవణ మహారాజు మనస్సు తోనే యాగంచేసి, రాజసూయం చేసినవాడైనాడు - యాగఫలం పొందాడు. రామచంద్రా ! దీనివల్ల కర్త మనస్సే, అనీ, సుఖదుఃఖాలను అనుభవించేది మనస్సే అనీ నీవు తెలుసుకో ! అట్టి మనస్సును బ్రహ్మమందు లగ్నం చెయ్యి.

ఇంద్ర జాలికుడు అదృశ్యుడైపోగా అచటి సభ్యులు, వారితో పాటు రాజు, ఇదంతా ఏమిటి ? అని నన్ను అడిగారు. నేను ఆలోచించి ఆ వృత్తాంతం తెలుసుకొని ఈవిధంగా చెప్పాను.-

రాజసూయ యాగం చేసిన వారు అనేక రకాల దుఃఖాలను పంద్రెండు సవంత్సరాలపాటు అనుభవిస్తారు. కాబట్టి, లవణ భూపాలునిచేత దుఃఖం అనుభవింపజేయటానికై ఇంద్రుడు అతని వద్దకు ఇంద్రజాలికుని (దేవ దూతను) పంపాడు. అతడు లవణునికి ఆపద కలిగించి అదృశ్యుడైనాడు.

ఓ రామచంద్రా ! జ్ఞానాజ్ఞాన భూమికలను గూర్చి (అవస్థలనుగూర్చి) చెపుతాను, తెలుసుకో. ముఖ్యంగా జ్ఞానభూమి ఏడు విధాలుగా, అజ్ఞాన, భూమి ఏడు విధాలుగా ఉంటుంది. ఇవే కాక, ఇంకా అవాంతర భేదాలుకూడా ఉంటాయి. ఈ రెంటి మూలంగా బాగా వృద్ధిపొందితే వీటినుండి పరిపుష్టములైన వివిధ శాఖలు,.వివిధ ఫలాలను ఇస్తాయి.

జ్ఞాని, అజ్ఞానుల లక్షణాలు:-

స్వరూపావస్థితిర్ముక్తి స్తద్భ్రంశోహం త్వవేదనం
ఏతత్సంక్షిప్య తత్రోక్తం తద్ జ్ఞాత్వాజ్ఞత్వ లక్షణం 88
శుద్ధ సన్మాత్ర సంవిత్తేః స్వరూపాన్న చలంతి యే
రాగద్వేషాదయో భావా స్తేషాం నాజ్ఞత్వ సంభవః 89
యత్స్వరూప పరిభ్రంశ శ్చేత్యార్థచితి మజ్జనం
ఏతస్మాదపరో మోహో న భూతో న భవిష్యతి. 90
అర్థాదర్థాంతరం చిత్తేయా తి మధ్యేతు యా స్థితిః
నిరస్త మననాకారా స్వరూపస్థితిరుచ్యతే 91

**సంశాంత సర్వ సంకల్పా యా విలా వదవ స్థితిః**
**జాడ్య నిద్రా వినిర్ముక్తా సా స్వరూప స్థితిః స్మృతా** 92
**అహంతాంశే క్షతే శాంతే భేదే నిష్పందచిత్తతా**
**అజడా యా ప్రకచతి తత్స్వరూప మితిస్థితం** 93

సత్యజ్ఞానానంద లక్షణమైన స్వరూపంలో స్థిరంగా ఉండటమే ముక్తి. ఈ లక్షణం కలవాడు జ్ఞాని. దేహేంద్రియాదులే నేను అని తలచటమే బంధము. ఇట్టి లక్షణం కలవాడు అజ్ఞాని.

దృశ్య సంబంధం లేనట్టి, సత్య జ్ఞానములు లక్షణంగా కల నిజ స్వరూపం నుండి చలింపనివారికి రాగద్వేషాదులు ఉండవు కాబట్టి వారికి అజ్ఞాన సంబంధం ఉండదు.

చిద్రూపం కలవాడైన ఆత్మ సత్య జ్ఞానానందరూపమైన తన రూపాన్ని మరచి, జడములైన దేహేంద్రియాదులేనేను అని తలచి ( దృశ్యములందు మునింగి) భ్రమించటమే మోహం. దీనిని మించిన మోహం మరొకటిలేదు.

స్వరూపావస్థ అంటే ఏది ? అంటే, చిత్తం ఒక వస్తువు మీదనుండి వేరొక వస్తువుమీదికి పోయేటప్పుడు, మొదటి వస్తువును విడిచి రెండవ వస్తువును ఇంకా పొందనప్పుడు, ఏ వస్తువు యొక్క స్మృతీ లేనట్టి, ఆ మధ్య కాలస్థితినే స్వరూపావస్థ అంటారు. అంటే రెండు జ్ఞానాల మధ్య ఏజ్ఞానమూ లేని శూన్య స్థితి స్వరూపావస్థ. అదే ఆత్మ స్వరూపం అన్న మాట ( ఇదే విషయం త్రిపురా రహస్యం జ్ఞాన ఖండంలో కూడా ఇట్లాగే చెప్పబడ్డది)

సమస్త సంకల్పాలనూ వదలి, రాతిలాగా ఉండే ఏ స్థితి కలదో ( జాగ్ర దవస్థకు అతీతమైన స్థితి). అది జడత్వము. నిద్ర లేని ఏ స్థితికలదో ( స్వప్న సుషుప్తులకు అతీతమైనది) అది స్వరూపస్థితి అనిపించుకుంటుంది. ఆ స్థితినే తురీయ స్థితి అంటారు. అదే ఆత్మ స్వరూపం.

అహంకారం క్షయమైపోయి, భేదబుద్ధి అణగిపోయి, నిశ్చల చిత్తత్వం లభించి, శుద్ధ చైతన్యం మాత్రమే ప్రకాశించటాన్నే స్వరూపం అంటారు.

**అజ్ఞాన భూమికలు :- జాగతలోనిభేదాలు -**

**బీజ జాగ్రత్తథా జాగ్రన్మహా జాగ్రత్తథైవ చ**
**జాగ్రత్ స్వప్నస్తథా స్వప్నః స్వప్న జాగ్రత్సుషుప్తకం** 94

ఇతి సప్తవిధో మోహః పునరేవ పరస్పరం
శ్లిష్టో భవత్యనేకాఖ్యః శృణు తస్య చ లక్షణం.
ప్రథమం చేతనం యత్ స్యాదనాఖ్యం నిర్మలం చితః 95
భవిష్య చ్చితి జీవాదినామ శబ్దార్థ భాజనం
బీజరూపం స్థితం జాగ్రద్బీజ జాగ్రత్తదుచ్యతే 96
ఏషాజ్ఞప్తే ర్నవావస్థాత్వం జాగ్రత్సం స్థితిం శృణు.
శ్రీరామా ! బీజ జాగ్రత, జాగ్రత, మహా జాగ్రత అనే జాగ్రదవస్థలోని 97
దశలు మూడు, జాగ్రత్స్వప్నము, స్వప్నము, స్వప్న జాగ్రత అనే స్వప్నావస్థాదశలు మూడు, సుషుప్తి ఒకటి, మొత్తం ఏడు విధాలుగా మోహం అనేది ఉంటోంది. వీని లక్షణాలు విను.

సుషుప్తినుండి (నిద్రనుండి) లేచినప్పుడు, పేరులేనట్టి, దృశ్య సంబంధం లేనట్టి, చిత్తమనీ, జీవుడనీ, ఇట్టి పేర్లకు ఆధారమైనట్టి చైతన్యమే, జాగ్రతకు మూలమైనందున అట్టి అవస్థను బీజ జాగ్రత అంటారు. ఇదే జ్ఞానానికి నూతనావస్థ అన్నమాట.

నవప్రసూతస్య పరాదయం చాహ మిదం మమ
ఇతియః ప్రత్యయః స్వచ్ఛ స్త జ్జాగ్రత్ప్రాగ భావనాత్
అయం సోహ మిదం తన్మ ఇతి జన్మాంతరో దితః 98
పీవరః ప్రత్యయః ప్రోక్తో మహాజాగ్రదితి స్ఫురన్
అరూఢ మథవారూఢం సర్వథా తన్మయాత్మకం 99
యజ్జాగ్రతో మనోరాజ్యం జాగ్రత్స్వప్న స్స ఉచ్యతే
ద్విచంద్ర శుక్తి కారూప్య మృగతృష్ణాది భేదతః 100
అభ్యాసా త్ప్రాప్య జాగ్రత్త్వం స్వప్నోనేక విధో భవేత్
పరమాత్మ నుండి క్రొత్తగా ఏర్పడిన జీవునికి కలిగే ''నేను ఇట్టి స్థూలదేహం 101
కలవాడను, ఇది నాది, అనే ఇట్టి భేదజ్ఞానం లో జన్మాంతర స్మృతి గనుక లేకుండా ఉంటే, స్థితిని జాగ్రత అంటారు. (బీజ జాగ్రతను అంకురావస్థ అని అనుకుంటే, ఈ జాగ్రత అనేది రెమ్మలు కలుగుతున్న స్థితి అనుకోవచ్చు.) ఈ స్థితిలో రెండు ప్రధానాంశాలను గమనించాలి (1) నేను వేరు పరమాత్మవేరు అనే భేదజ్ఞానం (2) పూర్వ జన్మాంతర స్మృతి లేకుండా ఉండటం

''నేను జన్మాంత రాల్లో ఫలానా పనులు చేశాను. కాబట్టి ఆ కర్మ ఫలాను భవం కోసం శరీరం వచ్చింది. దీనితో ఇప్పుడు ఆ కర్మలఫలాన్ని అనుభవిస్తున్నాను.'' అనే దృఢమైన జ్ఞానాన్నే 'మహాజాగ్రత' అంటారు.

**స్వప్న భేదాలు :–** జాగ్రతవస్థలో ఉన్నవాడు, తాను చూచిన వస్తువునుగాని, చూడని వస్తువును గానీ మనసులో తలచుకొంటూ తన్మయత్వాన్ని పొంది ఉంటే ఆ స్థితిని 'జాగ్రత్ స్వప్నము' అంటారు. ఒకచంద్రునిలోనే ఇద్దరు చంద్రుల్ని భావించటం, ముత్యపుచిప్పలో వెండిని, ఎండమావిలో నీటిని భావించటం జాగ్రత్స్వప్నమే ! భ్రాంతి వల్ల జాగత్స్వప్నం అనేక విధాలుగా ఉంటుంది.

**అల్పకాలం మయాదృష్ట మేతన్నో సత్య మిత్యపి**
**పరామర్శః ప్రబుద్ధస్య స స్వప్నఇతి కథ్యతే** 102
**చిరసందర్శనాభావాద ప్రఫుల్ల బృహద్వపుః**
**చిరకాలాను వృత్త శ్చస్వప్నో జాగ్రదివోదితః** 103
**స్వప్న జాగదితి ప్రోక్తో జాగ్రత్యపి పరిస్ఫురన్.**

నిద్రమధ్యలో జాగ్రదవస్థాసంబంధమైన వాసనను స్మృతిచేత కొంత కాలంపాటు అనుభవించి, మేల్కాంచిన పిమ్మట నేను ఇంతకు పూర్వం కొద్దికాలం పాటు చూచిన ఈ వస్తు సమూహము, సన్నివేశాలు సత్యం కావని నిశ్చయించుకొనే స్థితినే 'స్వప్నము' అంటారు..

చాలా కాలంపాటు జాగ్రతలాగానే నిలిచి ఉండి, కనపడి, జాగ్రత యందు కూడా మరపు రాకుండా జ్ఞప్తిలో ఉంటే అట్టి దానిని 'స్వప్నజాగ్రత' అంటారు. ఇందులో రెండు ప్రధానాంశాలు (1) దీర్ఘకాలం పాటు స్వప్న స్థితి ఉండటం (2) జాగ్రతలో కూడా మరపుకు రాకపోవటం.

**సుషుప్తి :–**

షడవస్థా పరిత్యాగే జడా జీవస్య యా స్థితిః
భవిష్యద్దుఃఖ బోధాఢ్యా సౌషుప్తిః సోచ్యతే గతిః 104
జగత్తస్యా మవస్థాయా మంతే తమసి లీయతే
సప్తావస్థా ఇతి ప్రోక్తా మయా జ్ఞానస్య రాఘ 105
ఏ కైకా శత సంఖ్యాత్ర నానా విభవరూపిణీ

ఇంత వరకు చెప్పబడిన బీజజాగ్రత, జాగ్రత, మహాజాగ్రత, జాగ్రత్‌స్వప్నం, స్వప్నము, స్వప్నజాగ్రత అనే ఆరు అవస్థలూ కర్మ ఫలానికి అనుభవస్థానాలు - కర్మ ఫలం అనుభవించేందుకు వీలైన స్థితులు. సుషుప్తి అనేది ఈ ఆరింటికీ భిన్నమైనది. ఈ సుషుప్తిలో స్థూల సూక్ష్మ ప్రపంచాలు రెండూ లయమైపోతాయి. ఈప్రపంచానికి మూలం అయినట్టి అజ్ఞానం మాత్రం మిగిలి ఉంటుంది. అంటే అజ్ఞానంతోకూడిన ఆత్మ మాత్రం మిగిలి ఉంటుంది. ఇకముందు సుఖదుఃఖానుభవాలనీయగల కర్మ వాసనలతో కూడిన అవస్థయే 'సుషుప్తి' ఈ అవస్థలో ఈ జగత్తు అంధ తమస్సులో మునిగి ఉంటుంది.

ఓ రామా ! ఇంత వరకు చెప్పబడిన ఈ ఏడు అజ్ఞానావస్థలు, ఒక్కొక్కటి కార్య విశేషాలవల్ల అనేక భేదాలను పొందుతూ ఉంటుంది. అని చెప్పి వసిష్ఠుడు ఇట్లా అన్నాడు.

రామా ! ఇంత వరకు అజ్ఞాన భూమికలను గూర్చి చెప్పాను. ఇక ఏడు విధాలుగా ఉండే జ్ఞాన భూమికలను గూర్చి చెపుతాను. దీనిని తెలుసుకున్నవాడు ఇక అజ్ఞానం అనే బురదలో పడడు.

**జ్ఞానభూమికలు :-**

**వదంతి బహుభేదేన జ్ఞానినో యోగభూమికాః**
**మమత్వభిమతా నూన మిమా ఏవ సుఖప్రదాః** 107
**అవబోధం విదుర్జ్ఞానం తదిదం సాప్త భూమికం**
**ముక్తి స్తు జ్ఞేయమిత్యు క్తా భూమికా సప్తకాత్పరం** 108
**జ్ఞాన భూమి శ్శుభేచ్ఛాఖ్యా ప్రథమా స ముదాహృతా**
**విచారణా ద్వితీయా తు తృతీయా తను మానసా** 109
**సత్త్వాపత్తి శ్చతుర్థీ స్యాత్తతో సంక్తి నామికా**
**పదార్థా భావనీ షష్ఠీ సప్తమీ తుర్యగా స్మృతా** 110
**ఆసామంతే స్థితాముక్తి స్తస్యాం భూయో న శోచతి**
**ఏ తాసాం భూమికానాం త్వమిదం నిర్వచనం శృణు** 111

జ్ఞానులైనవారు ఈ జ్ఞానభూమికలను ( యోగభూమికలను) అనేక విధాలుగా చెపుతూ ఉంటారు. నాకు మాత్రం ఈ చెప్ప బోయే ఏడు విధాలభూమికలే ( అంతస్తులే) నచ్చుతాయి.

ఈ ఏడు జ్ఞానభూమికలను గూర్చి తెలుసుకోవటమే జ్ఞానమనీ, దీని చేత కలిగే ముక్తి, ఈ సప్తభూమికలకంటే అతీతమైన జ్ఞేయమనీ (తెలుసుకొన దగిన పరబ్రహ్మమనీ) అంటారు. (మనం ఏడు అంతస్తులు గల మేడ పై భాగానికి పోవాలి ఏడవ అంతస్తు పైకి చేరటంతో, ఇక ఎక్కవలసిన అంతస్తులు ఉండవు. మనం చేరవసిన గమ్యం అదే! అది ఎనిమిదవ అంతస్తుకాదు. పైన ఉన్నది ఆకాశమే తప్ప, కప్పు కాదు. అట్లాగే జాగ్రత్, స్వప్న, సుషుప్తుల, ఆ వల ఉన్న స్థితి తురీయం. తురీయం అనేది మూడు అవస్థల్లాగా, నాలుగో అవస్థకాదు; ఆ విషయం ఇచ్చట గమనించాలి. కొందరు తురీయాతీతావస్థ అని 4 వ అవస్థను చెపుతారు. అది సరియైనదిగా తోచదు)

(1) శుభేచ్ఛ (2) విచారణ (3) తనుమానస (4) సత్త్వాపత్తి (5) అసంసక్తి

(6) పదార్థాభావని (7) తుర్యగ. ఈ ఏడు భూమికలకు పైనున్నది ముక్తి. అచటికి చేరిన వాడు దుఃఖమునొందదు. ఈ జ్ఞానభూమికలనే కొందరు యోగభూమికలు అంటారు. వీటి లక్షణాలు చెపుతున్నాను. విను.

కిం మూఢ ఇవ తిష్ఠామి ప్రేక్ష్యేహం శాస్త్ర సజ్జనైః
వైరాగ్యపూర్వ మిచ్ఛేతి శుభేచ్ఛేత్యుచ్యతే బుధైః 112
శాస్త్ర సజ్జన సంపర్కో వైరాగ్యాభ్యాస పూర్వకం
సదా చార ప్రవృత్తి ర్యా ప్రోచ్యతే సా విచారణా 113
విచారణా శుభేచ్ఛాభ్యా మింద్రియార్థే ష్వరక్తతా
యత్ర సా తనుతాభావా ప్రోచ్యతే తనుమానసా 114
భూమికా త్రితయాభ్యాసా చ్చిత్తేర్థే విరతే ర్వశాత్
సత్త్వాత్మని స్థితిశ్శుద్ధే సత్త్వా పత్తిరుదాహృతా 115
దశాచతుష్టయా భ్యాసా దసంసర్గ ఫలేన చ
రూఢ సత్త్వ చమత్కారా ప్రోక్తా సంసక్తి నామికా 116
భూమికా పంచకాభ్యాసా త్స్వాత్మారామతయా దృఢం

ఆంభ్యంతరాణాం బాహ్యానాం పదార్థానా మభావనాత్ 117
పరప్రయుక్తేన చిరం ప్రయత్నేనావబోధనం
పదార్థా భావనీనామ షష్ఠీ సంజాయతే గతిః 118
భూమిషట్క చిరాభ్యాసాద్భేదస్యానుపలంభతః
యత్స్వభావైక నిష్ఠత్వం సాజ్ఞేయా తుర్యగా గతిః 119

''నేను మూఢుని లాగా ఉన్నాను; ఎందుచేత? శాస్త్రాభ్యాసం చేసి, సత్పురుష సాంగత్యం చేసి, నేను కూడా ఆత్మ స్వరూపాన్ని తెలుసు కుంటాను.'' అనే ఈ విధమైన, వైరాగ్య పూర్వకమైన, కోరిక కలగటాన్నే, ''శుభేచ్ఛ'' అంటారు. ఇది మొదటి భూమిక.

వేదాంత శాస్త్ర విచారణ, బ్రహ్మవేత్తల శుశ్రూష చేయటం, సంసారమందు విరక్తి కలగటానికై ప్రాపంచిక విషయాలయందున్న దోషాలను లెక్కిస్తూండటం, సత్పురుషుల నడవడిలాగా తననడవడిని దిద్దుకోవటం ఇదంతా 'విచారణ' అనే రెండవభూమిక. శుభేచ్ఛచేత, విచారణచేత విషయవాసనలయందు విరక్తి కలుగుతుంది. మనస్సు పెంపొందటానికి కారణమైన రాగమునశించి, మనస్సు సూక్ష్మ రూపాన్ని పొందు నట్టి దశను 'తను మానస' భూమిక అంటారు. ఇది మూడవది.

శుభేచ్ఛ, విచారణ, తను మానస, అనే మూడింటి అభ్యాసం వల్ల, సంస్కారం నశిస్తుంది. మనస్సులో విషయ వాసనలు తగ్గుతాయి. మనస్సు నిర్మలమైన ఆత్మ స్వరూపంలో నిర్వికల్ప సమాధి చేత నిలకడపొంది ఉండటాన్ని 'సత్త్వాపత్తి' అంటారు. ఇది నాల్గవ భూమిక. ఈ స్థితిలో నున్నవానిని 'బ్రహ్మవిదుడు' అంటారు.

పై నాల్గు భూమికలను అభ్యసించుట చేతను, విషయ వాసనా సంసర్గాన్ని పోగొట్టునట్టి సమాధి పరిపాకం వల్లనూ, మనస్సునందు దృఢమైన బ్రహ్మ సాక్షాత్కారం లభించే స్థితిని 'అసంసక్తి' అంటారు. ఎందు చేతనంటే ఈ అవస్థ యందు అవిద్య యొక్కగాని, అవిద్యా కార్యముల యొక్కగాని సంసక్తి (సంసర్గం) ఉండదు. ఈ స్థితిలో నున్నవానిని 'బ్రహ్మవిద్వరుడు' అంటారు. ఇది ఐదవ భూమిక.

పై అయిదు భూమికలను అభ్యసించటం వల్ల దృఢమైన ఆత్మ నిష్ఠ కలుగు తుంది. బాహ్యాభ్యంతర పదార్థాలను భావింపడు. పరుల ప్రయత్నం చేత దేహ కృత్యాలను నిర్వర్తించుకుంటాడు. ఇది 'పదార్థాభావని' అనే ఆరవ భూమిక. ఈ దశ యందున్న వానిని 'బ్రహ్మవిద్వరీయుడు' అంటారు.

పై ఆరు అవస్థలను అభ్యసించటం వల్ల, ఇతరుల ప్రయత్నం వల్ల కూడా భేద వ్యవహారం కలుగని స్థితి లభిస్తుంది. అంటే, సచ్చిదానంద లక్షణమైన ఆత్మయందే ఉనికిని కలిగిఉండే స్థితి అబ్బుతుంది. దానినే 'తుర్యగ' అంటారు.

ఇది ఏడవదైన స్థితి. ఈ అవస్థయందున్న వానిని 'బ్రహ్మవిద్వరిష్ఠుడు' అంటారు. ఇతడు బ్రహ్మవిదుడు, బ్రహ్మవిద్వరుడు, బ్రహ్మవిద్వరీయుడు, అనే ముగ్గురికీ అతీతుడైనవాడు బ్రహ్మ విద్వరిష్ఠుడు. ఇతడు తురీయుడు. జాగ్రత్ స్వప్న సుషుప్తులకు అతీతస్థితిని తురీయమన్నట్లే, ఈ స్థితి కూడా 'తురీయగ' లేక 'తుర్యగ' అన్నారు.

ఏషా హి జీవన్ముక్తేషు తుర్యావస్థేహ విద్యతే
విదేహ ముక్త విషయం తుర్యాతీత మతః పరం 120
యే హి రామ మహాభాగా స్సప్తమీం భూమికాం గతాః
ఆత్మారామా మహాత్మానస్తే మహత్పద మాగతాః 121
జీవన్ముక్తా న సజ్జంతి సుఖదుఃఖ రసస్థితౌ
ప్రకృతే నార్థ కార్యాణి కించిత్కుర్వంతి వా న వా 122
పార్శ్వసబోధితా స్సంతః పూర్వాచారక్రమాగతం
ఆచార మాచరం త్యేవ సుప్తబుద్ధ వదక్షతాః 123
భూమికా సప్తకం త్వేతద్ధీమతామేవ గోచరం
ప్రాప్తా జ్ఞాన దశామేతాం పశుమ్లేచ్ఛాద యోపి యే 124
స దేహా వా విదేహా వా తే ముక్తా నాత్ర సంశయః 125

జీవన్ముక్తులయందు ఈ తురీయావస్థఉంటుంది. అంటే జీవించి యుండగా మోక్షాన్ని పొందినవారు శరీరాన్ని వదలలేరు కాబట్టి ఈ స్థితిలో ఉంటారు. శరీరం వదలితే విదేహ ముక్తులు అవుతారు. వారు బ్రహ్మస్వరూపులే! కాబట్టి తురీయానికి పరమైన తరీయాతీత స్థితిని చెప్పలేదు. అవసరమూ లేదు.

ఈ ఏడవ భూమికయైన తురీయంలో చరించేవారు మహానుభావులు, ఆత్మయందు క్రీడించేవారు, జీవన్ముక్తులైన వారు సుఖదుఃఖాలను లెక్కించరు - తలచరు. లౌకిక కృత్యాలను సైతం ఒకప్పుడు చేస్తారు. ఒకప్పుడు చేయరు. సత్పురుషులచే బోధింపబడి, తండ్రి తాతల నుండి పూర్వాచారక్రమంగా వచ్చిన ఆచారాలను నిద్ర నుండి మేల్కొంచిన వారిలాగా నిరాటంకంగా చేస్తూ ఉంటారు.

ఈ సప్త భూమికలు బుద్ధిమంతులైన వారికి మాత్రమే తెలుస్తాయి - గోచరిస్తాయి. ఇతరులు గుర్తించలేరు. పశువులు, మ్లేచ్ఛులు మొదలైనవారు కూడా, జన్మాంతర వాసనచే ఈ జ్ఞాన భూమికలను పొందినచో, వారు కూడా జీవన్ముక్తులు, లేక విదేహ ముక్తులు కాగలుగుతారు. ఇందులో సందేహం లేదు.

జ్ఞప్తిర్హి గ్రంథి విచ్ఛేద స్తస్మి న్సతి హిముక్తతా
మృగ తృష్ణాంబు బుద్ధ్యాది శాంతి మాత్రాత్మక స్త్వసౌ 126
యేతు మోహార్ణవా త్తీర్ణాస్తే ప్రాప్తాః పరమం పదం
తేస్థితా భూమికా స్వాసు స్వాత్మలాభ పరాయణాః 127
ఏ తాసు భూమిషు జయంతి హి యే మహాంతో
వంద్యాస్త ఏవ హి జితేంద్రియ శత్రవస్తే 128
సమ్రాట్ స్వరాడపి చ యత్ర తృణాయతే త
త్సారం పదం జగతి తే సమవాప్నువంతి. 129
మనః ప్రశమనో పాయో యోగ ఇత్యభిధీయతే
సప్తభూమి స్స విజ్ఞేయః కథితా స్తాశ్చ భూమికాః 130

అహంకారం అనే ముడి తెగిపోవటమే జ్ఞానం. అట్టి జ్ఞానం ఉంటేనే ముక్తి కలుగుతుంది. ఎండమావులే నీరు అనే భ్రాంతి అణగి పోయినప్పుడు కలిగే స్వరూప జ్ఞానం లాంటిదే ఈ జ్ఞానం కూడా! దట్టమైన అజ్ఞానం నుండి తరించిన వారే పరమపదాన్ని (మోక్షాన్ని) పొందినవారౌతారు. అట్టివారు ఆత్మజ్ఞానాన్ని పొంది ఈ జ్ఞాన భూమికలలో చేరినవారౌతారు.

ఈ జ్ఞాన భూమికలందు స్థిరత్వాన్ని పొంది, ఇంద్రియ నిగ్రహం కలిగినవారే నమస్కరింపదగిన పూజ్యులు. సామ్రాజ్యాధిపత్యాన్ని కూడా మించిన మోక్షపదమును పొందుచున్నారు. ఆ మోక్షపదం ముందు సార్వభౌమత్వం గడ్డిపరకలాంటి తుచ్ఛమైనది.

రామా! మనస్సు యొక్క చాంచల్యాన్ని తొలగించటానికి సాధనమైనందువల్ల, ఈ జ్ఞాన భూమినే కొందరు 'యోగము' అని అంటున్నారు. వీటిని తెలుసుకోవలసిన అగత్యం ఉంది. కాబట్టే వానిని గూర్చి చెప్పాను.

బ్రహ్మస్వరూపం -

ఏతాసాం భూమికానాం తు గమ్యం బ్రహ్మేభిదం వరం
తత్తాహంతాత్మతా యత్రపరతా నాస్తి కాచన 131
న క్వచిద్భేద కలనా న భావా భావరంజనా
సర్వం శాంతం నిరాలంబం వ్యోమస్థం శాశ్వతం శివం 132
అనామయ మనాభాసం అనాత్మక మకారణం
న సన్నాసన్న మధ్యాంతం న సర్వం సర్వమేవ చ 133

**మనో వచోభిరగ్రాహ్యం శూన్యాచ్ఛూన్యం సుఖాత్సుఖం**
**అసంవేదన మాశాంత మాత్మ వేదన మాతతం** 134

రామా! ఈ జ్ఞాన భూమికలలో ఉండే వారికి గోచరించే బ్రహ్మస్వరూపం ఎట్టిదో చెపుతున్నాను. విను, ఆ బ్రహ్మము నందు నీవు నేను పరుడు అనే భేదం ఎన్నడూ ఉండదు. ఉన్నది, లేదు అనే భావాభావములు ఉండవు. అది 'సర్వాత్మకం'. నిర్వికారం, నిర్విషయం. చిదాకాశస్థితం. శాశ్వతం. శివశబ్దం కలది. దోషం లేనిది. అనారోపితం. నామ జాతిరహితమైనది. కారణత్వం లేనిది. ఆది మధ్యాంత రహితము. జగత్తు కంటె విలక్షణం. జగద్రూపం. మనస్సుకు వాక్కుకు గోచరించనిది. ఆకాశం కంటె శూన్యతరమైనది. విషయసుఖాల కంటె సుఖతరమైనది. అప్రమేయము, ఆశాతీతము, అన్ని ప్రమాణాలకూ మూల మైనదీ బ్రహ్మము అని తెలుసుకో!

వసిష్ఠుడింకా ఈ విధంగా చెపుతున్నాడు -

ఓ రామచంద్రా! నీకు బ్రహ్మ స్వరూపాన్ని గూర్చి చెప్పాను. ఇక అజ్ఞాన భూమికల ( అవిద్య యొక్క) యొక్క మాహాత్మ్యం చెపుతాను విను.

లవణ మహారాజు ఐంద్రజాలికుని వల్ల భ్రాంతిని పొంది, మరునాడు తాను కష్టాలనుభవించిన ఆ అరణ్యానికి పోవాలని నిశ్చయించుకొన్నాడు. ఆ అరణ్యం ఎక్కడ ఉన్నది? అని ఆలోచించాడు. అది వింధ్యపర్వత ప్రాంతంలో ఉండి ఉంటుందని ఊహించాడు. మరునాడు జైత్రయాత్రకు బయలుదేరునట్లుగా, మంత్రులు మొదలైనవారితో కలసి దక్షిణ దిక్కుగా వింధ్య పర్వత ప్రాంతానికి బయలుదేరాడు. ఆ అడవిని చేరి, తిరిగి తిరిగి తాను పూర్వం చూచినట్టి అరణ్య భాగాన్ని చేరి, చూస్తూ, అచటి వారిని అడిగి తెలుసుకుంటూ ఆశ్చర్యపడ్డాడు. వెనుక చండాల వాటికలో చూచినవారిని గుర్తుపట్టాడు. ఇట్లా తిరుగుతూ, ఆ అరణ్యంలో పొగక్రమ్మినట్టి, లోగడ తన్నుపోషించినట్టి చండాలుడున్న గ్రామం చేరాడు. అక్కడ గుడిసెలలో ఉన్నప్రజల్నీ, స్త్రీలను చూచాడు. అక్కడ ఒక వృద్ధస్త్రీ, బంధువులు చెదరిపోగా, కన్నీరు పెడుతూ, స్త్రీల మధ్య దీనంగా ఇట్లా విలపిస్తోంది - ''ఓ పుత్రులారా! నన్ను వదలి ఎచటికి వెళ్ళినారు? గురువింద మాలలు ధరించిన ఓ పుత్రీ! నా దురదృష్టం నిన్ను ఎచటికి తీసికొనిపోయినది? ఓ రాజపుత్రా! నీ అంతఃపురస్త్రీలను వదలి, నా కొమార్తెను ప్రేమించావు గదా! అది కూడా నీకు దక్కక పోయేనే!''

ఈ సంసారమనేది ఒక మహానది. పండితులచేత పరిహసింపబడే తుచ్ఛ కార్యాలే తరంగాలు. అందుకే ఒక జన్మలోనే రాజత్వము, చండాలత్వము కూడా కలిగింది. ఈ సంసారమనే నదిలో పడ్డవాడు ఎట్టిపనినైనా చేస్తాడు.

లవణుడు, ఆ వృద్ధస్త్రీని, మిగతా స్త్రీల చేత చెప్పించి ఊరడించాడు. ఈ విధంగా అడిగాడు - ''నీవు ఎవతెవు? నీ కూతురు ఎవరు? నీ కొడుకులు ఎవరు? నీ వృత్తాంతం చెప్పు'' అని.

ఆ వృద్ధాంగన, కన్నీరు కారుస్తూ చెప్పసాగింది - ''ఈ గ్రామం పేరు పుక్కసపోషము. నా భర్త ఇచటి చండాలురకందరకు రాజు. మాకు చంద్రవదనయైన ఒక కూతురు ఉండేది. ఆమె దైవయోగం వల్ల, ఇచటికి వచ్చిన ఒకరాజును భర్తగా పొందింది. చాల కాలం సుఖంగా ఉంది. ఒక కన్యను, ఇద్దరు పుత్రులను కన్నది. కొంతకాలానికి ఈ దేశంలో ఒక గొప్ప భయంకరమైన కరవు వచ్చింది. జనులంతా దూరదేశాలకు పోయి చనిపోయినారు. మేము ఇచటనే - జనులు లేని ఈ గ్రామంలోనే - ఇట్లా దుఃఖిస్తున్నాము.''

ఇదంతా విన్న రాజు ఆశ్చర్యపడ్డాడు. వారిపై దయదలచి వారికి కావలసిన వస్తువులను ఇప్పించాడు. వారి దుఃఖాన్ని పోగొట్టాడు.

లవణ మహారాజు, ఈ విధంగా రెండు లోకాలను చూచాడు. అవిద్యా స్వభావాన్ని గ్రహించాడు. నా చేత బోధింపబడి సుఖంగా ఉన్నాడు. రామా! అవిద్య అనేది, లేని దానిని ఉన్నట్లుగా, ఉన్న దానిని లేనట్లుగా భ్రమింపజేస్తుంది.

ఇది విని రాముడిట్లా అడిగాడు - ఓ మహానుభావా! స్వప్నము ఎట్లా నిజమౌతుంది? అనేసందేహం నా మనసు నుండి తొలగటం లేదు. అది ఎట్లా సంభవమో చెప్పండి.'' అని.

వశిష్ఠుడీ విధంగా చెప్పాడు - ''రామా! అవిద్య యందు, అది అట్లా సంభవమే అవుతుంది. గాధి వృత్తాంతాన్ని చెప్పినప్పుడు నీ కది బోధపడుతుంది.

కాకి వచ్చి చెట్టు మీద వ్రాలినప్పుడే దైవవశాన తాటిపండు క్రిందపడినట్లు (కాకతాళీయంగా) ఏ కారణం లేకపోయినా, మనో వాసన వల్ల కారణం లేకపోయినా వ్యవహారాలు ఒక దానితో మరొకటి సంబంధాన్ని పొందుతున్నాయి.

ఐంద్రజాలికుడు నెమలి పింఛం త్రిప్పినప్పుడు రాజుకు ఏ అవిద్య

పుట్టిందో, ఆ అవిద్యయే మరునాడు కూడా కలిగింది అనే విషయం మాత్రం నిజం. లవణ భూపాలునికి స్వప్నం లాంటి ఏ భ్రాంతి కలిగిందో, అట్టి విభ్రాంతియే చండాలురచిత్తంలోనూ కలిగింది. ఈ విధంగా చండాలుర చిత్తంలో లవణ మహారాజుకు సంబంధించిన జ్ఞానము, లవణ మహారాజు చిత్తంలో చండాలురకు సంబంధించిన జ్ఞానమూ కలిగింది. ఇదంతా భ్రమగదా! దీనికి సత్యత్వం ఎట్లా వస్తుంది? అంటే - స్వప్నములో కనుపించే పదార్థాల్లాగానే, జాగ్రత్తునందు కనిపించే పదార్థాలు కూడా జ్ఞాన మాత్రరూపములే! అంటే, తాను తెలుసుకొనే సమయంలో మాత్రమే సత్యంగా తోస్తాయి. కాబట్టి, వానికి సంబంధించిన వ్యవహారం కూడా అట్టిదిగానే గ్రహించు.

తత్త్వోపదేశం -

సంబంధే ద్రష్టృ దృశ్యానాం మధ్యే ద్రష్టుర్హి యద్వపుః
ద్రష్టృ దర్శన దృశ్యాది వర్జితం తదిదం పరం 135
దేశాద్దేశం గతే చిత్తే మధ్యే యచ్చేతసో వపుః
అజాడ్య సంవిన్మననం తన్మయో భవ సర్వదా 136
అజాగ్రత్స్వప్న నిద్రస్య యత్తే రూపం సనాతనం
అచేతనం చాజడం చ తన్మయో భవ సర్వదా 137
జడతాం వర్జయిత్వైకాం శిలాయా హృదయం హి యత్
అనునస్కం మహాబాహో తన్మయోభ వ సర్వదా 138
చిత్తం దూరే పరిత్యజ్య యోసి స్థోసి స్థిరో భవ
భవభావనయా ముక్తో యుక్త్యా పరమయాన్వితః 139
సంసారోగ్రార ఘట్టేస్మిన్ యాధృధా యంత్ర వాహినీ
రజ్జుస్తాం వాసనా మేతాం ఛింధి రాఘువ యత్నతః 140

శ్రీరామా! చూచే ఆత్మకు సైతం సాక్షిమాత్రరూపమైనదీ, చూచేవాడు, చూపు, దృశ్యము (చూడబడే విషయము) అనే ఈ మూడింటి యందూ ఉండి కూడా, ఈ మూడింటికీ విలక్షణమై నట్టిదీ బ్రహ్మము అని తెలుసుకో! చిత్తము ఒక వస్తువు నుండి మరొక వస్తువు మీదకు పోవునప్పుడు, మొదటి వస్తువును విడచి రెండవ వస్తువును ఇంకా చేరనట్టి మధ్యకాలంలో దృశ్య రూపంగాని, వృత్తిరూపం గాని, సంకల్ప రూపంగానీ కానట్టి ఏ కేవలరూపం ఉన్నదో ఆ కేవల రూపాన్ని

(ఆత్మ స్వరూపాన్ని) పొందు. జాగ్రత్తు, స్వప్నము, సుషుప్తి అనే మూడు అవస్థలు లేనట్టియు, చేతనము గాని జడం కానీ, కానట్టియు, నీదైన ఆ కేవల రూపాన్ని పొందు. జడత్వం లేకున్నట్టియు, రాతిమధ్య భాగం లాగా సంకల్ప రహితంగా ఉండే ఏ కేవల రూపం ఉన్నదో ఆ కేవల రూపాన్ని పొందు. ఆత్మస్వరూపం జడం కాదు, సంకల్పరహితమైన చేతనం. సంసార భావనను వదలిపెట్టి, వేదానుకూలమైన యుక్తితో కూడి సంకల్ప వికల్పాలను పరిత్యజించినపుడు ఏ రూపం ఉంటుందో, అట్టి రూపంతో స్థిరంగా ఉండు. శ్రీరామా! సంసారమనేది ఏతం లాంటిది. (నీళ్ల తోడే యంత్రం) వాసన అనే త్రాటిచే ఆ ఏతం అనే యంత్రం కట్టుబడి ఉంది. నీవు వాసన అనే త్రాటిని ఛేదించు.

**పూర్వం మనస్స ముదితం పరమాత్మ తత్త్వా**
**త్తేనా తతం జగదిదం స్వవికల్పజాలైః** 141
**శూన్యేన శూన్యమపి తేన యథాంబరేణ**
**నీలత్వ ముల్ల సతి చారుతరాభిధానం** 142

శ్రీరామా! ముందుగా పరమాత్మ వల్ల మనస్సు పుట్టింది. ఆ మనస్సు తన వికల్పాల చేత ఈ జగత్తును సృష్టించింది. ఆకాశం శూన్యము. అయినప్పటికీ ఆకాశం లోని నలుపును శూన్యంలో సృష్టిస్తున్నట్లుగా, శూన్యమైన మనస్సు, శూన్యమైన జగత్తును కల్పిస్తోంది.

**సంకల్ప సంక్షయ వశాద్గలితే తు చిత్తే**
**సంసార మోహమిహికాగలితా భవంతి** 143
**స్వచ్ఛం విభాతి శరదీవ ఖ మాగతాయాం**
**చిన్మాత్ర మేక మజ మాద్యమనంత మంతః** 144

సంకల్పం ఉడిగిపోతే మనస్సు విడిపోతుంది. అప్పుడు సంసారమోహం అనేమేఘాలు సైతం తొలగిపోతాయి. అప్పుడు శరదృతువు రాగానే ఆకాశం నిర్మలంగా ప్రకాశించునట్లు, ఆది అంతాలు లేనట్టి, చిన్మాత్రమైనట్టి ఆత్మ స్వరూపం స్వచ్ఛంగా లోన ప్రకాశిస్తుంది.

యోగ వాసిష్ఠసారంలో ఉత్పత్తి ప్రకరణం సమాప్తం

# స్థితి ప్రకరణము

**పూర్వ ప్రకరణ సారాంశం** – ఉత్పత్తి ప్రకరణంలో ఈ జగత్తంతా మనో విలాసం వల్ల కలిగినదనీ, యోగం వల్ల మనోవిలాసం అణగిపోతే జగత్తు కూడా అణగిపోతుందనీ చెప్పారు. సంకల్పం ఉడిగిపోతే, మనస్సు కూడా ఉడిగిపోతుందనీ మనస్సు ఉడిగితే సంసారమూ సంసార బంధమూ ఉడిగిపోయి, చిన్మాత్రమైన ఆత్మస్వరూపం స్వచ్ఛమైన ఆకాశం లాగా ప్రకాశిస్తుందనీ చెప్పారు.

ఈ ప్రకరణంలో మనస్సు వల్ల కలిగినట్టి జగత్తు మనస్సులోనే ఉంటుందనీ, ఆ మనస్సు తనకు కారణమైనట్టి ఆత్మలో ఉంటుందనీ చెపుతున్నారు. ఇందులో ఐదు ఉపాఖ్యానాలు ఉన్నాయి. శుక్రోపాఖ్యానం, దామాద్యుపాఖ్యానం, భీమాద్యుపాఖ్యానం దాశూరోపాఖ్యానం, ఉపదేశోపాఖ్యానం.

మనోవికారమైన ఈ జగత్తంతా మనస్సుతో సహా ఆత్మయందు ఉంటుందనే విషయాన్ని నిరూపించటానికై వసిష్ఠుడు శ్రీరామునితో అంటున్నాడు -

వసిష్ఠ ఉవాచ -

అకర్తృక మరంగం చ గగనే చిత్ర ముత్థితం
అద్రష్టృకం స్వానుభవం అనిద్రం స్వప్న దర్శనం 1
సాక్షిభూతే సమే స్వచ్ఛే నిర్వికల్పే చిదాత్మని
నిరర్థం ప్రతిబింబంతి జగంతి ముకురే యథా 2
ఏతత్తే రామ వక్ష్యామి కార్యకారణతాం వినా
స్థితా బ్రహ్మణి విశ్వశ్రీః ప్రతిభామాత్ర రూపిణీ 3
ఏకం బ్రహ్మ చిదాకాశం సర్వాత్మక మఖండితం
ఇతి భావయ యత్నేన చేతశ్చాంచల్య శాంతయే 4
రేఖోప రేఖా వలితా యథైకా పీవరీశిలా
తథా త్రైలోక్య వలితం బ్రహ్మైకమితి దృశ్యతాం 5
ద్వితీయ కారణాభావాదనుత్పన్న మిదం జగత్
తిష్ఠతి బ్రహ్మణి స్ఫారే ప్రతిభామాత్ర రూపధృత్ 6
అత్ర భార్గవ వృత్తాంతం కథయామి తవానఘ
అనుత్పన్న మిదం విశ్వం యేన చేతసి పశ్యసి. 7

శ్రీరామచంద్రా! ఒక చిత్రాన్ని చిత్రించాలంటే, చిత్రించేవాడూ రంగులు మొదలైనవి, గోడ లేక పటము మొదలైనవి కావాలి. కాని, ఈ జగత్తు అనే చిత్రం,

చిత్రించే కర్త గాని, రంగులు గానీ, గోడ వగైరా లేమీ లేకుండా ఆకాశంలోనే (శూన్యంలోనే) ఏర్పడులోంది. (ఆత్మనిష్క్రియం కాబట్టి కర్త లేడు. అద్వితీయం - రెండవదంటూ లేనిది కాబట్టి రంగులు వగైరాలు ఏవీ లేవన్న మాట. మూర్తమైన ఆధారం ఏదీ లేనందు వల్ల చిదాకారంగా ఏర్పడింది. అని భావం) దృశ్యం కంటె భిన్నంగా, చూచేవాడు (ద్రష్ట) ఉంటేనే దృశ్యం అనేది (చూడబడేది) ఉంటుంది. ఈ జగత్తు అనే దృశ్యానికి తన కంటె వేరుగా ద్రష్ట అంటూ లేడు. అంటే, ద్రష్టకు దృశ్యానికీ భేదం లేని దృశ్యమన్న మాట! అంటే, స్వానుభవరూపమైనదని భావం. మరొక విశేషం ఏమంటే, స్వప్నం అనేది నిద్రవచ్చి నపుడు కనిపిస్తుంది. కాని, ఈ జగత్తు అనే స్వప్నం నిద్రలేకుండానే (జాగ్రత్తలోనే) కనిపిస్తుంది.

ఆత్మ, ప్రత్యక్షంగా చూచేది కాబట్టి సాక్షి. పరిపూర్ణుడు, నిర్మలుడు, భేదరహితుడు, (నిర్వికల్పుడు) అయిన చిదాత్మయందు ఈ జగత్తులు, అద్దంలో ప్రతిబింబించినట్లుగా, నిరర్థకంగా (నిష్ప్రయోజనంగా) ప్రతిబింబిస్తున్నాయి.

రామా! ఈ విశ్వసంపద అంతా, కార్యకారణ భావం లేకుండానే, ప్రతిభా మాత్రరూపంతో బ్రహ్మమందే ఉన్నది.

చిత్తచాంచల్యం తొలగటానికై, బ్రహ్మము, అఖండమైనదనీ (ఏకరూపమైనదనీ), చిదాకాశస్వరూపం కలదనీ, సర్వాత్మకమనీ, పరిపూర్ణమనీ, అద్వితీయమనీప్రయత్నంతో భావన చెయ్యి!

భేదమనేది స్పష్టంగా కనిపిస్తూ ఉంటే, అభేదాన్ని భావించటం ఎట్లా సంభవం? అంటే - శిల అనేది ఒకటే! ఆ శిలలోనే ఏనుగులు, గుఱ్ఱాలు మొదలైన రూపాలు, దేవతామూర్తులు మొదలైన రూపాలు రేఖోపరేఖలతో విభిన్నంగా కనబడుతున్నాయి. కాని, శిల ఒకటే! అట్లాగే, బ్రహ్మము ఒకటే ఈ ముల్లోకాల రూపంతో వివర్తం చెంది ఉన్నది.

బ్రహ్మము కంటె ఇతరమైనదేదీ లేదు కాబట్టి, ఉత్పత్తి పొందని ఈ జగత్తు, ప్రతిభారూపాన్ని ధరించి ఉంది. అంటే, ఈ జగత్తు బ్రహ్మమందు అధ్యస్తమైనందున (ఆరోపితమైనందున) ఎండమావుల్లో నది లాగా ప్రాతిభాసికంగా ఉంది అని భావం.

ఉత్పత్తి చెందని ఈ జగత్తును, చిత్తంలో ఎట్లా చూస్తున్నావో తెలియటానికై నీకు శుక్రుని వృత్తాంతాన్ని చెపుతాను. దాని వల్ల అనుత్పన్నమైన ఈ విశ్వాన్ని నీవు నీ మనస్సులోనే చూడగలవు. ఈ విశ్వం పుట్టలేదనే విషయం నీకే తెలుస్తుంది.

## శుక్రోపాఖ్యానము

పూర్వం భృగుమహర్షి మందర పర్వతపు ఒక చరియ యందు తపస్సు చేస్తూ ఉండగా అతని కుమారుడైన శుక్రుడు తండ్రిని సేవిస్తున్నాడు. శుక్రుడింకా బ్రహ్మభావాన్ని పొందలేదు. జ్ఞానాజ్ఞానాల మధ్య వ్రేలాడుతున్నాడు. తండ్రి నిర్వికల్ప సమాధియందుండగా, ఒకనాడు ఆకాశంలో పోతూ ఉన్న ఒక అప్సరసను చూచాడు. శుక్రుని మనస్సు చలించింది. ఆ అప్సరసనే ధ్యానిస్తూ కండ్లు మూసికొని మనోరాజ్యంలో విహరింపసాగాడు.

ఆ అప్సరస స్వర్గంలో ఉంది. ఆమె ననుసరించి తాను కూడా స్వర్గానికి వచ్చాడు. సురకాంతలు ఇంద్రుని సేవిస్తున్నారు. తాను కూడా ఇంద్రునికి నమస్కరించాడు. ఇంద్రుడు శుక్రుని ఆదరించాడు. అతడు స్వర్గంలో విహరింపసాగాడు.

అతడు అచటి అప్సరసలలో మెనుకతాను గాంచిన అప్సరసను చూచి గుర్తించాడు. ఆమె కూడా శుక్రుని జూచి పరవశం చెందింది. ఆమె పొందు కోరిన శుక్రుడు అనుకూలమైన కాలం కోసం రాత్రిని కల్పించుకున్నాడు. ఆ రాత్రి యందు ఆ అప్సరస శుక్రుని చేరింది. వారిరువురు అట్లా సుఖిస్తూ ఉండగా ఎనిమిది మహాయుగాలు గడచినాయి. శుక్రుని పూర్వపుణ్యం క్షీణించింది. అతడు నేలపై బడ్డాడు. అతని శరీరం నూరు ముక్కలైంది.

అంతట శుక్రుని జీవకల చంద్రమండలాన్ని ప్రవేశించి, మంచు రూపంతో శాలిధాన్యంలో ప్రవేశించగా, ఆ ధాన్యాన్ని దశార్ణ దేశంలోని ఒక బ్రాహ్మణుడు భుజించాడు. శుక్రజీవం ఆ బ్రాహ్మణుని రేతో రూపం దాల్చి, బ్రాహ్మణుని భార్య యందు పుత్ర రూపంలో జన్మించాడు. పిమ్మట ఆ శుక్రుడు ( బ్రాహ్మణ బాలుడు) పెద్దవాడై హిమగిరి ప్రాంతంలో తపస్సు చేస్తూ ఒక మన్వంతరం గడిపాడు.

తరువాత ఆ బ్రాహ్మణునకు లేడి యందు మనుజరూపుడైన పుత్రుడు కలిగాడు. ఆ శుక్రుడు (బ్రాహ్మణుడు) ఎల్లప్పుడు తన కుమారునికి ధనము గుణము దీర్ఘాయువును కోరుతూ తపోనిష్ఠను వదలిపెట్టాడు. భోగచింతచే ధర్మచింత నశించగా క్షీణాయుష్కుడై మృత్యువు చేత భక్షింపబడ్డాడు.

ఆ శుక్రుడే మద్ర రాజునకు కొడుకై పుట్టాడు. ఇట్లా అనేక జన్మలు పొంది ఆ శుక్రుడు గంగా తీరంలో నున్న ఒక మునికి పుత్రుడై జన్మించాడు. తాను కూడా తపోనిష్ఠను పూనాడు. కొంతకాలానికి భృగుమహర్షి వల్ల కలిగిన శుక్రశరీరం, గాలికి ఎండకు శిథిలమై నేల కూలినది. దానిని రక్షించిన వారు లేరు.

భృగుమహర్షి వేయి దివ్య సంవత్సరాల తరువాత, అఖండ జ్ఞానరూపమైన సమాధిని విరమించి లేచి చూచాడు. పుణ్యమూర్తియైన తన కొడుకు కనిపించలేదు. చూడగా, నొకచోట ఎండిపోయిన శరీరం కనిపించింది. పుత్రుని శవాన్ని చూచి, అకాలంలోనే తన పుత్రుని కొంపోయినందుకు కాలునిపై కోపించి శపింప సిద్ధపడ్డాడు.

అంతట కాలుడు నెలలనే పండ్రెండు చేతులతో, ఋతువులనే ఆరు ముఖాలతో, కవచ కుండలాలలను, ఖడ్గపాశాలను దాల్చి పాంచభౌతిక శరీరంతో ప్రత్యక్షమై, భృగు మహర్షితో యిట్లా అన్నాడు - ఓ బ్రాహ్మణుడా! మేము నియతిని పాలిస్తున్నాము. నీవు తపస్వివి. బుద్ధిహీనుడవై నన్ను శపింపపూనుకోవద్దు. ప్రళయాగ్ని జ్వాలలే నన్ను కాల్చలేవు. నీవు నన్నెట్లు శపింపగలవు? మేము బ్రహ్మాండాలను, రుద్రకోటులను, విష్ణు బృందాలను మ్రింగిన వారము. మా వల్ల కానిదేమున్నది? మేము భోక్తలము. మీరు భోజ్యములు. ఇది నియతి వల్ల కలిగిందే తప్ప మనవల్ల, మన యిష్టం వల్ల కలిగింది కాదు.

కల్పాంతంలో కార్యబ్రహ్మకు సైతం, కారణమైన కాలము, ఈశ్వర సంకల్పం అనే వాటిచేత, చెట్లకు పూలు పూచి రాలిపోయేటట్లుగా జీవులు వస్తూ పోతున్నారు. ఓ మునీంద్రా! నీ జ్ఞాన దృష్టి ఏమైంది? నీ ధీరత్వం ఎక్కడికి పోయింది? నీ మహత్వం ఏమైంది? ఇట్లా మోహాన్నిపొందుతున్నావేమి? తమ కర్మ యొక్క పరిపాకం వల్ల, అవస్థాభేదం కలుగుతోంది అనే విషయాన్ని ఆలోచింపక, మూర్ఖునిలాగా నన్ను శపించటానికి పూనుకుంటున్నా వేమి?

ఇట్లా అని, కాలుడు శుక్రునికి చిత్తమయమైన సంసారాన్ని గూర్చి తెలయజేయటానికై ఇంకా యిట్లా అంటున్నాడు -

ఓ మునీంద్రా! చిత్తమే పురుషుడు. చిత్తం చేసినదేదో అదే పని క్రింద లెక్క. మనస్సు జీవుడెట్లా అవుతాడు? అంటే, మనస్సు ప్రాణాన్ని ధరించటం వల్ల జీవుడౌతున్నాడు. ఆ మనస్సే, నిశ్చయాత్మకమైతే బుద్ధి అవుతోంది. ఆ మనస్సే 'నేను' అనేఅభిమానాన్ని పొందితే అహంకారమౌతోంది. ఇట్లా మనస్సే అనేక రూపాలను పొందుతోంది. కాబట్టి, నీవు సమాధిలో ఉన్నప్పుడు, నీ కుమారుని యొక్క మనస్సు, శుక్రశరీరాన్ని వదలివేసి స్వర్గానికి పోయింది.

అక్కడ, స్వర్గంలో విశ్వాచి అనే అప్సరసతో కొంత కాలం ఉండి, పిమ్మట,

దశార్ణదేశంలో బ్రాహ్మణుడు గాను, కోసల దేశంలో రాజుగాను, మహారణ్యంలో బోయవాడుగాను, గంగాతీరంలో హంసగాను, సూర్యవంశంలో పౌండ్రమహారాజుగాను, సాల్వదేశంలో సౌరమతాచార్యుడు గాను, ఒక కల్పంపాటు విద్యాధరుడుగాను, తరువాత మునిపుత్రుడుగా, సౌవీరదేశంలో మండలేశ్వరుడుగా, త్రిగర్తదేశంలో శైవాచార్యుడుగా, కిరాత దేశంలో వెదురుపొదగా, జాంగల దేశంలో మృగంగా, తాళవనంలో సర్పంగా, తమాలవనంలో వన కుక్కుటంగా, ఇట్లా నానా యోనులందు జన్మించాడు. ఇప్పుడు నీ కొడుకు, వామదేవుడనే పేరుతో విప్రకుమారుడై పుట్టి, జడలను దాల్చి, జపమాలను పూని, ఇంద్రియాలను జయించి, ఎనిమిది వందల సంవత్సరాల నుండి గంగాతీరంలో తపస్సు చేస్తున్నాడు.

మునీంద్రా! స్వప్నంలాంటి ఆ మనోభ్రమను చూడదలిస్తే, జ్ఞాన దృష్టితో చూడు, అని, కాలపురుషుడు పల్కగా ఆ భృగుమహర్షి జ్ఞాన దృష్టితో కుమారుని స్థితిని గూర్చి ఆలోచించాడు. అతనికి బుద్ధి అనే అద్దంలో పుత్రుని వృత్తాంతం అంతా కనిపించింది. పుత్రుని స్థితిని చూచి, భృగువు మళ్లీ మందరగిరి చరియయందున్న తన శరీరాన్ని ప్రవేశించాడు. పిమ్మట కాలుని చూచి యిట్లా అన్నాడు-

''ఓ జ్ఞాన వైరాగ్య నిధీ! మేము బాలబుద్ధి కలవారము. ప్రౌఢబుద్ధులం కాము. మీ వంటి వారి బుద్ధి త్రికాల జ్ఞానం కలది '' అనగా విని, కాలుడు ప్రసన్నుడై, ఆ మునీంద్రుని చేయిపట్టుకొని సమంగా నదీ తీరానికి బయలుదేరాడు. అచటకి చేరి అచట ఇంద్రియములను నిగ్రహించి తపోనిష్ఠుడై యున్న భృగుపుత్రుని చూచారు. కాలుని సంకల్పం వల్ల సమాధి నుండి భృగుపుత్రుడు లేచి, వారికి నమస్కరించాడు. వారు ముగ్వురు ఒక శిలపై గూర్చుండి సంభాషించుచుండగా వారితో మునిపుత్రుడు ఇట్లా అన్నాడు -

''మీ శాస్త్రం వల్ల గాని, తపస్సు వల్ల గాని, జ్ఞానం వల్ల గాని, విద్య వల్ల గాని, లభింపని ఆనందం, మీ దర్శనం వల్ల నాకు కలిగింది. సూర్యచంద్రుల్లాగా ఉన్న మీరెవ్వరు?'' అని.

భృగు ఇట్లా అన్నాడు - ''నీవు జ్ఞానివి. అజ్ఞానివి కావు. కాబట్టి నీ పూర్వ జన్మవృత్తాంతాన్ని గుర్తుకుతెచ్చుకో!'' అని. ఇది విని ఆ మునిపుత్రుడు ధ్యాననిష్ఠుడై తన జన్మాంతరములను జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు. సంతోషంతో ఆశ్చర్యంతో

చిరునవ్వు నవ్వుతూ అన్నాడు - ''ఎంత విచిత్రం! చిత్తమందలి భ్రాంతి దృష్టివల్ల ఈ విస్తారమైన జగత్తంతా కలుగుతోంది. చూడవలసిన దానిని చూచాను. తెలుసుకొనవలసిన దానిని తెలుసుకొన్నాను. భ్రమ తొలగిపోయింది. చిన్మాత్రముల కంటె ఏదీ లేదు గదా!''

ఓ తండ్రీ! మందర పర్వతం మీద నున్న నా పూర్వపు దేహాన్ని చూడాలని ఉంది. కాబట్టి, అచటికి పోదాం! నాకు సంకల్పం గాని, అసంకల్పం గాని ఏదీ లేదు.'' అని

వసిష్ఠుడు రామునితో యింకా యిట్లా అన్నాడు - ఓ రామా! వారు ముఫ్వురు తత్త్వజ్ఞానులు. జగత్తు యొక్క స్థితినిగూర్చి ఆలోచిస్తూ ఒక క్షణంలో మందరాద్రి వచ్చారు. అచట భృగుపుత్రుడు, తన పూర్వ శరీరాన్ని చూచాడు. తండ్రితో ఇట్లా అన్నాడు - తండ్రీ! నీవు పూర్వం సుఖోపచారాలు చేసి పోషించిన ఈ శరీరం ఎండిపోయినది. సందేహంగాని కౌతుకంగాని, కల్పనగాని ఏమీ లేకుండా ( మనస్సు లేనందు వల్ల) ఎట్లా పడిఉన్నదో చూడండి! ఆశలు, దుఃఖాలు, మోహం, వీటిని అణచటానికి అమనస్కత్వం (మనస్సు లేకుండటం) తప్ప, ప్రాణులకు శ్రేయస్కరమైనది ఇంకేదీ లేదు. అమనస్కత్వాన్ని పొందిన బుద్ధిమంతులే సుఖానుభవం యొక్క పరమావధిని పొందుతారు. దైవశరీరం వల్ల అమనస్కత్వాన్ని పొందిన నా శరీరాన్ని (దుఃఖము, పరితాపము లేని శరీరాన్ని) చూచాను.

ఇట్లా అంటున్న భృగు పుత్రునితో కాలుడు ఈ విధంగా అన్నాడు - ''ఓ మునిపుత్రా! రాజు తన నగరంలో ప్రవేశించేటట్లుగా, నీవు ఈ శరీరంలో ప్రవేశించు. రాక్షసులకు నీవు గురుత్వం వహించు. మీకు శుభమగుగాక!' అని పలికి కాలుడు మాయమైనాడు.

పిమ్మట, భృగుపుత్రుడు, సమంగా నదీ తీరాన ఉండిన బ్రాహ్మణుడను అనే భావం విడిచిపెట్టి, భృగుమహర్షి వీర్యం వల్ల కలిగిన ఆ శరీరంలో ప్రవేశించాడు. భృగువాశరీరాన్ని మంత్రజలాలను చల్లి ఆప్యాయనం కావించాడు. అంతట ఆ శరీరం నాడులతో వెనుకటి వలె ప్రకాశించింది. ప్రాణవాయువు చేరింది. శుక్రుడు లేచి తండ్రికి నమస్కరించాడు. వారిద్దరు సంకల్పాలను వదలి అలలు లేని సరస్సులాగా ఉన్నారు. ఓ రామా! ఈ శుక్రచరిత్రాన్ని నీకు చెప్పాను. దీనిని నీవు మనస్సులో బాగా విచారణ చేసి వర్తించు.

# దామాద్యుపాఖ్యానము

శుక్రోపాఖ్యానంలో 'మనోవికారమే సంసారం' అని చెప్పబడ్డది. ఈ ఉపాఖ్యానంలో, మనోవికారమైన ఆ సంసారం, వివేకం చేత మనస్సు అణగిపోగా, అది కూడా (సంసారం) అణగిపోతుందనీ మనస్సు అణగకపోతే (వివేకం కలగక పోతే) వృద్ధి చెందుతుందనీ చెప్పటానికై ముందుగా చిత్తనైర్మల్యానికి అవసరమైన సాధన సామగ్రిని గూర్చి చెపుతున్నారు.)

రామచంద్రా! ఎల్లప్పుడు ఆత్మవిచారపరుడై ఉండే వానికీ, సంకల్ప రహితునికీ, పరిపక్వమైన అంతఃకరణం కలవానికీ, హేయమైన ఈ దృశ్యాన్ని (సంసారాన్ని) వదలిపెట్టి బ్రహ్మాన్ని గ్రహించేవానికీ, ద్రష్టయైన ఆత్మనే సదా చూచేవానికీ, తెలుసుకోదగిన పరతత్త్వాన్ని తెలుసుకోవటంలో జాగరూకుడై ఉండే వానికీ, అజ్ఞానానికి మూలమైన సంసారమందు ఆసక్తి లేక, సుప్తుని వలె ఉండే వానికీ, వైరాగ్య పరిపాకం వల్ల సుఖవాసనలు తొలగిపోతాయి. దాని వల్ల అహంకారం విడిపోతుంది. దాని వల్ల చిల్లగింజ చేత నీరు నిర్మలమైనట్లుగా విజ్ఞానం చేత మనస్సు నిర్మలమౌతుంది.

రాగ ద్వేష విషయాసక్తి లేకపోవటం వల్లనూ, సుఖదుఃఖాది ద్వంద్వదోషాలు లేకపోవటం వల్లనూ, నిరాలంబమైన చిత్తం పంజరం నుండి వెలువడిన పక్షిలాగా మోహం నుండి దూరమౌతుంది. అట్లా సందేహ రహితమూ, సంకల్ప శూన్యమూ, పరిపూర్ణమూ అయిన చిత్తం పూర్ణచంద్రుని లాగా ప్రకాశిస్తుంది.

ఆత్మ విచారము చేత, ఆత్మతత్త్వ సాక్షాత్కారం చేత, పరిపూర్ణమైన స్వభావము కలవాడు, బ్రహ్మవిష్ణు రుద్రుల యెడల జాలి చెందుతున్నారు - వారు సదా దుఃఖితులు గదా! అని ఆత్మ విచారము, జగద్విచారము అంతఃకరణంలో కలగ నంతవరకు అంధకారమయమైన ఈ సంసారం ఉండనే ఉంటుంది.

**ఆత్మజ్ఞాని లక్షణము :-** తనకు ఇతరులకు భేదాన్ని చూడనివాడు, జగత్తును చిన్మాత్రంగా చూచేవాడూ ఆత్మదర్శి (ఆత్మను చూచేవాడు) అన్నమాట. ఆత్మను సర్వ శక్తియుతమైనదిగా, అపరిచ్ఛిన్నమైనదిగా (అనంతమైనదిగా) రెండవ వస్తువంటూ లేనిదానినిగా (అద్వితీయంగా) చిన్మాత్రంగా చూచేవాడే ఆత్మదర్శి.

కన్ను, ప్రయత్నం లేకుండానే దగ్గరనున్న వస్తువులను చూచునట్లుగా, ఆత్మ విదుని చిత్తం కూడా రాగద్వేషం లేకుండానే కార్యాలయందు ప్రవర్తిస్తుంది. 'వీడు దొంగ' అని తెలిసి, వానితో వ్యవహరించినప్పుడు వాడు మిత్రునిగానే కనిపిస్తాడు.

బాధకుడుగా తోచడు. అట్లాగే, తెలిసి అనుభవించే భోగాలు ఆత్మజ్ఞానికి సంతోషకరములే అవుతాయి. బంధింపబడి యున్న రాజు ఆహారం యిచ్చినంత మాత్రానికే సంతోషిస్తాడు. స్వతంత్రుడైన రాజు రాజ్యం వల్లనైనా తృప్తిని పొందడు. అట్లాగే ప్రత్యాహారాదుల వల్ల నిగ్రహింపబడిన మనస్సు కూడా, స్వల్ప భోగాల వల్లనే తృప్తి పొందుతుంది.

**మనస్సును జయించే ఉపాయం :**– హఠయోగాదులతో, ప్రాణాయామాదుల ద్వారా అయినను మనసును జయించటానికి ప్రయత్నించాలి. ఈ ప్రపంచంలో వేరొక మార్గం లేదు. ఈ ప్రపంచంలో చిత్తానికి ( మనసుకు) లోబడనివారే ధన్యులు. అట్టివారే పురుషులు. మనస్సు సర్పం లాంటిది. విషయవాసనలు దాని విషం. ఆ సర్పం ఎవని హృదయంలో కదలకుండా చుట్టచుట్టుకొని పడుకొని ఉంటుందో, వారే ధన్యులు. అట్టివారికి నమస్కారము. అని చెప్పి వసిష్ఠుడు ఇంకా యిట్లా అంటున్నాడు -

**మహానరక సామ్రాజ్యా మత్త దుష్కృత వారణాః**
**ఆశాశరశలాకాఢ్యా దుర్జయా హీంద్రియారయః** 8
**ప్రక్షీణ చిత్త దర్పస్య నిగృహీతేంద్రియ ద్విషః**
**పద్మిన్య ఇవ హేయంతే క్షీయన్తే భోగవాసనాః** 9
**తావన్ని శీధ వేతాళా వల్గంతి హృదివాసనాః**
**ఏకతత్త్వ దృఢా భ్యాసా ద్యావన్న విజితం మనః** 10
**భృత్యోభిమత కర్తృత్వా న్మంత్రీ సత్కార్యకారణాత్**
**సామంతశ్చేంద్రియాక్రాంత్యా గురుద్విద్యా ప్రదానతః** 11
**లాలనాత్స్నిగ్ధ లలనా పాలనా త్పావనః పితా**
**సుహృదుక్తం చ విశ్వాసాత్ మనోమన్యే మనీషిణాం** 12

ఇంద్రియాలనే శత్రువుకు మహానరకమే సామ్రాజ్యము. పాపాలు మదపు టేనుగులు. ఆశలు అనేవి బాణాలు. అట్టి ఇంద్రియాలను మనోగర్వము తొలగిపోయి, ఆ ఇంద్రియాలనే శత్రువులను జయించినట్టి పురుషుని భోగవాసనలు, హేమంత ఋతువులో తామరతూండ్లు క్షయమైపోయినట్లు నశించిపోతాయి.

ఆత్మ తత్త్వాన్ని భావిస్తూ మనస్సును జయింపకపోతే, అర్ధరాత్రి యందు పిశాచాల్లాగా, వాసనలు హృదయంలో నాట్యం చేస్తూనే ఉంటాయి.

పండితులైన వారి మనస్సు, వారి అధీనంలో ఉంటుంది. కాబట్టి ( వారి మనస్సు) ఇష్టకార్యాలు చేస్తూ సేవకునిలాగా ఉంటుంది. అనుకూల కార్యాలు చేస్తూ

మంత్రిలాగా, ఇంద్రియాలను నియమించి ఆజ్ఞాపిస్తూ సామంతునిలాగా, జ్ఞానాన్ని కలిగిస్తూ గురువులాగా, లాలిస్తూ కాంతలాగా, పాలిస్తూ తండ్రిలాగా, విశ్వాసం చూపుతూ మిత్రునిలాగా సంతోషాన్ని కలిగిస్తుంది.

స్వాలోకిత శ్శాస్త్రదృశా స్వబుద్ధ్యా స్వానుభావితః
ప్రయచ్ఛతి పరాంసిద్ధిం త్యక్త్వాత్మానం మనః పితా 13
సందృష్ట స్సుదృఢ స్స్వచ్ఛస్సుకాంత స్సుప్రబోధితః
స్వగుణే నోర్జితే భాతి హృది హృద్యో మనోమణిః 14
ఏవం మనోమణిం రామ బహుపంక కళంకితం
వివేక వారిణా సిద్ధ్యై ప్రక్షాళ్యాలోక వాన్భవ. 15
వివేకం పరమాశ్రిత్య బుద్ధ్యా సత్యమవేక్ష్య వ
ఇంద్రియారీ నలం తీర్త్వా తీర్ణోభవ భవార్ణవాత్ 16
అయమహ మితి నిశ్చయో వృధా య
స్తమల మపాస్య మహామతే స్వబుద్ధ్యా
య దితర దవలంబ్య తత్పదం త్వం
వ్రజ పిబ భుంక్ష్వ న బధ్య సేమనస్కః 17

శాస్త్ర దృష్టిచేత పర్యాలోచనచేయబడి, స్వానుభవం చేత నిశ్చయించుకోబడినట్టి మనస్సు, తాను లయాన్ని పొంది కైవల్యాన్ని ఇస్తుంది.

ఉత్తమమైన శాస్త్ర దృష్టి కలిగి ఉంటుంది. కాబట్టి సంశయ విపర్యయాలు లేనిదై ఉంటుంది. సంశయ విపర్యయాలు ఉండవు. కాబట్టి నిర్మలంగానూ, నిర్మలమై ఉంటుంది కాబట్టి శుభేచ్ఛ కలిగి ఉంటుంది. శుభేచ్ఛ కలది కాబట్టి మంచి జ్ఞానాన్ని పొందినదై ఉంటుంది. జ్ఞానయుక్తమై ఉంటుంది కాబట్టి శమదమాది గుణాలు కలిగి ఉంటుంది. అట్టి రమణీయమైన మనస్సు అనే మణి హృదయ మందు ప్రకాశిస్తుంది.

రామా! అనేక మలిన వాసనలు అనే బురద చేత కళంకితమై యున్న మనస్సు అనే మణిని, విచారణ వల్ల కలిగిన వివేకం అనే జలంతో కడిగి, మోక్షం అనే తత్త్వాన్ని చూడు.

రామా! మంచి వివేకాన్ని ఆశ్రయించి, బుద్ధిచేత తత్త్వాన్ని తెలుసుకొని, ఇంద్రియాలు అనే శత్రువుల్ని జయించి, సంసార సాగరాన్ని దాటు. 'ఇది నేను' అనే అహంకారపరిచ్ఛిన్నమైన వ్యర్థ నిశ్చయాన్ని పూర్తిగా వదలివేసి, అపరిచ్ఛిన్నరూపమైన 'బ్రహ్మాన్ని నేను' అని యెరిగి సంకల్ప రహితుడవై సంచరిస్తే బంధాన్ని పొందవు.

**దామవ్యాళ కటకోపాఖ్యానం** ;- వసిష్ఠుడు ఈ విధంగా చెపుతున్నాడు -

ఓ రామచంద్రా! నీవు దామవ్యాళకటుల లాగా వివేకశూన్యుడవై వ్యవహరింపవద్దు. భీమ భాస దృఢుల వలె దుఃఖ రహితుడవై వర్తించు. ఇది విని, రాముడు దామ వ్యాళకటుల వృత్తాంతాన్నీ, భీమభాస దృఢుల వృత్తాంతాన్నీ చెప్పమని అడుగగా, వసిష్ఠుడు ఇట్లా చెప్పాడు -

ఓ రామచంద్రా! పాతాళంలో, ఐశ్వర్య రమణీయమైన ఒక బిలంలో శంబరుడనే రాక్షసేంద్రుడుండేవాడు. అతడు గొప్ప మాయావి. అతనికి దేవతలను జయింపజాలిన గొప్ప సైన్యం ఉంది. మాయాబలం గల శంబరుడు, దేశాంతరమేగి, అచట నిద్రిస్తూ ఉండగా, దేవతలు అతని సైన్యాన్ని వధించారు.

అంతట, శంబరాసురుడు తన సేనలను రక్షించటానికై ముండికాంకుడు, ద్రుముడు అనే వారిని నియమించాడు. దేవతలు సమయం చూచి వారిద్దరినీ కూడా వధించారు. శంబరుడు కోపించి స్వర్గానికి వెళ్లాడు. అతని రాకను చూచి, అతని మాయాబలానికి భయపడి దేవతలు అడవుల్లోను, పొదల్లోను దాగారు. స్వర్గంలో క్షుద్రదేవతలు, దుఃఖితలైనస్త్రీలు మాత్రమే మిగిలి ఉన్నారు. భుజబలదర్పితుడైనశంబరాసురుడు ఆ స్వర్గమంతటా తిరిగి, లోకపాలుర నగరాలను కాల్చి తిరిగి తన నివాసానికి వెళ్ళాడు. దేవాసురుల వైరం ప్రబలమైంది. అవకాశం దొరికినప్పుడు ఒకరినొకరు వధించుచుండిరి.

శంబరాసురుడు కోపించి, తన మాయచే మహాబలవంతులైన ముగ్గురు రాక్షసులను సృజించాడు. దాముడు, వ్యాళుడు, కటుడు అనే ఆ మువ్వురూ ఆ విధంగా మాయవశుడైన పరమాత్మ వలన పుట్టి లోక వాసన, దేహాభిమానం, లేనివారై శత్రుమిత్రులనే విచక్షణ గాని, జనన మరణాలు, జయాపజయాలనే ఆలోచన గానీ లేక కనిపించిన సైనికులందరినీ వధింపసాగారు.

శంబరాసురుడు వారిని జూచి, ఇష్టానిష్ట విచారణ లేనివారు కాబట్టి వెనుతిరిగి పోవటమనేది ఉండదు కాబట్టి వారితో కలిపి తన సైన్యాన్ని దేవతలపైకి పంపాడు. దేవతలు ఆ సైన్యం ముందు నిలవలేక పారిపోయారు. దామవ్యాళకటులు దేవతల వెంట పడ్డారు. దేవతలు వారి కంట పడకుండా దాగినారు. ఎంత వెదకినా దేవతలు కనిపించనందున ఆ ముప్పురు పాతాళాన ఉన్న తమ ప్రభువు శంబరాసురుని వద్దకు వెళ్లారు.

దామాదులచే ఓడిపోయిన దేవతలు బ్రహ్మ వద్దకు వెళ్లి తమ గోడును

విన్నవించుకున్నారు. వారి వృత్తాంతం విని, బ్రహ్మ యిట్లా అన్నాడు- దేవతలారా! వేయి సంవత్సరాల తరువాత గాని, మీరు శంబరాసురుని సైన్యాన్ని జయింపలేరు. అంతవరకు మీరు వేచి ఉండవలసిందే. మీరు మళ్ళీ మళ్ళీ పోయి, దామవ్యాళ కటులతో యుద్ధం చేస్తూ ఉండండి. పారిపోతూ ఉండండి. ఇట్లా మాటిమాటికీ మిమ్ము జయించి, పారద్రోలుతూ ఉండటం వల్ల వారి హృదయాల్లో అహంకారం అద్దంలో లాగా ప్రతిబింబిస్తుంది. ఆ అహంకారం వల్ల, వారికి దేహవాసన అబ్బుతుంది. అప్పుడు వారు వలలో చిక్కిన పక్షులౌతారు, మీకు వశులౌతారు. ఆశ అనేదే దుఃఖాలన్నింటికీ మూలం. ఆశలేక పోవటమే అన్ని సుఖాలకు నిలయం. జీవుడు ప్రపంచ వాసన అనే దారంతో - త్రాటిచే బంధింపబడి ఉన్నాడు. లోకవాసన పెరిగితే దుఃఖాలు పెరుగుతాయి. లోకవాసన తగ్గితే దుఃఖాలు తగ్గుతాయి. ధైర్యవంతుడైనా, విశేషజ్ఞుడైనా, వృద్ధుడైనా, మహాత్ముడైనా, సింహం గొలుసుచేత బంధింప బడినట్లు ఆశచేత బంధింపబడి ఉన్నాడు '' అని చెప్పి బ్రహ్మ అంతర్హితుడైనాడు.

బ్రహ్మదేవుడు చెప్పినట్లే దేవతలు మాటిమాటికి దామాదులతో యుద్ధం చేస్తూ ఓడి, పారిపోవసాగారు. ఇట్లా అనేక పర్యాయాలు దేవతల్ని ఓడించటం వల్ల, దామాదులకు అహంకారం పెరిగి, దేహాభిమానం కూడా పెరిగింది. దేహ వాసనతో భ్రాంతియుక్తులై దీనత్వాన్ని పొందారు- నా శరీరం స్థిరంగా ఉండాలని, సౌఖ్యం కోసం నాకు ధనం అధికంగా ఉండాలనీ, ఆశ పెరిగి సంకల్పం పెరిగి, ధైర్యం తరిగిపోయింది. జీవితాపేక్షచే బలహీనులైనారు. కట్టెలు కాలిపోయిన తరువాత అగ్నులు హవిస్సును కాల్పజాలనట్లు, వారు దేవతలను జయింపలేని స్థితికి వచ్చారు. క్రమంగా దేవతల చేతిలో చచ్చి నశించారు.'' అని, వసిష్ఠుడు ఇట్లా అన్నాడు -

రామా! దామాదుల స్థితి నీకు కలుగకుండుటకై నీకీ కథను చెప్పాను. చిత్తం, అవివేకం వల్ల అంతులేని ఇటువంటి ఆపదలను పొందుతోంది.

ఇది విని, రాముడు, పరమాత్మ వల్ల ఆ దామవ్యాళ కటులు ఎట్లా పుట్టారు? అని అడిగాడు. వసిష్ఠుడు వారి జన్మవృత్తాంతాన్ని చెపుతున్నాడు -

రామా! మాయచేత కల్పింపబడిన ఈ దామాదులు ప్రాతిభాసిక శరీరం కలవారైనట్లే మనం కూడా ప్రాతిభాసిక శరీరులమై బ్రహ్మమందే ఉంటున్నాం. అంతే తప్ప, ఎవ్వరూ చిదాకాశానికి వెలుపల ఉన్న వారు కారు. నీ ఉనికి, నా ఉనికి, దామాదుల ఉనికి అసత్యమే! ప్రాతిభాసిక రూపిణి మాత్రమే అయిన

పరమాత్మయొక్క జీవశక్తి, శంబరాసురుని ధ్యానం వల్ల చలించి, దామాద రూపాలతో మూడు విధాలుగా ఉల్లాసాన్ని పొందింది. కాబట్టి, మనం గాని, దామాదులు గాని, సత్యమైన వారము కాము. జ్ఞానస్వరూపము, నిర్మలము అయిన చైతన్యమే సత్యమైనది. సర్వవ్యాపకము, శాంతము, ఉదయాస్తమయరహితము అయిన ఆ సచ్ఛక్తి యొక్క ఉల్లాసమే ఈ జగత్తు అని గ్రహించు. అధ్యారోప దృష్టితో, అనుభవాను సారంగా చూస్తే, సర్వమూ సర్వమునందున్నది. అపవాద దృష్టితో చూస్తే ఏదీ దేని యందూ లేదు. ఉన్నదేదో శాంతము, ఏకము (అద్వితీయము) వ్యాపకము అయిన సత్తు మాత్రమే! కాబట్టి, నీవు నిశ్చయంగా భేదరహితుడవై ఉండు. (అధ్యారోపము = కాని దానియందు అవును అనే బుద్ధి అంటే, త్రాడు నందు పాము అనే బుద్ధి అధ్యారోప బుద్ధి. ఇది త్రాడే తప్ప, పాము కాదు అనే బుద్ధి అపవాద బుద్ధి.)

## భీమాద్యుపాఖ్యానము

(వెనుకటి దామాద్యుపాఖ్యానంలో అవివేకం వల్ల నేను, నాది అనే అభిమానం పుడుతోందనీ, ఆ అభిమానం వల్ల సంసారం పెరుగుతోందనీ చెప్పబడ్డది. ఈ ఉపాఖ్యానంలో ముందుగా దేహాదులందు అహంకారం (దేహమే నేను అనే భావం) లేకుండా ఉండటమే పురుషార్థమనీ, ఆ స్థితిని పొందటం ముఖ్యమనీ చెప్పదలచారు.)

వసిష్ఠ ఉవాచ -

ఇదం మేస్యా దిదం మే స్యాదితి బుద్ధిర్మహామతే
స్వేన దౌర్భాగ్య దైన్యేన న సత్యముప తిష్ఠతి 18
వేత్తి నిత్య ముదారాత్మా త్రైలోక్యమపి యస్తృణం
తం త్యజన్త్యా పదస్సర్వా మృగా ఇవ జరత్తృణం 19
పరిస్ఫురతి యస్యాంతర్నిత్యం సత్య చమత్కృతిః
బ్రాహ్మ మండమి వాఖండం లోకేశాః పాలయంతి తం 20
యేషాం గుణేషు సంతోషో రాగో యేషాం శ్రుతం ప్రతి
సత్యవ్య సనినో యే చ తే నరాః పశవోపరే 21
అథాపది దురంతాయాం నైవ గంతవ్య మక్రమం
రాహు రప్యక్రమేణైవ పిబన్నప్యమృతం మృతః 22
అవశ్యావశ్యతాం యాంతి సర్వాపదః క్షయం
అక్షయం భవతి శ్రేయః క్రీతం యేన గుణైర్యశః 23

యథాశాస్త్రం విహరతాత్వరా కార్యా న సిద్ధిషు
చిరకాలం పరాపక్వా సిద్ధిః పుష్టఫలా భవేత్ 24
వీతశోక భయాయాస మగర్ద మపయంత్రణం
వ్యవహారో యథాశాస్త్రం క్రియతాం మా వినశ్యతాం 25

జగములన్నీ ఆత్మ యందే ఉన్నాయి. కాబట్టి, ఆత్మ సర్వాత్మకుడైనప్పటికీ, తనకేమీ లేదు అనే దీనత్వంతో నాకు పుత్రాదులు కలగాలి. క్షేత్రాదులు కలగాలి' అనే బుద్ధి ఉన్నంతవరకు సత్యమైన ఆత్మస్వరూపం ప్రకాశించదు. ముల్లోకాలను గడ్డిపోచలాగా చూచే ఔదార్యవంతుని సమస్త ఆపదలు, మృగాలు ఎండు గడ్డిని వదలినట్లు వదలివేస్తున్నాయి.

సత్యస్వరూపమైన పరబ్రహ్మతో అనుసంధానింపబడిన హృదయం కలవానిని, దిక్పాలకులు బ్రహ్మాండాల్ని కాపాడినట్లు కాపాడుతూ ఉంటారు. ఈ గుణములన్నీ తమ యందున్నందున ఎవరు సంతుష్టిని కలిగి ఉంటారో, ఎవరు బ్రహ్మమునందాసక్తిని కలిగి ఉంటారో వారే మనుష్యులు. ఇతరులు పశువులు.

ఆపద వచ్చినప్పటికీ అక్రమానికి పాల్పడరాదు. రాహువు అక్రమం వల్లనే అమృతం త్రాగినా మరణించాడు. సద్గుణాల చేత కీర్తిని కొన్న వానికి అంతా వశులౌతారు. ఆపదలు నశిస్తాయి. అక్షయమైన శ్రేయాలు కలుగుతాయి. పురుష ప్రయత్నము నాశ్రయించి, తొందరపడక, శాస్త్ర పద్ధతిలో పనిచేస్తే తప్పక ఫలం కలుగుతుంది. ఎక్కువ కాలం పాటు పరిపక్వమై కలిగిన సిద్ధి అధిక ఫలాన్ని యిస్తుంది. శోకము, భయము, ఆయాసము, కామము, కౌటిల్యము, లేకుండా శాస్త్ర ప్రకారం నడచుకోవాలి. చెడిపోకూడదు.

అనర్థాయార్థ సంపత్తి ర్భోగౌఘో భవరోగదః
ఆపద స్సంపద స్సర్వా స్సర్వత్రా నాదరోజయః 26
ఆచారచారు చరితస్య వివిక్త వృత్తేః
సంసార సౌఖ్య ఫలదుఃఖద శాస్వ గృధ్నోః 27
ఆయుర్యశాంసి చ గుణాశ్చ సహైవ లక్ష్మ్యా
ఫుల్లంతి మాధవలతా ఇవ సత్ఫలాయ. 28
న తపాంసి న తీర్థాని న శాస్త్రాణి జయంతి హి
సంసార సాగరోత్తారే సజ్జనా సేవనం వి 29
లోభమోహారుషాం యస్య తనుతాను దినం భవేత్
యథాశాస్త్రం విహరతి స్వకర్మసు స సజ్జనః 30

అహమర్థోపరి జ్ఞాతః పరమార్థాంబరేమలః
పరిజ్ఞాతోహ మర్థస్తు పరమార్థాంబరం భవేత్ 31
చిజ్జ్యోత్స్నా యావదేవాంత రహంకార ఘనావృతా
వికాసయతి నో తావత్పర మార్థ కుముద్వతీ 32
అహంభావోం కురో జన్మవృక్షాణా మక్షయాత్మనాం
మమేదమితి విస్తీర్ణా స్తేషాం శాఖా స్త్వసత్ఫలాః 33
కిమాకృతి రహంకారః కథం సంత్యజ్యతే ప్రభో
స శరీరోశరీరశ్చ త్యక్తే తస్మింశ్చ కింభవేత్? 34

అర్థ సంపద అనర్థానికి కారణమౌతుంది. భోగాలు సంసార రోగాన్ని కలిగిస్తాయి. సంపదలన్నీ ఆపదలకు మూలములు. కాబట్టి వేటియందూ ఆసక్తి లేకుండా ఉండటమే జయాన్ని కలగిస్తుంది. సదాచారపరుడు, ధ్యానాసక్తచిత్తుడు, సంసార సుఖాల యందు ఆశలేని వాడు, ఆయుర్దాయము, కీర్తి అనే వాటిని సంపదతో పాటు పొందుతాడు. వసంతర్తువు నందు సత్ఫలాలకై తీగలు వికసించినట్లుగా అతనికి ఆయువు, కీర్తి సంపద అనే ఫలాలు లభిస్తాయి.

సంసార సముద్రాన్ని దాటటానికి సజ్జన సేవ తప్ప, తపస్సులు, తీర్థయాత్రలు, శాస్త్రములు, జపాలు, ఉపయోగింపవు. రోజు రోజుకు లోభమోహ రోషములు తగ్గిపోతున్న వాడూ , శాస్త్ర విధి ప్రకారం స్వకర్మల నాచరించే వాడూ సజ్జనుడు.

'నేను' అనే శబ్దానికి అర్థం తెలియక పోతే చిదాకాశంలో అది కళంకం లాగా ఉంటుంది. ఆ అర్థం తెలుసుకొంటే చిదాకాశమే అవుతుంది - కళంకం తొలగినందున. జ్ఞానమనే వెన్నెల అహంకారమనే మేఘం చేత కప్పబడి ఉన్నంతవరకు కైవల్యం అనే కలువపువ్వు వికసింపదు - అహంకారం నశిస్తేనే తప్ప మోక్షం సిద్ధింపదు. అహంభావము ఎన్నడూ చావని వృక్షాల వంటి జన్మలకు బీజం అవుతుంది. మమకారం ( నాది అనే బుద్ధి ) దుఃఖాలు అనే ఫలాలకు కొమ్మ లాంటిది.

ఇదంతా విని శ్రీరాముడు అడిగాడు - మునీంద్రా! అహంకారం అంటే ఏమిటి? ఎట్లా ఉంటుంది? అది శరీరం కలదైనా దానిని వదలిపెట్టటం ఎట్లా? దానిని వదలినందు వలన కలిగే ఫలం ఏమిటి?

**మూడు రకాల అహంకార స్వరూపం :**–వసిష్ఠుడీ విధంగా అన్నాడు - శ్రీరామా! అహంకారం మూడు విధాలుగా ఉంటుంది. వాటిలో రెండు రకాలు శ్రేష్ఠమైనవి. ఒక రకం విడువదగినది. వానిని గూర్చి చెపుతాను విను.

అహం సర్వ మిదం విశ్వం పరమాత్మాహ మచ్యుతః
నాన్యదస్తీత సంచింత్య పరమా సాహ్యాహం కృతిః 35
ఏషా సానైవ బంధాయ జీవన్ముక్తస్య విద్యతే
సర్వస్మా ద్వ్యతి రిక్తోహం వాలాగ్రశత కల్పితః 36
ఇతి యాసంవిదే వా సా ద్వితీయా హం కృతి శ్శుభా
మోక్షాయైషా న బంధాయ జీవన్ముక్తస్య విద్యతే
37
పాణి పాదాది మాత్రోయ మహా మిత్యేష నిశ్చయః
అహంకార స్త్రుతీ యోసౌ లౌకిక స్తుచ్ఛ ఏవ నః 38

''ఈ సమస్త జగత్తు నేనే! నేనే పరమాత్మను! నా కంటె వేరుగా ఏదియు లేదు '' అని అనుకోవటం శ్రేష్ఠమైన అహంకారం. ఇట్టి అహంకారం బంధాన్ని కలిగింపదు. ఈ విధమైన అహంకారం జీవన్ముక్తునికి ఉంటుంది.

''నేను దేహేంద్రియాదుల కంటె విలక్షణుడను. వెంట్రుక కొన యొక్క నూరవ భాగమంత అణు స్వరూపుడనై యున్నాను '' అనే బుద్ధి రెండవ రకానికి చెందినట్టి అహంకారం. ఇది కూడా మోక్షదాయకమే! బంధకమైనది కాదు. ఇట్టి అహంకారం కూడా జీవన్ముక్తునికే ఉంటుంది.

''నేను కాళ్లు చేతులు కలవాడను'' అనే అహంకారం మూడవ రకానికి చెందినది. ఈ అహంకారం ప్రాపంచికమై తుచ్ఛమైనది. అని వసిష్ఠుడింకా యిట్లా అంటున్నాడు- ఈ అహంకారం కలవాడు అధోగతిని పొందుతాడు. 'ఈ దేహమే నేను' అనే ఈ మూడవ అహంకారం సంసార జాలానికి మూలం కాబట్టి దీనిని వదలి పెట్టాలి. ఈ అహంకారాన్ని క్రమంగా వదలివేస్తే, మిగతా రెండు రకాల అహంకారాలూ ఉండి, శీఘ్రంగా ముక్తిని పొందుతాడు.

మొదటి రెండు అహంకారములను భావిస్తూ ఉంటే పురుషుడు పరతత్త్వాన్ని పొందుతాడు. క్రమంగా ఆ రెండు అహంకారాలను సైతం వదలివేస్తే శాశ్వత మైన బ్రహ్మ పదాన్నే పొందుతాడు. మూడవదైన దురహంకారాన్ని వదలివేస్తే, అప్పుడాతని శరీర స్థితి పుణ్యవంతమౌతుంది. అని అహంకార స్వరూపాన్ని చెప్పి, వసిష్ఠుడింకా ఇట్లా అన్నాడు -

ఓ రామా! ఆ విధంగా దామాదులు నశించిన పిమ్మట, శంబరుడు మళ్ళీ దేవతల్ని జయించటానికి ఉపాయం ఆలోచింపసాగాడు - ''నేను మాయచే సృజించిన దామాదులు, మోహం వల్ల మిథ్యాహంకారానికి లోనైనారు. ఈసారి నేను ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞానం కలవారిని సృష్టిస్తాను. వారికి మిథ్యాభావన ఉండదు. కాన అహంకారం లేనివారై దేవతలను జయించగలరు '' అని తలచి శంబరుడు సముద్రం నీటి బుడగలను సృష్టించినట్లుగా తన మాయచే రాక్షసుల్ని సృష్టించాడు.

**భీమాదుల పుట్టుక** - శంబరుని మాయ వల్ల, సర్వజ్ఞులు, వేదవిదులు, విరాగులు, పాతకరహితులు, ఏది తటస్థపడితే దానిని మాత్రమే చేసేవారూ (యథాప్రాప్త కర్తలు) అయిన భీముడు, భానుడు, దృఢుడు అనే ముగ్గురు రాక్షసుల్ని సృష్టించాడు. వారీ జగత్తును తృణప్రాయంగా చూడసాగారు. శంబరుని మాట ప్రకారం దేవతలతో సమంగా యుద్ధం చేస్తున్నారు. వారికి 'ఇది నాది' అనే వాసన వచ్చిన వెంటనే 'నేనంటె ఎవరు?' అనే విచారణ వల్ల ఆ వాసన తొలగిపోతోంది. వారు జరామరణ భయం లేనివారు, విరాగులు, ద్వేష రహితులు, సంప్రాప్తకృత్యాలను చేసేవారు, సమదృష్టులు కాబట్టి దేవతాసైన్యాన్ని భక్షింపసాగారు.

అట్లా భీమ భాస దృఢులచే ఓడింపబడిన దేవతల సైన్యం హిమాలయం నుండి, వేగంగా పరుగులు పెట్టే గంగానది లాగా పారిపోసాగింది. అట్లా పోయి వారంతా విష్ణుమూర్తి శరణుజొచ్చారు. విష్ణుమూర్తి ఆ రాక్షసులను తన చక్రాగ్ని జ్వాలలచే కాల్చి విష్ణులోకానికి చేర్చాడు.

కాబట్టి, రామా! వాసనతో కూడిన మనస్సు బంధకారణమనీ, వాసనా రహితమైన మనస్సు ముక్తమనీ అంటున్నారు. కాన నీవు వాసనా రాహిత్యాన్ని పొందు. సత్యమైన పరమాత్మ జ్ఞానం వల్ల వాసన నశిస్తుంది. వాసన నశించటంతోడనే చమురు లేని దీపంలాగా చిత్తం లయమైపోతుంది.

**సృష్టిక్రమం** - కాబట్టి, అహంకార పరిత్యాగమే మోక్షసాధకమనే విషయం తెలిసింది. ఆ విషయాన్ని ఉపపాదన చేయటానికై ఈ జగత్తు మాయ అని స్పష్టం చేయాలి. అందుకు ఉపాయాన్ని చెపుతున్నారు.

ఉపద్రవాలన్నింటికీ కారణమైనట్టి ఈ సంసార దుఃఖాన్ని పోగొట్టటానికి మనో నిగ్రహం ఒక్కటే ఉపాయం. దానిని మించిన ఉపాయం లేదు. శ్రీరామా! జ్ఞాన సర్వస్వాన్ని చెపుతున్నాను. విను. విని, మనసులో ఉంచుకో! భోగాలను అనుభవించాలనే కోరికయే బంధము. అట్టి వాంఛ లేకుండా ఉండటమే మోక్షం!

ఇతర శాస్త్రాలను గూర్చిన విచారణ అనవసరం. ఒక విషయం చెపుతాను అట్లా చెయ్యి. లోకంలో ఏదేది మనస్సుకు ఇంపుగా ఉంటుందో అట్టి ప్రతిదానినీ విషాగ్నులుగా చూడు - సంతాప హేతువులాగా తలచు. విషయభోగాలన్నీ విషమాలని బాగా ఆలోచించి వాటిపై ఆసక్తిని వదలు. వాటిని సేవిస్తూ ఉంటే అవి సుఖకరాలే అవుతాయి.

మనస్సు పెంపొందిన కొలదీ ఆత్మజ్ఞానం నశిస్తుంది. మనస్సు నాశ మొందితే ఆత్మజ్ఞానం పెంపొందుతుంది. కావుననే జ్ఞాని యొక్క మనస్సు నాశనమౌతుంది. అజ్ఞాని మనస్సు పెంపొంది బంధకమౌతుంది.

జ్ఞాని యొక్క మనస్స్వరూపం ఎట్లా ఉంటుందంటే, జడమైనందున ఆనందస్వరూపం కాదు. ఆనందానుభవానికి కారణమైనందున నిరానంద స్వరూపమూ కాదు. ఆత్మయందే ఉనికి కలది కాబట్టి చంచలం కాదు. బహిర్ముఖంగా పోతూ ఉండేది కాబట్టి స్థిరమూ కాదు. సత్కార్య సంకల్పాలు సైతం ఉండనందున సత్యమూ కాదు. ఇంద్రియాలను విషయాల యందు ప్రవేశపెడుతుంది. కాబట్టి అసత్యమూ కాదు. పరస్పర విరుద్ధాలైన ఈ రెండు పక్షాలకు మించిన మూడవ పక్షం ఏదీ లేదు కాబట్టి సత్ అసత్‌లకు మధ్యన ఉండేదీ కాదు. అందుచేతనే, జ్ఞాని యొక్క మనస్సు ఫలానా విధంగా ఉంటుందని చెప్పలేము.

ఇది విని శ్రీరాముడిట్లా అడిగాడు - ''మునీంద్రా! ప్రపంచానికి అతీతంగా ఉన్న చిదాత్మ యందు ప్రపంచం ఎట్లా ఉన్నదో నాకు మళ్ళీ తెలియజెప్పండి'' అని. (వసిష్ఠుడు చిదాత్మయందు వివర్తభావం చేత ఈ విశ్వం ఉన్నదని చెప్పదలచి, ముందుగా చిదాత్మస్వరూపాన్ని ఈ విధంగా చెపుతున్నాడు) వసిష్ఠుడంటున్నాడు -

రామా! అన్ని వస్తువులను తనలోనే పొంది ఉన్నప్పటికీ, అవయవ రహితమైనది కాబట్టి, ఆకాశం ఎట్లా కనిపించదో అట్లాగే సమస్తాన్నీ పొంది ఉన్నప్పటికీ చిదాత్మనిరంకుశుడై నందువల్ల కనపడడు.

సర్వసంకల్ప రహితా సర్వ సంజ్ఞా వివర్జితా
సైషా చిదవినాశాత్మా స్వాత్మే త్యాది కృతాభిధా 39
ఆకాశ శతభాగాచ్ఛా జ్ఞేషు నిష్కలరూపిణీ
సకలామల సంసార స్వరూపై కాత్మ దర్శినీ 40
తరంగాది మయా స్ఫారా నానాతా సలిలార్ణవే
తస్మాన్న వ్యతిరేకేణ తథైవేత్థం ప్రకాశతే. 41

ఆత్మ అనేది ఏ విధమైన సంకల్పాలు, పేర్లు, లేనిది. అవినాశ స్వరూపం కలది. వ్యవహారం కోసం చిదాత్మ, స్వాత్మ మొదలైన పేర్లు కలిగి ఉన్నది. ఆకాశం కంటె వందరెట్లు నిర్మలమైనది. జ్ఞానులందు నిష్కల రూపంగాను, అజ్ఞానులందు సకల రూపంగాను సంసార రూపంగాను ఉంటుంది.

సముద్రంలో పుట్టే తరంగాలు, బుడగలు అనేక రకాలుగా ఉన్నప్పటికీ, అవన్నీ సముద్రం కంటె భిన్నమైనవి కానట్లే చిదాత్మయందు కనుపించే నీవు, నేను అనే ఈ విధమైన ప్రపంచం అంతా, ఆ చిన్మాత్రం కంటె అభిన్నంగానే ప్రకాశిస్తోంది - ఈ జగత్తంతా ఆ చిద్రూపమే।

**అజ్ఞేష్వ సత్స్వభావో౽గ్ర సంసార గణగర్భిణీ**
**జ్ఞేషు ప్రకాశ రూపైవ సకలై కాత్మికా సతీ** **42**
**అనుభూతివశాన్నిత్యం కర్మాదీనాం ప్రకాశినీ**
**స్వాదినీ సర్వభావానాం భావనీ భువభోగినాం** **43**
**నాస్తమేతి న చోదేతి నోత్తిష్ఠతి న తిష్ఠతి**
**న చ యాతి నచాయాతి న చేహ న చ నేహచిత్** **44**
**సైషా, చిదమలాకారా నాశో మనో నాశో మహోదయః**
**రాఘవేయం ప్రపంచేన జగన్నామ్నా విజృంభతే** **45**

అజ్ఞానుల విషయంలో భయంకరమైన దుఃఖాలతో కూడిన సంసారాలను కలిగిస్తుంది. జ్ఞానుల విషయంలో జ్ఞాన స్వరూపం కలిగి, అభిన్నమైన ఆత్మ ప్రకాశం కలదిగా ఉంటుంది. అనుభవాన్ని బట్టి కర్మల్ని ప్రవర్తింపజేస్తూ, భోగ్య వస్తువుల్ని అనుభవింపజేస్తుంది. సంసారులకు ప్రవృత్తి కారణమౌతూ ఉంటుంది. అట్టి చిత్తు, నిత్యం కాబట్టి పుట్టటం ఉండదు, అస్తమించటం ఉండదు. నిర్వికారమైనది కాబట్టి నిలబడదు, కూర్చుండదు. నిష్క్రియం కాబట్టి రాదు, పోదు. నిరాధారం కాబట్టి ఇక్కడ ఉన్నదనటానికీ వీలు లేదు. పరిపూర్ణమైనది కాబట్టి ఇక్కడ లేదనటానికీ వీలు లేదు. రామా! నిర్మలాకారము, ఆత్మ నిష్ఠము అయిన ఈ చిత్తు, జగత్తు అనే పేరుతో విస్తరించి కనిపిస్తోంది.

**తత్స్వభావేన చిన్నామ్నా సర్వగే నోదితాత్మనా**
**ప్రకాశేనా ప్రకాశేన నిరంశేనాంశ ధారిణా** **46**
**స్వయం స్వకల్పనా యోగా దనంతం పదముజ్ఝితా**
**అయమస్మీతి భావేన గచ్ఛత్యాజ్ఞ పదం శనైః** **47**

నానాతాయాం ప్రవృద్ధాయా మస్యాం సంసృతి పూర్వకం
భావాభావ గ్రహో త్సర్గ పదే స్థితి ముపాగతే 48
పుర్యష్టకం స్పందశతైః కరోతి చ న కరోతి చ
ఇత్థం స్థిరతరా కారాః సంసారావళయోభితః 49
స్వభా వాద్బ్రహ్మణ స్సర్వాః పునరాయాంతి యాంతి చ
వ్యోమన్యేవ చిదాభాసే నిదాఘాత్సరితో యథా 50
లక్ష్యంతే తద్వదేమా శ్చిత్త త్త్వే సృష్టి దృష్టయః
యథా మదవశా దాత్మా అన్యవత్ప్రతిభాసతే 51
తథైవ చిత్త్వా విద్యాత స్స ఏవాస ఇతి స్థితః 52

అట్టి చిద్రూప వస్తువు పరిపూర్ణమైనది. అస్తమింపని స్వభావం కలది. జ్ఞానాజ్ఞాన స్వరూపమైనది. నిరవయవము సావయవము అయినది. ఇతర వస్తువును భావించుట చేత నిజస్వరూపావస్థను విడిచిపెట్టినది. ఇటువంటి ఆకారం కలవాడను అనే అభిమానం వల్ల జీవభావాన్ని పొందినది. అటువంటి చిత్తు, స్వభావం చేత సంసరణ పూర్వకంగా నానాత్వం వృద్ధి చెందగా, ఇది ఉన్నదనీ, ఇది లేదనీ, ఇది గ్రహింపబడ్డదనీ, ఇది విడువబడ్డదనీ, ఇటువంటి భేద ప్రపంచం నిలకడపొందగా వికల్పాల చేత సూక్ష్మ శరీరాన్ని చేస్తోంది. వాస్తవానికి చేయటం లేదు.

ఇటువంటి మిక్కిలి స్థిర రూపం గల సంసార సమూహములు బ్రహ్మము వలన నుండి వస్తున్నాయి, పోతున్నాయి. వేసవి యందు ఆకాశంలో ఎండమావులు కనుపించినట్లు నిష్కళంకమైన చిత్తత్త్వము నందు సృష్టులు కనిపిస్తున్నాయి. మద్యాదుల చేత కలిగిన మత్తు వల్ల, తాను పరాయివానిగా తోచునట్లు అవిద్య వలన చిదాత్ముడు, చిదాత్ముడు కానివానివలె తోచుచున్నాడు.

యేన శబ్దంరసం రూపం గంధం జానాసి రాఘవ
సోయమాత్మా పరంబ్రహ్మ సర్వ మాపూర్య సంస్థితః 53
బ్రహ్మైవేదం స్థితం నామ్నా మలమస్తీహ నేతరత్
తంగోగ్రగణ్నై రంభః సింధోః స్ఫురతి నోరజః 54
ద్వితీయా కల్పనై వేహ న రఘూద్వ హ విద్యతే
బ్రహ్మ మాత్రా దృతే వహ్నే రౌష్ణ్యమాత్రాదృతే యథా 55
ఆదౌ శమదమప్రాయై ర్గుణై శ్శిష్యం ప్రబోధయేత్
పశ్చాత్సర్వ మిదం బ్రహ్మ శుద్ధ స్త్వమితి బోధయేత్ 56

అజ్ఞస్యార్ధ ప్రబుద్ధస్య సర్వం బ్రహ్మేతి యోవదేత్
మహా నరక జాలేషు స తేన వినియోజితః 57
ప్రబుద్ధ బుద్ధేః ప్రక్షీణ భోగేచ్ఛస్య నిరాశిషః
నాస్త్య విద్యా మలమితి త్వాదృశస్యైవ గోచరః 58
సతి దీప ఇవాలోక స్సత్యర్కే ఇవ వాసరః
సతి పుష్ప ఇవామోదః చితి సత్యాం జగత్తథా 59
ప్రతిభా సత ఏ వేదం న జగత్పర మార్థతః 60

రామా! కన్ను మొదలైన బాహ్యేంద్రియాల ద్వారా బహిర్ముఖమైన ఏ చైతన్యం ద్వారా శబ్దస్పర్శ రూపరస గంధాలను తెలుసుకుంటున్నావో, ఆ చిద్రూపమైన పరబ్రహ్మమే సమస్త జగములందూ నిండి ఉంది. తరంగ బుద్బుదాది రూపాల్లో ప్రకాశించే ఉదకం, సముద్రమే తప్ప వేరు కాదు. అట్లాగే బ్రహ్మమే ఆకాశాది నామాలతో ప్రకాశిస్తోంది. అంతే తప్ప ఇతరమైన దేదీ కాదు.

రామా! అగ్ని యందు ఉష్ణం తప్ప ఇతరమైనదేదీ లేదు గదా! అట్లాగే ఈ జగత్తులో సచ్చిదానంద రూపమైన బ్రహ్మము కంటె ఇతర వస్తువేదీ లేదు.

(ఈ విధంగా చేతనాత్మకమైన ఈ జగత్తు చిదాత్మ యొక్క వివర్తమే కాబట్టి, చిదాత్మ కంటె భిన్నం కాదు అనే విషయం నిరూపింపబడ్డది. అయితే, ఈ విషయాన్ని తగిన అధికారికే బోధించాలి అని చెపుతున్నారు)

ముందుగా శిష్యునికి శమదమాది సాధన చతుష్టయ సంపత్తిని బోధించాలి. ఈ సాధన చతుష్టయ సంపత్తి కలిగిన పిమ్మట, ఈ సమస్త జగత్తు బ్రహ్మమే అనీ, ఆ బ్రహ్మము నీవే అనీ బోధించాలి.

అట్లా కాకుండా, ఏమీ తెలియని వానికీ, కొద్దిగా తెలిసిన వానికీ 'సర్వమూ బ్రహ్మమే' అని బోధించేవాడు (గురువు) తన శిష్యుని ఘోర నరకానికి పంపించిన వాడౌతాడు. వివేకవంతుడు, భోగాల యందు కోరికలేని వాడూ, సంకల్పాలు లేనివాడూ, అయిన నీవంటి వానికి, అవిద్యామలము లేదు కాబట్టి, దీని అర్థము -సర్వం ఖల్విదం బ్రహ్మ- అనే వాక్యం యొక్క అర్థం తెలుస్తుంది. రామా! దీపం ఉంటేనే వెలుతురు ఉంటుంది. సూర్యుడు ఉంటేనే పగలు ప్రకాశిస్తుంది. పూవు ఉంటేనే సువాసన ఉంటుంది. చిత్ ఉంటేనే (జ్ఞానం) జగత్తు ప్రకాశిస్తుంది. అంతే తప్ప యదార్థానికి జగత్తు ప్రకాశించటం లేదు.

ఇది విని రాముడిట్లా అడిగాడు - ఓ మునీంద్రా! పాలసముద్రం వంటి, చల్లని,

నిర్మలమైన, విచిత్రములైన, గంభీరములైన మీ సూక్తుల చేత నాకు బోధచేశారు. అయితే, అనంతములు, అప్రమేయములు, అద్వితీయము, సర్వాత్మకము, నిత్య ప్రకాశమానము అయిన పరమాత్మకు అవిద్య ఎట్లా వచ్చింది? తేజస్సును చీకటి కప్పలేదు గదా! మరి, జ్ఞాన స్వరూపమైన బ్రహ్మమునకు అజ్ఞానం ఎట్లా కలిగింది?

వసిష్ఠుడీ విధంగా సమాధానం ఇచ్చాడు - రామా! నా మాటల్లో పరస్పర విరోధం లేదు. విపరీతార్థాన్ని యిచ్చేవీ కావు. నీకు జ్ఞాన దృష్టిని వికసించి ప్రజ్ఞానం కలిగినప్పుడు, నా వాక్యాలు, వాటి ప్రామాణ్యము బోధపడుతుంది.

కత్తి చేత కత్తి, మలము చేత మలము, శత్రువు చేత శత్రువు శమిస్తున్నాయి. అంటే, సజాతీయమైన వాటిలో ఉత్తమమైన వాటి చేత అధమమైనవి శమిస్తున్నాయి. పరిపక్వమైనట్టియు, స్వాత్మజ్ఞాన నాశనానికై కలిగిన అవిద్య చేత, ఇతరములైన క్షుద్రమైన అవిద్యాదులు నశింపగా పరమ సాక్షాత్కార రూపమైన విద్య - జ్ఞానము - ప్రకాశిస్తోంది. అవిద్య అనేది, విద్యా పరిణామ రూపమైనది కాబట్టి, అది స్వాత్మనాశనానికై ఉదయించినదనే విషయం గుర్తించాలి.

ప్రాణుల యొక్క అవిద్య ఎటువంటిదంటే, తాను నశించటం చేత బ్రహ్మానందాన్ని కలుగజేయజాలినది. చూడటంతోడనే నశిస్తుంది కాబట్టి అసత్యమైనది. కాబట్టే, దీని స్వరూపం కనపడదు. 'యదార్థానికి అవిద్య అనేది లేదు' అనే భావనచేత బ్రహ్మాత్మైక్య ప్రాప్తి కలుగుతుంది. జ్ఞానివి అవుతావు. అప్పుడు ఈ అవిద్య యొక్క స్వభావాన్ని తెలుసుకోగలుగుతావు. నీకు బ్రహ్మాత్మైక్య జ్ఞానం కలుగునంతవరకు నీవు నా వాక్యం ఆధారంగానే అవిద్య అనేది లేదు అనే దృఢ నిశ్చయాన్ని కలిగి ఉండాలి. 'సర్వమూ బ్రహ్మమే' అనే భావన, హృదయంలో ఉన్నవాడు ముక్తుడే! 'ఈ జగత్తు బ్రహ్మము కాదు' అనే భేద దృష్టియే అవిద్య. కాబట్టి దానిని వదలివేయాలి.

రామచంద్రా! నీకు ఈ అవిద్య ఎట్లా వచ్చింది? అని కాక, నేను ఈ అవిద్యను ఎట్లాపోగొట్టుకోవాలి? అనే విచారమే కలగాలి. ఈ అవిద్య క్షయమై, నాశమొందినప్పుడు, ఇది ఎట్లా కలిగిందో, ఎట్లా అభివృద్ధి చెందిందో, ఎట్లా నశించిందో నీకు తెలుస్తుంది. కాబట్టి సంసార రోగానికి మూలమైన ఈ అవిద్య, నిన్ను మళ్లీ దుఃఖాలలోకి త్రోయకుండా, తగిన చికిత్స చేయటానికై యత్నించు.

వాయువు, తానే అయిన ఆకాశమందు, తానే కలిగి ( పుట్టి) చలిస్తూ ఉన్నట్లుగా, ఆత్మ కూడా చిచ్ఛక్తి చేత తానే కలిగి చాంచల్యాన్ని పొందుతోంది. అంటే, ఆత్మయే

జగత్తుకు అధిష్ఠానము, ఉపాదాన కారణము, నిమిత్త కారణమూ కూడా అవుతోందన్న మాట. చిదాత్మ యందు చిచ్ఛక్తి స్వల్పంగా చలించి, సముద్రంలో చలిస్తున్న తరంగం సముద్ర రూపమే అయినట్లుగా, చిద్రూపమే అయి ప్రకాశిస్తోంది.

సృష్టిక్రమము –

**క్షణం స్ఫురంతీ సా దేవీ సర్వశక్తి తయా తథా**
**దేశకాల క్రియా శక్తీ ర్వ్యయస్యాస్సం ప్రకర్షతి 61**
**స్వ స్వభావం విదిత్వోచ్చైరప్యనంత పదే స్థితా**
**రూపం పరిమితే నాసౌ భావయ త్య విభావతా 62**
**యదైవం భావితం రూపం తయాః పరమకాంతయా**
**తదైవైనా మనుగతా నామ సంఖ్యాదికా దృశః 63**

చిద్రూపిణియైన ఆ దేవి సమస్త శక్తులు కలిగి ఉంది. అందుకే క్షణ మాత్రం ప్రకాశిస్తూ, చెలికత్తెల వంటి దేశకాల క్రియాశక్తులను సృష్టి కోసం ప్రేరేపిస్తోంది. ఈ చిచ్ఛక్తి తన స్వరూపాన్ని తాను ఎరిగి, ఉన్నతము అనంతము అయిన కైవల్య పదంలో ఉంటూ కూడా, అవిచారం వల్ల, తన రూపాన్ని పరిమితమైనదిగా (పరిచ్ఛిన్నమైనదిగా) భావిస్తోంది. ఆ చిచ్ఛక్తి, తన రూపాన్ని తాను, పరిమితమైనదిగా భావించినప్పుడే, నామము, సంఖ్య మొదలైన భేదదృష్టులు అనుసరించి వస్తున్నాయి.

**క్షేత్రజ్ఞ అహంకారాది భేదాలు –**

రామచంద్రా! సంకల్ప వికల్పాలతో కూడి, దేశకాలవస్తువుల చేత పరిచ్ఛిన్నమైనట్టి (ఒక పరిమితిని పొందినట్టి) చిత్తు యొక్క రూపాన్నే 'క్షేత్రజ్ఞుడు' లేక 'జీవుడు' అంటారు.

ఆ జీవుడు (క్షేత్రజ్ఞుడు) పూర్వ వాసనలను భావిస్తూ 'అహంకార' రూపాన్ని పొందుతున్నాడు. ఆ అహంకారం, వాసనలచే కళంకాన్ని పొంది నిశ్చయాత్మకమైన 'బుద్ధి' అయినది. ఆ బుద్ధియే సంకల్ప వికల్పాదుల చేత సంశయాత్మకమై 'మనస్సు' అయినది. ఆ మనస్సే, అనేక సంకల్ప వికల్పాలతో కూడి 'ఇంద్రియము'ల రూపాన్ని పొందింది. ఆ యింద్రియాలే చేతులు కాళ్ళు మొదలైన వాటితో కూడిన 'దేహం' అయినది.

ఇట్లా సంకల్పాలు, వాసనలు అనే త్రాళ్లచేత చుట్టబడిన జీవుడు అనేక దుఃఖాలను పొంది నీచత్వాన్ని పొందుతున్నాడు. ఇట్లా సంకల్ప శక్తి రూపం కలిగి, విచిత్రమైన

శక్తితో కూడిన చిత్తం అహంకారంతో కూడి, పట్టుపురుగు లాగా తన్నుతానే స్వేచ్ఛ లేకుండా బంధించుకుంటోంది. చిత్తం, తానే కల్పించుకున్న శబ్దస్పర్శ రసాదులనే భోగసమూహాలలో తగుల్కొని, త్రాళ్లచే కట్టబడిన సింహంలాగా వివశత్వాన్ని పొందుతోంది.

అనేక రకాల శక్తులతో కూడిన ఈ చైతన్యాన్నే, మనస్సు అనీ, బుద్ధి అనీ, జ్ఞానమనీ, క్రియ అనీ, అహంకారమనీ, ప్రకృతి అనీ మాయ అనీ, కర్మమనీ, బంధమనీ, అవిద్య అనీ, ఇచ్ఛ అనీ రక రకాల పేర్లతో అంటున్నాం.

ప్రవాహంలో జలబిందువుల్లాగా మాయతో కూడిన బ్రహ్మము నుండి, సంసార వాసనతో కూడిన జీవరూపంలో ఉండే చిద్విలాసాలు లక్షల కొలది పుట్టినాయి, పుడుతున్నాయి, ఇక ముందు పుడతాయి. తమ తమ పుణ్యపాపాలలో ఉండే తారతమ్యాన్ని బట్టి ఈ జీవరాశిలో కొందరు మొదటి జన్మకలవారు. మరికొందరు వందల కొలది జన్మముల నెత్తినవారు. ఇంక కొందరు లెక్కలేనన్ని జన్మలెత్తినవారు. కొన్ని జన్మలలో కిన్నర కింపురుషులుగా, కొందరు బ్రహ్మవిష్ణు మహేశ్వరులుగా, కొందరు బ్రాహ్మణులుగా, కొందరు క్షత్రియ వైశ్య శూద్రులుగా, కొందరు వృక్షాల్లాగా, పర్వతల్లాగా, నదుల్లాగా, క్రిమికీటకాల్లాగా పుట్టారు.

ఇదంతా విని శ్రీరాముడిట్లా అడిగాడు - 'మునీంద్రా! జీవుడు మొదట మనోరూపాన్ని పొందినాడు గదా! ఆ జీవుడు మళ్లీ బ్రహ్మత్వాన్ని ఎట్లా పొందాడు? ఈ విషయం చెప్పండి.' అని.

వసిష్ఠుడిట్లా చెప్పాడు - రామా! పరమాత్మ తత్త్వము దేశకాలాదుల చేత అపరిచ్ఛిన్నము. ఆ ఆత్మతత్త్వం దేశ దిక్కాలాదుల చేత శరీరాన్ని గ్రహించి జీవుడౌతున్నాడు. ఆ జీవుడే వాసనల వల్ల మనస్సుగా అవుతున్నాడు. ఆ మనశ్శక్తి శబ్దతన్మాత్రను భావించి ఆకాశమైంది. అట్లా ఆకాశరూపాన్ని చెందిన మనస్సు, స్పర్శ గుణాన్ని భావించినందున స్పర్శ గుణం కలిగిన వాయువు రూపాన్ని పొందింది. ఆ వాయువే రూప గుణాన్ని భావించి అగ్ని రూపాన్ని పొందింది. అట్లా అగ్ని రూపాన్ని పొందిన మనస్సు రసగుణాన్ని భావించటం వల్ల జల రూపాన్ని దాల్చింది. పిమ్మట ఆ జల రూపకమైన మనస్సే గంధ గుణాన్ని భావించి, భూమి అయినది. ఇట్లా పంచ మహాభూతాలను, భూత గుణాలను సృష్టించి వాటితో కూడియున్న మనస్సు, అగ్ని కణాలను పోలిన శరీరాన్ని ఆకాశంలో చూచింది.

అహంకారానికి కలలైన కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలతోను బుద్ధితోను కూడి,

ఆకాశంలో గోచరించిన ఆ శరీరం, ప్రాణుల హృదయ పుండరీకంలో ఉండే సూక్ష్మ శరీరం (పుర్యష్టకము) అయినది. ఆ సూక్ష్మ శరీరంలో ఉన్నట్టి మనస్సే, తీవ్రమైన వాసనా వేగమున ప్రకాశించే శరీరాన్ని భావించి, పరిపాకం చెంది మారేడు పండులాగా స్థూలత్వాన్ని పొందింది.

మూసలో కాగిన బంగారంలా గా ఆకాశంలో ప్రకాశించే ఆ తేజస్సే, తన స్వభావం వల్ల పైన తల, క్రింద భాగంలో పాదాలు, రెండు వైపుల చేతులు, కాళ్ళు, మధ్యలో నడుము పొట్ట కలిగిన ఆకారాన్ని ధరించింది. ఆ ఆకారమే క్రమంగా స్పష్టత్వాన్ని పొంది, నిర్మలమైన రూపాన్ని పొంది, బుద్ధి, సత్త్వము, బలము, ఉత్సాహము, విజ్ఞానము అనే గుణాలతో కూడి అన్ని లోకాలకు పితామహుడైన బ్రహ్మదేవుడైనాడు.

త్రికాల జ్ఞాన సంపన్నుడైన ఆ బ్రహ్మ, తన రూపానికి సంతసించి, ఆద్యంత రహితము, చిన్మాత్రమూ అయిన ఈ పరమాకాశంలో ఇంతకు పూర్వం ఏమి ఉండెను? అని ఆలోచించాడు. అతనికి గడచిపోయిన యుగాలను, అందలి భూత జాలాన్ని, శాస్త్రాలను స్మరించి, లీలామాత్రం చేతనే మళ్లీ వాటినన్నింటినీ సృజించాడు. రామా! వసంతర్తువు నుండి పుష్ప సంపద కలిగినట్లుగా, బ్రహ్మ స్వరూపమైన మనస్సు నుండి ఈ సృష్టి అంతా కలిగింది.

## దాశూరోపాఖ్యానము

రామచంద్రా! జగద్రూపంలో ఉన్న మాయ యొక్క స్వరూపాన్ని వర్ణించి చెప్పటానికై దాశూరోపాఖ్యానాన్ని నీకు చెపుతన్నాను.

మగధ దేశంలో దాశూరుడు అనే ధర్మ పరాయణుడు, తపశ్శీలుడు అయిన మునీంద్రు డుండేవాడు. ఇతని తండ్రి శరలోముడు. అతడు కొడుకైన దాశూరునితో కలసి వనంలో నివసిస్తున్నాడు. కొన్నాళ్ళకు తల్లిదండ్రులు చనిపోగా బాలుడైన దాశూరుడు దుఃఖింపసాగాడు. అతనిని వన దేవతలు ఓదార్చారు.

దాశూరుడు తండ్రికి ఉత్తర క్రియలు చేసి, తపస్సు చేయాలని నిశ్చయించుకొన్నాడు. అతడు వైదిక కర్మలు చేస్తూ తన కర్మ కాండలకు పవిత్రమైన చోటు, పవిత్రమైన సాధనాలు, కావాలనే తలంపు ఎక్కువై ఒక విధమైన ఛాందసానికి లోనైనాడు. అతనికి భూతలంలో ఎక్కడా పవిత్రమైన చోటే కనపడ లేదు. చివరకు వృక్షాగ్రం పవిత్రమైనదని తలచి, పక్షిలాగా వృక్షాగ్రాన కొమ్మల సందుల్లో ఆకుల మధ్య ఉంటూ అగ్ని కార్యాలు చేయసాగాడు. అతడు అగ్నిలో తనభుజం నుండి

తీసిన మాంస ఖండాన్ని హోమం చేశాడు. అగ్నిహోత్రుడు, తన నోటి యందున్న విప్రమాంసఖండంతో దేవతల కంఠాలు కాలిపోతాయని తలచి, ఆతనికి ప్రత్యక్షమై ఏమికావాలో కోరుకొమ్మన్నాడు. దాశూరుడు '' భూమిపై నాకు పవిత్రమైన చోటే కానరాకున్నది. కాబట్టి ఈ వృక్షాగ్రమందే ఉండేటట్లు అనుగ్రహించమని కోరాడు. అగ్ని చేత వరాన్ని పొంది వృక్షాగ్రాన తపస్సు చేస్తున్నాడు.

అచటనే ఉంటూ, కర్మమార్గ నిష్ఠుడై, ఫలమునందాశకలవాడై గోమేధము, అశ్వమేధ, నరమేధాధి యజ్ఞాలు చేయగా, పది సంవత్సరాలకు ఆత్మ తత్త్వ ప్రకాశమైన జ్ఞానం కలిగింది. అతని అవిద్య నశించింది. వాసనారహితుడైనాడు. ఇట్లుండగా, ఒకనాడు ఆతనికి వనదేవత సాక్షాత్కరించింది. నీవు ఎవరవు? అని అడిగాడు.

ఆమె ఈవిధంగా అన్నది - '' నీవు ఉంటున్న కదంబ వృక్షం చేత అలంకృతమైన ఈ వనానికి దేవతను. నా వృత్తాంతం విను. చైత్ర శుద్ధ త్రయోదశినాడు ఇంద్రుని నందనోద్యానంలో కామోత్సవం జరుగుతుంది. ఆ ఉత్సవానికి అన్ని లోకాల వనదేవతలతో పాటు నేను కూడా వెళ్ళాను. అంతా తమ పుత్రులతో వచ్చారు. నేను పుత్రులు లేని దానను. వారిని చూచి దుఃఖించాను.

ఓ మునిపుత్రా! కల్పవృక్షం లాంటి నీ వుండగా నేనిట్లు ఏల శోకించవలె? నీవు నాకు పుత్రుని అనుగ్రహింపుము. లేనిచో నా శరీరాన్ని అగ్నికి ఆహుతి చేస్తాను. '' అని అన్నది.

ఆమె మాటలు విన్న దాశూరుడు, ఆమె కొక పుష్పాన్ని యిచ్చి, నీవు ఒక మాసానికి పూజార్హుడైన పుత్రుని కనగలవు, పొమ్ము అని పంపాడు. ఆమె అట్లే పుత్రుని కన్నది. పంద్రెండు సంవత్సరాలు ఆ పుత్రుని పెంచి, దాశూరుని వద్దకు తీసుకొని వచ్చి, ఈతనికి జ్ఞానోపదేశం చేయమని ప్రార్థించింది.

దాశూరుడాతనిని తన వద్ద నుంచుకొని వన దేవతను పంపి వేశాడు. అతడా బాలునికి ఆఖ్యానముల చేతను, దృష్టాంతముల చేతను, వేదాంత నిశ్చితములైన ఇతిహాసములచే తను జ్ఞానబోధ చేశాడు.

**దాశూరుడు కుమారునికి చెప్పిన కథ :-** దాశూరుడు కుమారునితో ఇట్లా అన్నాడు - పుత్రకా! నీకొక కథ చెపుతాను. విను. స్వోత్థుడు అనే రాజు ఉన్నాడు. అతడు జగత్తుల నాక్రమించే సామర్థ్యం కలవాడు. ఎవరికీ వశపడడు. కార్యసాధనలో ఆతనికి బ్రహ్మ విష్ణురుద్రులు సైతం సాటిరారు. పక్షి ఆకాశంలోనే పుట్టి, పెరిగి, నశించునట్లు, ఆ రాజు కూడా చిదాకాశంలోనే పుట్టి, అందే పెరిగి, అచటనే లయ

మొందుతున్నాడు. అతనికి ఉత్తమ మధ్యమ అధమ భేదాలతో సత్త్వ రజస్తమో రూపాలైన మూడు శరీరాలున్నాయి. అతడు బ్రహ్మాండమనే పట్టణాన్ని నిర్మించాడు. శీతోష్ణతేజస్కులైన సూర్యచంద్రులు ఆ పట్టణానికి రెండు దీపాలు. పదునాల్గు వీధులు ( భువనాలు) మూడు విభాగాలు ( ఊర్ధ్వ మధ్య అధో లోకాలు) సప్త సముద్రాలనే నడ బావులతో ఆ పట్టణం ప్రకాశిస్తోంది. ఆ పట్టణంలో ఆ రాజు దేహ రూపమైన అనేక అంతర్గృహాలను నిర్మించాడు.

ఆ అంతర్గృహాలు, శిరోరుహ రూపంబులైన (వెంట్రుకల రూపంలో ఉండే ) నల్లని తృణం చేత (గడ్డి చేత) కప్పబడ్డవి. శ్రోత్రాదిగా తొమ్మిది గుమ్మాలు (నవరంధ్రాలు) ఎడతెగని వాయు సంచారం గల నాసారంధ్రరూపమైన సింహద్వారం, జ్ఞానేంద్రియాలనే ఐదు దీపాలతో వాతపిత్త శ్లేష్మాలనే దేహ ధారణ క్షమములైన మూడు స్తంభాలతో ఎముకలనే తెల్లని దారువులతో ( కఱ్ఱ దూలాలతో) మాంసం అనే మృత్తికతో, దానిపై చర్మమనే పూత కలిగి, భుజాదులే వీధులుగా ఆ అంతర్గృహాలు ప్రకాశిస్తున్నాయి. మాయచే నిర్మింపబడ్డ ఈ అంతర్గృహాలు కొన్ని ఊర్ధ్వ భాగంలోను, కొన్ని అధోభాగంలోను ఉన్నాయి. అహంకారాలు అనే యక్షులు ఆ గృహాలను పాలిస్తున్నారు. మూడు రకాలైన ఆ శరీరాల యందు రాజు యక్షులతో క్రీడిస్తూ ఒక చోట నుండి ఇంకొక చోటుకు పోతున్నాడు.

పుత్రా! విను. ఆ రాజు చపల చిత్తుడు. అతడు ఇక ముందు కలుగబోయే నగరాన్ని గూర్చి ( దేహాంతరాన్ని గూర్చి) పోతాను అని సంకల్పిస్తాడు. ఆ సంకల్పం కలిగినంతనే అతడు భూతం ఆవేశించిన వాని లాగా గంధర్వ నగరం లాంటి పురాన్ని పొందుతున్నాడు. చపలచిత్తుడైన అతడు మళ్లీ వినాశనాన్ని పొందాలని సంకల్పిస్తే వినాశనాన్ని పొందుతున్నాడు. సముద్రం తరంగాల్ని సృష్టించినట్లుగా ఈ జగద్వ్యాపారాన్ని సృజించి, తానే నిందిస్తూ ఉంటాడు. ఒకప్పుడు దుఃఖం, ఒకప్పుడు సుఖాన్నీ పొందుతున్నాడు.

ఇదంతా విని దాశూరపుత్రుడు తండ్రిని ఈ వృత్తాంతాన్ని వివరించమని అడుగగా దాశూరుడు వివరిస్తున్నాడు -

పుట్టుక లేకుండానే కనిపించే ఈ సంసార స్థితిని నీకు వివరించాను. ప్రోత్థుడు అంటే పరమాకాశం నుండి కలిగిన సంకల్పం. సంకల్పం అనేది తానేపుడుతూ లయమౌతూ ఉంటుంది. ఈ జగత్తంతా సంకల్ప స్వరూపమే! సంకల్పం పుడితే జగత్తు పుడుతుంది. సంకల్పం నశిస్తే జగత్తు నశిస్తుంది. బ్రహ్మ విష్ణు రుద్రేంద్రాలు

ఆ పురుషుని (సంకల్పం) అవయువములు కాగా ముల్లోకాలను సృజించాడు. అతడు సృజించిన పట్టణ వీధుల స్వరూపాలు చెప్పాను గదా! కొన్ని దేహాలకు దేవతలని, కొన్ని దేహాలకు మానవులని, ఇట్లా రకరకాల పేర్లు ఉన్నాయి. ఆ దేహాలనే అంతర్గృహాలలో అహంకారాలనే యక్షులు పాలిస్తూ ఉండగా, ఆ స్వోత్థ మహారాజు ఆ యక్షులతో క్రీడిస్తున్నాడు. దీనికి (సంసారానికి) ఈ విధంగా సంకల్పమే కారణం. ఎంత తపస్సు చేసినా సంకల్ప క్షయం కానిదే మోక్షం లేదు. కాబట్టి, సంకల్ప క్షయానికై ప్రయత్నించు.

ఇట్లా చెప్పిన వసిష్ఠుడు శ్రీరామునితో మళ్లీ అన్నాడు -

రామా! ఆ రాత్రివేళ తండ్రి, పుత్రులయొక్క సంభాషణను విని, లేచి, ఆ కదంబ వృక్షాగ్రానికి వెళ్ళాను. దాశూరుడు నన్ను చూచి అర్ఘ్యపాద్యాదులతో పూజించాడు. పిమ్మట నేను దేవ నదికి వెళ్ళాను. రామా! నేను చెప్పిన దానిని బట్టి ఈ జగత్తు ఎటువంటిదో ఊహించు.

## ఉపదేశోపాఖ్యానము

దాశూరో పాఖ్యానంలో జగత్తు యొక్క ఉనికి మాయ అన్నారు. ఈ ఉపదేశోపాఖ్యానంలో స్థితి ప్రకరణం తాత్పర్యాన్ని సంగ్రహంగా చెప్పదలచి వసిష్ఠుడు శ్రీరామునితో అంటున్నాడు-

శ్రీరామచంద్రా ! అనంతమైనకాలంలో మానవ ఆయుర్దాయం వంద సంవత్సరాలు ఎన్నవ వంతు ? అట్టి నూరు సంవత్సరాల ఆయువుమీద ఆసక్తి ఎందుకు ? అంతః కరణం ఏవిధమైన ఆసక్తీ లేనప్పుడు ఎట్లా ఉంటుందో, ఆ రూపంతోనే నిరాసక్తంగా ఉండాలి.

ఆత్మయందు కర్తృత్వము, అకర్తృత్వము, రెండూ ఉన్నాయి. దేనియందు అభిరుచి ఉంటే దానిని అనుసరించవచ్చు. నేను కర్తను కాను, అనే దృఢ నిశ్చయం కలిగి, ప్రాప్తమైన కర్మను చేస్తూ ఉంటే బంధాన్ని పొందవు.

చిత్తం సంకల్పరహితమైనందువల్ల, విషయాలయందు అనాదరం కలుగుతుంది. కాబట్టి, 'నేను కర్తను కాను' అనేభావంవల్ల సమత్వం సిద్ధిస్తుంది. ఈ సమత్వ భావననే పరమామృతం అంటారు.

ఈ సమస్తమూ నేనే చేస్తున్నాను అనేది మహాకర్తృత్వ భావన. అది కూడా ఉత్తమమైన స్థితే! అంటే, ఈ సమస్త జగత్తుకు సంబంధించిన భ్రమనూ నేనే కలిగిస్తున్నాను, అనే కర్తృత్వ భావన అన్న మాట. దీనివల్ల కూడా సమత్వమే

మిగులుతుంది. అన్ని పదార్థము లందూ సమబుద్ధి ఉండటాన్నే బ్రహ్మ నిష్ఠ అంటారు. అట్టి సమభావంతో చిత్తాన్ని నిలిపితే మళ్లీ జన్మ ఉండదు.

అకర్తృత్వము, సర్వకర్తృత్వము (మహాకర్తృత్వము) ఈ రెంటినీ వదలి వేసి, మనస్సును పూర్తిగా త్రాగివేసినప్పుడు (లయం చేసినప్పుడు) ఏ రూపం కలవాడవు అవుతావో, ఆ రూపం కలవాడవై ఉండు.

రామా! నేను అన్ని దిక్కులు తిరిగాను. అన్నీ చూచాను. జ్ఞానులు అనబడేవారు ఎక్కడో అరుదుగా ఉన్నారు. ఎవరు, ఏఏ పనులు, ఏఏ ప్రయత్నాలు చేసినా శరీర పోషణకే తప్ప, మోక్ష సాధన కోసం కాదు. ఈ విషయమై, బృహస్పతి పుత్రుడైన కచుడు పఠించిన గాథలు ఇట్లా ఉన్నాయి విను.

ఒకప్పుడు కచుడు, సమాధి నుండి లేచి, సంతుష్టాంతః కరణుడై నిర్జన ప్రదేశంలో గద్గద స్వరంతో ఇట్లా అన్నాడు -

నేనుఏమి చేయాలి? ఎక్కడికి పోవాలి? దేనిని గ్రహించాలి? దేనిని విడిచిపెట్టాలి? జగత్తంతా, కల్పాంతంలో నీటితో నిండినట్లుగా ఆత్మతో నిండి ఉంది. దేహాల లోపల, బయట, క్రింద, మీద, దిక్కులందు, ఇటు, అటు, అంతటా ఆత్మయే ఉన్నది. ఆత్మ లేని చోటే లేదు. నేను లేనట్టి వస్తువు గాని, నాయందు లేనట్టి వస్తువు గాని, లేదు. సర్వము చిద్రూపంలో ఉంది. కాబట్టి నేను ఇతరులను కోరవలసినది ఏమున్నది?

కాబట్టి రామచంద్రా! ఆకాశానికి అలంకారంగా ఉన్న, దేదీప్యమానంగా వెలుగొందుచున్న సూర్యుని యందు ఏ చిత్తు ఉన్నదో, అదే పుట్టలో ఉండే పురుగులోనూ ఉంది. సత్పురుషులైన వారు తామస రాజస జన్మలను పొందినప్పటికీ, స్వప్రయత్నంతో సాత్త్విక జాతిని పొందుతున్నారు.

(యోగ వాసిష్ఠ సారంలో స్థితి ప్రకరణం సమాప్తం)

# ఉపశమ ప్రకరణము

పూర్వ ప్రకరణంలో ఈ జగత్తు యొక్క ఉత్పత్తికీ, స్థితికీ మనస్సే కారణం అని చెప్పారు. ఈ ప్రకరణంలో ఆ మనస్సు యొక్క ఉపశమాన్ని గూర్చి (శాంతించటాన్ని గూర్చి) చెప్పబోతున్నారు. ఈ ప్రకరణంలో పది ఉపాఖ్యానాలు ఉన్నాయి.

(1) జనకోపాఖ్యానము (2) పుణ్యపావనోపాఖ్యానము, (3) బల్యుపాఖ్యానము, (4) ప్రహ్లాదోపాఖ్యానము (5) గాధ్యుపాఖ్యానము (6) ఉద్దాలకోపాఖ్యానము (7) సురఘూపాఖ్యానము (8) బాసవిభాసోపాఖ్యానము (9) వీతహవ్యోపాఖ్యానము (10) ఆకాశగమ్యభావాది నిరూపణము

వసిష్ఠుడంటున్నాడు -

రామచంద్రా! స్తంభాల మీద మంటపం ఆధారపడి ఉన్నట్లుగా తమోగుణ ప్రధానులు, రజోగుణ ప్రధానులు అయిన వారి మీద ఈ సుదీర్ఘమైన జగద్రూపమైన మాయ ఆధారపడి ఉంది. సత్త్వగుణ ప్రధానులకు ఈ మాయతో సంబంధం ఉండదు. కాబట్టి శోకమోహాలు గాని, జన్మలు గాని లేనే లేవు. ఉన్నదేదో చిన్మాత్రమైన బ్రహ్మమే ఉన్నది. కాబట్టి సంతాపరహితుడవు కమ్ము.

ప్రాప్తమైన దానిని అనుభవించటం, అప్రాప్తమైన దానిని ఆశించకుండా ఉండటం వల్ల సంతాపం లేని వాడౌతాడు. ఈ సంసారంలో జన్మించు వారికి మోక్షాన్ని ఇవ్వటానికి సమర్థమైన మార్గాలు రెండు ఉన్నాయి. (1) గురువు చేత చెప్పబడిన అనుష్ఠానాన్ని ఆచరిస్తూ ఉంటే, ఒక జన్మలోనో కొన్ని జన్మలలోనో మోక్షం సిద్ధించవచ్చు. (2) కొంతవరకు జ్ఞానం కలవానికి ఆకాశం నుండి పండు పడినట్లు జ్ఞానసంప్రాప్తిరూపమైన మోక్షం సిద్ధిస్తుంది. ఈ రెండవ మార్గాన్ని గురించి నీకొక పూర్వ వృత్తాంతాన్ని చెపుతాను, విను! అంటూ వసిష్ఠుడు చెపుతున్నాడు -

## 1. జనకోపాఖ్యానము

ఏ ఆపదలూ లేనివాడు, సమస్త సంపదలు కలవాడు, జనకుడనే రాజు విదేహరాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. అతడొక రోజున ఉద్యానవనంలో విహరిస్తూ ఉండగా, అచట, సమీపంలో పొదలందు తిరుగుతున్న సిద్ధులు ప్రసంగ వశాన, ఆత్మ భావనతో కూడిన మాటలు మాట్లాడుతూ ఉండగా, ఆ మాటలు విన్నాడు

ప్రథమ ఆహ -

ద్రష్టృ దృశ్య సమాయోగా త్ప్రత్యయానంద నిశ్చయః
యస్తం స్వమాత్మ తత్త్వోత్థం నిస్పందం సముపాస్మహే.

ద్వితీయ ఆహ-

ద్రష్టృ దర్శన దృశ్యాని త్యక్త్వా వాసనయా సహ
దర్శన ప్రథమాభాస మాత్మానం సముపాస్మహే. 2

తృతీయ ఆహ -

ద్వయోర్మధ్య గతం నిత్యమస్తి నాస్తీతి పక్షయోః
ప్రకాశనం ప్రకాశానా మాత్మానం సముపాస్మహే. 3

చతుర్థ ఆహ -

స శిరస్కం హకారాది మశేషాకార సంస్థితః
అజస్ర ముచ్చరం తం స్వమాత్మానం సముపాస్మహే. 4
సంత్యజ్య హృద్గుహేశానం దేవమన్యం ప్రయాతి యే
తే రత్న మభివాంఛంతి త్యక్త్వా హస్తస్థ కౌస్తుభం... 5

మొదటి సిద్ధుడిట్లా అన్నాడు- చూచే పురుషునికి అందమైన వస్తువును చూచినప్పుడు ఏ ఆనందం కలుగుతుందో, ఆ జీవునికి బ్రహ్మత్వం వల్ల కలిగే ఆనందం ఏది కలదో, అట్టి ఆనంద స్వరూపుడు, నిశ్చలుడు అయిన ఆత్మను భావిస్తున్నాను. అంటే కోరిన ప్రయోజనం సిద్ధించగా కలిగిన ఆనందంతో కూడిన చిత్తం ఉపరతిని పొందగా, ఆత్మ యందు, కలిగే ఆనందమే బ్రహ్మానందము, అని భావం.

రెండవ సిద్ధుడిట్లా అన్నాడు -

చూచేవాడు, చూపు, చూడబడే వస్తువు, అనే ఈ మూడింటినీ, వాటి వాటి వాసనలతో సహా విడిచిపెట్టి, చూపుకంటె ముందుగానే తాను ప్రకాశిస్తూ, తన కాంతిచే సమస్తాన్నీ ప్రకాశింపజేసే ఆత్మను ఉపాసిస్తున్నాను.

మూడవ సిద్ధుడన్నాడు - ఉన్నాడు, లేడు, అనే రెండు పక్షాలకు ( అంటే సద్రూపంగా ఉన్నాడు. నిరాకారుడు కాబట్టి లేడు) సమానమై, చంద్రుడు సూర్యుడు విద్యుత్తు మొదలైన జ్యోతిస్సులను ప్రకాశింపజేసే ఆత్మను ఉపాసిస్తున్నాను.

నాల్గవ సిద్ధుడిట్లా అన్నాడు -

దేవతలు, మానవులు, తిర్యగ్జంతువులు మొదలైన వాటి అన్నింటి యందు ఉన్నట్టియు, 'హ' కారము, ఆదియందును, 'స' కారము అంతమందును గల 'హంస' మంత్రమును ఎల్లప్పుడూ ఉచ్చరిస్తూ ఉండే ఆత్మను నేను ఉపాసిస్తున్నాను.

తమ హృదయ కుహరాలలో ఉన్న ఆత్మను విడచి, ఇతర దేవతలను సేవించే వారు తమ చేతి యందున్న కౌస్తుభమణిని వదలి ఇతర రాళ్లను కోరే వారితో సమానం. ముందుగా తన మనస్సును జయించాలి. నిర్దోషమైన ఉపశాంతిని సాధించాలి. అంటే, చిత్తం విషయ సుఖాల యెడ శాంతిని పొందాలి. అట్లా మనస్సు శాంతించినప్పుడు స్వరూపంలో చిరకాలం నిలకడ లభిస్తుంది.

రామా! జనక మహారాజు సిద్ధుల మాటలు విన్నాడు. అతడు తన యింటికి తిరిగి వెళ్ళాడు. తనలో ఈ విధంగా చింతించాడు -

ఇంతవరకు నేను భ్రాంతుడనై, బుద్ధిహీనుడనై బ్రతుకుతున్నాను. ఈ రాజ్యమెందుకు? దీనితో ఏమి ప్రయోజనము? ఈ జగత్తు మీద నాకీ ప్రేమయెందుకు? ఈ సంపదలు, భోగాలు, నశ్వరాలే గదా! అన్నీ నశించిపోతూ ఉండగా, 'నేను ఉంటాను' అని అనుకోవటం అజ్ఞానం గదా? బాల్యమంతా అజ్ఞానంలోనూ. యౌవనమంతా విషయ లోలత్వంలోనూ. వార్ధకమంతా కుటుంబ చింతలలోనూ గడచిపోతూ ఉండగా మూఢుడైన మానవుడు ఈ జన్మలో చేసేది ఏముంది? అన్ని దుఃఖాలకు ఈ సంసారమే స్థానం. ఇక ఇక్కడ సుఖమేమి లభిస్తుంది? ఈ సంసారమనే వృక్షానికి మనస్సు మూలం. (మొదలు) సుఖదుఃఖ హేతువులు పల్లవాలు, సుఖదుఃఖాలనేవి ఫలాలు. దేహమనేది స్కంధము, పుత్రాదులు శాఖలు. వేల కొలదిగానున్న రాగద్వేషాదులు అంకురాలు.

సంసారానికి మూలమైన మనస్సు అంటే సంకల్పమే! కాబట్టి ఆ సంకల్పాన్ని ఉపశమింపజేస్తే, సంసారమనే వృక్షం ఎండిపోతుంది.

ఇట్లా సిద్ధుల మాటల చేత బోధింపబడిన జనకుడు నిజమైన జ్ఞానాన్ని పొందాడు. అంటే, ఆత్మ విచారపరుడై, ఆత్మను పొందాడు. అని భావం.

## 2. పుణ్య పావనోపాఖ్యానము

(వెనుకటి ఉపాఖ్యానంలో ఆకస్మికంగా, అనుకోకుండా, కాకతాళీయంగా సిద్ధుల మాటలు వినటం వల్ల జనకునికి చిత్తోపశాంతి కలిగినట్లు చెప్పబడింది.

ఈ ఉపాఖ్యానంలో గడచిపోయిన అనేక జన్మల్ని తలచటం వల్ల, ఆత్మ జ్ఞానం కలిగి, దాని వల్ల చిత్తోపశాంతి కలుగుతుందని చెప్పబడుతోంది)

వసిష్ఠుడు చెపుతున్నాడు- ఓ రామా! పూర్వం మహేంద్ర మనే పర్వతము యొక్క రత్న సానువు నందు 'దీర్ఘతపసుడు' అనే మునీంద్రుడుండేవాడు. అతనికి 'పుణ్యుడు' 'పావనుడు' అనే ఇద్దరు కొడుకులు. ఆ యిరువురిలో

పుణ్యుడు పూర్తిగా జ్ఞాని అయినాడు. పావనుడు సగము జ్ఞానాన్ని మాత్రమే పొంది మౌఢ్యాన్ని అతిక్రమించాడు. కాని పూర్తిగా జ్ఞానియై బ్రహ్మపదాన్ని పొందలేదు.

కొంతకాలానికి దీర్ఘతపసుడు, పూవులోని సువాసన ఆకాశంలో చేరినట్లుగా చిన్మాత్రమైన బ్రహ్మ పదాన్ని పొందాడు. శరీరాన్ని త్యజించాడు. పెద్దవాడైన పుణ్యుడు తండ్రికి ఔర్ధ్వ దైహిక కర్మల నాచరించాడు. పావనుడు పితృవియోగ దుఃఖం వల్ల చిత్తము చెడి అడవుల్లో తిరగసాగాడు.

పితృ కర్మనాచరించిన పిమ్మట, పుణ్యుడు తమ్ముని వద్దకు వచ్చాడు. తమ్మునితో ఇట్లా అన్నాడు- తమ్ముడా! ఎందుకు నీవు దుఃఖిస్తున్నావు? జ్ఞానుల్లో శ్రేష్ఠుడైన నీ తండ్రి మోక్షమనే పరమపదాన్ని పొందాడు - స్వస్వరూపాన్ని పొందాడు. ఆయన కోసం దుఃఖించటం ఎందుకు? నీ తల్లి దండ్రులు అనేక వేల మంది గతించారు. ప్రాణికి ప్రతి జన్మలోనూ బాంధవులు ఏర్పడతారు. తల్లిదండ్రుల కోసం దుఃఖించాలంటే, వెనుకటి జన్మల్లోని వారైన వేల కొలది మంది తల్లిదండ్రుల కోసం దుఃఖించాలి గదా! అట్లా ఎందుకు దుఃఖించవు?

అనేక మంది నీ పూర్వ జన్మల బంధువులు మృగయోనులందును, పక్షులు గాను, క్రిమికీటకాలుగాను జన్మించారు. వారి కోసం ఏల దుఃఖింపవు? ఇక నీ విషయానికి వస్తే, నీవు దశార్ణ దేశంలో వనగజంగానూ, తుషార దేశంలో రాజపుత్రుడవు గాను, పుండ్ర దేశంలో అడవి కాకి గాను, హైహయదేశంలో సామంతుడివి గానూ, త్రిగర్త దేశంలో గార్దభంగానూ, సాల్వ దేశంలో తేనెటీగ గాను, సరళ వృక్షంలో పక్షిగాను, ఇట్లా అనేక యోనులందు పుట్టావు. అనేక వేల సార్లు ఈ జంబూద్వీపంలో పుట్టావు.

ఈ జగత్తులో, అడవిలోని చెట్లకు ఆకులు రాలి పోవునట్లుగా, అనేక మంది తల్లిదండ్రులు పోతున్నారు. కాబట్టి, తమ్ముడా! నీవు భావాభావాలు గాని, జరామరణాలుగాని, లేనట్టి ఆత్మను ఏకాగ్రచిత్తంతో స్మరించు. నిర్మలమైన మనస్సుతో, సంభ్రమాన్ని వదలివేసి, హృదయ కమలంలో నున్న ఆత్మ యందు సుఖించు!

పుణ్యుని చేత ఈ విధంగా బోధింపబడి, పావనుడు జ్ఞానాన్ని పొందాడు. కాబట్టి, రామచంద్రా! మన చేత పూర్వం అనుభవింపబడిన శరీరాలకు లెక్కలేనంత మంది బంధువులున్నారు. వారి నందరినీ గుర్తు చేసుకొని దుఃఖింపగలమా? బ్రహ్మ నిష్ఠను పొందినవాడు మోహమునకు చిక్కడు. వివేకమనే స్నేహితుని, బుద్ధి అనే

చెలికత్తెను పరిగ్రహించిన వాడు మోహాన్ని పొందడు.

కాబట్టి, రామా! నీవు సమస్త కోరికలను విడచిపెట్టి, సంసారబంధాన్ని త్యజించి, ముక్తుడవు కమ్ము. మనసులో ఉండే ఆశలే, సంకల్పాలే బంధకాలు. కాబట్టి, అవి (ఆశలు) జారిపోగానే అందరూ ముక్తులే అవుతారు.

## 3. బల్యుపాఖ్యానము

(వెనుకటి ఉపాఖ్యానంలో లోగడ గడచిన అనేక జన్మలను తలచుకొన్నందు వల్ల, స్వరూప జ్ఞానం కలిగి, తద్వారా చిత్తోపశాంతి కలిగిందని చెప్పబడ్డది. ఈ ఉపాఖ్యానంలో పుణ్యాతిశయం వల్ల, ఒక్కొక్కప్పుడు, విషయ సుఖం కూడా చిత్తోపశాంతికి సాధన మౌతుందనే విషయం చెపుతున్నారు)

వసిష్ఠుడీవిధంగా చెపుతున్నాడు - రామా! పూర్వం పాతాళలోకంలో బలిచక్రవర్తి అనే రాక్షస రాజు ఉండేవాడు. అతడు సమస్త లోకాలను తేలికగా జయించి పదికోట్ల సంవత్సరాలు రాక్షస రాజ్యాన్ని పాలించాడు.

కృతయుగాదులు సుడులుగా తిరుగుతూనే ఉన్నాయి. దేవాసురులు వృద్ధిక్షయాలు పొందుతూనే ఉన్నారు. బలిచక్రవర్తి మాత్రం ముల్లోకాల్లోను ఉన్న భోగాలను తెంపులేకుండా అనుభవిస్తూనే ఉన్నాడు. అతనికి ఆ భోగాల యందు అరుచి పుట్టింది. ఒకనాడు మేడపై భాగాన కూర్చుండి ఇట్లా ఆలోచింపసాగాడు -

నేను రాజభోగాలు అనేకం అనుభవించాను. మొదట మాత్రం మధురంగా కనిపిస్తూ, పిమ్మట నశిస్తూ ఉండే ఈ భోగానుభవం నాకెందుకు? అనుభవించగానే రసవిహీనమైన విషయాన్ని మళ్ళీ మళ్ళీ అనుభవించటానికి నిజంగా వివేకియైనవాడు సిగ్గుపడాలి. ఈ భోగ రూపమైన విషయ సుఖం కంటె అనశ్వరమైన ఏ సుఖం ఉన్నదో దానిని గూర్చి ఆలోచించాలి. అని బలిచక్రవర్తి ధ్యాన నిమగ్నుడైనాడు.

కొంత సేపటికి కండ్లు తెరచి, అనుకొన్నాడు. అవును! నాకు జ్ఞప్తికి వచ్చినది. నా తండ్రియైన విరోచనుని ''అన్ని సుఖాలకు పరమావధియైన సుఖమేదో చెప్పుమ'' ని అడిగాను. అప్పుడాయన నాకీ విధంగా చెప్పాడు -

పుత్రకా! విస్తారమైన ఒక దేశం ఉంది. అందులో వేలకొలది లోకాలు ఒక మూలకు కూడా చాలవు. ఆ దేశంలో భూమ్యాకాశాలు, సముద్రాలు, పర్వతాలు, నదులు పొగరాలు ఏవీ లేవు. ఆ దేశంలో మహాతేజస్వి, సర్వకర్త, సర్వరూపుడు, అయిన రాజు ఒకడే ఉన్నాడు. ఆ రాజు చేత కల్పింపబడిన మంత్రి విచారపూర్వకంగా, ఎంత కష్టమైన కార్యాలనైనా నెరవేర్చగలడు. తనకు ఇష్టం లేకపోతే చెడగొట్టగలడు.

(దేశము అంటే మోక్షము. రాజు అంటే ఆత్మ. మంత్రి అంటే మనస్సు. రాజు చేత మంత్రి కల్పింపబడటం అంటే సృష్టి చేయాలనే సంకల్పం చేత ఆత్మ, మనస్సును కల్పించింది. అని భావం.)

ఆ మంత్రికి దేనినీ అనుభవించే శక్తి లేదు. దేనినీ ఎరుగడు (మనస్సు జడం కాబట్టి) రాజు కోసం కార్యాలు చేస్తాడు. ఆ మంత్రి ఒకడే రాజు యొక్క కార్యాలన్నీ చేస్తాడు. రాజు మాత్రం (ఆత్మ) ఏ పనీ చేయకుండా హాయిగా, ఏకాంతంగా ఉంటాడు. ఆ మంత్రిని యుక్తి చేత వశపరచుకోవాల్సిందే తప్ప, బలవంతంగా అయితే దెబ్బతిన్న పాములాగా కాల్చి పారేస్తాడు. (యుక్తి చేత అంటే సమస్త విషయాల యందలి కోరికలను వదలివేయటం ద్వారానే మనస్సును లోబరచుకోవాలి అని భావం)

చిత్తాన్ని జయించాలంటే, మనస్సు యొక్క వ్యవహారాలన్నింటినీ నాలుగు భాగాలుగా చేయాలి. మనస్సు ఏ మాత్రమూ జ్ఞానం లేనిదైతే' విషయ భోగాల చేత రెండు భాగాలను, అధ్యాత్మ శాస్త్ర విచారం చేత ఒక భాగాన్ని, గురుశుశ్రూష చేత ఒక భాగాన్నీ ఇట్లా నాలుగు భాగాలునూ పూరించాలి - అంటే మానసిక వ్యవహారాలు 2 + 1 + 1 గా ఉండాలని భావం. మనస్సు కొంచెం జ్ఞానాన్ని పొందినదైతే, విషయ భోగాలతో ఒక భాగాన్ని, గురు శుశ్రూష చేత 2 భాగాలను, శాస్త్ర చింతన చేత ఒక భాగాన్ని పూరించాలి - అంటే మనస్సును ఈ విధంగా ఆయా విషయాల మీద లగ్నం చేయాలి అని భావం. మనస్సు బాగా జ్ఞానాన్ని కలిగి ఉంటే అధ్యాత్మ శాస్త్ర విచారం చేత రెండు భాగాలను, గురుశుశ్రూష చేత రెండు భాగాలను పూరించాలి. అంటే, విషయ భోగాలను వదలివేయాలి అని భావం.

ప్రజ్ఞ చేత, విచారణ ద్వారా చిత్తశాంతిని, ఆత్మదర్శనాన్ని, తృష్ణా త్యాగాన్ని సాధించాలి. వైరాగ్యం చేతను, ఆత్మ విచార మహిమ చేతను నీకు ఆత్మ సాక్షాత్కారం లభిస్తుంది.

బలిచక్రవర్తి తన తండ్రి చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకొని మననం చేశాడు. అజ్ఞాన నివృత్తి కోసమై, అహంపదార్థమేది? ఆత్మ స్వరూపం ఎట్టిది? అనే విషయాలను గూర్చి ఆత్మ జ్ఞాని, గురువు అయిన శుక్రాచార్యుని అడగాలి అని నిశ్చయించుకొని, శుక్రాచార్యుని ధ్యానించాడు. చిన్మాత్రరూపుడైన శుక్రుడు, అచటికి వచ్చాడు. గురువును పూజించి, బలిచక్రవర్తి ఈ విధంగా అడిగాడు -

గురూత్తమా! ఈ భోగ జాలమునందు ఏమున్నది? ఈ భోగజాలము ఏ రూపం కలది? ఈ భోగజాలానికి మూలం ఏది? (ఈ మూడు ప్రశ్నలు భోగ సమూహాన్ని గురించి అడిగిన ప్రశ్నలు)

నేను ఎవరు? నీవు ఎవరు? (ఈ రెండు భోక్త సంబంధమైన ప్రశ్నలు,)

ఈ లోకాలు ఎట్టివో చెప్పండి (ఇది భోగ్య సంబంధమైన ప్రశ్న) (ఇట్లా భోగము (అనుభవము) భోక్త (అనుభవించేవాడు) భోగ్యము (అనుభవింపదగినది) జగత్తు ఈ మూడు రకాలుగా కనిపిస్తోంది. కాబట్టి మూడు విధాలైన ప్రశ్నలు అడిగాడు)

శుక్రాచార్యుడీ విధంగా అన్నాడు - దానవేంద్రా! నీ ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానం చెపుతాను. ఈ భోగజాలంలో ఉన్నది చిత్తు. ఈ భోగజాలము చిద్రూపం కలది. ఈ భోగ జాలమంతకూ మూలము చిత్తు.

నీవు చిత్. నేనును చిత్. ఈ లోకములన్నీ చిత్. ఇదే సమస్త వేదాంత సారం. నీకు శ్రద్ధ ఉంటే, ఈ నిశ్చయ జ్ఞానంతోనే నీవు బ్రహ్మపదాన్ని పొందుతావు.

శుక్రుని వచనాలను బలిచక్రవర్తి మననం చేయసాగాడు -

ఈ మూడు లోకాలు, నేను, దిక్కులు, క్రియలు, అన్నీ చిద్రూపములే! 'నేను' అఖండమైన, అంతటా ఉన్న సంవిత్తును (జ్ఞానాన్ని) అని యిట్లా చింతనం చేసి, బుద్ధి చేత, చైత్యము (చింతింపదగినది) చింతకుడు (చింతించేవాడు), చింతనము (చింత) అనే ఈ మూడు బహిర్విక్షేపాలను వదలివేశాడు. అట్లాగే, ధ్యాత (ధ్యానించేవాడు) ధ్యేయము (ధ్యానింపదగినది), ధ్యానము (ధ్యానించుట) అనే అంతర్విక్షేపాలను వదలివేశాడు. వాసనారహితుడు, నిశ్చలుడు అయి బ్రహ్మ పదాన్ని పొందాడు - నిర్వి కల్ప సమాధి నిష్ఠుడైనాడు.

ఇట్లా కొంతకాలం ఉన్న పిమ్మట మేల్కాంచి, నేను, నాది అనే వాసన లేని చిత్తంతో రాజకార్యాలు నిర్వర్తించాడు. కాబట్టి, ఓ రామచంద్రా! లౌకిక వ్యాపారాలలో నిమగ్నమైన మనస్సును, వివేక వైరాగ్యాదుల చేత నిరోధించి, హృదయ కమల మందు నిలిపి ఆత్మను సంధానం చేయాలి. ఇట్లా మదపుటేనుగును బంధించి నట్లు మనస్సును బంధించగలుగుతే పరమపురుషార్థమైన మోక్షాన్ని పొందగలుగు తాడు.

# 4. ప్రహ్లాదోపాఖ్యానము

(వెనుకటి ఉపాఖ్యానంలో పుణ్యాతిశయం వల్ల (గొప్ప పుణ్యం వల్ల) విషయ సుఖాలు కూడా ఒక్కొక్కప్పుడు విత్తోపశాంతికి కారణం అవుతాయని చెప్పబడ్డది. ఈ ఉపాఖ్యానంలో ఒక్కొక్కప్పుడు ఈశ్వరానుగ్రహం వల్లనే ఆత్మజ్ఞానం కలుగుతుందని చెపుతున్నారు.)

వసిష్ఠుడు శ్రీరామునితో ఇట్లా చెపుతున్నాడు - రామా! జ్ఞానప్రాప్తికై రాక్షస శ్రేష్ఠుడైన ప్రహ్లాదుడు తనంత తానే సిద్ధిపొందిన పద్ధతిని చెపుతాను విను -

దేవతలకు శత్రువైన హిరణ్య కశిపుడు వధింపబడిన పిమ్మట ప్రహ్లాదుడు ఈ విధంగా చింతించాడు - సంక్షుభితమైన కల్పాంత వాయువుచే కులపర్వతాలన్నీ పెకలింపబడునట్లు, నా తండ్రి మొదలైన రాక్షసులంతా వధింపబడ్డారు. మా తాతలతో సైతం మహా యుద్ధాలుచేసి ఏ విధంగానూ భయపడని విష్ణుమూర్తి మన వల్ల ఎందుకు భయపడతాడు? కాబట్టి, ఆ విష్ణుమూర్తే ఇక మనకు గతి. ఇక, ఇతర దిక్కు లేదు. ఆతని శరణు జొచ్చుట కంటె వేరు మార్గం లేదు. అని ఈ విధంగా తలచాడు. ఈ క్షణం నుండి నేను నారాయణుని శరణుజొచ్చాను. నేను నారాయణ స్వరూపుడను. అన్ని కోరికలు తీర్చే 'ఓం నమోనారాయణాయ' అనే మంత్రమే నాకు ప్రాణవాయువు. కాబట్టి, భక్తుడు విష్ణుస్వరూపుడై విష్ణువును పూజించాలి. నేను విష్ణుస్వరూపుడనైనాను. అని ఇట్లా మనస్సు చేతనే సమస్త పూజా ద్రవ్యాలను కల్పించుకొని, తాను విష్ణుస్వరూపుడై విష్ణువును పూజింపసాగాడు.

రాక్షసులందరూ క్రమంగా విష్ణుమూర్తి మీద నుండిన ద్వేష-బుద్ధిని వీడి, విష్ణు భక్తులైనారు. ఇంద్రాదుల కిదంతా ఆశ్చర్యజనకమైంది. వారంతా విష్ణువు వద్ద కేగి ఈ వృత్తాంతమంతా చెప్పారు. ఇది విని విష్ణువు దేవతలతో ఇట్లా అన్నాడు - ''మీరు చింతించాల్సిన పని లేదు. ప్రహ్లాదుడు నిజమైన భక్తుడైనాడు. ఇతనికి ఈ ప్రహ్లాద జన్మ చివరి జన్మ. ఇతడు మోక్షానికి తగినవాడు. ఇందువల్ల మీకు ఏమీ హాని కలుగదు. మీ లోకానికి మీరు పొండు. '' అని.

విష్ణుమూర్తి ప్రహ్లాదుని భక్తికి మెచ్చి ఆతని పూజా గృహానికి వెళ్ళి అతనికి ప్రత్యక్షమైనాడు. ప్రహ్లాదుడు విష్ణుమూర్తిని బహు విధాలుగా స్తుతించాడు. విష్ణుమూర్తి సంతుష్టుడై ఇట్లా అన్నాడు -

''ప్రహ్లాదా! ఆత్మ విచారం వల్ల సమస్త భ్రమలు తొలుగుతాయి. పరమ పురుషార్థ

ప్రాప్తి (మోక్షము) బ్రహ్మమందు విశ్రాంతి నొందుట అనేవి లభిస్తాయి. అట్టి ఆత్మ విచారం నీకు కలుగుగాక!'' అని ఆనతిచ్చి అంతర్హితుడైనాడు. పిమ్మట ప్రహ్లాదుడు విష్ణుమూర్తి అనుగ్రహించిన విధంగా ఆత్మ విచారం చేసి, నిర్వికల్ప సమాధిలో అయిదు వేల సంవత్సరాలు ఉన్నాడు. ప్రహ్లాదుడు బ్రహ్మమందు విశ్రాంతి నొందిన కారణం చేత పాతాళ లోకంలో రాక్షసులు లేకుండా పోయారు. విష్ణువు ఇట్లా తలచాడు. ''సృష్టి యందు దేవత లెంత ముఖ్యులో రాక్షసులూ అంత ముఖ్యులే! దేవతా సమూహమంతా మోక్షపదాన్ని పొందితే, భూమి యందు యజ్ఞాలు, తపస్సులు మున్నగు ధర్మాలన్నీ నశిస్తాయి. ఎందుచేతనంటే, కర్మ ఫల ప్రదాతలైన దేవతలు లేనందు వల్ల కర్మలు నిష్ఫలములౌతాయి. నిష్ఫలములు అయినందున మానవులు కర్మలనాచరింపరు. కాబట్టి కర్మనాశనం అవుతుంది. కర్మభూమి వ్యర్థమైపోతే, కర్మమూలమైన సంసారం క్షయమౌతుంది. అంతట సూర్యచంద్రాదులు నశిస్తారు. శూన్యమైయున్న ఈ లోకంలో నేను కూడా చిత్తశాంతిని పొంది బ్రహ్మపదంలో ప్రశాంతిని పొందుతాను. అకారణంగా ఈ జగత్తు ఇట్లా నశించటం మంచిది కాదు. కావున రక్కసులు బ్రతికి ఉండాలి. రక్కసులు బ్రతికి ఉంటే వారిని జయించాలనే కోరికతో దేవతలుంటారు. వారి చేత ధర్మము, ధర్మం చేత లోకస్థితీ కలుగుతుంది''.

విష్ణుమూర్తి ఈ విధంగా తలచి సమాధిలోనున్న ప్రహ్లాదుని పాంచజన్యాన్ని పూరించి మేల్కొలిపాడు. అతనిని తన చేతుల మీదుగా రాజ్యాభిషిక్తుని చేశాడు. విష్ణుమూర్తి అంతర్ధానమయ్యాడు.

ఇది విని శ్రీరాముడు వసిష్ఠుని ఇట్లా అడిగాడు - ''మునీంద్రా! పరమపదంలో లయమొందిన ప్రహ్లాదుని చిత్తం పాంచజన్య ధ్వని చేత ఎట్లా మేల్కొంచింది?''

వసిష్ఠుడిట్లా చెప్పాడు - ''రామా! జీవన్ముక్తుని హృదయంలో ఉండే వాసన నిర్మలమై దగ్ధ బీజంలాగా పునర్జన్మ రూపమైన అంకురాన్ని యివ్వలేదు. ఈ శుద్ధ వాసన కైవల్య సుఖప్రదము, ఔదార్యము కలది, కేవలం సత్త్వగుణంతో కూడినది, ఆత్మ ధ్యాన రూపిణియై, సుషుప్తిలో ఉండే వానిలో ఉండే వాసన వలె దాగి (విలీనమై) ఉంటుంది. జీవన్ముక్తులైనవాడు లోపల ఉన్నట్టియు, ఏదో ఒక కారణం చేత మెల్లగా పొందినట్టిదీ అయిన ఆ వాసనచే, దేహమనేది గనుక ఉంటే, వేయి సంవత్సరాలకైనా మేలు కొంటాడు.

# 5. గాధ్యుపఖ్యానము

(ఈశ్వరానుగ్రహం పూర్తిగా ఉంటే ఆత్మజ్ఞానం కలుగుతుందనీ, తద్వారా సంసార విముక్తి కలుగుతుందనీ ప్రహ్లాదోపాఖ్యానంలో చెప్పారు. ఈ ఉపాఖ్యానంలో, చిత్తాన్ని జయింపకపోతే జగద్రూపంలో ఉండే మాయ తొలగదని చెప్పదలచారు. మాయ యొక్క వైచిత్ర్యాన్ని చెప్పదలచి ఈ ఉపాఖ్యానం చెపుతున్నారు. ఇది లోగడ చెప్పబడిన లవణోపాఖ్యానంలాగా ఉంటుంది.)

వసిష్ఠుడు చెపుతున్నాడు - ఓ రామా! సంసారమనే ఈ మాయకు అంతం లేదు. దీనిని జయించాలంటే (వశపరచుకోవాలంటే) తన చిత్తాన్ని తాను జయించాలి. వేరే ఉపాయం లేదు. ఈ మాయా ప్రపంచం ఎంత విచిత్రంగా ఉంటుందో తెలియటానికై నీకొక ఇతిహాసాన్ని చెపుతాను.

పూర్వం కోసల దేశంలో గాధి అనే పేరు గల ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు సద్గుణవంతుడు. అతడు తన మనసులో ఏదో ఒక కోరిక పెట్టుకొని, బంధువులందరినీ విడచి అడవికి వెళ్లాడు. అచట ఒక సరోవరంలో కంఠ పర్యంతం నీళ్లలో ఉండి తపస్సు చేయసాగాడు. అతనికి శ్రీహరి ప్రత్యక్షమైనాడు. గాధి మహావిష్ణువుకు నమస్కరించి స్తుతించాడు. శ్రీహరి ప్రసన్నుడై ఏమి కావాలో చెప్పమన్నాడు.

గాధి ఈ విధంగా అడిగాడు - ''శ్రీహరీ! పరమాత్మ సంబంధం కలగినట్టి, ఆశ్చర్యాన్ని కలిగించేదీ, నీచే రచింపబడ్డదీ, సంసారమనే పేరు గలదీ, అయిన మాయను చూడాలని ఉంది'' అని.

''సరే! నీవు మాయను చూస్తావు. చూచిన తరువాత దానిని వదలివేద్దామని అనుకుంటే వదలిపెట్టు!'' అని అనుగ్రహించి విష్ణువు అంతర్ధానం చెందాడు.

ఒకనాడు గాధి, విష్ణువు చెప్పిన మాటలను తలుస్తూ, ఒక కొలనులో స్నానం చేస్తూ, మాయను చూడాలని అనుకొన్నాడు. క్రమంగా తన ధ్యానాన్ని, తాను జపించే మంత్రాన్నీ మరచిపోయాడు. తన ఇంట్లో తాను చనిపోయినట్లు, బంధువులంతా తన శవం చుట్టూ చేరి ఏడుస్తున్నట్లు, భార్య తన పాదాల మీద పడి విలపిస్తున్నట్లు, తల్లి తన చిబుకం పట్టుకొని విలపిస్తున్నట్లు చూచాడు (అంటే, మాయ యొక్క ప్రభావం చేత, కలలో లాగా అతనికి భ్రాంతి కలిగింది.) అతని బంధువులు దుఃఖిస్తూ, తన శవాన్ని శ్మశానానికి చేర్చారు. అచట చితిపై ఉంచి భస్మం చేశారు. స్థూలదేహం నశించింది.

పిమ్మట, ఆ విప్రుడు (గాధి) మనసులోని దుఃఖం చేత, హూణ మండలంలోని ఒక గ్రామంలో ఒక చండాల స్త్రీ గర్భంలో ప్రవేశించి, ఆమెకు కొడుకుగా జన్మించాడు. ఆ తల్లికి ప్రీతిపాత్రుడై అచటనే పెరిగాడు. క్రమంగా తాను పదునారు సంవత్సరాల ప్రాయం కలవాడైనట్లు గ్రహించాడు. ఒక చండాల కన్యకను వివాహం చేసికొని, ఆమె వల్ల పుత్రులను కన్నాడు.

ఇట్లా భార్యతోను, పుత్రులతోను. కొన్నాళ్లు సంచరిస్తూ ఉండగానే వార్ధక్యం వచ్చింది. ఆతని భార్య, పుత్రులు గతించారు.

ఆ దుఃఖంతో అతడు అనేక దేశాలు తిరుగుతున్నాడు. ఇట్లా తిరుగుతూ కీర దేశంలో ఒకగొప్ప పట్టణాన్ని చేరాడు. ఆ వీధుల్లో తిరుగుతున్నాడు. రాజ మార్గంలో అతనికొక ఏనుగు కనిపించింది. అది, ఆ దేశపు రాజు గారు చనిపోగా, తగిన వానిని వేరొక రాజును వెదకుచున్న ఏనుగు. ఆ ఏనుగు ఎదురుగా వస్తున్న ఈ చండాలుని తన తొండంతో ఎత్తుకొని తన మూపుపై పెట్టుకొంది.

ప్రజలంతా ఇతడే మనకు రాజు అని జయనాదాలు చేస్తూ ఉండగా, మంత్రులు ఇతర ప్రముఖులు అతనిని రాజుగా చేసి సేవిస్తున్నారు.

ఈ విధంగా ఎనిమిది సంవత్సరాలు గడచినాయి. ఒక రోజున దైవవశమున అతడు తన రాజలాంఛనాలన్నీ తీసి వేసి, పూర్వపు వేషంతో పట్టణం బయటకు వెళ్ళాడు. అచట నల్లని శరీరచ్ఛాయతో, వాద్యాల తీగలను మీటుతున్న చండాలురను చూచాడు. ఆ గుంపులో ఎఱ్ఱని కండ్లు గల ఒక వృద్ధుడు రాజును (గాధిని) చూచాడు. చూచి, ''ఓరీ! కటంజకా! ఇంతవరకు ఎక్కడ ఉన్నావురా! ఇన్నాళ్ళకి దైవవశాన కనిపించావు.'' అని పలుకరించాడు. ఆ రాజు ఆ చండాలుని లెక్క పెట్టలేదు. తాను ఆతనిని ఎరుగనట్లే యుండెను. రాజపత్నులు కిటికీలలో నుండి ఇది యంతయు చూచి, ఇతడు చండాలుడని తెలుసుకొని చాల దుఃఖించారు. రాజు అంతఃపురానికి వెళ్ళాడు. ఖిన్నులైయున్న అచటి మంత్రులు, రాజపత్నులు, ఇతనిని శవాన్ని చూచినట్లు అసహ్యంతో స్పృశింప లేదు. ఈ చండాల సంసర్గం వల్ల మనం అపవిత్రులమైనాము. అని తలచి రాజపత్నులు బాంధవులు అగ్ని ప్రవేశం చేశారు. నా వల్ల గదా, ఈ దేశానికి ఇట్టి అవస్థ ప్రాప్తించింది, అని తలచి, పశ్చాత్తప్తుడై రాజు కూడా అగ్ని ప్రవేశం చేశాడు. అంతటితో, ఆ అగ్నిలో నుండి కలిగే క్షోభం చేత ఆ గాధిముని ఆ మోహం నుండి తెలివి పొందాడు.

అతడు భ్రమ నుండి కోలుకొని 'నేనెవ్వడను? ఏమి చూస్తున్నాను? ఏమి

చేశాను?'' అని ఆలోచించి, తన చిత్తం అనంతమైన భ్రాంతితో కూడిన దృష్టులచే భ్రమిస్తోందని నిశ్చయించుకొని, చిత్తమోహాన్ని విడిచి తన ఆశ్రమంలోనే ఉన్నాడు.

ఇట్లా ఉంటూండగా, ఒకనాడు ఆతని వద్దకు ఒక అతిథి వచ్చాడు. అతనిని తృప్తుని చేసి, ప్రసంగ వశానగాధిముని ఆ అతిథిని మీరింతగా చిక్కిపోయి ఉన్నారేమి? ఇంత బడలి ఉన్నారేమి? అని ప్రశ్నించాడు.

ఆ అతిథి ఇట్లా అన్నాడు - ''నేను కీరమనే ప్రసిద్ధమైన నగరంలో పురజనుల చేత పూజింపబడుతూ ఒకనెల రోజులు ఉన్నాను. ఒకనాడు, ప్రస్తావవశాన ఒకడు, ఈ పట్టణానికి చండాలుడు రాజై ఎనిమిది సంవత్సరాలు పాలించాడనీ, ఈ విషయం తెలుసుకొన్న అంతఃపుర స్త్రీలతో పాటు ఆ రాజు కూడా అగ్ని ప్రవేశం చేశాడనీ, ఆ రాజుతో పాటు అచటి బ్రాహ్మణ బృందం కూడా అగ్నిప్రవేశం చేసినట్లు చెప్పాడు. ఈ వృత్తాంతం విని, నేను ప్రయాగకేగి, జపము ప్రాయశ్చిత్తము చేసికొని, మూడు చాంద్రాయణాలు చేసి, యిపుడు పారణము చేసి (వ్రతానంతరం భోజనం చేసి) వస్తున్నాను. అందుచేత, శ్రమపడి కృశించాను'' అని.

ఈ వృత్తాంతం విని, గాధి ముని ఆశ్చర్యపడ్డాడు. తాను లోగడ చండాలుడై నివసించిన దేశాన్ని చూడాలని తలచి హూణ రాజ్యానికి వెళ్ళాడు. అచట చండాల రూపంలో తాను నివసించిన తన యింటిని చూచాడు. అచటి గుర్తులను బట్టి పూర్వపు తన వృత్తాంతాన్ని జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు. విధి విలాసానికి ఆశ్చర్యపడ్డాడు.

పిమ్మట హూణ రాజ్యాన్ని వదలి, కీర రాజ్యానికి వెళ్లాడు. అక్కడ పూర్వం తానుండిన చోట్లు, తాను చూచినవి, తాను క్రీడించినవి అయిన ప్రదేశాల్ని చూచాడు. ప్రజల వల్ల తన వృత్తాంతాన్ని విన్నాడు. తనలో ఇదంతా విష్ణుమూర్తి చూపించిన మాయ అని గ్రహించాడు. ఒక గుహలోనికి ప్రవేశించి, పుడిసెడు జలాన్ని మాత్రం గ్రహిస్తూ, ఏమీ తినకుండా పదునెనిమిది నెలలు తపస్సుచేశాడు.

విష్ణుమూర్తి అతని వద్దకు వచ్చి ఇట్లా అన్నాడు-

'' ఓ విప్రోత్తమా! గొప్పదైన నా మాయను నీవు చూచావు గదా! ఇక, ఇంకా దేనిని కోరి ఈ తపస్సు చేస్తున్నావు? '' అని.

విష్ణుమూర్తిని అర్ఘ్యపాద్యాదులిచ్చి పూజించి ఆ విప్రుడు ఇట్లా అన్నాడు - ''దేవా! తమో రూపిణియైన నీ మాయను చూచాను. అందలి భ్రమ, సత్యం ఎట్లా అయనది? దాని రహస్యం నాకు చెప్పండి.'' అని.

నారాయణుడీ విధంగా చెప్పాడు- ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా! ఈ జగత్తు అంతకూ

చిత్తమే మూలము. జగత్తు అనేది చిత్తంలో ఉన్నదే తప్ప, చిత్తానికి వెలుపల లేదు. స్వప్నాదులందు చిత్తంలో ఉన్న జగత్తే ప్రకాశిస్తోంది. కాబట్టి, అందరి చేత స్వప్నాద్య వస్థల యందు అందరి చేత జగత్తు అనుభవింపబడుతూనే ఉంది. అట్టి చిత్తము, ఒక చండాలత్వాన్ని కనబరచటంలో ఆశ్చర్యం ఏముంది? భ్రాంతికి లోనై నీవు చండాల రూపుడనైనట్లు తలచావు. అట్లాగే, అతిథి వచ్చాడనీ, చూచాననీ తలచావు. హూణ రాజ్యాన్ని పొందాననీ తలచావు. అట్లాగే, వెనుకటి కటంజుని ఇంటిని చూచావు. కీరనగరానికి పోయినావు. అక్కడొక చండాలుడు రాజ్యం చేసిన వృత్తాంతాన్ని విన్నావు. నీ చిత్తంలో చండాల రూపం ఎట్లా కనిపించిందో, అట్లాగే కాకతాళీయంగా హూణుల చిత్తంలోను, కీరుల చిత్తంలోను ఆ చండాల రూపం కనిపించింది అని తెలుసుకో!

కాకతాళీయ వృత్తాంతం లాగ, ఒకటే ప్రతిభ అనేక మందికి ఒకప్పుడే, ఒకే సమయంలో కలుగుతోంది. మనోగతి చాలా విచిత్రమైనది. ఏ విధమైన చండాల రూపం కలవాడనైతినని నీవు ఎట్లా భ్రమించావో, అట్టి స్వరూపమే కల కటంజకు డనే పేరు గల శ్వపచుడు హూణరాజ్యంలో ఉన్నాడు. వాడు కళత్రహీనుడై, దేశాంతరానికేగి, కీర రాజై యుండి, ఆ పిమ్మట అగ్నిలో ప్రవేశించాడు. ఆ కటంజకుని వృత్తాంతాన్ని పోలిన వృత్తాంతం గల ఈ భ్రాంతి మాత్రం నీ చిత్తంలో కలిగింది. ఆ వృత్తాంతాన్ని విన్న నీవు అది నా వృత్తాంతమే అని తలచావు. మనోగతి విచిత్రం గదా!

ఆత్మజ్ఞానం లేనివాడు, వీడు, వాడు, నేను, నాది అనే భేదభావం కలవాడై సంసార సాగరంలో మునుగుతాడు. తత్త్వజ్ఞానం కలవాడు సర్వమూ నేనే, అనే అభేద భావం కలిగి తరిస్తాడు. సంసారమనే ఈ మాయకు అంతం లేదు. ఈ మాయ, ఆత్మ భావన చేతనే క్షయం కావాలి. మరొక విధంగా నశించదు.

జగత్తు అనేది ఒక మాయా చక్రం. ఆ చక్రానికి చిత్తమే నాభి. (మధ్యలో ఉండే రంధ్రం) నాభి, చక్రం తిరగటానికి హేతువైనట్లుగా ఈ మాయా ప్రపంచం ప్రవర్తించటానికి చిత్తమే హేతువు. అట్టి చిత్తాన్ని గనుక నిరోధిస్తే - మనస్సును నిర్వికారంగా చేస్తే ఆ మాయా చక్రం ఏ మాత్రమూ కదలదు - మనల్ని బాధించదు. ఓ విప్రా! నీవు లేచి ఇచట - ఈ గిరి కుంజమున- పది సంవత్సరాలు తపస్సు చేస్తే జ్ఞానాన్ని పొందగలుగుతావు అని చెప్పి నారాయణుడు అంతర్థానమైనాడు. గాధిముని, ఆ విధంగానే తపస్సు చేసి ఆత్మజ్ఞానాన్ని పొందాడు. జీవన్ముక్తుడైనాడు. తన సద్రూపాన్ని పొందాడు.

# 6. ఉద్దాలకోపాఖ్యానము

(వెనుకటి ఉపాఖ్యానంలో చిత్తోపశాంతి కలగటానికై మాయా వైచిత్ర్యాన్ని చూపించారు. ఈ ఉపాఖ్యానంలో, చిత్తం చంచలమైనదే అయినా, దృఢమైన యోగాభ్యాసం వల్ల ఉపశాంతిని పొందగలుగుతుంది అని చెప్పదలచారు.)

వసిష్ఠ ఉవాచ -

ఏవ మేషాతి వితతా దుర్జ్ఞానా రఘునందన
మహా మోహకరీ మాయా విషమా పారమాత్మకీ 1
అతో వచ్మి మహాబాహో మయేయం విషమాన్వహం
అసావధాన మనసం సంయోజయతి సంకటే 2
చిత్తా క్రమణ మాత్రాత్తు పరమాదౌషధా దృతే
ప్రయత్నే నాపి సంసార మహా రోగోన శామ్యతి. 3
వర్తమానం క్రమాయాతం భజద్బాహ్యా ధియాక్షణం
భూతం భవిష్య దభజద్యాతి చిత్త మ చిత్తతాం 4
సంకల్పాశాను సంధాన వర్జనం చేత్ప్రతిక్షణం
కరోషి తదచిత్తత్వం ప్రాప్త ఏవాసి పావనం. 5

శ్రీరామునితో వసిష్ఠుడు అంటున్నాడు -

రామా! పరమాత్మ సంబంధమైన ఈ మాయ ఎట్లా ప్రకాశిస్తుందో చూచావు గదా! అందుకే, ఈ మాయ అవహితచిత్తుడు కాని వానికి రోజూ అనేక కష్టాలను కలిగిస్తోంది. తన వర్ణాశ్రమాచారాలను అనాదర బుద్ధితో క్షణ మాత్రం ఆచరిస్తూ, భూత భవిష్యత్తులకు సంబంధించిన ఆలోచనలు చేయకపోతే, చిత్తం నిర్వికల్ప స్థితిని పొందుతుంది. నేనిట్లా చేయాలనే సంకల్పం గాని, నాకిదికావాలి అనే ఆశగాని లేకుండా, గడచిపోయిన దానిని గూర్చి తలచకుండా ఉంటే నీకు పవిత్రమైన చిత్త రాహిత్య స్థితి లభిస్తుంది.

చేతనం చిత్త రిక్తం హి ప్రత్యక్చేతన ముచ్యతే
నిర్మనస్క స్వభావంతు న త తత్ర కలనామలః 6
సా సత్యతా సా శివతా సావస్థా పారమాత్మకీ
సర్వజ్ఞ తా సా సా తృప్తి ర్నను యత్రమనః క్షతం 7
అ వివేకా దుపాహృత్య చేత స్సోద్యమనిశ్చయైః
బలాత్కారేణ సంయోజ్యం శాస్త్ర సత్పురుష క్రమైః 8

వికల్పం లేని చైతన్యమే ప్రత్యగాత్మ. ఆ ప్రత్యగాత్మయైన చైతన్యం వికల్పం లేనిది కాబట్టి, అందులో (ప్రత్యక్చైతన్యంలో) అవిద్య అనే కళంకం (మాలిన్యం) ఉండదు.

చిత్తం నశించి పోయిన స్థితినే జీవన్ముక్త దశ అంటారు. దానినే విదేహ కైవల్యం అంటారు. అదే పరమాత్మ స్వరూపం. అదే (ఆ చిత్తరాహిత్య స్థితే) సర్వజ్ఞత్వం. అదే ఆనంద స్వరూపత్వం.

చిత్తాన్ని, దేహమే నేను అనే భ్రాంతి నుండి లేవనెత్తి, ఆత్మానాత్మ విచార హేతువులైన ప్రమాణాలతోను, శాస్త్రాలతో, సదాచారాలతోను, ఆ చిత్తాన్ని అనుసంధానం చేయాలి - కూర్చాలి.

అట్లా ఆత్మానుసంధానం చేయాలంటే, ఆ నిర్వికల్పమైన ఆత్మయందు నిష్ఠ కలగాలి. ఇది నాది. అది వీడు. వాడు నేను. అనే ఇటువంటి వాసనలను విడిచి, సర్వమూ బ్రహ్మమే అని చిన్మాత్రాన్ని భావిస్తూ ఉండాలి. నీవు ఆశలు అనే త్రాళ్లను తెంచివేయాలి. దృశ్యము (జగత్తు) అనే మలాన్ని వదలి వేయాలి. మనసును నిర్మలం చేసి చిద్రూపాన్ని భావిస్తూ ఉండాలి. శుభాశుభ సంకల్పాలు గాని, ఇష్టానిష్ట భేదాలు గాని ఉండకూడదు. జగత్తుకు సంబంధించిన భావన ఉండరాదు. నిర్వికల్పుడవు (స్థిరుడవు) కావాలి. పెద్ద మేఘం ఏర్పడేటప్పటికి ప్రకాశ సంపద పోయి చీకటి వ్యాపిస్తున్నట్లుగా, చిత్తం సంసార వాసనలచేత స్థూలత్వాన్ని పొందటం వల్ల ఆత్మ జ్ఞానం దూరమై అజ్ఞానం వ్యాపిస్తోంది.

చిత్తానికి స్థూలత్వం ఎట్లా కలుగుతుంది? అంటే -

**అనాత్మ న్యాత్మ భావేన దేహ మాత్రాస్థయా ధియా**
**పుత్రదార కుటుంబైశ్చ చేతో గచ్ఛతి పీనతాం** 9
**అహంకార వికారేణ మమతామల లీలయా**
**ఇదం మమేతి భావేన చేతో గచ్ఛతి పీనతాం** 10
**ఆధి వ్యాధి విలాసేన సమాశ్వాసేన సంసృతౌ**
**హేయాదేయ విభాగేన చేతో గచ్ఛతి పీనతాం** 11
**స్నేహేన ధనలోభేన లాభేన మణియోషితాం**
**ఆపాత రమణీయేన చేతో గచ్ఛతి పీనతాం** 12
**దురాశాక్షీర పానేన భోగానిల బలేన చ**
**ఆస్థాదానేన చారేణ చిత్తాహి ర్యాతి పీనతాం.** 13

ఆత్మ కాని దేహాదులందు ఆత్మ అనే ఆదరం కలగటం వల్ల, దేహం, బంధు

పుత్ర కళత్రాదుల మీద ఆదరణ బుద్ధి కలగటం వల్ల, చిత్తం స్థూలత్వాన్ని పొందుతోంది.

అహంకారమనే (నేను అనే) వికారం వల్లను, 'ఇది నాది' అనే భావం వల్ల కలిగిన మమకారం అనే మలం కారణంగా చిత్తం స్థూలత్వాన్ని పొందుతుంది.

మానసిక దుఃఖాలు, శారీరక రోగాలు వీటి వల్లను, సంసారంలో ఏదో గొప్ప మేలు ఉన్నదనే నమ్మకం వల్లను చిత్తం స్థౌల్యాన్ని పొందుతుంది.

పుత్ర కళత్రాదుల మీది స్నేహం చేతను, ధన లోభం చేతను, భోగాల మీద కోరిక చేతను, వాటిని ఆదరించటం వల్లను, స్త్రీ లాభం వల్లను చిత్తం స్థూలత్వాన్ని పొందుతుంది.

చిత్తం అనే సర్పం, దురాశలు అనే పాలు త్రాగినందు వల్లను, భోగాలనే వాయు ప్రాసారణ వల్లను, స్వేచ్ఛాచారం వల్లను చిత్తం స్థూల మౌతుంది.

కాబట్టి, రామా! నీవు ఉద్దాలకుని లాగా పంచభూతాలను నశింపజేసి, ధైర్యంతో బుద్ధి చేత ఆలోచించు. నీకు ఉద్దాలకుని వృత్తాంతాన్ని చెపుతాను, విను -

పూర్వం గంధమాదన పర్వతంమీద ఒక చరియ యందు ఉద్దాలకుడనే ముని ఉండేవాడు. మొదట అజ్ఞానిగా ఉన్నా, క్రమంగా తపస్సు చేత శాస్త్రం చేత (శ్రవణం) నియమాల చేత, వివేకం కలుగగా, ముఖ్యంగా తాను పొందవలసిన వస్తువును గూర్చి ఆలోచింప సాగాడు. తనలో భోగ వాసనలు నశించాలనీ, సంకల్పాలు ఉడిగిపోవాలనీ, ఇచ్ఛానిచ్ఛలు లేకుండా పోవాలనీ, సంకల్ప రాహిత్యాన్ని పొంది నిర్వికల్ప సమాధిలో శిలలాగా కావాలనీ, బ్రహ్మ పదాన్ని పొందాలనీ ఆలోచింపసాగాడు. ధ్యానాభ్యాసాన్ని మొదలుపెట్టాడు.

ఆ ధ్యానాభ్యాసం చేస్తున్నా, అతని మనస్సు, మర్కటం లాగా చంచలంగా తిరుగులోంది. నిలకడ చెందటం లేదు. కాస్సేపు స్థిరంగా ఉండి, వెంటనే పక్షిలాగా ఎగిరిపోతోంది. అతని చిత్తం సత్త్వరజస్తమో గుణాలతో మాటిమాటికి చంచలంగా కలత చెందుతోంది.

ఒకనాడాతడు ఆసనాన్ని కల్పించుకొని నిర్వికల్ప సమాధి కోసం విచారణ చేయటం ఆరంభించాడు. తనకు నిలకడ లేకుండా వేధిస్తున్న చిత్తాన్ని గూర్చి విచారణ చేశాడు. చిత్త చాంచల్యం వల్ల కలిగే అనర్థాలను గూర్చి చింతించాడు. నిర్మనస్కుడై బ్రహ్మభావాన్ని పొందాలని ఆశించాడు. ఆ నిర్మనస్కుడు కావాలంటే నిస్సంకల్పుడు కావాలని తెలుసుకున్నాడు.

నైర్మల్యము, దైన్యం లేకపోవటం, సద్రూపత్వం, సర్వప్రియత్వం, అబాధత్వం, జ్ఞానిత్వం, ఆనంద స్వరూపత్వం, నిర్వికారత్వం, పుణ్యుల యందు ప్రీతి, కాంతిమత్వం, ఏకత్వం, సర్వాత్మత్వం, నిర్భయత్వం, ద్విత్వాది వికల్ప రహితం, మున్నుగా గల సౌందర్యవతులైన యువతులు ఆత్మ యందే రమిస్తున్న నాకు, సమాధి లేని సమయాల్లో ఆనందాన్ని యిస్తున్నారని, స్వచ్ఛమైన స్వీయబుద్ధి చేత నిర్ణయించుకున్నాడు.

పిమ్మట, ధ్యానం చేయటానికై పద్మాసనస్థుడైనాడు. ఉచ్చైస్వరంతో, ఓంకారాన్ని ఉచ్చరించాడు. ఆ నాదం బ్రహ్మరంధ్ర పర్యంతం వ్యాపించింది. అట్లా అర్థ మాత్రతో కూడిన అకార ఉకార మకారాత్మకమైన ప్రణవంలోని మొదటి భాగమైన అకారము ప్రాణవాయువుతో కూడిన శరీరమంతా వ్యాపించింది. అగస్త్యుడు నీటిని త్రాగి సముద్రాన్ని శూన్యం చేసినట్లుగా రేచకం ద్వారా శరీరం నుండి వాయువు ను పూర్తిగా వెలుపలికి వదలివేసి శరీరాన్ని శూన్యం చేశాడు.

అట్లా వెడలిన ప్రాణవాయువు చిద్రసంతో నిండిన ఆకాశంలో ఉంది. రేచకం చేత హృదయాగ్ని ప్రజ్వలించి, మలిన శరీరాన్ని దహించింది. ఇట్లా ప్రాణాయామం యొక్క మొదటి పద్ధతిలో రేచక రూపమైన ఈ అవస్థ - స్థితి - ఇచ్ఛామాత్రంగా ఉన్నదే తప్ప, హఠయోగాభ్యాసం ద్వారా బలాత్కారంగా వచ్చినది కాదు. హఠయోగమనేది దుఃఖాన్ని కలిగించేది కదా! - కష్టసాధ్యం గదా! (ప్రణవంలోని అకారం రేచకంలో ఉచ్చరించాలి)

ఇట్లా ఆకాశంలో ప్రాణవాయువును నిరోధించిన తరువాత చిత్తానికి సమస్థితిని కలుగజేసే, ప్రణవం యొక్క రెండవ భాగమైన ఉకారాన్ని ఉచ్చరించే సమయంలో నిశ్చలమైన కుంభకమనే ప్రాణాయామాన్ని చేశాడు. ఆ కుంభక స్థితిలో శరీరానికి లోపల గాని, బయటగాని, క్రిందగాని, పైన గాని, ప్రాణాలు చలింపకుండా, గాలిచే నింపబడిన చర్మపు తిత్తిలో లాగా నిశ్చలంగా ఉన్నాయి. ఆ సమయంలో - కుంభక స్థితిలో - శరీరం అనేపురం, అగ్ని చేత క్షణంలో కాల్చబడి, తెల్లనిభస్మం లాగా కన్పట్టింది. (రేచకాగ్ని చేత కాల్చబడి కుంభకంలో చల్లబడ్డది)

ఆ భస్మంలో, కర్పూరపు శయ్య మీద శయనించి యున్నట్లు శరీరాస్థులు కన్పిస్తున్నాయి. ఎముకలతో కూడిన ఆ భస్మం, చండవాయువుచే ఎగురగొట్ట బడినదై శరత్కాలంలోని మబ్బులాగా ఆకాశంలో కనుపించి మాయమైంది.

ఇట్లా ప్రణవం యొక్క ద్వితీయావస్థలో సంభవించిన కుంభకావస్థ

ఇచ్ఛానుసారంగా వచ్చిందే తప్ప, బలవంతంగా, దుఃఖకరంగా ప్రాప్తించే హఠయోగంలో కలిగేది కాదు. కుంభకానంతరం చిత్తోపశాంతిని కలిగించే ప్రణవం యొక్క మూడవ అంశమైన మకారాన్ని ఉచ్చరించేటప్పుడు, వాయువును పూరించటం వల్ల, పూరకప్రాణాయామం జరిగింది. అప్పుడు ఆకాశంలో ఉన్న ప్రాణ వాయువులు చేతన మనే అమృతానికి మధ్యలో ఉండి, హిమస్పర్శచే చల్లదనాన్ని పొందినాయి. గగనంలో ఉన్న ఆ ప్రాణవాయువులు క్రమంగా చంద్రమండల రూపాన్ని పొందినాయి.

షోడశకలా పరిపూర్ణమైన ఆ చంద్ర మండలంలో ఆ ప్రాణ వాయువులు అమృతధారల రూపాన్ని పొందాయి. ఆ అమృతధారా వర్షం చేత ఉద్దాలకుని శరీరం నారాయణ స్వరూపం లాగా నాలుగు బాహువులు కలదియై చంద్రబింబం లాగా ప్రకాశిస్తోంది.

అమృత రూపాన్ని దాల్చిన ఆ ప్రాణాలు, ఉద్దాలకుని శరీరమంతా నిండి, శరీరంలోని కుండలినీ శక్తిని పూరించింది. (ఈ ఉపాఖ్యానంలో చెప్పిన శరీరాన్ని శోషింపచేయటం, దహింపజేయటం ఈ ప్రక్రియలన్నీ భూతశుద్ధి అనే మంత్ర శాస్త్ర సంప్రదాయాన్ని బట్టి భావనా మాత్రంగానే గ్రహించాలి)

పిమ్మట ఉద్దాలకుడు పద్మాసనస్థుడై, దేహాన్ని స్థిరంగా నిలిపి, చంచలమైన చిత్తాన్ని బలాత్కారంగా నిరోధించాడు. ఉచ్ఛ్వాస నిశ్వాస రూపమైన ప్రాణమార్గాన్ని ముఖమందు నిరోధించాడు. ఇంద్రియాలన్నింటినీ విషయాల వైపు నుండి లోనికి ఆకర్షించాడు. బాహ్య విషయాలను, దూరంగా వదలి ఆంతర విషయాలనూ కూడా విలీనం చేశాడు. అపానాన్ని నిరోధించటం ద్వారా నవద్వారాలలోని వాయువులను నిరోధించాడు. మెడను శరీరాన్ని సమంగా ఉండునట్టు నిటారుగా నిలిపాడు. ('సమం కాయం శిరోగ్రీవం ధారయన్నచలం స్థితః' అని, భగవద్గీత ఆత్మ సంయమయోగాధ్యాయంలో చెప్పారు. ఇది యోగశాస్త్ర ప్రసిద్ధమైన విషయం)

పిమ్మట ప్రత్యాహారాదుల చేత ధ్యానానికి అభిముఖంగా - సిద్ధంగా ఉన్న చిత్తాన్ని దహరాకాశంలో బంధించాడు. వికల్పాలను, భ్రాంతులను ఛేదించాడు. అప్పుడాతనికి హృదయమందు సూర్యుని వంటి వివేకాన్ని కప్పి ఉంచినట్టి తమోగుణ స్వరూపమైన అంధకారం కనిపించింది. హృదయంలో ఉన్న జ్ఞానం అనే సూర్యుని చేత ఆ అంధకారాన్ని (తమోగుణాన్ని) ఛేదించాడు. తేజఃపుంజాన్ని చూచాడు.

కొంతసేపటికా తేజాన్ని దూరం చేశాడు. ఆ తేజస్సు శాంతించగా అతని చిత్తం, నిద్రను పొందింది. అతడు ఆ నిద్రను కూడా దూరం చేశాడు. అతనికి ఆకాశంలో ఏదో వివిధ వర్ణాలతో కూడిన ఆకృతి కనిపించింది. కొంతసేపటికి ఆ ఆకారం కూడా మాయమైంది. అతని మనస్సు మోహాన్ని పొందింది. ఆ చిత్తమోహాన్ని (కర్మలను) కూడా తుడిచివేశాడు. అంతట ఆ ఉద్దాలకుని చిత్తము, సత్త్వ లక్షణాలైన తేజస్సుగాని, తమస్సు గాని, నిద్రగాని, మోహం గానీ, ఏవీ లేని నిర్వికల్ప సమాధి స్థితిని పొంది, క్షణకాలం ఆత్మయందు విశ్రమించింది.

ఇట్లా ఉద్దాలకుని చిత్తము, విశ్రాంతిని పొంది, సర్వాత్మకము, స్వస్వరూప చైతన్య పూర్ణము అయిన బ్రహ్మాత్మైక్య చైతన్యాన్ని పొందింది. బంగారం, నూపురం అనే ఆకారాన్ని పొందినట్లు, అతని మనస్సు స్వరూప చైతన్యంతో కలియటం వల్లను, స్వరూపానందం పొందటం వల్లను చిద్రూపసత్వాన్నీ పొందింది. అతడిట్లా జీవ భావాన్ని వదలివేసి చిదాకాశాన్ని పొంది, సత్తామాత్రరూపుడై ఆనంద సముద్రుడైనాడు.

అతడు గాలి లేని చోటనున్న దీపం లాగా నిశ్చేష్టుడై యుండెను. ఆ చిదాకాశంలో చాలా కాలం ఉండి, అంతరిక్షచారులైన సిద్ధులను, దేవతలను చూచాడు. కాని వారి యందాసక్తిని పొందలేదు. సిద్ధులు, సాధ్యులు, బ్రహ్మాదిదేవతలు ఉండే జీవన్ముక్త స్థితిలో ఆరు నెలల పాటు ఉన్నాడు. సిద్ధ విద్యాధరాదులు ఆతనిని స్వర్గానికి ఆహ్వానించారు - యోగ విభూతములు అతనిని ఆకర్షించాలని ప్రయత్నించాయి. కాని ఉద్దాలకుడు వారిమాటలను నిరాదరించి తన స్థితిలోనే ఉన్నాడు.

అట్లా పరిపూర్ణ చిద్రూపాన్ని పొంది, ఆ చిద్రూపాన్నే చాలాకాలం అభ్యాసం చేయటం వల్ల సత్తాసామాన్యాన్ని పొందాడు. అంటే, అంతటా నేను ఒక్కడనే ఉన్నాననే భావాన్ని పొందాడు. బ్రహ్మానంద రూపుడైనాడు. అభేద స్థితిని పొందాడు.

(ఇది చిత్త నిరోధ రూపమైన యోగశాస్త్రానికి సంబంధించిన విషయం. ఇది ఒక ప్రత్యేక శాస్త్రం గానే పెంపొందింది. భగవద్గీత వంటి, ఉపనిషత్తుల వంటి వేదాంత గ్రంథాలలో ఈ ధ్యానయోగానికి ప్రముఖ స్థానం యివ్వబడ్డది. ఇది సాధనకు సంబంధించిన విషయం కాబట్టి, స్వీయానుభూతికి సంబంధించిన విషయం కాబట్టి, ఉద్దాలకుని ధ్యానసాధనను గూర్చి స్థూలంగా చెప్పబడ్డది)

# 7. సురఘూపాఖ్యానము

(వెనుకటి ఉపాఖ్యానంలో చిత్త వృత్తి నిరోధరూపమైన యోగాభ్యాసం దృఢమవటం వల్ల, చిత్తోపశాంతి కలుగుతుందనీ, అదే సమాధి కంటె ఉత్తమావస్థ అనీ చెప్పారు. ఈ సురఘూపాఖ్యానంలో, ఆ చిత్తవిశ్రాంతియే జీవన్ముక్తికి హద్దు (అవధి) అని చెప్పదలచారు.)

కైలాసం అనే పేరు గల హిమవత్పర్వత శిఖరం ఉంది. ఆ శిఖరానికి దిగువన హేమజటములు అనే కిరాత దేశాలు ఉన్నాయి. ఆ దేశాలకు సురఘుడనువాడు రాజా. అతడు బలవంతుడు, దైత్యుల గర్వాన్ని అణచినవాడు. ఒకనాడు ఆతని వద్దకు మాండవ్యుడు అనే ముని వచ్చాడు. సురఘుడు మునిని పూజించాడు. మునితో ఇట్లా అన్నాడు -

''మునీంద్రా! మహాత్ముల సాంగత్యం దుఃఖాలను పోగొడుతుంది. తత్త్వజ్ఞులైనవారు సంశయాన్నే - అనుమానాన్నే - గొప్పపీడగా చెప్పారు. భృత్యుల యెడ నేను నిగ్రహానుగ్రహాలు చూపాల్సి వస్తోంది. అందువల్ల కలిగే చింతలు నన్ను బాధిస్తున్నాయి. అంతటా అందరికీ ఒకే విధంగా ఉండే సూర్యకిరణాల్లాగా నాకు సర్వసమత్వం ఎట్లా లభిస్తుంది? ఈ విషయం నాకు చెప్పండి.'' అని

ఈ విధంగా అడిగిన సురఘునికి మాండవ్యుడిట్లా ఉపదేశించాడు -

**స్వయత్నేన స్వసంస్థేవ స్వేనోపాయేన భూపతే**
**ఏషామనః పేలవతా హిమవత్ప్రలీయతే** 1

**స్వవిచారణయై వాశు శామ్య త్యంతర్మనోమలం**
**కోహం కథమిదం కింవా కథం మరణ జన్మనీ** 2

**విచార యాంతరేవ త్వం మహత్తామలమేష్యసి**
**విచారేణ పరిజ్ఞాత స్వభావస్య సతస్తవ** 3

**మనస్స్వరూప ముత్సృజ్య శమమేష్యతి నిజ్వరం**
**తిష్ఠదేవ మనోరూపం పరిత్యక్షతి తేనఘ** 4

ఓ రాజా! వైరాగ్యము, త్యాగము మొదలైన స్వప్రయత్నాల చేతను, శ్రవణ మననాది ఆత్మ ప్రకాశమైన సాధనాల చేతను, స్వాత్మ బోధ కలగటం చేతను, ఈ మనస్సులోని దైన్యం మంచులాగా కరగిపోతుంది. ఆత్మ విచారం చేతనే మనస్సులోని మలం శాంతిస్తుంది. కాబట్టి, నేను ఎవడను? ఈ జగత్తు ఏమిటి? ఎట్లా కలిగింది? జనన మరణాలు ఎట్లా కలుగుతున్నాయి? అని నీవు నీలో ఆలోచించు. ఇట్లా

ఆలోచించటం వల్ల, భ్రాంతి వల్ల కలిగిన పరిచ్ఛిన్న రూపం పోయి, మహత్వాన్ని పొందుతావు. నీవు ఆత్మ విచారం వల్ల స్వ స్వరూపాన్ని తెలుసుకోగలుగుతావు. నీవు స్వ స్వరూపాన్ని తెలుసుకోవటం వల్ల, తరంగం అణగిపోయి, వెనుకటి జలభావాన్ని పొందునట్లు, నీ పూర్వపు బ్రహ్మరూపాన్ని పొందుతావు. కాలం ఉంటూ ఉండగానే, మన్వంతరంలో పూర్వపు కలి కల్మషంతో కూడిన రూపం వదిలివేసినట్లుగా, నీ మనస్సు, తాను ఉంటూ ఉండగానే పూర్వ రూపాన్ని వదలివేస్తుంది.

**యావద్యా వత్పరాలోకః పరమాత్మైవ శిష్యతే**
**తావత్తా వ న్మహో బాహో స్వయం సంత్యజ్యతేఖిలం** 5
**యావత్సర్వం న సంత్యక్తం తావదాత్మా న లభ్యతే**
**సర్వవస్తు పరిత్యాగే శేష ఆత్మేతి న కథ్యతే** 6
**సకల కారణ కార్య పరంపరా**
**మపి జగద్గత వస్తు విజృంభితం** 7
**అలమపాస్య మనః స్వవపు స్తతః**
**పరి విధూయ చ య చ్ఛు భమస్తు తత్.** 8

స్వల్పము అధికము అయిన సమస్త పదార్థాలను అనాత్మలుగా తెలుసుకొని, వాటిని నిషేధిస్తూపోగా, పరంజ్యోతి స్వరూపమైన పరమాత్మయే మిగులుతుంది. ఆత్మకాన్తి పదార్థాలనన్నింటినీ విడిచిపెట్టేటంత వరకు ఆత్మ వస్తువు లభ్యం కాదు. అన్ని వస్తువులను విడువగా మిగిలి ఉండేది ఆత్మయే!

''సమస్త కార్యకారణ పరంపరను, జగత్తుకు సంబంధించిన వస్తువాసనలతో గూడిన మనస్సును విడిచి, తన శరీరం ఆత్మకాదు అని నిరసించగా, ఏ వస్తువు మిగులుతుందో అదే శుభంకరమైన బ్రహ్మమౌగాక!''

మాండవ్యు డీ విధంగా ఉపదేశింపగా, సురఘుడు తన బుద్ధిలో ఆత్మ విచారణ ఆరంభించాడు - ఈ శరీరంలో ఉన్న మాంసం, ఎముకలు, కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు ఇవేవీ 'నేను' కాను. అవన్నీ జడాలు. కాబట్టి అసద్రూపాలు. వీటన్నింటినీ నిషేధింపగా మిగిలేది, వికల్ప రహితము, మాయా సంబంధం లేనట్టి చిత్తే (జ్ఞానమే) నేను. చిద్రూపుడైన పరమాత్మే సూర్యచంద్రాదుల్లో, వాయువులో, సర్వభూతాల్లోనూ అనుస్యూతంగా ఉన్నాడు. ఆ చిద్రూపుడను నేనే! ఇట్లా విచారణ చేసి, వివేక నిశ్చయం చేత బ్రహ్మపదాన్ని పొందాడు.

రామా! ఇట్లా సురఘుడు ప్రజ్ఞానియై యుండగా, అతనికీ పర్ణాదుడనే రాజర్షికీ

(పరిఘుడు) జరిగిన సంవాదాన్ని చెపుతాను విను.

పారసీక దేశానికి రాజు పరిఘుడు అనే వాడుండేవాడు. ఆతని రాజ్యంలో ఒకప్పుడు పండ్రెండు సంవత్సరాల పాటు క్షామం (కరవు) వచ్చింది. జనుల దీన స్థితికి వగచి, తగిన ప్రతీకారం చేయలేక రాజ్యాన్ని వదలి తపస్సు చేయటానికై అడవికి వెళ్ళాడు. అక్కడ ఎండిన ఆకులు (శుష్క పర్ణాలు) తింటూ తపస్సుచేశాడు. పర్ణాలు తిన్నందున ఆతనికి పర్ణాదుడనే పేరు వచ్చింది. అట్లా వేయి సంవత్సరాలు తపస్సు చేసి, ఆత్మజ్ఞానాన్ని పొంది ద్వంద్వ దోషరహితుడై, సమదృష్టి కలవాడైనాడు.

అతడు ఇచ్ఛానుసారంగా తిరుగుతూ సురఘుని యింటికి వచ్చాడు. వారిరువురికి ఈ విధంగా సంభాషణ జరిగింది -

పరిఘుడు - ఓ పుణ్యాత్ముడా! నీవు జ్ఞానాన్ని పొందినట్లుగానే నేనూ జ్ఞానాన్ని పొందాను. నీవు నిర్మలము, గంభీరము అయిన సమబుద్ధిచే అన్ని పనులూ చేస్తున్నావు కదా! నీవు ఆధివ్యాధులు లేకుండా ఉన్నావు కదా! సమాధిని అనుష్ఠిస్తున్నావా?

సురఘుడు - మహాత్మా! ఆత్మను ఎరుగని మూఢునికి, ఎన్నడూ సమాధి కలుగదు. ఆత్మ తత్త్వాన్ని తెలుసుకున్న వారు, ఈ జగత్తుకు సంబంధించిన పనులు చేస్తున్నా, ఆత్మయందే ఉనికిని పొందినవారై నందున ఎల్లప్పుడూ సమాధి స్థితి కలవారే అయి ఉంటారు.

పద్మాసనం వేసి కూర్చున్నా, ఏ ఆసనం వేసినా, చిత్తం విశ్రాంతిని పొందనివానికి సమాధి ఎట్లా కలుగుతుంది? ఆశలనే గడ్డిపోచలకు, తత్త్వజ్ఞానం అగ్ని లాంటిది. దానినే - ఆశలను తత్త్వజ్ఞానం చేత దగ్ధం చేయటాన్నే - సమాధి అంటారు. అంతే తప్ప ఏ పనీ చేయకుండా కూర్చోవటం సమాధి కాదు. సుస్థిరము, యదార్థ దృష్టియుక్తం అయిన పరమజ్ఞానాన్నే సమాధి అంటారు.

సంపూర్ణ జ్ఞానస్వరూపులైన సాధువులు, సుఖదుఃఖాది వికారాలచే విముక్తులై ఉండటం వల్ల, అంతటా సమదృష్టి కలవారై, సమాహిత చిత్తులై (సమాధి నిష్ఠులై) ఉంటారు.

పరిఘుడు - రాజా! నిశ్చయంగా నీవు జ్ఞానివై, బ్రహ్మ పదాన్ని పొందావు. నీవు నిర్మలుడవు, పూర్ణుడవు. అహంకారాదులు లేనివాడవు. ఆత్మ నిష్ఠుడవు. అంతటా చూడబడుతూ, అంతటనూ ప్రకాశిస్తున్నావు. ఈ ఆత్మానందంలో తృప్తి పొందితే, ఈ అంతర్దృష్టియే జీవన్ముక్తి అనిపించుకొంటుంది.

## 8. భాసవిలాసోపాఖ్యానము

(వెనుకటి ఉపాఖ్యానంలో చిత్త విశ్రాంతియే జీవన్ముక్తికి అవధి (హద్దు) అని చెప్పబడ్డది. ఆ చిత్త విశ్రాంతి లేకపోతే, అనేక విధాలైన అనర్థాలు, కష్టాలు కలుగుతాయని ఈ ఉపాఖ్యానంలో చెప్పదలచారు)

వసిష్ఠుడు శ్రీరామునితో ఇంకా యిట్లా అంటున్నాడు -

పూర్వం భాసుడు, విలాసుడు అనే ఇద్దరు స్నేహితులు సహ్యాపర్వత సానువు లందుండేవారు. వారిద్దరికీ ఒకప్పుడు సంవాదం జరిగింది. ఈ భాస విలాసుల తండ్రులు తాపసులు. ఇద్దరూ కూడా, అత్రిముని యొక్క ఆశ్రమంలో ఉండేవారు. వారిద్దరికీ భాసవిలాసులనే పుత్రులు జన్మించారు. వారిరువురూ ఏక మనస్కులై స్నేహభావంతో ఉండేవారు.

కొంత కాలానికి వారి తండ్రులు గతించారు. తమ తండ్రులకు ఔర్ధ్వ దైహిక క్రియలాచరించి, తాము ఆత్మ విచారణ చేయసాగారు. ఒకసారి వారిద్దరూ చాలాకాలానికి కలసికొని ఇట్లా ముచ్చటింపసాగారు.

విలాసుడు : మిత్రమా! భాసా! స్నేహితుడవైన నన్ను విడిచి ఇన్ని రోజులు ఎక్కడ ఉన్నావు? నీ తపస్సు ఫలించిందా? నీ బుద్ధి సంతాపరహితమైనదా? నీ విద్య ఫలించి ఆత్మజ్ఞానివైనావా? కుశలమా?

భాసుడు : మిత్రమా! స్వాగతం! నా అదృష్టవశమున కనిపించావు. సంసారంలో ఉన్న మనకు కుశలమెట్లా కలుగుతుంది? తెలుసుకొనదగిన బ్రహ్మవస్తువు తెలిసేటంత వరకు, చిత్తం క్షయమైపోయే దాకా, సంసారాన్ని తరించే వరకు కుశలమనేది ఉండదు. ఆశలు నిశ్శేషంగా పోవాలి. శాస్త్ర జన్యమైన పరోక్ష జ్ఞానం కలగాలి. పిమ్మట అపరోక్ష జ్ఞానం కలగాలి, అంతవరకు కుశలమనేది ఉండదు. ఆత్మలాభం కలుగకపోయినా, జ్ఞానమనే ఔషధం గనుక మనకు లభించకపోతే, సంసారమనే విషూచికా జాడ్యం మాటిమాటికీ పుడుతూనే ఉంటుంది.

ఇట్లా వారిద్దరూ తమలో తాము ముచ్చటించుకొంటూ క్రమంగా జ్ఞానాన్ని పొంది మోక్షాన్ని పొందారు.

# 9. వీతహవ్యోపాఖ్యానము

(చిత్త విశ్రాంతి పొందకపోతే అనేక ప్రయాసలకు లోనుకావలసి వస్తుందని వెనుకటి ఉపాఖ్యానంలో చెప్పారు. ఆ విధమైన చిత్తవిశ్రాంతి కోసం సంగాన్ని త్యజించాలనీ, ప్రాణనిరోధం చేయాలనీ, సమాధి అవసరమనీ ఈ ఇతిహాసంలో చెపుతున్నారు.)

ఇంకా వసిష్ఠుడీ విధంగా చెపుతున్నాడు -

రామచంద్రా! సంగమనేది చిత్తానికి బంధనం. అట్లా బంధింపబడి ఉన్న చిత్తం తరించాలంటే జ్ఞానాన్ని మించిన మార్గం వేరే లేదు. కర్మత్యాగం చేయనివాడూ, కర్మలందే ఆసక్తి కలవాడూ సంగము చేత బంధింపబడుతున్నాడు. సమస్త కర్మలను, కర్మఫలాలను, ఉపాసనా ఫలాలను, మనస్సు చేత పరిత్యజించటమే అసంగము. ఈ విధమైన సంగరాహిత్యం చేతనే కైవల్యం లభిస్తుంది.

ఈ జనసమూహము, మృతి చెంది, మళ్ళీ మళ్ళీ కృమికీటకాది యోనులందు పుడుతూ ఉండటమే 'సంగవిలాసము'. తరంగాలు సముద్రంలో పుడుతూ, లయమౌతూ ఉన్నట్లుగా, జీవజాలమంతా పుడుతూ లయమౌతూ ఉండటమే 'సంగవిలాసము'.

రామా! ఈ సంగమనేది 'వంధ్య' అనీ 'వంద్య' అనీ రెండు విధాలుగా ఉంటుంది. 'వంధ్య' అనే సంగము, మూఢులకు, 'వంద్య' అనే సంగము తత్త్వజ్ఞులకు ఉంటుంది.

ఆత్మస్వరూప జ్ఞానం లేనిదీ, దేహాది వస్తువుల వల్ల కలిగేదీ మళ్ళీ మళ్ళీ జనన మరణాదుల్ని కలిగించేదీ 'వంధ్య' అనే సంగము.

ఆత్మానాత్మ వివేకం చేత, ఆత్మ నిశ్చయం కలుగగా, ఆత్మరూపమైనదీ, జనన మరణ రహితమైనదీ 'వంద్య' అనే సంగము.

'వంధ్య' అనే సంగం కలవారు రౌరవము, అవీచి, కాలసూత్రము మొదలుగా గల నరకాలను పొందుతారు.

బ్రహ్మ విద్యా విషయమైన ప్రబోధం పొందినందున, జగత్తులో సంగం లేనివాడు ముక్తుడౌతాడు.

ఆత్మ నిష్ఠుడైన జీవుడు, లోక వ్యవహారం చేసినా చేయకపోయినా జీవన్ముక్తిని పొందినవాడే అవుతాడు.

చిత్తం దృశ్య సంబంధమైన వృత్తులు లేకుండా పోవటం వృత్తిలయం అవుతుంది. అట్లా వృత్తిలయం పొందినవారి యొక్క స్థితి, వాసనా రహితమై

ఉంటుంది. కాబట్టి జాగ్రత్తునందే సుషుప్తత్వము (నిద్రావస్థ) వంటిది అంటారు. ఈ విధమైన జాగ్రత్తునందే సుషుప్తత్వ స్థితి, అభ్యాసయోగం వల్ల పరిపక్వమైతే దానిని జాగ్రత్ స్వప్న సుషుప్తులనే మూడు అవస్థల కంటె విలక్షణము, అతీతము అయిన స్థితిని నాల్గవదైన 'తురీయము' అంటారు. జీవన్ముక్తుడు ఈ తురీయంలో స్థిరత్వాన్ని పొంది బ్రహ్మానందాన్ని అనుభవిస్తాడు. తురీయంలో మూడు అవస్థలకు సంబంధించిన స్మృతీ ఉండదు. శరీరం మాత్రం ఉంటుంది. ఆ శరీరం కూడా పోతే తురీయాతీత పదాన్ని పొందుతాడు. దానినే విదేహముక్తి అంటారు. (యదార్థానికి, తురీయానికి తురీయాతీతానికీ భేదం ఏమీ లేదు. సంగం లేదు కాబట్టి శరీరం ఉన్నా ఒకటే! లేకపోయినా ఒకటే! కాబట్టి కొందరు తురీయాతీత మనేది ఒకటి ఉన్నదని అంగీకరించరు.)

రామా! శరీరం ఉన్నప్పటికీ మందమారుతాలు పర్వతాన్ని ఛేదింపలేనట్లు, భోగవాసనలు ఆత్మ విచారం కలవాని మనస్సును కదిలింపలేవు. అనేక సరోవరాలలో ఉన్నప్పటికీ జలమనేది ఒకటే అయినట్లు వికల్ప బుద్ధులందున్న వస్తువు ఒకటే తప్ప, అనేకం కాదు అనే నిశ్చయం కలవాడే విముక్తుడు. రామా! వీతహవ్యుడనే మునీంద్రుడు మోక్షాన్ని పొందిన విధం నీకు చెపుతాను విను.

వింధ్య పర్వత ప్రాంతంలో వీతహవ్యుడనే ముని, చాలాకాలం పాటు కర్మాచరణ చేసి, ఆ క్రియా కాండము నుండి ఉపరతిని పొంది, కర్మలన్నింటినీ వదలివేసి, నిర్వికల్ప సమాధిని అభ్యసించటానికై ఒక పర్ణశాలలో ప్రవేశించాడు. పద్మాసనస్థుడై, బాహ్యాభ్యంతర విషయాన్నింటినీ పరిత్యజించి, మనస్సును స్థిరంగా ఉంచుకోవటం కోసం, తన చిత్తంలో ఇట్లా విచారించసాగాడు -

నా మనస్సు స్థిరంగా ఉండక ఎందుకిట్లా చలిస్తోంది? ఒక పదార్థం మీద నుండి వేరొక దాని మీదకు ఎందుకు తిరుగుతోంది? ఓ చిత్తమా! అనవసరంగా చింతిస్తూ ఈ జగత్తులో విహరింపకు! నీకును చిత్తుకును చాలా భేదం ఉంది. నీవు జడానివి. ఓ చిత్తమా! నీవు అహంకారం వల్ల 'నేను జీవుడను' అని అనుకొనుచున్నావు. ఓ ఇంద్రియములారా? ఎందుకిట్లా వ్యర్థంగా వ్యాకులం చెందుతున్నారు?

ఇట్లా విచారణ చేస్తూ, చిత్తాన్ని బలవంతంగా నియమించి, ఇంద్రియాలను నిశ్చలంగావించి, ప్రాణాలను కూడా నియమించాడు. చిత్తంలో లిఖింపబడ్డ ప్రతిమలాగా ఉన్నాడు. ఇట్లా మూడు వందల సంవత్సరాల పాటు ధ్యాననిష్ఠుడై ఉన్నాడు. ఆతని శరీరం వర్షాల వల్ల కొట్టుకొని వచ్చిన బురద చేత పాతుకొని

పోయింది. ఆతని శరీరం కదలటం లేదు. శరీరంలో తెలివి మాత్రం ఉంది. నవరంధ్రాలు భూమి చేత కప్పబడి పూడిపోయాయి. ప్రాణాలు మాత్రం నియమింపబడే ఉన్నాయి. చలించటం లేదు.

మూడు వందల సంవత్సరాలు గడచిన పిమ్మట ఆతని జీవ సంపత్తు (చిత్) ప్రారబ్ధ శేషాన్ని అనుభవించటానికై, హృదయంలో ఉన్మేష క్రమం చేత స్థూలత్వాన్ని పొంది మనస్సు రూపంలో కల్పన చేతనే ఈ రకరకాల భావాలను హృదయంలోనే అనుభవించింది -

వంద సంవత్సరాల పాటు ఆ ముని యొక్క చిత్తం, కైలాస వనంలోని కదంబ వృక్షం క్రింద జీవన్ముక్తుడైన ముని రూపంలో ఉంది. తరువాత నూరేండ్ల పాటు విద్యాధరత్వాన్ని పొందింది. పిమ్మట అయిదు యుగాల పాటు ఇంద్రత్వాన్నీ, ఒక కల్పం పాటు రుద్ర గణత్వాన్నీ పొంది, ఇట్లా అతడు (వీతహవ్యుడు) స్వప్నం లాగానే సర్వమూ అనుభవించాడు. పిమ్మట ఒకనాడు ఆతని చిత్తం, పూర్వరూపాలను చూడాలని అనుకొన్నది. నశించిపోయినట్టి వెనుకటి శరీరాలను, ఇంకా నశించి పోకుండా ఉన్నట్టి మరికొన్ని శరీరాలను చూచాడు. ఇంకా నశించకుండా ఉన్న వీతహవ్య నామంతో ఉన్న శరీరాన్ని చూడాలని అనుకొన్నాడు. దానిని మట్టిలో నుండి లేవనెత్తటానికి పూనుకొని యిట్లా ఆలోచించాడు -

''ఈ శరీరం మట్టిచేత కప్పబడి ఉంది. కాబట్టి దీనిని లేవనెత్తటానికై సూర్యునిలో నేను ప్రవేశిస్తాను. సూర్యుని పారిపార్శ్వకుడైన పింగళకుడనే వాడు నా దేహాన్ని పైకి తీస్తాడు'' అని తలచి లింగదేహంతో సూర్య మండలంలో ప్రవేశించాడు. సూర్యుని ఆజ్ఞ చొప్పున పింగళకుడు వీతహవ్యుని వెంట వెళ్లి భూమిలో క్రుంగియున్న శరీరాన్ని లేవనెత్తాడు. అప్పుడాముని ఆ శరీరంలో ప్రవేశించి, సంతోషంతో సమీపంలో నున్న కొలనులో స్నానం చేసి పూర్వం లాగానే ప్రకాశించాడు.

అతడు మైత్రి, సమత, శక్తి, సద్బుద్ధి, ముదిత, కరుణ, కాంతి అనే గుణాలు కలవాడై, సమస్త సంగాలు వదలిపెట్టి, నిర్వికల్ప చిత్తంతో వింధ్య నదీ తీరంలో ఆత్మయందే ఆనందిస్తూ చాలా కాలం గడిపాడు.

పూర్వాపరలోకాలను చూచిన ఆ వీతహవ్యుడు, తన మనస్సును శాంతింప

జేయటానికై ఇట్లా ఆలోచించాడు - ''ఇంద్రియాలను నేను పూర్వమే పూర్తిగా పరిహరించాను. ఇప్పుడు మళ్ళీ చింతించటం వల్ల ప్రయోజనం ఏముంది? ఉన్నది, లేదు, అనే భేద దృష్టిని ఛేదించి మిగిలి ఉండే చిన్మాత్రంలోనే అను సంధానాన్ని పొంది స్థిరంగా ఉంటాను. ప్రబుద్ధుడనైనా (ఇంద్రియాల చేత విషయాలను పొందుతున్నా) సుషుప్తిలో హర్షవిషాదరహితుడనై ఉన్నా, స్వస్వరూపంలో ఎల్లప్పుడూ మేల్కొని ఉండే చిన్మాత్రాన్ని అవలంబించి నియమిత చిత్తవృత్తికలవాడనై ఉంటాను. ఇట్లా ఆతని చిత్తం ఇచ్ఛానిచ్ఛలు లేని (నిర్వికల్పమైనది) స్థితిని పొందింది. అతడు విదేహ కైవల్యాన్ని పొందాలని తలచాడు.

ఓ రాగ భోగములారా! మీకు నమస్కారము. ఓ సంసార దుఃఖమా నీకు నమస్కారము. ఓ విషయ సుఖములారా! మీకు నమస్కారము. స్నేహితుని వంటి ఓ ధర్మకార్యమా! నీకు నమస్కారము. నేను నిన్ను విడిచిపోతూ ఉన్నందున ఒంటరినై, కృశించి, దుఃఖిస్తున్న తల్లిలాంటి దానవైన ఓ ఆశా! నమస్కారము. ఓ కామమా! ఓ సుకృతమా! ఓ రాగమా! మీరంతా నాకు సహజసిద్ధులు, మిత్రులు, మీ అందరికీ నమస్కారము. ఇట్లా అతడు సమస్త విషయ జాలాన్నీ వదలివేశాడు.

పిమ్మట అతడు తమము గాని ప్రకాశము గాని ఏమీ లేని స్థితి పొందాడు. అంటే, త్రిగుణాతీతుడైనాడు. ఇట్లా వీతహవ్యుడు త్రిగుణాతీత స్థితిని పొంది మనస్సును గడ్డిపోచలాగా వదలివేసి, స్వరూప జ్ఞానాన్ని పొందాడు. పిమ్మట అప్పుడే పుట్టిన శిశువు యొక్క జ్ఞానం లాగా ఉన్న ఆ స్వరూప జ్ఞానాన్ని కూడా వదలివేశాడు - పశ్యంతి అనే పదాన్ని పొందాడు.

పిమ్మట ఆ పశ్యంతిని మించిన నిర్వికల్ప సమాధిని పొంది, పర్వతంలాగా స్థిరుడైనాడు. తురీయాన్ని పొందాడు. స్వరూపం కంటె ఇతరమైన ఆనందము లేనందున నిరానందుడు, సద్రూపుడైనందున సత్తు, ఏ వ్యవహారమూ లేనందున అసద్రూపుడు, అయినాడు. ఇది కాదు, ఇది కాదు, అని సర్వాన్నీ నిషేధించగా మిగిలిన దేదో ఆ రూపం కలవాడైనాడు. ఇట్లా ఆతడు జనన మరణ వివర్జితము, ఆద్యంత రహితము, ఆకాశం కంటె నిర్మలమైన రూపం కలిగి ఈశ్వరుడు అయినాడు -విదేహ ముక్త స్థితిని పొందినాడు. ఇట్లా ఆ వీతహవ్యుడు ముప్పది వేల సంవత్సరములు విహరించి పునర్జన్మ రాహిత్యాన్ని పొందాడు.

## 10. ఆకాశ గత్యభావ నిరూపణము

(పూర్వ ప్రకరణంలో చిత్త విశ్రాంతి లభించటం కోసం, సంగత్యాగము, ప్రాణ నిరోధము, సమాధి అభ్యాసం అనే సాధనాలను గూర్చి చెప్పారు. ఈ సర్గలో జీవన్ముక్తునికి ఆకాశ గతి లేదనే విషయాన్ని నిరూపించి చెపుతూ చిత్తానికి ఉపశాంతి లభించటాన్ని నిరూపించటానికి పూనుకుంటున్నారు)

శ్రీరాముడు వసిష్ఠుని ఈ విధంగా అడిగాడు – ఓ మునీంద్రా! జీవన్ముక్తులలో ఆకాశ గమనాది శక్తులు ఎందుకు కనిపించవు?

వసిష్ఠుడిట్లా సమాధానం చెపుతున్నాడు –

**అనాత్మ విదముక్తోపి నభోవిహరణాదికం**
**ద్రవ్య మంత్ర క్రియాకాలశక్త్యాప్నోత్యేవ రాఘవ** 1
**నాత్మజ్ఞ స్యైష విషయ ఆత్మజ్ఞోహ్యాత్మ దృక్స్వయం**
**ఆత్మ నాత్మని సంతృప్తో నా విద్యా మనుధావతి.** 2

ఆత్మజ్ఞానం లేనివాడు జీవన్ముక్తుడు కానేరడు. అయినా, రసాయనాది ద్రవ్యాల చేతను, త్రైపురాది మంత్రాల చేతను, దృఢమైన అభ్యాసం చిరకాలం చేయటం చేతను, ఆకాశ గమనాది సిద్ధులను పొందుతాడు. కాని, ఆత్మజ్ఞునికి ఆకాశ గమనం మొదలైన సిద్ధుల మీదకు బుద్ధిపోదు. ఎందుచేతనంటే, అతడు ఎల్లప్పుడు ఆత్మజ్ఞానాను సంధానంతో, ఆత్మానందంతో తృప్తుడై ఉంటాడు. కాబట్టి అవిద్యామూలమైన ఆకాశ గమనాది సిద్ధుల్ని అపేక్షింపడు.

**ద్రవ్య మంత్ర క్రియా కాల శక్తయ స్సాధు సిద్ధిదాః**
**పరమాత్మ పద ప్రాప్తౌ నోప కుర్వంతి కాశ్చన.** 3
**సర్వేచ్ఛాజాల సంశాంతా వాత్మలా భోదయో హియః**
**స కథం సిద్ధి వాంఛాయాం మగ్న చిత్తే న లభ్యతే.** 4

ద్రవ్యము, మంత్రము, క్రియ – తంత్రము, కాలము మొదలైన వాటి శక్తులు ప్రపంచానికి సంబంధించిన పనులను సాధించటానికి సాధనాలు అవుతాయి. పరమాత్మ పదాన్ని పొందటానికి ఇవి సాధనాలు కావు. సమస్తమైన కోరికలు శాంతించగా, ఆత్మ లాభాన్ని పొందిన వానిని ఆకాశ గమనాది సిద్ధుల మీద కోరిక ఎందుకు ఉంటుంది?

శ్రీరాముడు ఇట్లా అడిగాడు - ''ఓ మునీంద్రా! యోగనిష్ఠులు చిరకాలం

ఎందుచేత జీవిస్తున్నారు?'' వసిష్ఠుడు అంటున్నాడు - రామా! ప్రాణాది వాయువుల చలనం వల్ల దేహాలు చలిస్తున్నాయి. యోగనిష్ఠులు ప్రాణాలను నిరోధించే (ప్రాణాయామం) అభ్యాసం ఉన్నవారు కాబట్టి యోగులు నాశమొందరు - చాల కాలం ఉంటారు. యోగికి మనస్సు యొక్క చలనం గానీ, ప్రాణవాయువు చలనం గానీ, బాహ్యాభ్యంతర చలనాలు గానీ ఉండవు. అందుచేత అట్టివానికి జరామరణాలు దూరంగా ఉంటాయి. (అసలు ఉండవని భావం కాదు.) బాహ్యాభ్యంతర చలనాలు లేనందు వల్ల, శరీరధాతువులు ఒకే విధంగా ఉంటాయి. అరుగుదల, క్షీణత్వం ఉండవు (తక్కువగా ఉంటాయి.)

సర్వజ్ఞులు, వైరాగ్య సంపన్నులు, మహాబుద్ధులు, ప్రాణనిరోధం వల్ల సుషుమ్నాముఖం భిన్నం కాగా, బ్రహ్మ విష్ణు రుద్ర గ్రంథులు కలవారై ఉంటారు. అట్టి యోగనిష్ఠులు శరీరం ధరించాలన్నా, శరీరం విడువాలన్నా స్వతంత్రులై ఉంటారు.

రాముడిట్లా ప్రశ్నించాడు – ''మునీంద్రా! యోగులకు వివేకోదయం వల్ల చిత్త స్వరూపం లయమై పోతుంది గదా! అటువంటప్పుడు, మైత్రి, ముదిత, కరుణ మొదలైన గుణాలు ఎక్కడ పుడతాయి? అంటే, ఆత్మ నిర్గుణం కదా! చిత్తం లయమైపోయినప్పుడు, ఇక ఈ గుణాలకు అధిష్ఠానం ఏది?'' అని.

వసిష్ఠుడన్నాడు – ''రామా! చిత్తనాశనం రెండు విధాలుగా ఉంటుంది. అరూప నాశనము, సరూప నాశనము అని. మనస్సు ప్రాతిభాసికంగా ఉండటం సరూపం. మనస్సు ప్రాతి భాస మాత్రంగా నైనా లేకపోవటం అరూప నాశము అవుతుంది. జీవన్ముక్తుని యందు సరూపనాశము, విదేహ ముక్తుని యందు అరూపంగానూ ఉంటుంది.

చిత్తం ఉండటం దుఃఖం కోసం. చిత్తం నశించటం సుఖం కోసం. కాబట్టి చిత్తం యొక్క ఉనికిని క్షయమొనర్చుతూ చిత్తాన్ని నశింపజేయాలి. తత్త్వాన్ని తెలుసుకోకుండా ప్రకృతి సంబంధమైన సత్త్వాది గుణాలను నావి అని తలచే చిత్తం, దుఃఖ భాజనమౌతోంది. అట్టి దానినే మనం జీవుడని అంటున్నాం.

సుఖదుఃఖాలు ఏ జ్ఞానిని చలింపజేయలేవో, విపత్తులు, దారిద్ర్యం, హర్షం, మదం, ఇత్యాదులు ఎవనిని చలింపజేయజాలవో, ఆతని చిత్తం నశించిందన్నమాట.

మూఢత్వం అంటే మనస్సే! చిత్తనాశం అంటే జ్ఞానమే! మనస్సులో

త్రిగుణాలకు సంబంధించిన మూఢత్వం నశించిందంటే, జ్ఞాని యొక్క మనస్సు శుద్ధ సత్త్వాత్మక మైనదన్న మాట. ఆ శుద్ధ సత్త్వం వల్లనే జీవన్ముక్తుని మనస్సు మైత్రి, కరుణ, మొదలైన గుణాలతో కూడినదై సద్వాసనలతో కూడి, పునర్జన్మ రహితమౌతోంది.

రామా! సరూప మనో నాశనమనే దాని యందు – జీవన్ముక్తునికి కలిగే మనోనాశనంలో – వసంతర్తువులో పూలగుత్తులు ప్రకాశించినట్లు మైత్రి మొదలైన గుణాలు ప్రకాశిస్తాయి. అరూపమైన మనోనాశనము అనేది నిష్కల రూపం కాబట్టి విదేహముక్తుని యందే ఉంటుంది.

శ్రీరాముడు మళ్ళీ ఇట్లా అడిగాడు – ''ఓ మునీంద్రా! బ్రహ్మాండమైన ఆకారం గల ఈ సంసారం అనే ద్రాక్ష తీగకు బీజం (జనన కారణం) ఏది? ఆ బీజానికి బీజం ఏది? దాని బీజం ఏది? అట్టి దానికి బీజం ఏది? ఆ మూల బీజం ఏది? అట్టి దానికి బీజం ఏది? ఆ మూల బీజం ఏది?''

వసిష్ఠుడిట్లా అన్నాడు – ''రామచంద్రా! అంతస్సు – లోనలీనమై యుండి పొటమరించిన (సమారంభమైన) పుణ్య పాపాలనే అంకురాలు కల శరీరమే సంసారమనే తీగకు బీజం అని తెలుసుకో! (శరీరం ఉంటే సంసారం ఉంటుంది. శరీరం లేకపోతే సంసారం ఉండదు. కాబట్టి శరీరమే సంసారానికి బీజం)

ఈ శరీరానికి బీజం ఏది? అంటే, జనన మరణాది దశలకు ఆశ్రయము, దుఃఖాలనే రత్నాలకు సంపుటము, ఆశకు వశమైనదీ అయిన చిత్తమే ఈ శరీర బీజం. (సదసద్రూపము, అవయవ సమష్టి రూపమూ అయిన శరీరం చిత్తం వల్లనే కలుగుతోంది) ఈ చిత్తం అనే వృక్షానికి వృత్తులనేవి శాఖలు. చిత్తమనే ఈ వృక్షానికి రెండు బీజాలు ఉన్నాయి. ప్రాణాదివాయువుల చలనం ఒకటి, దృఢమైన వాసన రెండవది.

ప్రాణవాయువు హృదయంలో మనస్సును వహించే నాడులందు సంచరించేటప్పుడు వృత్తి జ్ఞాన రూపమైన చిత్తం కలుగుతోంది. కాబట్టి ప్రాణం చిత్తానికి బీజం అనవచ్చు. ప్రాణవాయువు యొక్క చలనం చేత వృత్తి జ్ఞానం సర్వగతమౌతూ – సర్వేంద్రియాలనూ పొందుతూ ఉంటుంది. ప్రాణ నిరోధం చేత వృత్తి జ్ఞానం నిరోధింపబడితే మోక్షం సిద్ధిస్తుంది. చిత్త విక్షోభం వల్ల రాగము, దాని వల్ల విషయభోగ వాంఛ కలిగి చిత్తానికి దుఃఖం కలుగుతుంది. చిత్తం బాహ్యా

విషయాల యందు సుషుప్తిని పొంది, ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నిస్తే బ్రహ్మపదాన్ని పొందుతుంది.

యోగనిష్ఠులు చిత్త శాంతి కోసం ప్రాణాయామం చేతను ధ్యానం చేతను, యోగశాస్త్రంలో చెప్పబడిన మహాముద్రాదుల చేతను ప్రాణాలను నిరోధిస్తున్నారు. ప్రాణ నిరోధం చిత్తానికి స్వాస్థ్యం కలిగిస్తుంది.

జ్ఞానులు అనుభవించి చెప్పినట్టి, రెండవదైనట్టి వాసనాజన్యమైన చిత్తోత్పత్తిని గూర్చి చెపుతున్నాను. విను –

వాసన అంటే, దృఢమైన భావనతో కార్యకారణాలను గూర్చి ఆలోచించకుండానే పదార్థాన్ని శీఘ్రంగా గ్రహించటం. దీనినే సంస్కారమనీ అంటారు. ఉదా. అప్పుడే పుట్టిన శిశువుకు గానీ, నిద్ర నుండి మేల్కొన్న వానికి గానీ, వెంటనే కార్య ప్రవృత్తి హేతువైన దానిని వాసన అనవచ్చు. పురుషుడు దృఢమైన అభ్యాసం వల్ల చిత్తంతో ఏ వస్తువును భావిస్తూ, ఇతరమైన స్మృతుల్ని మరచిపోతున్నాడో, తాను ఆ వస్తువే అవుతాడు. వాసన చేత, తాను భావించిన వస్తువునే సద్వస్తువు అని మోహాన్ని పొందుతాడు. వస్తువు యొక్క నిజరూపాన్ని గ్రహించలేడు.

ఇదంతా విని శ్రీరాముడిట్లా అడిగాడు – '' మునీంద్రా! సంసార బీజాల్ని గూర్చి చెప్పారు. మరి, ఇన్నింటికీ మూలమైన ఆత్మపదము ఏ మార్గం వల్ల శీఘ్రంగా పొందటానికి వీలౌతుందో ఆ పద్ధతి చెప్పండి'' అని.

వసిష్ఠుడీ విధంగా చెప్పాడు – ''రామా! నీవు వాసనాత్యాగం విషయమై యత్నం చేస్తే, ఆధి వ్యాధులన్నీ క్షణంలో పోతాయి. నిజానికి, వాసనాత్యాగం చాలా కష్టమైనదే! మనస్సు లయం చెందే వరకు వాసనాక్షయం కాదు. వాసనాక్షయం జరిగితేనే గాని చిత్తం శమించదు.

తత్త్వజ్ఞానం కలిగేటంత వరకు వాసనాక్షయం కాదు. తత్త్వజ్ఞానం, మనోనాశము, వాసనాక్షయము, ఇవి మూడూ ఒక దాని కొకటి కారణములై దుస్సాధ్యములై ఉన్నాయి. కాబట్టి, పురుషప్రయత్నం చేత వివేకం వల్ల, భోగవాంఛను దూరం చేయాలి. తత్త్వజ్ఞానాన్ని మనోనాశనాన్ని, వాసనాక్షయాన్నీ సాధించాలి. ఇవే మోక్షఫలాన్ని యిస్తాయి. ఈ మూడింటిలో ఏ ఒక్కదానినో సేవించినందు వలన ప్రయోజనం ఉండదు.

సంగమే పదార్థములకు కారణము. సంగమే సంసారానికి మూలం. సంగమే ఆశలకు మూలం. సంగమే ఆపదలకు బీజం. కాబట్టి, రామా! సంగత్యాగాన్నే మోక్షం అన్నారు. సంగరాహిత్యం వల్లనే జన్మరాహిత్యం కలుగుతుంది. కాబట్టి, నీవు సంగాన్ని వదలిపెట్టు. సంగాన్ని వదలిపెడితే జీవన్ముక్తుడవౌతావు. (మోక్షానికీ, జన్మ రాహిత్యానికీ స్వల్ప భేదం ఉంది. ప్రస్తుతం ఉన్న దేహాదులతోడి సంబంధం నివృత్తి కావటాన్ని మోక్షం అంటారు. ఇక ముందు కలుగబోయే దేహాల తోడి సంబంధ నివృత్తి జన్మరాహిత్యం అవుతుంది).

ఇదంతా విని రాముడిట్లా అడిగాడు – ''ఓ మునిచంద్రమా! సంగము అంటే ఏమిటి చెప్పండి'' అని

వసిష్ఠుడిట్లా అన్నాడు – రామా! ఇష్టములైనట్టి, అయిష్టములైనట్టి పదార్థముల యొక్క సంయోగ వియోగములందు (పొందటం, పొందక పోవటం) సుఖదుఃఖాది వికారాలను కలిగించే మలిన వాసననే సంగము అంటారు.

జీవన్ముక్తులకు పునర్జన్మ రాహిత్యాన్ని కలిగించేదీ, హర్ష విషాదాదులు లేనిదీ శుద్ధవాసన అవుతుంది.

దీనులు, మూఢచిత్తులు అయిన వారికుండే సంసార మూలమైన వాసనను 'సంగము' అంటారు. రామా! నీవు హర్ష విషాద రహితుడవైతే, రాగ భయక్రోధాదులు లేనివాడవైతే అసంగుడవు అవుతావు. సుఖాలకు ఉబ్బిపోకూడదు. దుఃఖాలకు క్రుంగిపోకూడదు. ఆశచేత వివశత్వాన్ని పొందకూడదు. అప్పుడు నీవు అసంగుడవౌతావు. సంపదను, ఆపదను, సమభావంతో చూస్తూ ప్రాప్తమైన దానిని అనుసరిస్తూ ఉంటే అసంగుడవౌతావు. నీవు సమస్త వస్తు సమూహమునందూ సమభావాన్ని కలిగి, ధీరుడవై ప్రకృతమైన దానిని ఆచరిస్తూ సంగరహితుడవై సుఖంగా ఉండు.

యోగవాసిష్ఠంలో ఉపశమ ప్రకరణం సమాప్తం

# నిర్వాణ ప్రకరణము

## భుశుండోపాఖ్యానము

ఈ ప్రకరణంలో 15 ఉపాఖ్యానాలున్నాయి. అందు మొదటిది భుశుండోపాఖ్యానం. ఇందులో ప్రాణవృత్తిని అనుసంధించినందు వల్ల చిత్తవిశ్రాంతి కలుగుతుందనీ, తద్వారా మోక్షం కలుగుతుందనీ, నిరూపింపదలచారు.

శ్రీరాముడు వసిష్ఠుని ఈ విధంగా అడిగాడు – ''మునీంద్రా! చక్కటి జ్ఞానం చేత వాసన లయం కాగా, జీవన్ముక్త పదంలో విశ్రాంతి పొందాను. మరి, ప్రాణచలనాన్ని నిరోధించటం చేత వాసన లయం కాగా జీవన్ముక్త పదం ఎట్లా లభిస్తుందో చెప్పండి.'' అని.

వసిష్ఠుడీవిధంగా చెప్పాడు –

**సంసారోత్తరణే యుక్తి ర్యోగ శబ్దేన కథ్యతే**
**ఆత్మజ్ఞాన ప్రకారోస్య ప్రాణానాం సంయమస్తథా** 1
**ప్రకారౌ ద్వావపి ప్రోక్తౌ యోగశబ్దేన యద్యపి**
**తథాపి రూఢ మాయాతః ప్రాణయుక్తౌ వశౌ భృశం** 2
**అసాధ్యః కస్య చిద్యోగః కస్యచిద్ జ్ఞాన నిశ్చయః**
**ప్రకారౌ ద్వౌ తతో దేవో జగాద పరమశ్శివః** 3

ఓ రామచంద్రా! సంసారాన్ని దాటే విషయమై చెప్పబడే ఉపాయాన్ని యోగం అంటారు- యోగ శబ్దంలో సూచిస్తారు. అంటే, ఆత్మజ్ఞాన స్వరూపము, ప్రాణాయామ రూపమూ అయిన రెండు ఉపాయాలకూ యోగశబ్దాన్ని వాడుతున్నారు. అయినా యోగమనే శబ్దం ప్రాణాయామ మందే రూఢమైంది. ఒకనికి ప్రాణాయామ పూర్వకమైన యోగం అసాధ్యం కావచ్చు. వేరొకనికి జ్ఞాన మార్గం అసాధ్యం కావచ్చు. అందుకే పరమేశ్వరుడు రెండు మార్గాలనూ చెప్పాడు.

ఇంతవరకు నీకు జ్ఞాన మార్గాన్ని చెప్పాను. ఇక యోగమార్గాన్ని చెపుతాను. ఈ సందర్భంలోనే ఒక ఉపాఖ్యానాన్ని చెపుతాను.

ఒకసారి నేను స్వర్గంలో ఇంద్రుని ఆస్థానంలో ఉండగా నారదాదుల వల్ల చిరకాల జీవులైన వారి చరిత్రలను విన్నాను. ఆ సందర్భంలో శాతాతపుడనే ఒక మునీంద్రుడు చిరకాల జీవుల్ని ప్రస్తుతిస్తూ ఇట్లా అన్నాడు.

మేరు పర్వతం మీద కల్పవృక్షం ఒకటి ఉంది. ఆ వృక్షపు తొఱ్ఱలో వైరాగ్య సంపన్నుడు, భుశుండుడనే పేరు గల వాయసశ్రేష్ఠుడు (కాకి) ఉన్నాడు. ఈ

సృష్టిలో ఆ భుశుండుని లాగా చిరకాలం నుండి జీవిస్తున్న వాడు ఎవడూ లేడు. అతడు చిరంజీవి, రోగరహితుడు, జ్ఞాని, శాంతచిత్తుడు, కాలజ్ఞుడు.

దేవసభలో నున్న మునీంద్రులంతా ఆ భుశుండుని వృత్తాంతాన్ని చెప్పమని అడుగగా, ఆ శాతాతపుడు ఆతని యదార్థ వృత్తాంతాన్ని పూర్తిగా చెప్పాడు.

వసిష్ఠుడంటున్నాడు – రామా! నేనా వృత్తాంతాన్ని దేవసభలో విని, ఆ భుశుండుని చూడాలనే వేడుకతో బయలు దేరాను. ఆతడున్న వృక్షం వద్దకు వెళ్ళాను. ఆతనిని వెదకుతూ ఆ వృక్షం మీది గూళ్ళలో, తొఱ్ఱలలో కొన్ని పక్షుల్ని చూచాను – హంసలు, కోయిలలు, నెమళ్ళు, వాయసములు అనేక రకాల పక్షుల్ని చూచాను.

వాటి మధ్యలో కాంతిమంతుడు, పరిపూర్ణ చిత్తుడు, ఉన్నతాకారం కలవాడు, మౌని, ప్రాణచలనాన్ని నిరోధించినందున అంతర్ముఖుడై యున్నవాడు, ప్రసన్న గంభీరమనస్కుడైన భుశుండుని చూచాను. అతడును నన్ను చూచి, నేను చెప్పకుండానే సమస్తమూ గ్రహించి, నాకు అర్ఘ్యపాద్యాదులిచ్చి ఇట్లా అన్నాడు – "వసిష్ఠ మునీంద్రా! చాలాకాలానికి అనుగ్రహించారు. నాకు సంతోషమైనది. చిరకాల జీవులకు సంబంధించిన ప్రస్తావన రాగా, మీరిటకు వచ్చారు. మీరు వచ్చిన కారణం తెలిసినా, మీ మాటలు విందామని అడుగుతున్నాను. చెప్పండి." అని.

నేనిట్లా అన్నాను – "ఓ పక్షి రాజా! నీవు చెప్పినది నిజమే! నా సంశయాలను పోగొట్టు. తత్త్వజ్ఞుడవైన నీవు ఏ కులంలో పుట్టావు? నీ వయస్సు ఎంత? పూర్వకాల వృత్తాంతాలు నీకు జ్ఞప్తియందున్నాయా? యిక్కడ ఎందు చేత నివాసం ఏర్పరచుకున్నావు?" అని

రామా! భుశుండుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు – వసిష్ఠా! దేవదేవుడైన హరునికి క్రీడాసహాయులై ప్రమధులు, అనేక ఆకృతులు కలవారు ఉన్నారు. ప్రమధుల్లాగానే మాతృకలు, కూడా పరివారం లాగా ఆ రుద్రుని వద్ద ఉంటూ నృత్యం చేస్తూ ఉంటారు. వారంతా పర్వత సానువుల్లోను, ఆకాశంలోను, లోకాంతరాల్లోను, శ్మశానాల్లోను, ప్రాణుల శరీరాల్లోనూ ఉంటూ ఉంటారు. జయ, విజయ, జయంతి, అపరాజిత, సిద్ధ, రక్త, అలంబస, ఉత్పల అనే వారు అష్ట మాతృకలు; మిగతా వారికి వీరు నాయికలు. ఇతర మాతృకలందరూ ఈ ఎనిమిది మందిలో ఒక్కొక్కరిని ఆశ్రయించి ఉంటారు.

అష్టమాతృకల్లో 'అలంబస' అనే మాతృకకు, (వైష్ణవీ శక్తికి గరుడుని లాగా)

చండుడనే వాయసం (కాకి) వాహనంగా ఉంది. అష్టైశ్వర్యయుక్తలైన ఆ మాతృకలు, ఒకప్పుడేదో ఉత్సవం చేస్తూ, నాట్యం చేస్తూ నవ్వుతూ, పానం చేస్తూ, గానం చేస్తూ ఉన్నారు. వారి వాహనాలు కూడా మద్యం సేవించి నాట్యం చేస్తున్నాయి. ఆ ఉత్సవంలో సరస్వతీ దేవి (బ్రాహ్మి) యొక్క వాహనాలైన హంసాంగనలు, అలంబుస యొక్క వాహనమైన చండమనే పేరు గల వాయసము, రాగినమైకం చేత నాట్యం చేస్తూ ఉండగా ఆ హంసాంగనలు చండాఖ్యమనే కాకంతో కలసి క్రీడించినాయి. అంతట, ఆ హంసలు గర్భం ధరించినాయి.

ఓ మునీంద్రా! ఆ హంసాంగనలు జరిగిన విషయాన్ని బ్రాహ్మీ దేవికి చెప్పినాయి. బ్రహ్మీదేవి గర్భవతులైన ఆ హంసలను వాహన కృత్యంబు నుండి స్వేచ్ఛ నిచ్చి పంపింది. కొన్నాళ్ళకు ఆ హంసలు ఇరువది యొక్క మంది పుత్రులను మమ్మ కన్నవి. మేము సరస్వతిని ఆరాధింపగా, ఆమె సమాధి నుండి లేచి మమ్మ అనుగ్రహించింది. మేము జీవన్ముక్తులమై యిక్కడ ఉన్నాము.

మేము ధ్యాన నిష్ఠలో ఉందామని సంకల్పించుకొని, తండ్రియైన చండునికి, అలంబుసకు నమస్కరించి, వారి అనుగ్రహంతో ఇట్లా ఉన్నాం. మేము అడుగగా, మా తండ్రి, ఈ కల్ప వృక్షాన్ని మాకు ఆవాసంగా అనుగ్రహించాడు. ఇక్కడ సుఖంగా ఉన్నాము. నేడు పరమాత్మ తత్వాన్ని తెలుసుకొన్న మిమ్మ చూచి ధన్యులమైనాము. మా జన్మము సఫలమైనది.

ఇది విని వసిష్ఠుడు ఇట్లా అడిగాడు - ''ఓ పక్షీంద్రా! నీ తమ్ములేమైనారు? నీ వొక్కడివే ఉన్నావేమి?'' అని.

భుసుండీ విధంగా చెప్పాడు - ఓ మునీంద్రా! మేమందరము ఇక్కడ ఉంటూ ఉండగా అనేక కల్పాలు గడచాయి. నా తమ్ములు ఇంత కాలానికి శరీరాలను తృణాల్లాగా వదలి శివపదము నందు ఐక్యాన్ని పొందారు. ఎంతటి వారైనా, అంతా కాలం చేత భక్షింపబడుతూనే ఉన్నారు. నేను మాత్రం కల్పాంతంలో జగత్తు యొక్క వ్యవహారమంతా శాంతించేటప్పుడు కృతఘ్నుడైన స్నేహితుని వదలివేసినట్లుగా ఈ గూటిని విడచిపెట్టిపోతున్నాను. అప్పుడు నేను, నిశ్చలములైన శరీరావయవాలు కలవాడనై, వాసనా రహితుడనై జీవన్ముక్తుని లాగా, ఆకాశంలో ఉంటున్నాను.

కల్పాంతంలో ద్వాదశాదిత్యులు ఒక్కసారిగా ఉదయించి, ఎండకాచేటప్పుడు, నేను వరుణ సంబంధమైన భావనను బంధించి (వరుణ భావనచేత సూర్యతాపం

తగులకుండా) నిశ్చల ధ్యానమగ్నుడనై ఉంటాను. ప్రళయవాయువులు వీచేటప్పుడు 'నేను పర్వతాన్ని' అనే భావన నిశ్చలం చేసి చలించకుండా ఉంటాను. మేరువు మొదలుగా జగత్తంతా ఒకే సముద్రంలాగా అయిపోయేటప్పుడు నేను వాయురూపాన్ని భావనలో నిశ్చలం చేసి ఆకాశంలో ఉంటాను. మునీంద్రా! ప్రళయ కాలంలో, బ్రహ్మాండానికి బయట ఉండే పృథివ్యాది తత్త్వాలన్నింటికీ చివరిదైన ఆత్మతత్త్వంలో సమాధి నిష్ఠుడనై ఉంటాను. నా సంకల్ప బలం చేత ఈ గిరి శిఖరం మీది ఈ వృక్షం ఇట్లాగే ఉంటుంది.

ఇది విని వసిష్ఠుడు ఇట్లా అడిగాడు - "ఓ పక్షీంద్రా! ఇటువంటి ధారణ చేత నీవు బాధ లేకుండా ఉన్నట్లుగా, ఇతర యోగులు ఎందు చేత ఉండలేక పోతున్నారు?"

భుసుండు డిట్లా అన్నాడు - "మునీంద్రా! ఇది పరమేశ్వరుని ఏర్పాటు దీనిని ఎవరూ దాటలేరు. నేను ఇట్లా, వారు అట్లా, ఉండవలసి రావటం స్వభావం యొక్క నిశ్చయం.

వసిష్ఠుడిది విని ఇట్లా అడిగాడు - "పక్షీంద్రా! నీవు తత్త్వజ్ఞానము లౌకిక జ్ఞానమూ కూడా కలవాడవు. యోగ చిత్తం కలవాడవు. వెనుకటి కల్పాల్లోని వార్తలు నీ జ్ఞప్తిలో ఉన్నవి చెప్పు." అని.

భుసుండుడిట్లా చెపుతున్నాడు - "ఓ మునీంద్రా! గడచిన కల్పాల్లో శిలలు, వృక్షాలు, లతలు, తృణాలు లేని భూమిని చూచాను. ఒక కల్పంలో జగత్తు అంతా దహింపబడి, ప్రళయం ఆలస్యం కాగా పదనొకండు వేల సంవత్సరాలు భూమి భస్మంచేత నిండిపోయి ఉండటం చూచాను. ఒక కల్పంలో భూమి అంతా నాలుగు యుగాల పాటు చెట్లు చేమలతో నిండి ఉండగా చూచాను. ఒక యుగంలో అంతా వింధ్య పర్వతం చేత ఆవరింపబడి ఉండటాన్ని చూచాను. సురాపానం చేసే బ్రాహ్మణులు, సురాపానాన్ని నిషేధించిన శూద్రులు కలిగినట్టి, స్వేచ్ఛగా సంచరిస్తున్న కులాంగనలు కలిగిన సృష్టిని చూచాను.

సూర్య చంద్రాదుల పుట్టుకను, ఇంద్రోపేంద్రుల వ్యవస్థను, హిరణ్యాక్షుడు భూమిని అపహరించటం, ఆదివరాహమూర్తి ఆ భూమిని ఉద్ధరించటం, వేదాలను తీసికొనిరావటం, పాలసముద్రాన్ని మథించిన విధం, ఇంకా రెక్కలు మొలవని గరుడుని, వీటి అన్నింటినీ నా కంటె పిన్నవారే యెరుగుదురు. ఈ జగత్తులో నీవు, భరద్వాజుడు, పులస్త్యుడు, అత్రి, నారదుడు, మరీచి, సనత్కుమారుడు,

భృగువు, స్కందుడు, విఘ్నేశ్వరుడు, గౌరి, సరస్వతి, లక్ష్మి, గాయత్రిమొదలైన వారి పుట్టుకలను నేను చూచాను. ఓ వసిష్ఠా! బ్రహ్మపుత్రుడవైన నీకు ఇది ఎనిమిదవ జన్మము. మొదటి జన్మలో నీవు నాతో కలసి యుంటివి. నీవు ఒకసారి ఆకాశంలోను, ఒకసారి జలంలోనూ, ఒకసారి పర్వతం మీదను, ఒకసారి అగ్నియందు జన్మించావు. సముద్రంలో మునిగిపోయిన భూమిని, మహాకూర్మం అయిదు కల్పాంతరాల్లో, ఉద్ధరించటం నేను చూచాను.

ఓ మునీంద్రా! యుగధర్మాన్ని బట్టి పురుషుల బుద్ధులలో హెచ్చు తగ్గులు కలగటం, వాటిని బట్టి కర్మలు, చదువు సంధ్యలు, వేద పాఠక్రమంలో ఎచ్చుతగ్గులు కలగటం పలుమార్లు చూచాను. చాలా ఆశ్చర్యాన్ని కలిగించేదీ, లక్ష గ్రంథ పరిమితము అయిన ఇంకొక వాసిష్ఠ రామాయణాన్ని నేను ఎరుగుదును. వసిష్ఠ రామ సంవాదరూపమైన ఈ రామాయణం విస్మృతమై పోయినందున వాల్మీకి అనే జీవుని చేత పండ్రెండవ సారి చెప్పబడుతోంది. అట్లాగే భారతం వ్యాసుడనే జీవుని చేత పండ్రెండవసారి చెప్పబడ్డది. అట్లాగే శ్రీకృష్ణుడు పదనారవసారి వసుదేవునింట పుట్టాడు. ఇట్లా పూర్వకల్ప గాథలన్నీ చెప్పగా విని వసిష్ఠుడు అడిగాడు –

'ఓ పక్షీంద్రా! ఈ ప్రపంచంలో జగద్వ్యవహారంలో వర్తిస్తూన్న వారిని మృత్యువు ఏ విధంగా అయితే బాధింపకుండా ఉంటుందో చెప్పు, ''అంటే ఎవరిని మృత్యువు వధింపదు? చిరజీవత్వానికి కారణం ఏమిటి?'' అని.

భుసుండుడిట్లా చెప్పాడు – ''మునీంద్రా! వాసన లేనివానిని, మానసిక దుఃఖాలు లేనివానిని, ఆశలు, చింతలు, లోభము, కోపము, మన్మథపీడ, లేని వానిని మృత్యువు వధింప లేదు. ఏకము, నిర్మలము, పవిత్రము అగు బ్రహ్మమునందు విశ్రమించిన వానిని మృత్యువు వధింపలేదు. సంసార వ్యాధికి కారణమైన దోషాలు ఏవీ సమాధి నిష్ఠని చిత్తాన్ని బాధింపలేవు. మనస్సును బ్రహ్మమందు సక్తమైన దానినిగా చేయాలి. అయితే, ఆత్మ చింతన దుర్లభమైనది. అందుచేతనే, నేను, ఆత్మ చింతతో సమానమైనదీ, సర్వదుఃఖాలూ పోగొట్టేదీ, చిరకాల జీవితానికి కారణమైనదీ అయిన ప్రాణచింతను ఆశ్రయించాను.

నీవు అడిగావు కాబట్టి ప్రాణగత్యనుసంధానాన్ని గూర్చి చెపుతాను. ఈ శరీరం ప్రాణగతికి నివాసం. శరీరం మధ్యలో నున్న హృదయ కమలం నుండి క్రిందకు పైకి ప్రాణాపానాలనే రెండు వాయువులు సంచరిస్తూ ఉంటాయి. నేను

వాటిని అనుసరిస్తాను. అవి క్రమంగా ఉష్ణశీతస్వభావాలు కలవి. హృదయాకాశానికి సూర్య చంద్రుల్లాంటివి. యావజ్జీవము, మూడు అవస్థల్లోను సమాన రూపంగా ఉంటాయి. ప్రాణాపాన గతిననుసరించి, నాకు సుషుప్తిలో ఉన్న వానికి రోజులు గడచునట్లు గడుస్తున్నాయి. ప్రాణాపానముల గతి చాల సూక్ష్మమైనది.

చలనశక్తి గల ప్రాణవాయువు బాహ్యాభ్యంతరాలలో ఎల్లప్పుడూ సంచరిస్తూ దేహానికిపైన పండ్రెండు అంగుళముల వరకు వ్యాపిస్తుంది. (ఆపైన ప్రాణవాయువు లేదని కాదు. అది శరీరానికి అందదు.) అపానవు చలనశక్తి కలిగి బాహ్యాభ్యంతరాల్లో సంచరిస్తూ ఎల్లప్పుడూ అధోముఖంగా ఉంటుంది.

ఇక ప్రాణాయామాన్ని గురించి చెపుతాను. మేల్కొని ఉన్నా, నిద్రిస్తున్నా, ప్రాణాయామ గతిని తెలుసుకొన్నవానికి, ఏ ప్రాణాయామం జరుగుతోందో దానిని గురించి చెపుతున్నాను. అప్రయత్నంగా హృదయ బిలంలో నుండి ప్రాణములు బయటకు రావటాన్నే 'అంతస్థరేచకం' అంటారు.

శిరస్సు మొదలుకొని పండ్రెండంగుళముల మేర వరకు బాహ్య ప్రదేశాన్ని ఆక్రమిస్తున్న ప్రాణవృత్తులు అవయువాలను పూరించేటప్పుడు దానిని 'బాహ్యపూరకం' అంటారు. (ఇచట హృదయంమొదలుకొని మూర్ధము వరకు ఉన్న శ్వాస గతియొక్క సగభాగాన్ని 'అంతరరేచకము' అనీ, మూర్ధంమొదలుకొని బయటకు పండ్రెండు అంగుళాల వరకు ఉన్న అర్థాంశాన్ని 'బాహ్యపూరకము' నీ గ్రహించాలి.)

ఇట్లా వాయువు బాహ్య ప్రదేశం నుండి లోపలకు ప్రవేశిస్తూ ఉండగా నాసాగ్రం మొదలు మూర్ధం వరకూ, మూర్ధం మొదలు నాసాగ్రం వరకూ కలిగే రెండు రకాల స్పర్శనూ కూడా 'నాంతర పూరకం' గా చెపుతారు.

అపానవాయువు శాంతింపగా, హృదయ మందు మళ్లీ ప్రాణవాయువు ఉదయించే దాకా ఉండే వాయువు యొక్క నిశ్చల స్థితిని ''అంతస్థ కుంభకం'' అంటారు.

ఇక బాహ్య రేచకాదులను గూర్చి విను. ద్వాదశాంతం మొదలుకొని నాసాగ్రం వరకు బయటనున్న ఆకాశ మందు, ప్రాణంలో అపానం ఏకీభావం చెందినస్థితిని 'బాహ్యకుంభకం' అంటారు.

హృదయం మొదలుకొని నాసాగ్రం వరకు, బాహ్యానికి అభిముఖంగా ఉండే ప్రాణవాయువు యొక్క నడకను, యోగులు 'బాహ్యపూరకం' అంటారు.

నాసాగ్రం మొదలు ద్వాదశాంతం వరకు ఉండే ప్రాణవాయువు గతిని మరి ఇంకొక 'బాహ్యపూరకం' అంటారు.

ప్రాణవాయువు నాసాగ్రం కంటె బాహ్య ప్రదేశానికి పోయి అస్తమించగా, లోనికి ఆకర్షించే అపాన వాయువు ఉదయింపనంత వరకు ఉండే పూర్ణ కుంభ తుల్యంగా ఉండే స్థితిని 'బాహ్యకుంభకంగా' చెపుతారు.

బాహ్యేన కుంభింప బడినట్టి వాయువు మళ్ళీ అంతర్ముఖంగా ఉండే స్థితినే 'బాహ్యరేచకం' అని గ్రహించాలి. దీనిని అనుష్ఠిస్తే ముక్తి లభిస్తుంది.

ద్వాదశాంతం మొదలుకొని నాసాగ్రం వరకు, చలనం చేత అపానానికి ఏ రూపం ఉంటుందో దానిని ఇంకొక 'బాహ్యపూరకం' అంటారు. (అంటే బాహ్యపూరకాలు (1) నాసాగ్రంమొదలు ద్వాదశాంతం వరకు ఉండే ప్రాణవాయు గతి (2) ద్వాదశాంతం నుండి నాసాగ్రం వరకు అపానినికి ఉండే గతి).

మునీంద్రా! ఇట్లా బాహ్యాభ్యంతర కుంభకాదుల ప్రాణాపాన స్వభావాల్ని నిరోధిస్తే మళ్ళీ మానవునికి జన్మ ఉండదు.

మునీంద్రా! ఇంతవరకు చెప్పిన దానిని బట్టి బాహ్యపూరకాలు మూడు, అంతర పూరకాలు మూడు, కుంభకాలు రెండు మొత్తం ఎనిమిది దేహ వాయువుల యొక్క స్వభావాలను రాత్రింబవళ్ళు స్మరించటం ముక్తి ప్రదమౌతుంది. (ఈ ఎనిమిదీ కాక రేచక పూరకాలను చేర్చితే పది అవుతాయి. కాని, ఇక్కడ కుంభకాన్నే ప్రధానంగా చెప్పటానికి పూనుకోవటం వల్ల దాని భేదాలనే గ్రహించి ఎనిమిదిగా చెప్పారు.)

ప్రాణ చింతన రూపమైన ఈ విషయంలో సంసక్తమైన మనస్సు, బాహ్యవిషయాలను వదలివేస్తే కొద్ది రోజుల్లోనే కైవల్యాన్ని పొందుతుంది. వారు దుఃఖ రహితులౌతారు.

మునీంద్రా! హృదయంలో ఉన్నట్టి, పద్మాకారంలో ఉండే నాడీ చక్రం నుండి ప్రాణం పుడుతోంది. ఈ ప్రాణం నాసాగ్రానికి వెలుపల ద్వాదశాంగుళ పర్యంతంలో అస్తమిస్తోంది. అపానం వెలుపల నున్న ద్వాదశాంతం నుండి బయలుదేరి హృదయంలో ఉన్న పద్మము నందు అస్తమిస్తోంది.

అపాన వాయువు చంద్రరూపమై, బయట ద్వాదశాంతం నుండి లోనికి వచ్చి, దేహాన్ని పోషిస్తోంది. ప్రాణం సూర్యరూపాన్ని గానీ, అగ్ని రూపాన్ని గానీ దాల్చి హృదయం నుండి బయటకు పోయి శరీరాన్ని పాకం (పచనం) చేస్తోంది.

ఇట్లా ప్రాణ గతిని అనుసంధానం చేయుటం ద్వారా ఆత్మానుసంధానం చేయుటం ఎట్లాగో చెపుతాను విను. అపానవాయువు అనే చంద్రుని లోపలి చివరి భాగం, ప్రాణమనే సూర్యుని చేత, ఏ ఆత్మతత్త్వంలోనికి మ్రింగివేయబడ్డదో, ఆ ఆత్మతత్త్వాన్ని అనుసంధానం చేస్తే నరునికి జన్మ మరణాలు ఉండవు. అంటే, అపానాంతం ప్రాణంలోను, ప్రాణం ఆత్మలోను అనుసంధానింపబడాలి.

ఇట్లా అపానం ప్రాణకలను, ప్రాణము అపాన కలను గ్రసించటానికి సిద్ధపడేటప్పుడు, ఈ ప్రాణాపానాల రెంటికీ మధ్యలో సాక్షిగా ఉండేది ఆత్మతత్త్వం. ఆ ఆత్మతత్త్వాన్ని పొందినవాడు తిరిగి జన్మింపడు. అపానం అస్తమించి, ప్రాణం, ఇంకా ఉదయించని మధ్య స్థితిలోను, ప్రాణం అస్తమించి ఇంకా అపానం ఉదయించని మధ్య స్థితిలోను, నాసాగ్ర మందు ద్వాదశాంతరూపమైన ఆకాశంలో, ప్రాణాపాన ప్రవర్తకమై, అవాగమనాలు సాగిస్తూ ఉండే చిదాత్మను ఉపాసిస్తున్నాము. పరమార్థ దృష్టిచేత ఏ విధమైన కల్పనా (ఆకారం) లేనిదీ, ఆపాత దృష్టిచేత జీవోపాధి భూతమైనదీ (ఆకారం కలదీ) స్వానుభవం అనే ఐశ్వర్యం కలదీ అయిన పరమాత్మ పదాన్ని ఉపాసిస్తున్నాము.

ఓ మునీంద్రా! నేను భూత భవిష్య ద్వర్తమానాలను గూర్చి విచారించను. వర్తమాన సంబంధమైన దృష్టితో స్వరూప నిష్ఠుడనై ఉంటున్నాను. ఈ వస్తువును పొందానని గానీ, పొందలేదని గానీ చింత నాకు లేదు. అందుచేత చిరకాలం జీవిస్తున్నాను. నాకు సంతోషమూ లేదు, దుఃఖమూ లేదు. వైరాగ్యంతో అన్నీ వదలివేశాను. చిత్త వృత్తికి చోటు లేదు. ప్రాణికోటి సుఖంతో సుఖాన్నీ, ప్రాణికోటి దుఃఖంతో దుఃఖాన్నీ పొందుతున్నాను. కాబట్టి నాకు రోగాలు లేవు.

వసిష్ఠుడంతా విని అతని వద్ద సెలవు తీసికొని సురలోకానికి వెళ్లాడు. వసిష్ఠుడు రామునితో అంటున్నాడు –

రామా! కృతయుగం అయిన పిమ్మట, ఆ భుసుండునితో ఆ మేరు శిఖరమున నున్న వృక్షం మీద కలుసుకున్నాను. ఇప్పుడు త్రేతాయుగం నడుస్తోంది. ఈ త్రేతాయుగం మధ్యలో నీవు పుట్టావు. మళ్లీ ఎనిమిది సంవత్సరాలనాడు అతనిని అక్కడే ఆ స్థితిలోనే చూచాను. నీకు ఆ భుసుండుని వృత్తాంతం చెప్పాను గదా! నీకు ఏది యుక్తమో (ప్రాణచింత, ఆత్మ చింతలలో) దానిని ఆచరించు.

## 2. దేవపూజోపాఖ్యానము

ప్రాణవృత్తిని అనుసంధానం చేయటం వల్ల మోక్షం కలుగుతుంది. అని వెనుకటి ఉపాఖ్యానంలో చెప్పారు. ఈ ఉపాఖ్యానంలో దేవ పూజ చేతనే చిత్త విశ్రాంతి వల్ల కలిగే సుఖం కలుగుతుంది.

వసిష్ఠ ఉవాచ –

ఆ భాస మాత్రమే వేద మిత్థం సంప్రతి భాసతే
అయం నా మాహ మిత్యంత రసదేవ శరీరకం 1
మాంసాస్థిమయ నిర్మాణ దేహోహ మితి విభ్రమం
త్యజ సంకల్ప నిర్మాణ దేహాస్సంతి సహస్రశః 2
సుఖతల్పగతో యేన స్వప్న దేహేన దిక్తటాన్
పరిభ్రమసి హే రామ సందేహాస్తే క్వ సంస్థితః 3
జాగరాయాం మనోరాజ్యే యేన స్వర్గపురాంతరం
పరిభ్రమసి మేరుం వా సదేహాస్తే క్వ సంస్థితః 4
దీర్ఘ స్వప్న మిమం విద్ధి దీర్ఘం వా చిత్త విభ్రమం
దీర్ఘం వాపి మనోరాజ్యం సంసారం రఘునందన. 5
ఆభాస మాత్రమే వేదం న సన్నాసజ్జగత్త్రయం
ఇత్యన్య కలనా త్యాగం సమ్యగాలోకనం విదుః 6
అవశ్యమేవ హి మయా మర్తవ్య ఇతి నిశ్చయః
ఇత్యాత్మ మరణప్రాప్తౌ కిం ముథా పరితప్యతే 7
భోగాభోగా బహిష్కార్యా అర్యస్యాను సరే త్పదం
ప్రవిచార్య మహార్థం స్వమేక మాత్మాన మాశ్రయేత్ 8
అత్రే మా మ పరాం దృష్టిం మహామోహ వినాశినీం
శృణు యా కథితా పూర్వం మమకైలాస కందరే
సంసార దుఃఖ శాంత్యర్థం దేవే నార్ధేందు మౌళినా. 9

వసిష్ఠుడు అంటున్నాడు – రామచంద్రా! ఈ శరీరం కేవలం ఆభాసమాత్రం (ప్రతీతి మాత్ర సిద్ధం) అయినా, అవిచార దశలో వీడు, నేను, అనే భేదం చేత, అభేదం చేతను, అభిమాన విషయంగా అంతఃకరణంలో ప్రకాశిస్తోంది. ఆలోచించి చూస్తే అంతా మిథ్యయే! మాంసం, ఎముకలు మొదలైన వాటిచే నిర్మింపబడిన ఈ దేహమే నేను, అనే భ్రాంతిని విడచిపెట్టు.

సంకల్పం వల్ల కలిగిన ఇటువంటి దేహాలు వేలకొలది ఉన్నాయి. నీవు శయ్యపై పరుండి స్వప్న సంబంధమైన శరీరంతో ఏఏ దేశాలు తిరుగుతూ ఉంటావో, అటువంటి నీ దేహం అసలు ఎక్కడ ఉన్నదో చెప్పు. స్వప్నంలోని దేహం అసత్యమని నీవు అంగీకరించే ఉన్నావు గదా!

అల్లాగే, జాగ్రద్దశయందు మనో రాజ్యంలో, ఏ శరీరంతో స్వర్గం గాని, మరొకపట్టణాన్ని గాని, మేరువుపై గాని తిరుగుతున్నావు గదా! ఆ శరీరం ఎక్కడ ఉన్నదో చెప్పు. రామా! ఈ సంసారాన్ని దీర్ఘ స్వప్నమని గ్రహించు. లేదా ఆకాశంలోని నల్లదనం లాగా చిరకాలాను గతమైన చిత్త విభ్రాంతిగా గానీ, లేదా దీర్ఘమైన మనోరాజ్యంగా గానీ గ్రహించు – మిథ్య అని తెలుసుకో!

ఈ జగత్తు ఆభాస మాత్రమే కాబట్టి బాధ్యం కాబట్టి సత్తు కాదు. కనిపిస్తోంది కాబట్టి అసత్తూ కాదు. మరి ఏమి చేయాలి? అంటే, ఈ జగత్తు ప్రతిభాస మాత్రమైనది, అనే భేదకల్పనను విడిచివేయటమే సరియైనజ్ఞానం అవుతుంది. పుట్టిన దానికి చావు తప్పదు. అనే న్యాయాన్ని బట్టి, పుట్టటం చేతనే మరణమనేది నిశ్చియమై ఉండగా, ఇక మరణం కోసం దుఃఖించటం ఎందుకు? బ్రతికి ఉండగా ఏ కొంచెమో సంపద లభిస్తే దాని కోసం గర్వపడటం ఎందుకు? పదార్థ సముదాయంతో కూడిన ఈ జగత్తులో భేదబుద్ధిని విడచిపెట్టి అంతటా అనువర్తించి యున్న ఆ సచ్చిన్మాత్రాన్నే చూడు.

భోగాతిశయాన్ని వదలిపెట్టి, జీవన్ముక్తుని మార్గాన్ని అవలంబించాలి. మహావాక్యార్థాలను విచారించి ఒకటే అయిన ఆత్మను ఆశ్రయించాలి. ఈ సందర్భంలో మహామోహాన్ని పోగొట్టజాలిన మరొక విధమైన ఆత్మ జ్ఞానోపాయాన్ని చెపుతున్నాను. దీనిని కైలాసంలో శివుడు సంసార విముక్తికై చెప్పాడు. నీకా విషయం చెపుతాను, విను –

రామా! కైలాసం పార్వతీ దేవికి క్రీడాగృహం. ఈశ్వరుని వాసస్థానం. ఆ మహాదేవుని ఆరాధిస్తూ నేను ఆ పర్వతం మీద కొన్నాళ్ళు ఉన్నాను. నేనిల్లా కైలాసం మీద తపస్సు చేస్తూ ఉండగా కొంతకాలం గడచింది. ఆనాడు శ్రావణ బహుళ అష్టమి. ప్రదోషకాలం గడచింది. దిక్కులు శాంతంగా ఉన్నాయి. మొదటి జాము గడచింది. ఆ సమయంలో నేను సమాధిని విడచి కండ్లు తెరచాను. నాకు ఆశ్చర్యకరమైన తేజస్సొకటి కనిపించింది. నేను ఆలోచిస్తూ చూస్తూ ఉండగానే పార్వతీదేవిచేతినిపట్టుకొని శివుడు వచ్చాడు. నేను పరమశివునికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చాను. శివుడు నా వైపు ఆర్తిహరణ దృక్కులతో చూచాడు. నేను గౌరీ దేవిని

కూడా పూజించాను. శివుడు ప్రసన్నవాక్కులతో నా యోగక్షేమాలు తెలుసుకున్నాడు. నేను ఈ విధంగా అడిగాను –

ఓ భగవానుడా! నీ అనుగ్రహం వల్ల సమస్త దిక్కులు ప్రసన్నంగా ఉన్నాయి. అయినా, ఒక విషయం తెలుసుకొనగోరి అడుగుతున్నాను. సమస్త పాపాలను హరింపజేసేదీ, సర్వశుభాలనూ ఇచ్చేదీ, అయిన దేవపూజా విధానం ఎట్లా ఉండాలో చెప్పండి.

మహేశ్వర ఉవాచ –

**శృణు బ్రహ్మ విదాం శ్రేష్ఠ దేవార్చన మనుత్తమం**
**న దేవః పుండరీకాక్షో న చ దేవ స్త్రి లోచనః 10**
**న దేహో దేహ రూపో వా న దేవ శ్చిత్తరూపకః**
**అకృత్రిమ మనాద్యంతం దేవనం దేవ ఉచ్యతే 11**
**అకారాది పరిచ్ఛిన్నే మితే వస్తుని తత్కుతః**
**అకృత్రిమ మనాద్యంతం దేవనం చిచ్ఛివం విదుః 12**
**దేవః కః స్యాదితి త్వేత త్ప్రథమం తావదుచ్యతే**
**తదేవ దేవశబ్దేన కథ్యతే తత్ప్రపూజయేత్ 13**

బ్రహ్మ వేత్తలలో శ్రేష్ఠుడా! మునీంద్రా! దేవార్చనా విధిని చెపుతాను. విను. 'దేవుడు' అంటే, విష్ణువు కాడు, త్రినేత్రుడైన శివుడూ కాడు, దేహరూపుడూ చిత్తరూపుడూ కాదు. మరి ఎవరు? అంటే, ఉపాధి (శరీరం) లేనట్టి, ఆది మధ్య అంతాలు లేనట్టి, జ్ఞానాన్నే (దేవనము) దేవుడు అనాలి. అకారాదుల చేత పరిచ్ఛిన్నుడైనట్టి, పరిమిత వస్తు రూపుడైనవాని యందు దేవత్వం ఎట్లా ఉంటుంది? కాబట్టి ఉపాధి లేనట్టి, ఆదీ అంతము లేనట్టి, జ్ఞానమే శివుడు, దేవుడు, కాబట్టి, జ్ఞానమే రూపంగా గల దేవుని పూజించాలి.

**అజ్ఞాత శివతత్త్వానా మాకారో ద్యర్చనం కృతం**
**యోజనా ధ్వ న్య శక్తస్య క్రోశాధ్వా పరికథ్యతే 14**
**చిద్వ్యోమైవ కిలాస్తీహ పారావార వివర్జితం**
**సర్వత్రాసంభవ చ్చేత్యం కల్పాంతేషు చ శిష్యతే. 15**
**బోధస్సామ్యం శమశ్చేతి పుష్పాణ్యగ్ర్యాణి తస్యతైః**
**శివం చిన్మాత్ర మమలం పూజ్యం పూజావిదో విదుః 16**

**శుభబోధాదిభిః పుష్పైః దేవ ఆత్మా యదర్చ్యతే**
**తత్తు దేవార్చనం విద్ధి నాకారార్చన మర్చనం. 17**

యోజన దూరం నడవలేని వానికి దగ్గర త్రోవగా క్రోశం దూరం చెప్పినట్లు, నిరాకారమైన శివత్వాన్ని తెలుసుకోలేని వారికి సాకారార్చనం చెప్పారు.

ఆద్యంతములు లేనట్టి, దృశ్య సంస్పర్శ లేనట్టి, కల్పాంతమందు సైతం మిగిలి ఉండేది చిదాకాశం ఒకటే! తత్త్వజ్ఞానం, సమభావం ,నిర్వికారచిత్తం, అనేవి చిద్రూపుడైన ఆ శివుని పూజించటానికి పుష్పాల్లాంటివి. నిర్వికార చిత్తము, తత్త్వజ్ఞానం మొదలైన పుష్పాలలో ఆత్మరూపుడైన దేవుని అర్చించటమే దేవార్చన మౌతుంది. అదే కైవల్య సుఖాన్ని ఇస్తుంది. సాకారార్చనము అర్చనం కాదు.

దేవపూజ బాహ్యమనీ, అభ్యంతరమనీ రెండు భేదాలుగా ఉంది. బాహ్య దేవ పూజలో పంచభూతాత్మకము, ప్రపంచాతీతము, అన్ని పదార్థాల్లోనూ ఉండేదీ, సదసత్తుల మధ్య నుండేదీ, సత్తా మాత్రరూపమైనదీ అయిన చిత్తు ( జ్ఞానము) లోపల బయట అంతటా నిండి ఉండటం వల్ల 'మహాసత్త' అనీ, దేవశబ్దంతో వ్యవహరింపబడుతోంది. ఆ చిత్తే ( జ్ఞానమే) వికల్పాలతో కూడినదై దృశ్యాన్ని భావిస్తూ క్రమంగా చిత్స్వరూపము నుండి తొలగి దృశ్యభావాన్ని పొందుతోంది - సాకారం అవుతోంది. ఆ చిత్తే దేశకాలాది శక్తులచేత క్షోభను పొంది( ఉల్లాసాన్ని) క్రమంగా జీవుడై, వెంటనే బుద్ధి రూపమై, పిమ్మట అహంకారమై, ఆ పిమ్మట మనస్సు అవుతోంది.

బ్రాహ్మణుడే అయినా, బాల్యం నుండీ చండాలురచే పెంచబడిన తాను, చండాలుడనే, అని భావించి, చండాలత్వాన్ని పొందుతున్నాడు. అట్లాగే నిర్మలమైన ఆ చిత్తు, మనోభావాన్ని పొంది సంసారాన్ని అవలంబిస్తోంది. ఈ దేహమే నేను అని అనుకోవటం వల్ల దుఃఖాన్ని పొందుతోంది. ఈ దుఃఖం సంకల్పం వల్లనే వచ్చి, సంకల్పం వల్లనే వృద్ధిపొందింది అని తెలుసుకొని, ఆ సంకల్పాన్ని వదలివేస్తే, నైర్మల్యాన్ని పొంది, పరమానందాన్ని అనుభవిస్తాడు.

ఆత్మ సర్వశక్తియుతుడు. ఆ శక్తుల ఉల్లాసం చేతనే సంసారాన్నీ కల్పిస్తున్నాడు, సంసార నివృత్తినీ పొందిస్తున్నాడు. ఆ శక్తులు ఎటువంటివి? అంటే, ఇచ్ఛాశక్తి, ఆకాశ శక్తి, కాలశక్తి, నియతిశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి, కర్తృత్వశక్తి, అకర్తృత్వశక్తి ఇట్లా ఆత్మ శక్తులకు అంతం లేదు. ఆత్మ యొక్క ఆ ఉల్లాస శక్తే ఈ సంసారం అంతటా ప్రవర్తిస్తోంది. నిరోధశక్తి చేత నశిస్తోంది. శాస్త్రాల్లో చెప్పిన సంస్కార

విధులు, స్నానాచమనాదులు పవిత్రమైనవే అయినా పూజావిధుల్లో వాటిని ప్రయత్నం చేతనైనా విడిచిపెట్టాలి. దేహానికి సాక్షియైన చిత్ప్రకాశరూపాన్నే పూజకు గ్రహించాలి. చిన్మాత్రుడైన ఆ దేవుని ధ్యానం చేయటం తప్ప వేరే ఉపాయం లేదు. అంటే, నిరాకారుడు, జ్ఞానస్వరూపుడు, సర్వగతుడు, బ్రహ్మాది సమస్త దేవతల చేత ధ్యానింపబడే ఆ పరమేశ్వరుని - పరమాత్మను ధ్యానరూపంలో భావన చేయాలి. అంటే, నిరంతరానుసంధానం చేయాలి. అదే నిజమైన దేవపూజ.

ఈ విధంగా శివుడు ఆభ్యంతర పూజా విధిని, చెప్పి పార్వతీదేవితో సహా అంతర్హితుడైనాడు. రామా! నేను ఆ విధంగానే ఆత్మాను సంధానం చేస్తున్నాను.

ఇది విని శ్రీరాముడు చాలా సంతోషించాడు.

## 3. బిల్వ ఫలాఖ్యానము

(వెనుకటి ఆఖ్యానంలో దేవార్చనా విధానాన్ని చెప్పి, తద్వారా చిత్తానికి అంతర్ముఖత్వం లభించగా నిర్వాణ ప్రాప్తి కలుగుతుందని చెప్పారు. ఈ ఆఖ్యానంలో బ్రహ్మము అన్ని పదార్థాల్లోనూ అంతర్భూతమై ఉన్నదని చెప్పదలచారు.)

వసిష్ఠ ఉవాచ -

బ్రహ్మైవ భూరిభువన భ్రమ విభ్రమోచ్చై
రిత్థం స్థితం సమమనేకత యేకమేవ 1
సర్వాత్మకం భవతి నేతర దంగకించి
చ్చిత్తాదికం చ న హ్యదీవ హి సన్నివేశః 2
అత్రేమా మనబోధాయ విస్మయోల్లాస శాలినీ
అపూర్వాం చైవ సంక్షేపా ద్రామరమ్యాం కథాం శృణు. 3

రామా! సర్వాత్మకమైన బ్రహ్మము ఒకటే అయినా, అనేక భువనాలతో గూడి, భ్రాంతి విలాసములచేత, వియదాది రూపముతో అనేకంగా ఉంటోంది. అంతే తప్ప, స్వాప్నావస్థలో కనిపించే వస్తువు లేనట్లే చిత్తాదికం గానీ, వియదాదికం గానీ ఏదీ లేదు. ఈ విషయం తెలయటానికే ఒక రమ్యమైన కథను సంగ్రహంగా చెపుతాను -

యోజనానాం సహస్రాణి విపులం విమలం స్ఫుటం
యుగైరప్యజర ద్రూప మస్తి బిల్వ ఫలం మహత్ 4
పురాణమపి బాలేందు దళ మార్దవ సుందరం
మహాకల్పాంత వాత్యాయా అపివే గైరచాలితం 5
యోజనా యుత కోటీనాం కోటి లక్ష శతైరపి
వైపుల్యే నా పరిచ్ఛేద్యం మూలమాద్యం జగత్ స్థితేః 6

(అన్ని పదార్థాలూ తనలోనే కలిగియున్నట్టి చిద్ఘనమైన బ్రహ్మమే అపూర్వమైన బిల్వఫలంగా వర్ణింపబడుతోంది) అనేక వేల యోజనాల వైశాల్యం కలదీ, ముసలితనం మొదలైన వికారాలు ఏవీ లేవు కాబట్టి ఎన్ని యుగాలకైనా శీర్ణం కానట్టి రూపం కలదీ, పురాతనమైనదైనప్పటికీ బాలేందు శకలం లాగా మృదువైనదీ, కల్పాంతమందు వీచే వాయువులచేత కూడా కదలనిదీ, లక్షకోట్ల యోజనాల వైశాల్యం చేత (అనంతమైన వైశాల్యం చేత) అపరిచ్ఛేద్యమైనదీ, జగత్ స్థితికి మూలమైనదీ అయిన గొప్ప బిల్వఫలం (మారేడు పండు) ఉంది.

ఆ బిల్వ ఫలానికి సమీపంలో అనేక బ్రహ్మాండాలు, పర్వతం క్రింద ఆవగింజలు ఉన్నట్లు ఉన్నాయి. ఆ పండు ఎన్నడూ ముగ్గి క్రింద పడదు; శిథిలమూ కాదు. పరమపురుషార్థ రూపమైనది కాబట్టి, అన్ని ఫలాలకు సారభూతమైన ఈ బిల్వ ఫలానికి చిచ్ఛక్తి స్ఫూర్తియే అంతర్గతమైన సారం. అనంతం కాబట్టి తరళరూపం కలది. అనేక పరిణామాలు చెందేది కాబట్టి స్ఫురద్రూపం కలదీ అయిన చిచ్ఛక్తి చేత నిజరూపంలోనే సృష్టి సంకల్పం జరుగుతోంది.

ఇది అనంతమైన ఆకాశం. ఇది కాలరూపమైన అంశము. ఇది జగత్తును నియమించటానికి పూనుకొనే నియతి. ఇది సంచలనాత్మకమైన క్రియ. ఇదే బ్రహ్మాండ మండపం. ఇవి దిక్కులు. అని ఇదంతా ఆ బిల్వఫలం యొక్క తనదైన చమత్కారం అని గ్రహించాలి.

శ్రీరాముడన్నాడు – ఓ మునీంద్రా! బ్రహ్మరూపాన్నే బిల్వఫల రూపంగా చెప్పావని అనుకుంటున్నాను. అహంకారాది ప్రకృతులైన మహదాదులచే వ్యాప్తమైన ఈ జగత్తు చిత్సారభూతమైనది. కాబట్టి భేదాభేద విచార రూపమైన భేదం ఇందులో ఏమాత్రమూ లేదు. బ్రహ్మాండం మొదలుగా గల ఈ జగత్తు చిద్రూపమైన బిల్వము యొక్క సారమే!

# 4. మహాశిలోపాఖ్యానము

(వెనుక సర్వార్థములను లోపల ఉన్నట్లు భావించి, అద్వితీయమైన చైతన్యాన్ని బిల్వ ఫలంగా నిరూపించి చెప్పారు. ఇప్పుడు రకరకాల జగత్తులచే చిత్రంగాను, అఖండైక రసంగాను, నిర్వికల్పము, ఘనీభూతము అయిన ఆ చిత్తే (జ్ఞానమే) మహాశిల అని నిరూపింపదలచారు.)

వసిష్ఠుడు చెపుతున్నాడు –

శ్రీరామా! అశ్రుతపూర్వము, ఆశ్చర్యకరము అయిన ఒక ఆఖ్యాయికను చెపుతున్నాను, విను.

(చిత్తు) ప్రేమాస్పదమైనది కాబట్టి స్నిగ్ధము, స్వయం ప్రకాశం కాబట్టి స్పష్టము, సుఖానికి హేతువు కాబట్టి మృదు స్పర్శము, అంతులేనిది కాబట్టి అతి విస్తృతము, ఎల్లప్పుడు ఉండేది కాబట్టి నిబిడము, విజాతీయ మిశ్రితం కాదు కాబట్టి నీరంధ్రమూ, అయిన మహాశిల ఒకచోట ఉన్నది.

ఆ శిలయందు, కొన్ని పరస్పర సంబంధము కలవీ, కొన్ని పరస్పర సంబంధం లేనివీ, కొన్ని ఊర్ధ్వ మూలములు, కొన్ని అధోముఖములు కొన్ని మూలమే లేనివి, రమణీయములు, అనంతములు అయిన పద్మాలు కొలనులో ఉన్నట్లు ఉన్నది. (దేవలోకాదులు పై భాగంలో నున్న ధ్రువ మండలాన్ని ఆశ్రయించి ఉన్నాయి కాబట్టి ఊర్ధ్వమూలములు. పాతాళాది లోకాలు భూలోకానికి బాహ్యంలో ఉన్న కూర్మాన్ని ఆశ్రయించి ఉన్నాయి కాబట్టి అధోలోకాలు. శివ విష్ణు లోకాదులు నిత్యాలు.)

ఆ పద్మాల వద్ద లక్షల కొలది శంఖాలు, చక్రములు ఉన్నాయి. (నక్షత్ర గ్రహాదులు శంఖాలు. ద్వీపాలు చక్రాలు) ఈ జగత్తంతా దేని యందు ఉన్నదో అట్టి చిద్రూపమైన శిలను గురించి చెపుతున్నాను. నిబిడత్వము, ఏకరూపత్వము, అభేద్యత్వము, కూటస్థత్వము మొదలైన ధర్మాలు ఉన్నందున చిత్తు ఈ శిలయే! ఈ శిల ఘనీభూతమైనది. నీరంధ్రమైనది (దట్టమైనది) అయినా, దీనియందు ఆకాశములో వాయువు ఉన్నట్లుగా ఈ జగజ్జాలమంతా ఉన్నది.

ఆ శిలయందు స్వర్గము, భూమి, వాయువు, ఆకాశము, పర్వతాలు, నదులు, దిక్కులు, అన్నీ ఉన్నాయి. ఆ శిలకు రంధ్రము ఎక్కడా లేదు. భూతభవిష్యద్వర్తమానములనే కాలత్రయ సంబంధమైన వస్తు సమూహంతో

కూడిఉన్నప్పటికీ ఈ చిద్రూపమైన శిల భేదభావాన్ని పొందదు. ఈ చిత్తు, గర్భంలో విశ్వాన్ని ధరిస్తున్నా, ఏకరూపం కలిగి ఉంది. శిలమీద ఏర్పడిన పద్మము, శిల కంటె భిన్నమైనది కానట్లుగా చిత్తునందు కల్పింపబడిన ఈ జగత్తు చిత్తు కంటె భిన్నం కాదు.

శిలయందు కల్పింపబడిన పద్మము, మిరియములో మనకు తోచు కారము, స్వభావసిద్ధమై పుట్టటం పోవటం లేనట్లుగా (ఉదయాస్తమయాలను పొందనట్లుగా) చిత్తు నందు సృష్టి కూడా, స్వభావంగానే జరుగుతూ, ఉదయం గానీ అస్తమయాన్ని గానీ పొందదు.

గర్భిణి యందు గర్భము, బిల్వఫలంలో గుజ్జు ఉన్నట్లుగా అనేక వికారాలతో కూడిన ఈ జగత్తులో, చిత్తు ఉన్నది. శిలాగర్భంలో పద్మరూపంలో, చక్రరూపంలో రేఖలు నిశ్చలంగా (సుషుప్తిలో నున్నట్లు) ఎట్లా ఉంటాయో అట్లాగే చిత్తులో ఈ జగజ్జాలం అంతా ఉంది.

సర్వాత్మకమైన బ్రహ్మము, ఎక్కడ ఏ రూపంతో ప్రవర్తిస్తుందో అక్కడ ఆ రూపంతో కనిపిస్తుంది. కాబట్టి, సర్వమూ బ్రహ్మమే, సుషుప్తావస్థను పొందినట్లు నిశ్చలంగా ఉంది.

అనేక జన్మాది వికారాలతో కూడిన జగద్రూపమైనట్టి గొప్పభ్రమను, శిలయందేర్పడిన కమలం లాగా, బ్రహ్మగానే తెలుసుకోవాలి.

ప్రశాంతుడు, సముడు, చిద్ఘనుడు అయిన ఆత్మయందు, ఇట్లా తోచుచున్న జగద్భ్రమ (జగద్విలాసం) శిలయందు కల్పితమైన కమలం లాగా, మూలకారణ రూపమే అవుతోంది. కనపడునట్టి సృష్టిమొదలైన అవస్థలు నిష్ప్రమాణాలు కాబట్టే నిజరూపాన్ని బాధించలేవు.

## 5. అర్జునోపాఖ్యానము

అఖండైక రసంబైన చిత్తును శిలగా వెనుకటి ఆఖ్యాయికలో నిరూపించారు. ఈ ఆఖ్యానంలో సర్వమూ బ్రహ్మమే అనే జ్ఞానం కలవాడు యుద్ధాది కృత్యాల్లో ప్రవృత్తుడైనా, అవి (యుద్ధాదులు) చిత్తవిశ్రాంతికి బాధకాలు కావు అని చెప్పబోతున్నారు)

శ్రీరాముడు వసిష్ఠుని, ఓ మునీంద్రా! జగద్బృందాన్ని నిర్మించే సామర్థ్యం కలిగినట్టిదీ, దర్పణం లాగా నిర్మలమైనదీ అయిన పుర్యష్టకం యొక్క రూపం

(జీవుని రూపం) ఎట్టిదో చెప్పండి అని అడిగాడు. అందుకు వసిష్ఠుడిట్లా చెప్పాడు -

రామా! బ్రహ్మము, ఆద్యంత రహితము, జగత్కారణము అయినట్టిది. ఆ బ్రహ్మమే అవిద్యతో కూడినప్పుడు జీవుడు అనిపించుకొంటున్నాడు. అంటే, మాయా సంబంధం లేనట్టి బ్రహ్మము, అవిద్యోన్ముఖమైతే, అదే జీవరూప మౌతోంది.

ఆ జీవుడు ఈ దేహంలో సంచరిస్తూ 'నేను' అని అభిమానించటం వల్ల అహంకారము, సంకల్పాదుల రూపమైన మననం వల్ల మనస్సు అవుతున్నాడు. ఆ జీవుడే జ్ఞానంతో గూడిన నిశ్చయాత్మకమైన వ్యాపారం వల్ల బుద్ధి అవుతున్నాడు. ఆత్మచేతచూడబడటం వల్ల ఇంద్రియరూపాన్ని, దేహ రూపభావన చేత దేహంగానూ, ఘటాకార భావన చేస్తే ఘటంగానూ అవుతున్నాడు. ఇట్టి స్వభావం కల ఆత్మనే పుర్యష్టకం అంటున్నారు. నేను జ్ఞానిని, నేను కర్తను, నేను భోక్తను, నేను సాక్షిని, ఇట్లా నేను అనే అభిమానం గల సంవిత్తే జీవుడు. ఆ సంవిత్తునే పుర్యష్టకం అంటారు. జనులంతా ఈ పుర్యష్టకానికిలోనవటం వల్లనే, ఒక స్వప్నం నుండి వేరొక స్వప్నాన్ని చూచినట్లుగా అసత్యమైన ఈ జగత్తును చూస్తున్నారు.

ఇట్లా చెప్పి, వసిష్ఠుడు అంటున్నాడు - రామా! పాండుపుత్రుడైన అర్జునుడు శ్రీకృష్ణునిచే బోధింపబడి సంగరహితమైన జ్ఞానాన్ని పొంది జీవిత కాలాన్ని సుఖంగా గడపగలుగుతాడు (ద్వాపర గాథ కాబట్టి భవిష్యత్తుగా చెప్పారు)

ఇది విని రాముడు, ''మునీంద్రా! అర్జునుడు ఎపుడు జన్మిస్తాడు? శ్రీకృష్ణుడు అసంగత్వాన్ని అతనికి ఎట్లా, ఏమని బోధిస్తాడు?'' అని అడుగగా మళ్ళీ వసిష్ఠుడు చెపుతున్నాడు -

రామా! యముడు ప్రాణుల్ని హింసించటం వల్ల పాపం వస్తుందని శంకించి, ఆ పాప నివృత్తికై ప్రతి మహాయుగంలోను ఒకప్పుడు ఎనిమిది సంవత్సరాలు, మరి యొకప్పుడు పండ్రెండు సంవత్సరాలు, వేరొకప్పుడు పదమూడు, మరియొకప్పుడు పదునాల్గు సంవత్సరాలు తపస్సు చేస్తూ ఉంటాడు. అట్లా యముడు తపస్సు చేసే కాలంలో మృత్యువు ప్రాణుల్ని హింసింపదు. అందుచేత, భూమిపై ప్రాణికోటి పెరిగిపోయి తిరగటానికి కూడా వీలు కాకుండా పోతుంది. అప్పుడు విష్ణ్వాది దేవతలు అనేక విధాలైన ఉపాయాలతో భూభారాన్ని

తొలగించటానికై ప్రాణుల్ని హింసిస్తారు. ఇట్లా అనేక యుగాలలో, అనంతమైన ప్రాణికోటి గతించిపోయింది.

సూర్యపుత్రుడు, పితృపతి అయిన ఈ యముడు ఇపుడు కొన్ని యుగాల తరువాత పాప విమోచనం కోసం పండ్రెండు సంవత్సరాలు తపస్సు చేస్తాడు. ఆ సమయంలో భూభారం పెరిగిపోతుంది. భూమి ఆ భారాన్ని భరించలేక విష్ణువు శరణుజొచ్చుతుంది. విష్ణువు రెండు శరీరాలతో – కృష్ణుడు, అర్జునుడు అనే శరీరాలతో అవతరిస్తాడు. కౌరవ పాండవులకు జరిగే మహాయుద్ధంలో అర్జునుడు మరణోన్ముఖులై వచ్చిన బాంధవులను గాంచి యుద్ధవిముఖుడౌతాడు. అప్పుడు శ్రీకృష్ణుడాతనికి ఈ విధంగా ఉపదేశిస్తాడు –

అర్జునా! ఈ ఆత్మకు ఒకప్పుడు జన్మించటం గానీ, మరణించటం గానీ ఉండదు. ఆత్మ ఇపుడు ఉండి, ఇక ముందు ఉండకపోవటం అంటూ ఉండదు. ఆత్మ ఉత్పత్తి రహితుడు, నిత్యుడు, శాశ్వతుడు, వృద్ధిక్షయాలు లేనివాడు. శరీరాన్ని హింసించినా ఆతడు హింసింపబడడు (న జాయతే మ్రియతే...... భగవద్గీత)

అర్జునా! కార్యం సిద్ధించినా, సిద్ధించకపోయినా, సమభావంగా ఉండటం యోగం. అట్టి యోగనిష్ఠుడవై, ఫలకాంక్షను వదిలి కర్మలను ఆచరించు. అన్ని కర్మలను బ్రహ్మార్పణ బుద్ధితో చేస్తే, క్షణంలో నీవు బ్రహ్మవే అవుతున్నావు. (యోగస్థః కురు కర్మాణి...)

సకల శుభాశుభ కర్మలను ఈశ్వరుని యందర్పించు. ఈశ్వరుని యందు చిత్తాన్ని ఉంచు. అట్లా చేస్తే దుఃఖం ఉండదు. అన్ని భూతాల్లోను ఆత్మను చూడగలుగుతావు. భూతలాల్ని ప్రకాశింపజేసే ఈశ్వరుడవౌతావు. అట్లా చెయ్యి!

అన్ని సంకల్పాదులను వదలి, సమభావం కలవాడవై, శాంతచిత్తుడవు కర్మఫలాన్ని వదలినవాడవు అయి కర్మలనాచరిస్తూ ఉండు.

ఇది విని అర్జునుడు అడుగుతాడు – ''కృష్ణా! సంగత్యాగానికీ, బ్రహ్మార్పణానికీ, ఈశ్వరార్పణ రూపమైన సన్న్యాసానికీ, జ్ఞానానికీ, యోగానికీ ఉన్న భేదం ఏమిటో నా అజ్ఞాన నివృత్తికై చెప్పు!'' అని.

శ్రీకృష్ణుడిట్లా బోధించాడు –

అన్ని సంకల్పాలూ శాంతించగా, వాసనలన్నీ అణగిపోగా ఏ విధమైన భావనలూ లేని రూపమే పరబ్రహ్మ స్వరూపం. అట్టి బ్రహ్మను తెలుసుకోవటానికి చేసే

ప్రయత్నాన్నే జ్ఞానమనీ, యోగమనీ, అంటారు. 'ఈ జగత్తు, నేనూ కూడా బ్రహ్మమే' అని తలచటాన్నే బ్రహ్మార్పణంగా చెప్పారు. కర్మల యొక్క ఫలాన్ని వదలివేయటాన్నే సన్న్యాసం అంటారు. సంకల్ప సమూహాన్ని వదలివేయటాన్నే అసంగము అంటారు. సమస్త సంకల్ప వికల్పాలను భేదభావం లేకుండా ఈశ్వర రూపంగా భావించటం ఈశ్వరార్పణం అవుతుంది. (అంటే, ఈశ్వరుడు సర్వాంతర్యామి. అతడే ఆయా విధాలుగా చేయిస్తున్నాడు. ఈశ్వర విలాసం చేతనే సమస్త వ్యవహారాలూ జరుగుతున్నాయి. అని అన్ని వ్యవహారాలనూ ఈశ్వరునికే అర్పించటం)

నీవు చిత్తాన్ని నా యందు ఉంచు. నా యందు భక్తి కల వాడవు కమ్ము. నాకు నమస్కరించు. చిత్తం నా యందు నిలిపి నన్నే భావిస్తే, నా రూపం కలవాడవే అవుతావు.

అర్జునా! నాకు సామాన్య రూపం, పరమరూపం అని రెండు రూపాలు ఉన్నాయి. చేతులు, కాళ్ళు, శంఖం, చక్రం, వగైరాలను ధరించిన రూపం సామాన్యరూపం. ఆద్యంత రహితము, అఖండము అయిన రూపం పరమరూపం. ఆ పరమ రూపమే బ్రహ్మము; ఆత్మ, పరమాత్మ అని పేర్కొనబడుతోంది.

నీవు ప్రబుద్ధుడవై, జ్ఞానివై, ఆత్మరూపాన్ని తెలుసుకొనేటంత వరకు నాలుగు చేతులు గల దేవతా స్వరూపాన్ని పూజిస్తూ ఉండు. అట్టి పూజ వల్ల ప్రబోధాన్ని పొంది, పరమ రూపాన్ని తెలుసుకోగలుగుతావు. ఇక అప్పుడు మళ్ళీ మళ్ళీ జన్మను పొందవు – జన్మ రాహిత్యం కలుగుతుంది.

కోరికలు లేకుండా, సంకల్పాలు లేకుండా పనులు చేసేవాడే జ్ఞానాగ్ని చేత సమస్త కర్మలను దహించివేసినవాడే పండితుడు.

అహంకారం, దానికి మూలమైన అజ్ఞానం లేని వారు, సంగరహితులు ఆత్మానుసంధానంలో ఆసక్తి కలవారు, కామనా రహితులు, సుఖదుఃఖాది ద్వంద్వ దోషం లేని వారు అయిన విద్వాంసులు బ్రహ్మపదాన్ని పొందుతారు.

అర్జునా! నీవు ద్వంద్వ దోషరహితుడవు కమ్ము. సదా సత్త్వగుణ నిష్ఠుడవు కమ్ము. సదా తటస్థుడవుగా ఉండు. ప్రమాదరహితమైన చిత్తం కలవాడవు కమ్ము.

శ్రీకృష్ణుడీ విధంగా బోధించి, మౌనం వహించగా, అర్జునుడు సమస్త శోకాలనూ విడచి ఆనందాన్ని పొందుతాడు.

# 6. శతరుద్రోపాఖ్యానము

(యుద్ధాదిక వ్యాపారాలు చిత్త విశ్రాంతికి బాధకాలు కావని చెప్పారు. ఇక, ఇప్పుడీ ఆఖ్యాయికను ఈ జన్మపరంపర తన సంకల్పరూపమైన భ్రాంతిపరంపర వల్లనే సిద్ధిస్తోంది అనే విషయానికి దృష్టాంతంగా చెపుతున్నారు.)

వసిష్ఠుడు శ్రీరామునితో అన్నాడు –

రామా! ఒక యతీశ్వరుడు ఉండేవాడు. అతనికి సమాధిని అభ్యసించటం మీద ఆసక్తి ఎక్కువ. ఆ అభ్యాసంలోనే కాలం గడిపేవాడు. అట్లా నిరంతరం అభ్యాసం చేయటం వల్ల, నిర్మలమైన అతని చిత్తం, దేనిని భావిస్తే ఆ రూపాన్ని (జలం తరంగ రూపాన్ని పొందినట్లు) పొందుతోంది. ఒకనాడు అతడు సమాధి నుండి లేచి, ఏక చిత్తంలో ఒక వ్యవహారాన్ని ఆలోచించాడు.

ఇట్లా ఆలోచిస్తున్న అతనికి, తాను పామరునిగా కావాలనే బుద్ధి పుట్టింది. పూర్వ స్థితిని వదలి పామరపురుషుడై 'జీవటుడు' అనే పేరు పెట్టుకొన్నాడు. జీవటుడనే ఆ స్వప్న పురుషుడు స్వప్నంలో నిర్మింపబడ్డ పట్టణ వీధుల్లో చాలకాలం తిరిగాడు. ఆ జీవటుడు మద్యం త్రాగి, నిద్రించి, స్వప్నంలో వేద పఠనం చేస్తూ ఆనందిస్తున్న బ్రాహ్మణ రూపాన్ని పొందాడు.

ఒకప్పుడా బ్రాహ్మణుడు ఆహ్నికవ్యాపారాలు నిర్వర్తించి నిద్రపోగా, స్వప్నంలో తాను సామంతత్వాన్ని పొందాడు. ఆ సామంతుడు ఒకసారి నిద్రపోయి, స్వప్నంలో మహారాజుగా అయినాడు. ఆ మహారాజు ఒకనాడు తన స్వప్నంలో దేవతాస్త్రీ రూపాన్ని పొందాడు. ఆ దేవకాంత తన స్వప్నంలో లేడి భావాన్ని పొందింది. ఆ లేడి నిద్రించి, స్వప్నంలో తాను లోగడ చూచియున్న తీగ రూపాన్ని పొందింది. (తాము చూచినవి, తాము విన్నవి అయిన పదార్థాలు చిత్తంలో స్మృతిరూపంలో అక్షయమై ఉంటున్నందు వల్ల తిర్యగ్జంతువులు కూడా స్వప్నాన్ని చూస్తాయి.) ఆ తీగ నిద్రావస్థను పొంది, స్వప్నంలో తనను తుమ్మెదగా చూచింది. ఆ తుమ్మెద కమల గర్భంలో ఉండగా దానికి స్వప్నంలో ఏనుగు రూపంలో ఆసక్తి కలిగింది. ఇంతలో ఒక ఏనుగు వచ్చి, తుమ్మెదతో సహా కమల లతను నలిపివేసింది. అంత ఆ తుమ్మెద ఏనుగును భావించి యున్నందున ఏనుగు రూపాన్ని పొంది విహరిస్తోంది. అట్లా విహరిస్తుండగా ఆ ఏనుగు ఒక గుంటలో పడ్డది. ఒక రాజు ఆ ఏనుగును బంధించి తీసికొనిపోయాడు. పిమ్మట, ఆ ఏనుగు ఒక యుద్ధంలో నరుకబడి మరణించింది.

ఆ యేనుగు, తన గండస్థలం మీదనున్న తుమ్మెదను భావించి యుండుటచే మళ్లీ తుమ్మెద అయినది. ఆ తుమ్మెద మళ్ళీ ఏనుగు యొక్క పాదం చేత పద్మలతతో పాటు చూర్ణత్వాన్ని పొందింది. ఆ తుమ్మెద ప్రక్కన ఉన్న కల హంసలను భావించుటచే తాను కలహంస అయినది. ఆ కలహంస ఇతర యోనులందు జన్మిస్తూ దైవవశాన బ్రహ్మవాహనమైన హంస అయినది.

ఆ హంస ఒకసారి రుద్రలోకానికి పోయి రుద్రుని చూచింది. ఆ హంసకు తానే రుద్రుడననే నిశ్చయ బుద్ధి కలిగింది. అది రుద్రరూపాన్ని పొంది, ప్రమథ గణాలతో, విహరించింది. ఆ రుద్రుడు ఉత్తమ జ్ఞానం చేత, తన పూర్వపు వృత్తాంతాన్నంతా బుద్ధిలో చూచాడు. వివిధ స్వప్నాలకు ఆశ్చర్యపడి ఇట్లా ఆలోచించాడు –

ఆహా! ఎంత చిత్రం! ఈ మాయ, మిథ్యారూపం కలదైనా ఎండమావుల్లోని నీరు లాగా ఈ విశ్వాన్ని మోహింపజేస్తోంది కదా! నేను విచిత్రములు, అనేకములు అయిన సంసారాల్లో, ఒక సర్గంలో జీవటుడనైనాను, వేరొక జన్మలో బ్రాహ్మణుడను, మరొక జన్మలో రాజును అయినాను. ఇట్లా జన్మాంతరాల్లో, అనేకవేల సంవత్సరాలు, అనేక మహా యుగాలు, అనేక చర్యలు గడచాయి. నానా రూపాలైన ఆ శరీరాల వద్దకు పోయి, వానిని చూచి, చక్కటి జ్ఞానాన్ని ఇచ్చి, నాతో సమానమైన వానినిగా చేయుదును గాక! అని ఆలోచించి, రుద్రుడు, శవంలాగ నిద్రిస్తున్న భిక్షువు వుండే మఠానికి పోయి, ఆతనిని మేల్కొలిపి, చిత్తాన్నీ జ్ఞానాన్నీ కలిగించగా ఆ భిక్షువు లేచి, తనకు కలిగిన మనోభ్రమను తలచి, తనను రుద్రునిగాను జీవట రూపంలో ఉన్న వానిని గానూ తెలుసుకొని, తనకు కలిగిన జ్ఞానసంపదకు ఆశ్చర్యపడ్డాడు. అనేక జన్మలకు మూలమైన మాయా వైచిత్ర్యమునకు చకితుడైనాడు.

అంతట ఆ భిక్షువు, రుద్రుడు, జీవటుని యింటికేగి ఆతనిని మేలుకొలిపి, చిత్తంతోను, జ్ఞానంతోను కూడిన వానినిగా చేశారు. ముగ్గురూ ఆశ్చర్యపడ్డారు – మొదట ఏకరూపులే ఇపుడు మూడు రూపాలు కల వారైనారు. పిమ్మట విప్రుడు మొదలుగా గల వారి వద్దకేగి, వారి వారితో కలసి జ్ఞానవంతులను చేశారు. ఇట్లా రుద్రాంశ వల్ల వంద మంది దివ్యజ్ఞానాన్ని పొంది, రుద్రుని అనుజ్ఞచే తమ తమ నివాసాలకు వెళ్ళారు. వారంతా కొంతకాలానికి దేహాంతరాలలో రుద్రత్వాన్ని పొందారు.

వసిష్ఠుడంటున్నాడు – రామా! ఈ చిత్తు సర్వాత్మకం కాబట్టి దేనిని దేనిని చూస్తే దానిని దానిని పొందుతోంది. ఏ వస్తువును స్వప్నంలో చూస్తున్నామో, సంకల్పం చేత కంటున్నామో ఆయా వస్తువు చిత్తునందు చిద్రూపమై ఉంటూనే ఉంది. అయితే, సంకల్పగతము, స్వప్నగతము అయిన వస్తువు సిద్ధించే దశ, ప్రాణ నిరోధం వల్లను మనోనిరోధం వల్లనూ మాత్రమే లభిస్తుంది. సమాధి, అధ్యాత్మశాస్త్ర జ్ఞానము వీనిచే కలిగిన దృష్టులు ఫలించిన యోగులైన రుద్రాదులు తమ సంకల్పానుసారంగా సమస్త వస్తువులను అంతటను చూస్తారు.

తదేక నిష్ఠ ఉన్న వానికి అన్ని పనులూ సిద్ధిస్తాయి. ఆసక్తి అనేది ఉంటేనే మనం తలచిన కార్యాన్ని పొందుతున్నాము. ఆసక్తి లేకపోతే పొందలేము. ఏకనిష్ఠలేని మూర్ఖుడు దేనినీ పొందలేడు. విద్యాధరుణ్ణి కావాలి అని గానీ, బ్రాహ్మణుడను కావాలని గానీ ఏదో ఒక దాని మీదనే ధ్యానం ఉంటే ఆ విధంగా అవుతాడు. రెంటినీ కోరితే రెంటికీ చెడతాడు. భిక్షుకుని జీవుడు తదేక నిష్ఠచేతనే రుద్రత్వాన్ని పొందాడు.

రాముడిట్లా అడిగాడు – ''మునీంద్రా! భిక్షుని సంకల్పం వల్ల మిగతా వారంతా ఎట్లా రుద్రత్వాన్ని పొందారు?'' అని.

వసిష్ఠుడన్నాడు – విష్ణువు ఒక్కడే అంశావతారాల చేత, వేయి రూపాలు పొంది, జగత్తును పాలిస్తున్నట్లుగా, భిక్షుని సంకల్పం వల్ల, ఒక్కటే అయిన శుద్ధ చిత్తు యొక్క అంశాలైన జీవటాదులు సత్యమైన వారిలాగా కన్పిస్తున్నారు. అంతే!

## 7. బేతాలోపాఖ్యానము

(శత రుద్రోపాఖ్యానంలో ఈ జన్మపరంపర అంతా స్వసంకల్ప రూపమైన భ్రాంతి చేత ఏర్పడినదే అని చెప్పారు. ఇపుడు సౌషుప్త మౌన సంపత్తికై లోగడ చెప్పిన కర్కటీ ప్రశ్నల్లాగా, దుర్ఘటమైన బేతాళ ప్రశ్నలనూ వాటి సమాధానాలనూ చెపుతున్నారు.)

వసిష్ఠ ఉవాచ : వసిష్ఠుడన్నాడు –

**సుషుప్త మౌన వాన్భూత్వా త్యక్త్వా చిత్త విలాసితాం**
**కలనామల నిర్ముక్త స్తిష్ఠాత్మ స్వచ్ఛ తత్పదః** 1

రామా! సంకల్పాది రూపమైన చిత్త రూపాన్ని వదలిపెట్టి, వాసనలనే మలం లేనివాడవై, సుషుప్త మౌనాన్ని వహించి బ్రహ్మభావంతో ఉండు.

శ్రీరామ ఉవాచ : శ్రీరాముడడిగాడు.

**వాఙ్మౌన మక్ష మౌనం చ కాష్ఠ మౌనం చ వేద్మ్యహం**
**సుషుప్త మౌనం మౌనీశ బ్రహ్మన్ బ్రూహి కి ముచ్యతే. 2**

ఓ మనీంద్రా! నేను వాఙ్మౌనాన్ని, అక్షమౌనాన్ని, కాష్ఠమౌనాన్ని ఎరుగుదును. కాని సుషుప్తమౌనం అంటే ఏమిటో తెలయదు. చెప్పండి.

వసిష్ఠ ఉవాచ : వసిష్ఠుడంటున్నాడు –

**అభావితాయాం శుష్కాయాం క్రియాయాం బద్ధనిశ్చయః**
**హఠాత్ జితేంద్రియ గ్రామో మునిః స్యాత్కాష్ఠ తాపసః 3**

బ్రహ్మ భావనా విరహితమైనందున నీరసమైనట్టి ప్రాణాయామాది క్రియలయందాసక్తుడై, హఠయోగం చేత ఇంద్రియాలను నిరోధించేవాడు కాష్ఠమౌని అని వ్యవహరింపబడతాడు.

**యథా భూతమిదం బుద్ధ్వా భావి తాత్మాత్మని స్థితః**
**లోకోఽహమోపి తృప్తోంతర్య స్స ముక్తో మునిః స్మృతః 4**

జగత్తంతా బ్రహ్మమే అని తెలుసుకొని, నేనే బ్రహ్మన్ని అనే నిశ్చయం కలవాడై, ఆత్మస్వరూపాన్నే అనుసంధానం చేస్తూ వ్యవహార మాత్రంగా మామూలు మనిషిగా ఉన్నప్పటికీ, లోపల బ్రహ్మానందంతో తృప్తి పొంది ఉండేవాడు (అట్టిముని) జీవన్ముక్తుడు.

**వాఙ్మౌనం వచసాం రోధో బలాదింద్రియ నిగ్రహః**
**అక్షమౌనం పరిత్యాగ శ్చేష్టానాం కాష్ఠ సంజ్ఞకం 5**
**ప్రస్ఫుర చ్చిత్త కలన మేత న్మౌన త్రయం స్థితం**
**ఏతేషాం హఠామౌనానాం విషయః కాష్ఠతాపసః 6**

సుషుప్త మౌనాన్ని చెప్పబోయేముందు ఇతర మౌనాల్ని గురించి చెపుతున్నారు– వాక్కును నిరోధించటం వాఙ్మౌనం. హఠయోగం ద్వారా చక్షురాదీంద్రియాలను నిరోధించటం అక్షమౌనం. శరీరము దాని అవయువాలను వాటి చేష్టలను నిరోధించటం కాష్ఠమౌనం. ఈ మూడూ చిత్త వాసనతో కూడి ఉంటాయి. కాబట్టి (బ్రహ్మ భావన ఉండదు కాబట్టి) కాష్ఠతాపసుడైనవాడే వీటిని ఆశ్రయిస్తాడు.

**అవిభాగ మనాయాసం యదనాద్యంత మాస్థితం**
**ధ్యాయతో ధ్యాతశ్చైవ సౌషుప్తం మౌనముచ్యతే 7**
**యథాభూత మిదం బుద్ధ్వా జగన్నా నాత్వ విభ్రమం**
**యదాస్థిత మ సందేహం సౌషుప్తం మౌనముచ్యతే 8.**

అనేక సంవిద్రూపాత్మ శివమే వేద మాతతం.
ఇత్యాస్థిత మనంతం యాత్సౌషుప్తం మౌనముచ్యతే 9
సుషుప్త మౌనం యోగీశై ర్ద్వివిధైః ప్రాప్యతే ఖలు
సాంఖ్య యోగిన ఏకే స్యురపరే యోగయోగినః 10

అంతర్ముఖుడైనా, బహిర్ముఖుడైనా, ముని యొక్క జాగ్రత్ స్వప్న సుషుప్తుల విభాగం ఉండదు. కర్మేంద్రియాలను నిరోధించటంలో కలిగే క్లేశమూ ఉండదు. ఉపక్రమోపసంహారాలూ ఉండవు. అట్టి బ్రహ్మనిష్ఠలో ఉండటాన్నే సుషుప్తమౌనం అంటారు.

అనేక విధాలుగా పరిభ్రమిస్తూ ఉన్న ఈ జగత్తు బ్రహ్మమందు అధ్యస్తమై ఉన్నది కాబట్టి, జగత్తును బ్రహ్మరూపంగానే నిశ్చయించి నిర్వికల్పంగా బ్రహ్మభావంతో ఉండటాన్నే సుషుప్తమౌనమంటారు.

ఈ జగత్తు అనేకసంవిద్రూపములైన (జ్ఞాన రూపములైన) ఆత్మస్వభావాలు కలదనీ వ్యాప్తమైన బ్రహ్మమే అనీ, నిరవధికమైన బ్రహ్మ నిష్ఠ కలిగి ఉండటాన్నే సుషుప్తమౌనం అంటారు.

ఈ జగత్తు, చిదాకాశ వివర్తం కాబట్టి, ఆకాశవహౌతోంది. మూర్తిమంతమైయున్నది కాబట్టి, ఆకాశమూ కాదు. అధిష్ఠాన సత్తవలన (సద్రూపంగా తోచటం వల్ల) ఉన్నది. కల్పితమైనది కాబట్టి లేదు. అని, ఇట్లా జగము, బ్రహ్మ కంటె భిన్నం కాదని నిశ్చయించి, ఏకా కారమూ నిర్వికారమూ అయిన బ్రహ్మనిష్ఠతో ఉండటమే సుషుప్తమౌనం (సుషుప్తితో సమానమైన మౌనం) అనిపించుకుంటుంది.

సాంఖ్యులు, (జ్ఞానులు) యోగులు ఈ ఇరువురే సుషుప్తమౌనాన్ని పాటిస్తూ ఉంటారు.

తత్త్వజ్ఞానోదయం చేత లభించిన సమాధినిష్ఠ గల యోగులు సంఖ్యా (జ్ఞానము) చేతనే సిద్ధిని పొందుతారు. కాబట్టి వారు సాంఖ్యులు. అష్టాంగ యోగం చేత ప్రాణాదివాయువులు శాంతింపగా, ఆద్యంత రహితమైన బ్రహ్మమును పొందినవారు యోగులు.

ఆత్మతత్త్వాన్ని నిరంతరం అనుసంధానం చేయటం, ప్రాణాది వాయువుల్ని లయమొందించటం, మనో నిగ్రహం అనేవి మూడే మోక్ష సాధనాలు. వీటిలో ఒకటి సిద్ధిస్తే మిగతా రెండూ సిద్ధిస్తాయి. ఏ ఒకటి లేకపోయినా మిగతా రెండూ నశిస్తాయి. వీటిలో ప్రాణలయం చిత్తలయం అనే వాటిలో ఏ ఒకటి లేకపోయినా

రెండవది నశిస్తుంది. అందుకే ప్రాణచిత్తాలు రెండూ, తాము నశించి మోక్షమనే ఉత్తమ కార్యాన్ని చేస్తున్నాయి. ఆత్మ స్వరూపత్వాన్ని పొందేటంతవరకు, చిత్త వృత్తిని ఆత్మతత్త్వంలో నిలిపి ఉంచాలి. చిరకాలాను సంధానం వల్ల చిత్తం ఏ వస్తువునందు ఏకాగ్ర మౌతోందో, ఆ వస్తువే అవుతోంది.

రామా! సంసారం స్వప్న భ్రాంతితో సమానమైనది అనే విషయమై బేతాలుడు దాహరించిన ప్రశ్నలు ఉదాహరణలౌతాయి. సందర్భాన్ని బట్టి గుర్తుకు వచ్చాయి. చెపుతాను, విను.

వింధ్యారణ్యంలో మహాకాయుడైన బేతాలుడున్నాడు. అతడు తిండికోసం ఒక దేశానికి వెళ్ళాడు. అతడు నిరపరాధుల్ని, నిర్నిమిత్తంగా వధించి తినడు. అతడు తిండి కోసం, ఆ రాజ్యంలో రాత్రిపూట తిరుగుతూ ఉండగా, ప్రచ్ఛన్న వేషంలో, రాజ్యస్థితిని తెలుసుకొనగోరి తిరుగుతున్న రాజు కనిపించాడు. బేతాలుడు పెద్దగా అరుస్తూ అతనిని భక్షింపదలచాడు. ఇది చూచి, రాజు ఓరీ! బేతాలా! అన్యాయంగా, బలాత్కారంగా నన్ను వధించి తింటే, నీ తల వేయి ముక్కలౌతుంది ; జాగ్రత్త! అన్నాడు.

బేతాలుడిట్లా అన్నాడు – రాజా! నేను నిన్ను అన్యాయంగా తినను. నేనడిగే ప్రశ్నలకు సరియైన సమాధానాలిస్తే నిన్ను భక్షింపను. రాజు అందుకు అంగీకరించాడు. వారి ప్రశ్నోత్తరాలు.

బేతాలుడు : – బ్రహ్మాండములు ఏ సూర్యుని కిరణాలకు పరమాణువు లౌతున్నాయి?

రాజు :- ఓ బేతాలా! నీవు చిత్ అనే సూర్యుని గురించి అడిగావు. చిత్సూర్యుడే సమస్తాన్నీ ప్రకాశింపజేస్తున్నాడు. ఇతడే జీవ రూపంలో అంతఃకరణాలను ప్రవర్తింపజేస్తున్నాడు. సూర్యులు ఈతని తేజోలేశాలు. కాబట్టి, ఇతడు సూర్యులందరికీ సూర్యుడు. ఈ చిత్ సూర్యుని ముందు బ్రహ్మాండాలన్నీ పరమాణువులతో సమానం. అన్నీ ఆ చిత్సూర్యుని కాంతిచేతనే ప్రకాశిస్తున్నాయి.

బేతాలుడు : – మహాకాశములనే రేణువులు ఏ వాయువు నందు ప్రకాశిస్తున్నాయి?

రాజు : – కాలశక్తి స్ఫురణము, గగనశక్తి స్ఫురణము, వాయుశక్తి స్ఫురణము, చిచ్ఛక్తి స్ఫురణము ఇటువంటి వన్నీ పరమాత్మ అనే మహా వాయువునందు, పుష్పమునందు పరిమళంలాగా, స్వరూప మవటం వల్లను, ప్రకాశమానమవటం

వల్లనూ తద్రూపంబులుగానూ, అన్వృత జడ దుఃఖాత్మకాలైనందున అతద్రూపములూ అయి ప్రకాశిస్తున్నాయి. తద్రూపంగా = ఆ మహావాయు రూపంగాను, అతద్రూపంగా = ఆ మహావాయువు కానట్లుగానూ ప్రకాశిస్తున్నాయి.

బేతాలుడు : – ఎవడు స్వప్నము నుండి, వేల కొలది స్వప్నాంతరాలను పొంది (స్వప్నంలోనే స్వప్నాలను పొంది) వాటిని వదలివేస్తూ నిర్మలమైన తన రూపాన్ని విడువకుండా ఉంటాడు?

రాజు :– మాయతో నిండినది కాబట్టి ఈ జగత్తే మహాస్వప్నం. ఆ మహాస్వప్నంలో, ఆత్మ, జన్మలనే చిన్న చిన్న స్వప్నాలను అనుభవిస్తూ, శాంతమైన తన బ్రహ్మభావాన్ని వదలడు.

బేతాలుడు : – అరటి చెట్టును లోపల లోపల విమర్శించి చూస్తే, కేవలం ఆకులు గానే ఉన్నట్లు, లోలోన విమర్శిస్తే ఏది తానే అయి వెలుగుతోంది?

రాజు :– అరటిచెట్టు విమర్శించిన కొలదీ, పత్రమాత్రంగానే ఉన్నట్లుగా, ఈ జగత్తు అనేక విధాలుగా ఉన్నా లోపల విచారిస్తే బ్రహ్మమే అయి ఉంది.

బేతాలుడు : – బ్రహ్మాండములు, ఆకాశము, భూతజాలము, సూర్యమండలము, మేరువు, ఇవి అన్నీ ఏ అణువు యొక్క పరమాణువులు?

రాజు :– పరమాత్మ గ్రహింపశక్యం కానివాడు, పొందశక్యం కానివాడగుట వలన పరమాణువుతో సమానుడు. ఈ పరమాత్మ దేశకాలాదుల చేత అపరిచ్ఛిన్నుడు. కాబట్టే పరిచ్ఛిన్నములైన మేరువు మొదలైన వాటికి మూలమగుచున్నాడు. బ్రహ్మాండాలు, మేరువు మొదలైవి పరమాత్మ ముందర ఇంకా పరమాణువులుగా ప్రకాశిస్తున్నాయి.

బేతాలుడు : – జగత్త్రయము అవయవ రహితమైన, ఏ పరమాణువు అనే, మహా పర్వతం యొక్క, రాళ్ళ నడుమ నుండే సారవంతమైనది?

రాజు :– ఈ ఆత్మ, అగ్రాహ్యుడైనందు వల్ల పరమాణువైనప్పటికీ, వ్యాపకుడైనందు వల్ల మహా పర్వతం లాంటి వాడు. స్థూల ప్రపంచాకారంలో కనిపిస్తూన్నా వాస్తవంగా అవయవ రహితుడు. ఈ ముల్లోకాలు (జగత్త్రయం) సర్వ ప్రపంచాలకూ అధిష్ఠాన భూతుడైన, విజ్ఞాన రూపుడైన ఈ పురుషుని యొక్క సారాంశం వంటిది. ఈ సదుత్తరాలను విని బేతాలుడు రాజును వదలి, వివేకంతో శాంతించి, ఆకలిని మరచి, ఏకాంతాన ధ్యానపరుడైనాడు.

# 8. భగీరథోపాఖ్యానము.

(చిత్త విశ్రాంతి దుర్లభమే అయినా స్వప్రయత్నం చేత లభిస్తుంది, అని చెప్పదలచి ఈ భగీరథోపాఖ్యానాన్ని చెపుతున్నారు)

వసిష్ఠుడు శ్రీరామునితో చెపుతున్నాడు -

శ్రీరామా! ధర్మశీలుడైన భగీరథుడనే రాజు ఉండే వాడు. అతడు యాచకులకు చింతామణి వంటివాడు. పాతాళ వాసులైన తన బంధువులను గంగఅనేసోపాన మార్గం ద్వారా బ్రహ్మలోకానికి పంపాడు. అతనికి యౌవనంలోనే దైవవశాన వైరాగ్యం కలిగి ఆత్మ విచారం చేయాలనే కోరిక పుట్టింది.

ఈ ఆత్మ విచారణేచ్ఛ బలవత్తరం కాగా, అతడు త్రితులుడు అనే గురువు వద్దకు వెళ్ళాడు. త్రితులుడు అతనికి తత్త్వజ్ఞానాన్ని ఉపదేశించాడు - దేహాదులందు అహంభావం నశిస్తే, రాగద్వేషాలు పోయి, సంసారమనే రోగానికి ఔషధం లాంటి జ్ఞానం ఉదయిస్తుంది అని చెప్పాడు.

కొంతకాలం గడచింది. భగీరథుడు సర్వత్యాగము సిద్ధించటం కోసం, అగ్నిష్టోమమనే యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞంలో యాచకులకు సమస్తమూ దానం చేశాడు. ఇక కట్టుకొన్న వస్త్రాలు తప్ప ఏవీ మిగలలేదు.

తన పట్టణాన్ని వదలి, తన నామ రూపాలు వ్యక్తం కానీయకుండా గ్రామాల్లో తిరుగసాగాడు. ఇట్లా ఆత్మ నిష్ఠుడైన అతడు బాటసారుల వెంటపడి, నానా దేశాలు తిరుగుతూ, శత్రువు చేత ఆక్రమింపబడిన తన పూర్వపు నగరానికే వచ్చి భిక్షాటనచేయసాగాడు. పురజనులు భగీరథుని గుర్తించి దుఃఖంతోనే పూజించారు. ఇట్లా తిరుగుతూ అతడు మళ్ళీ ఒకసారి గురువైన త్రితులుని వద్దకు వెళ్ళాడు. ఆ గురు శిష్యులిరువురూ సమత్వాన్ని పొంది, దేహధారణాన్ని దుఃఖ హేతువుగా తలచారు. సిద్ధులొసగిన అష్టవిధైశ్వర్యాలను తృణప్రాయంగా వదలివేశారు.

ఇట్లా ఉండగా ఒకప్పుడు, ఒక పట్టణంలో, పుత్రహీనుడైన రాజు చనిపోయాడు. మంత్రులు, ప్రజలు రాజు లేనందున దుఃఖిస్తున్నారు. భిక్షావృత్తిలో సంచరిస్తున్న భగీరథుని చూచారు - అతని గుణసంపదను చూచారు. భగీరథుని కొనిపోయి రాజుగా పట్టాభిషిక్తుని చేశారు. పూర్వపు మంత్రులు భగీరథునితో ఇట్లా అన్నారు - ''రాజా! పూర్వం నీవు మాకు ఏర్పరచిన రాజును మృత్యువు భక్షించింది. కాబట్టి మీరే ఈ రాజ్యాన్ని పాలించండి'' అని.

రామా! వారు ఇట్లా ప్రార్థింపగా భగీరథుడు శాంతచిత్తుడై, విరాగియై,

మాత్సర్యం లేనివాడై, ప్రాప్తించిన కార్యం చేయటంలో ఆసక్తి కలవాడై రాజ్యాన్ని పాలించాడు. అతడు అనేక వేల సంవత్సరాలు తపస్సు చేసి భూమిపై గంగను ప్రవహింపజేశాడు.

## 9. శిఖిధ్వజోపాఖ్యానం

(ప్రతిబంధకంగా ఉన్నట్టి పాపసంచయం క్షయం కానందు వల్ల ఆత్మజ్ఞానం దుర్లభమైనప్పటికీ, ఆచార్య ప్రయత్నాతిశయం చేత లభిస్తుందని చెప్పటానికై అనేక ఉపాఖ్యానాలతో కూడిన ఈ శిఖిధ్వజోపాఖ్యానాన్ని చెపుతున్నారు.)

వసిష్ఠుడిట్లా చెపుతున్నాడు - రామా! వెనక ఏడవ మన్వంతరంలో ద్వాపరమందు మాలవ దేశంలో శిఖిధ్వజుడనే రాజు ఉండేవాడు. అతని భార్య పేరు చూడాల. ఆమె సురాష్ట్ర రాజకన్య. వారిరువురూ చిరకాలం యౌవన విలాసాల్లో క్రీడించారు. చాలా కాలం ఇట్లా గడచింది. ఆ ఇరువురూ భవరోగానికి ఔషధం లాంటి అధ్యాత్మ శాస్త్రాన్ని చాలకాలం విచారణ చేశారు.

చూడాల చాల కాలం పాటు ఆత్మ విచారణ చేసింది. చిద్రూపాన్ని తెలుసుకొన్నది. ఆమె ప్రతిదినము ఆత్మయందు క్రీడిస్తూ ఉన్నందు వల్లను, అంతర్ముఖురాలై ఉన్నందు వల్లను, జ్ఞానాన్ని దృఢంగా అభ్యాసం చేయటం వల్లను మిక్కిలి ప్రకాశించింది. ఒకనాడు శిఖిధ్వజుడు నిర్మలమైన కాంతిచే ప్రకాశిస్తున్న చూడాలను గాంచి ఆశ్చర్యపడ్డాడు. దీనికి కారణం అడుగగా చూడాల తన అనుభవాన్ని గురించి విశదీకరించి చెప్పింది.

కొంతకాలం గడువగా, ఒకప్పుడు చూడాలకు ఆకాశ గమన సిద్ధి పొందాలని తలచి, ప్రాణవాయువును ఊర్ధ్వదిశకు నడపించుటకై అభ్యాసం చేసింది. ఆకాశ గమన, పరకాయ ప్రవేశాది సిద్ధులను పొందింది. కాని శిఖిధ్వజానికి ఈ విషయం తెలియదు.

**కిరాటోపాఖ్యానము :** శ్రీరాముడు వసిష్ఠుని ఇట్లా అడిగాడు -

''మునీంద్రా! సిద్ధయోగినియైన చూడాల యొక్క ప్రయత్నాన్ని, అభ్యాసాన్ని చూచి అయినా శిఖిధ్వజుడు యోగాన్ని గురించి ఎందుకు తెలుసుకొనలేక పోయాడు?'' అని.

వసిష్ఠుడిట్లా అన్నాడు - ''రామా! గురూపదేశమనేది జ్ఞానబోధ కోసం చెప్పబడిన మర్యాద మాత్రమే! ఆత్మ సాక్షాత్కారం కావాలంటే శిష్యుని నిర్మలమైన

బుద్ధియే కారణం అవుతోంది'' అని

శ్రీరాముడన్నాడు - మునీంద్రా! లోక వ్యవహారంలో ఆత్మ జ్ఞానానికి గురూపదేశం కారణమనే వాడుక ఉన్నది కదా! అది యెట్లాగో చెప్పండి.

వసిష్ఠుడు చెపుతున్నాడు -

వింధ్యారణ్యంలో ధనవంతుడు, పరమలోభి, బహుకుటుంబికుడు అయిన వర్తకుడుండేవాడు. ఆతడు అరణ్యంలో పోతూ ఉండగా వాని చేతిలోని ఒక గవ్వ, గడ్డిచేత కప్పబటి యున్న నేలపై పడ్డది. వర్తకుడా గవ్వ కోసం ( గవ్వ = అత్యల్పమైన విలువ గల నాణెం) మూడు రోజులు శ్రమపడి ఆ ప్రదేశమంతా క్రుళ్లగించాడు. అట్లా వెదకుతూ ఉండగా అతనికి ఒక చింతామణి దొరికింది.

ఆ వర్తకుడు రాత్రింబవళ్లు అలసట లేకుండా గవ్వకోసం వెదకుతూ ఉండగా, విలువ కలిగిన గొప్ప మణి లభించినట్లుగా, గరూపదేశంచే ఆత్మజ్ఞానం లభిస్తుంది. అంటే, గురువు ఉపదేశించే ఉపాయం వల్ల ఉపాధితో కూడిన దేవుని ధ్యానిస్తూ ఉండగా, నిరుపాధికమైన బ్రహ్మము లభిస్తుంది.

చింతామణి లభించటానికి గవ్వ కారణమైనట్లే, బహుమూల్యమైన ఈ తత్త్వజ్ఞానానికి గురూపదేశం సాక్షాత్తు కారణం కాకపోయినా పరంపర చేత కారణమౌతోంది.

వసిష్ఠుడు శ్రీరామునితో ఇంకా అంటున్నాడు.

ఒకనాడు శిఖిధ్వజుడు ఏకాంతంలో తన తొడపై కూర్చున్న చూడాలతో అన్నాడు - '' ఓ కామినీ! చాల కాలం రాజ్యాన్ని అనుభవించాను. భోగాలు, ఐశ్వర్యాలు చూచాను. వైరాగ్యం కలిగింది. అడవికి పోతున్నాను.

చూడాల ఇట్లా అన్నది - వనవాసం అనేది శరీరంశీర్ణమైనవారికే తప్ప మీ వంటి యౌవనవంతులకు తగదు.

శిఖిధ్వజుడిట్లా అన్నాడు - నా కోరికకు విఘ్నాన్ని కలిగింపకుము. నీవు బాలవు కాబట్టి వనానికి రావద్దు.

ఆ రాత్రి సమయంలో అంతా నిద్రిస్తుండగా, చూడాలను వదలి రాజు వనానికి బయలుదేరాడు. శైల ప్రాంతంలో నున్న ఒక తపోవనాన్ని ప్రవేశించాడు. ఒక పర్ణశాలను నిర్మించుకొన్నాడు. ఫలమూలాలతో శరీర పోషణ చేస్తున్నాడు.

అచట రాజభవనంలో చూడాల మేల్కొన్నది. రాజు లేక పోవటం తెలుసుకొన్నది. గవాక్షం నుండి వెడలి అంతరిక్షానికి పోయి, కత్తిపట్టి పోతున్న

రాజును చూచింది. రాజుకు వనవాసం జరుగవలసి ఉన్నదని ఊహించింది కొంతకాలం తరువాత భర్త వద్దకు వెళ్ళాలి అనుకొన్నది. ఆమె రాజభవనంలోనే ఉన్నది.

ఇట్లా కొన్ని సంవత్సరాలు గడచినాయి. చూడాల తాను భర్తవద్దకు వెళ్ళవలసిన సమయం వచ్చిందని గ్రహించింది. రాత్రివేళ అంతఃపురం నుండి వెడలి యోగ శక్తితో వాయు మార్గాన మందర ప్రాంతాన్ని చేరింది. యోగశక్తిచేత అదృశ్యురాలై, చిక్కియున్నట్టి, ఆభరణాలు లేనట్టి, వన్నె తరగిపోయిన శిఖిధ్వజుని చూచింది. దుఃఖించింది. భర్తకు తత్త్వజ్ఞానాన్ని కలిగించి భోగమోక్షయుతుని చేయాలని సంకల్పించింది.

''నేను వేరొక రూపాన్ని దాల్చి అతని వద్దకు పోవాలి. ఈ రూపంతో వెడితే భార్య అనే భావంతో నా మాటలను నమ్మడు. '' అని తలచి యోగశక్తి చేత చూడాల ఒక ముని కుమారుని వేషాన్ని దాల్చి రాజు వద్దకు వెళ్ళింది.

శిఖిధ్వజుడు, ఆ బ్రాహ్మణపుత్రుని గాంచి, నమస్కరించి, అర్ఘ్యపాద్యాదులిచ్చి కూర్చుండబెట్టి వినయంతో అడిగాడు – ''ఓ జ్ఞానవైరాగ్య నిధీ! నీ వెవ్వడవు? ఎవని పుత్రుడవు? ఇచటి కేల వచ్చితివి? '' అని.

ఆ మునిపుత్రుడిట్లా చెప్పాడు – నారద మునీంద్రుడొకప్పుడు పర్వత గుహయందు ధ్యాన నిష్ఠుడై యుండెను. ఆ పర్వత చరియల నుండి గంగానది ప్రవహిస్తోంది. ధ్యానావసానంలో నారదుడు ఒక కలకల ధ్వనిని విన్నాడు. ఈ ధ్వని ఏమిటి? అని పరికించాడు. రంభ, తిలోత్తమ, ఆదిగా గల అప్సరసలు వస్త్ర రహితలై జలక్రీడలాడుతున్నారు. ఆ మునికి ఆనందం కలిగింది. ప్రాణవాయువు చలించింది. కామం వల్ల వీర్యపాతమైంది. దానిని ప్రక్కనున్న స్ఫటిక కలశంలో ఉంచి, సంకల్పాలనే క్షీరంతో ఆ కలశాన్ని నింపాడు. ఒక నెలకు ఆ వీర్యం ఒక బాలకుని రూపాన్ని పొందింది. నారదుడు సర్వ సంస్కారాలతో కూడిన ఆ బాలకుని యందు విద్యాధనాన్ని ఉంచాడు. పిమ్మట తన పుత్రుని బ్రహ్మవద్దకు తీసికొనిపోయాడు. బ్రహ్మ తన మనుమడైన ఆ బాలుని జ్ఞానవంతుని చేశాడు. ఓ రాజా! కుంభం మందు పుట్టిన నేను కుంభజుడనే పేరుగలవాడను. పోషించిన దగుటచే సరస్వతి నాకు తల్లి. ఆమె చెల్లెలగుటచే గాయత్రి నాకు పిన తల్లి'' అని చెప్పి చూడాల ఇట్లా అన్నది –

''ఓ సాధువా! నా వృత్తాంతం చెప్పాను. నీవు ఈ వనంలో ఏమి చేస్తున్నావో చెప్పు.'' అని.

శిఖిధ్వజుడు ఇట్లా అన్నాడు – మునీంద్రా! నేను శిఖిధ్వజుడనే రాజును. నేను సంసారానికి భయపడి వనంలో ఉన్నాను. ఉపవాస వ్రతం చేస్తున్నాను. అది కూడా దుఃఖజనకంగానే ఉంది.

మునికుమారుడు – రాజా! జ్ఞానమే శ్రేయస్కరమైనది. దాని వల్లనే కైవల్య ముక్తి లభిస్తుంది. తపస్స్వాధ్యాయ రూపమైన కర్మము వల్ల కాలహరణము, వినోదమే కలుగుతుంది. వాసన నశిస్తే కర్మఫలం నశిస్తుంది. వాసనారహితమైన క్రియ కూడా జన్మాంతరంలో ఫలించదు. సర్వమూ బ్రహ్మమే అని భావించటం చేత అజ్ఞానం నశిస్తుంది. అట్టి వానిలో వాసన జనింపదు. జీవుడు వాసనను విడచిపెట్టటం వల్ల జరామరణాలు లేనట్టి, పునర్జన్మ లేనట్టి ముక్తిని పొందుతాడు. నేను ఎవరిని? ఈ సంసారం ఎట్లా వచ్చింది? ఇది ఎట్లా పోతోంది? అని విచారింపక మూఢుని వలె ఉన్నావేమి? బ్రహ్మవేత్తలను సేవించి తెలుసుకోకుండా ఇట్లా ఉన్నావేమి?

శిఖిధ్వజుడు చూడాల (దేవపుత్రుడు) చెప్పిన మాటలను విని, తనకు బ్రహ్మోపదేశం చేయమని ప్రార్థించాడు. చూడాల అందుకు అంగీకరించి ముందుగా ఒక ఉపాఖ్యానాన్ని చెపుతోంది.

**చింతామణ్యుపాఖ్యానం :** రాజా! శ్రీమంతుడు, గుణవంతుడు తత్త్వవిదుడు అయిన పురుషుడు ఒకడున్నాడు. అతడు చింతామణిని సాధించాలని తలచాడు. అట్లా చాలకాలం ప్రయత్నింపగా, కాలవశాన చింతామణి దొరికింది. కాని అతనికి అదియే చింతామణి అనే నిశ్చయబుద్ధి లేనందు వల్ల, ఆశ్చర్యంతో ఆతడు ఇట్లా చింతించాడు– ''నిజంగా ఇది మణియేనా? ఇది మణి కాదు. మణి నాకెందుకు కనిపిస్తుంది? దీనిని స్పృశించి పరీక్షించనా? నేను స్పృశిస్తే మాయమైపోతుందేమో! జీవిత కాలమంతా ప్రయత్నిస్తే చింతామణి లభిస్తుందో లభించదో అని అంటారు గదా! ఈ స్వల్ప కాలంలోనే ఎట్లా లభిస్తుంది? చింతామణి సర్వసిద్ధి ప్రదం కదా! నేను పెద్దపుణ్యాత్ముడను కాను. సామాన్య మానవుడను. నాకెందుకు లభిస్తుంది?'' అని యిట్లా ఆలోచించి దానిని గ్రహించలేదు. అతడట్లా ఆలోచిస్తూ ఉండగానే ఆ మణి ఎగిరిపోయింది.

ఆతడు మళ్ళీ చింతమణిని సాధించటానికై యత్నిస్తున్నాడు. దృఢనిశ్చయం కలవారు కార్యసాధన విషయంలో నిరుత్సాహపడరు. అంతట, కొందరు సిద్ధులు,

ఆతనిని మోసగింపదలచి, ఆతని ముందు ఒక గాజు మణిని ఉంచారు. అతడా గాజు మణిని చూచాడు. ఇదే చింతామణి అని నిశ్చయించుకొన్నాడు. మూఢుడు, మోహం వల్ల మట్టిని కూడా బంగారంగా అనుకుంటాడు గదా! అతడు చింతామణితో సర్వసంపదలూ వస్తాయి కాబట్టి, నా ఈ ధనంతో ఏమి ప్రయోజనం? అని తలచి తన సంపదనంతనూ వదలి పరదేశానికి పోయాడు. ఆ దేశం సుఖకరమైనది కాదు. మణిప్రభావంతో సంపద పొంది సుఖిద్దామని అడవులకు పోయి, ఆ గాజు పెంకు వల్ల ప్రయోజనం లేనందు వల్ల ఆపదలను పొందాడు.

**గజోపాఖ్యానము :** చూడాల ఇంకా యిట్లా అన్నది – రాజా! జ్ఞానసాధనమైన ఇంకొక వృత్తాంతాన్ని చెపుతాను, విను.

వింధ్యవనంలో గజయూధానికి అధిపతియైన ఒక ఏనుగు ఉన్నది. అది చాల బలమైనది. దానికి రెండు తెల్లని దంతాలున్నాయి. మావటి వాడొకడు పట్టుకొని యినుప గొలుసు చేత బంధించాడు. అట్లా బంధింపబడి ఆ ఏనుగు దుఃఖించి, పరాధీనతను సహించలేక ఆ గొలుసును త్రెంపివేసింది. మావటి వాడా ఏనుగు గొలుసును త్రెంపటం చూచాడు. దానిని మళ్ళీ పట్టుకోవాలనే దృఢనిశ్చయంతో, ఒక తాటి చెట్టు ఎక్కి అట్లా పోతూ ఉన్న ఏనుగు మస్తకం మీదకు దూకాడు. కాని, అతడు ఏనుగు తలమీద పడకుండా, ఏనుగు ముందు భాగాన నేలపై పడ్డాడు. ఆ ఏనుగు దయతలచి, ఆతనిని త్రొక్కి చంపకుండా ప్రక్కనుండి వెళ్లిపోయింది.

మావటి వాడు లేచి, శరీరాన్ని స్వాధీనం చేసుకొని, ఏనుగును వెదకుతూ, అరణ్యంలో ఒక చోట దానిని చూచాడు. అతడు ఒక పెద్ద గోతిని త్రవ్వి, ఆ గోతి పైభాగన ఆకులు తీగలు మొదలైన వాటితో కప్పి ఉంచాడు. ఒక నాడా ఏనుగు విహరిస్తూ, ఆకులచే కప్పబడిన గోతిలో పడ్డది. మావటివాడు వచ్చి దానిని బంధించాడు. అది దుఃఖింపసాగింది. ఆ ఏనుగు తన ఎదుట క్రిందపడి యున్న మావటి వానిని ఆనాడు త్రొక్కి, చంపి ఉంటే, దానికీ దుఃఖం వచ్చేది కాదు. కాబట్టి, మానవుడు రాబోయే దుఃఖాన్ని, ప్రస్తుత క్రియల చేతనే పోగొట్టుకొనకపోతే ఆ ఏనుగు లాగానే దుఃఖాన్ని పొందాల్సి వస్తుంది.

ఇది విని శిఖిధ్వజుడిట్లా అడిగాడు – ''ఓ దేవపుత్రా! నీవు చెప్పినట్టి చింతామణ్యుపాఖ్యానము, గజోపాఖ్యానము అనే వీటి వల్ల గ్రహింపదగిన విషయం

ఏమిటి?'' అని.

చూడాల చెపుతోంది –

ఇతర శాస్త్రాలు చదువుకొన్నవాడూ, తత్వాన్ని గూర్చి తెలియని వాడూ అయినట్టి చింతామణి సాధకుడైన పురుషుడు నీవే! సమస్త దుఃఖాలూ పోగొట్టేది సర్వత్యాగం అనే చింతామణే! అటువంటి సర్వత్యాగాన్ని సాధించాలని కళత్రబాంధవులందరినీ వదలి రాజ్యం వదలి, ఆశ్రమానికి వచ్చావు. సర్వాన్నీ త్యజించకుండా అహంకారాన్ని మిగుల్చుకొన్నావు. కాబట్టి, సర్వత్యాగం పూర్తి కాలేదు. చిరకాల సాధ్యమైనది వేరే ఏదో ఉన్నదనీ, ఆనందప్రదమైన సర్వత్యాగం ఇది కాదనీ, నీ చిత్తంలో వికల్పం వృద్ధి చెందగా, త్యాగము నిన్ను వదలి పక్షిలాగా ఎగిరిపోయింది. ఇక నీవు చూచినది తపస్సు అనే గాజు మణిని. సులభసాధ్యము, పరమానందప్రదమూ అయిన వస్తువును వదలిపెట్టి, కష్టసాధ్యము, స్వల్పానంద ప్రదము అయిన దానిని పరిగ్రహించేవాడు పరిహాసపాత్రుడౌతాడు. రాజా! నీవు చింతామణిని పొందానని అనుకుంటున్నావు. స్ఫటికం ముక్కను కూడా నీవు పొందలేదు.

చూడాల గజోపాఖ్యానాన్ని వివరిస్తోంది – వింధ్యాటవిలో నుండిన ఏనుగవు నీవే! నీ వైరాగ్యం, వివేకం అనేవి రెండూ తెల్లని దంతాలు. నీ అజ్ఞానమే ఏనుగును పట్టదలచిన మావటివాడు. మహాబలశాలియైన ఏనుగు మావటివానికి భయపడ్డది, లొంగినది. నీవు కూడా అట్లాగే గొప్పశక్తి కలవాడవైనప్పటికీ అజ్ఞానం చేత భయాన్నీ దుఃఖాన్నీ పొందుతున్నావు. ఆశ అనేది ఇనుపగొలుసు. ఇనుము కాలక్రమంలో క్షయం కావచ్చు. కాని ఆశమాత్రం వృద్ధిపొందుతుంది. ఏనుగు బలమైన గొలుసును త్రెంచటం అంటే, నీవు భోగాలనూ, రాజ్యాన్నీ వదలివేయటం. మావటివాడు తాటి చెట్టు నుండి క్రిందపడటం, అంటే, నీవు రాజ్యాన్ని వదలటం వల్ల అజ్ఞానం పడిపోయింది. విరక్తితో అజ్ఞానం భయపడి వణకుతుంది. అట్లా పడిపోయిన అజ్ఞానాన్ని, సర్వత్యాగం అనే కత్తితో నీవు నరికివేయాల్సింది. అట్లా నీవు చేయలేదు. అందు చేతనే ఆ అజ్ఞానం నిన్ను మళ్లీ గోతిలో పడవేసింది. రాజ్యాన్ని వదలినప్పుడే అజ్ఞానాన్ని వధించి ఉంటే, నీకు బాధ ఉండేది కాదు. మావటివాడు గుంటలోని ఏనుగును మళ్ళీ పట్టుకోవటం అంటే, అజ్ఞానం నీకు దుఃఖాన్ని కలిగించింది అని భావం. మావటి వాడు గోయి త్రవ్వటకు వాని సాధన సంపత్తి (సామగ్రి) నీలోని విచారణ లేకపోవటం,

అనాదరం, చింత అనేవి. గోతిని కప్పిన తీగలు అంటే తపోదుఃఖము చేత, సజ్జన వృత్తుల చేత కొద్దిగా గోయి ఆవరింపబడ్డదన్న మాట. రాజా! నీవు ఈ నాటికీ దుఃఖప్రదమైన గోతిలో ఉన్నావు.

చూడాల (కుంభుడు) సర్వత్యాగ మంటే ఏమిటో వివరింపదలచి ఇట్లా అంటోంది. రాజా! ధనం, భార్య, ఇల్లు, రాజ్యం, భూమీ వగైరాలతో నీకేవిధమైన సంబంధమూ లేదు. ఇవేవీ నీవి కావు. నీవి కాని వాటిని వదలినందున నీకు సర్వత్యాగం ఎట్లా సిద్ధిస్తుంది? నీవు నీకున్న రాగాన్ని వదలి పెట్టాలి. దాని వల్ల నీకు దుఃఖరాహిత్యం కలుగుతుంది.

ఈ విధంగా దేవపుత్రుని వాక్యాల వల్ల ప్రేరితుడై శిఖిధ్వజుడు వనములోని పర్ణశాల, ఫలాహారపాత్రం, కృష్ణాజినం, జపమాలికమొదలైన వాటి మీద రాగాన్ని వదలి – నావి అనేభావం వదలి అగ్నిలో వేసి తృప్తి చెందాడు.

దేవపుత్రునితో ఇట్లా అన్నాడు – ఓ దేవపుత్రా! నీ చే బోధింపబడి సర్వత్యాగంచేసి నేను కేవలుడను, శుద్ధుడను, చిన్మాత్రుడను అయినాను. ఇంకా మిగిలి యున్నది ఏదో చెప్పు.

దేవపుత్రుడు (కుంభజుడు) ఇట్లా అన్నాడు – రాజా! నీవు సర్వత్యాగివి కాలేదు. వ్యర్థంగా పరమానందాన్ని పొందినట్లు నటించవద్దు.

రాజు :– అయితే, ఇంద్రియాలు, రక్తమాంసాది వికారాలతో కూడిన ఈ శరీరాన్ని నశింపజేసి సర్వత్యాగినౌతాను.

కుంభుడు :– రాజా! జ్ఞాన విహీనమైన పశువు, రోషంతో దూడను హింసించినట్లు నిరపరాధియైన దేహాన్ని ఏ బిలంలో వదలిపెడతావు? అట్లా దేహాన్ని వదలినందున సర్వత్యాగం సిద్ధించదు. దేని వల్ల ఈ దేహం క్షోభను పొందుతోందో, ఏది జన్మ కర్మలకు మూల కారణమో అట్టి చిత్తాన్ని వదలి వేస్తే సర్వత్యాగం సిద్ధిస్తుంది. జన్మ మరణ కర్మాదులన్నింటికీ చిత్తమే కారణం. దానిని వదలి – సర్వత్యాగంచేసి ఏ రూపంతో ఉంటావో ఆ రూపంతో ఉండు! అని చెప్పి ఆ కుంభుడు, శిఖిధ్వజుడు ప్రార్థించిన మీదట చిత్తస్వరూపాన్ని, అహంకార స్వరూపాన్ని వివరించి చెపుతున్నాడు –

**వాసనైవ సదా రాజన్ స్వరూపం విద్ధి చేతసః**
**చిత్తశబ్దస్తు పర్యాయో వాసనాయా ఉదాహృతః** 1

రాజా! వాసనయే చిత్తం యొక్క స్వరూపం. చిత్తమనే శబ్దం. వాసనకే పర్యాయపదం. చిత్తమనే వృక్షానికి అహంకారం బీజం. ఆ బీజం వల్ల వచ్చే అంకురమే బుద్ధి. చిత్తమనే వృక్షానికి మూలమైన అహంకారాన్ని ఛేదించు.

**వాసనా వివిధాశ్శాఖాః ఫలంత్యో వివిధం ఫలం**
**అభావితా భవంత్యంతర్లూనా స్సంవిద్బలేనవై** 2

అనేక రకాల సుఖదుఃఖాలనే ఫలాలను కలిగిస్తున్న వాసనలనే శాఖలను ఆత్మానుసంధాన బలంచేత లోన భావింపకుండా ఉపేక్షిస్తే ఆ శాఖలు ఛేదింపబడిన వౌతాయి. పెరగవు. ఫలాలనీయవు.

**అసంసక్తమనా మౌనీ శాంత వాద విచక్షణః**
**సంప్రాప్తకారీ యస్సోంతర్లూన చిత్తలతో భవేత్** 3

విషయాసక్తి లేనివాడూ, మౌననిష్ఠుడు, నిర్వివాదుడు, ఆవశ్యక కార్యాల్ని చేసేవాడూ చిత్తం యొక్క శాఖలను ఛేదిస్తాడు.

**గౌణం శాఖా విలవనం ముఖ్యం మూల వికర్తనం**
**చిత్తవృక్షస్య తేన త్వం మూలకాష పరో భవ.** 4

చిత్తమనే వృక్షం యొక్క శాఖలను ఛేదించటం అంతగా ముఖ్యంకాదు. మూలమైన అహంకారాన్ని ఛేదించటం మాత్రం చాలా ముఖ్యం. కాబట్టి మూలాన్ని ఛేదించే విషయంలో ఆసక్తి కలవాడవు కమ్ము.

అట్లా చేస్తే చిత్త రాహిత్యం అవుతుంది. చిత్తమనే వృక్షాన్ని కాల్చటానికి ఆత్మ విచారమనేది అగ్ని లాంటిదని గ్రహించు. దేవపుత్రుడైన కుంభజుని ఉపదేశాన్ని విని రాజు ఇట్లా అన్నాడు –

ఓ మునీంద్రా! నేను తెలుసుకొన్నాను. కర్త లేనందు వల్ల కార్యం అనే జగత్తు లేదని, దృశ్యాను సంధానం లేదని యుక్తిపూర్వకంగా చెప్పారు. దృశ్యం ఏమాత్రమూ లేదని నిరోధింపబడ్డాను కాబట్టి చిన్మాత్ర రూపుడనైన నేనే సర్వాత్ముడనై ప్రకాశిస్తున్నాను, అనే బోధము కలవాడనైనాను. అందుచే చిన్మాత్రుడనై యున్నాను. కాబట్టి పరమాత్మనైనాను. నేను ఇప్పుడు దృశ్యాను సంధానాన్ని విడిచి శాంతిని పొందాను...

ఇది విని కుంభుడు శిఖిధ్వజునితో ఇట్లా అన్నాడు - మహారాజా! ఈ జగత్తు ఎట్లా కలిగిందో, ఎట్లా లయంచెందుతుందో నీకు చెప్పాను. ఈ విషయం మనస్సులో ఉంచుకొని, యుక్తుల చేత అనుసంధానం చేసియు, యదార్థంగా నిశ్చయించుకొనియు, స్ఫుటమైన జీవన్ముక్తి పదంలో యధేచ్ఛగా ఉండు.'' అని చెప్పి ( కుంభుడు ) చూడాల అంతర్ధానమైంది.

పిమ్మట చూడాల అంతఃపురానికి వెళ్ళి, నిజదేహంతో మూడు సంవత్సరాలు రాజకార్యాలు నిర్వహించి, మళ్ళీ భర్త యున్న చోటకు వచ్చి సింహనాదం చేసింది. నిర్వికల్ప సమాధిలో నున్న శిఖిధ్వజుడు కనులు విప్పి చూడలేదు. ఆశ్చర్యపడి, తనలో ఇట్లా అనుకుంది - ''రాజు ఆత్మ పదమందు విశ్రాంతి నొందాడు. నేనీ రాజు దేహాన్ని పరీక్షించి, ఈ శరీరంలో జీవిత శేషం ఉన్నట్లయితే, ఆతని దాంపత్య యోగానికై నేనూ జీవించి ఉంటాను. లేకపోతే ఈ స్త్రీ రూపాన్ని వదలి పరమపదాన్ని పొందుతాను.''అని ఆలోచించి రాజు శరీరాన్ని పరీక్షించింది. ఆతని హృదయంలో బోధహేతువైన జీవిత శేషం ఉన్నదని తెలిసుకొన్నది. ఆమె తన దేహాన్ని విడచి, బ్రహ్మ లక్షణంగా ఉన్న రాజన్యుని చిత్తత్వంలో ప్రవేశించింది. అందు నిర్వికల్ప సమాధిచే, క్షీరనీర న్యాయంగా కలసిపోయిన చిత్తాన్ని వేరు చేసి, తన దేహాన్ని పొంది సామగానం ఆరంభించింది. ఆ సామగానం విని రాజు యొక్క చైతన్యం వికసించింది. కళ్ళు తెరచి చూచాడు. ఎదుట కుంభుడు ఉన్నాడు. అతనితో రాజు ఇట్లా అన్నాడు - ''మునిపుత్రా! అదృష్టవశమున కనిపించావు. నన్ను పవిత్రుని చేశావు.''

కుంభుడు :- రాజా! ఇచటి నుండి వెళ్లినప్పటి నుండి, నా చిత్తము నీ యందే లగ్నమై ఉన్నది. స్వర్గలీలలందు నీతోనే కలసి ఉంటాను. నీ వంటి బంధువు, ఆప్తుడు, శిష్యుడు మరొకడు లేడు.''

శిఖిధ్వజుడు :- నీవు నా సాంగత్యం కోరుతున్నావు కాబట్టి, పూర్వార్జితమైన నా పుణ్యం ఫలించింది. మీరు ఉపదేశించిన యోగ నిష్ఠ వల్ల పొందే సుఖం స్వర్గంలో మాత్రం ఎట్లా కలుగుతుంది? స్వర్గంలో అయినా, భూమియందైనా ఆత్మ నిష్ఠను అవలంబించి విహరిస్తాను.

కుంభుడు :- రాజా! నీవు నిజంగా పరమ పదము నందు ఆనందంగా విశ్రమించావా? చిత్తం నిరుద్వేగంగా ఉంటోందా?

శిఖిధ్వజుడు :- మునీంద్రా! నీ అనుగ్రహం వల్ల దుఃఖరహితుడనై యున్నాను.

ఆకాశంలాగా నిర్మలుడనై యున్నాను.

వారిద్దరూ పరమస్నేహంతో భేదరహితులై సంతోషులై వనంలో సంచరిస్తున్నారు. శిఖిధ్వజుడు సమచిత్తత చేత కుంభుని లాగా ప్రకాశిస్తున్నాడు చూడాల అతనిని దేవ పుత్రునిలాగా కాంతియుక్తునిగా చూచి ఆశ్చర్యపడ్డది.

కుంభుడొకనాడు శిఖిధ్వజునితో అన్నాడు – ''రాజా! నేడు చైత్రశుద్ధపాడ్యమి. స్వర్గంలో ఇంద్రుని ఆస్థానంలో వేడుకలు జరుగుతాయి. నేనీనాడు నా తండ్రి యెదుట ఉండాలి. అని చెప్పి, అతని వద్ద సెలవు తీసికొని వెళ్ళాడు.

చూడాల తన నగరానికి వెళ్ళి, రాజ కార్యాలన్నింటినీ తీర్చి, మళ్ళీ శిఖిధ్వజుని యెదుటకు వచ్చింది.

రాజు – దేవపుత్రా! స్వాగతము. నీవు విమనస్కుడవు వలె ఉన్నావేమి?

కుంభుడు (చూడాల) :– రాజా! స్వర్గంలో జరిగిన వృత్తాంతం చెపుతున్నాను. విను. నేనిచటి నుండి వెళ్ళి, ఉత్సవానంతరం తండ్రి అనుమతి పొంది యిచటికి వస్తూ ఉండగా, ఆకాశంలో నల్లని మేఘాలలో దుర్వాసముని కన్పింపగా, ఆతనితో ఇట్లా అన్నాను – ''ఓ మునీంద్రా! నల్లని మేఘాలనే వస్త్రాలను ధరించిన నీవు అభిసారిక వలె ఉన్నావు.'' నా మాటలకాతడు కినుక వహించి, నీవు రాత్రులందు స్తనకేశాదిస్త్రీ లక్షణాలతో, హావభావాది వికారాలు కలిగి ఉందువు గాక! అని నుడివి మాయమైనాడు. కాబట్టి, నేనిక నీతో ఈ విధంగా పగలు మునికుమారునిగ, రాత్రి స్త్రీ రూపంలోనూ ఉండాల్సివస్తోంది గదా! అని చింతిస్తున్నాను.

రాజు :– జరిగిన దానికి వగచి ప్రయోజనం లేదు, అట్లాగే మనం పరస్పర సంభాషణలతో వెనుకటి వలెనే ఉందాము, అని ఊరడించాడు. చూడాల పగలు కుంభుని వలె రాత్రి స్త్రీ వలె అతని సాన్నిధ్యంలోనే ఉంటోంది. ఇట్లా ఉంటూ ఉండగా చూడాల శిఖిధ్వజుని వివాహంచేసుకోవాలనే తన తలంపును ప్రకటించింది. ఈ వివాహం వల్ల మేలుగాని, కీడు గాని లేదు, అని తన అంగీకారాన్ని తెలపాడు. వారిరువురూ వివాహం చేసుకొన్నారు. పిమ్మట, చూడాల మూడు రోజుల కొకసారి నగరానికి వెళ్ళి రాజకార్యాలు తీర్చి వస్తోంది. ఒకనాడు చూడాల తనలో ఈ రాజుకు కామవికారం, భోగాలయందాసక్తి, ఉన్నదో లేదో పరీక్షింప నెంచి, దేవతలు, అప్సరసలతో కూడిన ఇంద్రుని ఆ వనంలో ఆతనికి కనిపింప చేసింది. శిఖిధ్వజుడు ఇంద్రాదుల్ని పూజించాడు. ఇంద్రుడు శిఖిధ్వజుని తనతో పాటు

స్వర్గానికి వచ్చి స్వర్గ భోగాలను అనుభవింపుమని ఆహ్వానించాడు. రాజు, ''నా మనస్సు వాంఛారహితమై యున్నది. కాబట్టి స్వర్గానికి రాను'' అని మృదువుగా తిరస్కరించాడు. ఇంద్రుడు వెళ్ళిపోయాడు.

చూడాల, రాగద్వేష ప్రధానము, భ్రాంతి జనకము అయిన పద్ధతిలో మళ్ళీ రాజును పరీక్షింపదలచింది.

రాజు, ఒకనాడు జపసంధ్యా తత్పరుడై యుండగా, చూడాల తానొక విటునితో కలసి, ఆ కల్పిత విటుని కౌగలించుకొని యున్నట్లు నటిస్తోంది. శిఖిధ్వజుడు వచ్చి ఆ దృశ్యాన్ని చూచి, నిర్వికారుడై, వారి ఆనందానికి భగ్నం కలిగించకుండా దూరంగా తొలగిపోయాడు. చూడాల చేసిన ఈ పరీక్షలో సైతం రాజు నెగ్గాడు. పిమ్మట చూడాల నిజరూపాన్ని ధరించింది.

శిఖిధ్వజుడు, తాను రాజ్యాన్ని విడిచి వచ్చింది మొదలుకొని, జరిగిన వృత్తాంతాన్ని ధ్యానదృష్టితో చూచి, సమాధి నిష్ఠను విరమించి, తన కాంతను కౌగలించుకొని, తొడపై కూర్చుండబెట్టుకొని ఇట్లా అన్నాడు –

కాంతా! దాటశక్యం కాని, ఈ సంసారాటవి నుండి, యోగం చేత నన్ను దరిచేర్చావు. నీకు సాటియైన వారు లేరు. ఇచ్ఛారహితురాలవై సంసారాన్ని తరించిన నీవు, నాకు చేసిన ఈ ఉపకారానికి ప్రత్యుపకారం చేయలేను. నీ అనుగ్రహం వల్ల సంసార సముద్రం నుండి తరించి, సర్వాతీతుడు, సర్వగతుడు, ఆకాశతుల్యుడను అయినాను. ఇంక ఏమి చేయాలో చెప్పు. అట్లాగే చేస్తాను''

చూడాల ఇట్లా అన్నది – ''రాజా! నీవు జీవన్ముక్తుడవు. నీవు కొంతకాలం పాటు రాజ్యం చేస్తూ కాలక్రమేణ విదేహ ముక్తిని పొందగలవు. నేను నీకు పట్టపు దేవిగా ఉంటాను.''

రాజు అందుకు అంగీకరించాడు. ఇరువురూ నగరానికి వెళ్ళారు. పురజనులు, మంత్రులు వారిని ఆహ్వానించారు. శిఖిధ్వజుడు చూడాలతో పదివేల సంవత్సరాలు రాజ్యం చేసి చమురు లేని దీపంలాగా శరీరాన్ని విడచి కైవల్యాన్ని పొందాడు.

రామా! నీవు కూడా శిఖిధ్వజుని లాగానే ప్రకృతమైన కార్యాలను ఆచరిస్తూ,

# 10. కచోపాఖ్యానము

(ఈ ఉపాఖ్యానంలో చిత్త త్యాగమే, సర్వత్యాగం అనే విషయాన్ని తెలియజేస్తున్నారు)

వసిష్ఠుడు రామునితో ఇంకా యిట్లా అన్నాడు -

రామా! నీకు శిఖిధ్వజుని వృత్తాంతాన్ని చెప్పాను. నీవు కూడా ఆ మార్గాన్ని అవలంబిస్తే దుఃఖాన్ని పొందవు. ఈ శిఖిధ్వజుని లాగానే బృహస్పతి పుత్రుడైన కచుడు కూడా జ్ఞానాన్ని పొందాడు. నీకు అతని వృత్తాంతాన్ని చెపుతాను. విను.

కచుడు బాల్యాన్ని అతిక్రమించాడు. తత్త్వపదాల కుండే వాచ్యార్థాల్ని తెలుసుకున్నాడు. అతడు సంసారాన్ని తరింపదలచి తండ్రియైన బృహస్పతిని ఇట్లా అడిగాడు - ''తండ్రీ! ప్రాణధారణమే చేష్టానిమిత్తమైన సూత్రంగా ఉన్న ప్రాణి, ఈ సంసార పంజరం నుండి ఎట్లా తప్పించుకొని పోగలుగుతుందో నాకు చెప్పండి!'' అని. బృహస్పతి ఇట్లా అన్నాడు - ''కుమారా! అనర్థములనే మొసళ్లకు ఆవాసమైన ఈ సంసార సముద్రం అనాయాసంగా దాటాలంటే 'సర్వత్యాగం' ఒకటే ఉపాయం.

ఇది విని కచుడు వనానికి వెళ్ళాడు. కచుడు వనంలో ఎనిమిది సంవత్సరాలున్నాడు. ఒకనాడు అరణ్యంలో తండ్రియైన బృహస్పతి కనిపించగా నమస్కరించి, తన్ను కౌగలించుకొన్న తండ్రితో అన్నాడు ''తండ్రీ! సర్వత్యాగం చేసి ఎనిమిది సంవత్సరాలైనా, ఇంకా నాకు విశ్రాంతి లభింపలేదు'' అని.

కచుని దీన వాక్యాలను విన్న బృహస్పతి ''సర్వమును విడువుము'' అని పలికి వెళ్లిపోయాడు.

కచుడు నార చీరలను కూడా వదలి వెళాడు. ఇట్లా మూడు సంవత్సరాలు గడచిన పిమ్మట మళ్లీ వనంలో తండ్రి కనిపించాడు - తండ్రితో అన్నాడు - ''తండ్రీ! నేను నారచీరలు, వెదురు కఱ్ఱ, ఇతర వస్తువులు అన్నీ విసర్జించాను. అయినా ఆత్మ పదంలో విశ్రాంతి లభింపలేదు.'' అని.

బృహస్పతి ఇట్లా అన్నాడు ''పుత్రా! పండితులు 'సర్వము' అంటే చిత్తమే అని అంటారు. కాబట్టి నీవు చిత్తాన్ని వదలి వేస్తే శోభిస్తావు. చిత్తత్యాగమే 'సర్వత్యాగము'గా సర్వజ్ఞులు చెప్పారు.'' ఇట్లా చెప్పి బృహస్పతి స్వర్గానికి వెళ్ళిపోయాడు.

కచుడు తనలో ఇట్లా ఆలోచించాడు - 'దేహం మొదలైన పదార్థాలు 'చిత్తం'

కావు. నిరపరాధములైన వీటిని బాధించడంఎందుకు? అందుచేత తండ్రి వద్దకు పోయి చిత్తస్వరూపాన్ని తెలుసుకొని దానిని విసర్జించి సుఖింతును గాక!'' అని.

ఇట్లా తలచి తండ్రి వద్దకు వెళ్లి అడిగాడు. అతనితో తండ్రి యిట్లాఅన్నాడు- అహంకారమే చిత్తము. దానిని వదలటం తేలికే! ఏకము, ఆద్యంత రహితము, చిన్మాత్రము, ఆకసముకంటె స్వచ్ఛము అయిన ఆత్మ వస్తువు ఉన్నది. దానిని భావిస్తూ, శాంత చిత్తుడవు, నిశ్చింతువు కమ్ము. ఇట్లా తత్త్వాన్ని అనుసంధానం చేస్తూ ఉంటే మిథ్యారూపమైన అహంకారం నశిస్తుంది - చిత్తం లయమౌతుంది.

రామా! తండ్రి చేత ఇట్లా పరమోపదేశం పొంది, కచుడు అహంకారం అసద్రూపం కలది అని తెలుసుకొని, జీవన్ముక్తుడు, నిర్మలుడు, నిరహంకారుడు, హృదయ గ్రంధి తెగిపోయినవాడూ అయినాడు. నీవు కూడా కచునిలాగానే అహంకారాన్ని అసద్రూపంగా తెలుసుకో!

## 11 మిథ్యాపురుషోపాఖ్యానము

(విచారణయొక్క ప్రాముఖ్యాన్నిచెప్పదలచి, విచారణచేయకుండా ఉండటం వల్ల తోచే ఈ అహంకారం, సంసారంలో వ్యర్థంగా దుఃఖం పొందుతోంది అనే విషయానికి దృష్టాంతంగా ఈ ఉపాఖ్యానాన్ని చెపుతున్నారు)

వసిష్ఠుడంటున్నాడు - ''శ్రీరామా! భేదాభేదాలను విడిచిపెట్టి, సన్మాత్ర రూపమైన వస్తువునందు ఉండిసుఖపడు. మిథ్యాపురునిలాగా వ్యర్థంగా దుఃఖాన్ని పొందకు''.

శ్రీరాముడన్నాడు - ''మునీంద్రా! సత్యాన్ని మిథ్యగానూ, మిథ్యాభూతమైన జగత్తును సత్యంగానూ చేసినవాడెవడు? ఆ మిథ్యా పురుషుని గురించి చెప్పండి'' అని.

వసిష్ఠుడిట్లా చెపుతున్నాడు ''రామా! మాయా యంత్రం లాంటివాడు, బాలుని లాగా అల్పబుద్ధి కలవాడు, మూర్ఖుడు అయిన పురుషుడొకడున్నాడు.

ఆ పురుషుడు (అహంకారం) మరుస్థలంలో ఎండమావులున్నట్లుగా, నిష్ప్రపంచము, అనిర్దేశ్యము అయిన చోట, శూన్యంలో (చిదాకాశంలో) కలిగి, అక్కడే ఉంటాడు. ఆ శూన్యస్థలంలో వాని కంటె ఇతరులెవ్వరూ లేరు. వాడు మూఢబుద్ధి కలవాడు కాబట్టి, ప్రపంచాతీతమైనట్టి బ్రహ్మవస్తువును ఎరుగడు.

క్రమంగా వృద్ధి నొందిన ఆ పురుషునికి ఆకాశాన్ని ఒకచోట నిలిపి, దానిని

యింటిని నిర్మించి, నేనే ఆకాశాన్ని రక్షిస్తున్నానని అనుకుంటున్నాడు. కాలక్రమంలో ఆ గృహం నశించింది. అది చూచి అతడు, అయ్యో! గృహాకాశమా! నీవు నశించిపోతివి గదా! అని దుఃఖించి, ఆకాశాన్ని రక్షించటానికై ఈసారి ఒక నూతిని త్రవ్వాడు. ఆకాశాన్ని రక్షించానని సంతోషిస్తూ ఉండగా కొంతకాలానికి ఆ నూయి పూడిపోయి నశించింది. కూపాకాశ నాశనానికి అతడు పూర్వంలాగానే దుఃఖించి, ఈసారి ఒక కుంభాన్ని తయారు చేశాడు. ఆకాశాన్ని కుంభంలో ఉంచి రక్షించితిని గదా! అని సంతోషించాడు.

కొంతకాలానికి ఆ కుంభం నశించింది. ఆ దుర్బుద్ధి ఊరుకోలేదు. తన పనిని విరమించలేదు. ఒక గర్తాన్ని (గోతిని) నిర్మించాడు, అది నాశనం కాగా ఒక కుండాన్ని నిర్మించాడు. అదీ నాశనం కాగా ఒక చతుశ్శాలను నిర్మించాడు. అదీ కాలక్రమాన నశించింది.

ఇట్లా అతడు ఆకాశ రక్షణ కోసం గృహ కుంభాదులననేకం సృష్టించి విఫలుడై, ఒక పర్వత గుహను చూచి, అందులో చేరి అందలి ఆకాశాన్ని పాలిస్తూ, ఆయా ఉపాధులన్నీ నశిస్తూ ఉండగా దుఃఖిస్తూ ఒక దుఃఖము నుండి ఇంకొక దుఃఖాన్ని పొందుతున్నాడు.

శ్రీరాముడు :- ''మునీంద్రా! ఆ మాయాపురుషుడెవడు? వాడు ఆకాశాన్ని రక్షింపదలచటం అంటే ఏమిటి?'' అని అడిగాడు.

వసిష్ఠుడిట్లా చెప్పాడు - శ్రీరామా! మాయాయంత్ర రూపుడైన ఆ పురుషుడు అహంకారం. దేనియందు ఈ జగత్తంతా ఉన్నదో, ఏది సృష్ట్యాది నుండీ ఉన్నదో అట్టి చిదాకాశమే శూన్యము. అట్టి చిదాకాశం నుండి, అహంకారమనేది, వాయువు వల్ల మొదటి చలనం కలిగినట్లు కలిగింది. వాస్తవానికి అహంకారం ఆత్మ కాదు. అది, ఆత్మస్వరూపమైన చిదాకాశాన్ని రక్షించటానికై అనేక దేహాలు నశించిపోతున్నా, మళ్ళీ మళ్ళీ రక రకాల దేహాలను సృష్టిస్తూనే ఉంది. ఈ శరీరాలన్నీ కూప, కుంభ, గృహాదులతో సమానం. ఈ మిథ్యాపు రుషుడు ఆత్మభావంతో ఈ ఘటాకాశాదుల నిర్మాణంలో క్లేశాన్ని అనుభవిసున్నట్లుగా, నీవు దుఃఖాన్ని పొందకు.

ఆకాశం కంటె విస్తృతము, శుద్ధము, సూక్ష్మము, శివము అయిన ఆత్మ వస్తువు మరొకటి లేదు. అట్టిది ఎవరి చేతగ్రహింపబడుతుంది? ఎవరి చేత రక్షింపబడుతుంది.? శరీరం నశించటం చేత, హృదయాకాశం నశించిందని

వ్యర్థంగా దుఃఖిస్తున్నారు. దేహం నశించినా దేహి నిత్యుడే! ఆత్మ నశించేది కాదు. దానికి జనన మరణాలు లేవు. ఈ సర్వమూ భావాభావరహితమైన బ్రహ్మమే! అని తెలుసుకో! జ్ఞానం వల్ల అహంకారాన్ని వదలిపెట్టి, అహంకార రహితమైన బ్రహ్మమునందు జీవన్ముక్తత్వాన్ని పొంది ఉండు.

## 12. భృంగీశోపాఖ్యానము

(చిత్త విశ్రాంతి అనేది సమాధి లేకపోయినా, మహాకర్తృత్వాదుల చేత సిద్ధిస్తుందని ఈ ఉపాఖ్యానంలో చెపుతున్నారు.)

వసిష్ఠుడు చెపుతున్నాడు - రామా! ఇది బంధము, ఇది మోక్షము అనే విచారాన్ని విడచిపెట్టి, అభిమానరహితుడవు, మౌనవంతుడవు, జితేంద్రియుడవు మానమదవర్జితుడవు, నిరహంకారుడవు అయి స్వకార్యాల్ని చేస్తూ ఉండు. సమస్త శంకలను వదలి వేసి మహాకర్తవు, మహాభోక్తవు, మహాత్యాగివి కమ్ము.

ఇది విన్న రాముడు - ''ఓ మునిచంద్రా! మహాకర్త, మహాభోక్త, మహాత్యాగి, వీరి లక్షణాలను వివరించి చెప్పండి'' అని అడిగాడు.

వసిష్ఠుడిట్లా చెపుతున్నాడు -

రామా! ఈ మూడు వ్రతాలను పూర్వం పరమేశ్వరుడు, భృంగీశునికిచెప్పాడు. దానిని నీకు చెపుతాను. పూర్వం మేరుపర్వతాన ఉత్తర దిశయందు పరమేశ్వరుడు పరివారంతో కూడి యుండగా అచటికి తత్త్వాన్ని తెలుసుకొనగోరి, భృంగీశుడు వచ్చాడు. అతడు పరమేశ్వరుని ఈవిధంగా ప్రార్థించాడు - ''దేవా! ఈ సంసార వైచిత్ర్యాన్ని చూచి, తత్త్వాన్ని తెలుసుకొనలేక మోహాన్ని పొందుతున్నాను. ఏ నిశ్చయంతో ఈ సంసారమనే ప్రాత యింటిలో హాయిగా, శోకం లేకుండా, ఉండగలుగుతానో చెప్పండి'' అని.

ఈశ్వరుడీవిధంగా చెప్పాడు - ''ఓయీ! నీవు సమస్త సంశయాలనూ విడచి, ధైర్యంతో మహాకర్తవు, మహా భోక్తవు, మహాత్యాగివి కమ్ము. నీకు వారి లక్షణాలు చెపుతాను, విను!

రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, ధర్మాధర్మాలు, ఫలాఫలాలు వీటిని అపేక్షించకుండా పనులు చేస్తూ ఉండేవాడు మహాకర్త. అహంకారం, మానము, మాత్సర్యము, లేనివాడై, నిశ్చింతగా కార్యాలు నిర్వర్తించేవాడు మహాకర్త. నిష్కాముడు, రాగం లేనివాడు సాక్షిభూతుడు, నిర్మలబుద్ధి కలవాడు, హర్ష

విషాదులు లేనివాడూ, దుఃఖంలోను, ఆనందంలోను సమభావం కలవాడూ, వృద్ధిక్షయాలలో సమ భావం కలవాడు మహాకర్త.

ఇక మహాభోక్త లక్షణం విను! దేనినీ ద్వేషించని వాడు, దేనినీ కోరని వాడు, లభించిన దానిని అనుభవించేవాడు, మహాభోక్త. అట్లాగే సుఖదుఃఖాలను కలిగించే పనుల్లోను, భ్రాంతిని కలిగించే సంయోగ వియోగాల్లోనూ సంక్షోభాన్ని పొందకుండా సమభావంతో అనుభవించేవాడు మహాభోక్త. జరామరణాలు, రాజ్యం, దారిద్ర్యము అన్నింటినీ రమ్యమైనవిగా యెంచి అనుభవించేవాడు మహాభోక్త. కారం, పులుపు, తీపి, చేదు అన్నింటినీ సమభావంతో తినేవాడూ, రుచిగా ఉండేవి, రుచి లేనివి, తినదగినవి, తినరానివి అనే భేదభావం లేకుండా, సంకల్ప వికల్పరహితుడై భుజించేవాడు మహాభోక్త.

ఇక మహాత్యాగి. ధర్మాధర్మములు, సుఖదుఃఖాలు, జనన మరణాలు మొదలైన భావాలను మనస్సులోకి రాకుండా విడచిపెట్టిన వాడు మహాత్యాగి. కోరికలు, సందేహాలు, ఊహలు మొదలైన వాటిని బుద్ధిచేత వదలివేసినవాడు మహాత్యాగి. దృశ్యవాసనల నన్నింటినీ వదలివేసిన వాడు మహాత్యాగి.

అని చెప్పి వసిష్ఠుడిట్లా అన్నాడు – రామా! ఈ విధంగా శివుడు భృంగీశునకు ఉపదేశించాడు. వీటిని నీవు కూడా అవలంబించి శోకరహితుడవై ఉండు. నీవు అంతర్ముఖుడవై యుండి, బాహ్యమున సమస్త కార్యాలూ చేస్తూ ఉన్నా, అహంకార రహితుడవై నందున ఖేదాన్ని పొందవు.

## 13. ఇక్ష్వాకూపాఖ్యానము

(ఆత్మ విచారం చేత తత్త్వాన్ని తెలుసుకొనటం సాధ్యం కానప్పుడు గురువు చెప్పిన మాటల్ని బట్టి తత్త్వాన్ని తెలుసుకోవటానికి వీలవుతుందని ఈ ఉపాఖ్యానం ద్వారా చెపుతున్నారు.)

వసిష్ఠుడీ విధంగా చెపుతున్నాడు – శ్రీరామా! మీ వంశానికి ఆదిపురుషుడైన ఇక్ష్వాకుడు ఏ విధంగా ముక్తిని పొందాడో చెపుతాను. విను''

ఇక్ష్వాకుడు రాజ్యపాలనం చేస్తూ, జనన మరణాల చేత దుఃఖదాయకమైన ఈ జగత్తు ఎట్లా కలిగింది? అని తన మనస్సులో ఆలోచించాడు. కాని ఈ జగత్తుకు కారణం ఏదో అతనికి తెలియదు. ఒకనాడు బ్రహ్మలోకం నుండి తన సభకు విచ్చేసిన మనువు అనే ప్రజాపతిని పూజించి ఇట్లా అడిగాడు –

"ఓ భగవానుడా! ఈ జగము దేని నుండి కలిగినది? దీని స్వరూపం ఎట్టిది? ఈ జగత్తు ఎప్పుడు కలిగింది? ఎందుకు కలిగింది? నేను ఈ సంసార విభ్రమం నుండి ఎట్లా విముక్తి పొందగలుగుతాను?" అని.

మనువు ఇట్లా చెప్పాడు - రాజా! ఈ జగత్తు గంధర్వ నగరం లాంటిది. మరు భూమిలో జలం లాంటిది. ఇది అసలు లేనే లేదు. మనస్సుతో సహా ఆరు ఇంద్రియాలకు అతీతమైనదీ, ఎక్కడా కనపడనిదీ, నాశనం లేనిదీ, సత్తు అయినదీ, అయిన ఆత్మ ఒక్కటే ఉన్నది.

అన్ని దృశ్యాలకూ మొదటిదైన ఈ సృష్టి, కనిపించకుండా ఉండే ఆత్మ అనే, ఆ మహాదర్శంలో - అద్దంలో - ప్రతిబింబిస్తోంది. తేజస్స్వభావం కలిగిన ఆ బ్రహ్మశక్తులు కొన్ని బ్రహ్మాండాల రూపంలోనూ, మరి కొన్ని శక్తులు ప్రాణి రూపంలోనూ కనిపిస్తున్నాయి. బంధం గాని, మోక్షం గాని, భేదం గాని, అభేదం గాని, ఏదీ లేదు. జ్ఞానసారమైన ఆ బ్రహ్మం ఒక్కటే ఉంది. జలం ఒక్కటే తరంగాల రూపంలో అనేకంగా ప్రకాశించే విధంగా, చిత్తు ఒక్కటే అనేక రూపాలలో ప్రకాశిస్తోంది. అంతే తప్ప దృశ్యం అనేది ఏదీ లేదు. కాబట్టి, నీవు బంధమోక్ష కల్పనను దూరంగా వదలివేసి, సంసార భయాన్ని వదలి బ్రహ్మమే సారాంశమని గ్రహించి సుఖంగా ఉండు.

రాజా! ఆ చిత్తు యొక్క చిన్మాత్ర రూపాలైన సంవిత్తులు (జ్ఞానాలు) సంకల్పానికి అభిముఖులై, జలం తరంగత్వాన్ని పొందినట్లుగా జీవత్వాన్ని పొందుతున్నాయి. ఆ జీవులు మున్ను పుట్టిన సంసారంలో తిరుగుతున్నారు. సుఖదుఃఖాలకు మూలమైన మోహం కూడా మనస్సు నందే ఉన్నది. ఆత్మయందు లేదు. అనుభవమాత్రరూపుడైన ఆత్మయే, దేహాది ఉపాధితో కూడి జీవుడుగా కనిపిస్తున్నాడు. ఆత్మను శాస్త్రం చేతగాని, గురువు ద్వారా గానీ చూడలేము. తన ప్రయత్నం చేతనే, సత్త్వగుణ నిష్ఠమైన తన బుద్ధి చేతనే చూడగలం.

త్రోవన నడచిపోయే బాటసారులు రాగద్వేషరహితమైన బుద్ధితో సంచరిస్తున్నట్లుగా, ఈ దేహేంద్రియాదుల్ని రాగద్వేషరహితమైన చిత్తవృత్తితో చూస్తూ ఉండాలి. పండితుడైన వానికి ఈ దేహేంద్రియాదుల మీద ఆదరమూ ఉండదు, నిరాదరమూ ఉండదు. ఇతర పదార్థాల మీద లాగా యథాస్థితిగా ఉంటాడు. కాబట్టి, రాజా! నీవు దేహాదుల్ని దూరంగా విడిచి, అంతటా చల్లని అంతఃకరణం కలవాడవై ఉండు.

రాజా! నీవు పరిపూర్ణమైన ఆత్మభావంతో, భువనాలన్నింటి యందు నిండియున్నవాడవు, వాసనారహితమైన జ్ఞానం కలవాడవు. నిరతిశయానందం కలవాడవూ, నిర్మలుడవు, పరిపూర్ణుడవు, నిర్భయుడవు, చిద్రూపుడవూ అయి ఉండు.

రాజా! నీకు జ్ఞాన భూమికలను గూర్చి చెపుతాను విను.

మొదట శాస్త్రాధ్యయనము, సజ్జన సాంగత్యము, మొదలైన వానిచేత బుద్ధిని వృద్ధి పొందించాలి. ఇది యోగానికి ప్రథమ భూమిక. దీనినే శుభేచ్ఛ అని కూడా అంటారు. ఆత్మ విచారము అనేది రెండవ భూమిక. ''నేను అసంగుడను'' అని భావించటం మూడవ భూమిక. వాసన లయమైపోవటం నాల్గవ భూమిక. దీనినే సత్త్వాపత్తి అని కూడా అంటారు. వాసనారహితము, చిన్మయము అయిన ఆనంద రూపం అయిదవ భూమిక. ఈ భూమిక యందు మనుజుడు జీవన్ముక్తుడై ఉంటాడు. సంవేదనా రహితము, ఘనీభూతానందాకారము, సుషుప్తావస్థతో సమానమైన స్థితిని కలిగి ఉండటం ; ఇది ఆరవ భూమిక. దీనిని తుర్యావస్థ అనీ, పదార్థాభావనీ స్థితి అనీ అంటారు. సమరూపం కలదీ, అంతటా పరిపూర్ణమై ఉండేదీ, సౌమ్యము, స్వచ్ఛము, తుర్యాతీతము, కైవల్య రూపము అయన స్థితి ఏడవ భూమిక. ఇది జీవించి యున్న వారిలో గోచరించదు. విదేహముక్తులకే గోచరిస్తుంది.

మొదటి మూడు భూమికలు జాగ్రదవస్థయే! నాల్గవ భూమిక స్వప్న తుల్యంగా ఉంటుంది. అయిదవ భూమిక సుషుప్తావస్థ ఆరవ భూమిక తుర్యావస్థ. మనో వాక్కులకు అతీతమైనదీ, అగోచరమైనదీ, స్వప్రకాశమైనదీ అయిన ఏడవ భూమిక తుర్యాతీతావస్థ. (దీనిని కొందరు ఒక అవస్థ అని అంగీకరింపరు. తురీయాన్నే ఒక అవస్థగా అంగీకరింపని వారూ ఉన్నారు. అట్లా అంగీకరింపకపోవటం సమంజసం కూడాను! ఈ తురీయ, తుర్యాతీత దశల్లో జీవభావమే ఉండదు కాబట్టి!)

ఇట్లా మనువు చేత ఉపదేశింపబడిన ఇక్ష్వాకుని అవిద్య నశించింది. మనువు బోధించిన మార్గాన్ని అవలంబించి సుస్థిరుడైనాడు.

# 14. మునివ్యాధోపాఖ్యానము

(ఈ ఉపాఖ్యానంలో తత్త్వం తెలుసుకొని, చిత్త విశ్రాంతి పొంది, విశ్రమించిన వానికి సామాన్యంగా లౌకిక వ్యవహారం ఉండదనే విషయాన్ని చెప్పదలచారు.)

శ్రీరాముడు వసిష్ఠుని ఇట్లా అడిగాడు - మునీంద్రా! జీవన్ముక్తునికి ఆకాశగమనాదకాలు లేవని అన్నారు గదా! జీవన్ముక్తునికి ఉండే అపూర్వమైన విశేషమేదో చెప్పండి.

వసిష్ఠుడిట్లా చెప్పాడు - రామా! జ్ఞాని యొక్క చిత్తము ఏ ఒక అతిశయంలోనూ వర్తించదు. అతడు శాంతచిత్తుడై ఆత్మయందే ఉంటున్నాడు. మంత్రసిద్ధులు, తపస్సిద్ధులు, తంత్రసిద్ధులు మొదలైన వారిచేత ఆకాశ గమనాదికాలు సిద్ధిస్తాయి. అందులో గొప్పతనం ఏముంది? జీవభావం పోవటం లేదు. కాబట్టి గొప్పతనం ఏమీ లేదు. మంత్రతంత్రాలతో సిద్ధుల్ని సాధించేవారు, ఆత్మజ్ఞానంతో ఆ సిద్ధులను సాధించటం లేదు. ఆ సిద్ధులను ఆత్మజ్ఞాని ఆశించడు.

రామా! సమస్త జీవులు పరబ్రహ్మము నుండి నిష్కారణంగానే వస్తున్నారు. అట్లా వచ్చిన పిమ్మట తాము చేసిన కర్మలే ఆ జీవుల సుఖదుఃఖాలకు కారణమౌతున్నాయి. ఆత్మస్వరూపం తెలియక పోవటం వల్ల కలిగిన సంకల్పం, కర్మలకు కారణమౌతోంది. కాబట్టి నీవు సంకల్పాన్ని విడిచిపెట్టు సంకల్ప రాహిత్యమే మోక్షం. అట్టి సంకల్పరాహిత్యాన్ని బుద్ధిచేత అభ్యసించు. అభ్యాసక్రమం చేత సంకల్పాలను వదలివేయాలి.''

నీ చిత్తానికి ఏదైనా జగత్పదార్థం రుచించిందీ అంటే నీవు సంసార బద్ధుడ వౌతున్నావన్న మాట. నీ చిత్తంలో ఏదీ రుచించక పోతే సంసారం నుండి విముక్తుడవౌతున్నావన్న మాట. పండితుడైన వాడు మనస్సును మనస్సు చేతనే ఛేదిస్తాడు. అస్త్రాన్ని అస్త్రం చేతను, విషాన్ని ప్రతి విషం చేతనూ వారిస్తున్నట్లుగా మనస్సు చేతనే మనస్సును నివారించాలి.

జీవునికి స్థూలము, సూక్ష్మము, పరము, అని మూడు రూపాలు ఉన్నాయి. కాళ్లు , చేతులు తల మొదలైన అవయవాలు కలిగి జీవుని యొక్క భోగం కోసం ఉపయోగపడే దేహం స్థూల రూపం.

తన సంకల్ప రూపమైనదీ, సంసారం ఉన్నంత వరకూ ఉండేదీ, అయిన చిత్తమే జీవుని యొక్క సూక్ష్మరూపం.

ఆద్యంత రహితము, సత్యము, చిన్మాత్రము, నిర్వికల్పము అయినది జీవుని పరమరూపం.

రామా! నీవు స్థూల సూక్ష్మ రూపములందాసక్తిని వదలి, పరరూపము నందాసక్తుడవు కమ్ము.

శ్రీరాముడిట్లా అడిగాడు - ''మునీంద్రా! తుర్యావస్థా లక్షణం చెప్పండి'' అని. వసిష్ఠుడిట్లా అన్నాడు.

**అహం భావాన హంభా వౌ త్యక్త్వా సదసతీ తథా**
**యదసక్తం సమం స్వచ్ఛం స్థితం తత్తుర్యముచ్యతే** 1
**యా స్వచ్ఛా సమతా శాంతా జీవన్ముక్త వ్యవస్థితిః**
**సాక్ష్యవస్థా వ్యవహృతా సాతుర్య కలనోచ్యతే** 2
**నైతజ్జాగ్రన్న చ స్వప్నః సంకల్పానా మసంభవాత్**
**సుషుప్త భావో నాప్యేత దభావా జ్జడతా స్థితేః** 3
**శాంత సమ్యక్ప్రబుద్ధానాం యథాస్థిత మిదం జగత్**
**విలీనం తుర్య మిత్యాహుర బుద్ధానాం స్థిరం స్థితం** 4
**అహంకార కలాత్యాగే సమతాయాస్స ముద్గమే**
**విశరారౌ కృతే చిత్తే తుర్యావస్థోప పద్యతే.** 5

రామా! ఇది నేను, ఇది నేను కాదు, అనే భావాలను ; ఉన్నాను, లేను, అనే భావాలను విడిచి, అసంగము, స్వచ్ఛము అయిన చైతన్యమే తుర్య రూపం. అని గ్రహించాలి.

నిష్కళంకమైనది, సమత్వంతో, శాంతత్వంతో కూడినట్టి జీవన్ముక్తుని వ్యవహారంలో ఉండే ఉదాసీనావస్థనే తురీయావస్థ అంటారు.

ఈ తుర్యావస్థలో సంకల్ప వికల్పాలు ఉండవు. జాగ్రత్తుగాని, స్వప్నం గానీ ఉండవు. అజ్ఞానం లేనందున సుషుప్తావస్థా కాదు. (సుషుప్తిలో జడత్వం. తమోగుణం ఉంటాయి) తురీయస్థితిలో, శాంతులు, జ్ఞానులు అయిన వారికి లాగా, ఈ జగత్తు బ్రహ్మంలో లీనమైపోతుంది. మూఢులకు జగత్తు స్థిరంగా ఉన్నట్లే ఉంటుంది.

అహంకారాన్ని వదలివేస్తే, సమత్వం సిద్ధించగా, చిత్తం క్షయమొంది తురీయత్వం సిద్ధిస్తుంది. ఈ విషయమై నీకొక దృష్టాంతాన్ని చెపుతాను -

ఒక మహారణ్యంలో ఒక ముని ఉన్నాడు. అతడు మహామౌన నిష్ఠలో ఉన్నాడు. ఆ ముని వద్దకు వచ్చి ఒక వ్యాధుడు ఈ విధంగా అడిగాడు - ''మునీంద్రా! బాణం తగిలి మృగం పరుగెత్తుతూ ఇటు వచ్చింది. దాని వెంట నేనూ వచ్చాను.

ఆ మృగం ఇటే వచ్చింది. ఎటు వైపు పోయినదో చెప్పు.'' అని.

ముని అన్నాడు- '' నాయనా! వనవాసులము, సావ్యనిష్ఠులము, సమశీలురము, మౌనులము. మాకు వ్యవహార సాధనమైన అహంకారం లేదు. మనస్సు, సమస్త ఇంద్రియాల కర్మలను చేస్తూ ఉంటుంది. అట్టి ఆ మనస్సు నా నుండి చాలా కాలం క్రితమే జారిపోయింది. నేను జాగ్రత్ స్వప్న సుషుప్తులను ఎరుగను. ఎల్లప్పుడూ తురీయావస్థలో ఉంటూ ఉంటాను. ఆ స్థితిలో దృశ్యమంటూ ఏదీ లేదు.'' అని అన్నాడు.

ఆ మునీంద్రుని వాక్యం విని వ్యాధుడు, ఆ మాటల అర్థం తెలియనందున వెళ్ళిపోయాడు.

కాబట్టి, రామా! తురీయావస్థ కంటె ఇతరమైన అవస్థ లేదు. నిర్వికల్పమైన చిత్తునే తుర్యమంటారు.

చిత్తానికి జాగ్రత్ స్వప్న సుషుప్తులనే మూడు అవస్థలున్నాయి. వాటినే ఘోర శాంత మూఢావస్థలని కూడా అంటారు. జాగ్రద్రూపమైన చిత్తం ఘోరము, స్వప్న రూపమైన చిత్తం శాంతము, సుషుప్తస్థితమైన చిత్తం మూఢము అని వ్యవహరింపబడతాయి. సత్త్వగుణ రూపమై ఉండే చిత్తాన్ని మృతము అంటారు. అట్టి చిత్తాన్నే, మృత చిత్తాన్నే యోగులు ప్రయత్నంతో సాధిస్తారు. రామా! నీవు కూడా భేదవాసనలు శాంతింపగా సంకల్ప రహితమైన ఆ తుర్యపదంలో సుఖంగా ఉండు.

## 15.సప్తభూమికోపాఖ్యానము

(సమస్తమైన ఈ జ్ఞాన శాస్త్రానికీ సారభూతమైన జ్ఞాన భూమికలను గూర్చి ఈ చివరి ఆఖ్యానంలో నిరూపింపదలచారు.)

వసిష్ఠుడిట్లా ఆరంభించాడు - రామా! ''మోక్ష మంటే ఎంతటిది? ఈ సంసారమే శ్రేష్ఠమైనది.'' అని నిశ్చయించుకొని కోరకలతో కర్మలను ఆచరిస్తూ ఉండే వానిని ప్రవృత్తుడు అంటారు.

ఈ సంసార వ్యవస్థ నిస్సారమైనది. నాకు దీనితో ప్రయోజనం లేదు. రసహీనమైన కర్మలు ఎందుకు? ఈ కర్మలన్నీ ప్రాచీనములు. వీటిని ఎందుకు చేయాలి? నిరతిశయమైన విశ్రాంతి స్థానం ఏదో మనసులో నిశ్చయించుకొనిన ముముక్షువును నివృత్తుడు అంటారు.

రామా! నీకు ఏడు జ్ఞాన భూమికలను గూర్చి వివరిస్తాను విను-

**శుభేచ్ఛ** :- నేను ఎప్పుడు వైరాగ్యవంతుడనై, సంసారాన్ని దాట గలుగుతాను? అనే ఆలోచనతో కూడిన వాడు, వాసనలయందు విరక్తిని పొందుతాడు. మంచి పనులు చేస్తాడు. ప్రేమతో మాట్లాడుతాడు. మనోవాక్కాయములతో సజ్జన సేవచేస్తాడు. ఇట్లా ఉండేవాడు మొదటి భూమికను పొందినవాడు.

**విచారణ** :- ఈ రెండవ భూమికను పొందినవాడు జ్ఞానసాధనాలైన శాస్త్రాలను సంపాదిస్తాడు. చదువుతాడు. శ్రౌతస్మార్తకర్మాచరణం చేస్తాడు. ధారణ ధ్యానాదులను అభ్యాసంచేస్తాడు. పండితులనాశ్రయించివేదాంత శాస్త్ర శ్రవణం చేస్తాడు. నిత్యానిత్య వస్తువివేకం కలవాడౌతాడు. మదం, అభిమానం, దంభం, మోహం, మాత్సర్యం లాంటి దుర్గుణాలను వదలిపెడతాడు.

**అసంసర్గము** :- ఈ భూమికను పొందినవాడు ఆత్మాద్వైత లక్షణమగు వేదాంత వాక్యార్థము నందు నిశ్చలమైన బుద్ధిని కలిగి ఉంటాడు. ఆత్మ నిష్ఠలతో కూడి తత్త్వాన్ని మననంచేస్తూ, వైరాగ్య ప్రసంగాలుచేస్తూ చిత్తోపశాంతి చేత లభించిన అసంగసౌఖ్యంతో కూడి నీతివంతుడై ఉంటాడు. ఈ మూడవ భూమిక యందు జ్ఞానవంతుడు సామాన్యము, శ్రేష్ఠము అనే రెండు రకాల అసంగాన్ని అనుభవిస్తాడు. నేను కర్తను గానీ, భోక్తను గానీ, బాధ్యుడను గానీ, బాధకుడను గానీ కాను అని తలచి పదార్థములందు అసంగుడై యుండటం సామాన్య అసంసర్గం. ఆత్మవస్తువు కరతలామలకం వలె స్పష్టం కాగా, సంసార సాగరానికి ఆవలి యొడ్డుననున్న పరబ్రహ్మ మందు మౌనంగానూ, శాంతంగానూ ఉండటం శ్రేష్ఠమగు అసంగం. ఆద్యంత రహితము. శాంతము అయిన తత్త్వాన్ని ఆశ్రయించటమే శ్రేష్ఠమగు అసంసర్గం.

ఈ మూడు భూమికల యొక్క అభ్యాసం వలన చిత్తమందు అజ్ఞానం నశించి జ్ఞానం ఉదయిస్తుంది. ఈ మూడు భూమికలను **జాగ్రదవస్థగా** పేర్కొంటారు.

**నాల్గవ భూమిక**:- అద్వైత భూమిక. ఈ నాల్గవ భూమికను పొందినవారిలో ద్వైత భావం నశించి అద్వైతభావం స్థిర రూపాన్ని దాల్చుతుంది. అంతట అతనికి ఈ లోకమంతా స్వప్నంలాగా కనిపిస్తుంది. కాబట్టి ఈ భూమికను **స్వప్నావస్థ** అంటారు.

**ఐదవ భూమిక** :- ఈ ఐదవ భూమికను పొందినవాడు సత్తామాత్రంగా మిగిలి ఉంటాడు. ఇట్టి వాని చిత్తం విలయాన్ని పొందినందున జగద్రూపమైన

వికల్పాలేవీ ఉదయింపవు. ఈ భూమికను **సుషుప్తి** దశగా పేర్కొంటారు. ఇతడు అద్వైత మాత్రంలో నిలిచి ఉంటాడు.

**ఆరవ భూమిక :-** ఈ పైన చెప్పబడిన అయిదు భూమికలందు వాసనా రహితుడై అభ్యాసం చేస్తూ క్రమంగా **తుర్యమనే** పేరు గల ఈ ఆరవ భూమికను పొందుతాడు. ఈ భూమిక యందున్న వాడు అహంకార రహితుడు, ఏ విధమైన సందేహాలూ లేనివాడూ, వాసనా రహితుడూ జీవన్ముక్తుడూ అయి, చిత్రంలో ఉన్న దీపం లాగా ఉంటాడు. లోపల బ్రహ్మాన్ని భావించుచున్నందున బ్రహ్మామందు సైతం పూర్ణుడై, సముద్రంలో మునిగియున్న పూర్ణకుంభం లాగా ఉంటాడు.

**ఏడవ భూమిక :-** విదేహ కైవల్య ముక్తియే యేడవ భూమిక. ఇది ఇట్లా ఉంటుందని చెప్పటానికి వీలు లేనిది. బ్రహ్మ వస్తువు నిత్య సిద్ధం కాబట్టి క్రొత్తగా దేనినీ పొందేవాడై యుండడు. కైవల్య స్వరూపం నిరుపాధికం కాబట్టి చెప్పటానికి శక్యం కానిది. దీనిని కొందరు **బ్రహ్మం** అంటారు. కొందరు **కాలం** అంటారు. ఇట్లా అనేక రకాల పేర్లతో చెప్పినా నామ రూపాలు లేనిది. రామా! ఏడు భూమికలను చెప్పాను. వీటిని అభ్యసించిన నరుడు దుఃఖాన్ని పొందడు.

రామా! మరొక విషయం చెపుతున్నాను. బాగా మదించినట్టియు, పెద్ద దంతాలు కలదియు, యుద్ధమునందాసక్తి కలదియునైన ఏనుగు ఒకటి ఉన్నది. అనేక అనర్థాలను కలిగిస్తున్న ఈ ఏనుగును నరుడు వధించకపోతే, ఈ భూమికలను సాధించలేడు. ఆ మదపు టేనుగును వధిస్తేనే తప్ప ఎవ్వడూ మంచి యుద్ధ భటుడని అనిపించుకొనడు.

శ్రీరాముడు, ''ఆ మదపు టేనుగు ఏది? యుద్ధ భూములేవి? దాని నెట్లా వధించాలి?'' అని అడుగగా, వసిష్ఠుడు ఇట్లా చెప్పాడు. రామా! 'ఇది నాకు కావాలి' అనే కోరికే ఏనుగు. దీనికి ఇంద్రియాలు అనేవి పిల్లలు. ఈ ఏనుగు మనస్సు అనే అరణ్యంలో విహరిస్తుంది. ధర్మాధర్మములనేవి దీని దంతాలు. ఇది మదించి శరీరమనే కాననంలో తిరుగుతూ ఉంటుంది. ఈ ఇచ్ఛ అనే ఏనుగునకు వాసనలే మదము. ఈ ఏనుగు దీనులైన జీవులను చంపుతోంది. పురుషుడు ఏ కార్యాల్లో అనేక సార్లు జయాపజయాలు పొందుతున్నాడో ఆ కార్యాలే యుద్ధ భూములు. వాసన, ఈహ, మనస్సు, చిత్తం, సంకల్పం, భావన, మొదలైనవన్నీ ఆ ఏనుగుకున్న పేర్లు. ధైర్యం అనే అస్త్రంతో ఆ ఏనుగును ఛేదించాలి. ఇచ్ఛ అనేది లోపల ఉన్నంత వరకు భయంకరమైన సంసారం ఉంటుంది.

సంకల్పం శాంతించటమే మోక్షం. రామా! పరిపూర్ణము, నిర్వికారము, జన్మాది రహితము, విశుద్ధ జ్ఞానరూపము అయిన బ్రహ్మమును భావించుటయే సంకల్పత్యాగము, కర్మత్యాగము అని పేర్కొనబడుతోంది.

## భరద్వాజానుశాసనమ్

భరద్వాజుడు వాల్మీకితో ఇట్లా అన్నాడు:- వాల్మీకి మునీంద్రా! శ్రీరామచంద్రుడు వసిష్ఠునిచే జ్ఞాన సారాన్ని అంతను విని, నిర్మలచిత్తుడు, ప్రశాంతచిత్తుడు, పూర్ణజ్ఞాన నిష్ఠుడు అయినాడు గదా! ఇంకా ఏమైనా అడిగాడా?

వాల్మీకి అన్నాడు - శ్రీరాముడు జనన మరణ రహితుడు. శుద్ధ జ్ఞాన స్వరూపుడు. యోగేశ్వరుడు, ఉత్పత్తిస్థిత్యాదులకు అధీశుడు, విశ్వవంద్యుడు. అష్టైశ్వర్యాల్ని తృణప్రాయంగా విసర్జించినవాడు, తెలుసుకొనదగిన దేదీ లేనివాడు, అతడింకేమీ అడగలేదు.

భరద్వాజుడాశ్చర్య పడి యిట్లా అన్నాడు - ''శ్రీరాముడు మోక్ష పదాన్ని పొందాడు. మునీంద్రా! ఈ సంసార సముద్రాన్ని దాటి, నేను ఎట్లా విశ్రాంతి పొందగలనో చెప్పండి'' అని. వాల్మీకి యిట్లా చెపుతున్నాడు.

భరద్వాజా! శ్రీరాముని వృత్తాంతమంతా చెప్పాను. నీవు దీనిని నీ బుద్ధిలో విచారించి మననం చెయ్యి. ఈ విషయమై నేను నీకు చెప్పవలసినది చెపుతున్నాను, విను.

ఈ ప్రపంచం అవిద్య వల్ల కలిగింది. ఇందులో సత్యవస్తువు ఏదీ లేదు. ఇది పండితులు నిశ్చయించిన విషయం. జ్ఞానం లేనివారు అనవసరంగా వాదులాడుకుంటున్నారు. చిత్తత్త్వం కంటె భిన్నమైనది ఏదీ లేదు. కాబట్టి, మిథ్యయైన ద్వైతము, సత్యమైన అద్వైతాన్ని బాధింపదు. మిత్రమా! ప్రణవార్థాదుల్ని, వాటి రహస్యాన్ని అభ్యసించి విశుద్ధ చిత్తుడవు కమ్ము.

ప్రపంచ విషయకమై చిత్తవృత్తి ఉంటే, జాగ్రదవస్థలో ఉన్నా అది నిద్రయే అవుతుంది. ఎవని చిత్తంలో నిరంజనమైన జ్ఞాన దీపం వెలుగుతుందో వాడే ప్రబుద్ధుడు. అవిద్య వల్ల కలిగిన ఈ భేదాలన్నీ నీటి బుడగల్లాగా పుట్టి, క్షణమాత్రంలో జ్ఞానసముద్రంలో కలుస్తున్నాయి. భరద్వాజా! సంసారమనేది ఉన్నదనీ, శ్రీరామునికది తొలగిపోయినదనీ, నీకు తొలగలేదనీ అనుకుంటున్నావు. ఇది మోహం. ఉన్నదేది? పోయినది ఏది? దేనిచేత, ఎవనికి ఏమివస్తోంది? ఇదంతా మాయ. ఈ మాయలో ఎందుకు మునుగుతావు?

మోహాన్ని వదలు! వివేకంతో మోహాన్ని చంపు. మోహం తొలగిపోతే అసాధారణమైన జ్ఞానం నిస్సంశయంగా నీకు లభిస్తుంది. సాక్షిభూతుడవై ఈ సంసారనాటకాన్ని చూడు. శోకమోహాదులతో నీవు దానిలో పాల్గొనకు. చిదానంద ఘనము, విశుద్ధము అయిన ఆత్మను భావింపుము.

## గ్రంథసారము

భరద్వాజుడు వాల్మీకి చెప్పిన దంతా విని, దృశ్య ప్రపంచాన్ని లయం చేసే ఉపాయాన్ని తెలుసుకొనగోరి, వాల్మీకితో ఇట్లా అన్నాడు. మునీంద్రా! నీ అనుగ్రహం వల్ల అన్నీ విన్నాను. వైరాగ్యం కంటె భాగ్యము, సంసారం కంటె శత్రువు లేదు గదా! వసిష్ఠుడు శ్రీరామునికి చెప్పిన గ్రంథసారాన్ని వినాలని అనుకొంటున్నాను. చెప్పండి.

వాల్మీకి చెపుతున్నాడు – భరద్వాజా! మోక్షాన్ని కలిగించే జ్ఞానసారాన్ని చెపుతున్నాను, విను. ప్రపంచాన్ని లయం చేస్తే, తత్త్వం ఎట్లా ప్రకాశిస్తుందో, అట్టి ఉపాయాన్ని మాండూక్యాది శ్రుతులలో చెప్పబడిన విధంలో సంగ్రహంగా చెపుతాను.

అంతరింద్రియ నిగ్రహం, బాహ్యేంద్రియ నిగ్రహం శమదమాలు కలవాడు, పాపకృత్యాలు వదలినవాడూ, ఇంద్రియ సుఖాల నుండి ఉపరతిని పొందినవాడూ, శ్రద్ధతో కూడినవాడూ, మంచి మృదువైన సుఖకరమైన ఆసనం మీద కూర్చున్నవాడూ, చిత్తేంద్రియాల శ్రమను జయించినవాడై, మనస్సు నిర్మలమయ్యేంత వరకు శ్రవణం చేయాలి. అంతఃకరణ శుద్ధి కోసం ప్రాణాయామం చేయాలి – ప్రాణగతి నిరోధించాలి. విషయాల మీద నుండి ఇంద్రియాలను మెల్లమెల్లగా ఆకర్షించాలి.

దేహం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, జీవాత్మ, ఇవి దేని నుండి ఏదేది జన్మిస్తోందో శ్రుత్యాదుల చేత తెలుసుకోవాలి. పిమ్మట ఆయా భూతాల్లో, ఆయా దేవతల్లో విలీనము(లయం) చేయాలి. ఆధ్యాత్మికమైన దేహేంద్రియాది భావాన్ని వదలి, వాటికి కారణములైన దేవతల యొక్క సమష్టిరూపుడు, అకారార్థమైన (ప్రణవంలోని అకారం) 'విరాట్టే నేను' అనే భావన చేత ముందుగా విరాట్‌లో స్థితుడు కావాలి. పిమ్మట ఆ విరాట్టుకు కారణము, ఉకారార్థము, సూక్ష్మభూత లింగ సమష్టి రూపుడూ అయిన హిరణ్య గర్భుని యందు ఆ

విరాట్పురుషుని లీనం చేయాలి. అట్లా హిరణ్యగర్భుని యందు నిలిచియుండి, పిమ్మట ఆ హిరణ్య గర్భునికి కారణుడు, మాయోపహతుడు, మకారవాచ్యుడు అయిన అవ్యాకృతుని యందు, ఆ హిరణ్యగర్భుని లయమొందించాలి, ఆ పిమ్మట, అంతటికీ అధిష్ఠానము, అర్ధమాత్రాలక్షితము ( ప్రణవంలోని అర్ధమాత్ర) అయిన శుద్ధ బ్రహ్మము నందు అవ్యాకృతుని లయమొందించి స్థితుడై యుండాలి. ( ఇది ప్రణవోపాసన)

దేహేంద్రియాదులు ఏవేవి దేని నుండి పుట్టినాయో వాటిని వాటి వాటి యందు లయమొందించాలి. మాంసాదులైన పృధ్వీతత్త్వాన్ని భూమియందు, రక్తాది జలతత్త్వాన్ని జలంలోను, వీర్యం మొదలైన అగ్ని తత్త్వాన్ని అగ్నిలోను, ప్రాణాలను వాయుతత్త్వంలోను, శరీరాకాశాన్ని ఆకాశ తత్త్వంలోను ఉంచాలి. అంటే, తన్మాత్రవములని భావించి, లయం చేయాలి. అట్లాగే ఘ్రాణాదీంద్రియాలను కూడా వీనికి కారణాలైన సూక్ష్మపృధివ్యాదులలో లయం చేయాలి. పిమ్మట, జీవునికి శబ్దాది భోగసిద్ధికై, కర్ణం మొదలైన గోళకాల్లో ప్రవేశించినట్టి శ్రోత్రాది ఇంద్రియ భావంతో కూడిన దిగాది దేవతల్ని దేవతలందు ప్రవేశపెట్టాలి. అంటే, శ్రోత్రాన్ని దిక్కులందు, చర్మాన్ని విద్యుత్తునందు, చక్షుస్సును సూర్యునిలోను, జిహ్వను వరుణునిలోను, ప్రాణాన్ని వాయువులోనూ, వాక్కును అగ్నియందు, పాణిని ఇంద్రుని యందు, పాదాల్ని విష్ణువు నందు, పాయువును మిత్రుని యందు, ఉపస్థను కశ్యపుని యందు, మనస్సును చంద్రుని యందు, బుద్ధిని బ్రహ్మయందు ఉంచాలి.

పైన చెప్పబడిన వారంతా ఆయా ఇంద్రియాలకు దేవతలు. ఆ దేవతల్నే ఇంద్రియాలు అంటున్నారు. ఇదంతా శ్రుతిననుసరించి చెప్పబడినది. ఇట్లా దేహేంద్రియాదులను వాటివాటి కారణాల్లో లయం చేసి, ''నేను విరాట్పురుషుణ్ణి'' అని భావించాలి.

అర్ధనారీశ్వర రూపంలో బ్రహ్మాండంలో నున్న పురుషుడే ( జగత్తుకు అభిన్న నిమిత్తో పాదాన కారణుడై యున్న బ్రహ్మమే) ప్రభువు. అన్ని భూతాలకూ ఆధారమైనవాడు; కారణుడు. అతడే తండ్రి. కాబట్టే తాను సృజించిన దేవ మనుష్యాది ప్రాణికోటికి అన్నపానాదుల్ని, జీవనోపాయాన్నీ కల్పించి పోషిస్తున్నాడు.

బ్రహ్మాండం కంటె రెట్టింపు భూమి, భూమి కంటె రెట్టింపు జలం, జలం కంటె

రెట్టింపు అగ్ని. అగ్నికి రెండింతలు వాయువు. వాయువునకు రెండింతలు ఆకాశం. ఇట్లా ఒకదాని పైనొకటి చొప్పున, పంచీకృతము, అపంచీకృతమునైన భూతాలచే జగత్తు వ్యాప్తమై ఉంది. (పంచీ కరణాన్ని గురించి వేదాంత గ్రంథాల్లో చెప్పారు)

కాబట్టి, భూమిని జలంలోను, జాలాన్ని అగ్నిలోను, అగ్నిని వాయువులోను, వాయువును ఆకాశంలోనూ, ఆకాశాన్ని సమస్త స్థూల ప్రపంచోత్పత్తికీ కారణమైన మహాకాశంలోనూ, లయం చేసి, ఆ హిరణ్యగర్భాకారంలో ఉండినవాడై, వాసనలు, సూక్ష్మభూతాలు, కర్మ, అవిద్య, దశేంద్రియాలు, మనస్సు, బుద్ధి, వీటితో కూడిన లింగశరీరాన్ని మాత్రమే ధరించినవాడై, నేను బ్రహ్మాండాన్ని అనే అభిమానం విడవటం వల్ల ఆ బ్రహ్మాండం కంటె వెలుపల ఉంటూ, సూక్ష్మ భూతరూపమైన సమష్టిలింగ శరీరంలో ఆత్మగా ఉంటూ ఉండే ''హిరణ్య గర్భుణ్ణి నేనే!'' అని ధ్యానించాలి.

(సూక్ష్మ భూతాలయందు అభిమానం కలవాడైయున్న ఈ హిరణ్య గర్భుడే, బ్రహ్మాండాభిమానాన్ని విడవటానికిపూర్వం, బ్రహ్మాండైశ్వర్యాన్ని అనుభవించటానికై చతుర్ముఖ బ్రహ్మయ్యై ఉన్నాడు.)

ఇట్లా, 'నేను హిరణ్య గర్భుడను' అని భావించిన పిమ్మట, అవ్యాకృతుని యందు లింగశరీరాన్ని లీనం చేయాలి. అవ్యాకృతుని గురించి :- అపంచీకృతమైన భూతాల కంటెసూక్ష్ముడు, ఉపాధి రూపంచేత మాయాంశం, చిద్రూపం చేత అవ్యక్తం, ఈ అవ్యాకృతుని యందే జగత్తు నామ రూప రహితమై ఉంటోంది. ఈ అవ్యాకృతునే సాంఖ్యులు ప్రకృతి అనీ, వేదాంతులు మాయ అనీ, తార్కికులు అణువు అనీ, బౌద్ధులు సంవృతి రూపమైన అవిద్య అనీ అంటారు. ఆకాశాది క్రమంలో జరిగిన సృష్టి, భూమ్యాది క్రమంలో ఉపసంహారమూ జరుగుతుంది. అందుచేత, విరాట్, హిరణ్యగర్భ, అవ్యాకృత నామాలు (పేర్లు) కలదీ, స్థూల, సూక్ష్మ, కారణ రూపాలు కలదీ, జాగ్రత్ స్వప్న సుషుప్తత్రయాన్ని విడచినట్టిదీ, 'శివమద్వైతం చతుర్థం మన్యంతే' అని శ్రుతిచే చెప్పబడిన ఆత్మతత్త్వాన్ని ధ్యానించాలి. అట్టి ధ్యానం చేత లభించిన చరమ సాక్షాత్కారవృత్తిచే, ధ్యానకర్తృకరణ రూపమైన లింగశరీరము, మూలాజ్ఞానము పోవటం వల్ల, ఘటభంగం కాగానే ఘటాకాశం మహాకాశంలో లీనమై నిరతిశయానందాన్ని (పరబ్రహ్మము) పొందుతోంది. దీనినే లింగశరీరభంగము అంటారు.

ఇప్పుడు అజ్ఞానం తొలగిపోయింది. కాబట్టి లింగశరీర బంధము నుండి విముక్తుడనైనాను. నేనుచిదాకాశాన్ని కాబట్టి చిదానందసముద్రంలో ప్రవేశించాను. నేను సర్వోపాధి రహితుడనైన బ్రహ్మాన్నే! నేను పుణ్య పాప విముక్తము, జగత్కారణము, అద్వితీయము అయిన బ్రహ్మాన్నే! అని, ఇట్లా, ముముక్షువు సదా బ్రహ్మాన్ని ధ్యానించాలి.

ఇట్లా అభ్యాసం చేయటం వల్ల పురుషునకు మనస్సు క్షయమైపోతుంది. మనస్సు క్షయమైపోగా ఆత్మ ప్రకాశిస్తుంది. ఆత్మ ప్రకాశింపగా సమస్త దుఃఖాలూ పోతాయి. ఓ భరద్వాజా! ఇట్లా నీకు వసిష్ఠుడు రామునికి చేసిన ఉపదేశాన్నంతనూ చెప్పాను. నీవు జ్ఞానమార్గం చేతను, యోగమార్గం చేతను అన్నీ తెలుసుకొనగలుగుతావు. నీవు ఆత్మ సంధానాభ్యాసం చెయ్యి. మనస్సును స్థిరపరచుకో! ఇది విని, భరద్వాజుడిట్లా అడిగాడు – ''ఓ మునీంద్రా! శ్రీరాముడు ఆత్మయందు విశ్రమించినాడు గదా! అట్టి రాముడు, వసిష్ఠుని చేత మళ్ళీ ఏ విధంగా లోక వ్యవహారంలో ప్రవేశపెట్టబడ్డాడు?'' అని.

వాల్మీకి ఇట్లా అన్నాడు – శ్రీరాముడాత్మయందు విశ్రమించి యుండగా విశ్వామిత్రుడు, వసిష్ఠ మహర్షితో – ''ఓ మునీంద్రా! నీవు శక్తిపాతం చేత తక్షణముననే గురుత్వాన్ని చూపించావు, కాబట్టి నీవు మహానుభావుడవు (కుండలిని యొక్క షట్చక్రభేదనము చేత, బ్రహ్మరంధ్రమున నున్న పరమ శివుని తోడి సమావేశము గాని, లేదా, జీవునికి ఉపాధి పరిత్యాగం చేత శుద్ధ బ్రహ్మ రూపత్వాన్ని గానీ శక్తిపాతం అంటారు.) శిష్యునికి దేహము నందే పరమశివుని సమావేశాన్ని కలగించేవాడే గురువు. నీవు దయతో ఇపుడు రాముని సమాధి నుండి మేలుకొలుపు, నే వచ్చిన పని గుర్తు చేసుకో! రామావతార ప్రయోజనం సిద్ధించేటట్లు చెయ్యి.''

అంతట వసిష్ఠుడు సుషుమ్నా ద్వారమున శ్రీరాముని హృదయంలో ప్రవేశించి, ఆతనిని మేల్కొలిపాడు. శ్రీరాముడు గురువాక్యాన్ని విధిగా తలచి కర్తవ్యాలను నెరవేర్చాడు.

భరద్వాజా! నీకు, శ్రీరామచంద్రుని జీవన్ముక్తి పర్యంతము గురుశిష్యుల సంవాదాన్ని చెప్పాను. ఈ పద్ధతినే అనుసరించి నీవు కూడా సుఖం పొందు. నీవే కాదు, ఈ రామచంద్ర వసిష్ఠసంవాదాన్ని విన్నవాడెవడైనా మోహాన్నీ, మాలిన్యాన్నీ, రాగద్వేషాదులనూ, సమస్త దోషాలనూ వదలి విరక్తుడై పరబ్రహ్మాన్ని పొందుతాడు.

యోగవాసిష్ఠ సారము సమాప్తము

## శ్రీ నోరి శ్రీనాథ వేంకట సోమయాజులు గారి గ్రంథములు

| | | |
|---|---|---|
| 1. | ఉపనిషద్దర్శనము భాగం 1 (తైత్తిరీయ, ఈశ, కేన, ప్రశ్న, మాండూక్య, కఠోపనిషత్తులు) | 35-00 |
| 2. | ఉపనిషద్దర్శనము భాగం 2 (బృహదారణ్యకోపనిషత్తు) | 75-00 |
| 3. | ఉపనిషద్దర్శనము భాగం 3 (ఛాందోగ్య, ఐతరేయ, ముండకోపనిషత్తులు) | 75-00 |
| 4. | ఉపనిషద్దర్శనము భాగం 4 (శ్వేతాశ్వతర, కైవల్యోపనిషత్తులు) | 15-00 |
| 5. | బ్రహ్మసూత్ర దర్శనము (శారీరక మీమాంస) | 180-00 |
| 6. | గీతా దర్శనము (భగవద్గీత) | 100-00 |
| 7. | ఆత్మబోధ | 10-00 |
| 8. | ఆత్మానాత్మ వివేకము | 15-00 |
| 9. | అపరోక్షానుభూతి | 15-00 |
| 10. | వివేక చూడామణి | 35-00 |
| 11. | పతంజలి యోగదర్శనము | 50-00 |
| 12. | ధ్యానయోగము | 35-00 |
| 13. | వేదాంత పంచదశి (అచ్చులు) (మాధవ విద్యారణ్య మునీంద్రకృతము) | |
| 14. | యోగవాసిష్టసారము | 85-00 |
| 15. | పరలోకము - పునర్జన్మ | 20-00 |
| 16. | మన వివాహ వ్యవస్థ | 25-00 |
| 17. | త్రిపురా రహస్యము (శ్రీ భాగవతుల కుటుంబరావు) | 125-00 |

పై గ్రంథములన్నియు మా సంస్థ ద్వారా ప్రచురించుచున్నామని తెలియజేయుటకు సంతసించుచున్నాము.

**శివకామేశ్వరి గ్రంథమాల**

భ్రమరాంబాపురం, కృష్ణలంక, విజయవాడ - 520 013.